
చరిత్ర

# జానపద గేయ వాంగ్మయ పరిచయము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# జానపద గేయ వాఙ్మయ పరిచయము

[ 1953 తెలుగు భాషా సమితి పర్యవేక్షణను మద్రాసు
ప్రభుత్వమువారిచే బహుమానము బడసిన గ్రంథము ]

★

రచన:
హరి ఆదిశేషువు M. Sc.

★

మహోదయ ప్రెస్,
శ్రీకాకుళం.
1954

# ఒక మాట

" కస్తూరి రంగరంగా మాయన్న కావేటి రంగరంగా ! " అని పాడుత బిచ్చానికివచ్చే సంక్రాంతి దాసరులూ, భూపాలరాగంతో మేలుకొలుపులు పాడ మా అమ్మమ్మా నాకు జానపద వాఙ్మయంతో బాల్యంలోనే పరిచయం కలుగజేశాక దానికి సాయంగా కుశలవ కుచ్చల చరిత్రనీ, గరుడాచలాన్నీ పాడి వినిపిం మా అమ్మ గేయ వాఙ్మయంపై నాకు కలిగిన అభిరుచికి ప్రోదిచేసింది.

కార్యాంతర వ్యగ్రుడనై తెలుగుదేశపు దక్షిణపు ఎల్లలోనుండి స్థాన జానపద గేయ వాఙ్మయానికి దూరమైన నాలో దాగిఉన్న అభిరుచిని తెలుగు భాష సమితివారి ఆహ్వానం పునరుజ్జీవింప జేసింది. అందువల్ల కలిగిన చాపల్యాన కొన్ని పాటలను సేకరించి, వాని బాగోగులను రసికులకు వివరించుటకు నాల సమర్థతలేదని, వెనుకాడాను. అట్టి స్థితిలో మిత్రుడు, ఉపదేష్ట, మార్గద డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు "ధీమత్ విఘ్న నిహన్యమానులగుచు ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము యుజ్జగింపరుసుమీ" అన్న భర్తృహ వాక్యార్థాన్ని పదేపదే జ్ఞాపకంచేసి ఉత్సాహం చేకూర్చారు. నిరాడంబరుడు తెలుగు సాహిత్య సంస్కృతీ పోషకుడు శ్రీ పందిరి మల్లికార్జునరావుగారూ, జా పద గేయాల నెన్నింటినో సేకరించిన విజయవాడ రేడియో స్టేషన్‌వారూ శ్రీ బి. ఎ. రామారావుగారూ, శ్రీ వేమరాజు భానుమూర్తి, డాక్టర్ శ్రీపా గోపాల కృష్ణమూర్తిగారూ నేను సేకరించిన గేయాలకుతోడు ఎన్నో గేయాల్ని రచనల్ని ఇచ్చి ఈ గ్రంథరచనకు తోడ్పడ్డారు. వారందరికీ నేనెంతో కృతజ్ఞుణ్ని

ఈ రచన నాకొకవిధమైన సంతోషాన్ని, తృప్తినీ, ఇచ్చింది. కాని, ఇది అసమగ్రంఅనీ, ఇంకా తెలంగాణా, రాయలసీమ రచనలెన్నో ఇందులో చేరవలసి వున్నాయనీ గుర్తిస్తున్నాను. అనతికాలంలో తెలుగుదేశమంతటా అన్ని మూలలా, అన్ని పల్లెల్లోనూ గేయ వాఙ్మయ సేకరణ ఒక్కుమ్మడిగా జరగాలని ఈ గేయ వాఙ్మయం సాధ్యమైనంత సమగ్రమైంది అవుతుందనీ ఆశిస్తున్నాను. అలా జరిగితే ఈ గ్రంథం మరింత పెరుగుతుంది. అలా పెరగాలనే నాకోరిక.

యాన్ని వివరించడం జరిగింది. ఈ విధానంవల్ల ఈ గ్రంథం విస్తృతంగా కొంత అప్రియమనిపించక తప్పదు. జానపద గేయ వాఙ్మయ సంపుటాలు వెలయాలి, మన గ్రంథాలయాలన్నింటిలోనూ చదువరులకి అందుబాటులో ఉండే స్థితి ఏర్పడే వరకూ ఈ విధానంతప్ప మరొకటి ఉచితంకాదని నా అభిప్రాయము. ఇలా చెయ్యకపోతే గ్రంథంలోని విషయము చదువరులకి పూర్తిగ చెవిటివారి ముచ్చటలా అవుతుందేమోనని నా భయం. ఈ గ్రంథం చదివినవారిలో జానపద వాఙ్మయాన్ని పరిశీలించాలనే ఉత్సాహం కలిగించాలని నా కోరిక. అది సఫలమైతే ధన్యుణ్ణని భావిస్తాను.

మదరాసు ప్రభుత్వంవారి తరఫున తెలుగు భాషాసమితివారు 1952-53 లో జరిగిన గ్రంథరచనపోటీలో దీనికి బహుమానము లభించింది. వారిచ్చిన ప్రోత్సాహానికి నేనెంతో కృతజ్ఞుణ్ణి. జానపద గేయ వాఙ్మయాన్నిగురించి శ్రీయుతులు పిన్నప లక్ష్మీనారాయణ పంతులు, చింతా దీక్షితులు, దేవులపల్లి కామేశ్వరరావు, నేదునూరి గంగాధరం కృష్ణశ్రీ, తిమ్మావఝల కోదండరామయ్య, శ్రీమతి [illegible]ల్లిందల సరస్వతీదేవి మొదలగువారెందరో కృషిచేశారు; చేస్తున్నారు. వారందరి రచనలతోపాటు తెలుగు సరస్వతి పాదాలవద్ద నా యీ పూజా ప్రసూనం కూడా ఉండాలనే నా కోరిక.

పోషణలేని జానపద వాఙ్మయం పూర్తిగా నశించకుండా ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంవారూ, తంజావూరి సరస్వతీ మహల్‌వారూ, అమెరికన్ డైమండ్ ముద్రాక్షరశాలవారూ, శ్రీయుతులు కొండపల్లి వీరవెంకయ్య, రావు చంద్రయ్య, నూలు సుబ్బారావు మొదలగువారూ కొంతవరకు కాపాడారు. అందుకు ఆంధ్రలోకం వారికి కృతజ్ఞులై ఉండడం న్యాయం. ప్రజావాణి తొల్కు-పలుకుల్ని, ప్రజా పరిపాలన యుగోదయం కాగానే పరిచయం చేయగల భాగ్యం లభించినందుకు నేను అదృష్టవంతుడను. నా కృషి ఫలితాన్ని ప్రజలకందిచ్చే అందుకు తోడ్పడిన నవ్య విజ్ఞాన ప్రచురణలవారికీ, శ్రమకోర్చి చక్కగా ముద్రించిన మహోదయ ప్రెస్‌వారికీ అత్యంతాదరంతో పరిచయ వాక్యాలువ్రాసి సదభిప్రాయాలుఇచ్చి ప్రోత్సహించిన సహృదయులకీ నేను ఎంతో కృతజ్ఞుణ్ణి.

# జానపద వాఙ్మయం

జానపద వాఙ్మయం అంటే ఏమిటి? పేరునుబట్టి అది జానపదుల వాఙ్మయంఅని స్పష్టమౌతోంది. జానపదం అనేది నేడు మనం జిల్లా, తాలూకా అని వ్యవహరిస్తున్నట్లుగా ప్రాచీన భారత దేశంలో వ్యవహారంలోఉన్న దేశ విభాగంఅని మనకు సాహిత్యంవల్ల తెలుస్తోంది. ఆదికాలంనుంచీ భారతీయ మానసిక ప్రవృత్తికి ప్రశాంతమైన జానపదాలే ప్రియమైనట్లూ నగరవాసులు గానివా రందరినీ గ్రామజానపదులనే పరిగణించునట్లుకూడా మనం అనుకోవచ్చు. ఎలుక మీద పిల్లినీ, పిల్లిమీద ఎలకనీ ఎక్కించి కాలక్షేపంచేసే నాగరికులకంటె నిసర్గ మనోహరమైన ప్రకృతి ఒడిలోపెరుగుతూ మాయామర్మమూ ఎరుగని వారవడం చేతనేమో వాచస్పత్యకారుడు జానపదుల్ని "కృత యజ్ఞాయ మేధావీ, బుధో, జానపదశ్శుచిః" అని యజ్ఞం చేసినవారితో పండితులతో సమానంచేసి పవిత్రులని ప్రశంసించాడు.

మనోనైర్మల్యాన్నిబట్టి వాక్శుద్ధినీ, సిద్ధినీ పొందవచ్చుననేది ఆర్షమతం. జన్మతః శుచులైన జానపదులవాక్కు అసంస్కృతమైనా, యాసతో కూడిఉన్నా నాగరికులకు హాసకారణమైనా పరిశీలనకు అర్హమైనదే. జానపద వాఙ్మయం అనంతమైనది. అందుచేత తెలుగుపై అభిమానము కలవారందరూ విబుధజనుల వలన విన్నంత కన్నంత జానపద వాఙ్మయాన్నిగురించి కృషి చేయవలసిందే. లేకపోయినట్లయితే వారి వాఙ్మయాభిరుచి కేవలం మాటమాత్రమేనని అనవలసి వస్తుంది. ఇప్పటికే ఈ విషయాన్నిగురించి కృషి చెయ్యడంలో జాప్యం జరిగిందనీ, అందుచేత ఎంతో వాఙ్మయం కాలవాహినిలో కలసిపోయి వుంటుందనీ, అది లభించే అవకాశం జారిపోయిందనీ, తలచేవారిలో నేనొకణ్ని. అందువల్ల ఇదవరకూ నడుముకట్టి దొరికిన జానపద వాఙ్మయాన్ని సేకరించి, అందులోకన్పించే మంచిగుణాల్నీ, తరితీపుల్నీ, ఇతరులకు చూరలియ్యాలి. ఎంత వాఙ్మయం ఇప్పటికే నష్టమై ఉంటుందో చదువరులే ఊహించుకొనేటందుకు కొంచెం ఉదాహ

కొనసాగిద్దాము. ఇటీవల తెలుగువారిని అర్థంచేసుకొందామని ప్రయత్నించిన ఔత్తరాహుల్లో హరీంద్రనాథ చట్టోపాధ్యాయ, దేవేంద్రనాథసత్యార్థి అనేవారు ముఖ్యులు. వారిలో హరీంద్రనాథుడు తెలుగువారిలో ప్రత్యక్షమైన కవితాత్మకు ముగ్ధుడయినాడు. ఎన్నో ఉపన్యాస వేదికలమీద గోష్ఠుల్లోనూ, తన అభిప్రాయాల్ని వెల్లడించాడు. "వీరూ వారూ, అనే తేడాలేకుండా తెలుగువారిని కవి అంటామంటేసరి, కవితారసం చిందుతుంది." అన్న వాక్యమే ఆయన అభిప్రాయపు సారాంశం. అలాంటి గుణం తెలుగుజాతికి ఈనాడు హఠాత్తుగా సంభవించిందికాదు. వారిని సంస్కృత కవుల భావదాసులు కాసట బీసట గాథలు త్రవ్వేవారని నిరసించిన నాటినుంచీ ఉన్నదే. అందుచేత అథమం 11-వ శతాబ్దంనుంచి నేటివరకు ఎందరు తెలుగువారు తెలుగునాటపుట్టి కవితాత్మను జీర్ణించుకొని, కవితా-హృదయాలు స్పందించగా తెలుగుల వాతావరణాన్ని కవితా రాగవాహినులతో ముంచెత్తి ఉంటారు? సంస్కృతపు సావిళ్ళలో కొలువుతీరిన పండిత ప్రకాండులు వారికేసిచూడక, వారు పాడింది సారస్వతమేమోనన్నైనా కన్నెంట చూడక యాదాలాభంగానైనా వినకుండా ఉన్నప్పుడు వారు ఎన్ని తిరునాళ్ళలో, ఎన్ని రథాయాత్రల సందర్భాల్లో, ఎన్ని జాతరలలో, ఎన్ని ప్రభల ఊరేగింపులలో ఎందరు తెలుగువారిని శృంగార వీర అద్భుత రస నిమగ్నుల్నిచేసి ఆనందించి ఉంటారు. ఆపాటలన్నీ ఏమయ్యాయి? ఆ సుద్దులన్నీ ఏమయ్యాయి? ఆసూక్తులన్నీ ఏమయ్యాయి? ఆగాథలన్నీ ఏమయ్యాయి? ఏమో ఎవరు చెప్పగలరు? అవే నేటికీ రూపుమారి నాయకీ నాయకుల పేర్లుమారి కొత్త భావాలతో, కొత్త భాష నుంచి రవాణాఅయిన పదాల వెల్లువలతో ఉక్కిరిబిక్కిరియై చాప చిరిగి చదరంతై కొసెబిగించి కట్టుబమాని గాగరా ధరించిన తెలుగుపడుచై హాయిలుగొల్పుతూ గుజిలీప్రతుల్లోనో, ఎవరెట్లుజెప్పిన అట్లు మాటాడుతూ కుంటినడకలతో లయ పడని గమకములతో ఎవరు చేయూతను ఇచ్చెదరాఅని పల్లెపట్లల్లో వేచిఉంటేమో అనిపిస్తోంది.

అపరిమితమైన జానపద వాఙ్మయం తగిన ఆదరణ లేకపోవడంవల్ల పరిమితమైనట్లు భ్రమ గొల్పుతుంది. విషయ విస్తృతినిబట్టికూడా అది అపరిమేయమైనదే.

నుడికారపు సొంపువల్ల తెనుగు ఇటాలియను భాషతో తులతూగుననీ తొలిసుదార ప్రశంసించిన విషయము సుప్రసిద్ధమే. అనాసుడి జానపదుల జాన

తెనుగునకు చెందినదేనని బ్రౌనుదొర రచనలను చూచినవారికి స్పష్టమవుతుంది. అందుచేత అసలు సిసలైన తెలుగు నుడికారాన్ని గ్రహించాలంటే జానపద వాఙ్మయాన్ని మథించవలసిందే.

సాహిత్య దృష్టితోనేకాకుండా, సంగీత శాస్త్రదృష్ట్యా చూసినాకూడా జానపద వాఙ్మయం, ముఖ్యంగా గేయవాఙ్మయం పరిశీలనార్హమవుతోంది. క్రూర జంతువులనుచూసి భయవిహ్వలుడవడంచేతనో, లేక కుందేలు చేజిక్కినప్పుడుత్సాహంచేత తన్ను తామరచి మానవుడు వేసిన కేకల్లోనో, ఉదాత్తానుదాత్త స్వరితములు ఉత్పన్నమైనట్లు స్పష్టమవుతోంది. కోయిల కూతకు కూయకూసే ఉత్సాహవంతుడైన జానపద బాలునినోట పంచమస్వనం ఉత్పన్నమైందనడం సత్యదూరము కాబోదు. వసంతకాలంలో కన్పించి పంచమస్వన మొలికించి కాలం మారగానే మాయమైన కోయిల కూజితము కల్పించిన మధుర స్మృతులచే జానపదుల కంఠంలో సంగీతం ఆవిర్భవించిందని మనంనమ్మవచ్చు.

సహజంగా సృష్టిలో విన్పించిన మధురస్వనాల్ని అనుసరించి మానవులాలాపించిన ఆలాపనలలో గేయముత్పన్నమైందనీ, అపరిష్కృతమై అది ప్రజలతోపాటే పెరిగి వారినిత్యజీవితంతో పెనవేసుకొని వృద్ధిఅయినదనీ విజ్ఞులు భావిస్తున్నారు. అందుచేత ఏ దేశపు సంగీత సాంప్రదాయాన్నైనా, అర్థంచేసుకోవాలన్నా, వివరించాలన్నా ఆదేశపు సంగీత సుధారసపు చెలమను వెతకాలి. అది ఆదేశపు జానపద గేయాల్లో, ప్రజలు పాడేపాటల్లో, తీసే కూనురాగాల్లో గర్భితమై ఉంటుంది. కర్నాటక సంగీత సంప్రదాయం బహుగొప్పది. మా త్యాగయ్యఅంతటివాడు లేడుఅని మనం బుజాలు పొంగేలా చెప్పుకొంటాము. ఆ సంప్రదాయానికి మూలబీజము, త్యాగయ్య గానసుధారసానికి కారణమైన మర్మాన్ని తెలుగు జానపద వాఙ్మయంలోనుంచే తవ్వి వెతకి బైటబెట్టాలి. జానపద గేయ వాఙ్మయ ప్రయోజనాన్నిగురించి ఇలా అభిప్రాయపడేది నేనొకణ్ణే కాదు. మన తలదాటిన పెద్దలెందరో ఇలా అనుకుంటోన్నవారే. వారిలో ఒకరిద్దరి అభిప్రాయాల్ని యీ సందర్భంలో ఉటంకించడం అసందర్భంకాబోదు.

మదరాసు విశ్వవిద్యాలయంలో ఆచార్యులైన సంగీత కళానిధి సాంబమూర్తిగారు ఒక వ్యాసంలో ఇలారాశారు. జానపద గేయాల్ని సేకరించేవారిలో సంగీతంఅంటే అభిరుచి చాలా తక్కువగా కన్పిస్తోంది. కన్పించటం లేదనే

అనాలి. సంగీతంలో నిష్ణాతులైనవారిలో జానపద గేయాల్లోఉన్న రాగవరసలన్నీ, వాటి ప్రత్యేకతనీ, ప్రయోజనాన్ని తెలుసుకొన్నవారు కన్పించరు. పామరుల్లో వ్యాపించి వనలతలా వృద్ధిజెందే కళారమ్యతని గ్రహించి, వాటిలో దారితెన్నులు తీర్చితిద్దవలసిన బాధ్యత అభిజ్ఞులమీదా అట్టికృషిని ప్రోత్సహించవలసిన బాధ్యత రసికులమీదా ఉంటాయి.

వాగ్గేయకారులమీదనున్న ఈ గురుతర బాధ్యతని గుర్తించాడో ఏమో వారిలో అగ్రగణ్యుడైన త్యాగరాజస్వామి ప్రజాసామాన్యంలో వ్యాపించిన ప్రియమైన రాగవరసల్నీ, ఫణితుల్నీ దివ్యనామావళి సంకీర్తనలో గ్రహించాడు. అంతేకాకుండా ఆయన పాడిన మరికొన్ని ప్రఖ్యాత కీర్తనల్లోకూడా జానపద గేయ ఫణితుల్లో కొన్ని సంస్కరించి గ్రహించినారని విజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. దివ్యనామావళీ, త్యాగ బ్రహ్మ కీర్తనలూ శ్రోత్రపేయములు కావని ఎవ్వరూ అనరుకదా! వాటిలో గర్భితమైన జానపద సంగీతరీతులు వాటి మాధుర్యమునకు బాధకములుకావనీ, మిదుమిక్కిలి పోషకములు కావచ్చుననీ భావించుట సబబేకదా!

ఇక ఆధునికులలోకూడా కళాపరిపూర్ణులైన మన ఫిడేలు నాయుడుగారికి జానపద గేయములపైగల అభిమానము అందరెరిగినదే. వారు కచ్చేరీలలో జానపద గేయమున కొక స్థానము ప్రత్యేకించారు. భారత జాతీయతను ప్రతిబింబించేఉద్దేశంతో నేడు రేడియోశాఖవారుకూడా జానపద గేయ ప్రసారాన్ని గురించి శ్రద్ధ వహిస్తున్నారు.

తెలుగు జానపద గేయాల నెన్నింటినో పాడించి విని, సేకరించి తర్జుమా చేసుకొని పరిపరివిధిని పులకించి ఇతర జాతీయ జానపద గేయములతో పోల్చి చూచి దేవేంద్రనాథసత్యార్థి సరళశైలికీ, హృదయమునుంచి సూటిగా వెలికెగసిన భావసంపత్తికీ, మనోమోహన గీత మాధుర్యమునకూ, నిసర్గ సుందర ప్రతిబింబములకూ ముగ్ధుడయినాడు.

మరోదృష్టితో పరిశీలించినాకూడా జానపద వాఙ్మయం ప్రయోజనకారి అనవలసివుంది. " దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ " అన్న గురజాడ అప్పారాయకవి వాక్యమూ " రాజులు సుప్రసిద్ధులేమైనసూ జనజీవన

ముంగూర్చి తెలియనిచో చరిత్ర నిష్ఫలముగదా!" అని నిర్వచించిన డాక్టర్ నేలటూరి వెంకట రమణయ్యగారి సుభాషితమూ తలదాల్చ నర్హమైనవి. గ్రామ జీవనము గ్రామీణ వాఙ్మయంలోనే పూర్తిగా ప్రతిబింబించుచున్నది నిర్వివాదము. అందుచేత జానపద వాఙ్మయమే ఏజాతియొక్క నిజ సంస్కృతినైననూ, జీవిత పరమావధులనూ, లక్ష్యములనూ వారనుభవించిన సుఖదుఃములనూ వ్యక్తంచేయ గల ఏకైక సాధనము. అదే జాతి చరిత్ర రచించు చరిత్రకారులకు అపరూప ముల పేటిక.

జానపద గేయాలను పాడినవారు సహజకవులు. "నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు"అని గొంతువిప్పి పాడినవారు అట్టి రచనలు సాధారణ ఛందోరీతుల నతిక్రమించడం పరిపాటి. అలాగనగానే వీటికి ఛందోనియమాలుండవనడానికి వీలులేదు. ప్రిస్తరించినట్లయితే లభించే అనంత సంఖ్యాకమైన వృత్తగీతాల్లోని పై మాత్రాబద్ధమై లయ తాళ బద్దగమకంతో ఒప్పిఉంటాయి.

ఆంగ్లభాషలో పండితులు వ్యవహారంలోఉన్న భాషకి ఎంతప్రాధాన్యం ఇచ్చారో మనకి జోసెఫ్‌రైట్ అనే నిఘంటుకారుని కృషిని వ్యక్తీకరించే ఈక్రింది వాక్యంవల్ల తెలుస్తుంది. లోకవ్యవహారంలోఉన్న రూపాలనన్నింటినీ క్రోడీక రించి ఇంగ్లీషువారు 1898 లో రైట్ పర్యవేక్షణక్రింద పనిచేశారు. 150మంది పండితులు 194 అంశాల విషయసేకరణచేసి రెండు శతాబ్దాల్లో ఎవరు ఎక్కడ వాడిన పదాల అన్నింటిరూపాలను సేకరించి కూర్చి నిఘంటువుగా ప్రకటించారు. ఇదివిన్న తెలుగు భాషాప్రియులు తెలుగు వ్యావహారిక భాషకికూడా అలాంటి అవ కాశం ఎప్పుడులభిస్తుందోనని ఉవ్విళ్లూరవలసిందే. జానపద వాఙ్మయ సేకరణా, పరిశీలనా అది సాధ్యం అయేటందుకు మొదటిమెట్టు.

భాషాతత్వం తెలుసుకొనదలచినవారికికూడా జానపద వాఙ్మయం అమూల్య మైన చేదోడు. మాండలిక పదాలూ, ఒకనాడు వాడుకలోఉండి నేడు మారుమూ లకు చేరిన పదాలూ ఆ మహోదధిలోనుంచే పొందడానికి వీలవుతుంది.

జానపద కవుల వాక్కు అసంస్కృతము. సహజమయినది. వారి కవి త్వంలో జాను తెనుగు పాలెక్కువ, కవితాధార వారిసొమ్ము. అందుచే (ఛందో) వ్యాకరణములు వారి ననుసరించవలసినదేకాని వారు వాటి గిరులలో నిముడరు. అట్లిముడవలెనని వారు అగి అగి గొంతు నులుముకొనరు.

జానపద కవులలో అన్ని తరగతులవారూ ఉన్నారు. వేములవాడ విద్యాధికారియైన శ్రీనాథుడు మొదలు, భిక్షాధికారియైన వీధి బిచ్చగానివరకూ జానపద కవులే. వీరిలో స్త్రీ గాల సృష్టి విశేషంతేమ. విద్వత్కవులుకాని, పామరులుగాని జానపదకవులే. పండితభిషక్కుల రచనలు పాకముగబడిన రసమయ గుళికలు. జానపదకవుల రచనలన్నచో చెట్టునుంచి జారిపడిన అమృత ఫలములు. రసమయ గుళికలయందు రసమున్నదని నిరూపించుటకు శాస్త్రవేత్త లవసరము. కాని అమృత ఫలములందు రసము అనంతకాలే జాలువారుచుండును. రసగుళికలను జీర్ణించుకొను జీర్ణశక్తి మహామేధావులే సమర్థులు. అమృత మధురసము చిన్నలువాని నాస్వాదించుట కెల్లరు సమర్థులే.

శృంగార వీర కరుణాద్భుత రసోత్కర్షము లైన రచనలందరికీ హృద్యములే. ఈ రస భావముల కాధారభూతులైన నాయికా నాయకులకూ చదువరులకూ ఎంతతక్కువ అంతరం ఉంటే అంతఎక్కువగా తాదాత్మ్యం సిద్ధించి రసప్రాదుర్భావమవుతుంది. అందుచేతనే అట్టి రచనలకి జనాదరణం సిద్ధిస్తుంది. దాని మూలంగా పోషించే పోషకులు లేకపోయినా, పనిగట్టుకొని ప్రచారంచేసే సరస విమర్శకులూ, మల్లినాథసూరులూ లేకపోయినా గుణ దోష విమర్శనల కతీతమయి జానపద గేయములు పూర్తిగా నశించక నిలిచాయి.

జానపద గేయ వాఙ్మయం బహు ప్రయోజనకారి అన్నది నిర్వివాదము. ఇప్పటివరకూ ప్రకటితమై, సహృదయులచే సేకరింపబడిన జానపద వాఙ్మయాన్ని లోకంలో వ్యాప్తమై ఉన్నదానితో పోలిస్తే సముద్రంలో కాకిరెట్టవంటి దనక తప్పదు. విశాఖ, శ్రీకాకుళం మండలాలు గేయ వాఙ్మయానికి పుట్టిల్లని విజ్ఞుల అభిప్రాయము. అందుచేత మన మండలములోని విద్యార్థులూ, విద్యావంతులూ ఈ జయ ఉగాదినాడు జానపద గేయ వాఙ్మయ సేకరణ చెయ్యవలెనని కృతనిశ్చయు లవాలనీ, వారికృషివల్ల అనతికాలంలోనే తెలుగు సాహిత్య మహోదయమునకు రాచబాట ఏర్పడాలనీ కోరుతున్నాను.

## 2. శృంగార రసాత్మక గేయములు.

జానపద గేయాల్లో శృంగార రసాత్మక గేయములు ప్రధానమైనవి. ఆలంకారికులు శృంగారరసం అన్నిరసాల్లోనూ ముఖ్యమైందని అంగీకరించడంతో

జీవితంయొక్క లక్ష్యం సౌందర్యార్చనఅనీ అది మధుర భావానితో వ్యాఖ్యఅనీ వారంగీకరించినట్లు భావించవచ్చును. అదే మన తెలుగువారి జీవిత పరమావధి యనికూడా భావించేటందుకు అసంఖ్యాకంగాఉండి వ్యంగ్యంగానూ వాచ్యంగానూ శృంగార రసాన్నొలికిస్తూన్న తెలుగుగేయాలూ, కావ్యాలూ సాక్షీభూతంగా ఉన్నాయి. శృంగార వీర రసాలు పరస్పరం సహకరిస్తూ మన కావ్యప్రపంచాన్నీ, జాతీయ జీవనాన్నీ నడుపుతూన్నట్లు కన్పిస్తుంది. వింటే భారతంవినాలి అన్న నానుడివల్ల వ్యక్తమవుతూన్న మన భారత వీరగాధా కథాశ్రవణ కౌతుహలమూ, దాక్షారామ చళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ వక్షోజములపై వాసించిన కస్తూరీ పరిమళమూ, గన్నెకాడారి పొద్దున నిఘంటునో, భృంగిరిటులనో కైదండ పట్టుకొని సానివాడ కరుగుచున్నాడోయను భీమేశ్వరుడూ, ద్వీపాంతరములనుండి చందనాగరు కర్పూరముల తెప్పించి వసంతోత్సవముల నిర్వహించిన వసంతరాయులుకూడా అవిషయమే రుజువు ఆవుతోంది.

జానపద వాఙ్మయంలోకూడా మన జాతికి వెన్నెముకలాంటి శృంగార వీర రస వాహినులు రెండూ కలిసిఉన్నాయి కాటమరాజు కథా, పలనాటి వీరులకథా, బొబ్బిలికథా మొదలైనవి వీరగాధలకు కొన్ని ఉదాహరణములు. వాటి విషయం ప్రకరణాంతరంలో వివరించబడింది. శృంగార రసాత్మక కావ్యప్రశంసయే ప్రస్తుతవిషయము.

జానపద వాఙ్మయంలోని శృంగారాత్మక కావ్యాల్ని రెండు విభాగాలు చెయ్యవచ్చును. సాంసారిక గాథల నాధారంగాగొని ఆదర్శ జానపద దంపతుల చరిత్రని వివరించేవి. వీర బాజమ్మకథ, కరుణ విప్రలంభ ప్రధానమైన కామమ్మకథా ఉదాహరణములు. ఇక రెండోరకానికి చెందినవి. టుమ్రీల లాంటి నోటిపాటలు, అవి అముద్రితములు, అసంఖ్యాకంగా జనసామాన్యంలో నిలిచిఉన్నాయి. అవన్నీ రస గుళికలు, కొన్ని నీతి బాహ్యములని విమర్శకులు నిరసించినవి. కాని ఆలాంటివికూడా జనాదరంవల్ల నేటికీ నశించకుండా నిలిచాయి. శృంగార రసాత్మక గేయ వాఙ్మయమే ఆధునిక పద్యాధికులలో కొందరిని ముఖ్యంగా నండూరి వెంకటసుబ్బారావు, అడవి బాపిరాజు మొదలైనవారిని ఆవేశపూరితుల్ని చేసి మధుర కావ్య రచనకు పురిగొలిపాయి. అందుచేత వాటన్నింటినీ సేకరించడమూ, ప్రకటించడమూ అవశ్య కర్తవ్యములు.

మనకు లభించే శృంగార రసాత్మక గేయాల్లో చల్ మోహనరంగా, యెంకయ్య చంద్రమ్మ పాట, సిరిసిరిమువ్వా, గోంగూరపాట, నారాయణమ్మ పాట, గుంటూరు చిన్నదాన, ఒకరికి చేతులిచ్చాన్, తమలపాకులమీద పండ్లెంతపోసి, నందగిరిబంగారుమామ, వస్తావంటే పిల్ల వస్తావంటే, రారమ్మో, బుల్లిరెమ్మో, పచ్చబొట్టు పొడిపించునావా, అనేవి ముఖ్యమైనవాటిలో కొన్ని. వాటినే స్థాలీ పులాక న్యాయంగా పరిశీలించ దలచుకొన్నాను.

"కంటికి కాటుకపెట్టి కడవా చంకానబెట్టి
కళ్ళనీళ్ళు కడవనిండెను గదరా చల్ మోహనరంగా" అని నటిస్తూ
"నీకు నాకు రెండుజోడూ నిన్నొక్క నిముషమైన
విడనాడ జాలకుంటిని గదరా" అనీ
"గట్టుదాటీ పుట్టదాటీ గహనాంతర సీమదాటీ
అన్నిదాటీ అలసిపోతిమి గదరా చల్ మోహనరంగా" అనీ
"నీకూ నీవారులేరు, నాకూ నా వారులేరు
ఏటిఒడ్డున ఇల్లుకడదాం పదరా చల్ మోహనరంగా"
మాదుమల్లీ తోటలోన, మంచినీళ్ళ బావికాడ
ఉంగరాలు మరచివస్తిని కదరా చల్ మోహనరంగా॥
నీకునాకు జోడుఅయితే మల్లెపూల తెప్పగట్టి
తెప్పమీద తేలిపోదాం పదరా చల్ మోహనరంగా"

అన్న చరణాల్లో మధురమైన దృశ్యాలు తలపులోవచ్చి నిలుస్తాయి. నాయికా నాయకులు నిత్య యౌవనులై, నిత్య ప్రేయసీప్రియులై, వర్ణ వ్యవస్థల అంటుసొంటులు తగులనివారై, జానపద సాహిత్యంలో నిలిచారు. ఈగేయంలో ఉన్నతస్థాయి నందిన ప్రేమ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారిని ఆకర్షించింది. "మాలపల్లి" అన్న గ్రంథంలోని జ్యోతీ, అప్పాదాసుల ప్రేమని వారు దీనికి వ్యాఖ్యగా చిత్రించారు. ఈ గేయం కల్పించే మధుర చిత్ర సన్నివేశాలకి ముగ్ధులై సి. పుల్లయ్యగారు సినిమా తెరమీద దీనికి రూపమిచ్చారు. ఆ చిత్రాన్ని తెలుగుదేశంలో ఆబాలగోపాలంచూసి రసానందం పొందారు. నాయికగా నటించిన శ్రీమతి పుష్పవల్లి తారాపథాన్నందింది. పండిత పామరామోదాన్ని ఇంతగా పొందిన ఈ గేయాన్ని ఉమాకాంత విద్యాశేఖరులు నీచ శృంగార రసోత్కృష్టమైనదనీ; ఆదరణీయముగాదనీ యెంకయ్య - చంద్రమ్మ, నారాయణమ్మ పాటలతో చేర్చి తూర్పారబట్టారు.

విద్యాశేఖరులవారి ఆగ్రహానికి గురియైన గేయాల్లో యెంకయ్య-చంద్రమ్మ పాటఒకటి. చల్ మోహనరంగ పాటలోని నాయికా నాయకుల వర్ణాలు తెలియవు. కాని యెంకయ్య మాలోడు. చంద్రమ్మని పెళ్లాడితే "కులము తక్కువవాని కొట్ట వస్తుండారు. ఏడకెళ్ళినగాని యీసుతో చూస్తారు" అని కుమిలిపోతాడు.

"మన ప్రేమలత పెరిగి మనల నొకటిగజేయ
మనకడ్డులౌతవా మతకట్టుదిట్టములు
మనమందు చింతలేలా చంద్రమ్మ"

అని తానై ఓదార్చుకొంటాడు. ఇక చంద్రమ్మకూడా-

"మంచిమనసైతేను మాలోడి మాచేల
కుల మెన్నుకోలేదురో రెంకయ్య గుణమునే
చూశానురో'' అని ప్రేమించింది. సమాజానికి వెరచి
"మాలోణ్ని పెళ్ళాడ్తె మరియాద పోతాది
మాట్లాడకూరుకోవే చంద్రమ్మ" అన్న నాయకుడితో
"పల్లలేరుటకాని కాలవొడ్డుకువస్త
దాముకాడా సుందరో రెంకయ్య'' అని

తమ సమావేశానికి యుక్తిగా స్థలనిర్దేశం చేసిన జాణ చంద్రమ్మ.

"అరటితోటానుండి అరటిపళ్ళుతెస్త
సరదాగ తిందామురో రెంకయ్య
దొరలలా తిందామురో'' అని

మురిసిన సరళ హృదయ; అల్పసంతోషి-

కల్లుతాగాలని తాటిచెట్టెక్కితే
కాలు బెణికిపోయినాదో"

అని తన మద్యపాయిత్వాన్ని మాటుపెట్టకుండా వాపోయే యెంకయ్యని-

"కాలుబెణికిందాని కనబడక పోయేవు
కట్టుకడతా వేగరారో రెంకయ్య''

అంటూ తన సహనశీలాన్ని వ్యక్తంచేసే క్షమాయాధరిత్రి చంద్రమ్మ.

"నీమీదమోహాన నిద్దరేళలాకూడ

నువ్వు కల్లోకొచ్చి నవ్వినట్లయింది
నిన్నిడిసిపెట్టలేనో వెంకయ్యా"

అని తన నాతిచరామిఅన్న నిశ్చయాన్ని చంద్రమ్మ వ్యక్తంచేస్తుంది. పట్టి వ్యవస్థమీద తిరుగుబాటుచేసిన వీరి ప్రేమభావాన్ని.

"మంచెకాడికి వేగరావో వెంకయ్య
మనసిచ్చి మాటాడరా"

అని చంద్రమ్మ, స్త్రీ సహజమైన మాతృత్వగర్వ సూచకంగా

కొడుకుపుట్టేను కోటప్పకొండాకి
పోయితీరాలిరో వెంకయ్య"

అన్నందుకూ పరిణయ నియమ బద్ధ శృంగారంకాదనీ. అసభ్యమైందనీ రసాభాసయైన నీచ శృంగారమనీ విద్యాశేఖరులు భావించి నిరసించారు. తమ కనులబ్ధమైన పరిస్థితుల్లో నివసిస్తూ, ఉత్కృష్టమైన ప్రేమభావంతో స్పందించిన హృదయాలుగల జానపదుల శృంగారం పూర్తిగా నిరసింప తగినదికాదని నా మనవి. అది ఆదర్శప్రాయము కాకపోవచ్చు ,ఐనా, దాన్ని జానపద జీవిత ప్రతిబింబము అనిమాత్రమే భావించి, గ్రహించవలసి వుంటుంది. కించిద్వర్ణభేదాలు కారణంగా ప్రేమికుల జంటల్ని వెలివేసి వారి ఆనందమయ జీవితాలకి ఘాత కలిగించటం తగదనికూడా కవి తెలిపాడు. అందుచేత ఇది సంఘ సంస్కార ప్రచారాత్మకమైన గేయం అనికూడా అనతగిందే.

సిరిసిరిమువ్వ పాటలో రంగూన్ సబురులుచేసే నాయకుడు రంగూను నుంచి ఇంటికి జోడుకొయ్యల ఓడమీద, బల్‌రంగుచీరలు పంపాడు. సిల్కుచీరలు కట్టిన భార్యని అద్దాలమేడలో ముద్దులాడుతూ, మోటారుకార్లలో కలిసితిరుగుతూ సుఖజీవనం గడుపుదామని కలలుకంటాడు. కాని, రంగూను లాభాలపల్ల మదించి, కానికాలమొాటచేత రంగుచేసి పిలిపించి రమ్మసారా త్రాగించి ముద్దులాడి మురిపించిన రంగూను రండముండల వలలోపడి సొమ్మంతా పోగొట్టుకొన్నాడు. ఒంటికి చెప్పరాని రోగాలుతగిలి, తిన కూడు, కట్ట గుడ్డ కరవై, తోడునీడలేక వైద్యుడు మందులతో మచ్చ మాపుతూంటే చేసిన ఫలవింత పరిణితమైంది. ఇది పశ్చాత్తాపతప్తుడై "ఒకనాటి సుఖం బొకయేటి దుఃఖ"మని వాపోయిన చాటు పద్యకర్తని జ్ఞప్తికితెచ్చే రచన. "మనసూ వద్దిక నాదుమాట వినుమా

మర్యాద గాపాడుమా'' అన్న పద్యాలకోవలోని దవ్యమైన నూటి రచన. శృంగారాభాస ప్రధానమైన ఈ రచన రంగూన్ తెలుగులకు పారా హుషార్ ఇచ్చేటటువంటిది.

కొత్త చీర గట్టుకొని, కొప్పున పూపు బెట్టుకొని, నెత్తిన గంపెత్తుకొని, గోంగూరకోసం నాయిక వెడుతూంటె తోట పెత్తనారి కన్నుగీటాడు. మొగుడుతో చెప్పకుండా ఎందుకు వెళ్ళానని నాయిక వెనకాడుతూంటే ఆతగపుమాలిన చిత్తకార్తె నాకొడుకు నాయికను యెగాదిగాచూచి, బాటకడ్డంగానిల్చి, పైటబట్టుకొని, రెంగున రూపాయిదీసి, ఖంగుఖంగున మోగిస్తూ, రంగులెన్నో జేయసాగాడు ఇవన్నీ చూసి నాయిక బెదిరి, మాట్లాడకుండాడంటే, మౌనం అర్ధాంగీకారం అనుకున్నాడో యేమో మూతిమీసందువ్వి, యాతనబెట్టుతూ, మంచి చీర బెడ్తానని మాటలాడుతూ పయిన పడబోయాడు. పూటుగాతాగి పిచ్చికుక్క వేషాలెన్నో వేయబోతే నాయిక విసిగి నేసారి నాయకుణ్ని కాలెత్తి తన్నింది. దాంతో మత్తుదిగిందో యేమో, వాడు నాయికకు చేయెత్తి మొక్కుతాడు. రాక్షస శృంగారం ఇందులో అభివర్ణితమైంది. తోట పెత్తనారి దుశ్చేష్టలు జుగుప్స కలిగేలా వర్ణించబడ్డాయి. అధికార, ధనాంధమత్తుల దుశ్చేష్టల్ని ఇలా వర్ణించడంకూడా సంస్కారపుమనిషి దారితీసేదే.

నారాయణమ్మ కులుకుగుబ్బలుచూచి వలచిన నాయకుడు ఆమెతో రంగ మెల్లి రంగురంగుల మేడల్లో ఉందామనీ, మోటారుబండెక్కి వాటంగా తిరుగుతూ, నాటకాలకి తీసుకెళ్తూ, ఎన్నో వస్తువులిచ్చి ఎంతో సుఖపెడతాననీ, తనవాగ్దానాలు బూటకాలుకాదనీ శుక్రవారంనాడు బయలెల్లే ఓడకు ప్రయాణంకమ్మనీ లయలుగా చెప్తుతాడు. ఈ పాటలో నాయకుడు జానపద గేయ వాఙ్మయంలో గిరీశానికి జోడీగా కన్పిస్తున్నాడు. ఇది జానపదులలో ఒక రకంవారి మనుష్యుల స్వభావాన్ని చిత్రించే గేయము.

తమలపాకులమీద వడ్లెండబోసి నీళ్ళు తెచ్చేటందుకు సిసింద్రీలాంటి కోడలు చెరువుకెళ్ళింది. అటుజూచి, ఇటుజూచి, గట్టొంకజూచి, కట్టమీదపోయే పొట్టికోమటినీ, దాటమ్మటవెళ్ళే బాపనయ్యనీ, పూజారితన్ననీ బిందెత్త రండని పిలుస్తూ ఊసులాడబోతుంది. కోడలిలాగ ఆలస్యం చెయ్యడంచూసి అనుమానపుదేమో ఆ అత్తగారు కోడల్ని వెంటాడిస్తుంది. ఆమె రాకడచూసిన ఊసులాడి

కోడలు తనకితానే బింకెత్తుకొని తుయ్రిసుంటుంది. నిరపాయకరము. నిరాపేక్ష ణీయము, ఐన ఒక మానసిక స్వభావం ఇందులో చిత్రించబడింది.

"గుంటూరి చిన్నదాన గుళ్ళపేరులదాన" అన్న మరో గేయంలో దేశవిప్ప కాయమైన రంగులయ్య నగల్నిబట్టి పిల్ల ఊరుచెప్పుకొని పలకరిస్తాడు. నగల కంటె నగలు ధరించిన పిల్లమీదనే తనకళ్ళూ, మనసూ, మోజూ, పోతున్నాయని చమత్కరించాడు.

"ఈరమ్మో బుల్లిరమ్మో" అన్న మరోపాటలో నాయకుడు తన నాయిక ఈరమ్మ అందంలో అత్తరుబుడ్డీ అటుకుల పేరూ, సక్కని సుక్కలకి సాటిలేని అమె అందానికి మురిసి రాజమండ్రి రెడ్డికొడుకు రైకలిస్తానని. కాకినాడ కలకటేరు కాసులిస్తానని కబుర్లంపారనీ, అంతపాటి అందగత్తెకి ప్రియుడవడం తన భాగ్యమన్నట్లు మురుస్తాడు. ఏమి అసూయా విహీనుడీ జానపద నాయకుడు.

మరో గేయంలో

"వస్తావంటే పిల్ల వస్తావంటే
కొత్త కోరంగిదాక నీవ్వస్తావటే?" అని ప్రియుడూ-
వస్తాగానీ, నే వస్తాగానీ, నన్ను
కొట్టకుండ తిట్టకుండ వుంటావటోయి?॥

అని మురిసి మురిపించే నాయికా, సంవాదం సాగిస్తారు.

నాయకునకు దూరమై నీలికొండల కవతలనున్న నాయిక తన బంగారు మామని తలచుకొంటూ చంద్రగిరి చీరలనీ, రాజమండ్రి రయికల్నీ పంపమని "నందగిరి బంగారుమామా ఓరందగాడా" అన్న పదంలో పులకిస్తూ పలికింది.

మరో జానపద నాయిక సింహాదిరప్పన్నను సేవించుకొనేటందుకువెళ్ళ-

పచ్చబొట్టు పొడిపించు బావా, పావల
పరకిచ్చి పొడిపించు బావా॥ అని

బావదగ్గిర గారంచేస్తుంది, చేతిమీద నిండుగా అప్పన్నకొండనీ, కొండ మీద గుడినీ, రామన్న బాణాలు, హనుమంతు వాలాలు, సీతమ్మ పాదాలు పొడిపించుకొని, కోమటారింటికెళ్ళి కొబ్బరిమానె రాసుకొని సాలెవారింటికెళ్లి కొత్త

చీర కట్టుకొని అందాల రాణిలాగుంటానని ఆ అల్పసంతోషి అమాయికంగా మురుస్తుంది. . ఏమి నిష్కల్మష హృదయలీ జానపద నాయికలు.

జానపద నాయికల్లో భర్త దేశాంతరంవెళ్ళి తిరిగివస్తానని గడువు పెట్టిన నాటికి రాకపోతే దిగులుపడుతున్న నాయిక ఆలంకారికుల విప్రలంభ నాయికలకే మాత్రం తీసికట్టుకాదు. చూడండి నాయికి మరదలికీ నాయికకీ ఎంత ఉన్నత స్థాయిలో నడిచిందో యీ సంభాషణ,

మరదలు॥ ఏమొదినా, ఏమొదినా ఎందుకేడుత్తావు
ఎర్రినాపొదనా నువ్వేంటనే సెప్పు ॥ఏమొ॥

నాయిక॥ దేశమెల్లిన మీయన్న తిరిగి రానేదు
తిరిగొత్తె బాగుణ్ను తీర్తమెలుమాము ॥దేశ॥

మరదలు॥ ఎల్లినోడెల్లినట్టె ఊడిపోతాడ
రేపో మాపోగాసి తిరిగొత్తె డొదిన ॥ఏమొ॥

నాయిక॥ సెప్పెల్లిన గడువూలు దాటిపోనాయి
సెట్టెక్కి సూదొలె పొత్తున్నదేమొ ॥దేశ॥

మరదలు॥ సెట్టొద్దు సేమొద్దు పూరుకో వదిన
రాబోయె మాయన్న రాకమానాడు ॥ఏమొ॥

నాయిక॥ సూసిసూసేరళ్ళు కాసినయి కాయాలు
మేసేటి ఆవూలు మానినయి మేతాలు ॥దేశ॥

మరో నాయిక భర్త తన్ను అత్తింటికి తీసుకొని పోయేటందుకు వచ్చాడని విని, పుట్టింటిభారం చెల్లెలికి అప్పగిస్తూ.

"మాబావ వచ్చేడు ఓయి సెల్లేలా,
నేనెల్లి పస్తాసు ఓయి సెల్లేలా,"

అని సెలవులు తీసుకొంటు-ది.

"మంచె దిగవే పాంచాల సిలకా''

అంటూ లయలుగా మాట్లాడే వగకాడికి.

"సేబాసు కుర్రోవాడా, సెవులపోగులవాడా,

మూడావ కన్న, నా మరియాద వక్కాడు,
మంచెదిగను, రంచెదాటిరాను''

అని మరో నాయిక జవాబు ఇస్తుంది. అంతటితో నిరుత్సాహ పడడు ఆ నాయకుడు.

"పూలదై కదాన, పాలుసూపులదాస
కాలిలో ముల్లిరిగె, కాసంతతీయవే''

అని జాలిగొలిపేలాఅని నాయికని మంచెమీదినుంచి దిగి రమ్మంటాడు. నాయిక మనసు దీనితో కొంచెం కదిలినా, ఆమె నిలదొక్కుకొని తనకు తాళికట్టిన వాడున్నాడనీ, కాలిలో ముల్లుని కరిగి మంగలిచే తీయించుకొమ్మ''నీ, చెప్పి "మంచెదిగను, నే మంచెదిగను." అని తన నిశ్చయాన్ని ఘంటాపథంగా చెప్పి ఆ పొంచివున్న చిన్నవాడిని పంపించేస్తుంది. ఈపదం చదివిన వారిలో ఎవ్వరూ జానపదుల్లో శృంగారం నియమబద్ధమైంది కాదనీ, నీతిరహితమైందనీ అనలేరు.

అవినీతిలోకూడా నీతి మిలమిలా మెరుస్తుంటుందన్న సత్యము మనకి మరోగేయంవల్ల స్పష్టమవుతోంది. రామదాసనే రంకుమగణ్ని మరిగి, వానిచేత అసలుమగడైన యెంకులుగాణ్ని చంపించి స్వేచ్ఛగా ఉందామని లంబాడీ ఎంకమ్మ నిశ్చయించుకొంది. "రెండెడ్ల బండిస్తా, పండిన చేనిస్తా"నని రామదాసుకి ఆశ కల్పించింది, "నీసాయా, నాసాయా, గొజ్జంగి పువుసాయా, పువుమీద తేనీగ సాయా కలిసిపోతాయ''ని మురిపించింది. వయసు ముమ్మరంచేత లంబాడీ యెంకమ్మతో అవినీతికరమైన సంబంధానికి ఒడబడినా రామదాసు యెంకులుగాణ్ని తన దోవలోంచి తొలగించేటందుకు చంపపూనుకొనే సాహసానికీ, అవినీతికీ ఒడబడలేకపోతాడు.

నాయకునిలో అసూయరేపి తనవైపు అతనిని మరింతగా ఆకర్షించుకొనే జాణతనం మరోగేయంలోని నాయికలో కన్పడుతోంది,

ఒకరికి చేతులిచ్చావ్, ఒకరికి కాళ్ళనిచ్చావ్
ఒకరిని చేతాబట్టి కూడున్నావోయ్, బావా! కూడున్నావోయ్

అన్న నాయిక హార్యాలు రెచ్చగొట్టిన అసూయానలంతో దందహ్యా మానసుడై నాయకుడు మండిపడి-

ఎవరికి చేతులిచ్చావే, ఎవరికి కాళ్ళనిచ్చావే
ఎవరిని చేతబట్టి, కూకున్నావే పిల్లా, కూకున్నావే

అని అడుగుతాడు, వెంటనే జాణయైన ఆ నాయిక-

గాజులకి చేతులిచ్చాన్, కడియాలకి కాళ్ళనిచ్చాన్
డబ్బుల్ని చేతబట్టి, కూకున్నానోయ్, బావా కూకున్నానోయ్.

అని తాను పొడిచిన పొడుపుకథని తానేవిప్పి, తారేపిన అసూయని మంచు విడినట్లు మాయమయేలా చేస్తుంది. ఈధోరణిలో అసూయని రెచ్చగొడుతూ, విడగొడుతూ నెఱజాణ నాయకుడికి తనమీదగల మోజుని ఒక కొలికికి తెస్తుంది. దేశదేశాలా నెల్లూరి నెఱజాణలూ, రావూరి రసికతలూ, తెలుగు మీరిపోసడమంటే నాగరికులవడమేనసీ తెలుగువారు పేరందుటకు జానపదులలోగూడ ఇట్టి ప్రజ్ఞా విశేషముండుటయే కారణము కావచ్చును.

శృంగార రస ప్రధానమైన జానపద గేయాల్లో తిల్లాలెపాటలు ఒకరకము. తిల్లాలెఅన్నపదం తిల్లానాయొక్క అపభ్రంశరూపం. వీటిలోని కథా విషయము సామాన్యంగా స్త్రీ పురుషులమధ్య జరిగే ధ్వని ప్రధానాత్మకమయిన సంభాషణ. రథ ప్రధానం కానేరాదు. సంభాషణకూడా ఒక పథకాన్ననుసరించి వుండదు ఒకేఒక నాయిక, ఒక నాయకుడూమాత్రం ఉండాలనే నియమంకూడా లేదు. నాయికా నాయకుల బృందంయొక్క రసాత్మక సంభాషణలే తిల్లానాలు. రచనా విధానాన్నీ, చమత్కారాన్నీ పరిశీలిస్తే గాథా సప్తశతిలోని గాథలు స్ఫురణకు వస్తాయి. మచ్చుకోసం నాకు లభించిన ఒక తిల్లానానుంచి రసలబ్ధులకోసం భారీ యెత్తున మచ్చుతునకల్ని అందిస్తాను

పు॥ ఎల్లలోకొశారుని నా యుల్లమందు దలచిమ్రొక్కి
చల్లని వేళనొక్క తిల్లాలె బాడవస్తి ॥తి॥

ప్రీ॥ సకలలోక ధారుడయిన సామి పాదసేవజేసి
వికలమైన పాటపాడ విందువస్తి వన్నెకాడ ॥తి॥

పు॥ పన్నెలాటి జాలమేసి నిన్నునమ్మి వచ్చినాను
చిన్నబుచ్చరాదు నన్ను చెలియరో నే నోర్వజాల. ॥తి॥

స్త్రీ॥ పురుషులను నమ్మరాదు తిరిగిపొమ్ము పల్లగాడు
దురుసుమాట లాడరాదు తిరిగిపొమ్ము పల్లగాడు. ॥తి॥

పు॥ నిన్నుబాసి పోవజాల నిముషమైన తాళజాల
కన్నె దయజూడీవేళ కరుణలేదా చిన్నబాల. ॥తి॥

స్త్రీ॥ వేషగాడ ! చాలుచాలు వేళగాదు తాళుతాళు
వాసిగాదు పొమ్మిప్వేళ వేషాలు జూపనేల. ॥తి॥

పు॥ సొగసుగాను నన్నుగూడు చెల్లాలన్నినాడు
కౌగలించి ముద్దిడుకల్కి కలిసె మనకు రేడుజోడు. ॥తి॥

స్త్రీ॥ ఏవూరు అందగాడ ఏలనాతో మాటలేల
సరసమాడ రానేల ? చాలు; నే చిన్నదాల. ॥తి॥

పు॥ చెన్నపురికి బోయివస్తి, చెండుపువ్వులు దీసుకొస్తి
సిగనుముడిచి త్రిప్పవే నా చిత్తము రంజిల్లగాను. ॥తి॥

స్త్రీ॥ యల్లన్న బండ్లమీద అల్లమెచ్చు బెల్లమెచ్చు
నామగడు బండిమీద నాగూరు పంచదార. ॥తి॥

పు॥ నీవుచూడగ చిన్నదానవు. నిమ్మపండ్ల మేనుదానవు.
పోవనేల పురుషునితో బెంగుళూరు రెయిల్మీద. ॥తి॥

స్త్రీ॥ నీలగిరి కొండమీద నిత్యం వర్షామెకదా !
కాలుజారుచుండె బావ కరము చేతికివ్వరారా ॥తి॥

పు॥ ముక్కుపచ్చల చిన్నదానా, ఎక్కుదాము రైలుబండి
నీచక్కదనం చూడగానె, జాతివాడు చేరయ్యడు ॥తి॥

స్త్రీ॥ ఒంటియెద్దు బండివాడ, వెంటనొస్తి బండిమీద
ఇంటిమగడు వంటిరిగాడు కొండసీమకు పోయినాడు. ॥తి॥

పు॥ నీలినీలి కొండలవిగో, సీమగని బండియదుగో,
జల్లిసీమ బాటలవిగో, జాజిపూల తోటలవిగో. ॥తి॥

స్త్రీ॥ చిత్తూరు బండిమీద శీఘ్రమునే వెళ్ళవలెను
చేతులో దుగ్గాణిలేదు జాతివాని మాటరాదు ॥తి॥

పు॥ చెన్నపట్నం చేరుదామ చెప్పకుండ ఎవరితోడ
తప్పకుండ దారిబట్టి తరలిపోపె ముందుగాను ॥తి॥

స్త్రీ॥ కన్నుగానని చీకటిలో చిన్నకన్నె నెటులబోదు
వన్నెకాడ జోడుగూడి వక్కసారె పోవుదామ ॥తి॥

పు॥ కొట్టుకొస్తి కొండసీమ కొమ్మరో నిక నుండజాల
దట్టమైన మాటలేల తడవుజేసే వాగజాల ॥తి॥

స్త్రీ॥ నరసాపురపు పేటలోను సరివిచెట్ల తోటలోను
కురిసినట్టి జోరువాన కొంగుదడిసె లంగాదడిసె ॥తి॥

పు॥ నిన్నసంజవేళలోను చెన్నపట్నం వీధిలోను
సన్నుతాంగి వారకాంత సల్పెనొక్క గాథవింత ॥తి॥

స్త్రీ॥ నామగడు వాడకెళ్ళె నాకు యెవరు జోడులేరు
కోడిగూసే వేళవరకు తోడురమ్ము వన్నెకాడ ॥తి॥

పు॥ ఇల్లులేదు. పెండ్లిలేదు. ఈతచెట్లకు కల్లులేదు.
ఢిల్లీ బజారులోను టోపీకి పెండ్లమంటె ॥తి॥

స్త్రీ॥ ఆవులుండె మేకలుండె. అత్తరూతుర నేస్తెయుండె
గుత్త సారాయిబూడవుండ కొండసీమకు పోవనేల ॥తి॥

పు॥ నరసాపురపు చిన్నదాన నల్లపట్టు చీరదాన
మల్లిమొగ్గ రవికెదాన చీరమీద చిలుకవాలె ॥తి॥

స్త్రీ॥ పాలకొల్లు సంతకెళ్ళే పల్లెఅక్కాలెలా మళ్ళి
గోరింటాడ కల్లుగొట్టి గొల్లుమనుచు దారిబట్టె ॥తి॥

పు॥ తెల్లతెల్ల చీర్లకట్టి మల్లెపూలు గోయుదానా
తెల్లవాడు చూచెనేని మళ్ళి రానీడుసుమ్ము ॥తి॥

స్త్రీ॥ కల్లుత్రాగి పల్లుమరచి కైపుయెక్కి వొర్లిపోము
పెళ్ళిజేసి పంపుతాము పెందరాడె తోవజూడు ॥తి॥

పు॥ తెల్లవాడి తోటలోను పుల్లలేరే చిన్నదానా
మల్లెపూల దండలిస్తు మాటవొకటి ఆడిపోవె ॥తి॥

స్త్రీ॥ మధురపట్నం వెల్లవలె, మల్లెపూలు తేవలె
కుదురుగాను శిగ ముడువవలె కులుకు బెళుకు జూపవలె ॥తి॥

పు॥ ఏమగిరీ కొండమీద ఎక్కిపోయె చిన్నదాన
మామకొడుకు నేగాన మాటవొక్క టాడరావే ॥తి॥

స్త్రీ॥ యెల్లఎడ్ల బండ్లమీద ఎక్కితోలె వన్నెకాడా
మెల్లమెల్లగ నడచుచుంటి తరలివస్తు సందగాడ ॥తి॥

పు॥ కల్లు అంగళ్ళుజూడు కాశికిపోయే బాటజూడు
మల్లెపూల తోటజూడు కుసుమపూల వన్నెజూడు ॥తి॥

స్త్రీ॥ కొల్లేరు కొంగ, సేప, కొండసీమ తాటికల్లు
వల్లుదిర్గిప్పె నడువజాల వన్నెకాడ చిన్నదాన ॥తి॥

పు॥ ఏలూరు చిన్నదాన, ఎర్రిపట్టు చీరదాన
ఎక్కుదామ రెయిలుబండి, వెల్లుదాము తంజావూరు ॥తి॥

స్త్రీ॥ సారాయి దుకాణముండె, సారమైన రూరలుండె
కోరమీసం రంగసామిశెట్టిరా ముప్పావుసేరు ॥తి॥

పు॥ బందరు చీరదాన, బనారసు రవికెదాన
చీరమీద చిలుకజూచి చిత్తమెల్ల తల్లడిల్లె ॥తి॥

స్త్రీ॥ సారాయి కల్లు త్రాగవద్దు, సంతకాడ తొందరొద్దు
దారిలోన అల్లరొద్దు, దాపుచేరి చూడరాదొ ॥తి॥

పు॥ బాల ప్రాయముతోనిన్ను బాసిపోతి మోటుమేను
మల్లివచ్చి చూడగానె బాలింత రూపమేమో ॥తి॥

స్త్రీ॥ వన్నెకాడ నీవునన్ను వంటరిగా విడిపోయినావు
అన్నాహారములేక చాలా అలసిసొలసి యుంటిచాలా ॥తి॥

పు॥ బంటుమిల్లి బాటలోన బందరు కోటలోను
కంటికింపయినట్టి జాణ కదలిపోదము కొండసీమ ॥తి॥

స్త్రీ॥ పెద్దపెద్ద కొండలేమి బెజవాడ సంతలేమి
ఎద్దునడచె దురితమేమి వద్దువద్దుర కొండసీమ ॥తి॥

పు॥ బెజవాడ రెయిలెక్కి రాజమండ్రి ఏరుదాటి
విశాఖపట్నం త్రోవపట్టి వెల్లుదామ విజయనగరం ॥తి॥

* * *
* * * *

పు॥ ఆడదానవు వాడయెక్కి ఏడబొయ్యేవు వన్నెలాడి
ఏడుదినములు కూడులేక మాడిచచ్చేవు మళ్లిబోదె ॥తి॥

స్త్రీ॥ ఓడనడిపే తెల్లవాడువచ్చి ముచ్చటించుచుంటె
ఏడునాళ్ళకు పోతేనేమి యేడాదికి పోతేనేమి ? ॥తి॥

పు॥ బర్మాదేశములో నీవు పనులేమీ జేయలేవు
తిరిగిపోవె తిన్నగాను తిప్పలేల సుందరాంగి ॥తి॥

స్త్రీ॥ ఇంటిమగడు వంట్రిగాడై పూరకుంటె రంగములో
ఇంటనుండే సంపాదింతు గంటకే వక వరహావంతు ॥తి॥

పు॥ రంగూన్‌కు పోపునట్టి రండముండల కొందరింటి
పురుషుణ్ని కొట్టితిట్టి పొమ్మంటారట దారిబట్టి ॥తి॥

స్త్రీ॥ రాత్రిపగలు శ్రమలకోర్చి రాబట్టిన రూకలుచ్చుకు
మేస్త్రులంచు తిరుగునట్టి ముట్టాలుల * చేతురటుల ॥తి॥

పు॥ బర్మాదేశం పోవనేల బంగపోయి రావనేల
ద్వారకాపురి చేరరాద దోషమెల్ల బాసిపోద ॥తి॥

ఈ తిల్లాలెపాట రచయిత, దాస వెంకటసామి, రకరకాల జానపద స్త్రీ పురుషుల సంభాషణన్ని విపరించేడు. చెన్నపురిచెండ్లు, ఇందరద్దకపు చీరెలు, బనారసు రవికెలు, ఏలూరు ఎర్రపట్టంచుచీరలు, నరసాపురపు నల్లపట్టంచుచీరలు, తెల్లతెల్ల చీరలుకట్టి మల్లెపూలు కోస్తూనో, తెల్లవాడి ( మిషనరీల ) త్రోటలో పుల్లలేరుతూనో ప్రత్యక్షమయే జానపద స్త్రీలనీ, నీవుచూడ చిన్నదానవు నిమ్మపండ్ల మేనిదానవులంటూ శరీరం పులకరించేలా ఇచ్చకాల మాటలాడుతూ సంచెరిగి "చెన్నపట్నం చేరుదామ చెప్పకుండ ఎవరితోను, ఎక్కుదామ రెయిలు బండి వెల్లుదామ తంజావూరు, మామకొడుకు నేగాన మాటఒక్కటాడరాద" అనే లయలమారి జానపద నాయకుల్నీ ప్రత్యక్షం చేశాడు.

---

* మూర్ఖులు

తిల్లానాఅనే జానపద గేయ విశేషం తమిళనాడులో విశేషవ్యాప్తి గాంచింది. అది ఉత్సవసమయాల్లో ప్రజావినోదసాధనంగా శతాబ్దాల తరబడి వాడుకలో ఉంది. సంగీత శాస్త్రవేత్త లంగీకరించే ఇతర రచనలతోపాటు శ్రీ స్వాతితిరునాళ్ (కులశేఖర మహారాజు) తిల్లానాలనుకూడా రచించి స్వరకల్పన చేసినారట! విషయం నాతికఠినమైందవడంచేతా, భాష సరళమైందవడంచేతా, భావం రమ్యమైందవడంచేతా జానపద హృదయంగమమైన రచనల్లో తిల్లానాకొక ప్రత్యేకత సిద్ధించింది. లయానుగుణంగాఉండే ఈ సంభాషణా రూపకము నృత్తవాద్య సహితమై యక్ష గాన రూపములకు పూర్వరూప మనిపిస్తుంది. ఈ రకపు గేయ రచనలు తెలుగులో అతితక్కువ. మనం ఉదహరించి పరిశీలించిన పాటను రచించిన దాన వెంకటస్వామికి తమిళ జానపద సంప్రదాయాలతో పరిచయం కలదనీ, వాటిని ఆకళించుకొని, వాటి ప్రయోజనాల్ని గుర్తించి దీనిని రచించాడనీ, మనం భావించవచ్చు. అందుకు ఈ పాటలోని అనుదాహృతములైన తమిళ పదాలు సాక్ష్యమిస్తాయి. మొత్తంమీద ఈ తెలుగుతిల్లానా తెలుగు జానపద గేయ వాఙ్మయానికొక ముఖ్యాలంకారము. నృత్తగీత సహితమైన ఇలాంటి సంభాషణా రూపకములు తెలుగు కళా సంప్రదాయముల పునరుజ్జీవనానికి తోడ్పడుతాయి. నేటి జానపద గేయ రచయితలీ రచనా విధానాన్ని ఒరవడిగా గ్రహించి మేలైన రచనలు చేయాలని ఆశిస్తున్నాను.

తిరుపతి కాశీ రాములాలా కుమారుడు లాలా కన్నయ్య. నవరసాలంకార నాటకముగా తిరుపతిలో గంగజాతర సమయంలో ప్రజల్ని వినోదింపజేసేటందుకు సుంకరి (పన్ను వసూలు చేసేవాడు) కొండడివేషము కథని రచించాడు. ఇది తిల్లానా బాణీలో రచింపబడిందనే అనాలి. సుంకరివేషం వేసుకొన్న శ్రీకృష్ణునికీ, చల్లనమ్ముకొనేటందుకు పట్నంలోకి రాబోతున్న గోపికలకీ జరిగిన సరస సంభాషణే ఇందలి కథావిషయము. సుంకరి పన్నుకోసంకాక భామని పట్టపలెనని అటకాయిస్తాడు. అందుచేత సంభాషణ శృంగార, హాస్య రస ప్రధానంగా సాగుతుంది. చివరికి కృష్ణుడువేషం కథ జనబాహుళ్యంయొక్క అభిమాన పాత్రమైందనే అనిపిస్తుంది. అభినవ రామలింగ బిరుదాంక హాస్యరసోపన్యాస పారీణుడైన ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య తన్నుతాను సుంకరి కొండాయయని చాటువులలో సంబోధించుకొన్నాడు.

జానపద గేయాల్లో శృంగార రస ప్రధానమైనవాటిని పూర్తిగా వివరించా

లంటే ఎంత గ్రంథమూ చాలదు. వ్యంగ్యంగానూ, వాచ్యంగానూ ఈగేయాల్లో స్త్రీ పురుషుల ప్రేమకలాపాల రీతులు చిత్రించబడ్డాయి. జానపదుల ఉబుసుపోకకుపయోగించే కాలక్షేపాలూ, అవకాశాలూ, నాగరకులకు లభించే వాటితో పోల్చి చూస్తే అతితక్కువేనని అనాలి. వారిలో సహజంగా ఉండే కళాభిరతి సక్రమమైన కృషికి అవకాశం లేకపోవడంవల్ల పరిణతిచెందదు. వారిలో స్త్రీ, పురుషుల పరస్పర సమావేశాలూ, వారు కలిసిమెలిసి పనిపాటలుచేసే అవకాశాలూ, ఒకరిపట్ల ఒకరికి చనువునిస్తాయి. అలాంటి పరస్పరాకర్షణవల్ల కలిగే రస ప్రాదుర్భావము అప్పుడప్పుడు సాంఘిక నియమాల్ని అతిక్రమించడంలో ఏమీ ఆశ్చర్యంలేదు. ఈ రకరకాల రస ప్రతిధ్వనులే జానపద గేయ వాఙ్మయంలో ప్రతిబింబించాయనడం సత్యదూరం కాబోదు. అందుచేత వాటిని ఆదర్శ సూచకములైన రచనలు కావని తప్పుపట్టి నిరసించుటలో అర్థంలేదు. అలాచెయ్యడం న్యాయంకాబోదు. అలాంటి గేయాల్లో వర్ణితములైన నాయికా నాయకులని జానపదులు ఆదర్శంగా గ్రహిస్తారనీ, ఆదర్శప్రాయులనే భ్రమపడతారనీ, నేననుకోను.

జానపద గేయాల్లో ధ్వనించే శృంగారం నీచశృంగారంఅని అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులవంటి విమర్శకులు నిరసించవచ్చు. కాని, కచకుచవర్ణనలుగాని, పుంభావ రతి సంప్రదాయములుగాని, వాటియందు మందునకైననూ కన్పించవని వారంగీకరింపక తప్పదు. సామాజిక వ్యవస్థలో తరతరాలుగా తక్కువవారని భావింపబడుచున్న వారి భావములకు నీచత్వ మాపాదించి నిరసించుటయు అంతరంగె పచ్చిగా వర్ణితములైన విషయములను ఆలంకారిక సమ్మతములనీ, ఉత్కృష్ట రస పోషకములనీ నిర్వచించుట కేవలం అన్యాయమే అవుతుంది. పరాశర దాశకన్యావ్యవహారం ప్రబంధ మర్యాదలో నడిచిందనడం స్వభావ విరుద్ధమవుతుందికదా: అలాగే నృసింహస్వామి చెంచితల సమావేశమూను. ఈరెండు సంఘటనలలోనూ నాయికలు కన్యలవడంచేతా, నాయకులుత్తములవడంచేతా వారిశృంగారం ఉత్కృష్టమైందనీ, జానపద నాయికా నాయకుల్లో అట్టి విశిష్టత మృగ్యమనీ సామాన్యంగా పరకీయాశ్రయమై ఉంటోందనీ అందుచేత వారి శృంగారం నీచశృంగారమనీ ఎవరైనా అనవచ్చు అలా వాదించేవారికి శృంగార రసావిష్టులైన నాయికా నాయకులు, వీరు వారని భేదంలేకుండా తన్మయులవుతారనీ, తార్తీయ పురుషార్థ సిద్ధియే వారి తత్కాల లక్ష్యమవుతుందనీ, అట్టి స్థితిని అశ్లీలములు దొర్లకుండా, మధుర భావ స్ఫోరకంగా రచించిన రచనలన్నీ

ఆదరణీయమనే నని నా అభిప్రాయము. మధుర భావనా పేశలములు వంటివృత్తాలికిగాని, నీతికిగాని రసాన్ని అధఃకరించే ప్రాముఖ్యం ఇచ్చి విమర్శించి, నిరసించటం న్యాయం కాదు. ఇలాగనడం చేత అనీతి ప్రచారాన్ని నేను సాగిస్తున్నవాడ్ని కాదు. రస నిర్వచనంలో నీతి అవినీతుల్ని పరిగణిస్తారని ముడివేయడం ఆలంకారికులకూ, విమర్శకులకూ తగదనిమాత్రం మనవి. ఒకచిన్న ఉదాహరణం చెప్పి ముగిస్తాను. సీతారాముల ఆదర్శ పరిణయం నీతిబోధకమై, మధురమై స్వచ్ఛపవిత్రమమైంది. యెంకి నాయుడుబావలు, వెంకయ్య చంద్రమ్మలు అను నాయికా నాయకుల పరస్పర పరిణయం పరకీయమని నిర్వచించేటందుకు విస్పష్టమైన ఆధారాల్లేవు. కాని విద్యాశేఖరులు అనుమానించినట్లు పరకీయా పరిణయమైనా లేతనీలిరంగు ఛాయవంటిదనో, ధూమ్రవర్ణంవంటిదనో అనవచ్చు. ఏరంగుఅందం దానిదేకదా! లోకాన్ని యథాతథంగా చిత్రించే చిత్రకారుడు ఏరంగునీ వదలివేయాలని అనం కదా! అలాంటప్పుడు లోకాన్ని అద్దంలోలా తన కవిత్వంలో చూపించదలచుకొనే సహజ పదశిల్పి బీదసాదల్ని యథాతథంగా చిత్రించడం, దూష్యంఅనడం అన్యాయం. "కొయ్యబొమ్మలె మెచ్చు కనులకు కోమలుల సౌరెక్కునా?" అనిపించేలాంటిది.

## 3 వీ ర క థా వా ఙ్మ య ము

తెలుగుదేశం వీరులకి అన్నికాలాల్లోనూ ఆటపట్టే. దానికి కారణం తెలుగుతల్లులు బాలబాలికలను బాలకృష్ణులుగాను, లక్ష్మి సీతాది దేవతలుగాను భావించి, ప్రేమించి, వీరగాథలు రంగరించి పొయ్యడమూ, వయసు వచ్చిన తర్వాత వారు సంచారి కథకులు పాడే అతి వీరరస ముఖ్యాంగించిన వీరగాథలు వినడమూ, అనేఅనాలి.

వీర కథాగానం మనదేశంలో అనాది సిద్ధమైన ఆచారమనే అనిపిస్తుంది. పృథ్వీరాజ యశఃకాయాన్ని నిల్పిన చాంద్ కవీ, రాజపుత్ర వీరగీతాల్ని గానం చేసిన భట్టులూ, మన కాటంరాజుకథ పాడే గొల్లలూ, పల్నాటి వీరకథనిపాడే పిచ్చుగుంట్లూ, బొబ్బిలి పాటకులూ. ఒకే అనుపూర్విగలవారు. సాహసికుల సాహసకృత్యాలు అంతకంటె తక్కువ సాహసికులకి వెరపూ, ఆశ్చర్యమూ, కలిగిస్తాయి. అందుచేత సాహసికుల్ని మెచ్చుకోవడం ఒక్కొక్కసారి అనుకరించే సాహసం కలగడం జరుగుతాయి. ఇది దేశం పరస్వాధీనం కాకుండా

కాపాడుకొనవలసిన కాలంలో అత్యగత్యమైంది. అందుచేతనే వీరకథా గాథలెన్నో గేయరూపంలో ప్రచారంలో నున్నాయి. అలాంటివాటిలోవే కాటమరాజుకథ, పల్నాటి వీరచరిత్ర మొదలైనవి.

## (I) కాటమరాజు కథ

తెలుగు వీరకథా వాఙ్మయంలో కథా విషయాన్నిబట్టి అతి ప్రాచీనమైంది కాటమరాజుకథే. నెల్లూరి మండల శాసన సంచయములో కాటమరాజుకీ, మనుమసిద్ధికీ క్రీ॥ శ॥ 1170 ప్రాంతంలో యుద్ధం జరిగినట్లు ఆధారం కనిపిస్తోంది. ఐతే, ఆశాసనంలో కనిపించే పద్యాలు కొన్ని భాగవతంలోవి. అందుచేత ఆ శాసన ప్రామాణికత్వాన్ని శంకించవలసిందే. చారిత్రికంగా కాటమరాజు కథ విలువ ఎలాగున్నా జానపదుల్లో ముఖ్యమైన తెగకుచెందిన గొల్లల కత్యంత ప్రీతిపాత్రమైంది. తెలుగు గడ్డమీద పుట్టి పెరిగిన గొల్లవీరులకీ చోళరాజైన సిద్ధిరాజుకీ జరిగిన యుద్ధగాథ కావటంచేత ఈ తెలుగు వీరగాద అందరికీ ప్రీతిపాత్రమైంది. అన్నిదేశాల్లోనూ గొల్లలు అమాయికత్వానికి పేరందారు. నైసర్గిక సౌందర్యంతో ఒప్పే వాతావరణంలో రాత్రింబగళ్ళు జీవిస్తూ తమకంటె అమాయికములయిన ఆవుల్నీ, గొర్రెల్నీ, మేకల్నీ మేపుకొంటూ నిత్యతృప్తులూ, నిరతిశయానంద భరితులూఅయి జీవనం గడుపుకొనేవారు. వారిని యోగీశ్వరతుల్యులని భావించడంలో ఏమీవింత కన్పించదు. అన్నిదేశాల వాఙ్మయంలోనూ గొల్లలకు అసమానమైన స్థానముంది. మనదేశంలోకూడా యదువంశజుడైన కృష్ణునికిగల అత్యున్నత స్థానాన్నిగురించి ఎవరూ ఎవరికీ వివరించనక్కరలేకుండానే స్పష్టంగా కన్పిస్తోంది.

మనకి లభించిన కాటమరాజు కథని కొమనాల గోత్రాబ్ధిచంద్రుడైన గంగుల మల్లయ తనయుడు, సర్వన సోదరుడు పినయల్లయ శ్రీనాథ వచన (రచనా?) పద్ధతిని అనుసరించి రాశాడు. దీనిప్రతి ప్రాచ్య పుస్తక భాండాగారంలోవుంది. దాన్ని పరిష్కరించి పీఠికతో శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారి అధ్వర్యంలో ప్రభుత్వంవారు ప్రచురిస్తున్నారని వినికిడి. అందుచేత ఈ వీరగాథకి తెలుగు ప్రజానీకంలో ఇతోధిక వ్యాప్తిగాంచే అవకాశం కలుగుతోంది. ఈ కథకు సంబంధించిన ఇతర గాథలూ కూడగట్టి సవిమర్శంగా ప్రకటితం అవ

వలసిన అవసరంఉంది. వాటన్నింటినీ పక్కనపెట్టకుండా ముఖ్యకథనమాత్రం పరిశీలించ దలచుకొన్నాను.

కాటమరాజు యాదవరాజు. అమిత విక్రమశాలి. గోవుల పోషకుడు. పెద్దిరాజు వర కుమారుడు. శ్రీశైలం, నల్లమల మొదలయిన పర్వతప్రాంతారణ్యాల్లో పశువుల్ని మేపుకొంటూ, సిద్ధిరాజుకి పుల్లరి ఇచ్చేటందుకు ఒప్పుకొన్నాడు. కాని, తన గోవులకు సిద్ధిరాజు మనుష్యులైన కిరాతకులవల్ల నష్టం కలగడంచేతా, పాతపగలు తీర్చుకోవాలనే నిశ్చయంచేతా, పుల్లరి యివ్వడానికి నిరాకరిస్తాడు. అలా నిశ్చయం చేసుకొన్నట్లు మరది వరసతో సంభాషించే పద్మనాయనితో కాటమ రాజు చెప్పిన క్రింది మాటలవల్ల తెలుస్తుంది.

పగతునై పశువులపాకనాటి మేపి
పుల్లరి యివ్వక పోగలుచుపచ్చి
వెలయ వైరంబున్న యరగడ్డపాటి
పల్లవాది రాజుతో పగదీర్తుననుచు
గుంట మరణ వీరగంగ గురుతు యుగములకు
నరగ పోట్లాడుదు, యిక్కడ పగ సంహరింతు
అనుచు తన మదియందు ఆత్మలో తలచి
పరిచారకుల బిలిచి పలికెను రాజు
పాలేరు గడి చేసి సరిగ దక్షిణమందు
మా తండ్రి పోలు రాజు మరియు నెదురుగను.
తమరుండె తాపుకు తమక యేర్పరచు

అని ఆజ్ఞాపించాడు. సిద్ధిరాజుకీ తమకీ గల పాతపగలకీ కారణాన్ని కూడా కాటమరాజు పోలురాజుని స్మరించి కారణయుద్ధానికి అనుజ్ఞపొందే ఘట్టంలో తెలిపాడు. ఆ సందర్భంలో పత్తికొండకీ మహరాజుస్నుడైన పోలురాజుకీ క్రిందిమాదిరిగా జరిగిన పాతసంభాషణ గుర్తు వచ్చింది.

తొల్లి చంద్రగుప్తుడు శివుని దొడ్డపూజించి
ప్రతిష్ట.పర్వతం చేసి పరమేశ్వరుని కృపను
ఆవుల షలురాజు అదృష్ట వశమున
వల్లయ పోలురాజువై పుట్టితివి పురహరుని కృపను

ఆరూపమున హరుని అటు పూజచేసి
తుదను జంగాలకై దురములో నీవు
చూడ చోద్యముగ చోడదళము చుట్టుకొన నీవు
"హర హర" యని తలచి అటు పొరచూచి
చక్కగా నరికానావశానల గూర్చి
ముప్పయి మూడు పోట్లు నీకు ముందుగా నాటె
అతిథాయె హరిపురికి. అప్పుడు నేను
శలవిచ్చి సేనపైనను పంపుమంటి
పల్లవులవో మామ వద్దన చెప్పితిని
తల్లిదండ్రులు లేని బాలలకు అగు నీవు దిక్కు
పంచ కొండముల చెల్లినవారి సుతుల బాగుగా దెచ్చి.
యింతలంతల బాలల యీడేర్చుమంటివి
దొరకాని చాలురధనముకొండ [దొనకొండ] యేలించుమంటిని
మళ్ళి వచ్చె చిత్రభాను సంవత్సరాన

వ॥ పగ తీరును. అందుచేతనే.

నాయుడ వినవోయి నా చిన్న మరది.
పాయరాని సంగతి పద్మరాఘవుడ
ధర్మయుద్ధము మనకు తగదొరకునో యనుచు
కారణ యుద్ధము కలిగితె కైలాసమనుచు
మనకటు సంతోషమై వుండగాను
తొల్లి మా పెద్దల పగలు దొరకొని వచ్చె.
పల్లవాది రాజుల పాలేటివద్ద
పట్టి పోట్లాడవలె. మా తండ్రి ప్రతిన యీడేర్తు.

అని తిసుగని నిశ్చయం చేసి రణానికి ఆయితం కండని పల్లికొండ అయితన్నచే జాబు పంపాడు. దొనకొండ రాజులకీ. పశువుల బాస తెలిసి భావజ్ఞమూర్తి యదర్రియను పశువులకీ. చల్లవారికీ. కబురు తెల్పమన్నాడ నాచమాళ్ళ నాయుడికీ. నేతివారి ముద్దయ్యకీ. పిలుపులు వెళ్ళాయి. పొపయ ముమ్మయ. పుత్తమీరాజు అనే బలాఢ్యులూ, కొణ్యంధ్ధూ, మరాధుచేనూతో వచ్చి పంచలింగాల కొండవద్ద విడిశారు.

సిద్ధిరాజు రాయబారం పంపాడు. రాయబారం వచ్చిన రాయశృంగావళి అనే భట్టు వాదం అంతా వినిపించి,

"బుద్ధిమాలియు పెట్టి బుద్ధులు పోక
పెద్దరికాల్ మాని పెట్టు పుల్లరిని" అని ముగిస్తాడు.

అతని వాదంలో గొల్లల్ని గురించి తీసికట్టుగా చెప్పిన మాటలకు కాటమ రాజు సభలోవారికి చిర్రెత్తుకొచ్చింది. వారిభట్టు గొల్లల ప్రాముఖ్యాన్ని, ప్రశస్తి ని క్రిందివిధంగా కీర్తించాడు.

మాటిమాటకు గొల్ల గొల్లడనియేవు
పురముగా నీ భూమి మోసెను గొల్ల
తరిగొండ లాగంగ త్రావడాయె గొల్ల
వేడుక వ్రేపల్లె వెలదుల గూడి
కొల్లలాడినవాడు గొల్లతడు కాడె.

అని కృష్ణుని లీలలను వివరించి,

మాకులంబున బుట్టె మదన గురుండు
మా కులంబున బుట్టె మరియు సూర్యుండు

అని దేవతలందరినీ గొల్లలని తేల్చి,

కాటమేశ్వరునిట్లు కారు లాడితివి
పరుల కెన్నియని బాహుబలుండు
పరకాంత తల్లిగా భావించువాడు
ఇటువంటి రాజు కనుయెదుటను నిలచి
తాటోటు మాటలు తప్ప బల్కితివి.

అని రాజుని కీర్తించి,

వదలక పలుమారు వసుధేశు నెదుట
వదలి రమ్మనుమి మీ కలవారినెల్ల.

అని యుద్ధనిశ్చయం చేశాడు.

యుద్ధం నిశ్చయం కాగానే సిద్ధిరాజు, సిద్ధన, తిక్కనలను పిలవనంపి తన [illegible]లందరికీ [illegible] వ్రాయించాడు. వారందరిలో తిరునామాల తిప్పరాజు,

శ్రీకంఠరాజు, పెదవేగి చక్కారాజు, పెదవరదరాజు, అల్లికొండ అబ్బిరాజు, అదివన్నె మాదిరాజు, గయకొండ నేలే గంగరాజు, పులుగొండ సోమన్న, పుద యాద్రి పుమ్మయ్య, చన్నపట్నం యేలే చంద్రశేఖరుడు, అనేవారున్నారు. మొత్తం మీద తెలుగు యాదవరాజులతో చోళసైన్యాలు ఢీ కొన్నాయి. ఈ యుద్ధంలో ఖడ్గతిక్కన చూపిన పరాక్రమము భట్రాజుల కవితకుత్కృష్టత నాపాదించింది.

కరణాల దేవూరు? కయ్యమేపూరు?
పరికింప చదువను బాసలు తెలుప
పగతుల నిర్జింప పనిగాదు నీకు.

అన్న శిద్ధిరాజు వేళాకోళం వ్యర్థవాక్యాలయేలా ఖడ్గతిక్కన పాగలకొండ దగ్గర అత్యంత బలులైన చల్లవారినికదిశాడు. యుద్ధం చిత్రభాను సంవత్సరంలో మాఘ బహుళ అమావాస్య మంగళవారంనాడు మొదలైంది. కాటమరాజు తరపున తంబళ బ్రహ్మరుద్రయ్య నాయకత్వం వహించేడు. శిద్ధిరాజు సైన్యం మొదటితాకి డితో యథాయథలైంది. తిక్కన్ననుచూచి-

చల్లపిన్నమనాయుడు సార్వభౌముండు
పోరు నిలుపుమోయి భూసురోత్తముడ
సరిగాదు మాతోను సమరంబుశాయ.
అగ్రజులు మీరు మరి యాదవుల మేము

అని బ్రహ్మహత్యాపాతకానికి శంకించి పోరుచాలించవలసిందన్నాడు. తిరిగి సైన్యం కూర్చుకొద్దామనే ఉద్దేశంతో రణతిక్కన నెల్లూరువైపు తిరిగాడు. వెనుతిరిగిన తిక్కన్నకు పొడలిచ్చిన స్వాగతం ఎంత వ్యంగ్యంగా ఉందో చూడండి.

ఘనమైన దాడాలు గారెలుగావు
ఆర్చి నరికేకత్తు లరిసెలుగావు
పూని పొడుచు బల్లేలు పూర్ణ కుడుములుగావు
బంటుతన మేపూరు బ్రాహ్మ దేపూరు

ఇక ఇంట్లో భార్యా, తల్లీ, స్నానందగ్గరా, భోజన విషయంలోనూ చేసిన పరిహాసం చాటుకవిత్వంలో మణిపూసల్లాంటివి. తెలుగుదేశంలో ఆబాలగోపాలం

విరిగినవి. వాటిలోని భావాలే వీరగాధలో కూడా ప్రతిఫలిస్తున్నాయి. రణమర్యాదలతో తిక్కన-

యతిప్రాస రీతులు యెరుగని కవితేల ?
శ్రుతిగూర్చి పాడని సొగసు పదమేల ?
యితరులు మెచ్చని యింతి శోభనమేల ?
అరిచూచి మెచ్చని బంటుతనమేల ?

అని భావించి తిరిగి సైన్యం కూర్చుకొని రణరంగ విహారానికి పరశురాముడిలా తయారయాడు. ఈ ఉగ్రమూర్తి నిచూసి-

పుడమిలో యాదవులు పుణ్యాత్ములనగ
కడసారి బ్రహ్మహత్య కట్టుగోరాదు.

అని భావించి. కాటమరాజు తంబళ బ్రహ్మరుద్రయ్యను పిలువనంపి. తిక్కన్నను ఎదుర్కొనవలసిందని అర్థించాడు. బ్రహ్మరుద్రయ్య శివపూజా ధురంధరుడు.

హరహరాయని తనలింగము నచ్చోటనిలిపి.
గంధ మక్షింతలు ఘనపూజచేసి.
మారేడు పత్రియును, మల్లెపువ్వులును
శిరమందు ధరియించి, శివలింగమనుచు
వీరభోనము తనకు వేగ చెల్లించి.

తిక్కనతో ద్వంద్వయుద్ధానికి సిద్ధంఅయినాడు. వారిద్దరి ఘోరయుద్ధాన్ని పదకర్త చక్కగా వర్ణించాడు. తిక్కన బ్రహ్మరుద్రయ్య లిద్దరూ పరస్పర ఖడ్గహతులైనారు.

తర్వాత చల్లవారియుద్ధమూ, ఆవులయుద్ధమూ సాగాయి. ఆవులయుద్ధంలో బొల్లావుదే నాయకత్వం. నాయకుడు లేకపోయినా, పశువులే కళపెళకదంతొక్కుతూ శత్రువులను ఢీకొనడం పల్నాటి వీరచరిత్ర మందపోటులో లంకన్న ఒరిగిన తర్వాతనూ. ఈ బొల్లావుయుద్ధంలోనూమాత్రమే కన్పిస్తోంది. ఈ ప్రత్యేకత ఒక్క తెలుగునాటనే, తెలుగు జానపద వాఙ్మయంలోమాత్రమే, ద్యోతకమవుతోంది ఆవులని జయించలేక శిద్ధిరాజుసైన్యం వాటిమీద తుపాకిగుండ్లు ప్రయోగించిందట।

చివరికి శిద్ధిరాజూ, కొటమరాజూ, దక్షుడూ, శంభుడూ తారసిల్లినట్లు తారసిల్లి పోరాడి ఇద్దరూ మడిశారు. రణరంగము ప్రమథగణాలతోడి శివునినాట్య రంగమైంది. ఈ యుద్ధరంగంలో 88వేల ఏకాంగ వీరులూ, 90వేల అశ్వాలూ, 3వేల ఏనుగులూ, 15వేల లొట్టిపిట్టలూ, 9లక్షల తుపాకీ విలుమూకా బలిఅయి నట్లు పదకర్త వర్ణించాడు. పాతపగలూ, పుల్లరితగవూ ఇలా ముగిశాయి. మనకి గొల్లభారతం మిగిలింది. కొటమరాజు-

నరజన్మ మెత్తుటచేనలనన్న
ఆవుల గాచుటచే ఆపులన్న
పశువుల పట్టము గట్టుటచే
కాట కోటేశ్వరుడు కొటమరాజు

క్షత్రియుడై, వరములిచ్చు దేవుడై తెలుగు దేశంలో నిలిచాడు. వర్షాభావపు రోజుల్లో వర్షంకోసమూ, నిస్సంతులైన స్త్రీలు సంతానంకోసమూ, భజించే ఉపాస్య దైవమయ్యాడు. "కాటమరాయడా, కదిరీ నరసింహుడా"అని పాడే జానపదులూ "రామాండకతలెల్ల మేమెరుంగనివనా ? కొటమరాజుకు కర్ణుడోడె" అని తమ పాండిత్యాన్ని గురించి కోతలుకోసే మూర్ఖులూ, కొత్రిని చీరకట్టి సంతానం కోసం వలపలాడే కాంతామణులూ నేటికీ నిలిచియున్న కొటమరాజు కీర్తిస్తంభా లనే భావించాలి. అందుచేత కొటమరాజుకథ ముఖ్యమైందన్న విషయాన్ని గురించి ఎవరూ సందేహించవలసిన పనిలేదు. ఐతే, ఈ కొటమరాజు కథలో చరిత్రవేత్తలదృష్టికి కొన్ని అసందర్భాలు కనిపిస్తాయి. క్రీ॥ శ॥ 1170 ప్రాంతాన జరిగిన యుద్ధంలో చన్నపట్నం పాలించే చంద్రశేఖరుడు పాల్గొన్నాడనీ, లొట్టి పిట్టలబలము పాల్గొన్నదనీ, తుపాకీ విలుమూకల యుద్ధం జరిగిందనీ వర్ణించ బడింది. ఇది ఒక లోపమే. ఎందుచేతనంటే ఫ్రాన్సిస్‌డేకి చంద్రగిరిరాజులు పట్టా యిచ్చినతర్వాతనే చన్నపట్నం స్థాపన అయింది. ఈ యుద్ధం తర్వాత అథమం పందమ్యేళ్ళకి తర్వాతగాని పాశ్చాత్య దేశాల్లోనే తుపాకీలు, వాడుకలోకి రాలేదు. అలాంటప్పుడు 1170 లోనే ఈ యుద్ధంలో తుపాకీలని మనవారు వాడే రనడం సంచర్భోచితంగాలేదు. ఈ లోపాలు పదకర్త కాలంనాటికీ విషయాలు జరిగివుండడమో, లేక అసలు పదంలో, తర్వాతదాన్ని పాడిగ సంచారిపాటకులు చేసిన చేర్పులవల్లనో కలిగి ఉండవచ్చును. అందుచేత వీటిని పెద్దలోపాలుగా ఎంచవలసిన పనిలేదు.

## (II) పల్నాటి వీర చరిత్ర

వీర రస ప్రధానమైన రచనల్లో పల్నాటి వీరచరిత్రకి ప్రత్యేకస్థానం ఇవ్వాలి దాన్ని రచించిన శ్రీనాథుడీయాదేశంబనకుండా సమగ్ర ఆంధ్రావనిని మెట్టినాడనే అనాలి. ఆయనకి ఆంధ్రదేశమూ, త్రిలింగ శూర తేజస్సూ, సమగ్రంగా ప్రత్యక్షమై పులకరించేలా చేశాయి. అయఃపిండంవంటి కాశీఖండాన్నీ, విద్వదౌషధంవంటి నైషధాన్నీవ్రాసి కవిసార్వభౌముడై, కనకాభిషేకాది గౌరవములందిన, వీర శ్రీ వేమభూపతి వీట విద్యాధికారియైన శ్రీనాథుడు పామరజనామోదకరంగా వీరచరిత్రని "శాశ్వతంబై నట్టి సద్గ్రంథమునే" నమ్మకంతో రాయడం ఎంతో హర్షించతగిన విషయం. సంస్కృతారణ్య సంచారివిద్వన్మత్తేభ యూథములే దేశంఅంతటా నిండియున్న కాలంలో వెన్నెలరాత్రిలలో జనసమూహాలకు విన్పించేటందుకు పిచ్చుకుంటుజాతి వారికోసం పనికట్టుకొని గ్రంధరచనచెయ్యడం గమనిస్తే, శ్రీనాధుడు వారూ వీరూఅనే తేడాలెంచకుండా అన్ని తరహాలవారికోసమూ ఎన్నివిధాల వీలైతే అన్నివిధాల విద్యావ్యాప్తికై పాటుపడిన అస్వార్థ విద్యాధికారి యనికూడా రుజువవుతోంది. పంబజోడూ, తిత్తీ, సాయంతో వీరకథలను పిచ్చుకుంటుజాతివారు పాడతారు. కథకుడు చేత తిత్తిపట్టుకొని భావానికీ కథపట్టుకీ అనుగుణంగా ఇటూ అటూ తిరుగుతూ అభినయిస్తూ కథ సాగిస్తాడు. బహుశా యీ శ్రవ్య శ్రావ్యకథా విధానమే భారతీయ రూపకానికి బీజంలాంటిదని విమర్శకు లంగీకరించతగిన విషయంఅని నా అభిప్రాయం.

స్వతంత్రదేశంలో స్వాతంత్ర్యంలంటే అభిమానమూ, దాన్ని రక్షించుకోవలసిన బాధ్యతా ప్రజల జీవనాళాల్లో ప్రవహిస్తూండడం అవసరం. అవసరమైనప్పుడు స్వతహా రక్తంలో నిద్రాణమైఉన్న వీరగుణాన్ని ప్రజ్వరిల్లేలాచేసి ప్రజల్ని స్వాతంత్ర్య రక్షణ దీక్షితుల్ని చెయ్యడం వీరకథా ప్రచారంవల్లా, వీరారాధనవల్లా సాధ్యమవుతుంది. పృథ్వీరాజు యశోగీతాల్నీ, రాజపుత్రవీరుల పరాక్రమాగ్ని స్ఫులింగాలవంటి గీతాల్నీ ఉత్తరాదివారెరుగుదురు. ఇకదక్షిణాదిని తెలుగుదేశంలో కాటమరాజుకథనీ, వీరచరిత్రనీ, బొబ్బిలికథనీ, చిన్నప్పరెడ్డికథనీ, అల్లూరి సీతారామరాజుకథనీ మనం ఎరుగుదుము.

తెలుగులోని వీరకథా వాఙ్మయం అంతటిలోనూ పల్నాటి వీరచరిత్రదే అగ్రస్థానం, అదే మంజరీ ద్విపదలో వ్రాయబడిన మొదటి కావ్యమట; కథా

వస్తువుయొక్క ప్రాముఖ్యాన్నిబట్టికూడా అది తెలుగువారికి గర్వకారణమవుతోంది. సర్వమానవ సౌభ్రాతృత్వ సూచకమైన వీరమతం తెలుగునాటనే ఆవిర్భవించింది. వీరకథా సంవిధానంపట్ల వీరులపట్ల భక్తివిశేషం కలిగి, వారికి గుడులు కట్టి, తిరునాళ్ళుజరిపి, ఆరాధించడం ఆచారమైంది. జాతి మత కుల భేదాలతో శతధా విభాగింపబడిన జాతి, వీర గుణోపాసన మూలంగా ఏకమైంది. మాల కన్నమ మొదలు మలిదేవ భూపతివరకూ ఏక కార్యస్థులై ఏక పాత్రాశనమువంటిదైన చాపకూడు కుడుచుట వీరపద్ధతి నవలంభించిన వీరమతము వారికే చెల్లుతుంది. ఈమతానికి నాడున్నవ్యాప్తి. నేటికీ నిలిచిఉన్న ప్రాంగ్యంనిబట్టి మనం ఊహించుకోవచ్చు. వీరగాథకి ఆనాటి వారిచ్చిన ఉత్కృష్టస్థానాన్నీ, మత గౌరవాన్నీ, మరొక విషయంకూడా రుజువు చేస్తుంది. ఈనాటికీకూడా కొందరు వీరకథ పఠనాన్ని వారి పితృదేవతలకు చేసే అపరక్రియలలో ముఖ్యమైన విధిఅని భావిస్తున్నారట. నావిష్ణుః పృధివీపతిఃఅన్న వాక్యంలోనూ, రాముడు ప్రతిష్ఠించిన రామలింగేశ్వరుడూ, గణపతిదేవుడు ప్రతిష్ఠించిన గణపేశ్వరుడూ మొదలైన దేవతల ఆరాధనలోనూ, సూచనప్రాయంగా గర్భితమైఉన్న వీరారాధనే వెల్లువయై వీరమతమనే పేర పొంగిపొర్లి తెలుగుదేశాన్ని వీరఖండంగా మార్చిందనీ, ఇది జపాన్ దేశమునందలి షింటోమతాని కీడైనదనీ అనుకోవచ్చు.

దక్షిణాదిని అరువత్తి మూపురు (63) శివభక్తులుగా నవతరించిన ప్రమధగణము, తెలుగునాట అరవై యైదుగురు (65) వీరులుగా నవతరించి వీరవిహారమొనర్చి, తెలుగుతల్లి తరతరముల వీరులకు నిత్యపంట అయేలా చేశారు. వారి ఈకథనూ, వారిఅమానుష శౌర్యపరాక్రమ స్ఫూర్తులనూ, భక్తిభావముతోవినినవారు కూడా వీరావేశమెత్తి ఎదిరినీతమ్మూ గుత్తెరుగక పొడుచుకొనడం జరిగిందట ! ప్రశస్తమైన ఈ వీరకథను సంగ్రహముగా తెలుసుకొందాము.

పల్నాటి వీర చరిత్రాన్ని పల్నాటి వీర భారతం అనికూడా జనులు పేర్కొంటారు. భారతంలోలాగే ఇందులోకూడా అన్నదమ్ములు రాజ్య విభాగం కోసం చేసిన యుద్ధమే కథావిషయం. ఈ యుద్ధంలో రెండువైపులవారూ కక్షతో శాయశక్తు లన్నింటినీ సమీకరించి పోట్లాడారు. వీర శైవానికీ, అప్పుడే పల్నాటిలో కాలూనికొని ప్రబలమవుతున్న వైష్ణవానికీ, కలిగిన సంఘర్షణకూడా ఈ వీరభారతంలో ద్యోతకమవుతోంది. ఈ శైవ వైష్ణవ మత సంఘర్షణే వీర చరిత్రానికి మత ప్రాముఖ్యం కలిగేటందుకు కొంత కారణమేమోనని నా అభిప్రాయం.

కార్తవీర్యార్జునుని వంశంలోనివాడైన అనుగురాజు సైన్యంతోకూడా తన రాజధానియైన పాలమాచాపురిని (దానికే జంఘనాపురి అనేది నామాంతరము) వదలి దక్షిణాపథానికి వచ్చాడట! అతని యాత్రికి కారణం అతని పూర్వీకుడైన కార్తవీర్యార్జునుడు చేసిన బ్రహ్మహత్యా (జమదగ్ని ఋషిని) పాతకము వెంటాడుచుండుటయే. ఆ పాతక విముక్తికోసం నల్లజీడిమానె గుడ్డలకట్టి పుణ్య తీర్థాలలో మునిగేటందుకు అనుగురాజు దక్షిణాదికి వచ్చాడు. హైహయరాజుల రాజకీయ ప్రాబల్యం ఉత్తరాపథంలో సన్నగిల్లడమువల్ల, నూత్నరాజ్య స్థాపన కోసం ఆ వంశపువాడైన అనుగురాజు దక్షిణాపథానికి వచ్చాడనీ, యాత్ర అన్నది మిషఅనీ, చరిత్రకారులంటారు. అతని రాకడకి కారణం ఏదయినా జీడిమానె గుడ్డలధరించి పుణ్యనదుల్లో ,మునిగి, మునిగి వచ్చిన అనుగురాజు బట్టలు కృష్ణా నదిలో స్నానం చేయగానే తెల్లని వయాయి. వెంటనే బ్రహ్మహత్యా పాతక విముక్తి యైనట్లాతనికి అనిపించింది. దీనికిసాయం చందవోలులో రాజ్యమేలు తూన్న రాజు ఇతనిని గౌరవించి, కూతునిచ్చి వివాహంచేసి, పల్నాడు అరణంగా ఇచ్చి, పాలించుకొమ్మని కోరాడు. ఆరాజు కులోత్తుంగ చోడగొంకరాజు అయి వుండవచ్చునని ఊహించేటందుకు చరిత్రవల్ల వీలవుతోంది. అనుగురాజుకి వీర కామేంద్రుడనే పేరుగల నలగామరాజు, నరసింగరాజు, ఝట్టిరాజు, పెరుమాళ్ళు రాజు, అనేవారూ పెదమల్ల, పినమల్ల, బాలమల్లి దేవాదులూ వేర్వేరు భార్యలవల్ల జన్మించారు. ఈ సవితి అన్నదమ్ముల విరుద్ధలకూ, జరిగిన యుద్ధమే ప్రఖ్యాత ఇతివృత్తము.

అనుగురాజుకి దొడ్డనాయుడు మంత్రి. దొడ్డనాయుడి పరోక్షంలో అతని కుమారుడు బ్రహ్మనాయుడు మంత్రి అయాడు. అతను పల్నాటి కృష్ణుడని ప్రఖ్యాతి గాంచాడు. అతి పరాక్రమశాలి. మలిదేవాదుల కేడుగడ వీరకామదేవేంద్రుడూ, దుర్యోధనసదృశుడూ అయిన నలగామరాజుకీ అతని మంత్రియైన నాగమకీ ప్రతిజోదు. బ్రహ్మనాయని సత్యవాక్ప్రీతి, ప్రజలమీద నాతనికున్న ఆధ్యాత్మిక ప్రభావమూ, వీరచరిత్రకి గౌరవం ఆపాదించాయి. మన కాలంలో గాంధీజీలాగ, ఆకాలంలో బ్రహ్మన్న సామాన్య జనుల్లోంచి వీరుల్ని సృష్టించి, తయారుచేసి లెక్కకుమించిన సైన్యాన్ని ఎదిరించే సాహసం చేకూర్చాడు.

అనుగురాజు తర్వాత నలగామరాజు రాజ్యానికి వచ్చాడు. అతను సూటి యైనవాడుకాక నాగమ్మఅనే ఆమెకు వశుడై ఆమె చేతిలోని కీలుబొమ్మ అయాడు.

ఆమెకూడా బాలమలిదేవాదుల నెట్లయినా వంచించి పల్నాడంతటికీ నలగాముడే ఏకచ్ఛత్రాధిపతి కావాలని కోరింది. ఆమె జిట్టగామాలపాడులోని రామిరెడ్డికూతురు. ఫరాసుదేశంలోని జోన్ ఆఫ్ ఆర్క్ కన్యలా మాతృదేశ సేవాకంకణం ధరించింది. అన్నదమ్ముల పాలిపంపకాలవల్ల పల్నాడు చీలికలైపోకూడదనీ, ఆనాటి శైవమతంతప్ప మరొక మతానికి తావుండరాదనీ, కలలుకన్నది. అందుచేతనే మృగయా విహారంకోసంవచ్చి అలిసిపోయిన నలగామున్నీ, పరివారాన్నీ, ఆతిథ్య మర్యాదలచే రంజింపజేసి, ఏడుగడియల పరిపాలనాధికారాన్ని వరంగాపొందింది. ఆ వరాన్ని వినియోగించుకొన్నప్పుడు ఆ ఏడుగడియలలోనే బొక్కసానికి అధిక ధనం చేర్చింది. దాంతో నలగామరాజు ఆమెను మెచ్చి మంత్రిగా గైకొన్నాడు. ఆమెకూడా కాసెకట్టి బ్రహ్మనాయనికి ప్రతిజోడై బోడీషియా, జోన్‌కన్యలవలె నిలిచింది. ఈమెవీరగుణస్వరూపంలో రుద్రమనీ, మల్లమనీగన్న తెలుగుతల్లికన్న తొలి వీర ప్రసూనము. ఈమె దీక్ష నాగుబాము పగవంటిదని చింతపల్లిరెడ్డి నలగాముడి సభలో ప్రశంసించాడు. కార్య సాఫల్యంకోసం, ఎలాంటి పనికోసమైనా వెనుతీయనిదనే అనాలి. అందుచేతనే బాలమలిదేవాదుల తరఫున రాయబారానికి వచ్చిన అలరాజుకి, నలగాముని అల్లుడనయినా వెనుదీయక, విషప్రయోగం చేసేటందుకు జంకలేదు. నాగమ మంత్రిత్వం వహించగానే బ్రహ్మనాయుడు మలిదేవాదుల సంరక్షణభారం వహించి, మాచెర్లను రాజధానిగా నిర్ణయించి, వారి పాలిరాజ్యంతో వెళ్ళిపోయాడు. పెద్దమలిదేవుడు రాజుగా, బ్రహ్మన్న మంత్రిగా ఈ కొత్త రాజ్యం దినదినాభివృద్ధి నందసాగింది. పక్కలోని బల్లెమువలెనున్న వారిరాజ్యాన్ని దోచుకొనిరండని నాగమ్మ దొంగల్ని పురిగొల్పింది. బ్రహ్మనాయుడు పుత్రప్రేమతో లాలించే మాల కన్నమదాసు మాచెర్ల నగర సంరక్షకుడు. అతని కనుమొరగుట ఎవరికీ సాధ్యంకాదు. కన్నమదాసు దొంగలను అరికట్టి, వారి వీపుల మీద ఇసుకబస్తాలుకట్టి, గురజాల సరిహద్దులదాకా తరిమికొట్టాడు.

నాగమ మరోఎత్తు ఎత్తింది. బ్రహ్మనాయుడునీ, మలిదేవాదుల్నీ, కోడిపందాలకి పిలిపించింది. బ్రహ్మనాయుడుకి విషం పెట్టించింది, కాని, నిష్ఫలమయింది. కోడిపందాల్లో ఓడినవారు రాజ్యంవదలి పన్నెండేళ్ళు వలసలు పోవాలన్నషరతుతో పందాలాడారు. అందులోకూడా నాయకురాలు మోసంచేసి తమకోడిని నెగ్గింపించింది. మోసం జరిగిందని తెలిసికూడా రుజువు చెయ్యడానికి వీలుకానందున, మాట నిలుపుకోవాలనే పట్టుదలతో, మలిదేవాదులనుతీసుకొని బ్రహ్మన్న మందాడి అడవులకు వలస బయలుదేరుతాడు. అతనితోపాటు మాచెర్ల ప్రజలంతా ఊరు

పాడుపెట్టి అనుసరిస్తారు. అదే బ్రహ్మనాయుడికి జనసామాన్యంపైదగల ప్రతిభా వానికి తార్కాణం. అనుచరులతో కృష్ణదాటి మండాద కొనలకు వెళ్ళేటప్పుడు బ్రహ్మనాయుడు మొసలితో యుద్ధంచేసి, దాన్నిసరికి, కృష్ణానదిని నిష్కంటకం చేశాడు. మండాది కొనలో వీరమేడపిలనే పట్నం లేచింది. బాలమలిదేవాదుల గోధనం లంకన్న పోషణలో వృద్ధిఅయింది. ఇవన్నీ వినగానే నాయకురాలికి అసహనం హెచ్చింది. మలిదేవాదుల గోధనం అపహరించవలసిందని ఎరుకల వారిని పురిగొల్పింది. వారు హఠాత్తుగా బ్రహ్మన్న, మలిదేవాదులు మంద దాపున లేనిసమయం కనిపెట్టి, దొంగపోటుగావచ్చి గోపుల్ని పొడిచి లంకన్నని చంపి మందని తోలుకుపోతారు. లంకన్న చనిపోగానే గోపులు విజృంభించి కొందరి శత్రువుల్ని చంపాయి. మాల కన్నమదాసుకి మందపోటు సమాచారం తెలియగానే, వారిని వెంటాడి, చెల్లాచెదరుచేసి గోధనాన్ని మరలించాడు.

కోడిపందెపు నియమాల్ని పాటించి, వలసలు పూర్తిచేసుకొని, తమ రాజ్యం తమకిమ్మని మలిదేవాదులు నలగామరాజు దగ్గరికి అలరాజుని రాయబారిగా పంపారు. అలరాజు నలగామరాజు అల్లుడు. రత్నాల పేరిదేవి భర్త. తండ్రిని బట్టి మలిదేవాదులకు శుభాకాంక్షి. అందుచే ఉభయుల మేలుకోరి రాయబారం వెళ్ళాడు. నరసింగరాజుతో ఆలోచించి, నాగమ్మ అలరాజు రాయబారాన్ని విఫలం చేసింది. అలరాజు తిరిగిపోతున్నపుడు నేర్పుగా, దారిలో పూలతో విషప్రయోగం చేస్తుంది రత్నాల పేరిదేవి ఈ దుష్కార్యానికి కోపమూర్తితురాలైంది. తండ్రినీ, నాయకురాల్నీ శపించి అలరాజుతో అగ్నిప్రవేశం చేసింది.

రాయబారం విఫలంకాగానే అలరాజు పగ తీర్చుకొనేటందుకు మలిదేవాదుల పక్షం వహించిన వీరులంతా వీరకంకణం ధరించి యుద్ధానికి తయారయారు. అలరాజు తండ్రి కొమ్మరాజు మలిదేవాదుల పక్షాన నిలిచాడు. కొమ్మరాజు నలగామరాజు దగ్గరికి అలరాజుని రాయబారిగా పంపేటందుకు అంగీకరించలేదు. ఆయన బ్రహ్మనాయుని ఉద్దేశ్యాన్ని శంకించాడు. అలరాజుపై బ్రహ్మనాయనికి పగ ఉండేటందుకు అవకాశం కలదని అతనికి తెలుసు. ఒకేపక్షాన ఉన్నప్పటికీ, కొమ్మరాజు అలరాజాదులకూ, బ్రహ్మనాయనికీ అంతశ్శతాలున్నాయి. ఐనా, బ్రహ్మనాయుడివేమీ మనసులో లేవనియూ, అలరాజుని రాయబారిగా పంపడంలో తనకేమీ దురుద్దేశం లేదనీ, నచ్చచెప్పి తనకుమారుడైన బాలచంద్రుణ్ణి ఇల్లడగా ఇచ్చాడు. ఆబాలచంద్రుడే పల్నాటి యుద్ధంలో వీరాగ్రేసరుడు, అభిమన్యు సమానుడు.

బాలచంద్రుణ్ణి బ్రహ్మనాయని భార్య ఐతమ్మ ఎన్నో నోములు నోచి కన్నది. అతనితోపాటు బ్రాహ్మణ కుమారుడైన అనపోతునీ, కుమ్మరి చందునీ, కంసాలి మల్లునీ, ఇత్యాదిగా అన్నికులాలకూ చెందిన పన్నెండుగురు కుమార వీరుల్ని పుత్ర నిర్విశేషంగా పెంచింది. యోధులంతా ఈ బాలవీరుల్ని, వీర మేడపి రక్షణకు వదలి రణరంగానికి కదలిపోయారు. ఆటల సరదాలో మునిగి వీరందరూ బొంగరాలాట ఆడసాగారు. బొంగరం ఎగిరి కోమటి అన్నమ్మ కాలికి తగిలి గాయంచేసింది. వెంటనే అన్నమ్మ బాలుణ్ని ఫెళ్ళుఫెళ్ళునతిట్టి "పొగ రెక్కిఉన్నావు. తండ్రులతో కార్యంపూడి రణరంగానికి పోరాదా ?" అని అదలించింది. బాలుడికి వెంటనే కనువిప్పైంది. తమ్ములతో రణరంగానికి పోయేటందుకు సెలవిమ్మని తల్లినికోరాడు. వెంటనే ఐతమ్మ దుఃఖపరవశ అయింది. బాలునికి గండమున్నదని ఆమెకు తెలుసు. యుద్ధానికి పోకుండా బాలుణ్ని తాను ఆపలేనని గ్రహించి "నీభార్యదగ్గిర సెలవు తీసుకొనిపో" అంటుంది. భార్య సౌందర్య మోహితుడై ఆగుతాడేమోనని ఆశపడింది. భార్యా దీవనపొంది యుద్ధానికి పోవటం కర్తవ్యమని బాలుడికి బోధించి. తన ఉద్దేశాన్ని బాలచంద్రుని భార్య మాంచాలతో చెప్పేటందుకు ఆమె అంతఃపురానికి తొలిసారిగా పయనమైంది.

బాలచంద్రునిభార్య మాంచాల. వివాహమైనతర్వాత ఆమెను బాలచంద్రుడు చూడనేలేదు. దుర్భోధలకులోనై సానిసబ్బాయి (శ్యామాంగి) తోడిదే లోకముగా వీర సోదరులతోడి ఆటపాటలే కాలక్షేపముగ, గడివాడు, అందుచేత భార్యసెలవు కోసం వస్తున్నానని తల్లినే ముందు పంపాడు. మాంచాల వీరవనిత, తెలుగు కోడలు, తన్ను చేరవచ్చిన అత్తను అల్లంతనచూసి, ఆమెరాకకుగల కారణాన్ని గ్రహించింది. వెంటనే-

మాఅత్త తనకొడుకు మగటిమిచెలగ
ఆజిరంగంబున కరిగెదనన్న,
ఆలు దీవనగొని అరుగుమా అనెను
మొగము చెల్లమిరాక మొగిదలవంచె
పిలువింపుమనివచ్చె వేగ నాకడకు
బ్రహ్మగూర్చెను మమ్ము బాల్యంబునందు
సమదాస ఆతడు సమసినవెనుక

వెంట నేగెద అత్త విడుపుమీమాట
పంపుము పుత్రుని బవరంబుసేయ.

అని వెటకారమూ, రోషమూ స్ఫురించేలా ముందుగానే సమాధానం ఇస్తుంది. ఐతాంబ కార్యవాది. అందుచేత కోపం పెంపుకొని కోడలితో-

పరమ పాతివ్రత్య పావనమూర్తి.
పతిభక్తి గలిగిన పద్మాయతాక్షి.
నేనువచ్చిన కార్యమెరింగియును,
ఇబ్భంగి బలుకుట యేటిక్రమంబు ?

అని బుజ్జగింప చూసింది. మాంచాలకి కోపం అసలు ఐతాంబమీదనే. కొడుకును మందలించి, సన్మార్గానికి త్రిప్పని దోషం ఆ తల్లిలోఉంది. అదే మాంచాల-

ఇసుమంత నా సౌఖ్యమెఱుగడు: నీదు
తనయుడో అత్తరో! దైవంబు కెఱుక
పాపపుమాటలు పలుకంగ వలదు;
వెలయ భుజించుట వేశ్య గేహమున;
విడియంబుచేయుట, వెలయాలియింట;
సౌఖ్యంబులొందుట సానిధామమున
నానోము ఫలమేమొ ? సరిసజునియతి
చేసినన్ విడిపింప జేసెనాసాతి;
భోగంబు నొందెడు పొలతులువారు
చావ నోచినయట్టి సకియనునేను
సరిజేసి యీమాట సభనెన్నరాదు
నీపుత్రు నడవడి నీచిత్తమెరుగు;
నీవు కర్త్రివి మాకు నేమి వాక్రుత్తు ?
ఆడపలయు మాట లాడితిగాక,

అని మర్మమెత్తి పొడిచే మాటలతో నిరూపించి, ఐతాంబను నిరుత్తరను చేసి, మీ బాలుణ్ని పంపించమంటుంది.

ఘూంచాల బాలచంద్రుణ్ణి ఆపలేననీ, కాదలచినది కాకమానదనీ అనుకొన్నది. కర్తవ్యపాలనానికి పూనుకోవలెననీ, మానవ ప్రియత్న లోపం చేయకూడదనీ అనుకుంది. ఏది కర్తవ్యమో తెలియక, తొలిసారి ధర్మదర్శనలాలసతో ఊగులాడింది. అప్పుడామెతల్లి రేఖాంబ మాంచాల హితంకోరి పుత్రికా ప్రేమవశురాలుకాకుండా కర్తవ్యాన్ని ఉపదేశిస్తుంది. ఆ ఉపదేశంలో జీవిత పరమావధిని గురించి తెలుగు స్త్రీలల్లో వ్యాపించిన అభిప్రాయాలు ఇమిడి ఉన్నాయి.

జన్మ వృక్షమునకు చవిగలయట్టి
పటుతర కమనీయ ఫలములు రెండు;
కెరలు భోగములొండు, కీర్తి రెండవది
తొలుపండు చవిచూచి తొలగు నొక్కండు
మలుపండు చవిచూచి మలగు నొక్కండు.
వీర లిద్దరికిని భేదంబుహెచ్చు
మొదటి ఫలంబున మొనసెడు రసము
క్షణభంగురంబయి సమసిపోగలదు.
రెండవ ఫలమున రెక్కొనురసము
శాశ్వతంబౌచు దిశల్ గలదాక
సవితృడు గలదాక శశిగలదాక
తారలు గలదాక ధర గలదాక
వారిధిగలదాక పరలుచునుండు
ప్రకట ఫలద్వయ రసమునుగోరి
అనుభవించెడివార లరుదు భూస్థలిని
ప్రాకృత జనములు ప్రశమ ఫలంబు
ప్రాప్తించి సంతృప్తి వడయంగగలరు
వీరాంశమునబుట్టి వెలయువారలకు
మొదటి ఫలంబిది ముఖ్యంబుగాదు
మహిమాస్పదంబయి మనసుజ్వలింప
పరుగెత్తుదురు రెండవ ఫలంబుకొరకు.
వెలదిరో నీభర్త వీరశేఖరుడు
కీర్తి కాముకుడయి కేరుచున్నాడు
నీవు భోగములపై నిరతి త్యజించి

బాలచంద్రుని భద్ర భావంబెరింగి
భావి మానవుల హృద్భవనంబులందు
తావకీన యశో లతా వివర్ధనము
సేయంగ గోరుము చెలువరో యిపుడు.

అని సలహా ఇస్తుంది. రేఖాంబకి తగినకూతురు మాంచాల, మాంచాలకి తగినతల్లి రేఖాంబ. తెలుగు స్త్రీలకీ తల్లి, కూతుళ్ళిద్దరూ ధ్రువతారలవంటివారు. వీరమాతలు, వీరపత్నులు. ఐతాంబలోని వీరగుణం, మాతృత్వం చాటునమణిగి పోయింది. అందుచేతనే ఆమె బాలచంద్రుడిని యుద్ధానికి పోకుండా ఆపాలనే వేలఅయింది. రేఖాంబ మాంచాలకి చేసిన కర్తవ్యతా ప్రబోధ వాక్యాలకి గుడికి బారెడుమారంలో, కుంతీదేవి ప్రబోధ వాక్యాలు భారతంలో మనకి కన్పిస్తాయి. ఐతే, అవి స్వలాభ, అవమాన రోష కషాయిత స్వాంతప్రేరితములు. రేఖాంబ వచనాల్లో వాటి వాసనేలేదు. శ్రీనాథుడుకూడా ఇది గుర్తించే భావి మానవుల హృద్భ వనంబులందు రేఖాంబా మాంచాలల యశో లతాభి వర్ధనమయేలా ఈ ఘట్టాన్ని వర్ణించాడనిపిస్తోంది. తన్ను కదియవచ్చి మోహితుడై, తన పూర్వ ప్రవర్తనకు లజ్జితుడై, పశ్చాత్తాప తప్తహృదయుడైన, బాలచంద్రునికి కర్తవ్య ముపదేశిస్తూ మాంచాల చెప్పిన వాక్యాలు ఈ ఘట్టంలో మణి కిరీటంలాంటివి. తెలుగు ఐతిహాసిక రచనల్లో సాటిలేనివి.

రతిరాజ సౌందర్య రణరంగధీర !
కమల బాంధవతేజ కరుణాలవాల !
వినతాత్మజునిలావు వెస నీకుగలుగు;
సామీరి సమమైన సాహసంబబ్బు;
కృష్ణునికెనయైన కీర్తి ఘటిల్లు;
రవికాంతియుతుడవై రంజిల్లుచుండి.
అలరాజు పగదీర్పు మనుజులతోడ;
నాతో బెనంగిన నయమేమిలేదు;
కడువడి కలనికి కదలుడుమీరు;
కుల గౌరవమునిల్పు గురుసాహసుండు;

పరికించిచూడ నెవ్వరు మీరుదక్క ?
పటుతర విక్రమ ప్రౌఢిమ మెరయ,
శ్రీగిరి లింగంబు, చెన్న కేశవుడు,
వరదము లొసంగగ వర్ధిల్లగలరు;
శాత్రవ విజయంబు సమకూరు మీకు;
ఈ యాయుధము వడినిచ్చును జయము;
కలియుగంబున మీకు ఘనపూజలమరు,

అని మాంచాల దీవించి కత్తి అందించింది. ఈ దీవనా బలమే బాలచంద్రుణ్ణి నిశ్చింతగా రణరంగంలోకి దూకించి, వీరవిహారం చేసేటందుకుతోడైంది. బ్రాహ్మణుడైన అనపోతుని రణరంగానికి తోడ్కొనిపోవద్దనీ, బ్రహ్మహత్యకు కారకుడవు కావద్దనికూడా, మాంచాల బాలచంద్రుడుకి సలహా ఇచ్చింది. ఆ సలహాను మన్నించి బాలచంద్రుడు మిషపెట్టి, అనపోతును వెనుకకుపంపి, వీర మేడపి రక్షణభారాన్ని అతనిమీద వేశాడు.

అనపోతు జన్మచే బ్రాహ్మణుడైనా పరశురామ, కృప, ద్రోణుల్నీ, అశ్వత్థామనీ, ఆదర్శంగా గ్రహించినవాడు. యుద్ధరంగంలోనికురికి, ఎప్పుడు వీరవిహారంచేద్దామాఅని ఊటలూరుతూన్నవాడు. ఎదురుచూడని మర్మఘాతం తగిలేసరికి అవమానంతో, నిరాశతో, కింకర్తవ్యతా విమూఢచేతస్కుడై బాలచంద్రుని కలుసుకోవాలని హుటాహుటీగా పయనమయాడు. దారిలో బాలచంద్రుడు దాటిరావద్దని పెట్టిన ఆనలనుచూసి, కత్తిఓదికొరిగి, ఆత్మహత్య చేసుకొని, తన బిరుదు నిశానీల్నీ, రక్తంతో జీరాడే పేగుల్నీ, బాలచంద్రునికి కానుకగా పంపించాడు.

రాయబారాలు జరుగుచున్న సమయంలో బాలచంద్రుడికి అనపోతు పంపిన కానుకలందాయి. యుద్ధం జరిగితీరవలసిందే. అలరాజు మొదలైన వీరులపగలు తీర్చవలసిందేనని బాలుడు సింహకిశోరంలా గర్జించాడు. ఇతని విజృంభణచూసి, ఇరువాగులవారూ సంధివిషయం నిరాశ చేసుకొన్నారు. బాలచంద్రుడు అభిమన్యుడులా వీరవిహారం చేశాడు, నరసింగుని నరికాడు. శత్రుసైన్యం తల్లడిల్లింది, జీరాడే ప్రేగుల్ని ధట్టీలోబంధించి అలుగులమీదకి ఒరిగాడు ఇతని తర్వాత

కొమ్మరాజూ, మరిదేనాయులూ యుద్ధానికి నాయకత్వం వహించి, శత్రువులను చేతి కొద్దీ చంపి ఒరిగారు.

తపరాజు యుద్ధంలో మరణించినా, బ్రహ్మనాయడు పగకోసం యుద్ధం సాగించాడు. ఇది మనదేశ చరిత్రలో అపూర్వం. ఇరుపైపులా పేరుగలవారంతా పోగా బ్రహ్మనాయుడూ, నాయకురాలూ, ముఖాముఖీ అయారు. స్త్రీతో పోరాడటం ఉచితం కాదని బ్రహ్మన్న వెనుకాడగా, నాయకురాలే కత్తిదూసి బ్రహ్మన్నమీదికి దూకింది. నాయడు స్త్రీ హత్యాపాతకానికి ఇష్టపడక నాయకురాలెక్కిన గుర్రాన్ని చంపేస్తాడు. ఆమె భయభ్రాంతురాలై యుద్ధరంగాన్ని వదలి పారిపోయింది. నలగామరాజుకూడా బ్రహ్మన్న దాడికోర్వలేక పారిపోయి, బ్రాహ్మణులను శరణు జొచ్చాడు. పల్నాటి వీరులపగ తీరింది. విప్రప్రార్థనవల్ల మనసుకరిగి నలగామ రాజుకీ హతశేషులకూ, బ్రహ్మనాయడు అభయమిచ్చి, నలగామరాజును గురిజాల సింహాసనమెక్కించి, గుత్తికొండ బిలంలో ప్రవేశించి సిద్ధిపొందాడట !

రసవంతమైన ఈ గాథని వివిధార్థ ప్రతిపాదకంగా శ్రీనాథుడు రచించాడు. ఇతరభాషా గ్రంథములతో ముడిపడని తెలుగు స్వతంత్ర గ్రంథరచనల్లో ఇదే మొదటిది. "ముదివిటులు, విధవలంజలు, పదకవితలు," లోకతరహాపని భావించిన కాలము నాటిదవడముచేత ఇది మాలదాసరుల చేతులందుండిపోయి, నోటిపాటగా పూర్తిగా నశించక నిలిచింది.

వీరగుణోపేతమైన ఈ కావ్యంలోనుంచి, వీర గుణ ప్రతిపాదకమైన కొన్ని ఉదాహరణలనుమాత్రంఇచ్చి, పూర్తిగా రసాస్వాదనకోసం ఓమారాంత విద్యాశేఖరులు సేకరించి ప్రకటించిన గ్రంథాన్ని చదువవలసిందేనని మనవి చేస్తున్నాను.

మాతృప్రేమచే సంచలించిన ఐతాంబకి, బాలచంద్రుడు వీర ధర్మ ప్రభావాన్ని, వేదాంతంతో మేళవించి చక్కగాయెలా వివరించాడో చూడండి-

వీవెరుంగని ధర్మమేనెరుంగుదునె?
ప్రాకృత భామలపగిది బల్కెదవు;
వెర్రితనంబేల వీరమానినికి
కాయమ నిత్యంబు; కలిమిహారికక్కి;

జలబుద్బుదవిధంబు క్షణభంగురములు;
షట్చక్రవర్తులు, సకల భూపతులు,
చనిరి బ్రహ్మేంద్రాది సర్వ దేవతలు,
భూతంబులై దును పొలియుచునుండు;
శౌర్య సత్కీర్తులు సమయ వెన్నటికి;
సకల పురాణముల్, సద్ధర్మ కథలు,
నీతి శాస్త్రంబులు, నీ వెరుంగుదువు,
పౌరుషాధికతచే బ్రతుకుటలెస్స;
జనన మరణములు, జనులకునిక్క—
మాలయంబుననున్న, అడవిలోనున్న,
తప్పక తార్కొను తథ్యంబుగాను,
పుణ్యలోకంబును బొందుమార్గముల,
వినిపింతునేతల్లి విశదంబుగాను,
సజ్జనసంగతి సంసారమెడల,
గురువు బోధించిన గురిమీద మనసు
నిలిపి మరణమొందు నిశ్చలుండొకడు;
ప్రాజ్య సామ్రాజ్య సంరక్షణమందు,
ఘనరణమ్మున రొమ్ము గాయాలనొంద
మనసు చలింపక మరణమ్మునొందు
శౌర్య పరాక్రమ సంపన్నుడొకడు;
వీరలిద్దరులెస్స వినువీధికేగి,
ఆదిత్యమండలం బరుదారజించి,
పోయి పుణ్యంబులభూమి జెందుదురు.
మొదటి కార్యముబూను ముఖ్యతలేదు
శౌర్యంబుచే మాకు సంపాద్యమగును

* * * *

వెలమలమైతిమి వీరజీవనత
విక్రమక్రమరూఢి వెలయుటజేసి
శస్త్రధారులకెల్ల సమరంబుకూడు

శౌర్యంబుచాలించి సకల ధర్మములు
చేసిన సత్కీర్తి చెందదుమాకు.
మనువు బోధించిన మార్గమేయిదియు.

*   *   *   *
*   *   *

జనులకు కష్టంబు సమకూరునపుడు
శ్రీవీర వీర్యంబు చెదరంగజేయు
దేశంబు పర నృపాధీనమౌనపుడు,
శ్రీవీరసత్వంబు చిక్కంగబట్టు
సామ్రాజ్య తరువెండి చచ్చెడునపుడు
శ్రీవీరరక్తంబు చిగిరింపజేయు
రాజసేవకులకు రణమే సుఖంబు.

పగరాజుల బొజుంగై, అష్టదిక్కుల రాజులనూ ఆ రణగండ్ల యుద్ధంలో ఓడించి, బలువైనకుంతాన్ని విజయ చిహ్నంగా గ్రహించిన. అసహాయశూరుడు బ్రహ్మన్న యుద్ధరంగ తత్వాన్ని, బాలచంద్రుడికెలా వర్ణించి చెప్పాడోచూడండి-

శౌర్యంబునకుబాదు, స్వర్గంపుత్రోవ,
ఎల్ల సుఖంబులకిది పట్టుకొమ్మ,
ఇది ముక్తిసోపాన మిది మూలధనము,
ఆగర్భశూరుల కాట ప్రదేశ
మిది దేవవితతుల సెన్ననోమేలు,
హెచ్చైన వీరులకిది పుట్టినిల్లు,
ధర్మ సంరక్షణార్థంబయి బుధులు
కదలక రక్తంబు కార్చెడుచోటు,
పటుకీర్తి నొందించు బ్రహ్మాండమందు
ఇది సమరావని; ఇది పుణ్యభూమి.

వీరచరిత్ర సాహిత్య రస పిపాసువుల దృష్టిలోనేకాకుండా, చారిత్రకుల దృష్టిలోకూడా ముఖ్యమైందే. అలరాజు తాత, శివలింగురాజుమీదికి యుద్ధానికి పోతూఉంటే—

వారితోడనె కూడివడియె జంగాలు
నల్లబొంతలవారు నాలుగువేలు,
ఎర్రబొంతలవారు ఎనుబదివేలు,

* * * * * * *

వారి పేరులు కొన్ని వయస చెప్పెదను
మేడయ్య, పడమటి మేటి బస్వయ్య,
బోడ శివయ్య, బొబ్బేడి బుగ్గయ్య,
కలుకంఠ లింగయ్య, కల్యాణ బసువ,
అక్కయ్య, కుక్కయ్య, ఆదిమల్లయ్య
నిజలింగ చిక్కయ్య, నీలకంఠయ్య,
ఉరమున లింగాలు మెఱసెడివారు,
గళమున రుద్రాక్ష గలిగినవారు,

బైలుదేరారట. ఈ వర్ణననిబట్టి పల్నాటి యుద్ధంనాటికి తెలుగుదేశంలో వీరశైవమతం బాగా వ్యాపించిందని తోస్తుంది. ఆయా విషయాల్నిబట్టి పల్నాటి యుద్ధం క్రీ॥ శ॥ సుమారు 1182 ప్రాంతంలో జరిగిందని నిర్ధారణయ్యింది.

వీరచరిత్ర విద్వత్కవి రచన. అందుచేత ఇతర వీరకథలతో పోల్చిచూస్తే ఇందులో విద్వత్తు ఎక్కువగా కన్పిస్తుంది. ఐనా, ఇందులోని విషయమూ, రీతీ, జనరంజకమైనవపడంచేత, జంపె, త్రిపుట, రగడ, చంద్రిక మొదలైన దేశ్య గీతవైఖరులతో, అర్ధోక్తులతో, సముదాయ గాన విధానంతో, నృత్త ప్రాముఖ్యం కలిగి వినోదం కలిగించే యక్షగాన ప్రయోగాలను కొంతవరకు అనుకరిస్తూ, పిచ్చుకుంట్లుపాడే విక్రమోత్తేజ కరమైన వీరగీతంగా, నిలిచింది. అదీ, దాన్ని రచించిన శ్రీనాధుడూ, పరంపరాగతంగా నిలిపిన అజ్ఞాత కథకులూ, సేకరించి ప్రకటించిన ఉమాకాంత విద్యాశేఖరులూ, ఆంధ్రజాతికి వందనీయులు,

## (III) బొబ్బిలి కథ

బొబ్బిలి కథాసంగ్రహం తెలియనివారు తెలుగుదేశంలో ఉండరు. రంగారాయ చరిత్ర పాటరూపంలోనేకాకుండా, ప్రబంధరూపంలోకూడా తెలుగు వాఙ్మ

యంలో అభివర్ణింపబడింది, పాటరూపంలో ఉన్నదే మనకు ప్రస్తుతం పరిశీలనాంశము. విజయనగర రాజులకీ, బొబ్బిలి వెలమదొరలకీ వంశక్రమానుగతంగా పగలున్నాయి. అవి కోడిపోరుల్లోనూ, నీటి వసతులదగ్గిరా, రాజుతూ ఉండటం ఆచారమైంది. ఇద్దరూ ఆభిజాత్య గర్వంగలవారే. ఇద్దరూ నైజాము సామంతులే. ఫ్రెంచివారికి ఇనాముగా నైజాము ఉత్తర సర్కారులివ్వడమూ, అవి చూద్దామని వచ్చిన బుస్సీని లంచాలిచ్చి విజయరామ గజపతి వశంచేసుకొని, బొబ్బిలివారిమీదికి నడిపించి వారికోట కొట్టించడమూ, ఈ కధలోని ముఖ్యవిషయము. కోటలోఉన్న 250 మంది వీరులూ, 500 మంది స్త్రీ బాల వృద్ధులూ, శత్రువులకు లొంగిపోక, వీరోచిత మరణాల్ని పొందడము, వీర కరుణాత్మక గాథ. బొబ్బిలిని ముట్టడించిన బుస్సీసైన్యము 750 మంది సోల్జర్లు. వారిలో 250 మంది అశ్వికులు, వీరి సాధన సంపత్తి నాలుగు మందుగుండు పటాలాలు. విజయనగరపు సైన్యం 11 వేలు. వారూ వీరూకలసి బొబ్బిలిని 24 జనవరి 1757 నాటి ఉదయాన ముట్టడించారు. ఈఅసమాన యుద్ధంలో బొబ్బిలివారి సాహసాన్ని చూసి, పరాసునాయకుడు లాలీ విస్తుపోయాడు. రంగయదొరగారు బురుజుని సంరక్షిస్తూ తుపాకిదెబ్బ తగిలి వీరమరణం పొందాడు. అంతఃపుర స్త్రీలందరూ మాన సంరక్షణార్థం అంతకుముందే జోహారుచేశారు. హతశేషుల్లో బొబ్బిలివారి తరపున రంగారావుకొడుకు వెంకటాద్రియుడుమాత్రమే మిగిలాడు. విజయమందిన విజయరామరాజుని రంగారాయుని అనుచరులు చాటుపోటుగావచ్చి చంపారని చరిత్రకారులంటారు. అలాచేసింది తాండ్ర పాపారాయుడనే వీరుడని పదకర్త అంటాడు. పదకర్త వర్ణనలు ప్రతిపద వీరరసోత్కర్షములు. బొబ్బిలివారు మానధనులని, అడుగడుగునా నిరూపితమవుతుంది. యుద్ధంకాకుండా సంధిరాయబారానికి రంగారావుపక్షాన ధర్మారావు వచ్చాడు. అతనితో బుస్సీయొక్క దుబాసి లక్ష్మయ్య-

రాజుమాటలూ ఫ్రెంచిమాటలూ ఒకటై యున్నాది;
రాజుగారికీ బొబ్బిలికోటలు ఫర్మానిచ్చేను;
చెప్పితేను తప్పేదిలేదు ఫ్రెంచిదొరగారు;
సంధికి వచ్చీనందుకు యేమీ సారములేదయ్యా;
వచ్చినవారూ వచ్చినట్టుగ కోటకు పొమ్మండి;
రాజుగారికి పట్టంగట్టి ఫ్రెంచిపోతారు;
వెనుకవచ్చి చంపలగొట్టి కోటను తియ్యండి

అని లౌక్యం ఉపదేశించాడు. వెంటనే-

యెక్కడలేని కోపమువచ్చే ధర్మారాయుడుకీ;
పరాకుంచక వినుమునీవు దుబాసి లక్ష్మయ్యా;
ఒకరిపట్టము ఒకరికి కట్టను యెవ్వరి కొడుకయ్యా ?
రాజమహేంద్రము జిల్లాలోనే ఫాలించిదొరగారు,
రాజుగారికి బొబ్బిలికోటలు ఫర్మానిచ్చేదే ?
యేమిధైర్యము ? యెక్కడిధైర్యము ? ఫాలించివారికి
పుట్టినచోట చావడానికి బ్రహ్మావ్రాయలేదు;
బొబ్బిలిమీద చావడానికి బ్రిహ్మవ్రాశాడు.

అని బొబ్బరించాడు. రాయబారానికొచ్చిన వెలమదొర ధర్మారావులోనూ, శూరులైన ఇతర వెలమదొరల్లోనేకాదు మనకు వీరత్వం కన్పించేది. పురుషులంతా వ్యాపారంకోసం పోవడంచేత పట్టు కోటలోఉన్న భేరి రామక్క సాటివారిని కూర్చుకొని బురుజుని సంరక్షించడానికి పూనుకొంది. వైశ్యస్త్రీలు యుద్ధంచేసి నట్లు వర్ణితమైనది ఈ ఒక్క వీరకావ్యంలోనే అనాలి.

రామరామా అనంతకాలము రాజ్యమేలుతామా ?
యుగము జగము ఉన్నంతవరకు ఉండగపోతామా

అని ఒకరినొకరు హెచ్చరించుకొంటూ-

తక్కెడుగుండులు, పలాలగుండులు, వీపునగట్టిరీ
అలంకారము లెక్కినారుగా భేరీ స్త్రీలంతా,
వడిసెళ్ళల్లో రాళ్ళుచెక్కిరి భేరీస్త్రీలంతా,
వడిగా అప్పుడు రువ్వినారుగా రాళ్ళుఅయితేను;
వడిసెలకింద మూడువేలు మరణం అయినారు
చావిడిబండలు దొర్లించారూ భేరీస్త్రీలంతా,
యెద్దులకప్పుడు కాగుచున్నవి అంబటిబానలు,
పల్పులువేసి పట్టినారూ అంబటిబానాలు,
బానఅంతయు దొర్లించారూ రాణువపైగాను
బానలకింద రెండువేలకు మరణము జెందిరిగా
సాగిలమాను తీసినారుగా భేరీస్త్రీలంతా;
గిరగిరమని త్రిప్పినారుగా సాగిలమానులను

సందుసందుకే సాగిలపడానూ రాయిగ నిలిచాము;
మానులక్రిందా మూడువేలా మరణము చెందిరిగా;
బురుజులక్రిందికి చేరనివ్వరు ఘోరీస్త్రీలంతా;
సింహాల్లాగు విశబడినారు ఘోరీస్త్రీలంతా;
చక్రములాగూ తిరిగినారుగా ఘోరీస్త్రీలంతా;
వేటునేటుకే నరికినారూ యేనుగులగుంపుల్ని
వీరి యుద్ధాన్ని చూసి హైదరుజంగోజి గడబిడలాడేడు
మూడునిమిషములలో దీసితినే ఆరణి. బళ్ళారి
యిట్టిజగడము నేనుయెక్కడ జూడేలేదయ్యా

అని బుస్సీ విస్తుపోయాడు. వల్లమందు (తుపాకిమందు) మాటొగ్గించి ఆ వీరనారుల్ని సమయించేటందుకు సెలవులు ఇచ్చాడు. బొబ్బిలి వీరులందరికీ ఇదే ఒరవడి అయింది. ప్రతివాడూ తనవారిని కూర్చుకొని, ఆ నిశ్చయంతోనే శత్రువుల్ని ఎదిరించి వీరస్వర్గం అందుకోవడమే. అందరినోటా ఒకటేమాట-

"రామరామా అనంతకాలము రాజ్యములేలామూ
యుగము జగము లున్నంతవరకూ ఉండగబోతామూ"

అనే. ఈపదమంతటా నిండిన వీరవినాదాల్లో కరుణాత్మకమైంది. విజయ రామరాజు దుశ్చింతని మళ్ళించేటందుకు మల్లమ్మదేవి చేసిన యత్నమూ, దాని వైఫల్యమూ, అది మల్లమాదేవి ఆంధ్రదేశ శ్రేయోకాంక్షని వెల్లడిచేస్తుంది. ఆమె రాచకీయాల నధిగమించిన లక్ష్యాన్ని-

"విజయనగరమూ, బొబ్బిలికోటా, కావడికుండాలు;
కావడికుండలు తప్పించొద్దు కన్నతండ్రినీవు"

అన్న మాటల్లో వెల్లడించింది. క్రిందైనా, మీదైనా ఈ దేశంలోనివారే పడాలిగాని పరాశ్రయం తగదని ఎంత మృదువుగా చెప్పింది! భ్రాతృప్రేమని కదిలించేలా-

నల్లగాజులు, నల్లపూసలు, నాకు నిల్పండి;
బొట్టుకాటుక, నిలుపుమయ్య ఓ విజయరామరాజ!

పసుపుకుంకుమ, నిలుపుమయ్యా ఓ విజయరామరాజ !
పూసపాటివా రిల్లేనాకూ పుట్టిల్లనుకొంటి,
దామర్లవారి సంస్థానమే మరనిపోయినాను.

అంటూ నమస్కార పురస్సరంగా ఆపేక్ష ఉట్టిపడేలా కబురంపింది. ఈ రాయబారానికి విజయరామరాజు ఎంత మోటుగా జవాబిచ్చాడో చూడండి-

ముండమోసితే, మూడుపల్లెలే యినాములిస్తాను
ముండకోకను, ముందేయేతు దేవిగారికైనా,
ముందుబాడు, ముందుఅన్నము, నీవేనన్నాడు.

ఈ తిరస్కారంవల్ల కలిగిన అవమానం, ద్రౌపది పరాభవానికి ఈడై, విజయరామరాజు రక్తంతో దాన్ని తుడిచివేయాలనే దీక్షని బొబ్బిలివారిలో కలిగించింది.

రసవంతమైన ఘట్టాల్ని ఎన్నింటినైనా ఈ పాటలోంచి ఉదహరించవచ్చు. కాని, గ్రంథ విస్తర భీతిచేత వాటిని ఆపవలసివస్తోంది; పదకర్త వాక్యాల్లో అత్యుక్తి ఎంతో కన్పిస్తోంది. అది పదాలలో కన్పించే సహజలక్షణం. చరిత్రకారులు విజయరామరాజు సైన్యం 11 వేలని అంటే పదకర్త లక్ష తొంభైనాలుగు వేలంటాడు. అలాగే బుస్సీ 750 సిపాయిల్ని, ఇరవైనాలుగువే లంటాడు. యుద్ధంజరిగింది. పొద్దున్నమొదలై సాయంత్రం పూర్తి అయింది. తర్వాత, ఆగాథ పరంపరగా వ్యాప్తమయింది. అంతేకాని, చరిత్రకారులు తు. చ. తప్పకుండా చెప్పేది లోకంలో వ్యాప్తమయేటందుకు అవకాశం లేకపోయింది. అందుచేత " ఇదుగో పులి అంటే అదిగో తోక " అన్నట్లుండే అత్యుక్తులు వ్యాపించాయి.

## (IV) అల్లూరి సీతారామరాజు కథ

ఇటీవల వీరకథా వాఙ్మయంలో శ్రీ సుంకర సత్యనారాయణ రచించిన అల్లూరి సీతారామరాజుకథ ముఖ్యమైంది అనాలి. ఆరచయితా, ఇతరులూ, రచించిన నెహ్రూకథా, మొల్లకథా, మొదలైనవి మరికొన్నికూడా ఉన్నాయి. కాని తెలుగు సాహసిక వీరునికథ అవడంచేతా, రసవంతమైన రచన కావడంచేతా, ఇది

బహుజనాదరణీయమైంది. అయితే ఇందులో వర్గద్వేషం పురిగొల్పే వాక్యాలున్నాయి. చారిత్రిక సాహిత్యంలో రాజకీయ అవసరాలను పురస్కరించుకొని చారిత్రిక పురుషులైనవారికి అసలు లేని ఉద్దేశాలను అంటగట్టడము, ఒక లోపమనే అనాలి. ఈ లోపాన్ని పరిహరిస్తే ఈ రచన మణిప్రాయమైంది. రచనావైదగ్ధ్యాన్ని వెల్లడించే ఘట్టాల్ని కొన్ని ఉదహరిస్తాను.

ఎత్తుగడలోనే

సంగర రంగ విహారా! ధీరా! శాత్రవసంహారా!
ధీరవిచారా! ఆంధ్రకుమారా! దీనజనోద్ధారా!
అందచందముల నందనవనము యాంధ్రదేశమోయి.
వినరా యాంధ్రుడ! మన్యసోదరుల విప్లవకథనేడు

అని ఆహ్వానించి-

శ్రీలలరారెడు తెనుగు దేశమున జీవనదులుగలవు;
మేలురకపు మైదానము లడవులు వేల గనులుగలవు;
మేదినిచరిత్ర ప్రసిద్ధికెక్కె మన గోదావరితల్లి,
గోదావరి తీరంబున అడవులు కొండలెన్నొగలవు;
భద్రాచలమా తీరప్రాంతమున భాసిల్లెడినగరు;
భద్రాచలకొండకు సమీపమున పాపికొండలందు,
రమణీయము లున్నతములు ప్రకృతి రమణికి సొగలివిర!
అమితోత్సాహంబున గోదావరి యాకొండలనడుమ
నురుసులుగ్రక్కుచు శరవేగంబున పరుగులెత్తుచుండు;
నిరుపమానమై యందచందముల నిలయంబుగనుండు;
ఘోరారణ్యము కప్పివేసెనా కొండలనన్నిటిని,
క్రూరమృగములా మహారణ్యమున కొరాడుచునుండు;

కథారంగస్థలాన్ని కళ్ళకుకట్టేలా వర్ణించాడు. తర్వాత, మన్నెపు అమాయకప్రజల్ని బాధిస్తున్న బాస్టియన్‌ని మందలించేటందుకు దూరుడుగా వచ్చిన కథానాయకుడు సీతారామరాజుని ప్రవేశపెట్టాడు. మన్నెపు రాజకీయాల్లో ఆయన ప్రవేశంతో మన్యంవారికి క్రొత్త ఆశలు కలిగాయి. ఆయనను చూడగానే వారాయ

నకు వశులయ్యారు. అందుకు కారణమైన సీతారామరాజు అలౌకిక సౌందర్యాన్ని కవి ఎలా వర్ణించాడో చూడండి-

బాలసూర్య తేజస్సంపన్ను డపార బుద్ధిబలుడు,
బాలయోగి, ధవళాంబుజ నేత్రుడు, బాహుబలుడు, త్యాగి,
నిరుపమాన గుణ రూప విలసితుండరిజన భీకరుడు,
కరుణాసర భరభరితస్వాంతుడు, కాషాయాంబరుడు,
కొండకోనలంగొంటిగ తిరుగుచు కోదండముబూని
చెండాడుచు మారీచుల నీచుల క్షేమంకరుడైన
సీతారాముండేమోనన మన సీతరామరాజు
ఆతరుణంబున గోదావరి నదికరుగుచు యిగిచూచి
శరవేగంబునవచ్చి బాస్టియను నరహంతకుతోడ
నరుపేదల హింసించుచుంటివా ? నీచాత్మా తగును ?
ఏ దీనుల రక్షింపకై క్రీస్తు తానెక్కినాడో శిలువ,
ఆ దీనుల హింసింప క్షమించునె అతడునిన్ను తులువ,
అను కాషాయాంబర ధారినిగని అధముడు బాస్టియను
చనెను సిగ్గుబడి మెలమెల్లన నాస్థలమువిడిచి....

వెంటనే గంటందొర-

మా పరిసర ప్రాంతంబుల దిరిగెడి మహనీయుడనిన్ను
పాపికొండపై జపము చేసికొను తాపసిగానెంచి,
దూరదూరమున నుంటిమి దగ్గరచేరక బాబయ్యా !
దారిజూపి మమ్ముద్ధరించగల దైవమావయ్యా !

అని తమరు నాయకత్వాన్ని వహించి స్వాతంత్ర్య పోరాటం నడిపించ మన్నాడు. అత్యాచారాలు మితిమీరడంచేత, చివరకు మన్నెపుప్రజలు బ్రిటిషు ప్రభుత్వంమీద సాయుధవిప్లవం సాగించారు. చూడండి కవి ఎంత చకచకా వారి విప్లవ శరంజాము వర్ణించాడో-

నెత్తురుడికి అవమాన పీడనోన్మత్తులైరి ప్రజలు
కత్తులు, కటార్లు, బల్లెము, లీటెలు, గరగర నూరారు.

అగ్నిపర్వతము పగిలె గుభిల్లున అమన్యములోన
అగ్నిజ్వాలవలె, విప్లవధ్వజ మది ఆకసమునకెగిరె
ధణధణ మ్రోగిందండీ రణభేరీ యపుడు:
ఘనుడా సీతారామరాజు తన ఖడ్గంబునుదూసె:
దీక్షగ రాజున కిరుపార్శ్వంబుల దిగ్దంతులరీతి
రక్షకభటులై గామునోదరులు రయమున నిల్చారు:
సాయుధులై స్త్రీ పురుష సమూహము సాగెనువెన్వెంట.

తర్వాత రాజుసైన్యానికీ, క్రమంగా మన్యంలో సమీకరణమైన బ్రిటిషు సైన్యానికీ, గొరిల్లాయుద్ధం జరుగుతుంది. విప్లవనాయకుడు తమవారినందరినీ-

అన్నలార ! వినుడో గెరిల్ల వీరాధిమన్యులార :
యెన్ని దినంబులు బ్రతికిన చావనిదెవ్వ రనఘులార !
ఈ రంగంబున విజయములేదా వీరస్వర్గముంది !
పోరాటంబున వీరులాంధ్రులను పేరునిల్పవలయు.

అని హెచ్చరించాడు, వారి కృతనిశ్చయమూ, సాహసికతా, ఏలాటివో గంటందొర యుద్ధంవల్ల తెలుస్తాయి. కవి, గంటందొర యుద్ధాన్ని ఎలావర్ణించాడో చూడండి-

చండ్రనిప్పులై మెరయగ కన్నులు గండ్రగొడ్డతెత్తి
తుండ్రించగ వైరుల కంఠంబులదూకి ముందుకపుడు
పరపడిజేయుచు గంటందొర తన పరాక్రమముజూపె
గిర గిర గిర గిర గొడ్డలిత్రిప్పుచు తిరిగెను పుర్రెలను
పొలో, పొలోయని రణరంగంబున తలపడి వైరులతొ
పులియన గాండ్రించుచు నాసీముల పుర్రెల తెగవ్రేసె
జాతరకడ బలి దున్నలనరికిన చందంబున నరికె;
ఘాతకులగు నా వైరులనెత్తురు కాల్వలుగట్టింది.

వ. ఈ వీరుని పరాక్రమానికి అదిరి శత్రుమూక దూరంగా పారిపోయి తుపాకులు కాల్చింది. గంటందొర ఎలాఉన్నాడు-

శరీరమంతట తుపాకిగుండ్లను పరచినట్లుగాగ
అరిభీకరుడా వీరునినెత్తురు వరదగ ప్రవహించె;
తలచుకొనుచు రాజును గంటందొర ధరణిపైనబడిరిగె;
తెలుగుతల్లి కన్నీటిచుక్కలను జలజలరాల్చింది.

ఇక మహాత్యాగీ, నాయకుడూఐన రాజుకూడా ఎక్కడినుంచీ సాయం రానందున విచారించి తనలో ఇలా అనుకున్నాడు.

కలియుగార్జునుడు మా గంటందొర కదనభూమి నొరిగె
బలమున కలియుగ భీముడు పట్టుబడెను మల్లు
మొగ్గరమున శాత్రవబలగాలను నుగ్గుజేసినట్టి,
అగ్గిరాజు నా పైరిపట్టె, హతుడాయె పడాలకట.

అని తెలుగుదేశాన్ని తలచుకొని తన్ను పట్టుకొనేటందుకు బ్రిటిషుసైన్యం చేతగాక గ్రామాలను భగభగ మండించి, ప్రజల్ని బాధించడంచూచి, విని, ఉడుకెత్తి.

భగ్గునమండుచు దిగ్గునలేచెను తందాన
ప్రజలు పడేడియా బాధలతలచెను ,,
ప్రజలు ప్రజలు నాప్రజ లన్నాడు ,,
ప్రజాద్రోహులను పడగూల్చెదనని ,,
విడచినబాణం బోయనరివ్వున వెడలె నుగ్రుడౌచు ,,
చెట్లను పుట్టల చేలనుజూడడు తందాన
గట్లను, వాగుల కంపలజూడడు ,,
పగతురజూడడు, మృగములజూడడు ,,
ప్రజలారా భయపడకండంటూ ,,
ప్రజలకు రక్షణ, రక్షణయంటూ ,,
ఎగరగ రెక్కలు ఎగశ్వాసంతో ,,
దిగజారగ ముచ్చెమటలు, వీరుడు ,,
ఖడ్గధారియై, కొరడవినిబడి ,,
కన్నుల నిప్పులు గ్రక్కుచుబోయెడి ,,
ప్రజా రక్షకుని రామరాజునీ, ,,

దారుణముగా చెడి మనుజులు నీచుల వైరులు మావారు
అరిభీకరుడా రాజును గన్గొని ఆదరి గుండెచెదరి
బిరబిర తుపాకులెత్తి కాల్చిరా పిరికిపందలంత
క్రూరులుగా పేల్చెడి గుండ్లదెబ్బలను వీరుడు తట్టుకొని
వీరావేశంబున నిట్లని యా ఘోరాగ్ని జిమిలిరె
ఆంధ్రదేశమా. వందనమిదిగో అందుకొనగదమ్మ!
ఆంధ్రులార! గైకొనుడు నా విప్లవాభి వందనముల.
రాలినదొక నక్షత్రంబవనికి రామరాజు ఒరిగె
తలచి రాజు నామమన్యసోదరులు వలవల యేడ్చారు
జలజల కన్నీరాలకబోసె మన తెలుగుదేశమంత.

ఈ విప్లవకథకీ భరతవాక్యం కావ్యానుగుణమైందే. వీరగుణోత్కర్షలో ఈగాథ బొబ్బిలిపాట, వీరచరిత్ర, కాటమరాజు కథలకేమాత్రం తీసిపోదు. బ్రిటిషు పాలనలో ఎంత అణగిఉన్నప్పటికీకూడా తెలుగుతల్లి తన సహజ వీర మాతృత్వాన్ని గోల్పోవలేదని ఈగాథ రుజువుచేసింది.

## (V) చిన్నపరెడ్డి పదము

తెలుగునాట సామాన్య మానవుల్లోకూడా వీరగుణం ప్రజ్వరిల్లిఉందనీ, సమయాన్నిబట్టి ఎదిర్చినవారి అసమాన బలాన్నికూడా లెక్కచేయకుండా ప్రస్ఫుటమౌతుందనీ, అనేటందుకు కోటప్పకొండ పితూరీదారు చిన్నప్పరెడ్డిని గురించిన పదం తార్కాణ.

చిన్నప్పరెడ్డిఅంటే సాహస కృత్యాలకి "సై" అనేటటువంటివాడని పేరు పొందాడు. పుట్టింది రెడ్డిపాలెంలో. పెరిగింది చేబ్రోలులో. అశ్వారూఢ నైపుణ్యములో తెలుగునాట సాటిలేనివాడు. ఆత్మవిశ్వాసం కలవాడు. అశ్వహృదయంలో నలుడికి దీటుఅని పదకర్త చప్పగాచెప్పి ఉపమాలంకారం చాటున దాక్కొన్నాడు. అశ్వానికి నాలుగుభాషలు నేర్పాపురా, అంటాడు, తనలాంటి వాళ్ళను కూర్చుకొని చీరాల పేరాల కొల్లగొట్టాడు. ఒంగోలు; బాపట్ల, పొత్తకమూరు, నెల్లూరు, వినుకొండ, గుంటూరు నగరాల్ని కొట్టాడు. ఉన్నచోటికి పన్నెండామడ నిర్ధూమధామం చెయ్యగలిగిన సాహసి. గోరంచు పంచెకట్టి, చిలకల తలపాగా చుట్టి,

అయిదున్నర కిర్రుచెప్పులతో వీధివెంబడి నడుస్తుంటే తనఊళ్ళోనేకాదు పొరుగూళ్ళోకూడా పేరుమోసిన కమ్మవారంతా చిన్నపరెడ్డితో మనకెందుకు తగాదాఅను కొనేలా ఉండేవాడు. ఉన్నంతలో రాజకీయవేత్త అనే అనిపిస్తాడు. నాజెళ్ళ కమ్మవారిని కూడగట్టుకొని చేబ్రోలు కమ్మవారిని, పూరువపలి శంకరగిరి మన్యాలు పట్టించగలననుకుంటాడు.

చిన్నపరెడ్డిలో కేవలం దుండగీడుతనమేకాదు. భక్తిభావంకూడా అసమానంఅనేఆనాలి. వృత్తిగా బందిపోట్లు నడిపినా అది ఏ అత్యాచారానికో విరుగుడేమో అనిపిస్తుంది. చిన్నపరెడ్డిలో ఆలగోడు ఆలించి పాలించే సౌజన్యం లేకపోలేదు. వ్యవసాయం మన దేశానికి జీవగర్ర. ఆ వ్యవసాయానికి మనదేశంలో ఎద్దులే మన బంధుకోటి. అవే మనకి నందీశ్వరుడిలా ఆరాధ్యాలూ, అనురాగపాత్రలూ అయాయి. వాటిని అందంగా అలంకరించి, శీతకాలపు చలి శివశివా అని వదలిపోతూండగా ప్రభలు కట్టుకొని ఒకరికంటె ఒకరు ముందుకు ఉరికలు వేస్తూ కోటప్పకొండ తిరునాళ్ళకు సాగిపోవడం కృష్ణా, గుంటూరు మండలాల వారికి నేటికాలంలోనే కాకుండా, పాతకాలంనుంచీ ఆచారమైనట్లు కన్పిస్తుంది. ఇదే దక్షిణాదిన మన తమిళ సోదరులు నేటికీ పాటిస్తున్న మాట్‌పొంగల్ (గోపూజ సంక్రాంతి కనుమ)ని తలపించే ఆచారం.

చిన్నపరెడ్డి నాలుగ్గాళ్ళ యెద్దుల్నికట్టి, బండిమీద యాభైమూళ్ళ ప్రభని తయారుచేశాడు. దాని వెంబడినే తాను తనగుర్రంమీద పాళెగారితో (జమీందారు) సమానమైన వైభవంతో బయలుదేరాడు. ప్రత్తిపాడు గ్రామంమీదుగా ప్రభసాగింది. గుర్రందిగి తమ గ్రామ మర్యాద పాటించవలసిందని ఆవూరి కమ్మవారు చిన్నపరెడ్డికి చెప్పారు. తాను గుర్రందిగననీ అందరూ ఒక్కుమ్మడిగా కలిసిఅయినాసరే తనమీదికి యుద్ధానికివచ్చి జయించి దింపవలసిందేనని చిన్నపరెడ్డి గర్జించాడు. "ఎందుకు చిన్నపరెడ్డితో విరోధం ? అతనితో చాలలేము" అని కమ్మవారు దారి వదిలారు. కాని, అందులో ఒక చమత్కారం చేశారు. చిన్నపరెడ్డీ, కమ్మవారూ గుర్రం దిగననీ, గుర్రం దిగమనీ వాదులాడుతున్న సమయంలో ఎవరో ప్రభకి కట్టిన మోకుల్ని సడలించారు. ప్రభ ముందుకు ఒరిగింది. చిన్నపరెడ్డి గుర్రం దిగి దాన్ని సరిదిద్దుతాడు. తమమాట ఏలాగైతేనేం నెగ్గిందికదాఅని కమ్మవారు నవ్వుకున్నారు. కవి ఈ విషయాన్ని హాస్యంగా చెప్పడు. "పత్తిపాటి నడివీధిలో రెడ్డీ పకపక నవ్వించినావురా !" అని అంటాడు. చిన్నపరెడ్డి గుర్రం దిగగానే

తమ గ్రామమర్యాద నిలిచిందని ఆ ఊరివాళ్ళూ, తన అవసరంకొద్దీ తానే గుర్తిం చినాననీ తన్నెవరూ బలవంతంగా దింపలేకపోయారని రెడ్డి తృప్తిపడ్డారు. పల్లెటూరి పట్టుదలల్నీ, యుక్తుల్నీ కవి రమ్యంగా చిత్రించాడు. ఇది గ్రామీణ జీవితంతో మమైక్యమైయున్నవాడికే సాధ్యమౌతుంది.

చిన్నపరెడ్డి యల్లమందల. గురువాయిపాలెం అనే గ్రామాల పొలిమేర కట్టవలో కోటీశ్వర నిధికి చేరాడు. జాగారం చేసేనాటికి ఎక్కడా సందులేకుండా, కోట్లకొద్ది శివభక్తులూ, గంటలూ, పిరాంగాలూ, శంఖాలూ, రొదలతో ఘోష కొలిపాయి. ప్రభల పోటీలు సాగుతున్నాయి. శాంతిభద్రతల్ని కాపాడేటందుకు మూడువందల జవానులూ (పోలీస్), కొంతమంది రిజర్వ్ జవానులూ (రిజర్వు) వచ్చారు. అప్పటికే రేనాటిరెడ్ల ఎద్దులు బెదరి కొంచెం గత్తరచేశాయి. అదిసాకుగా చేసికొని జవానులు చిన్నపరెడ్డిని ఎద్దుల్ని నిలపమన్నారు. కాని, వారి అసలు ఉద్దేశం వేరు. చిన్నపరెడ్డిఅన్నా, అతనికిచ్చిన పలుకుబడిచూసినా పోలీసు డిపార్టుమెంటుకి కన్నెర్ర. చిన్నపరెడ్డిఅంటే కృష్ణా, గోదావరీ మండలాల్లోనూ, చెన్నపట్నం గొల్కొండలదాకానూ మకుటంలేని రాజ్యాధిపతిగా చెలామణి అవుతున్నవాడు. అలాంటివాడు ఒంటిగా తిరునాళ్ళలో వీరికి తారసపడ్డాడు. అతనికి స్థానబలం తక్కువైన సమయం చిక్కింది. అందుచేత ఏదోవన్నికపన్ని అతని పనిపట్టా లనుకున్నారు. అంతకుముందు అతను చేసిన దోపిడి నేరాలకీ రుజువులు దొరక వాయె. ఎలాగైనా అతన్ని వదలగొట్టుకుంటేకాని పోలీస డిపార్టుమెంటుకి శాంతిఉండదు. ఇలాంటి అవకాశం వదులుకోకూడదని పోలీసు అధికారులు గూడుపుఠాణీచేసి, ఇద్దరు జవానుల్ని పిలిచి, చిన్నపరెడ్డికి ఇలా కబురుపంపారు. "నీయెద్దులు బహుభారీలయినవి. ఇప్పటికే తక్కిన ఎద్దులన్నీ బెదిరిఉన్నాయి. చాలా తంటాచేశాయి. జనంఅంతా భయపడుతున్నారు. అందుచేత నీ యెద్దుల్ని నీవు నిలిపిఉంచు లేకపోతే తుపాకిని వేస్తాము." చిన్నపరెడ్డి అంత అవమానం మాటపడి వూరుకుంటాడా ? కళ్ళెర్రజేసి "వినండయ్యా జవానులూమీరు, యెద్దుల్ని విప్పను, బండిని ఆపను, ముందు నన్ను తుపాకీవేసి, తర్వాత యెద్దుల్ని చంపండి" అన్నాడు. వెంటనే పోలీసులు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. ఉపాయంగా రెడ్డిని పట్టాలనుకున్నారు. గుర్రంమీదనున్న రెడ్డి మెరవులా మెరసి జనంమీదినుంచి దూకిపోయాడు. వెంటనే మూడువందల తుపాకులు పేలాయి. రంగం భీభత్సమైంది.

మూడువందలా తుపాకి పొగలో,
పొకరిముఖమును పొకరు గానకను,
తమలోతామే గొట్టుకొనుచు
తలగుద్దలు పడిపోయినదెరుగరు,
తల్లి పిల్లలు పోయినదెరుగరు,
కాళ్ళు చేతులు విరిగినదెరుగరు.

పరిజలస్థితి ఇలాకాగా అంతటాను యామిరాయి (?) వండే కలాయిలన్నీ మంటలు మండాయి. ఆ అగ్నిచే పాకలుకాలాయి. ఆ పాకల్లో జనం కొందరు "హర, హర" అంటూ హతమైపోయారు. డేరాలు వరసగా కాలాయి. నల్లని పొగలు లేచాయి. జనులుకొందరు పారిపోయారు. కొందరు జనులు చూస్తూ ఉన్నారు. తల్లి పిల్లలకు లేకుండా కాకిశోకము అవుతావున్నది. అని కవి సహజంగా కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. ఫెళ ఫెళరావాలూ, ఛటఛటార్భటులు (అర్థంకాని సంస్కృత పదజాలమూ,) ఈవర్ణనలో మనకు కన్పించవు. ఈ సంఘటనకీడైన సంఘటన స్వాతంత్ర్య సమర రంగాల్లో జరిగిన పోలీసు కాల్పుల సమయాల్లో మనలో చాలామంది చూసివుంటారు. ఇలాంటి భీభత్సమయరంగాన్ని తమ చిన్నతనంలో జరిగిన పార్క్-ఫెయిర్ అగ్నిప్రమాదాన్ని తమ చిన్ననాటి ముచ్చటలలో డాక్టర్ కె. యన్. కేసరిగారు చక్కగా వర్ణించారు. వర్ణనా చాకచక్యంలో మన ప్రజాకవివారికి తీసు,

ఇంత గలాటా జరిగితే చిన్నపరెడ్డి పోలీసువారికంటె ముందుగా తానే తాశీల్‌దారుకి కబురు చేసేస్తాడు. ఆయన మరికొందరు జవాన్లను వెంటబెట్టుకొని కొండదగ్గరకేగి జనుల్ని విచారించాడు. ఈ సంఘటనకి కారణం చిన్నపరెడ్డి, తన ప్రభని పోలీసులు ఆపమన్నా ఆపకుండా ముందుకు సాగించి, ఎద్దుల్ని బెదరగొట్టి శాంతి చెదరగొట్టడమేనని నిర్ణయించాడు. రెడ్డిని పట్టమనీ, పట్టిఅప్పచెప్పిన వారికి గొప్పపనులు యిస్తామనీ ప్రకటించాడు. చిన్నపరెడ్డి ఇలా ప్రకటన జరుగగానే మాయమయ్యాడు.

కోటప్పకొండదగ్గర అల్లరి జరిగిననాటి మధ్యాహ్నము రెడ్డి కొండగుహలలో దాగివున్నాడు, తర్వాత రెడ్డిపాలెంవెళ్ళి మూడురోజులున్నాడు. ఎక్కడైనా నిలకడగా ఉండటం తనకు క్షేమం కాదనుకున్నాడు. తన అశ్వారోహణ సామ

ర్ధ్యంలో అతనికి నమ్మకం ఉంది. తాను అశ్వం ఎదురుంటే, తప్పనిసరిగా పట్టగల ననుకుంటాడు. ఐతే తన అశ్వం కొండపగ్గర తుపాకి కాల్పులవల్ల నష్టమైంది. అందుచేత తిరిగి మరొక గుర్రాన్ని సంపాదించుకోవడం ప్రథమ కర్తవ్యమని నిశ్చయించాడు.

చిన్నపరెడ్డి తనకు తగిన అశ్వాన్ని సంపాదించుకొనేటందుకు చెన్నపట్నమో, గోలకొండో పోవాలనుకున్నాడు. రైలుకి చీటీలేకుండా చెన్నపట్నం బయలుదేరాడు. పట్నంచేరి చీటీ అడిగిన జవాన్లతో పొగాకు, మిరపకాయలు రవాణాచేసి అవి వచ్చాయేమో చూసేటందుకుమాత్రం వచ్చానని బుకాయించి తప్పించుకొన్నాడు, తెల్లటి ఆహార్యం. తెల్లకోటు. ఎడమ్మర కిర్రుచెప్పులూ, చేతిలో బెత్తము గొడుగుతో ఉన్న ఇతని వేషంచూసి, వారు ఇంతపెద్దమనిషి అబద్ధమాడడని వదిలారు.

చిన్నపరెడ్డి పట్నంలో మరోపాచిక వేశాడు. దావాసాహెబు బజారులో నరసింహారావుదగ్గర మంచి గుర్రముందని విన్నాడు. ఆగుర్రానికి జీను, సాని పెట్టే ఇస్మాయిల్ సాహెబుని దువ్వాడు. నరసింహారావు గుర్రాన్ని ఏడువందల యాభై రూపాయలకు కొంటానని బేరం చేశాడు, దాన్ని పరీక్షించేటందుకు అలా తిప్పి సాయంత్రానికి వస్తాననీ, బేరం రైటుచేసుకొని సొమ్మిస్తాననీచెప్పి రెడ్డి దౌడాయిస్తాడు.

గుర్రంయెక్కి వెళ్ళిపోయిన చిన్నపరెడ్డి తిరిగి పట్నంరాలేదు. నరసింహారావు లబోదిబోమన్నాడు. సాయంత్రమైంది. రాత్రి పదిగంటలయింది. రెడ్డి చేబ్రోలు చేరాడు, నరసింహారావు వాకబు చేశాడు. రెడ్డిని గుర్రపుధర అడిగి తెమ్మని చేబ్రోలు మనుష్యుల్ని పంపాడు. రెడ్డి మొండికెత్తాడు. గుర్రపుధర అప్పుడే ఇచ్చేశానని బుకాయించాడు. మళ్ళీ అడిగితే ప్రాణాలమీద ఆశలు వదులుకోవాలన్నాడు. నరసింహారావు ఇకలాభంలేదని పోలీసుస్టేషన్లకి టెలిగ్రాము కొట్టాడు. వారికి చిన్నపరెడ్డిఅంటే గడగడ. అందుచేత వారు టెలిగ్రాములు చించి బుట్టదాఖలు చేశారు.

ఇంతలేసి పనులు జరిగించినా చిన్నపరెడ్డికి చీకూ, చింతాలేవు. చీట్లపేక ఆడుతుంటాడు. ముసద్దీలు, పేష్కార్లతోకూడి ఉన్నసభకి రావలసిందని గుంటూరు

తహిసిల్దారువారు సగౌరవంగాపిలువనంపారు. చిన్నపరెడ్డి ఏసౌకృత్రిమముఉందని అనుమానించలేదు. నిష్కళంక హృదయంతో, మొండినమ్మకంతో, గుంటూరు సర్కారు తనని సమానస్థాయిలో మర్యాదగా గౌరవించేటందుకు పిలిచారను కున్నాడు కాబోలు. పాపం. తెల్లకోటు, సల్లాటు తొడిగి ముస్తాబైనాడు. గుంటూరి కచేరికి వెళ్లాడు. గుంటూరి సర్కారు బుజ్జగించి, ఇచ్చకాలుచెప్తూ 'అబ్బ వినవోయి చిన్నపరెడ్డి కొండకాడ జరిగిన కేజు యేమన్నా నీకు అంతు తెలుసునా?' అని అడిగారు. చిన్నపరెడ్డికి ఇంగ్లీషు న్యాయ చట్టపు మడత పేచీలు తెలియవు. రెవెన్యూ, అధికారులకి, న్యాయమూర్తుల అధికారాలున్నా యన్నది తెలియదు. నేరం ఒప్పుకొనే వాఙ్మూలంయొక్క స్వభావం తెలియదు. అతనికి తెలిసిందల్లా ఒకటే. అది అతని సాహసశక్తి ప్రకటన. మర్మంవిడిచి మాటాడడము. ఆపదలంటే జంకులేకపోవడం. ఇవే అతని రక్తంలోనూ, నాడుల్లోనూ ప్రవహిస్తు న్నవి. వెంటనే రెడ్డి నిర్లక్ష్యంగా 'నేనులేని ఆడ యెవ్వరితో జరిగింది' అన్నాడు. ఈ నిర్భీకతకి గుంటూరు సర్కారు గడగడవణికారు. చిన్నపరెడ్డిని వదలితే లాభంలేదనుకున్నారు. చేబ్రోలు వెళ్లనిస్తే మరి చిక్కడనుకున్నారు. అందుచేత వెంటనే రెడ్డిచేతులకు బొండవేశారు. కాళ్లకు సంకెళ్లువేశారు. నడుముకు గొలుసు కట్టారు. చిన్నపరెడ్డి జవానులను కన్నులారాచూశాడు. మీరు నమ్మించినన్ను తెచ్చేరు. ఇంతమాత్రం రెడ్డిపాళెంలో చెపితే విసురు విసురుకి యెరవై శిరసులు కత్తించపడేవి అని బోనులో సింహంలాగర్జించాడు.

చిన్నపరెడ్డికి సంకెళ్లుపడినతర్వాత పోలీసు జవాన్లకి ధైర్యం చిక్కింది. ఆతర్వాత ఇతనితో దుమ్మెక్కిన పలకలూరు తిమ్మారెడ్డినీ, పడిదరము మునసబు అప్పయ్యనీ, మూడిపళ్ల గోవిందునీ, వారివారి గ్రామాల్లో పట్టుకొని వెంట బెట్టు కొని గుంటూరు తీసుకొచ్చారు. వీరందరినీ ధర్మబల్ల (బోను) ఎక్కించారు. చిక్కినవారికి చిన్నపరెడ్డికున్న ధీమా, ప్రాణాలమీద నిర్లక్ష్యమూలేవు.

> 'అన్నెం పున్నెం ఎరుగము
> పాపాబింకము ఎరుగము;'

అని ఏకవాక్యంగా అని శిక్ష తప్పించుకో జూచాడు. విచారణ జరుగుతోంటే చిన్నపరెడ్డి భార్య రత్నమ్మా, లంజ జానకమ్మా చూడవచ్చారు. చిన్నపరెడ్డి అపమానభారంతో కుంగిపోయాడు. చూడవచ్చిన రత్నమ్మతో ఇలాగన్నాడు. "గుంటూరికి చెన్నపట్నానికి గొలుసు కట్టి డబానడనీవు యొదలపెట్టినా చేబ్రోలు నేరానవిడక్క" ఈ వాక్యంలో తప్పులు, దొర్లాయవీ

గుంటూరికీ, చెన్నపట్నానికీ, మధ్య అంచెలంచెలుగా గుర్రాల్ని నిలిపి, తాను తప్పించుకొనేటందుకు అవకాశాలు కల్పించినా, తప్పించుకొని పోయేచేతే ఉత్సాహం తనకు లేదనీ, ఆ ఋణం తీరిపోయినట్లు తలచుకునీ చెప్పినట్లు తోస్తుంది. జానపదరచనల్లోనూ గుణితప్రతుల్లోనూ, విస్పష్టంగా లేకపోవడం అక్కడక్కడ కన్పిస్తుంది. ఈ దోషం ఉండుట విచారింపతగిందే. అపక్రపరాక్రమంతో తెలుగు దేశాన్ని గడగడలాడించి, సంకెల వేయించుకొని అందరఎదుటపడిన, పిదప, తిరిగి ఎలాతప్పించుకొని దొంగలాగనక్కి ఉండగలనని, మానుషం గల చిన్నప రెడ్డి అనుకోవడం ఎంతోసహజంగా ఉంది.

ఈఒక్క వాక్యంలో పదకర్త ఎంతజీవితవైరాగ్యాని ఇమిడ్చాడు. ఇందులో "చతురంభోధి పరీతభూవలయ...." పద్యంలోని గంభీరభావాలు, సంస్కృతపదాల లో పెదవుల చివరలనుండి మాత్రమే వచ్చేవి లేవని తప్పు పట్టితే చెప్పేదేమీలేదు. పదకర్త భావాలు సూటిగా హృదయంలోంచి వచ్చేవేగాని గొంతుకు నచ్చుకొని, చుట్టుపక్కలనున్న వారికేసిచూసి, వారిని రంజింపజేద్దామనే ప్రయత్నాలుచేసి తయారుచేయించుకొన్న దుస్తులవంటివి గావని మాత్రం చెప్పవలసిఉంటుంది.

చిన్నపరెడ్డిని 'యిడి కైదులో వుంచుతాము' అని తాసిల్దారు అన్నారు. రెడ్డికి అదినచ్చలేదు. వీరవిహారంచేస్తూ, స్వేచ్ఛగా బ్రతికిన తనకు బోనులో ఎలకలా పడివుండడము తగదనుకున్నాడు. సర్కారినిమించి సర్కారీ చెలా యించిన తనకు వీరోచితమైన శిక్ష పడాలనుకున్నాడు. అందుచేత తన్ను తుపాకిని వేయించవలసిందనీ, లేకపోతే, ఉరిమానుకు వెయ్యండనీ కోరాడు. ఇలా తుపాకిని వేయవలసిందనే కదా భగత్ సింగ్ ప్రభృతులు కోరారు. నిర్భీకతలో మన చిన్నపరెడ్డి వారికేమీ తీసిపోడు.

తర్వాత ధర్మపెట్టెల తెప్పించి, కాగితాల చీటీల వ్రాసిపెట్టి, నేరస్థుల్ని ఏరుకొమ్మన్నారనీ, చిన్నపరెడ్డి గౌరకాగితం ఏరుకొన్నాడనీ. అందులో ఉరి మానుకి సెలవు వచ్చిందనీ, ఆప్రకారమే చిన్నపరెడ్డిని రాజమహేంద్రం జిల్లాలో వురితీశారనీ చెప్పి, చిన్నపరెడ్డి కథని పదకర్త ముగించాడు.

చిన్నపరెడ్డి సాహసికత్వంలో రాబిన్ హుడ్‌కి ఏమీతీసిపోడు. అశ్వారూఢ నైపుణ్యంలో నా రాజ్యం అంతా ఒకయెత్తు, నా గుర్రం ఒకయెత్తుఅన్న రిచర్డుకి

లొచ్చుకాడు. తన కథానాయకుడు అచ్చుతీర్చినట్లు ధీరోదాత్త. ధీరలలితుల్లో చేరదేయని పదకర్త బెంగపెట్టుకొనకుండా చిన్నప్పరెడ్డి కథని ఉన్నదాన్ని ఉన్నట్లుగా కవి వర్ణించాడు. అందుచేతనే అది పఠితల్నీ, శ్రోతల్నీ ఉయ్యాలలూగిస్తూ సామాన్య తెలుగు ప్రజల్లో రగుల్కొని ఒకనాడు ప్రజ్వరిల్లిన వీర గుణాగ్నిస్ఫులింగంగా నిలిచింది.

## (VI) గుర్రాల గోపిరెడ్డి పదము

చిన్నప్పరెడ్డి లాంటివాడే అయిన గుర్రాలగోపిరెడ్డి అన్న మరో వీరకిశోరం జానపద గేయాల్లో మనకి ప్రత్యక్షమవుతాడు. అతన్ని గురించి మెరుపులాంటి ఒక్క పాట ముక్క తప్ప మనకి ఏమీ తెలియదు.

‘శేరు, శేరు యొండిమురుగుట్ చేతులాకు పెట్టుకొని
కట్టవ మీద వస్తావుంటె కలకపేరులా........’

దన్నించేవాడట. ఎల్ల గుర్రం ఎక్కిపోతావుంటే, కట్టేది కాయపంచె (నీర్కాయ) అయినా, సుక్కవంటి సక్కదనంతో సూడ రెండు కన్నులూ చాలనన్నట్లుండేవాడట. ఏ జనకంటకమైన పనులు చేశాడో కాని, ఈ గుర్రాల గోపిరెడ్డిని, దాచే పల్లెకెళ్లేదారిలో నలుగురూ బట్టి నేల మధ్యని నరికేశారట. ఇది తలచుకు తలచుకు తల్లిప్రాణం గుండెలు వ్రీలేలా, సకరుణంగా విలపించే ఘట్టంలోని ముక్కలు మాత్రమే మనకి లభిస్తున్నాయి.

## (VII) సర్వాయి పాపడి కథ

వీర గుణస్ఫోరకమైన జానపద రచనల్లో సర్వాయి పాపడికథ మరొకటి. సర్వాయి పాపడు పుట్టింది పులగాము. పెరిగింది తాటికొండ. కులమందు గవండ్ల వాడు. ఇంటిపేరు నాసనోళ్ల అసేన్, వుసేన్, తుర్కహిమాన్, చూదేకుల పీరు, ముక్కలుగోసే నక్కల పెరుమాళ్ళు, నెల్లూరి హనుమంతు, చాకలి సర్వన్న, మంగల మాసన్న, కుమ్మరి గోవిందు మొదలైనవాళ్ళతని నేస్తగాళ్ళు. ఇక పాపడు ఎలాంటివాడో చూడండి.

పాపడియొక్క పేరు చెప్పితే
పూరుపిచ్చిక పొలం చేరదు

పొట్టి గిబ్బెన బ్రాడు నేరగు
కొంజులా హరాడుతూండు
నక్కలా నాట్యాము గొంక్క

సంటూలు పసుగెత్తిసాగునా. వాడేటంటె
పందికొక్కు దోలుకొప్పాడో. ..
పొంతికుండలు గంతులేస్తాయి. ..
పసిబిడ్డలు పాలుతాగారు, ..
గుఢ్డాలు గుగ్గిళ్ళు తినవు, ..
మేనుగూలు మేతలందావూ, వాడిపేరంటే

ఢిల్లీ దర్బారౌతుకు; గోలుకొండబస్తీ రౌతుకు,
కడపజిల్లా లౌతుకురా: వాడిపేరంటె
కందనోలు సూయిలౌతుకురా; వాడిపేరంటె
మైసూరు జిల్లాలౌతుకురా: వాడిపేరంటె
చెన్నాపట్టణము హౌతుకురా; వాడిపేరంటె

మొత్తంమీద విశాలాంధ్రం అంతా ఇతని పేరంటే దడ, దడే. పాపడు 'వినరా సర్దారిపాప, కరవిద్యలు యెన్ని అయినా, కులవిద్యకు సాటిరావురా సర్దారి పాప,' అనిహితంచెప్పిన తల్లిమాట పెడచెవిని పెడతాడు. బాల్యంలో జరిగిందనే ఈగాధనిసమ్మాడు. ఒకనాడు ఆవుల్ని మేపి, చెట్టునీడని నిద్రపోతుంటే పన్నెండు శిరసులనాగు పాపణ్ని చూచి ఎండపొడ కాస్తోందని అతనికి పడగ లెత్తి, గొడుగుపట్టిందట. ఈ సమాచారం భావివైభవ సూచకంగా పాపడు గ్రహించాడు. కాశీనుండి రామేశ్వరం యాత్రపోయే బ్రాహ్మణులు పాపడి జాతకంలో గోలకొండ యేడు గడియలు యేలడానికి వంతమున్నదని చెప్పారు. పాపడీ కబురూ నమ్మాడు.

పాపడు తననేస్తాలతో కలిసి "ఊరు కొట్టితే యేమిఫలము, పల్లెకొట్టితే యేమిఫలము, కొడ్తె గోలకొండ కొట్టాలని" నిశ్చయించుకున్నాడు. ఉషారు కోసం మేదర యెంకన్న, కొత్తవాలు మీరి సాహెబు ఇతర నేస్తాలూ, రేణు గుంటకల్లు కన్నులెర్రజేసే మాత్రిమే ఉయిపోయిందనీ, లాహిరియెక్క లేదనీ, అందుకోసం మొయిలు గుంటకల్లు తాగాలనీ, వేషం వేసుకు బైలుదేరాడు, సర్వాయి పాపడు ముస్తాబైన విధానం చూడండి.

పట్టూషరాయితొడిగి,
పచ్చేల నడికట్టుగట్టి,
అందేలబల్లెం తీసెరా, ఆరాయడూ
ఇనపగుంప్లి చేతబట్టెనూ, ఆరాయడూ
వింటిలిబిద్ద (వుండీల్ బద్ద ?) చేతబట్టెనూ, ఆరాయడూ
యాటకొడవలి చంకనేసెనే, ఆరాయడూ
సిగమీద పూవులుచుట్టెనే, ఆరాయడూ
ఒళ్ళు చక్కోలుపెట్టెనే, ఆరాయడూ
పైరిగద్దం పొయిలుపాపన్న, ఆరాయడూ

ఇలా అలంకరించుకొని బయలుదేరిన పాపడికి చిక్కుతీసి కొప్పు పెట్టుకొని, శ్రీగంధపు చుక్కబెట్టుకొని, హంసల, మొగ్గల రవికెని తొడిగి, పండ్లకు దాసీనా వేసుకొని, బొంబుమెట్టి వేసుకొని బొమ్మంచు చీరగట్టి, పిల్లవాణ్ని చంకబెట్టి, కూటిబుట్ట యెత్తుకొని, యెదురుగుండా వచ్చిన చాకలి యెల్లమ్మ ఫెళ్లు మనితుమ్మింది. సర్దారిపాపడు మనసు వికలమై, "అరె ధూల్, ఖాంచోద్ యెదురుగుండా తుమ్ముతా శకునమొస్తాది, దీని ముక్కుచెవులు కోయ్యండి'' అని ఆజ్ఞాపిస్తాడు. అది కుయ్యో, మొర్రోమనగానే "ఇప్పుడున్న బుద్ధి, అప్పుడేల లేకపోయెనే ?" అని తిట్టి మొగిలికుంట, తోపు గడగడ వణికేలా కల్లుకట్టే జిడెన్న దగ్గరకెళ్ళి "నరుకులాడేకల్లు'' కావాలంటాడు. జిడెన్న అలా వీరావేశం ఎత్తించేకల్లు తన దగ్గర లేదన్నాడు. వెంటనే పాపడిజనం వసంతంతా వెతికి, చర్ చర్ మనే ఏడు లొట్టెల కల్లుదింపించి, చెరుగుపట్టమని, దివిటీ మండినట్లుమండే ఆరకల్లునీ (సారా) మూడుతుండ్ల తుడకాకు సీసా సారానితాగి, గోల్కొండ చాయచూచి, మీసము గిరగిర దిప్పాడు.

చెడతాగి ఒళ్ళుమరచి వస్తున్న పాపడికి గద్దిచెప్పే నాంచారు ఎదురవుతుంది. వెంటనే "గద్దెచెప్పవే ఖాంచోత్" అని పాపడు ఆమెను బెదిరించాడు. నాంచారు—

గద్దెబుట్ట దించినాది; వినరా సర్దారిపాప
యేడుగురి పెండ్లాలతోను, పన్నెండుమంది లంజలతోను,
ఏనాదిపిల్లతోను, భోగమోరి కన్యతోను,
పాలకిసెక్కె పంతమున్నాది. ఓరాయుడా

లంజయుంచే లక్ష్మినవ్వురా, ఓరాయుడా
గోలుకొండ ఏలడానికి వంతమున్నాది.
ఓరాయుడా, నీకు వంతమున్నాది."

అని గట్టె చెప్పింది. ఈ ఉపశ్రుతికి పాపడు పొంగిపోయి. నాందాడునే లంజగా వరించి, యింటికి లాక్కొచ్చి, "నీ ముద్దుకోడలు ఇదుగోనే సర్వమ్మ తల్లి" అని దాన్ని అప్పగించి, "గోలుకొండ దర్బారు కొట్టేటందుకు ధనం కావాలనీ, కల్లుఅమ్మిన పైకమెక్కడే. ధనముండే పోవిదెక్కడే ?" అని జబర్దస్తీగా అడుగుతాడు. సర్వమ్మకి పాపడి వేషాలూ, ప్లానులూ నచ్చవు అందుచేత-

దబ్బా దుగ్గాణీయెరుగ
రుప్య, అరదుట్టుయెరుగ
దుట్టుమీద దుప్పెదురా "

అని మాటుపెట్టిన పైకం ఏమిలేదంటుంది. పాపడీ మాటలు నమ్మక, ఆమెచేత నిజం పలికిద్దామని నూనెతెప్పించి, సలసకాకలుచించి, దివిటీలుచుట్టి, సర్వమ్మని యెల్లకిల పండదోసి, రొమ్ముమీద కాలుపుదీరి, దివిటీలతో కాల్చి వాతలు వేయిస్తాడు. సర్వమ్మనోరు, నొసలుకొట్టుకొని, బాధలను భరించలేక లొంగి—

నీ యమ్మకడుపు కాలిపోను
పుల్లనీళ్ళ దాసకాడ పుట్టెదైనా పైకమున్నదిరా సర్దారిపాప

అని అంటుంది. పాపడికి ఆ పైకంతో తృప్తి కలగలేదు, సర్వమ్మ మాట లపై నమ్మకమూ కలగలేదు. అందుచేత-

ఆరేథాంబోత్ ఇంకాబాగా చెప్పమంటాడే
వత్తితోను కాలుస్తున్నాడు; సరదారి పాపడు
వత్తిచమురు పిండుతున్నాడే సరదారిపాపడు

ఈ బాధలకి సర్వమ్మ పూర్తిగా లొంగిపోయింది.

నీయమ్మకడుపు కాలిపోను:
ఇలవేల్పు యల్లమ్మ
యల్లమ్మ దేవళాన
యేడుకొప్పెర్ల ధనము ఉన్నాది నరదారిపాప

అని తాను దాచిన ధనం ఎక్కడున్నదీ చెప్పేసింది వెంటనే రాయడు ఎల్లమ్మ దేవళానికి బయలుదేరాడు. చూకుడుగావచ్చే పాపణ్నిచూచి, భయపడి యల్లమ్మ దేవళంవిడిచి వెళ్ళిపోబోయింది. అలా వెళ్ళిపోబోతున్న ఎల్లమ్మను పాపడు జడపట్టుకొని యీడ్చుకొచ్చి,

"యేడుకొప్పెర్ల ధనమున్నదా, యెల్లమ్మా,
నీకు యేడుమన్నలు కావలెనా యెల్లమ్మా ?"

అని అడిగాడు. ఈ ఘోరానికి గ్రామదేవత గడగడలాడింది" ఏడుదున్నాలూ వద్దు, ఏటపోతులూవద్దు" అని యేడుకొప్పెర్ల ధనముజూపెను ఆయెల్లమ్మ. వెంటనే పాపడు ఆ యేడుకొప్పెర్లధనం లేవదీసుకొని, పన్నెండువేల రాణువను కూర్చుకొని గోలుకొండమీదికి యుద్ధానికి బయలుదేరాడు. తన రాకడని తెలియజేస్తూ నవాబుకి వర్తిజాబులంపాడు.

గోల్కొండ నవాబువద్దర ఐదులక్షలదండుంది. గోలుకొండ గవనికాడ పాపడి దళానికీ, నవాబు సైన్యానికీ యుద్ధం జరిగింది. పాపడియుద్ధం పదకర్త ఎలా వర్ణించాడో చూడండి-

రెండుచేతులా పట్టాకొడిగె సర్దారిపాపడు
కార్యానికీ చూకినాడుగా చందుమీదికేమి
గిరగిరమంటూ పట్టాకత్తులు తిరిగాయపుడేనూ
ఎగిరే వొక్క-శిరస్సులాకు మెడాసందులేదు
వాలేటి వో శిరస్సులాకు యేడాసందులేదు

ఇలా వీరవిహారంచేసిన పాపడికి, గోల్కొండ గవని స్వాధీనం ఆయింది. తిరిగి నవాబు నిలదొక్కుకుని ఏడుగడియల తర్వాత ఆగవని స్వాధీనం చేసుకొని ఉంటాడు. పదకర్తమాత్రం నవాబు పాపడికి ఏడుగడియలు తక్కువయేక్కే యోగ

ముందని గ్రహించి. అదర్వాప పాపడు నిర్వీర్యుడు కానానే అబ్బాయని రాత్రా-
లికంగా తప్పుకొని. అకాల స్నపదానం తీరిపోగానే ద్విగుణీకృతోత్సాహంతో.
పైగా—

నీవు గోలుకొండమీది యుద్ధానికి పోవస్తినా

అంటూ బొబ్బరించి—

మూడువేలవీ తుపాకినాదు తయారుపరిసించి

యుద్ధం సాగించాడు. ఆ సందులసమరంలో

మూడువేలకీ తుపాకి రంజకమైనాది
అసిదెబ్బ తగిలినాదిగా పాపడికై తేను.

వెంటనే పాపడు ఇందర్ని చంపి, ఒకగిచేతులో వావడమేసుని వాడు యెగర వేసి రొమ్ముఒగ్గి గరగరమంటూ వాడు ఒగ్గగానే "రామా, రామా" అంటూ ప్రాణంవొదిలి వీరస్వర్గానికి వెళ్ళాడు.

మొత్తంమీద పాపడికథలో పిండారీదండుల దాడుల్లో జరిగిన చర్యల్లాంటివి వర్ణితమయాయి. కేవలం ఉత్సాహంవల్ల నేస్తాల్ని, అపరిమితమైన సైన్యాన్ని సమీకరించి, గోల్కొండ సవాబునే కొందిశీకుల్ని చేయగలిగిన ఈ తెలుగు వీరుడి గాధ మనకు వినసొంపైనది. సొమ్ముకోసం తల్లినికూడా బాములుపెట్టడం, అత నిలో గర్హించవలసిన లక్షణమే. కాని, పదకర్త తన వీరుణ్ని యథాతథంగానే వర్ణించాడుగాని తీర్చితిద్ది చెక్కి మలచి ధీరగుణుణ్నిగా చేయలేదు. అందుచేతనే సర్వాయిపాపడు తెలుగు జనసామాన్యం లోనివాడుగా అన్నికాలాలవారిలోనూ గోచరిస్తాడు. అందువల్లనే తమలోనివాడుగా కన్పించే ఈతనికథ తెలుగు జాన పదుల వాఙ్మయంలో నిలిచిఉంది.

ఈ సర్వాయి పాపడికథకి చరిత్రాత్మకములైన ఆధారాలు కన్పించవు. పారంపర్యా వాడుకలోఉన్న. ఈకథనీ, ఇలాంటి ఇతర రచనల్ని సేకరించడమూ, వాటికిచరిత్రదృష్టిలో ఏమైనావిలువఉందాఅని పరిశీలించడమూ,మంచిది. మనఆచార వ్యవహారాలూ, వ్యాప్తిలోఉన్న కథలూ, కొన్నిమాత్రమే పాశ్చాత్య పరిశోధకుల కృషివల్ల సేకరింపబడ్డాయి. అవిసమగ్రంగా చెయ్యవలసినబాధ్యత మనమీదఉంది.

# 4 సాహసిక కథా వాఙ్మయము.

సాహసికుల కథలూ, వీరకథా వాఙ్మయమూ ఒకేకోవలోవి. ఈ విభాగం కేవలం సౌలభ్యంకోసం చేసిందిమాత్రమే. ఈ రకపు కథల్లో గాఢ సాహసికుడైన నాయకుణ్ని అనుసరించి నడుస్తుంది. బంగారు తిమ్మరాజు కథ, ఆరెమరాటీల కథ, దేశింగురాజుకథ, చిన్నప్పరెడ్డికథ, సర్వాయి పాపడికథ, సీతారామరాజు కథ అలాంటివే. వీటిలో చిన్నపరెడ్డి, సర్వాయి పాపడికథలకి చరిత్రప్రసిద్ధిలేదు. ఈ కథల్లేకపోతే వారికి ఊరూ పేరూ ఉండవు. సీతారామరాజుకథలో అభూత కల్పనలులేవు. చరిత్ర రసవంతంగా వివరించబడింది. ఇవి మూడూ ఇంతకు పూర్వమే పరిశీలించాము. మిగిలిన మూడుకథలూ అలాటివికావు. పెనుగొండలో రాయల పరిపాలనా, తెలుగుదేశంలో వసతులేర్పరచుకొన్న మరాటీలూ, చెంజీ పరిపాలించిన దేసింగూ ఇతర కారణాలవల్లకూడా చరిత్రలో ముఖ్యపాత్రలు ధరించినవారే. వారినగురించిన కథల్లో చారిత్రాత్మక సత్యాలు మెరికలుతిరిగి మెరుస్తాయి. వీటిలో చరిత్ర ప్రధానం కానేకాదు. నాయకులపేర్లు ఉచ్చారణ సౌలభ్యాన్ననుసరించి మారి ప్రచారమౌతాయి. అపుత్రకుడైన రాయలవారు మొసళ్ళను పెంచుకోవడమూ, సరూప్‌సింగు, తేజసింగులు, శూరసింగు, దేసింగులుగా వ్యవహరింపబడటమూ వీటి కుదాహరణములు. కథారచయిత చారిత్రిక విషయాల్ని ఇష్టంవచ్చినట్లు వాడుతాడు. హైదరాబాదు పురమనే గోల్కొండని ఢిల్లీ పాదుషా ఏలడమూ, సాదుల్లాఖాను ఢిల్లీపాదుషాకి అల్లుడవడమూ, తోండ్రమల్లు అతని దివానుకావడం అలాంటివే. ఇవి చరిత్రకారుల దృష్టిలో గర్హించతగినవి. పదకర్తకి కథానాయకుడిమీదవున్న గౌరవంవల్ల లేనిపోని గొప్పతనాలు ఆపాదించడం జరుగుతుంది. ఎంత వరప్రసాదియైనా, ఎలాంటి అవతారమూర్తియైనా బంగారు తిమ్మరాజు పైవాలసు ప్రత్యక్షం కాకపోతే నరుకుతాననడం, వారు కూడా హడలెత్తి వెంటనే ప్రత్యక్షమై అతన్ని అనుసరించడం సంచారి కథా రచయితల రచనల్లోనే సాధ్యం. ఇక చెంజీరాజ్యం దేసింగు తండ్రినాటినుంచికూడా ఆర్కాట్ నవాబులకి సామంతరాజ్యమే. అసలు సరూప్‌సింగ్‌కి జుల్ఫికర్‌ఖాన్ దయవల్లనే రాజ్యంవచ్చింది. పారాహజారి గుర్రంకథ కేవలం కవికల్పనే.

ఎన్ని అభూత కల్పనలున్నా ఈ కథలు జనసామాన్యంయొక్క అభిమాన పాత్రములయాయి. చరిత్రలో కేవలం సూత్రప్రాయంగావున్న విషయాల్ని వివ

రంగా మనకు ఈ కథలవల్ల తెలుస్తాయి. అందుచేత వీటి పరిశీలన మనకెంతో అవసరం. బంగారు తిమ్మరాజు కథలో-

చంద్రగుండముకు సూర్యగుండముకు తామేవెళ్లారు
పాపుకోళ్ళనూ పొట్టినవిడిచీ పరికించిచూచె
వేలకొలదీ, కోట్లకొలదీ మొసళ్ళు గలవండీ
ముంగుముక్కెరలు. కర్ణ పుష్పములు, మొనిట్లుగలవండీ
కంఠకోరలు కాలిఅందెలు మొసళ్ళు గలవండి
మొసళ్ళచూచి చింతగున్నడు బాలుతిమ్మరాజు
దాసీ. ఖాసాజనములబిల్చె బాలుతిమ్మరాజు
నగ నాణెము లున్నకారణమేమి నీటిపురుగులాకు
రాయలవారికి పిల్లలులేకా మొసళ్ళపెంచారు
నల్లమేకలా నాలుగువేలూ మేతలువేయించీ

అని చెప్పారు. ఈ ఘట్టంలో రాయలవారి పెంపుడు మొసళ్ళసంగతి చెప్ప బడింది. ఆ రాయలవారు కృష్ణదేవరాయలని జనసామాన్యంలో పుక్కిటిపురాణం ఉన్నట్లు మెకంజీదొరవారు సేకరించిన గాథల్లో ఉందట ! రాయలవారు పెను గొండలో అప్పుడప్పుడుండేవారనీ. వారి రాణులలో ఒకామె పాళెగార్లందరిలో అత్యంత సుందరుడైన బంగారు తిమ్మనాయుడిని మోహించిందనీ, విఫలమనో రథురాలై పగ తీర్చుకొనేటందుకు అతనిమీద రాయలవారితో కొండేలు చెప్పిం దనీ జనశ్రుతి. రాయలు ఆమాటలునమ్మి, తిమ్మనాయుడిమీద కోపంతో అతన్ని ముక్కలు, ముక్కలుగా నరికించాడట ! తిమ్మనాయుడిగోరీ ఇదిగోనని క్రిందటి శతాబ్దంవరకూ ఒకచోటు చూపించి జనం పరంపరగా చెప్పుకొనేవారట ! "యింటిని తిమ్మరాజుకథ. యింటిని యీర్లకథా ప్రసంగముల్...." అన్న చంద్ర శేఖర శతకంలోని వాక్యంకూడా ఈ కథా ప్రచార బాహుళ్యాన్ని సూచిస్తోంది. లోక వ్యాప్తమైఉన్న ఈ కథలో నిగ్గుదేల్చిఉన్న సత్యాన్ని వివరించవలసిన బాధ్యతని చరిత్రకారులు వహించాలి.

## (I) బంగారు తిమ్మరాజు కథ

ఈ కథ పెనుగొండను రాయలవారు ఏలుతున్ననాటిది. రాయలవారి అన్న దమ్ములు ఏడుగురు. విఠలరాజు, వీర్రాజు, కటకంరాజు, కళింగరాజు, రఘు

పతిరాజు, భూపతిరాజు, కూర్మరాజు అన్నవారేవారు. రాయలవారు పెనుగొండా బెల్లంకొండా యేలుతున్నారు. పదకొండుగురు పట్టపుదేవుల్ని పెళ్ళిళ్ళాడారు. కాని, ఒక్కరికీ సంతతిలేదు. కర్ణాట (సంగీత) భరత విద్యల్లో ప్రవీణ అయిన భోగంరంగసాని ఒకత్తెనుకూడా ఖామందుకుంచారు. ఆమెకి ఏడుమేడలు కట్టించిఇచ్చారు. దాని మేడలసొంపు ఎలా ఉందంటే-

సూనెబోసి యెత్తవచ్చును రంగసానిమేడా
పాలుదోసి యెత్తవచ్చును రంగసాని మహలు

అని జనులంతా అనేలావుంది. దానితమ్ముడు సవరపు నారప్ప. వాడు చాడీకోరు. కొండముచ్చు నారాయుడు. స్త్రీలను చెరబెట్టడము, పిల్లలనుచంపి వస్తువులను తీసుకోవడము, ఇళ్ళకు అగ్గిపెట్టడము, వాడు చేసేపనులు.

రఘుపతిరాజు శేషపట్నంఏలుతున్నాడు. శేషపట్నం, చెంగల్పట్టూఆయనవి. బంగారు తిమ్మరాజు ఆయన కుమారుడు. వరానబుట్టిన వరప్రసాది. రఘుపతిరాజూ ఆయనభార్య మేనయ్యగారూ, తిరుమలకొండమీద ఏడుసంవత్సరాలు నివాసంచేసి శిరస్సుకిందా, కాళ్ళపైకీఉంచి తపస్సుచేసి తిమ్మరాజుని కన్నారు. ఆ తర్వాత పూల రంగారావు, కృష్ణంరాజూ కలిగారు. శేషపట్నంలో శింహ్వాశగిరి తఖ్తుంది. ఆతఖ్తుమీద పూలరంగరావూ, వజ్రాలుగూర్చిన తఖ్తుమీద కృష్ణంరాజూ, బంగారు తఖ్తుమీద బంగారు తిమ్మరాజూ కూర్చుండి ప్రజల్ని పాలిస్తున్నారు. తండ్రితాతలు, మునిమనుమలు అంతాకలిసి వారంతా అయిదువందలమంది ఉన్నారు. నిత్య కల్యాణం పచ్చతోరణంగా వారు రాజ్యపాలనచేస్తూ స్వతంత్రంగా ఉన్నారు.

రఘుపతిరాజన్నా, బంగారు తిమ్మరాజన్నా సవరపు నారప్పకి మంట. దానికి కొంత పూర్వకథఉంది. నారప్పతండ్రి జవల గోవిందు, సూరత్తుగల కులంలో పుట్టాడు. రాయలవారి దివాను. రాయలవారతనిని ఒకసారి శేషపట్నం దస్తుకోసం పంపారు. గోవిందు రాకడికి కారణం అతని తంపులమారితనమేనని రాజులు ఊహించి.

కోటయివతలి సున్నపురాళ్లూ తీసికెళ్ళమనిరీ
బురుజుమీదిదీ ఆలికగడ్డి పట్టుకెళ్ళమనిరీ
డాలుకత్తిలో పైసాయున్నది తీసుకెళ్ళమనిరీ

మాటలుపడనూ గోవిందైనా ఒప్పినాడుకాదూ
గోవిందూని పట్టుకున్నటూ ముట్టడేసినాటూ
కోటవెలుపల నల్లరాతికే బరి నరికినారు

అంమచేత తండ్రిగారిని చంపిన పగలు తీర్చుకోవాలని నారప్ప తలపోశాడు. రఘుపతిరాజు కొడుకు బంగారు తిమ్మరాజుని ఎలాగైన యుక్తిచేసి, కొట్టి పగ తీర్చుకోవాలని నిశ్చయించాడు. నారప్ప తన అప్ప రంగసాని మేడకు వెళ్లాడు. తండ్రిగారిని చంపిన పగలు తీర్చుకొనేటందుకు ఆసరాకమ్మని కోరాడు. ఎలాగైనా తిమ్మరాజుని పెనుగొండకు పిలిపిస్తే తాను లడాయికల్పించి, చేసి, కొడతానని అంటాడు. రంగసానిలో ప్రతీకారవాంఛ పుట్టి రేకెత్తింది. ఇదెంతపని, అని

మద్దెల తాళం పట్టుకరారా తమ్ముడ నారప్ప

అని రాయలవారిని రంజింపడానికి నాట్యప్రదర్శనానికి హంగుచేయమంది. అప్పా, తమ్ముడూ ముస్తాబయారు. అప్ప రంగసాని-

నవరత్నాల పద్మములేసిన రవిక తొడిగినాదీ
బంగారంపు పూరీపువ్వులా చీరకట్టినాదీ
యేడువారపూ సొమ్ములైనా తానేపెట్టిండే
కాళ్ళకున్నైనా గజ్జెలుకట్టెను పెదబోగపుసాని

తమ్ముడు నారప్ప-

బంగారంపు గళ్ళరుమాలు తలకు జుట్టినాడు
భుజబందూలు, భుజములనిండా తానేకట్టాడు
పదివేళ్ళకు ఉంగరంబులూ తానేబెట్టాడు

ఇలా వారిద్దరూ అలంకరించుకొని రాయలవారి సభకేగారు. అక్కడ రంగసాని మోళీకట్టింది. ఆ మోళీకి—

నల్లగుండా కుమ్మరులనూ రాయలు పిలిపించె
నాలుగువందల పచ్చిబానలే సేగమెలనించె
బానమీదనే అరిటాకులు దొంతరగాపర్చి

ఆకుమీదనే వడ్లగింజలు వత్తుగానుబోసి
నూతిమీదనూ యేడుసూదులూ దొంతిబెట్టినాది.

ఆ తర్వాత మహారాజైన రాయలవారికి దండంబెట్టి.

యేడుగడియలూ ఒంటికాలితో నాట్యంఆడిండీ.
నాట్యంలాడే రంగసాని మొగ్గేవాలింది.

రంగసానిని మెచ్చి రాయలవారు.

కోరుకొనవే రంగసానిరొ వూళ్ళు కోరుకొనవే
తిరుపతినుండి శ్రీరంగందాకా జాగీరిస్తాను
గోలకొండా, చెన్నాపట్నం జాగీరిస్తాను.

అని వాగ్దానం చేశాడు. రంగసాని "అర్తివాళ్ళము. (అర్థులం. అరిపేద వాళ్ళము ?) మాకు మొఖాసాలూ, గుర్రాలూ, మిద్దెలూ, మేడలూ, జవాహిరీలూ ఎందుకు ? బంగారు తిమ్మరాజుని చూడాలనిఉంది. ఒకసారి పిలిపించండి" అని కోరింది. రాయలు రంగసాని ఉద్దేశాన్ని శంకించి ఘాతలమారివని నిందించాడు. మరోకోరిక కోరుకొమ్మంటాడు. రంగసాని తనకి-

భూమిదేవితో, ఆకాశంతో, వొట్టువున్నదండీ
తల్లిదండ్రితో, తమ్ముడిపైనా వొట్టువున్నదండీ
సవతులపైనా దేవుడిపైనా వొట్టువున్నదండీ.

అని చెప్పి పట్టుపట్టింది. మహారాజు తిమ్మరాజుకి వెంటనే ఇలా జాబులు రాశాడు-

పద్దెనిమిదికోటల పరగణాలు నేనేలుతున్ననయ్యో
ఆరుకోటలా పెనుగొండాకు పట్నంకడతాను;
పెనుగొండా పట్నముకైనా పెళ్ళికొడుకుచేతు;
పైనములయ్యా పెనుగొండకూ బేగినిరావాలి;
పదకొండుగురూ పెద్దతల్లులూ చూదాలంటారు
చూడవలెవనీ పెద్దతల్లులకు భ్రాంతులు కలిగాయి
యెనిమిదోనాటికి తిరుపతిలోనూ పాదములుంచాలి

ఆ జాబున్ని వేగిరావులచేత పంపించారు. వారుకూడా పెద్దాడ, మొగుప తిరుపతి, శివకంచి, అనంతగిరి, మంగపట్నం అనేచోట్ల మజిలీలుచూసి, పేష పట్నంచేరి రాయలవారి ఫర్మానాలు తిమ్మరాజుకి అందించారు.

రాయలవారి ఫర్మానాలందుకోగానే తిమ్మరాజు ప్రయాణభేరీ వేయించాడు. తలిదండ్రులను సెలవు అడిగాడు. భార్య మాణిక్యదేవికడకు సెలవుపొందేటందుకు వెడదామనుకున్నాడు. ముందుగా ఆమెదగ్గరకి వేటి కుదుర్చుకొనిరమ్మని తన పాలతల్లి పల్లెరమణమ్మని పంపాడు. వీరందరూ ఏకవాక్యంగా-

"వద్దు, వద్దు పెనుగొండ ప్రయాణం" అనీ
వాడీకోరులు వున్నారయ్యా, పెనుగొండలోను,
ఝూటాకోరులు వున్నారయ్యా, పెనుగొండలోను,

అని చెప్పి వెనక్కి లాగజూచారు. ప్రయాణభేరీలో అపశబ్దం మ్రోగింది. జెండాకొయ్య విరిగిపడింది. మదపుటేనుగు నాలుగో గేటుదగ్గరకు చేరేసరికి కూలి పడింది. గుర్రం సింహద్వారం దగ్గరకు వచ్చేసరికి చచ్చింది. మాణిక్యదేవి ఈ ప్రయాణం వార్తను వినేసరికి, ఆమె-

నుదుటనుఉన్నా కుంకుమబొట్టూ నేలనువ్రాలింది
కాలినిఉన్నా వెండిమట్టెలు బద్దలు అయినాయి
చేతినిఉన్నా గాజులుఅన్నీ చిట్లిపోయినాయి.

ఇక శకునాలుచూస్తే "యుద్ధమనీ, మరణమనీ" వచ్చింది. తిమ్మరాజు చలించలేదు. "వెళ్ళకమానను, వెళ్ళకమానను పెనుగొండాకు'' అనినిశ్చయించి "బ్రతికే బ్రతుకూ సమ్మతిలేదా"అనీ," రాజ్యసంపదా వస్తేమీరూ కండ్లజూడలేరా" అనీ "దీవెన ఈయుడి, దీవెన ఈయుడి"అని అందరిదగ్గరా సెలవులు కోరాడు. వారందరూకూడా ఏకవాక్యంగా-

దండం, దండం, దండం, నీకూ తిరుపతి వెంకన్నా!
వరానబుట్టిన వరప్రసాదీ పెనుగొండొస్తాడూ
వెన్నుదగిలీ వెంటనుండుమీ తిరుపతి వెంకన్నా!
దండం, దండం, దండం, నీకూ అలమేల్మంగమ్మా!

వరానబుట్టిన బంపబ్రసాదీ పెనుగొండకొస్తాడు
వెన్నుతగిలీ వెంటనుండుమీ అలమేల్మంగమ్మా!

అని తమతమ కులదైవతాన్ని ప్రార్థించి సెలవులు ఇచ్చారు. ఇలా పేరు పేరు వరుసలా సెలవులు తీసుకోవడం, వారు సెలవులియ్యడం పదకర్త వివరంగా వర్ణించాడు. ఈ పట్టుల్లో వాక్యాలు పదేపదే అనువృత్తం కావడం కథా సరణికిసొంపునీ, శ్రోతలకి ముందు జరగబోయేదేమిటిఅని ఎదురుచూసే ఉత్సాహాన్నీ కలిగిస్తాయి. ఎన్ని అడ్డంకులుపచ్చినా, ఎన్ని అపశకునాలు కలిగినా నాయకుడు పెనుతీయకపోవడము అతనిమీద ప్రజలకి అభిమానం ఎక్కువమేటందుకూ, అతని కష్టాలుచూస్తే జాలి యెక్కువయేటందుకూ కారణం అవుతాయి. విశిష్ట జానపద రచనలన్నింటిలోనూ ఈ లక్షణం గోచరిస్తోంది. బంగారు తిమ్మరాజు కథలో అది పరిణతి జెందింది.

తిమ్మరాజు హాస్సేన్, హుస్సేన్ అనే కొలువులోని తురుష్కబిడ్డలతోటీ తనమంది బలగంతోటీ, పెనుగొండకి పయనమైనాడు, దారిలో అనంతపట్నం మజిలీలో మామ అయ్యపరాజు వీరిని కలిశాడు. శివకంచిలో కామాక్షినీ, విష్ణు కంచిలో వరదరాజునీ, పెదతిరుపతిలో వెంకటస్రమణునీ రాజులు సేవిస్తారు. అన్నిచోట్లా-

"నల్లరాళ్ళకూ దండంబెడితే ఫలమేమిటి"

అని ఆదైవాలు ఏనరు సాక్షాత్కరించాలని హఠం చేస్తాడు. పన్నెండేళ్ళ బ్రాహ్మణ బాలికలాగ కామాక్షీ, నంబివారి బాలునిలాప రదరాజూ, ప్రత్యక్షమై,

పగటి యుద్ధముకు పరవాలేదు ఓయి తిమ్మరాజా!
మాపటివేళను గుళ్ళనుందుమూ మేమురాము రాజా!

అని పలాలిచ్చారు. కామాక్షమ్మ,

యెచ్చట కష్టంకలిగితె రాజా అప్పుడు దలచూయి
అకాశమూ విరిగీపడితే అడ్డంపడుతాను.

అని భరోసా ఇచ్చింది. ఇక వెంకటస్రమణు మన తిమ్మరాజు దృష్టిలో వెంకటరెడ్డి: ప్రత్యక్షం కాకుండా జాలంచేసిన ఆదైవాన్నికూడా "నరుకుదు నిన్ను

నాలుగు ముక్కలుగా'' అనీ, నిన్నుచంపి నే చస్తుననీ, గడగడ వణకించాడు. దేవతలమీదకూడా ఇంత అధికారం చెలాయించిన భక్తుల్ని మనం ఏ వాఙ్మయం లోనూ, ఏనాటా కానబోము. ఇలాంటివి దేవతలతో ఆత్మీయత సాధించిన తెలుగు జానపద వాఙ్మయంలో మాత్రమే ప్రత్యక్షమవడం జరుగుతోంది.

తిమ్మరాజాదులు పెనుగొండ చేరారు. రాయలవారు ఎదురుభేటీకి బైలు దేరబోతున్నారు. అప్పుడు వేశాడు నవరం నారప్ప ఒక మడతపేచీ. "తక్కువ వారి భేటీకి మీరు వెళ్ళుట తగవుకాదు, సెలవయితే నేనేవెళ్ళి వారిని తోడుకు వస్తాను ? '' అని సన్నాయినొక్కులు నొక్కుతూ ఇచ్చకాలాడాడు. రాయలువారు కొడుకు తండ్రులకు యెక్కువ తక్కువలేమిటి అంటూనే "బావ'' మాటలకు పొంగిపోయి, హవుదా వేసిన ఏనుగుపై అతనినే ఎక్కించి ఎదుర్కోలుకి పంపాడు.

నారప్ప వేసిన పాచిక పారింది. తిమ్మరాజుకి దొంగజాబులు బనాయిం చాడు. అందుచేత రాజపుత్రులు రాయలవారే వస్తున్నారనుకొని ఎదుర్కొన్నారు.

పల్లకిదండె చేతబట్టుకూ, కూడానడిచారు,
వంగి, వంగి, సలాములెన్నో వారుచేసినారు.

ఇవన్నీ చూసి మీసాలలో నవ్వు నావుచేసుకొంటూ.

కోరచూపులే చూచాడయ్యా ఆ సంకరకొడుకూ,
కారుమాటలే పలికాడయ్యా ఆ సంకరకొడుకు.

నారప్ప మాటల వైఖరితో రాజులు ఆగ్రహావేశపరులైనారు. "ఏలవస్తివీ, యెందుకొస్తివీ, యెవడవురానీవు" అని నిగ్గదీశారు. నారప్ప "సర్దారైన గోపిం దూకి, కొడుకునంటు అనెను'' రాజుకి నారప్పకుట్ర తెలిసింది. వాడు చేసిన అప మానానికి ఉగ్రులై యేనుగు హవుదావిరిచి, ఏటగలిపి, వాడిని మైనంముద్దలా మర్దించి వదిలారు. చావుతప్పి నారప్ప రాయలవారితో కార్యములన్నీ, గడ్డలైన వనిచెప్పి, పూర్వంనుంచీవున్న పగలు వివరించి చెప్పాడు. ఆకొండేలమారి మ్మాటలకు రాయలు కోపపడి, తలారులను పిలిపించి, నారప్పకు సంకెళ్ళు వేయించి, తానే యెదురుబేటీకి వెళ్ళాడు.

తిమ్మరాజు రాయలవారికీ వారి సైన్యానికే "వెంకమ్మెర్తిడ్డి''నీ, అన్నపూర్ణనీ తలచి పంటచేయించి విందుచేశాడు. ఆ విందులో.

అన్నం, పప్పూ చేతబట్టేనూ కంచీకామాక్షీ
పప్పు, కూరలూ పిండివంటలతో వడ్డించినదయ్యా
నేతివడ్డనా, పెరుగువడ్డనా వెంకన్నే జేసే
పాలవర్షమూ కురిపించైనా ఆకులుతీయించె.

శ్యావిందుచూసి అంతా "నరుడుకాదు నారాయణమూర్తి, బాలతిమ్మరాజు" అనుకున్నారు. తర్వాత అంతా రాత్రిపూటకి పెనుగొండ వెళ్ళారు. రాజపుత్రులు పన్నెండామడ పట్నంచూశారు. పట్నంఅంతా తిరిగి మహాలుకెళ్ళారు. కోటవెలుపల ఖైదులో నారప్ప ఉన్నాడు. అది రంగసాని మనసులో మెదులుతోఉంది. రాజులజాడలు జూచింది, పట్నంఅంతా శృంగారింపబడి మనోహరంగాఉంది. కాని, రంగసానిమాత్రిం.

ఇంటదీపమూ, కంటికాటుకా పెట్టాలేదయ్యా
తెల్లవస్త్రమూ, నల్లనికురులూ ముడువలేదయ్యా
తల్లిజచ్చినా శోకంపలెను ఏడుస్తున్నాది.

రాయలువారు దానింటికెళ్ళి ఏమే రంగసానీ ఎందుకిలా కోపంగా ఉన్నావంటే తిమ్మరాజు తన అంతఃపుర ద్రోహం తలపెట్టాడని చిత్రింగిలినం చూపెంచితిమ్మరాజుని చంపెంచమంది నారప్ప నిద్రాముద్రితుడై నరాజు తలమెకమూ నిస్తానని ముందుకు వస్తాడు. రాయలు భోగందాని కపటం గ్రిహించాడు. విసిగి రాయకష్టములతో మా కేమిటికి కాశికి పోతాముఅని ప్రయాణమైనాడు. వెళ్ళేముందు నపరం నారయ్యను కోటవెలుపలా బలిగొట్టండిఅని తలారులకాజ్ఞ యిచ్చాడు. అంతటితో నారయ్యకథ ముగియవలసిందే. కాని, వాడు తలార్లకి లంచాలిచ్చి తప్పించుకున్నాడు. గొర్రెపోతుని నరికించి గుర్తులు చూపెంచమన్నాడు. రాయలవారదిచూసి పీడవదలిందని ఆరుకోటల పెనుగొండరాజ్యం ఇంక బాగుపడుతుందని కాశీకి వెళ్ళాడు.

రాయలవారు కాశీకెళ్ళాక. నారప్ప మూరుదాటిని అక్కడ నగరికి వెళ్ళాడు. ఆమెని తిమ్మరాజుమీదికి ఉసిగొల్పాడు పన్నెండువేల సైన్యంతో రంగసాని తిమ్మ

రాజుమీదికి వంటెత్తింది. తిమ్మరాజుకి స్త్రీహత్యాపాతకం తగలుతుందని, అతని పాలకతల్లి పల్లెపు రమణమ్మ రంగసానికి ఎదురుపోటీగా సేనల్ని నడిపింది. రమణమ్మ యుద్ధాన్ని కవి ఎలా వర్ణించాడో చూడండి.

చెక్కీ, బాగూ రొడిగించయ్యా పల్లెపు రమణమ్మా:
పురుషవేషమే వేసినదయ్యా పల్లెపు రమణమ్మా:
డాలు, కత్తులూ చేతపుట్టెను పల్లెపు రమణమ్మా:
మేఘరంజి గుర్రముసెక్కెను పల్లెపు రమణమ్మా:
ఆరువేలనూ గడియలోపలా నిలుపున నరికిందీ:
యేనుగులాను, గుర్రములాను, వేలకొద్దినరికే
పడ్డ సైన్యమునుజూచి సానీ పరుగులు పెట్టింది
యింటికివెళ్ళి రంగసానీ సేనతోవచ్చింది
స్త్రీవేషముతో యుద్ధముచేసెను పల్లెపు రమణమ్మా
ముక్కముక్కలుగ నరికిందయ్యా సానివానిదండు
రమణమ్మా కట్టినబట్ట కాళ్ళల్లోపడెను
రమణనిజూచీ వేసెబల్లెమూ ఆ రంగసాని
పరుగుపరుగున వచ్చాడయ్యా తిమ్మరాజుజూడ
రక్తవరదలూజూచి రాజు గోలపెట్టినాడు
బాలుడనిన్నూ పెంచినందుకే బల్లెముతియ్యాలి:
గాయముమాన్పి కుదురుపరతునే తల్లీరమణమ్మా:
వెర్రిబుద్ధా ప్రాణంలనాదీ యెంగిలిజీవమురా:
నీచేతులతో దహనంచెయ్యి నాముద్దులకొడకా

రమణమ్మ మరణించిన తర్వాత తిమ్మరాజు "ఆడదానితో యుద్ధంచేస్తే అసురయుద్ధమగును" అని రంగసానిని మాయచేత సాధింతామని, పుక్కపలల్ని మాటొగ్గి పట్టుకున్నాడు. పట్టుబడిన రంగసానికి అభయంఇచ్చి, శేషుపట్నం రమ్మనీ, తల్లిలా మన్నిస్తాననీ చెప్పాడు. రంగసానికి ఆమాటలు రుచించలేదు. సిగ్గువిడిచి.

కాలంలోనూ వున్నానయ్యా: కాంతలందరికీ
అందులోనూ.

వావివరుసలూ బోగంవాళ్ళకు తలపనేటికయ్యా
పట్టపుదేవిగ నన్నుంచితె నేనువస్తానయ్యా

అని తన దుశ్చింతని వెల్లడించింది. ఆఅష్టపు మాటలకీ, దాని పాపచింత వలనూ, ఆడదని దయ జూడవలసిన పనిలేదని తిమ్మరాజు మరణశిక్ష విధించాడు. నారప్ప కడసారిగా మళ్ళీ నాలుగు నేలదండు కూర్చుకొని ఫిరంగీలతో, తుపాకీలతో, మందుగుండుతో తిమ్మరాజుమీదికి వచ్చాడు. కాని, ఆ యుద్ధంలో ఆ సైన్యం నశించింది. నారప్ప రాజుచేతికి చిక్కాడు. దాచిన మూలధనం చూపించవలసిందనీ రాజులు నారప్పని వేధించారు. నారప్ప తానుదాచిన ధనమున్న దిగుడుబావిని చూపించి నరుణ్ని బలియిచ్చి ధనలక్ష్మిని తీసుకొమ్మన్నాడు. నీవు సామంతుడవు: అందుచేత శక్తి ప్రీతిగా నిన్నే బలియిస్తాము; అని నారప్పని రాజులు బలివేశారు. ఆ ధనాన్ని తీసుకొని ఏనుగులమీదా, లొట్టియలమీదా పెనుగొండలో కాసుకూడా లేకుండా కట్టించి తిమ్మరాజు తిరుగుప్రయాణం అయాడు.

తిమ్మరాజుకి కొత్త బెడద వచ్చింది. చేజిక్కిన సొమ్ములో బావ మేఘపురాజు తనకి భాగం పెట్టమన్నాడు. తిమ్మరాజుకి అది నచ్చలేదు-

అన్యాయంపు సొమ్ముసకేమి జయముకాదు బావా
వెంకట్రమణకు నగలుజేశమూ ఓయీబావయ్యా

అన్నాడు. మేఘపురాజు కిదినచ్చలేదు—

దేవుడితోనూ, పైనాలతోనూ, నాకేపనిలేదు;
పైకంయిచ్చి, సమ్ముపంపుమీ, ఓయి బావగారూ !

అంటూ రాయబారాలు సాగించాడు. ఒకవైపున ఇలాగంటూ, కాశీదేశము రాయలవారికి జాబులువ్రాశాడు. అందులో, తిమ్మరాజు—

పెనుగొండా పట్నపుధనము కొల్లగొట్టినాడు
నీవుపంచినా రంగసానినీ తానేవుంచాడూ
వెంకటేశునికి నీధనమెల్లా వేలకొలదియిచ్చె.

అని లేనిపోనివి కల్పించి రాయలకి ఉడుకెత్తేలా చేశాడు. ఈ జాబులు చూడగానే, రాయలవారి మనసు విరిగింది. తిమ్మరా[illegible]

మటుమాయమయాయి. “ తల్లి పావనీ తలచవైతివి నా ముద్దుంగొడుకా ” అని వాపోయారు. తిమ్మరాజుని శిక్షించాలని నిశ్చయించారు. యింటిపైపం పంగి నాఘని తలిచారు. కాశీనుంచి దండుతో శీఘ్రగమనంతోవచ్చి మళ్ళి మొగ్గై పోతున్న తిమ్మరాజుని పెద్దతిరుపతిదగ్గర ఎదుర్కొన్నారు.

రాయలవారికీ, తిమ్మరాజుకీ యుద్ధం జరిగింది. తిమ్మరాజు బాణందెబ్బ తగిలి హతుడయ్యాడు. ఐనా, రాయలవారి కోపం తీరలేదు. రాజు శవాన్ని బండిమీదెక్కించి పట్నమంతా త్రిప్పారు. ప్రజలు విచారపరీత మనస్కులై-

పుణ్యాత్ముడినీ చంపించాడు ఆరాయలవారూ:
మేఘపురాజు చెప్పుడుమాటలు చాలావిన్నాడు:
అన్యాయంగా ముద్దులసుతునీ హడలచంపినారు

అంటూ ఆనోటా, ఆనోటా చెప్పుకొన్నారు. ఈమాటల్ని విని రాయలు పశ్చాత్తాపతప్తుడై వాడి కైజారుతో మేఘపురాజును ఒక వేటువేసి చంపాడు. తిమ్మరాజు లేకపోయినతర్వాత మా కెందుకీ లోకమని పినతండ్రులూ, బలగమూ తమ్ముతాము పొడుచుకు చచ్చారు. తిమ్మరాజు భార్య మాణిక్యదేవి ఈ వార్తలు విని మహలులో పొడుచుకు చచ్చింది. ఇంతపాపం కట్టుకొన్న విచారంవల్ల రాయలు విరాగియై శ్రీరంగం చేరుకున్నారు.

తిమ్మరాజు వెంకటేశ్వరునితో ఐక్యం అయాడు. మాణిక్యదేవి కంచి కామాక్షమ్మలో కలిసింది. తిమ్మరాజు ఆప్తమిత్రులు హుస్సేన్, హుస్సేన్ లు పెనుగొండలో పీర్లుఅయి వెలిశారు. శేషపట్నంలో కృష్ణంరాజూ, పెనుగొండలో పూల రంగారావూ పరిపాలించసాగారు.

## (II) ఆరు * మరాటీల కథ

పత్తికొండ తాలూకాలో మరాటీలు పన్నెండుకోటలు కట్టుకొని దొరలై ఏలుతూండేవారు. అందులో భాయిఫజేరావు ఒకడు. అతనికి నారాయణరావు, సిద్ధోజీరావు, కంఠేరాయుడు అనే ముగ్గురు కొడుకులున్నారు. తండ్రి అనంత

* (అరెకాపులు)

రము ఈ దాయాదులు భాగాలు పంచుకున్నారు. నారాయణరావు అన్నీ పంచాడు; కాని వేటకుక్కల్ని పంచమనేటప్పటికి-

మీరు కుక్కలపేరు యెత్తితే సై
ఆడవకుండ గొంతులు కోసేను సై

అని బెదిరించాడు. పెంపుడు కుక్కలంటే మరాటీలకెంత ప్రీతియో దీన్ని బట్టి తెలుస్తోంది. ధనాన్నైనా తృణప్రాయంగా భావిస్తారు. కాని, ప్రాణముండగా తమకి విశ్వాసపాత్రములైన కుక్కల్ని ఇతరుల కియ్యరు. వేటకుక్కల పంపకములో కలిగిన పగ, దాయాదిపగలూ అటపై యేండ్లపాటు రగిలింది. అందులో వెలిగిన ఒక స్ఫులింగమే ఆరుమరాటీల కథ.

సిద్దోజీరావూ, కంటేరాయుడూ వారివారి దేశాలేలేటందుకు వెళ్ళిపోయారు. వారికి సంతులేదు. నారాయణరావుకి ముగ్గురు సంతానం పెద్దవాడు సోమోజీ, రెండోవాడు చెవులపోగు ఫిరోజీ, మూడోవాడు చేతుల కడియాల సుబందిరావు. పెద్దవాడికి పడమటి దేశాన్నుంచి బంగిసింగిరావు కూతుర్నితెచ్చి పెండ్లిచేశాడు. అతనికో కొడుకు పుట్టాడు. వీరంతా ఇలాగుండగా పాపిష్టికరువు వచ్చింది. సోమోజీ తాత భజేరావు చచ్చిపోయాడు. తండ్రి నారాయణరావూ, అక్క రుక్మిణి, చెల్లెలు జగ్గాబాయికూడా కరువు బాధవల్ల చనిపోయారు. కష్టకాలంలో పినతండ్రి పట్నానికిపోతే లాయఖని అన్నదమ్ములు నిశ్చయించారు. బడే గాము పట్నానికి జాబు రాశాడు.

మన మరాటీల పినతండ్రి సిద్దోజీకి జాబులు చేరాయి. జాలిపడేటందుకు బదులు, పాతపగలు తీర్చుకోవడాని కిది అదను అనుకున్నాడు. వచ్చిన ఉత్తరం ఎడమచేత అందుకున్నాడు. అన్నకొడుకులు నలుగుర్నీ, నాలుగుదోవలు చెయ్యాలనుకున్నాడు. అరవైవేల దండు కట్టుకొనివచ్చి కరజకండిలో డేరాలు వేశాడు. అన్నకొడుకుల్ని పిలపనంపి చావిడి స్తంభాలకు విరిచి కట్టించాడు.

వాండ్లపట్నమంత కొల్లపెటెరా సై
కోటవాండ్లను కొల్లగొట్టె సై
వాండ్ల రంగుదేవిడీ కొల్లగొట్టె సై
వాండ్ల రాజవీధి కొల్లగొట్టె సై

ముంగరలు, ముక్కుపోగులు సై
ఉంగరాలు, ముక్కుపోగులు సై
మూడుబండ్ల బరువుగట్టి సై
అక్కడి వెండి బంగారము సై
వాండ్లు యేనుగుల బరువులుగట్టి సై
వాండ్లను యోగూలజేసేను సై
సిద్ధోజీ వాండ్ల జోగూలజేసెను సై

ఇలా ఊరంతా కొల్లగొట్టి పోతూంటే,

మేము యెట్లుబోదుము పిన్నయ్యా హరిహరి
మేము యెవ్వరిచేటికి పోదుము హరిహరి
సేద్యముజేయ చేతకాదురా హరిహరి
మాకు మడకదున్నా చేతకాదురా హరిహరి

అని వాపోయారు. సిద్ధోజీవారికి ఒకయేనుగు, ఒకబంటె, ఒక బయిల్ గాడీ, బండీ, రెండు నరాత్రివుల గిత్తల్నీ, ఒకరోజుకి సరిపోయే బత్తెంమాత్రం దయదలచి వదిలాడు.

కొల్లబోయిన పట్నం పాడుపడింది. అన్నదమ్ములు అడవిపాలయారు, గొల్లపల్లె దోవపట్టారు. అక్కడి అయిదిళ్ళ గొల్లవారి పొడుగున నిలిచారు. ఒక సారి ఫిరోజిరాయడు అడివికి నేటకెళ్ళాడు. పాలకొండ పడమటిభాగంలో కల బాయిదగ్గర కుందేళ్ళు, అతని వేటకుక్కల్ని ఎదిరించాయి. ఆభూమి గట్టిదని తలచి కొత్త కరిణకల్లు కట్టాలనుకున్నారు. తినబోతే రూకలేదే ఏంబెట్టి కోట కట్టేదని పరిపరివిధాల యోచనచేయగా సుబందిరావు ఇలా అన్నాడు. "కొల్లబో యిన మన కోటలోఉన్న ఎల్లమ్మ దేవాలయంలో యేడుకోట్ల ధనముంది. అది తెచ్చి కోట కడదాము." వెంటనే అంతా—

వోరుగంటి యెల్లమ్మ దండమే సై
ఓసుకోటి యెల్లమ్మ దండమే సై
వోరుగంటి దేవుడా దండమూ సై

ఇంటిదేవుడా దండమూ సై
కామాంకా సేకుదండమూ సై

అంటూ వేడుకొంటూ, కావలసిన ధనం కోరికితే కోటలు పేటలుకట్టి, యెల్లమ్మ దేవళంకట్టి, దేవళానికి బంగారు రేకులతో మలామా చెయ్యాలనీ, నిశ్చయించారు. వెండి గరుడస్తంభం ఎత్తించాలనుకున్నారు. ఈ అన్నదమ్ములకి యెల్లమ్మ ధనంచిక్కింది. కోటలు, పేటలు లేచాయి. మా పట్నం చేరినవారు, యేడుయేండ్లు ఏ హద్దు పన్నులు యివ్వనక్కరలేదన్నారు. యెవరువచ్చి ఏ మేడ జేరితే ఆ మేడలు వారివన్నారు. దేశదేశాలా ఈ కబురు మోగింది. పట్నం పూసైంది. రైతులు బలవంతులైనారు. బందరుదేశాన్నుంచి ఆరువేల దండుతో బోగంసుందరి కదిలివచ్చింది. మరాటీలు పుంజుకొన్నారు. పగలుచూచిన పట్నం మల్లె పూచినట్లూ, రేయిచూచిన పట్నం రేలపూచినట్లుగానూ ఉంది.

తిరిగి తేరుకున్న మరాటీలకి పాతపగలు మనసుకి వచ్చాయి, తమదేశం తమకిమ్మని పినతండ్రిని అడగాలనీ—

దాదావారు ఎవ్వరికి తండ్రి సై
మనం ఘట్టిపోరలో చెయ్యివేతాము సై
మనము రొమ్ముమీద కాళ్ళుపెడతాము సై
తిరగవేసి గొంతుని గోతాము సై
వాడి బడేగాము పాడుచేతాము సై

అనీ, నిశ్చయించుకున్నారు. అక్కడ సిద్ధోజిగుర్రం వీరి నిశ్చయాన్ని పసిగట్టింది. అది పగబట్టింది. గుర్రపు భాషలు తెలిసిన యెల్లుగాడు, మరాటీల పగల రీతులు వివరించాడు. సిద్ధోజి మొదట నమ్మలేదు. కాని తర్వాత నమ్మి తానే ముందు దెబ్బతీయాలని తీర్మానించాడు, చెంచెగాడినీ, మండెగాడినీ, గిరజాల గిరుమోజిగాడినీ, మంత్రాల మహిమగాడినీ, వాళ్ళందరికీ పెద్దయిన ఆనరాలు దొంగనీ పిలవనంపాడు, వారితో తన అన్నకొడుకుల శిరస్సులుతెచ్చి పగతీరిస్తే, ఒంటెబరువు పైకం ఇస్తానని చెప్పి వారికి ఆశ గొలిపాడు.

•

యుక్తి పన్ని, దొంగలు సోమోజీ కోటలో ప్రవేశించారు. రాత్రి సోమోజీ ఒంటిగా కోటలోకి బహిర్భూమికి రావడంచూసి, మీదపడ్డారు. సోమోజీ సమయం

తప్పిపచ్చిందని గ్రహించి, చెంటే డాలుగా, చేరులే కత్తులుగా, ఆ బిడుగుపు దొంగల్ని ఎదిరించాడు. ఒకరిమీద ఒకర్ని వేశాడు. బొట్లో వాకలో గిరింగల గిరుమోజీ కొంకరాలు కోసాడు. కోటలోకి ఎగిరి దూకాడు. సాగా వెనక్కి తోటలోకి పడింది. ప్రాణంపోయినా మేలుగాని, మానా పోయింది కాని, అని భావించి వెనక్కివచ్చి, మళ్ళీ దొంగలతో కలహపుమైనాడు. మంత్రాల మహాను గాడు విభూతి చల్లాడు, సోమోజీ దానితో కాళ్ళు, చేతులు పట్టుంపప్పి వారికి చిక్కాడు. వారితనిని పురిడీసి, గొంతుకోసి, తల తీసుకొని పోయారు.

చనిపోయిన సోమోజీప్రాణం బంగారుచిలకై స్వప్నంలో భార్యకి. పట్టుడు ఫిరోజ్‌కీ జరిగిన సంగతులు చెప్పింది. ఫిరోజ్ ఉలిక్కిపడి, సోమోజిని వెతకి దేహాన్నిచూసి, కుక్కల్ని ఉసిగొల్పి దొంగలను వెంటాడించాడు. దొంగలకీ, కుక్కలకీ ఘోరయుద్ధం జరిగింది. దొంగల గొంతుల్ని కుక్కలు కరకరమంటూ నమిలాయి. తర్వాత ఫిరోజ్ సోమోజి శిరస్సునితెచ్చి, గంధపుష్పాలతో అలంక రించి దహనం చేశాడు. అన్న అనంతరం ఫిరోజ్ కరడికల్లు రాజ్యాన్ని పాలించాడు.

ఈ కథలో కవి మరాటీలదండు దాడుల్ని, మరాటీల దాయాది పగల్ని, గుర్రాలూ, కుక్కలూ చూపించే విశ్వాసాన్ని, తెలివితేటల్ని చక్కగా చిత్రిం చాడు, దేశాన్ని దోచుకొన్న మరాటీదండులే క్రమంగా మన దేశంలో స్థిరపడి ఆరెకాపులయారేమోనని అనుకుంటున్నాను. ఇందులోఉన్న కథ మూడుమరాటీలదే, అందుచేత దీన్ని అరుమరాటీల కథ అనడంకంటె ఆరెమరాటీల కథ అనడం సబబేమో అనిపిస్తోంది.

## (III) దేశింగురాజు కథ

1713 లో చెంజీరాజ్యాన్ని పాలించిన దేశింగురాజుకథ, పారాహజారి గుర్రాన్ని గురించిన ఒక అభూత కల్పనతో, జనసామాన్యంలో ప్రచారంలో ఉంది. ఇది చరిత్రాత్మకమైన వీరగాథ. మహబత్‌ఖానుడికీ, దేశింగురాజుకీఉన్న అన్యోన్యం హిందూ మహమ్మదీయ సఖ్యానికి నిదర్శనంగా, ఆదర్శప్రాయమైంది. వారిద్దరూ చేయీచేయీకలిపి ఫరంగీలనీ, వారి చెప్పుచేతల్లోని ఆర్కాటు నవాబునీ, ఎదిరించారు. దేశభక్తి ప్రేరకమైనవారి చేతలు జానపద కవుల నాకర్షించాయనడంలో వింతలేదు. కవి నెల్లూర్పురవాసి, ఆతని పేరు మనకి తెలియదు. పాతకథా

కథనపద్ధతి ననుసరించి దేశింగురాజుకథని నారదుడు దేవేంద్రుడికి చెప్పినట్లుగా రచించాడు. ఇందులోకూడా జానపద కవుల రచనలన్నింటిలోనూ కన్పించేమాట సూటిదనమూ, సరళ పద పై చిత్రి అంతటా కన్పిస్తాయి. అనువు చిక్కినప్పుడు అర్థాంతరన్యాసాలంకారాన్ని గుప్పెత్తుతూ, కవి ప్రబోధం చెయ్యడంకూడా జానపద కథా వాఙ్మయంలో విరివిగావుంది. దేశింగురాజు వీరగాథలో ఇది పరిమితంగా వాడబడింది.

భువిలో మేఖైయారు దేశాల్లోనూ, "హైదరాబాదు పురమనే గోల్కొండ"ని ఢిల్లీపాదుషా యేలుతున్నాడు. మంత్ర తంత్రాలు తెలిసి సిద్ధుడైన గోగుఫకీరు పారాహజారిఅనే ఒక పొగరుమోతు గుర్రాన్ని తెచ్చి పాదుషాకు బహూకరించాడు. మేఘమండలంలోపోయే ఆ గుర్రాన్ని ఫకీరు మంత్రబలంవల్ల వశం చేసుకున్నాడు—

"తొమ్మిది మేఘములొక్క గస్తన. తొవిబడ జేసినది
ఇమ్మహిగలుగు సముద్రములెల్లను ఇట ఘోషించినవో,
అనేలా నడుస్తుంది ఆ దివ్యహయం"

అని దాని మహిమాతిశయాన్ని పాదుషావారి దివాంజీ రాజలింగబాబు వర్ణించాడు. అలాంటి ఉత్తమాశ్వం తన లాయంలో ఉండాలని పాదుషా నిశ్చయించి, ఫకీరికి ధనం బహూకరించి ఆ గుర్రాన్ని తీసుకున్నాడు. అది ఎవరికీ లొంగదు. నవాబు వెంటనే తన పాళెగాండ్రందరికీ పారాహజారిని స్వారి చేసినవారికి ఎక్కువైన బహుమతులిస్తానని కబురు చేశాడు.

చెంజికోటని ఏలే ధరణిసింగురాజు ఈవార్త విన్నాడు. అతనికి శూరసింగు, ధరణిసింగులనే వారిద్దరు కొడుకులు. వారు సాటిలేని వీరులు. వారికి కూడా రాజలింగబాబు పెద్దకరిణం రంగపిళ్ళచే రాయించిన జాబులు చేరాయి. ఆజాబులు హర్కార్ పాపయ్య, తపాల్‌మార్గంగా వేగం తీసుకెళ్ళి, సలాంచేసి శూరసింగుకి నిండుకొలువులో ఇచ్చాడు. జాబులుచూసి శూరసింగూ, ధరణిసింగూ ఢిల్లీకి ప్రయాణమైనారు. శూరసింగు అంతఃపురంలోకి సెలవుకోసం వెళ్లాడు. శూరసింగుభార్య రాంభాయికి ప్రసవ సమయం. ఆమె చింతనొంది తన నాథుని ఢిల్లీకి వెళ్ళవద్దంటుంది. కాని, శూరసింగు కలకలనవ్వి, నీకేంలక్కువ దాదుల తోటి భద్రంగా ఉండమని సెలవు తీసుకొని వెళ్ళాడు. ఢిల్లీపాదుషా పాళెగాండ్ల నందరినీ గౌరవించి—

వినుడో దేశాధీశులార యొక వివరము నిప్పుడును
పనివడి మిము పిలిపించిన కార్యము బాగుగదెల్పెదము
దేవలోక గుఱ్ఱంబొకటిక్కడ తేజరిల్లుచుండు
ఈ వసుధనుగల గుర్రంబులలో నిది యెక్కువైనదండీ
ఉన్నవారు దీన్నెక్కినవారికి వుచితంబుగ నిపుడు
మన్ననచేసి వారిపాళెమును మఱియిచ్చెదనేడు
కొన్నియినాములతో డనువారికి గుర్రము నిచ్చెదను.

లేకపోతే ఢిల్లీలో ఖైదుచేసి ఐదుసంవత్సరాలకొకసారి ఇంటికి ఉత్తరం రాసుకొనేటందుకు అనుజ్ఞ నిస్తానంటాడు. వచ్చిన రాజులంతా—

అచ్చట బారాహజారి గనుగొని అతిభీకరముగను
అంతట బారాహజారి గర్జిలనట్టె దిగులుజెంది
గంతులు వేసినమాత్రములోనే కడుభీతియునొంది
మిన్నువిరిగి పైబడిసటు రాజులు మేదినిపైబడిరి.
కన్నులుచెదరగ తలలువంచుకొని కడువడి చింతిలిరి.
గడగడవణుకుచు మూర్ఛలతేలుచు కాళ్ళను కడువడిగ
తడబడనందరు ఏమియుతెలియక తారుమారుకాగా
దేవలోక గుర్రముపైనెక్కగ దేవతలేగాని
ఈ వసుధనుగలవారికి తగునా ఈ గుర్రముపూని
ఎక్కలేము ఈ గుర్రముపైనా నిక్కముగా మేము.

అని ఖైదులో నుండేటందుకు ఒప్పుకున్నారు. పాదుషా నవ్వి వారిని దిక్కులేని పాడూరికి నక్కబోతు రాజులవంటివారని నిందావాక్యములాడి ఖైదుచేశాడు.

ఇక్కడ చెంజీలో రాంభాయి పుత్రుణ్ణికన్నది. ఆబిడ్డ గోత్ర రక్షకుడు కావాలని కోరింది రాంభాయి.

శూరసింగుడూ ఖయిదులో పడ్డ సొబగులుతలపోసి
పురుషుడులేనీ యిల్లేటికి ఈకాపుర మికనేమిటికి ?
పురుషుడులేనీ సొబగేమిటికీ మోహంబేమిటికి ?
పురుషుడులేనీ విభవంబేటికి భోగంబేమిటికి ?

పురుషుడులేనీ పురమేమిటికీ పుత్రుడిందేమిటికి ?
పురుషుడులేనీ జీవనమేటికి భువిబ్రతుకేమిటికి ?
పురుషునిబాసిన జన్మమేమిటికి సిరులుందేమిటికి

అని ఎంతో చింతించింది. దేశింగుని పెంచి పెద్దచేసింది. దేశింగు పెరిగి పెద్దవాడై మహబత్ఖానుతో నేస్తంకట్టి, గుర్రపుస్వారిలో, నీతివిద్యలో పేరు పొందాడు. ఒకరోజున తల్లిని మా తండ్రియేడి ? అని అడిగాడు. రాంభాయి బారాహజారి వృత్తాంతాన్నీ, శూరసింగు, ధరణీసింగులు ఖయిదున పడడమూ వివరించి చెప్పింది. వెంటనే దేశింగు—

పండ్లు పెటపెటని కొరికెనప్పుడు బాలుడుదేసింగు
కండ్లువురుముచును కోపముచేసెను ఘనుడగు దేసింగు
రెండుగడియలకులోపల ఢిల్లిని పిండిగజేసెదను
దండియైన ఆగుర్రమునెక్కి దౌడాయించెదను.

అని నిశ్చయించుకొని తల్లికి దండంబెట్టి అమ్మా ఇప్పుడు నాకు "జల్దీజల్దీ వుత్తరువిమ్ము జల్దీగానుతల్లీ" అని దేసింగు కోరాడు. తల్లి వ్యసనం చెందింది—

వినరా ముద్దులతనయా, తనయా నీవిటుబల్కితె
కని పెంచిన నాగర్భం చల్లగ గాంచుటెట్లులింక
నిన్నువిడిచి అరగడియైనా, నేనెట్లుండగలను
అనుచు చేతులూ పిసుకుకొనుచు తానంత మూర్ఛచెందె.

దేసింగు తల్లినిఓదార్చి, శంకరాభరణమేటిలో స్నానంచేసి, శ్రీరంగేశుని అర్చించి—

రంగనాయకా నేనుఢిల్లీకి రయమున పోవలెను
సంగతిమీరగ ఢిల్లిలోనే గుర్రపుస్వారి చేయవలెను
తండ్రుల ఖయిదులో నున్నవారిని తడయక తేవలెను
తండ్రివీవని నమ్మితినాపై దయయుంచగవలెను
సమ్మతిమీరగ నాకుసహాయము సరగున రావలెను
నమ్మి మిమ్మునే ఢిల్లికి పోయెదననుచు వేడుకొనెను.

శ్రీరంగస్వామి. దేసింగుని మెచ్చి సాక్షాత్కరించి—

అయ్యాదినదా దేసింగా నీకట సహాయముగను
వచ్చెద పోయిరమ్మని చెప్పిన ముచ్చటతోడుతను

దేసింగు మహబత్ఖానుడు తోడురాగా ఢిల్లీకి వెళ్ళాడు. పాద్చా కొలువుకి పోయి సలాంచేసి తాను వచ్చినపని చెప్పాడు. పాద్చా దేసింగు వయసునీ, మాటపోలి కనీచూసి డోలాయమాన మానసుడై ఇలాగనుకున్నాడు—

పిల్లమాటగా దోచలేదు. మరి పెద్దమాటగాదు
కల్లమాటగా దోచలేదు. నిక్కమ్ముదోచలేదు.

అని చర్చించి పారాహజారిని తెప్పించి దేసింగుకి చూపించాడు. వెంటనే తన్ను వారించవచ్చిన తండ్రి పినతండ్రులతో—

మించిమనంబున చింతవలదు మీకుతండ్రులారా;
మంచినవారీ జేయగవలెనే నెంచితండ్రులారా:
పుట్టినపుడే చావు నిజంబని పొసగతండ్రులారా
దిట్టముగా మీమనమున నమ్ముడు తెలిసితండ్రులారా!

అని వారించి సింగమువలె ఎగిరి పారాహజారిపై కెక్కాడు. తండ్రి. పిన తండ్రులకూ, పాద్చాకూ సలామ్ముచేసి "గోవిందా"యని తేజీని అదలించి జల్దీఅని దౌడాయించాడు. వెంటనే ఆగుర్రం-

ఉరవడిగలిగిన వాయువువలెనే వొప్పుగాను పరచెన్
కొండలనెల్లను మెండుగదాటుచు దొరకొని యెగయుచును
చెండుగనరుగుచు గంతులువేయుచు చెలగిముదుంగుచును
అడవులదిరుగుచు మాకులధ్రోయుచు కడువడి దాటుచును
తడవుగ తిరుగుచు తలక్రిందుగ బల్ఘాటిగ పరచుచును

పారాహజారి నాలుగుదిక్కులా ఐదుదినములపాటు తిరిగింది. దేసింగు కన్నులు గిరగిరతిరిగి శోషచే కడు భీతినంది రంగనాధస్వామిని ధ్యానించాడు. భక్తవత్సలుడైన శ్రీరంగనాధుడు దేసింగుకి ప్రత్యక్షమై పారాహజారిని అదలించి

ఢిల్లీకి పొమ్మన్నాడు. బారాహజారి మచ్చిక అయింది. పాదుషా దేశింగు అశ్వా రోహణ సామర్థ్యాన్ని మెచ్చి. బహూకరించి. రాజులందరినీవదలి. చెంజీని దేసింగుకి ఇనాముగా ఇచ్చాడు. ఈ బారాహజారి గాథనాటికి దేసింగు ఐదేండ్ల వాడట ! ఈ విషయం ఒక్క-టేచాలు మనకీకథల్లో కన్పించే అత్యుక్తి. అమా నుష క్రియా వర్ణనలూ, తెలియజేసేటందుకు.

దేసింగు బారాహజారీతో, తండ్రి, పినతండ్రిలతో చెంజీ వచ్చాడు. యువరాజు పట్టం కట్టుకున్నాడు. పెండ్లిఅయింది, పదకర్త పెండ్లికూతురు పేరుని గాని, దేసింగు మామపేరుగాని చెప్పలేదు, అదివింటే అగస్త్యభ్రాతలాగ ఈ కథలో దేసింగు మామఅనేపేరు కన్పిస్తోంది. దేసింగు కాలక్రిమాన రాజయ్యాడు. ఢిల్లీ పాదుషాకూడా తన కుమార్తెను సాదుల్లాఖానుకిచ్చి పెండ్లిచేసి ఆర్కాటు యిలాఖాకు రాజుచేసి, యేడులక్షల పఠాణీలతో నూట యెనుబది పాళాలను ఏలుకో మని పంపాడు. సాదుల్లాఖానుడు తన పరగణాల లెక్క-ల్ని తనిఖీచేయమని తోండ్రిమల్లోజికి చెప్పాడు. తోండ్రిమల్లోజి పన్నెండేళ్ళనుంచి దేసింగు మహా రాజునుండి పన్ను రావటంలేదని తేల్చాడు. సాదుల్లాఖానుడు తోండ్రిమల్లోజిని సైన్యసమేతంగా చెంజీ కోటమీదికిపోయి మూడురోజుల్లో పాతబాకీలన్నీ వసూలు చేసుకొని రమ్మంటాడు. పాదుషా తాను దేసింగు అశ్వారోహణ చాకచక్యాన్ని మెచ్చుకొని చెంజి రాష్ట్రాన్ని ఇనాముగా ఇచ్చినసైనం మరచిపోయి,

అల్లునికి నూట యెనుబది పాళెములు
మచ్చికతో ఫర్మానావ్రాసి మరియునిచ్చేమేల
ధర్మమునెంచక తటుకుననప్పుడు తనమది మూఢతను
ఫర్మానాలోజేర్చెను చెంజిని పదపడి చూడగను
గరిమతొ సాదుల్లానుడు పైకము కట్టలేదటంచు
అరయగ దేసింగుని అడుగుట కాదరువిగిరొ

అదే ఈ వీరగాథకి కారణమైంది. తోడర్ మల్ తిరువిరికోట షేక్ మహమ్మ దునీ, ఆరణి వెంకటాద్రివునీ, మధ్యేమార్గంలో చూచాడు, వారిద్దరివల్లా దేసింగు మహారాజు ప్రభావాన్ని తెలుసుకున్నాడు, వారుకూడా అతనికి-

రసికుడయిన యీ దేసింగుతొమనకు రచ్చలు వలదన్న
ప్రత్యక్షంబున రంగనాయకుడు పలుకుచుండునన్న

నిత్యము తిరుమణి దారులగన్న నీతివినయుడన్న

అని దేసింగుభక్తినీ, అలౌకిక శక్తి సంపన్నతనీ వివరించి అతనితో యుద్ధం వలదని సలహా ఇచ్చారు.

"ఉసురువున్న పుప్పమ్మవచ్చు నువ్వూరికి పోవన్నా" అని ఉపదేశించారు. కాని, తోడర్ మల్ తిరుమణి ధరించి, దేసింగుని మోసగించి, చెంజీని జయించి మట్టుపెట్టాలనే నిశ్చయంతో కదలిపోయాడు.

చెంజీకోటచూచి తోండర్రిమల్లు విస్మృతి చెందాడు. రణభేరీ వేయించాడు. ధరణిసింగు, తోండర్రిమల్లోజి తమ కోటమీదికి దండువచ్చిన సమాచారం రంగ నాథుని పూజలోమునిగి తన్మయుడై ఉన్న దేసింగుకిచెప్పి-

పనిమాలియు ఈ పూజలేమిటికి బాలుడ దేసింగూ;
మనము ఏమరిఉండినందునను తనయా దేసింగూ;
మనకోటకు నిపుడాపదవచ్చెను తనయా దేసింగూ;

అని ముందుపని చూడమన్నాడు. నవాబుదండు నాలుగుదిక్కులా ముట్టడి వేసింది. దేసింగు చెక్కుచెదరలేదు. రంగేశుని కృపకలిగుండగా బెదరవలసిన పనిలేదన్నాడు—

రామరామ ఆనంతకాలము రాజ్యమేలుతామా;
ఓ మహిరాజ కులాగ్రణి శూరతనిపుడు హెచ్చినాము;
తగుపుకు నబాబు దండుతీసుకొని తానువచ్చినాడా ?
తగువుబెట్టుకొని నన్నెదిరించెడి మొగవాడైనాడా ?
పోదగువాని పరాక్రమమెల్లను భూమిపాలుగాను
వంతుజేసెదను తక్షణమున మీరందరు జూడగను

అని వీరోచితంగా మాట్లాడి, హర్కారాలద్వారా తోండర్రిమల్లోజీని పిలిపించి—

రంగుమీర మాకోటమీదికి రానేల మదించి ?
యెన్నడునీవీ దారియెరుగ విపుడేల వచ్చినావు ?

నిన్నెవ్వడు బంపించినాడు మరి సేరగ నెవ్వడపు ?
నబాబుదండిటు రానేమిటికి ? నాదు కోటపైకి.

అని గర్జించాడు. పన్ను బాకీసంగతి యెత్తగానే కోపించి—

కోటకు వెలుపటి గుండురాళ్ళను ఎంచుక పొమ్మనుము
ఏటి యిసుకవున్నది వొంటెలపై యెత్తుక పొమ్మనుము
వరద వచ్చినపుడీ యేటిలొ బురద నిలిచెమెండుగాను
పరువునక విరగనెండి చెక్కలై యున్నవిగొనిపొండు
వరుసగయెడ్లను గోనెలమోపుల నొప్పుగగొనిపొండు

అని ఆంతటితో ఆగక—

"కినిసిన చేపలనమ్మెడి లచ్చెకు కిస్తీ కట్టవలెనా ? "

అని ఉపాలంభించి జాబురాసి, సాదుల్లాఖాను కిమ్మన్నాడు. తోండ్రిపల్లి ఆర్కాటుకి తిరిగిపోయి, దేసింగు ఇచ్చినజాబు నవాబుకిచ్చాడు. వెంటనే సాదుల్లా ఖానుడు మండిపడి బంగార్నాయనితో పాళెగార్లకు జాబులు రాయమన్నాడు. సేన లను వస్తులను తయారుచేయించి చెంజియేదికి దండు నడిపుమని అన్నాడు. బంగార్నాయని నాయకత్వాన దండు దేవనూరి యేటిగట్టున విడిసింది. వారికి సాయంగా తిరువణామలయేలే సుభంగిదొర వచ్చాడు. దేవనూరు కొల్లగొట్టారు. ఆవూరి కాపులు దేసింగుదగ్గరకు పరుగెత్తిపోయి ఇలా మొరపెట్టుకున్నారు.

రాంరాం, రాంరాం, రాంరాం, రాంరాం, రాజా దేసింగూ
రాంరాం మనవిని వినగదవయ్యా రాజా దేసింగూ;
దేవా వినుమిదొ నవాబుదండూ దేవనూరిలోన
యావత్తును తగకొల్లగొట్టిరి అరయకునికి తగున ?
కొండవంటి ధనరాసులు రత్నాల్ కొల్లగొట్టినారు;
శంకలేక భూషణ వస్త్రాదులనెన్నో సంగ్రహించినారు;
పట్టిరిస్త్రీలను పురుషులనెల్లరపెట్టిరిచెరలోన
ఇట్టటుకదలక కొందరిపట్టుక సేలేరాగాను
ఏమని చెప్పుదుమయ్యా మేమూ యిప్పుడు దేసింగూ ?
నేమము పూజలసల్పను సమయంబిపుడా దేసింగూ ?

కన్నుల యమునకు పూజలు సేయను కాలము గాదయ్యా :
ఎన్నగ పూజలు రాజ్యగము లిగితె యెన్నో కలవయ్యా

అని గోలపెట్టారు. వారంతో దేసింగు జవియకుండని, రంగనాథుని పూజించి, నవాబు సైన్యాలను ఎదుర్కోవాలనుకున్నాడు. ధనసింగు దేసింగు దాయాది. తురకలు కోట ముట్టడివేయగా పూజలోనుండుట తగదని హెచ్చరించాడు. దేసింగుకూడా తురకల్ని జయించే రంగని పూజించాలని నిశ్చయించి సరదార్లందర్నీ ఆయితంచేశాడు. మలకనూరిలోనున్న మహబత్ఖానుడికి కబురంపాడు. పెళ్ళిపీటలమీద కూర్చున్న మహబత్ఖానుడు "తంకంకణము పెండ్లికిరాదు, యెన్నకదనమునకు" అని భావించి, నీలవేణిఅనే తన గుర్రాన్ని ఎక్కి చెంజికి కదిలాడు.

మహబత్ఖానుణ్ని నవాబుసైన్యం ఆడ్డగించింది. ఖాను వీరవిహారంచేసి సైన్యంలోంచి దూసుకొని చెంజీ చేరుకుని, రాజామహలులోఉన్న దేసింగు సముఖానికి వెళ్ళాడు. దేసింగుకూడా భార్యదగ్గర సెలవుదీసుకొని యుద్ధానికి వెళ్ళ నిశ్చయించాడు. ధరణిసింగు అప్పుడు శుభసమయంకాదని వారించాడు. కాని దేసింగు రాణికీ, తనకూ మధ్య తెరగట్టించమనిచెప్పి ముఖావలోకనం చెయ్యకుండా శలవులడుగుతాడు. రాణి దేసింగుని కోటవెలుపలికి యుద్ధానికి పోవద్దని సలహా ఇచ్చింది. దేసింగు భార్యతో వీరపురుషోచితంబుగా—

పటుతరముగ నే దండున జొరబడి పరుల జయించినను
తటుకునవచ్చి నిన్నేలెదనే తప్పక యిప్పుడును
చటులధైర్యమున శత్రులదుంచెద నత్యంతంబుగనేను
రాచదండులో నీల్గిన స్వర్గము ప్రాకటముగగలదు.
చేగాని జయమును చెందివచ్చెదను చిరకీర్తియు గలుగ

అని పలికాడు. ఇలాచెప్పి సెలవడిగిన దేసింగుతోరాణి ప్రార్థను వీర వనితలాగ—

ముందునరుకునను పుడమినిబడినను ముఖ్యంబుగనేను
సందేహములేకను జేసెదవిను సహగమనమును

వెన్నుపోటుచే ధరగూలిన మిమ్ము కన్నులతోగనను
పన్నుగాను నే కట్టిడ్పింతును పాతచెంజిలోన

అని పలికింది. దేసింగు ఈమె వీరత్వానికి హర్షించాడు. రాణీ విజయ తాంబూలమిఇస్తూ దేసింగు చేతిమీది రేఖలు చూచింది. సాముద్రికశాస్త్రం తెలిసినదవటంచేత తనకూ ఆతనికీ యోగంలేదనీ, వీరాగ్రిణిఅనీ గుర్తించింది—

దేసింగు రాణిని వీడ్కొని, బారాహజారిని హెచ్చరించి, రంగనాథుని సెలవడిగి యుద్ధానికి ఉద్యమించాడు. అతనికి అపశకునము లెదురయాయి. దేసింగు రోషంతో—

ఏమిరంగా నీవిప్పుడు నన్నిట్లుసేయనగునా ?
స్వామియనుచు నిను నమ్మినందుకిటు చేయనీకుతగునా ?

అని నిష్ఠూరములాడాడు. రంగనాథుడు—

వెనుదీయకను పైరులగెలుపుము వేగమెదే సింగూ

అని ఆశీర్వదించాడు. దేసింగు రావడజూచి బంగార్నాయుడు బెదిరాడు. దొప్పుచువచ్చే పులీ, మదించిన ఏనుగూ, కదిసిన కృష్ణసర్పమూ లా దేసింగు శత్రువులను ఎదుర్కొన్నాడు. అతనిధాటీ శగ్గిద్దామని శత్రువులు మలయనూరి చెరువునీ, తామనూరి చెరువునీ కట్టలుకొట్టి శంకరాభరణ మేటిలోకి మళ్ళించారు. సేన వచ్చేవడి తగ్గింది. నవాబుసైన్యం వ్యూహం పన్నుతుంది. సింగు సేనతో 30 గుర్రాలతో ఆవలిఒడ్డుకి చేరాడు, రెండుగడియలుఆగి రణ అకాలపు ఏటివెల్లువ తీసినతర్వాత సేనని దాటించవలసిందని ధరణిసింగిచ్చిన సలహా దేసింగుకి రుచించలేదు. అందుచే ఏటిలో కొట్టుకొనిపోయి కొంతసైన్యం నష్టమైంది. శత్రుసైన్యాన్ని రదిమగానే దేసింగు అనుజ్ఞపొంది, మహబత్ఖానుడు ముందు కలపటమయాడు. సుభంగిసౌర చెయినరకి, శరణనిపించి, షేకు మహమ్మదుని ఓడించాడు. ఇలా వీరవిహారంచేస్తున్న మహబత్ఖానుణ్ని బంగార్నాయుడు తాకాడు. పిరంగీలు తుపాకీల బారుచేశాడు; గుండుదెబ్బతగిలి ఖానుడు వీరస్వర్గం అలంకరించాడు. అతని గుర్రాన్ని చెపట్టండని నవాబు ఆజ్ఞవేశాడు. కాని, అది వారికి అలవికాలేదు నీలవేణి శత్రువులకందకుండా దేసింగుదగ్గరకేగింది.

దేసింగు మిత్రుని మృతికి శోకించాడు. దావూద్‌ఖానుడిమీదికి కలపటమై వాడు. దావూద్‌ఖానుడుకూడా దేసింగుమీదికి మదపుటేనుగుల సమూహాన్ని డీకొలి పాడు. వాడే నవాబని దేసింగుభ్రమజెంది, అతనిజెండాలన్నింటినీ పెటపెటత్రుంచి-

ఒప్పుగనెత్తురు కాలువపులను కట్టెనంతజూచి
శంకరాభరణ నదిలోపలనే స్నానంచేయుటకు

మరలినాడు. అప్పుడతనిదగ్గరకు ధనసింగువచ్చి దేసింగుచేతిలో చచ్చింది నవాబుకాదని తెలిపాడు.

దేసింగు రోషంతో మళ్ళీ యుద్ధానికి కదిలాడు. అలసిసొలసిన దేసింగుతో మరునాటిపరకూ యుద్ధమాపమని శ్రీరంగనాధుడు చెప్పాడు. దేసింగు వేడిగా ఉన్నప్పుడే యుద్ధం చెయ్యడానికి నిశ్చయించాడు.

"ధీరులైనవారికి, ప్రాణములపై దృష్టిగలుగదయ్యా"

అని రంగనాధుని సెలవందాడు

దేసింగు తన సైన్యంమీదికివచ్చే ధాటీచూచి నవాబు తోండర్మల్లుతో రాజీ మాటలు చెప్పమని, ఆర్కాటురాజ్యాన్ని దేసింగుకిచ్చి, తానే అతని సర్దారుగా వుంటాననీ రాయబారం పంపిస్తాడు. దేసింగుకీ రాయబారం రుచించలేదు. తన స్నేహితుడైన మహబత్‌ఖానుని మరణానికి దేసింగు ఘూర్ణిల్లుతున్నాడు. పగ తీర్చుకోవాలనే నిశ్చయంతో ఉన్నాడు. అందుచేత-

" ఇద్దరుశూరులు తెగినవెనుక మాకింక మాటలేల ? "

అని రాజీ షరతులు నిరాకరించి యుద్ధం జరిగి తీరవలసిందేననీ, నబాబో, తావో చావవలసిందేననీ, జవాబిచ్చాడు.

దేసింగుమీదికి మొదట కవిసిన ఆరణి వెంకట్రావు పలాయనమంత్రం పఠించాడు, తన్ను విడువవలసిందని వేడిన నవాబుని వదలక ధాటీగా "చెంజీ రూకలు తక్కువై వసూలుచేసుకోడానికి వచ్చావుగదా - నా కత్తిమొనవున్న రూకలు తీసుకో" అని ఉపాలంభించాడు. ఏనుగుమీద నవాబూ, గుర్రంఎక్కిన దేసింగూ డీకొన్నారు. ఏనుగు కడుపుక్రింద కట్టిన తొట్టిలోవున్న మాష్టీడు

దేసింగు గుర్రపు వెనుకకాళ్ళను తెగవేశాడు. ఈ పోసంమూలాన దేసింగు పాదచారియై, గజారూఢుడైన నవాబుతో అసమయుద్ధం చేయవలసివచ్చింది. అలాగే వీరవిహారంచేసి, తన పరివారమంతా నశించడంచూసి, విచారంతో, యోగాసనస్థుడై కత్తి నెగురవేసి, ఎదురు రొమ్ము ఒడ్డి, దేసింగు ప్రాణం వదిలాడు.

దేసింగు మరణవార్త విని నబాబు-

పాపపునిందల పడితిని భువిలో బాలుడ దేసింగూ
లక్షయేనుగలు నీచే మడిసెను యీక్షణంబులోనూ
లక్షణమగు గుర్రంబులు నాలుగులక్షలు నీచేనూ
సుమని కోట్లసంఖ్య జనములు సరగున నరికితివే

అని పలవించి, బంగారపు పల్లకిలో దేసింగు దేహాన్ని సగౌరవంగా చెంజీకి పంపాడు. రాణి దేసింగుతో సహగమనం చేసింది, వీరదంపతులిద్దరూ విమానారూఢులై స్వర్గానికి వెళ్ళారు.

రాణీ జ్ఞాపకార్థం సాదుల్లాఖానుడు ఒక పట్నం కట్టించాడట. అదే నేటి రాణీపేట.

చరిత్రదృష్ట్యా జుల్ఫికర్ ఖాను చెంజీకోటలో తనప్రతినిధిగా సరూప్‌సింగ్ అనే రాజపుత్రుణ్ని నియమించాడు. అతనికీ ఇంగ్లీషువారికీ 1710 లో లావాదేవీలు జరిగాయి ఇంగ్లీషు కంపెనీలో ఉద్యోగస్థులు సరూప్‌సింగ్‌కట్టిన కప్పంతో పరారీ అయ్యాడట! దానికి బాధ్యత నష్టం కానివారికి ఉద్యోగమిచ్చిన కంపెనీవారిదేనని సరూప్‌సింగ్ నిశ్చయించాడు. ఈ వ్యవహారం వారు తొందరగా పరిష్కరించాలనికోరి, ఇద్దరు తెల్లవార్ని హామీగా చెరబట్టాడట. దానికి ఇంగ్లీషువారు 1711 ఫిబ్రవరిలో చెంజీమీదికి దండెత్తి, ఊళ్ళను కొల్లగొట్టి, 50 - 60 వేల పెగోడాల విలువైన ధాన్యాన్ని స్వాధీనం చేసుకొని కొందరు నాయకుల్ని చెరబెట్టారు, చెంజీవారు ఇంగ్లీషువారి కోటకి సరఫరాలేమీ అందకుండా అరికట్టసాగారు. ఇలాగ 1713 వరకూ జరిగింది. అప్పుడు రాజ్యానికి వచ్చిన తేజసింగు ఆర్కాటు నవాబుకి తాను సామంతుణ్నికానని ధిక్కరించి స్వాతంత్ర్యము ప్రకటించాడు. ఆ తేజసింగే మన పాటలోని దేసింగు. ఆ సందర్భంలో ఇంగ్లీషువారితోడ్పాటుతో ఆర్కాటు నవాబు దేసింగుమీదికి దండెత్తాడు. వారిద్దరికీ 17

జనవరి 1718 నాడు యుద్ధము జరిగింది. అదే ఈపదంలో సహజమైన అత్యుక్తులతోచేరి వర్ణితమైంది.

మొత్తంమీద సాహసిక కథా వాఙ్మయంలో చారిత్రాత్మక విషయాలు పరకవాయుగా కన్పిస్తున్నాయి. జనా కథకుడు చెప్పిందంతా అక్షరాలా నిజమనిగాని, అన్ని విషయాలూ ఆ నాయకుడికే సంబంధించినవని నమ్మడానికిగాని వీల్లేదు. జనశ్రుతి యాపకముకైన ఈ కథల్నిఓడ్చి, వడపోసి వాటిలోఉన్న చారిత్రిక సత్యాల్ని తేర్చి, అందియ్యవలసిన బాధ్యత చరిత్రకారులు వహించాలి. వారిశ్రమకి తగిన ఫలం లభించకపోదు.

## 5 కరుణ రసాత్మక కథా వాఙ్మయము

జానపద వాఙ్మయంలో కరుణ రసాత్మక కథలొక ముఖ్యమైన విభాగము. గృహచ్ఛిద్రాలకులోనై అష్టకష్టములుపడు అత్తింటి కోడళ్ళూ, పత్యైక జీవనలై సహగమనంచేసిన సాధ్వీమణులూ, చెడి పుట్టింటికిచేరి అవమానపీడితలై మనఃక్లేశములపాలై ఆత్మహత్యకు పాల్పడు ఆడబడుచులూ, మానసంరక్షణార్థమై వీర రసావేశం పొందిన వీరనారీమణులూ, మొదలైనవారి కథలు కరుణ రసాత్మకములై, జానపద జీవితాన్ని ప్రతిబింబించేవై ఉంటాయి. అలాంటి కథలు అన్ని దేశాల్లోనూ, అన్ని భాషల్లోనూ ఆదరణీయములై ఉంటాయనడంలో సందేహం లేదు. “ ఏకోరసఃకరుణఏవ ” అని భావించిన భవభూతి దేశంలో కరుణ రస ప్రధాన గాధలు ప్రచారంలో ఉన్నాయనడంలో వింత ఏమీలేదు. ఇలాంటి జానపద గాధల్లోనే జాతియొక్క సహజ సంస్కృతీరూపాన్ని తెలుసుకోవడానికి వీలవుతోంది. వ్యవహారానుగుణమైన ఆచారాలెన్నిఉన్నా, ఆ జాతికి లక్ష్యమై, ప్రియములయిన ఆచారాలేవో అలాంటి కథల్లోనే వ్యక్తమౌతాయి. మనదేశంలో సామాన్యజనుల్లో పుట్టి పెరిగిన సాధ్వులకథలలో కొన్ని ప్రచారంలో ఉన్నాయి. కామమ్మకథ, సన్యాసమ్మకథ, వీరరాజమ్మకథ, లక్ష్మమ్మకథ, సల్లతంగాళ్కథ అలాంటివే. వీటిని స్థూలంగా పరిశీలించడమే ఈఅధ్యాయంయొక్క ప్రయోజనం

సన్యాసమ్మకథ విశాఖపట్నంలోని ఒక పేరంటాలుకథ. ఆ మండలంలో నేటికీ సన్యాసమ్మ మొక్కబడులందుకొనే దేవతగా ప్రఖ్యాతిగాంచి వున్నది. ఈ సాంసారిక కథకికూడా అత్తకి కోడలిమీద కలిగిన ద్వేషమూ, తోడికోడళ్ళ

అసూయా, అన్నతమ్ముల జ్ఞాతికలహమూ, సన్యాసమ్మ జీవితాన్ని దుఃఖాంత గాథచేశాయి. అబ్బ, అమ్మలనుకోల్పోయిన చెల్లెలిమీద అన్న చూపిన అనురాగమూ అష్టకష్టాల్లోకూడా చెదరని మనసుగల సన్యాసమ్మకు పతిమీదగల ప్రేమా, తల్లిని ధిక్కరించియైన వదినయెడ భక్తి జూపిన అప్పన్న లక్ష్మణుని ధర్మమూ ఈవిషాద గాథలో తళుక్కుమనే మెరపులు. సన్యాసమ్మకి మేనత్తా, అత్తాఅయిన పాలమ్మ సన్యాసమ్మని కోడలిగా చేసుకొనేవరకూ వలవలాడడమూ, తర్వాత తక్కిన కోడళ్ళ ఇచ్చకాలమాటలకూ, లేనిపోని అనుమానాలకూలోనవడమూకథ వక్రగతిని నడిపేటందుకు కారణమైంది. ఇతివృత్తం ముఖ్యంగా సాంసారికమైనా, ధర్మ వీరాన్నీ, అద్భుత సంఘటనలనీ వ్యక్తంచేస్తోంది, కామమ్మకథకీ, ఈ కథకీ ఎన్నో పోలికలున్నాయి. రెండు కథల్లోనూకూడా కథానాయికలు పుట్టింట గారంగా పెరిగినవారే. ఇద్దరి భర్తలుకూడా భార్యల్నివదలి కొలువుకోసం దూరదేశాలు వెళ్ళారు. అందుచేత రెండుకథల్లోనూ ఈస్టిండియా కంపెనీ దొరలదగ్గర చిన్న ఉద్యోగాల్లో కుదురుకొన్న జానపదుల జీవితమూ, ఆశలూ వర్ణితమైనాయి. అపూయికలైన వారి భార్యల చిత్తస్థైర్యమూ, మాయపసుపు ఉన్నప్పటికీ భర్తమీద గల ప్రేమచే అనుగమించి పేరంటాళ్ళవాలనే నిశ్చయమూ వెల్లడి అవుతాయి. చిన్న సంఘటనలు వారికా నిశ్చయాన్ని కలిగించాయి. కామమ్మ చిన్ననాడు గంగిరెడ్డివాళ్ళు ఆడుతూంటే చూడబోయింది. అలాచూస్తూ కాలయాపనచేయగా పెత్తల్లి కామమ్మని "గుంటానపడి యేటి పేరంటాయి" అంది ఆమాటలనే సాగుమానం చేస్తూ కామమ్మ-

అప్పుడబట్టమే, ఇప్పుడు నిబద్ధి పెదబాబు
తనయొక్క ముచ్చటలు తీరినవని చెప్పు పెదబాబు
తనయొక్క యత్నము సరిపోయెనని చెప్పు పెదబాబు

అని కడసారి కబురుగా ముదలకించింది. సత్యపతి సన్యాసమ్మనికూడా అలాగే మారుటితల్లి పిన్నమ్మ గంగిరెద్దాట చూసేటందుకు వెళ్ళిన సందర్భంలో—

ముండా నీతాడని యెంచిత్తి
నీగాజు పూస తీసిన కబురెప్పుడువిందు సన్యాసి
నీ మొగుడు చెల్లిన సాపు కబురెప్పుడువిందు సన్యాసి
నీ ముండచీరలు ఎప్పుడం పేది సన్యాసి

అని కొండచీపురుతో పనేపనే బాదింది. గ్రామంలో పీరిద్దరూ పడిన నిందా వాక్యాలే వారి మనసుకిపట్టి వారికిపై ధవ్యం సహించరానిదయింది. జీవం తృణంగా అర్పించేటందుకు వెనుతీయకుండాఉండే మనఃస్థితి కలిగించింది. ఇద్దరికీ పాతివ్రత్య ప్రభావంవల్ల అమానుష శక్తులు లభించాయి. కామమ్మ కట్టుమోతు వెంకడికి విషియంఇచ్చి పక్షురాలేలా చెయ్యడం, సాగుమానం చూడవచ్చిన మంచాల వెంకమ్మ పారవేసుకొన్న నాను కథచెప్పి, దాన్ని ముత్యాల రాజన్న ( అతనికి ఆనాను దొరికింది ) చేత ఇప్పించడమూ, సాగుమానానికి దొరలను నమ్మించి అనుజ్ఞ తెచ్చుకోవడమూ, దీవెనలూ, వరాలూ ఇవ్వడమూ చేయగలిగింది, సత్యవతి సన్యాసమ్మ అన్నాహారాలు లేకుండా పట్టుదలవల్ల పుట్టింటా, కోడంత్రికం వల్ల అత్తింటా నెలలతరబడి ఉండటం, చచ్చిపోయిన భర్త చేత మాట్లాడించటం మొదలైన పనులు చేసింది.

కామమ్మకథ శ్రీ బసవరాజు అప్పారావుగారి దృష్టిని ఆకర్షించింది. వారు జానపద వాఙ్మయాభిమానులవడంచేతనే వాయు సందేశంలో కామమ్మని—

"కాపుకోడలు కామమ్మ కలియుగాన
సాగుమానము చేసిన సచ్చరిత్రి"

అని కీర్తించి, ఆమెపై మలయానిలుణ్ని మెల్లగా చల్లగా వీచుతూ పొమ్మన్నారు. విద్యావిహీనులైన జానపద స్త్రీలలోంచికూడా సీతా, సావిత్రీ సతులలాంటి పతిభక్తి మండితలైనవారు మనదేశంలో ఉద్భవించినట్లు కామమ్మకథా, సన్యాసమ్మ కథా రుజువు చేస్తున్నాయి. అందుచేతనే అవి ప్రజాభిమానానికి పాత్రమయాయి. వాటిలోని సులభశైలీ, భావపుష్టీ మెచ్చుకోదగినవి.

కామమ్మకథని మాదాసు వెంకయ్య రచించాడని కథలో ఆధారాలవల్ల తెలుస్తోంది. అందుకోసం కామమ్మ అతనికి పాతిక వరహాలూ, మగని మారయ్య నగలూ కానుకగా ఇచ్చింది. సన్యాసమ్మ చరిత్రి రాసిన కవి ఎవరోమాత్రం మనకి తెలియదు. ఐనా, ఇద్దరుకవులూ జానపద వాఙ్మయానికి అర్పించిన ముఖ్యాలంకారాలకి మెచ్చదగినవారనే అనాలి. ఈ కథలశైలీ, బాణీ తెలిపేటందుకు వాటిలోనుంచి కొన్ని వాక్యాల్ని ఉదహరిస్తాను.

సన్యాసమ్మని అత్తగారు దాలమ్మ ఎలాఏలుతోందో చూడండి—

పరమాన్న మొండినవేల సున్నమిస్తాదీ దాలమ్మ
అన్నమొండినవేళ ఆరికజావ యిస్తాదీ దాలమ్మ
కుడుము లొండినవేళ తవిటికుడ్డులిస్తాదీ దాలమ్మ
అరిసె లొండినవేళ పొయిరొట్టె లిస్తాదీ దాలమ్మ
కాలు కంకణమేసి యేలుచున్నాదీ దాలమ్మ
చేతి కంకణమేసి యేలుచున్నాదీ దాలమ్మ

మరో ఘట్టంలో—

మాటిమాటికి నాతో వాదించుతావా సన్యాసీ
యిష్టములేని మనువు యాలంటావు సన్యాసీ
కష్టబెట్టిన మొగుడిని వదులుకోరాదా సన్యాసీ

అంటే; సన్యాసమ్మ—

హరిహరీ యన్నాది ధరనిపైనివరిగే ఆబాల
శివశివాయన్నాది నొష్టగుద్దెనుగా ఆబాల
ఆబోలీలో అంబారి చేతబట్టెనుగా సన్యాసీ
యికను యెవడితోచెప్పినా పరువు పోతుంద దైవాము
అత్తయిచ్చిన హారతి నాదె యన్నాది సన్యాసీ
తన పయ్యెదచెంగు చేబాటుబెట్టింది అబాల.

కామమ్మ భర్త మారయ్య మరణించాడు. కామమ్మ సహగమనం చేసేటం
కు అనుజ్ఞకోసం కాకినాడ బయలుదేరుతోంది—

రావోయి రెడ్డన్న, నా చిన్నమరది రెడ్డన్న
కట్టండి పైనాలు కాకినాడకుగా రెడ్డన్న
పెత్తండిర్రి రామన్న పైనమన్నాది కామమ్మా
పినతండిర్రి గురవన్న పైనమన్నాది కామమ్మా
అంతాకట్టండి పైనాలు కాకినాడకుగా మీదంతా
కాకినాడకు యట్లుబోతావే కామమ్మా
అట్ల పెద్దవాన మహాకురిసెనమ్మా కామమ్మా

ఏరులూను కాలువలు యేకమైనాది
పుంతకాలువలన్ని తల్లివచ్చె కామమ్మా
భీమవరపుకాలువ నిండీయున్నాది కామమ్మా
మాపెవేసినగాని నాటపన్నది ఆకాలువ
తాళ్ళువేసినగాని పాలియ్యదమ్మా కామమ్మా
వట్టుమీదా గంగ పొర్లుచున్నాది కామమ్మా
పోనెల్లులేవమ్మ గంగలూలేవూ కామమ్మా
బ్రతికేవాండ్లుగనుక భయాలుమీకు రెడ్డన్న
చచ్చేవాండ్లకు మాకు భయాలుయేమి రెడ్డన్న ?

## వీ ర రా జ మ్మ క థ

సాంసారిక విషయాలే ప్రధాన కథా విషయమైనది వీర రాజమ్మ కథ. ఇది సన్యాసమ్మకథ వరసలోనే రచింపబడింది. దీని రచయిత యం. అప్పలనరసయ్య. కథకి రంగస్థలం వీరాధివీరులనూ, శూరులనూగన్న పల్నాటిసీమ. బాలచంద్రునీ, బ్రహ్మనాయనీ కని పేరుగన్న ఆ సీమలో రెంటచింతలలోని రెడ్డికుటుంబంలోని అత్తకోడళ్ళ వైషమ్యమూ, తల్లికొడుకుల తగవులూ, ఇంటికోడలు వీరరాజమ్మ కష్ట నిష్ఠూరాలూ ఈ కథకి ఇతివృత్తాలయాయి. కవి, వాటిని జానపద కథా గేయాల సహజధోరణిలో వివరంగా వర్ణించాడు. కరుణ రసస్ఫూర్తి కలిగిస్తూన్న ఈ కథలో అత్తకోడండ్రకు పరస్పర వైషమ్యా లేర్పడిన సందర్భంలో ఎంత ఉత్తమురాలైన కోడలైనా, ఎంతఓర్పు వహించిందైనా, వీర రాజమ్మ ఇల్లువదలి కన్నబిడ్డని, మానమర్యాదలకోసం ఎలా వదులుకోవలసి వచ్చిందో వర్ణింపబడింది.

రెండచింతలలో నాగిరెడ్డి రెడ్డికులస్థులకు మొనగాడై యున్నాడు. సంతు కొరకు అనేకవ్రతాలూ, దానధర్మాలూ జరుపుతూండేవాడు, కాని, అతని భార్య సూరమ్మరాగ. ఇరుగు పొరుగువారితో కాట్లాడుతూ, వారిని అనరాని మాటలంటూ ధనగర్వంతో మదించిఉండేది. ఊరిలోని అమ్మలక్కలు ఆమెమనసుని ఆర్ద్రం చెయ్యడానికో ఏమో ఒకసారి—

వినుము, వినుము సూరమ్మా వినుము మామాట
ఆదిగర్భేశ్వరివి, అన్నపూర్ణవు మాతల్లి

సిరి సంపదలతోడ తులతూగినావు సూరమ్మ
ఎంత భాగ్యంబున్న రాణించదమ్మా ! సూరమ్మ
నయసంత బిడ్డయినా కలుగదాయెనుగా సూరమ్మ
పిల్లలున్నయిల్లు కలకలలాడూ సూరమ్మ
పాపలులేనిల్లు పాడారుచుంతు మాయమ్మ
దీపమ్ములేనిల్లు యెట్టులుండునో ఓయమ్మ
చంద్రుడులేనట్టి యాకాశమట్లు మాయమ్మ
పెద్దలులేనట్టి యిల్లెట్టులుండు ఓయమ్మ
ఐదవతనములేని యతివ యెట్లుండు మాయమ్మ
బిడ్డలులేనిల్లు యట్లులేయుండు సూరమ్మ
ముండా దేవునిదయకు దూరమైనామా సూరమ్మ
పేదవారికిచూడ పిల్లలెందరొ సూరమ్మ
కలుగుచుందురుకాదె కడుపుచల్లగా మాయమ్మ
భాగ్యవంతులకైతె బ్రహ్మదేవుండు సూరమ్మ
సంతానమీయక చింతిల్లజేయు మాయమ్మ

అని విపులంగాచెప్పి సంతానవాంఛ కలిగించారు. దానిఫలితంగా కొంత కాలానికి సూరమ్మ పేర్రెడ్డిని కన్నది. ముద్దుబిడ్డనిగాంచి మురిసిపోయింది సూరమ్మ. బిడ్డనికి 16 సంవత్సరాలు రాగానే ఆషాఢమాసంలో-

పచ్చని గడ్డెల్ల భగ్గుమనుచుండె ఎండకు
పక్షులన్ని చెట్లమొదల వ్రేలాడె దాహకు
చెరువులో చేపలు చచ్చితేలెను ఎండకు

వడగాడ్పులకూ, జబ్బుచేసీ, మందుమాకూ వేసినా ప్రయోజనం ఏమీ లేక నాగిరెడ్డి గతించాడు. పేర్రెడ్డినీ, సూరమ్మనీ బంధుగు లోదార్చారు. తిరిగి యథాప్రకారంగా సూరమ్మ, గయ్యాళి సూరమ్మ అయింది. పేర్రెడ్డి యింటికి మొనగాడై సంసారం త్రిప్పుతూ ఆదర్శప్రాయమైన వ్యవసాయ దారుడయాడు.

పేర్రెడ్డికి పీర్రెడ్డి స్నేహితుడు. పీర్రెడ్డి నిశితమైన బుద్ధిమంతుడు. ఆపలిస్తే పేగులు లెక్కపెట్టగలవాడు. అందుచేత పేర్రెడ్డి అతన్ని సలహాచేయండీ ఏవిష

యమూ నిశ్చయం చేసేవాడుకాదు. పేర్రెడ్డికి పెళ్ళీడు వచ్చింది. వారూ, వీరూ సాటికులస్థులు, పిల్లనిస్తామనీ రాసాగారు. సూరమ్మకి చేతిరెడ్డిపిల్ల కామాక్షిని (ఊరిలోఉన్న సంబంధం) కోడలుగా చేసుకోవాలనిపించింది.

నాయన పేరయ్య నామాటవినుము నాతండ్రి
తలకష్టినావయ్యా, తండ్రివలె, నీవు పేరయ్యా
పెండ్లియీడువచ్చె నీవు పెండ్లాడు పేరయ్యా

అని లయలుగా తన మనసులోని కోర్కె వెళ్ళగ్రక్కింది, కామాక్షి నోటి మనిషని పేర్రెడ్డికి తెలుసు.

వలదు వలదునాకు ఆపిల్లవలదు మాయమ్మ
ఉన్న గౌరవమెంతో ? ఊడిపోవునుగా మాయమ్మ
నా పెండ్లిసంగతి నే చూచుకొందునోయమ్మ

అని చెప్పేస్తాడు. ఇలా కొడుకు తన సలహాని విసడ్డా చెయ్యడానికి, వీర్రెడ్డే కారణం అయివుంటాడని సూరమ్మ అనుకుంది. కొడుకుని ఏమీచేయలేక-

"ఈబుద్ధి నీకెవరు చెప్పారురా పేరయ్యా"

అని పడపడా తిట్టింది. మనసుకిరాని మనువువల్ల లాభమేమమ్మా అని అడ్డువచ్చిన వీరారెడ్డికికూడా అష్టకాలు తగిలాయి. అవి పడి ఊరుకొనేటందుకు వీరారెడ్డి సూరమ్మకి దగ్గరచుట్టమూకాదు, చప్పిడి తింటున్నవాడూకాదు.

ఆదిశక్తివమ్మా, మహంకాళివమ్మా సూరమ్మా
సిగ్గులజ్జలులేక చిందులాడెదవూ సూరమ్మా
నీనోటిధాటికి ఊరివారెల్లా సూరమ్మా
భయపడుచుందురు మాటాడలేక సూరమ్మా
ఎంతభాగ్యంబున్న ఎంతబలమున్నా సూరమ్మా
పెట్టినతిందురు సంతోషముననో సూరమ్మా
తిట్టినవడుదుర ఎవరైన భువిని సూరమ్మ
చేతిరెడ్డి కూతుపెండ్లి చేసెదవా సూరమ్మ

సరిపోవు వియ్యమ్మ నీకు వారికిని సూరమ్మ
అత్త కోడళ్ళిద్దరేకమైతేను సూరమ్మా
పట్టపగలేదోచు చుక్కలోయమ్మా సూరమ్మా
మీయింటి సంగతులు నాకెందుకమ్మా సూరమ్మా
నీతిట్లు నేనింక పడబోనుసుమ్మా సూరమ్మా

అంటూ వీరారెడ్డి సూరమ్మకి వడ్డీతో మృదువు తప్పకుండా సమాధానం ఇచ్చాడు. ఇలాగన్నా వీరారెడ్డికి పేర్రెడ్డి పెళ్లితో జోక్యం కలిగించుకోక తప్పలేదు. తనకు తగిన పిల్లని చూడమనీ, గుణవంతురాల్ని ఎంచవలసిందనీ, పేర్రెడ్డి మిత్రుణ్ని కోరాడు. వీరారెడ్డి లోకజ్ఞుడు, వాకబు తెలిసినవాడు. పలనాటి సీమ లోనే ఒక పల్లెటూళ్ళో, ఒక బీదఇంట్లో పుట్టి పెరుగుతూవున్న వీరరాజమ్మ అనే గుణవంతురాలు పేర్రెడ్డికి తగినభార్య కాగలదని అనుకున్నాడు. వీర రాజమ్మ కూడా పేర్రెడ్డి అందచందాల్నీ, గుణగణాల్నీ విని వరించింది. ఆమె అన్నలు అదియెరిగి ఆమెకది అందరాని పండని భావించి తాము భాగ్యభోగ్యములలో తూగగలిగిన మరొకనిని ఎంచుకొనమని కోరారు. కాబోయే అత్త సూరమ్మ నోటికీ, ఆమె ధనగర్వానికీ భయపడాలన్నారు. కాని, రాజమ్మ పేర్రెడ్డినితప్ప మరొకరిని పెండ్లాడనంది. కులగోత్రములలో సాటివారమనీ అందుచే భోగభాగ్య ములలో కొంచెం తగ్గినా తన్ను గుణవంతుడైన పేర్రెడ్డి స్వీకరించవచ్చుననీ అన్నది. ఇక గయ్యాళిగంపయైన సూరమ్మ విషయంలో—

అన్నిననుయాచేయ అత్తేమియనును తమ్ముడ
అత్తేమియన్నాను ఊరుకుంటాను తమ్ముడ

అని సమాధానం చెప్పింది. రాజమ్మ తలచినట్లే పేర్రెడ్డి ఆమెను గ్రహిం చాడు. అన్నదమ్ములు వైభవంగా సారె చీరలతో ఆమెను అత్తింటికి పంపారు.

ఆ వెంటనే రాజమ్మ కష్టాలకూ, అత్తపెట్టే రంపంకోతకూ అంకురార్పణ అయింది. నించుంటేతప్పు కూచుంటేతప్పు పనివాళ్ళు తగ్గారు. రాజమ్మ చెయ్య వలసిన ఇంటిపనులు క్రమంగా హెచ్చాయి. రాజమ్మ తాను పడుతున్న కష్టాలు మాటమాత్రంగానైనా చెప్పలేదు. అమ్మలక్కల ప్రసంగాలనుంచి రాజమ్మ పడు తున్న రాయిడిని పేర్రెడ్డి చూచాయగా గ్రహించాడు. తల్లిమీద కోపం చూపిం చాడు. దాంతో సూరమ్మ ఆగ్రహం మరింత హెచ్చింది.

రాజమ్మ గర్భం ధరించింది. మనమలనెత్తే సంతోషంలో సూరమ్మ మెత్తబడవచ్చునని పేరెడ్డి అనుకున్నాడు. తల్లిని పిలిచి—

అమ్మా నీకోడలు ఉత్తాదికాదు యిటుమైని
ఏపనినైనాను చేయించకమ్మా మాయమ్మ

అని, రాజమ్మ చేతమీద బరువుపనులు పురమాయించవద్దంటాడు. దానితో సూరమ్మ తన కోడల్నీ, ఊరివాళ్ళనీ, పేరెడ్డినీ నోరుచేసుకొని తిడుతుంది. రాజమ్మని పురుడికి పుట్టింటికి పంపించటం శ్రేయస్కరమనీ, ఆమెకి అత్తగారి కత్తికోత తప్పడానికి అదే దారిఅనీ పేరెడ్డి సలహా ఇస్తాడు. రాజమ్మ అన్నలు వచ్చి, సూడిదలిచ్చి, రాజమ్మని తమ ఇంటికి పంపవలసిందని కోరారు. కాని, రాజమ్మ భర్తనువదలి వెళ్ళనంటుంది. ఇవన్నీ చూడగానే సూరమ్మకి కళ్ళు కుట్టాయి. ఆమె ఏదయినాఅంటే ఫళాధళీ అనేది కామాక్షి ఒక్కర్తే. అందుచేత ఆమె పేతిరెడ్డి ఇంటికిపోయి, రాజసూయానంతరం దుర్యోధనుడు శకునియెదర వాపోయినట్లు వాపోతుంది. అలా వాపోవడంలో లౌక్యప్రజ్ఞ చూపించింది. కామాక్షికి ఆశగొల్పుతూ ఆమెకికూడా రాజమ్మమీద కసిగలిగేలా చేసేటందుకు ఇలాగంది—

"సంగనాచిముండ నాకుసొరికింది కామాక్షి,
మగనితలపైకెక్కి నాట్యమాడింది రాజమ్మ,
లేనిపోని మాటలెన్నో కల్పించి రాజమ్మ;
పేరయ్యతోచెప్ప, వాడు నామీదకోపాన
కసరి పొమ్మన్నాడు యింటిలోనుండి యీవేళ
మాయలమారి యీరాజమ్మయైతే మగనికి;
మందు మాకులుపెట్టి మతినివిరచింది కామాక్షి
ఆయింటనేనికను ఉండలేనమ్మా కామాక్షి
నీవు కోడలివైతె కనులకద్దూదు నాతల్లి
ఎంతచెప్పినకాని మావాడునిన్ను కామాక్షి
పెండ్లియాడుట కిష్టపడలేదమ్మా నాయమ్మ
మాయలమల్లిగాడా పీరిగాడు నాతల్లి
మావాని మతిచెరచి ఆటలాడేడు పేరయ్య

వానిచేతిలో కీలుబొమ్మయైనాడు నాతల్లి
వానిపెద్దరికము సాగుచున్నాది మాయింట
వారేమిచేతురో నేనుచూతును మాయమ్మ
ఎన్నాటికైనాను నీవు కోడలివి కామాక్షి
కావాలంచు నేను దేవుాలకెపుడు ముడుపూయి గడుదు"

అని స్త్రీ సహజమైన అసూయని రేపేలా చెప్పింది. అంతటితో అగ్నిదేవు డికి వాయుదేవుడూ, ఈర్ష్యకి క్రోధమూ సాయమైనట్లు, రాజమ్మకు కామాక్షి తోడయింది.

రాజమ్మ కొడుకుని కిన్నది. పేర్రెడ్డి పుత్రోత్సాహంతో పొంగిపోయాడు. సూరమ్మ కొరకొరలాడింది. ఇరుగు పొరుగులు ఇంటికి రాకుండా ఖాయిదా చేసింది. కోడల్ని సాధించడం హెచ్చించింది. ఇలా ఉండగా పేర్రెడ్డికి పెళ్ళి సంబంధం వచ్చింది. పేర్రెడ్డినికూడా తనతో పిల్లని చూసేటందుకు తోడురమ్మ న్నాడు. ముహూర్తం నిశ్చయంకూడా చేసుకొందామనుకున్నారు. పేర్రెడ్డి సరే నన్నాడు.

సమయంకోసం కాచుకొనివున్న సూరమ్మకి అదును చిక్కింది. కామాక్షిని ఇంటికి పిలిచింది. ఇద్దరూకలిసి బాహాటంగా మనసులోని అక్కసు వెళ్ళబుచ్చి రాజమ్మని రాత్రివేళ బైటికి గెంటేశారు. రాజమ్మ చంటిబిడ్డని చంకపైచుకొని వీధిలో నిలబడింది. తనకు సవతిగా కామాక్షిని తెద్దామని తలపోసే అత్తగారి ఆలోచనని ఆమె ఎరుగును. తన భర్తను పెండ్లాడాలని కామాక్షి కాంక్షించిందని ఆమె ముందువిన్నది. అంతకు ముందెప్పుడో తనకి సవతి పోరున్నదని ఎరుక లది ఎప్పుడోచెప్పిన ఎరుక జ్ఞాపకం తెచ్చుకొన్నది. ఇవన్నీ కలబోసి ఆలోచించి భర్తసుఖమే కోరుతూ, తాను కొంతకాలమేనా ఎడగలిగివుంటే తల్లిమాటల ప్రకారం కామాక్షిని పరిణయమాడి పేర్రెడ్డి మనఃశ్శాంతి పొందగలడని అను కుంది. ఇలా తలపోసి రాజమ్మ చిమ్మచీకటి రాత్రిలో పుట్టింటిదారి బట్టింది.

నిస్సహాయయై చీకటిలో పోతూవున్న రాజమ్మ కష్టా లినుమడించేలా, జడి వాన కురియసాగింది. తల దాచుకొనేటందుకు ఇటూ అటూచూసి మెరుపుల వెలు తురులో వూరికావల ఒంటరిగా కన్పించిన ఒక పెంకుటింటి పంచకి చేరింది. అది

పాముపడిన సమ్రం. దొంగలగుంపు మొక్క ఉనికిపట్టు. రాజమ్మకి పాపం ఇదేమి తెలియదు. ఏపివలాన అక్కడికి చేరిన రాజమ్మ దొంగల అలికిడివిని అది ఆడ తోడుదొరికే ఇల్లని భ్రమించింది. ఈమె సవ్వడివిని ఒకదొంగ పైకివచ్చాడు. అతనికీమె తన పస్థితిచెప్పి జడివానలో తలదాచుకొనేటందుకు చోటీయమంటుంది. ఆదొంగ మెరుపుకాంతిలో రాజమ్మని చూశాడు. అతనిమనసు చెదిరింది. దురుద్దేశం కలిగింది. లోపల ఆడవారున్నారని నమ్మించి ఇంటిలోకి రమ్మన్నాడు. ఆమె ఆ తీయని మాటలనునమ్మి దొంగలమధ్య చిక్కింది. వారంతా ఆమెకు మొరటుగా తమ దురుద్దేశం తెలిపారు. ఆమె భయభ్రాంత అయింది. అన్నలారా నామానం కాయండిఅని బతిమాలింది. కాని, వారికామాటలు రుచించలేదు. ఇంక యుక్తిచేసి బయటపడవలసిందేనని రాజమ్మ నిశ్చయించుకొంది. కాలకృత్యాల కోసం బయటికి వెళ్ళవలసి ఉన్నదంది. దొంగలకు నమ్మిక కలగలేదు. వారికి నమ్మిక కలిగేటందుకోసం పసికందయిన కొడుకుని అక్కడే వదలింది. బయట పడగానే వారినందరినీ తలుపు గొళ్ళెంవేసి, ఆగదిలోనే బంధించింది. కొంచెం నేచిఉంటే దారిపోయేవారెవరైనా సాయం దొరకరా అనేఆశతో ఎదురుచూడ సాగింది.

దొంగలు తాము పన్నినవలలో తామే పడినట్లు గుర్తించారు. వారు రాజమ్మని ఎంతో బతిమాలారు. రాజమ్మ వారిమాటలు నమ్మక ససేమిరా గొళ్ళెం తీయనంది. నీ కొడుకుని కండకండలుగా చేస్తామని దొంగలామెని బెదిరించారు. రాజమ్మ కొడుకు ప్రాణంకంటెకూడా తనమానం ముఖ్యమనుకొంది. దొంగలను ఏమైనాసరే నమ్మి వదలగూడదనుకొంది. నిస్పృహతో దొంగలు తమదగ్గరనున్న రాజమ్మ కొడుకుని ఖండించారు. తుండెములను కిటికీలోంచి ఆమెమీదికి విసిరేశారు.

రాజమ్మకి వెంటనే మనసు చెదిరింది, దొంగలకు తగినశిక్ష చేయించాలని నిశ్చయించింది, దారే ఎవరు వస్తారాఅని ఎదురుచూచింది. ఇలాచూడగా, చూడగా కొంతసేపటికి బండ్లను—

తోలూకవచ్చేరు పదిమందియైతే నాత్రోవ
రాజమ్మ బండ్లానుచూచీ పిలిచింది అప్పుడు
బండ్లాతోలువారి కామాటలైతే వినపడక

పాటాల పాడూచు బండ్లవారైతే గబగాబ
బండ్లాతోలూచుండ రాజమ్మతల్లీ యప్పూడు
బండ్లాకెదురుగపోయి నిలిపివేసింది వారాల

విచారంతో, కోపంతో, అలసటతో, ధీతిగొలిపే ఆమె రూపంచూసి బండ్లవారు మాటరాక కొయ్యైపోయారు. ఆమె ఏడుస్తూ తన కథనంతా వివరంగా చెప్పింది. వెంటనే వారి మనసుకరిగి తమ ప్రాణాలనైనాఇచ్చి ఆమెను రక్షించాలనీ, దొంగల్ని శిక్షించాలనీ నిశ్చయించారు. ఆమె చూపినదారినే వారు ఆమె వెంట నడిచారు, రాజమ్మకూడా వీరావతారిణి అయింది.

శౌర్యంబు, బలమూను, దుఃఖంబులోనా గలుగాగ
వెంటవచ్చినవాని చేతిలోనున్నా కత్తిని
లాగి చేతనుబట్టి హుంకరించింది రాజమ్మ
పైటా కొంగునైతే నడుమూకు చుట్టింది రాజమ్మ
చీర కుచ్చెళ్ళాను వెనుకాకు విరిచికట్టింది.
జుత్తు విరియబోసి కనులెఱ్ఱజేసి రాజమ్మ
శక్తిరూపమైతె దాల్చియున్నాది రాజమ్మ
చొరబడి కత్తిని త్రిప్పుచున్నాది యప్పూడు
దొంగ లామెనుజూచి దద్దరిల్లేరు వెంటానే
పారిపోపుటకైతె యత్నించినారు ద్వారాన
కాపుగానున్నట్టి వారిజూచేరు దొంగాలు
చావూ తప్పాదుమనకు అనుకొనివారూ ఏకమై
రాజమ్మమీదాకు కత్తూలుదూసా రందారూ
కొడుకూను దలచూచు కోపముప్పొంగగా రాజమ్మ
కొడుకు చంపినపగకు మారుచేయగనొక్కొక్క
దెబ్బాను దొంగాల కొట్టూచునుండా వారూను
చిన్న కత్తులతోడ నామెనుగూడా పొడిచిరి
దేహమంతయు రక్తమయమయ్యె నప్పూడు రాజమ్మ
కన్నూలనిప్పులు గ్రక్కుచునున్నాది రాజమ్మ
వీరావతారిణీ వీరరాజమ్మ, దెబ్బకు
ఒక్కొక్క దొంగాను నరికింది....

ఇలా వీరవిహారం చేసిన వీరరాజమ్మలో మనకి కవి మహిషాసుర మర్దని అంశనీ, పల్నాటి నాయకురాలి అంశనీ ద్యోతకం చేశాడు. ఇలా పొంగల్ని కంచకంచలుగా పంపిన వీరావతారిణిలో, కొడుకు రక్తపుమడుగు కంటపడగానే, మాతృత్వము ఒక్కుమ్మడిగా పొంగి పొర్లి ఆమెను మూర్ఛలో ముంచేసింది. ఆ మూర్ఛలోంచి ఆమె మరి తేరుకోలేదు. ఆమెకు తోడుగావచ్చిన బండినాయులకి దుఃఖం, ఆశ్చర్యం, ఆమెపట్ల భక్తీ కలిగాయి. ఆమె అక్కడ పేరంటాలై వెలసింది. వీరారాధనకి పేరందిన పల్నాటిలో అది వింతకాదుకదా!

పాపం పేరెడ్డి స్నేహితుడి పెండ్లిచేయించి తిరిగి ఇంటికి వచ్చాడు. సూరమ్మ, రాజమ్మ ఇల్లువీడి పోడానికి కారణాలెన్నో కథలల్లి చెప్పింది. పేరెడ్డి కాబోలనుకున్నాడు. కాని, వీరెడ్డికి అనుమానం కలిగింది. అతను ప్రక్కూరిలో జరిగిన కథ విన్నాడు. అక్కడ పతివ్రతా మాతృత్వప్రేమలు రూపొంది వెలసిన పేరంటాలుకథ విన్నాడు, ఆపేరంటాలు వెలసినరోజూ రాజమ్మ ఇల్లు వెడలిపోయినరోజూ ఒకటేనని గ్రహించాడు. మరికొంత చర్చచేసి ఆపేరంటాలే రాజమ్మఅని గుర్తించాడు. ఆమె గతిమాలిన స్థితికి సూరమ్మా, కామాక్షీకలిసి చేసిన కుట్ర కారణమని నిరూపించడానికి అతనేమీ సందేహించలేదు. వెంటనే అతను కలరూపు పేరెడ్డికి తెలిపాడు. కాని, ఏమిలాభం. చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకోవడం. తల్లిని పరమ రాకాసివని నిందించి నీయింటనొక్క నిముషమైనా ఉండననీ, కామాక్షితో నీవు కులుకుతూ ఉండమనిచెప్పి, అన్నీవిడిచి రాజమ్మనే తలచుకొంటూ ఎక్కడికో పోయాడు. అంతప్రేమా, అంతసౌశీల్యమూ గల భార్యగతికి శోకించి మనసు చలించకుండా పేరెడ్డి ఎట్లామనగలడు? ఈ విషాదగాథకి అంతకంటె సబబైన ముగింపు మరేమివుంటుంది?

మొత్తంమీద కవి ఈ సాంసారిక కథని చక్కగా నడిపి జానపద మానసిక తత్వాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించాడు. "ఇంటిలోపోరు మంచిదికాదు, సిరి తొలగిపోవు, నలుగురూ నవ్వుదురు. నగుబాట్లుగలుగు, లోకాన అపకీర్తి వచ్చు, అన్నీచెడిపోవు. కోడండ్రికముమాని అత్తలు కోడళ్ళలాలించి పాలించుచుండవలెనని" నీతి బోధించాడు. పెళ్ళివర్ణించినా, ఎరుకత చెప్పించినా, అమ్మలక్కల మాటల వర్ణించినా, కవి జాతీయపు నుడికారం ఒప్పించాడు. అన్ని జానపద రచనల్లోనూ కల్పించే వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలుతప్ప ఇందులో మరేలోపాలూ కన్పించవు.

## లక్ష్మమ్మ కథ

సాంసారిక కథా వాఙ్మయంలో లక్ష్మమ్మకథ గుంటూరు మండలంలో ఎక్కువ ప్రచారంలో ఉంది. ఈ కథని గురించి ఉమాకాంత విద్యాశేఖరులు యిలాఅన్నారు.

"ఒకప్పుడు మహావీరులకు క్షేత్రమైన పల్నాడు ఈ మధ్యకాలంలో లక్ష్మి అమ్మవారి మహాత్మ్యాన్ని ప్రదర్శించగలిగింది. కటికి కుటుంబపు కోడలి క్లేశాలన్నీ అనుభవించి ప్రాణాలు విడిచేసమయంలోకూడా చంపుతున్న భర్త హస్తస్పర్శను అభిలషించిన యీ సాధ్వి స్థానం దుర్గి. ఈమె కమ్మవంశానికి చెందింది. తండ్రి దిగుమర్తి ముసలప్పనాయుడు. ఆంగ్లకవి ఓథెల్లోను స్మరింపజేసే చిరుమామిళ్ళ వెంకానాయుడు, లింగాపురవాసి, ఈమెభర్త. ధర్మపరతంత్రయైన ఉదాత్త భారతీయ గృహిణికి సర్వకాలాల్లోనూ ఉదాహరణగా ఉండగలిగిన ఈమె ఇప్పటికీ పూజిత అవుతున్నది. ఈమె ఇతిహాసాన్ని సంచారి కథకులు ఇప్పటికీ కీర్తిస్తున్నారు" వారి వాక్యాలు లక్ష్మమ్మ కథకేకాక అలాంటి భావాలతోకూడిన వీరరాజమ్మ, సన్యాసమ్మ, కామమ్మ, నల్లతంగాళ్ కథలకుకూడా అన్వయిస్తాయి. జానపద కథా వాఙ్మయం తమకోసం కాదనుకునే విద్యాధికులకు విద్యాశేఖరులవారి వాక్యాలు కనువిప్పు కలిగిస్తాయి.

లక్ష్మమ్మ కథని కాకర్లరాజు పుటిగంటి వీరయ్యదేవదాసు రచించాడు. కథలో ఏమీ అసందర్భాలుగాని అసామాన్య విషయాలుగాని లేవు. భక్తిపరులు నమ్మడానికి అనుగుణంగా లక్ష్మమ్మ విగ్రహరూపంలో పుట్టుశిలగా వెలిసిందన్న మాటమాత్రం కవి సమయంగా గ్రహించాలి. ఇల్లరికపు అల్లుడితనం వెంకయ్యలోనూ, అత్తగారితనం వెంకమ్మలోనూ, ఆడబిడ్డతనం పిచ్చమ్మలోనూ మూర్తీభవించాయి. ఓర్పులో భూదేవికీ, పాతివ్రత్యంలో సీతాది సాధ్వులకీ సమానమై లక్ష్మమ్మ నూటవొక్కగుడులలో పల్నాటిసీమఅంతటా పూజలందుకుంటూన్నది. అది ఆమె దివ్యస్మృతికి, వీరారాధనకు పేరుగాంచిన పల్నాటిసీమ వారేర్పరచిన కట్టుబాటు. ఈర్ష్యావశుడైన భర్తని మన కావ్య వాఙ్మయంలో ఏకవీ చిత్రించలేదు. కాని నిత్య జీవితంలో అలాటివారెందరో ప్రత్యక్ష మవుతూనే ఉంటారు. జాతి జీవితాన్ని ప్రతిబింబించే వాఙ్మయంలో అనునిత్యం మన కళ్ళబడే పాత్రలను చిత్రించకపోవడం ఒక లోపమే. ఆలోపం లక్ష్మమ్మ కథవల్ల తీరింది.

లింగాలపురంలో గోషాలిగిన కమ్మవారి సంస్థానం చిరుమామిళ్ళవారిది. వారిలో పెద్దవాడు సుబ్బారాయుడు, రెండోవాడు కోటయ్య. మూడోవాడు వెంకయ్య. పెద్దవారిద్దరికీ పెళ్ళిళ్ళయాయి. మూడోవాడు వెంకయ్యకి పెండ్లికాలేదు. ఈముగ్గురు అన్నదమ్ముల తల్లిపేరు వెంకమ్మ. పిచ్చమ్మ వారి తోడబుట్టింది.

వెంకయ్యనాయుడు మరిద్దరు కమ్మగౌరలతో కలిసి ఎద్దులబేరంకోసం, లింగాలపురం వెళ్ళాడు. అక్కడ దిగుమర్తివారి సంస్థానంలో ముసలప్పనాయుడి ఇంటికి వెళ్ళాడు. ముసలప్పనాయుడుకి రామయ్య, కోటయ్య, అనే ఇద్దరు మగ బిడ్డలూ లక్ష్మమ్మఅనే ఆడపిల్లా ఉన్నారు. ముందు తానొక జన్మంలో నాగకన్యగా లక్షుమమ్మ జన్మమెత్తవలసి నరజన్మమెత్తిందా అన్నట్లూ,. బంగారంపు ప్రతిమ చందంగానూ ఉంది. వెంకయ్య ఆమెనుజూచి పెండ్లాడాలని ముచ్చటపడ్డాడు. అతను మనసులోని మాటను తన స్నేహితులతో చెప్పాడు. వారుకూడా ముసలప్పనాయుడితో తాము పప్పుఅన్నాలకు వచ్చామని ప్రస్తావించి సంబంధం సంగతి ఎత్తారు. ముసలప్పనాయుడు పెద్దవారిని రావలసిందనీ లక్షుమమ్మని పరాయియింటికి పంపించదలుచుకోలేదనీ అల్లుడు తమఇంటికి ఇల్లరికం రావాలనీ చెప్పాడు.

లక్షుమమ్మకీ, వెంకయ్యకీ పెండ్లిమాటలు జరిగాయి. పెండ్లి వైభవంగా జరిగింది. కవి వివరంగా పెండ్లివేడుకలు వర్ణించాడు. సుబ్బారాయుడు తమ్ముడితో అత్తమామల్ని తలిదండ్రులతో సమానంగా చూసుకోమనిచెప్పి ఇల్లరికం పంపాడు. ముసలయ్యనాయుడుకూడా అల్లుడని భేదమెంచక పుత్రనిర్విశేషంగా చూసుకోసాగాడు. దావమరుదులుకూడా తమ బావని చూడందే ఒక నిముషమైనా ఉండలేరు—

అల్లిదామర అల్లిన చందముగాను
మల్లెపుష్పము వికసించినట్లుగానూ

వెంకయ్య, లక్ష్మమ్మలు హాయిగా ఉన్నారు. వరహాలపెట్టె బీగమూ, ఇంటిలోలెక్కలూ, బేరసారములూ ముసలప్ప వెంకయ్యచేతికే ఇచ్చాడు. లక్షుమమ్మలో పతిభక్తితోపాటు, భక్తిరసంకూడా ఒకపాయగా వెల్లివిరిసింది. ఇలా కొంతకాలం హాయిగా జరిగింది. లక్షుమమ్మ గర్భవతియైంది. ఆమెకు ఆరవనెల వచ్చింది. వెంకయ్యనాయుడిలో లూపలోభం పొటమరించింది. అది అతనిని తప్పు

దారి పట్టించింది. భోగందాన్ని మరిగాడు. భార్యను కన్నులచూస్తే పొంచప్రమునుని చూచినట్లు చూడసాగాడు. భార్యచేతి అన్నంతినడు. తాంబూలం అందిస్తు, లక్ష్మమ్మ ఈసంగతి ఎవరితోనూ చెప్పదు. తనలోతానే కుమిలిపోతుంది. నెలలు నిండినతర్వాత ఆడబాలను కన్నది. పార్వతమ్మఅని పేరుపెట్టుకొంది. గారంగా పెంచసాగింది. ఒకరాత్రి అంతా నిద్రిపోతూఉండగా వెంకయ్య వీధిలోకి పోబో తున్నాడు. లక్ష్మమ్మ భర్తని చేయిపట్టుకొని ఆపి తనవల్ల దోషమేమని అడిగింది. వెంకయ్య, పాదాలమీద పడిన భార్యనొక దెంపపెట్టు పెట్టాడు. ఆమె అవమాన భారంచేత వివశయై ధరణికొరిగి మూర్ఛిల్లింది. వెంకయ్య వెంటనే నిష్క్రమించాడు తాను చేసినపని మునలయ్యకీ, పుత్రికకీ, ఆగ్రహ కారణమౌతుందనీ, తానిక అక్కడనుండుట క్షేమకరం గాదనీ ఎవరితోనూ చెప్పకుండా, ఏమీ తీసుకోకుండా లింగాలపురం దారిబట్టాడు.

వెంకయ్యని తల్లి అప్పచెల్లెలు ఏంవచ్చావన్నారు. ఎన్నాళ్ళక్కడడున్నా, తన ఇంటిపేరు వాసికెక్కదని వచ్చేశానని సమాధానం ఇచ్చాడు. పెళ్ళినాడనుకున్న మాట తాటోటు అయిందని సుబ్బారాయుడు చింతించాడు. అక్కడ మునలయ్య మొదలైనవారు వెంకయ్య ఏమయాడోఅని కంగారుపడ్డారు. లక్ష్మమ్మ తనంతట తాను మూర్ఛనుండి తేరుకొంది. తనకూ భర్తకూ మధ్యజరిగిన విషయమేమీ తల్లితోడుతో చెప్పలేదు. రామయ్య వెతుక్కుంటూ లింగాలపురంవచ్చి బావ గారినిచూసి వచ్చేవారు చెప్పి రాకూడదా అన్నాడు. సుబ్బారాయుడితో మీ మరద లిని త్వరగా పిలిపించుకోండని చెప్పాడు. లక్ష్మమ్మ చీరెసారెలతో అత్తింటికి చేరింది. వారింట తులసి బృందావనానికి గొప్పు తవ్వించడం మొదలుపెట్టింది. గడ్డపార వేసీవేయగానే ఐదు లంకెబిందెలు బైటపడ్డాయి. లక్ష్మమ్మ ఇంటికి రాగానే లక్ష్మి వచ్చిందని అంతా పొంగిపోయారు. ఆమెను కావలసిన నగలు చేయించుకొమ్మన్నారు. కాని. ఆమె "నా పెనిమిటి నాతో పలుకుతూ, నవ్వుతూ, పేలుతూఉంటే అదే నాకు సొమ్ము'' అని నగలేవీ వద్దంది.

అత్తవారింట్లో లక్ష్మమ్మకు పతినిరాదరణవల్ల కలిగిన విచారానికి, అత్త ఆడుబిడ్డల కత్తికోత తోడయింది. పార్వతమ్మని ఆడబిడ్డ పిచ్చమ్మకొడుక్కిచ్చి పెళ్ళిచెయ్యాలని వారికోరిక. కాని, పార్వతమ్మని సోదరుడు రామయ్యకిచ్చి చేయా లని లక్ష్మమ్మా, చేసుకోవాలని ఆమె పట్టింటివారూ ఆబిడ్డ పుట్టినప్పుడే అనుకొ న్నారు. తమ ఉద్దేశానికి విఘాతం కన్పించగానే వెంకమ్మా, పిచ్చమ్మా వెంక

య్యతో పుల్లింగాలు చెప్పసాగారు. వారు ఆమె సౌశీల్య లోపాన్ని గురించి నీలాప నిందలు వేయసాగారు. వెంకయ్య ఎంతచెడినా, భార్యశీలాన్ని అనుమానించేటంత నీచుడుకాలేదు. ప్రత్యక్ష ప్రమాణంలేనిదే తాను వారి మాటలనువేనినీ నమ్మనని ఖండితంగా చెప్పాడు. కల్పిత వాక్యాలవల్ల పని జరగదని, వెంకమ్మ కపటపు పన్నికపన్ని పాలికాపుని, లక్ష్మమ్మనీ లక్ష్మమ్మ పడకగదిలోచేర్చి వెంకయ్యని పిలిపించి ఆదృశ్యాన్ని చూపింది. వెంకయ్య అవిమృశ్యకారియై వెంటనే లక్ష్మమ్మని కత్తితో పొడిచి పొడిచి చంపాడు.

పతివ్రతయైన భార్యను చంపినపాపంతో వెంయ్య రెండుకండ్లూ పోయాయి. తడుములాడుకోసాగాడు. మరణాసన్నయైన సాధ్వి లక్ష్మమ్మ " తన పురుషుడి చాయకండ్లజూచి, చేతులుయెత్తి దండముపెట్టి " సెలవు తీసుకొంది.

లక్ష్మమ్మ మరణంవల్ల తమకు పేచీరాకుండా ఆమె అత్తింటివారు—

కుంకుడుకాయలు వూటదీసీ
నోరికైననూ పూసినారుతండ్రి
నాగుబాము కరచిందంటానే
పండబెట్టిగా వుంటారమ్మయ్యా

కాని వారి దాయాదులు లక్ష్మమ్మని అన్యాయంచేసి చంపివేశారని ఎత్తుబళ్ళు చెయ్యకుండా అటకాయించారు. లక్ష్మమ్మ వారిలో ఒకరినిపూని—

నన్ను పరాయివారు చంపలేదు
నా పురుషుడే నన్ను చంపినాడు
మీరు ఖాయిదా అయినావరచువద్దు తండ్రి

అని చెప్పి వారిని వారించింది.

లక్ష్మమ్మని సగౌరవంగా దహనం చేశారు, మరునాడు కాష్టంమీద 12 కావిళ్ళ పాలు పోశారు. వెంటనే నాగలోకమ్ములో తిరుమురు (తిమ్మిరి ?) పెట్టినట్లయి పుట్టుశిలయై లక్ష్మమ్మ లేచివచ్చింది. అది చాతబడి లక్షణమని కొందరు శంకించారు. వారికీ, ఈ విషాదగాధకి కారకులైన అత్త, ఆడుబిడ్డలకూ కండ్లు పోయాయి.

లక్ష్మమ్మ పేరంటాలై పూజలందుకొంటూ, సంతులేనివారికి సంతూ, కండ్లులేనివారికి కండ్లూ వరాలుగా ఇయ్యసాగింది. రామయ్యా, తమ్ముడూపగ దీర్చుకోవాలని వీరభద్రుడిలా ఉగ్రరూపంతో లింగాలపురంమీదికి వచ్చారు. లక్ష్మమ్మ గణాచారికిపూని ఒకరిమీద కోపం చెయ్యవలసిన కార్యంలేదని వారినిఆపి పార్వతమ్మని దగ్గిరికి కొనిపోయి వివాహం చేయమని కోరింది.

ఇలా మానవిగాపుట్టి, ఆదర్శ గృహలక్ష్మిగా జీవించిన లక్ష్మమ్మ, పేరంటాలై దేవతలలో కలిసింది. మన జానపదులకు స్మరణీయయై, పూజనీయయై వెలిసింది. ఆంగ్ల వాఙ్మయంలోని ఒథెల్లో విషాదాంత నాటక గాథతో తులతూగే గాథ మన వాఙ్మయంలో సృష్టియైంది. వెంకయ్య ఒథెల్లోకీ, అత్త ఆడబిడ్డలు మొత్తంగా కుచ్చితుడయిన ఇయాగోకీ ఉజ్జీలయారు. ఈ కథని చేయితిరిగిన రచయితలు సానదీర్చినట్లయితే మన సాహిత్యానికిక ముఖ్యాలంకారం లభిస్తుంది.

## నల్లతంగాళ్ కథ

నల్లతంగాళ్కథ అనే పేరితో ఒకకథ దక్షిణాంధ్రంలో ప్రచారంలోఉంది. ఈకథకి రంగస్థలం మధుర. అందుచేత తెలుగుప్రజలూ, తెలుగు సంస్కృతీ మధురవరకూ చొచ్చుకొనిపోయి ఈకథకి కారణమైనాయి.

మధురాపురాన్ని మనునీతి ప్రకారం రామలింగంఅనే రాజు, భార్య ఇంద్రాణితో పాలిస్తూ ఉండేవాడట. సంతానంలేక శివునిగురించి తపస్సుచేసి నల్లతంబి, నల్లతంగాళ్ అనేవారిని కన్నాడు. నల్లతంబి విద్యావంతుడై వయసురాగానే కుంతలరాజు కూతురయిన మూళియలంగారిని పెండ్లాడాడు. కోడలి గృహప్రవేశం, అత్త గంగాప్రవేశమూ జరిగాయి. రాజు తపస్సులో ఉండిపోయి నీతి నల్లతంగాళ్ని యెల్లప్పుడు పంటపండే దేశంలో మంచి స్త్రీధనంఇచ్చి పెండ్లిచేయమని చెప్పాడు.

కాశీమహారాజు నల్లతంగని పెండ్లాడాలనుకున్నాడు. పదిలక్షల బంగారం ఇచ్చాడు. నల్లతంబి వారిద్దరికీ వివాహం చేశాడు. నల్లతంబి చెల్లెలికి—

మేపగట్టున నిండియుండు బర్రెగొడ్లు * శ్రీధనము
అడవియందు నిండియుండు అవుమేక శ్రీధనము
మెరుగల భూములున్ను పంటభూములు శ్రీధనము
గొంతుకు బంగారు గోధుమ పూసలున్ను
ముఖమున గట్టుటకు ముత్యపు పూసలును
బంగారు కడియములు, పగడాల కడియములు
కూర్చుండి పెరుగు చిలుకుటకు ఆనుపీటలు బంగారుతో
చేపట్టి పాల్పితుక చేత్రాడు బంగారుతో
ఆనుకొని పాల్పితుక అనుత్రాడు బంగారుతో
శ్రీధనము లేదేయని చెప్పనేల చెల్లెలకు
ఆరులక్ష దాసస్త్రీలనప్పుడు తానుపొందె
వక్కాకు మడిచియివ్వ వనితల తానుపొందె
దక్షిణపు పక్కనుండు టెంకాయ తోటలున్ను
ఉత్తర దిక్కుననుండు ఉత్తలున్ను
ఇన్నిన్ని శ్రీధనము తానుపొందె నల్లతంగ

తర్వాత నల్లతంబి,

పాలునందు తక్కువనా భాగ్యమందు తక్కువనా
పూపునందు తక్కువనా బంగారు బొమ్మనీకు
యెక్కుమమ్మా పల్లకిలో మెరుకగల నాదుచెల్లి

అని వీడ్కొలిపి తంగని అత్తవారింటికి పంపాడు.

తంగ అత్తవారింట రచ్చలేకుండా పోరులేకుండా సుఖంగాఉంది. ఏడుగురు బిడ్డల్ని కన్నది. ఇలా కొంతకాలం గడిచింది. కాని, తర్వాత పండ్రెండుసంవత్సరాలు వానలులేక కరువు వచ్చింది. అన్నీ అమ్ముకుతింది. చివరకి తంగ ఆకలికి తాళలేక భర్తతో తన అన్నయింటికి పోదామంది. ఆమెభర్త ఆమాటని ఆమోదించక—

---

* స్త్రీ ధనము.

ఓసి యెప్పుడుపోవ ఉత్తమము కాదబల
బ్రతికి చెడి పోరాదుబాల యొకరింటికిని

అని అన్నాడు. పిడకలుతట్టి, కూలిపనిచేసి, కట్టెలు కొట్టియైనా కాలం స్వతంత్రింగా గడపడం భావ్యమన్నాడు. తాను రానన్నాడు. నల్లతంగ భర్తమాట వినలేదు. బిడ్డలతోకూడా తల్లితోడుమీద నమ్మకంతో అన్నగారింటికేగింది. ఆమెభర్త బిడ్డలను భద్రింగా చూచుకొమ్మని హెచ్చరించి తాను తనచోటనే ఆగి పోయాడు.

పుట్టింటికి బయలుదేరిన తంగకి అన్నీ అపశకునాలే ఎదురయ్యాయి. మార్గ మధ్యంలో అడవిలో దారితెలియక ఏడుపసాగింది. అక్కడ నల్లతంబికి చెల్లెలి మీద కలలువచ్చాయి. అతనికి మనసు సరిపడక వేటకోసం అడవికి బయలు దేరాడు. అతనికి అక్కడ దారితప్పి ఏడుస్తున్న నల్లతంగ ఎదురయింది. ఆమె బికారివేషంవల్ల చూచికూడా గుర్తుపట్టక ఎవరివమ్మా నీవు అనిఅడిగాడు. నల్లతంబి ఏనుగునీ, గుర్రాన్నీదిగి విచారపరీత మనస్కుడై —

ఏనుగు లెందుబోయె నీవేలుచున్న రాజ్యంలో ?
పల్లకీలు కరవాయెనా పణతినీదు దేశమూన ?
దాసీలేమైరి ధర్మగుణ నల్లతంగా ?
పొలునందు తక్కువనా, భాగ్యమందు తక్కువనా
ఏమి తక్కువవచ్చె ఈ యడవి నీవురాగాను
తాటాకులేదా నీకు ధరణియందు వ్రాయుటకు

అని చెల్లెలి దుర్గతికి వాపోయాడు. ఇలా కొంతసేపు వాపోసి తనయింటి గుర్తులుచెప్పి పిల్లలకు తినేటందుకు రుచ్యమైన ఫలాలూ, ఆడుకొనేటందుకు పిల్ల జింకలనూ తెస్తాననిచెప్పి వెళ్ళమన్నాడు. తంగ ఒంటరిగా అన్నయింటికి తానున్న దీనస్థితిలో పోయేటందుకు తటపటాయించింది. అన్నతో—

అన్నా ! ఓయన్నా నాకాశఅయిన అన్నావిను
తల్లికలిగిఉంటే తావిలచు ఆశతోను
తల్లిలేని బాలనేను తాచెదెను సిరీనాకు
తండ్రిలేని బాలనేను ధరణిలో మంచిలేదు

మూళియలంగారి మూదేవి మాదవంటాళ
రమ్మని పిలుచునో రచ్చచేసి పొమ్మనునో
తోబుట్టువు నీవుండె సొంతమెంతో అధికమగును
నీవులేని యింటిలోకి నేను పోవగాలనన్నా

అని నోరుతెరచి చెప్పింది. తంబి పరవాలేదని ఆమెకి ధైర్యం కలిగేలా చిన్నప్పటినుంచి పెంచిన దాదిఉందని చెప్పి పంపించాడు.

అన్న మాటలతో తేరుకొని తంగ అతని ఇంటికేగింది. తంగ రాకడ చూచి ఆమెవదిన, సొమ్ములన్నీ దాచింది. తలుపులు మూయించింది. మురికి బట్టలకట్టి మూలుగుతూ పండుకొంది. తంగవచ్చి తలుపుదగ్గర అరచింది. మూదేవి తన నోటి ముత్యాలు రాలునేమో అన్నట్లు మాటయినా ఆడలేదు. నల్లతంగ తల్లి యింటివాకిలి తెరచుకొనవలెనని ఆక్రోశించింది. ఆ పతివ్రత వాక్యం మూలాన ఇంటితలుపులు విడివడ్డాయి. తంగ లోపలికివెళ్ళి, ఆకొన్న తన పిల్లలకు టెంకాయ మామిడికాయలుతీసి ఈయబోయింది. వాటిని మూళియలంగారి పిల్లలు తినబోయే కాయల్ని వారి చేతులలోనుంచి లాగేసింది. తంగ గోడుగోడుమని దుఃఖించింది. వదినెకంత కష్టమేలనిఎంచి—

ధర్మపత్ని నేనైన తగిలి రగులవలెను నిప్పు
అంబలిచట కాగవలెను, ఆకబిడ్డ రాగవలెను

అన్నది. ఆమె పాతివ్రత్య మహిమవల్ల నిప్పు కల్పించి, రగిల్చి, అంబలికాచి, ఆకలితో అలసిన తన బిడ్డలకా అంబలి పోయమంది. ఆమె వదినె దానికీ ఒప్పలేదు. ఇరుగు పొరుగులవారితో తనఅన్న ఇంటికి తిరిగిరాగానే తనకు వదినె జరిగించిన పరాభవాన్నీ, వారు చూసిన సంగతులనూ చెప్పండనికోరి పిల్లలతో తిరిగి అడవిదారిపట్టింది. తాను వెళ్ళినదారినే గుర్తుగా తంగేడుఆకుల్ని వెదజల్లుతూపోయి, ఒకచోట తనచేతి ఉంగరాన్నికూడా వదలింది.

తిరిగి అడవికి చేరిన తంగకి ఏమిచేయడానికీ పాలుపోలేదు. భర్త మాట మీరిన పాపినని యేడ్పించింది. సతీదేవి జ్ఞాపకానికి వచ్చిందోయేమో తనకిక జీవించేటందుకు హక్కులేదనుకుంది. మరణించవలెనని నిశ్చయించి కన్పించిన గొల్లవారిని అడవిలో పాడుబావి లేదాయని వాకబుచేసింది. పాడుబావి యొగడ

తెలుసుకొని అక్కడికిచేరి తన మాంగల్యమే పర్వతమంత బరువౌగాకయని ఆ ఉత్తమి ఒకర్నీ వదలకుండా పిల్లల్ని బావిలోవిసిరి వారివెంట తానుకూడా దూకింది.

అడవిలో వేటాడుతున్న నల్లతంబికి దుష్టశకునములు తోచాయి. తంగ ఎక్కడ ? అని పలవరిస్తూ ఇంటికి వచ్చాడు. మాయలమారి భర్తకుపచారములు చేసింది. తాను ఆడబిడ్డనీ, పిల్లల్నీ ఆదరించితిననీ మంచినీరు తేవడానికి తాను వెడలిన దోసందుచూసుకొని పిల్లలతో తంగ యెక్కడికో పోయిందనీ, తాను వారికోసం వెతికి వేసారితిననీ, వగలుపోయింది. ఇరుగుపొరుగువారు తంగ రావడం, అలమటించిపోయి, తిరిగి అడవికి పోవడం జరిగింది జరిగినట్లుగా తంబికి చెప్పారు. వెంటనే తంగను వెతకి తీసుకొని వద్దామని తంబికూడా అడవికి వెళ్ళాడు.

అడివిలో తంగ వదిలిన ఆనవాళ్ళనుచూచి, గొల్లలసాయంతోటే తంబి పాడు బావిదగ్గరకు చేరాడు. అందులో చచ్చిపడివున్న అభిమానవతినీ, ఆమె పిల్లల్నీ చూచాడు. శోకించి. శోకించి వారందరినీ "తూకివత్తి" దహనం చేయ బోయాడు. చితి మండలేదు, వెంటనే తంబి చనిపోయిన చెల్లెలినుద్దేశించి—

ఏమమ్మా చెల్లీ నీకు యింత కోపమేలవచ్చె ?
మంటలు లేచెనేని మళ్ళి పగదీర్చెదను
నిప్పులేని మండెనేని నీదుపగ దీర్చెదను

అని బాసచేశాడు. మంట రగిలింది.

తంబి నగరుకు చేరాడు. ఎవరితోటీ మాటాడకుండా ఎనిమిది దినము లున్నాడు. విచారంతో, ఏమిచెయ్యడానికీ తోచక, పగ తీర్చేటందుకు ఏదారీ నిశ్చయించుకోలేక ముసుగు బిగదన్ని పండుకున్నాడు. మూళియలంకారి భర్తను చూచి, అతను చెల్లెలిపోబడి తెలియక విచారిస్తున్నాడనుకొని—

ఏమయ్యా రాజపుత్రా యేలకోపము నాపై
పోకిరి చెల్లెయది పోతేపోనిమ్ముగాని
వేటాడివచ్చినట్టి వివరమేమొ చెప్పుమయ్యా,

అని లాలించబోయింది. నల్లతంబి ఏమీ మాటాడకుండా—

ఆరు నెలల పుత్రమొకటి ఆతిప యున్నాడినాకు
ఆపుత్రము కానానే అబల నేనుందునీతో

అని. నీకూ నాకూ మధ్యన ఒకదివ్వ ఉన్నాడు: ముందు వాడికి పేరంటం వెయ్యాలిఅని నిశ్చయించాడు. బిడ్డల్నిపిలిచి భార్య తన చెల్లెలికి చేసిన అపకారం వివరించిచెప్పి. పాపిష్ఠైన భార్యనీ దాని బంధువర్గాన్నీ ఒకేసారి చంపాలనే తన నిశ్చయాన్ని వారికి తెలిపి, అందుకోసం రాతిస్థంభాలతో సూత్రపందిరి నొక దానిని నిర్మించవలసిందని కోరాడు

నల్లతంబి కొడుకుపెళ్ళికి మూదేవి సేనలన్నీ వచ్చాయి. ఆమె బంధుకోటి అంతావచ్చి చేరారు. తంబి తనవైపువారెవరూ పెళ్ళి పందిరిలోకి రాకుండాచేశాడు. వారందరికీ తంగ మరణవార్తలు పంపాడు. ఇక పెండ్లిపందిరిలో చేరిన వారలంతా పెండ్లికొడుకుకి కట్నాలు చదివించారు. వారంతా మూళియలంగారి తరఫు వారే. ఇదిచూసి మనసాపలేక తంబికొడుకు—

అయ్యా. ఓఅయ్యా అడిగెదె నేనొకటి
నీయొక్క తోబుట్టువు నెలత నల్లతంగా
పణతియొక రాజ్యమును పాలించు చున్నదిగా
ఆక్రాల్గంటి పేరునందు కట్టుమొక పట్టమునె
అత్త పట్టమొకటి కట్నం అందవలెను నాకిపుడు

అని మేనత్తమీది మమకారాన్నీ. ఆమె రానందుకు తానుపడే చింతనీ వ్యక్తంచేశాడు. కొడుకిలా మేనత్తపేరు తలవగానే నల్లతంబి కోపమూ, విచారమూ పైకుబికాయి. వెంటనే కొడుకుతో ఒదలుమరచి—

" అత్తను చంపినదోయి అధికపాపి నీతల్లి "

యని ఖడ్గందూసి పగతీర్చుకొనేటందుకు వేసిన పథకంమరచి మూళియంగారిని చంపడానికి పోబోతాడు. కొడుకు ఇంగితజ్ఞుడు. తండ్రి చెప్పకపోయినా జరిగిన సంగతు లాతడంతకుముందే గ్రహించాడు. సూత్రపందిరి రహస్యాన్నీ. ప్రయోజనాన్నీ అతడెరుగును, అందుచేత పెండ్లివారికిట కోపం చెయ్యవద్దని తండ్రిని వారించి, తన అత్తపగ తీరడం తన అభిమతమనీ, మూళియొక్క

సేనలకూ బంధుకోటికీ ఒకేసారి మోక్షమిప్పించాలనీ, చేసినప్లాను చెడనీకుమనీ తండ్రిని శాంతింపచేశాడు. పెండ్లి యధాక్రమంగా సాగింది. భోజనాలకి లేచారు. మూళీ బంధువర్గమూ, సేనా సూత్ర పందిరిలో కూర్చున్నారు. వారికి కొరాని శకునాలు కాసాగాయి. వారంతా విందుభోజనం హడావిడిలో నిమగ్నులై యుండగా తంబి శిల్పుల్నిపిలిచి సూత్రిపందిరి పడేలాగ సూత్రిం లాగమన్నాడు. క్షణంలో పందిరి క్రిందికి ఒరిగింది. సేనా, బంధుకోటీ మూలముట్టుగా నశించాయి. మూదేవి అదిచూచి చేతులు పిసుకుకొంటూ ఒంటిగొంతుతో ఏడువసాగింది. అది చూచిన తంబికి ఆగ్రిహం కట్టతెగింది. అతడు పనవి పనవి—

యెనమండ్రినూ జంపిన హీనజాతి యిందురావె
తంగకు భంగముల నీవు తలచి చేసినావు అని
సిగపట్టి యీడ్చి దాని చేతనుండు కత్తిచేత
నాలుకకోసె మూళిని నాగవల్లి పందిరిలో
కొప్పుకోసి గొంతువదలి........

గాడిదమీద నెక్కించి ఊరేగించి కాల్చి చంపి తంగపగ తీర్చాడు.

ఇంత జరిగింతర్వాత అక్కడ కాశీరాజుదేశంలో వర్షాలు కురిశాయి. దేశం తిరిగి సుభిక్షమైంది. ఆరాజు భార్యా బిడ్డలకోసం మధురకు వచ్చాడు. చెప్పలేక చెప్పలేక తంబి జరిగిన కథఅంతా చెప్పాడు. బిడ్డలులేని తనకిక రాజ్యం ఎందుకని ఆరాజు ఆత్మహత్య చేసుకొన్నాడు. తంబికూడా తంగలేని రాజ్యం తనకేలని దేహం వదిలాడు. వీరందర్నీ శివ పార్వతులు కైలాసానికి కొనిపోయారు.

ఈ కథలో కవి మధురానగరాన్నీ, అన్నా, చెల్లెళ్ళ సౌహార్దాన్నీ మాయల మారి మూదేవి చాతుర్యాన్నీ సహజోక్తులతో వర్ణించాడు. సూత్రిపందిరి నిర్మించి దానిద్వారా పగ తీర్చుకొనడం మిల్టన్‌కవి కావ్యంలోని కథానాయకుడు సామ్సన్, ఫిలిస్టైన్‌లమీద పగ తీర్చుకొన్న విధానాన్ని జ్ఞాపకం చేసేదిలాగుంది. కథలో అసందర్భాలు లేకపోతే ఇది చాలా చక్కనికథ అనడానికి వీలయేది. అవి యీ పదకర్త అనుభవజ్ఞుడూ, సిద్ధహస్తుడూ కాని జానపద రచయిత కావడంవల్లనే కలిగాయి. అందుచేత ఈరచన కేవలం పుట్టు రత్నంలాంటిది. ఆరు యోజనాల దూరంలోనున్న నల్లతంగ రాజ్యంలో కాటకమూ, మధురలో సుభిక్షమూ ఎలా

సాధ్యమయ్యేదో మనం ఊహించుకోవలసిందే. ఏనుగుమీద, గుర్రాలతో సైని కులతో వేటకెళ్ళిన తంబి నిస్సహాయురాలై దీనస్థితిలోనున్న తంగని చూశాడు. ఆమెను తన ఇంటికి పొమ్మని తన ఇంటిగుర్తులు (అక్కడే పుట్టి పెరిగిన ఆమె కవి తెలియవా?) చెప్పి పంపాడు. కాని, సేనలో ఏ ఒకరిద్దర్నో తోడిచ్చి పంపాలనేనా అతనికి ఎందుకు తోచలేదో. ఈ లోపమే కథని ఇలా నడిపించింది. విషాదాంతం చేసింది. ఈ లోపాల్ని పరిహరించి రసవంతమైనట్లు దిద్ది తీర్చినట్ల యితే బాగుంటుంది. ఈ లోపాలతో కథకు కాళ్ళు చేతులూ ఏమిటన్న సామెతకే రచన లక్ష్యంగా ఉంది.

## 6. అద్భుత రస ప్రధాన కథా వాఙ్మయము

అద్భుత రస ప్రధానమైన కథలు అన్ని భాషల్లోనూ స్త్రీలనూ, బాల బాలికలనూ, జానపదుల్నీ ముగ్ధుల్ని చేస్తాయి. అందుచేతనే ఆలాంటి కథలు అన్ని వాఙ్మయాల్లోనూ విరివిగా కనిపిస్తాయి. వాటికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. ఈ రకపు రచనల్లో మనసుయొక్క విశృంఖల విహారావధులు సూచితమౌతాయి. రచయిత కల్పనా చాకచక్యం నిశితమై ముక్కాకలు తీరుతుంది. అలాటికథలు విన్న జనసామాన్యానికి కష్టాలు కాపురం ఉండవనీ ఎలాంటి కష్టాలయినా దైవాను గ్రహంవల్ల మంచుతెర విడినట్లయిపోయేటందుకు అవకాశా లుంటాయనే అభి ప్రాయాన్ని కలిగించి జీవితాన్ని ఆశాజ్యోతులతో వెలిగిస్తాయి. జాతిలో ఈదురో మనే మనుష్యులుతగ్గి ఉత్సాహవంతులై కలకలలాడుతూ ఉండేవారెక్కువయేటం దుకు ఇలాంటి వాఙ్మయమే సహాయకారి. అందువల్ల జాతి కష్టనిష్ఠూరాల కోర్చు నట్టిదై, సుదృఢమైన వెన్నెముకకలదై, కీర్తి సంపదలకాకరము కాగలదు. తెలుగు కథా వాఙ్మయంలో అద్భుత రసాత్మకమైన కథలెన్నో ఉన్నాయి. వచన రీతిని కాశీమజిలీల కథలలో మధిర సుబ్బన్న దీక్షితులవారెన్నో మనోహరమైన కథల్ని కల్పించి, ఏరిసవాటిని రచించి హృదయాహ్లాదము కలిగించినారు. సంచా రనీ, కథకులు బాలనాగమ్మ కథనీ, కాంభోజరాజు కథనీ, ధర్మాంగద చరిత్రనీ, పాముపాటనీ, చిన్నమ్మకథనీ. పాడి, వినిపించి పొట్టపోసుకొంటున్నారు. గాంధారి కథఅనే మరోకథకూడా జానపద వాఙ్మయంలో ప్రచారంలోఉంది. వాటిని స్థూలంగా పరిశీలిద్దాము.

## (I) బాలనాగమ్మ కథ

తెలుగుదేశంలో బాలనాగమ్మకథ విననివారుగాని, సినిమాని చూడనివారు గాని ఉండరనడం అతిశయోక్తి కాదు. ఈ కథని రచించినదెవరో మనకి తెలియదు. కథ రెండుభాగాలుగా విభజించబడింది. మొదటిభాగంలో కాశికి పడమట మున్నూరామడల దూరానఉన్న భూచక్రిపట్నంఏలే నవాభోజరాజుతో కథ మొదలవుతుంది. అతని ఇల్లాలు లక్ష్మీదేవమ్మ సంతులేక వ్రతాలూ నోములూనోచి చివరికి—

గొడ్డుబోతనే బ్రతుకూ బ్రతకలేను కనిపెంచని జన్మమెందుకేమి
బాలలులేని బ్రతుకులెందుకేమి సంతులేనివారింట్లు భోజరాజా
కందులుకొట్టిన కళ్ళమందురేమి కాయలుకొట్టిన మానులందురేమి

అని పనవి పనవి భర్త సెలవంది నల్లకొండకు చేరవచ్చి అక్కడ తపస్సు చేసుకొంటున్న జటంగమహామునిని సేవించింది. ఆ మునీశ్వరుని సలహాప్రకారం ఆ కొండకు ఈశాన్యపు గట్టునఉన్న నాగముసింద్రిని గట్టుకేగి నాగేంద్రుని వరములందింది. సంతానం కలిగితే ప్రతిఫలంగా పొమ్మిదినెలలతర్వాత తన ప్రాణం ఇస్తానని ఒప్పింది. లక్ష్మీదేవమ్మ ఏడుగురి బాలల్ని కన్నది. వారిలో కడగొట్టుది బాలనాగమ్మ. తాను నాగేంద్రునికిచ్చిన వాగ్దానం సంగతి భర్తతో చెప్పింది. సెలవిమ్మంది. కాని నవాభోజరాజుకి నాగేంద్రుడి గండమునుంచి భార్యను తప్పించాలనే ఉద్దేశం కలిగింది. అందుకోసం పరీక్షిత్ మహారాజు చేసినంతపని చేశాడు. కాని ఫలించలేదు. నాగేంద్రుడి పగ మరింత హెచ్చింది. వీరి ప్రయత్నాల సమాచారంవిని.

పన్నెండు శిరసుల ఆదిశేషుడైన—

కోపముచేత పుట్టవిడిచివచ్చి భూచక్రిపట్నం వచ్చిచేరినాడు
ముందు ఆరాజుల తానుచూచినాడు విచ్చుకత్తుల పారాచూచాడు
తుపాకీలబారు చూచెను యెంతఅంతకురాలవే లక్ష్మీదేవమ్మ
నాకే నీవు యత్నంపెట్టినావా ? అప్పటిమాటలు యిప్పుడుతేవమ్మ
రక్షించినవారిని నీవేమి భక్షించను తలచుకొన్నవమ్మా
అయితే మంచిది కానియ్యమనెను. అక్కడ నాగేంద్రుడు మాయమైనాడు.
స్తంభములమొదటను పుట్టెనునాగన్న యెంతసాహసురాలవే లక్ష్మీదేవమ్మ?

ఈమంటకోను నేమాడిపోమనని ఇట్లనాకు యత్నంచేశావా?
అక్కడ నాగేంద్రుడు మాయమయ్యేనయ్యా. యేడునిలువుల తొట్టిలోనపుట్టే.
అన్నమాట నీవు తప్పవద్దుభామా, ఆడినమాట. దప్పవద్దునీవు
ఆకలిగొని నేనువచ్చినాను. అయ్యోస్వామి నాగయ్యనీవు
నన్ను పాపకర్మలు యిటులువుంచిరయ్యా. నినుచంపవలెనని యత్నంచేసిరి.
నీవెటుల వచ్చితివి నాతండ్రి? నాతోడివలు వేరెవున్నవమ్మ
నేను చచ్చేదాన్ని చావనె చచ్చేను. నీకడుపు నిండుగ ఆరగించుస్వామి.

అని లక్ష్మీదేవి తన్నుతాను నాగేంద్రుని కర్పించుకొన్నది. గండంతప్పించని మురుస్తూ దగ్గరకు వచ్చిన రాజుకి రక్తమండలములోనున్న లక్ష్మీదేవి కన్పించింది. రాజు విచారంతో పొడుచుకొని చావబోయాడు. మంత్రులు ధైర్యంచెప్పి, మంత్రవేత్తల్నిపిల్చి లక్ష్మీదేవిని విషనిర్విముక్తను చేయమని కోరారు. వారుకూడా-

"నాగదిగురా, నాగదిగురా నామనవి చేకొని నాగదిగురా"

అని పేరుపేరు వరుసలా నాగుల్ని పిలుస్తూ మంత్రించారు. లక్ష్మీదేవి పిల్లల్ని రాజుకి అప్పగింతలు పెట్టింది. పాలు అన్నం తెప్పించి దాన్నిముట్టి మారు పెండ్లాడనని బాసలు చేయించింది. కావాలంటే, ఆడపిల్లలను అత్తింటికంపిన తర్వాత పెండ్లాడమంది. పిల్లలనుచూస్తూ లక్ష్మీదేవి అందరి సెలవులనంది ప్రాణం సవిలింది.

తల్లిలేని ఆడపిల్లల్ని రాజు సరిగా పెంచలేకపోయాడు. మంత్రులు మొగమోటం పెట్టారు. చివరకు పుర్లుమాతంగి ప్రభావంవల్ల రాజు లొంగి, రెండో పెళ్ళి ఆడాడు. రాజు రెండోభార్యపేరు మాణిక్యదేవి. ఆమెతల్లి మందులమాదేవి. ఆమె అత్తింట కాలు పెట్టగానే ఎన్నో అపశకునాలయాయి. అవి చూడగానే రాజుకి మనసు విరిగింది. ఆమెను వేరేఉంచాడు. మూడునోలల మొక్కజొన్నలు రోజుభత్యం ఈయసాగాడు.

ఇలాగుండగా నవాభోజిరాజు జమాబందికి ఢిల్లీ వెళ్ళవలసినపని తగిలింది. పిల్లలసంగతి ఏమాఅని ఆలోచించాడు. బాల్యచాపల్యంచేత వారంతా మారుటితల్లి పిన్నమ్మదగ్గర ఉంటామని అన్నారు. రాజు సరేనని మాణిక్యాంబకు పిల్లల నప్పగించి ఖర్చులకు వేయిరూపాయిలిచ్చి ఢిల్లీవెళ్ళాడు. మాయలమాణిక్యం మాయలు

పన్నింది. నానాబాధలు పెట్టింది. వారికి, స్వర్గలోకంలోనున్న వారితల్లి లక్ష్మీదేవమ్మ సాయమైంది. విషంపెట్టినా పిల్లలు చావకపోవడంచూసి మాయల మాణిక్యం ఆశ్చర్యపడింది. మిషపెట్టి వారిని ఊరిబైట పాడుగుడికితీసుకొనిపోయి అందులో వేసి తాళంపెట్టి ఆకటిచిచ్చుకి మాడి చావండని తన ఇంటికి తాను చేరింది. బాల లకు తల్లి మళ్లీసాయమైంది. పుట్టతేనెల కల్పించి ఆమె వారిని సాకింది. ఆమె నవాభోజరాజుకి కలలో కప్పించి—

లేవయ్యా: లేవయ్యా నవాభోజరాజా: నీకు కడిపెడు బాలలనప్పగించినాను. ఆబాలలనీవు అడవిపాలు చేసినావా ?

అని వివరించి చెప్పింది, రాజు తుళ్ళిపడి, హుటాహుటీగా బాలలు, బాలలుఅని పలవరిస్తూ భూచక్రిపట్నం చేరుకొన్నాడు. ఆలా చేరిన రాజుతో మాణిక్యదేవి తన సవతి చెంతికుండలను పగులకొట్టి, తన శరీరమంతా గీచి, నా బిడ్డలను పెంచుటకు నీవెవరేఅని నిందించి అమె బిడ్డలను వెంటతోడ్కొని పోయిందని చెప్పింది. రాజామె మాటల్ని నమ్మలేదు. పట్నమంతా వెదకి చివరకు పాడుగుడిలో మరణాసన్నులైన బాలలను కలుసుకొని కలదూపు గ్రహించాడు. ఇక మాణిక్యాలదేవితో మాటహూడా ఆడహూడదనీ చూడనయినా చూడహూడదనీ నిశ్చయించుకున్నాడు. మాణిక్యాలదేవితల్లి మందులమూదేవి. ఆమెకి మాణిక్యాల దేవి తన స్థితిగతులను తెలిపింది. మందులమూదేవి మందులను ప్రయోగించడంలో అందెవేసినచేయి. ఆమె మందులనుపంపి, భోజరాజుపై ప్రయోగించమని సలహా ఇచ్చింది. మాణిక్యదేవి అలాగే చేసింది, మందు పారింది. వెంటనే మాణిక్య దేవిమీద మరులుగొని నవాభోజరాజు అమె మేడకి వచ్చాడు. పిల్లల తగులాటం వదిలించుకొని మరీ తనమేడకు రావలసిందని మాణిక్యదేవి షరతుపెట్టింది. నవా భోజరాజు అలాగే చేదామనుకొని పిల్లలతో మీ మేనమామలయింట దిగవిడిచి వస్తానని మభ్యపెట్టి వారిని ప్రయాణం చేశాడు. మధ్యేమార్గంలో అడివిలో బాల లనువదలి. తన బదులుగా ఒక కర్రిమొద్దును నిలిపి, తాను మాణిక్యదేవి అంతః పురానికి చేరుకొన్నాడు.

అడవిలో బాలలు నిద్రలేచి తమతండ్రి మరణించాడని తలచి గోడు గోడున దుఃఖించారు. వారికి, అడవిలోనే శాపవశంచేత పగటివేళ మనిషి. రాత్రి వేళ పులీఅయే వంగపట్నపురాజు, ఆసరాఅయాడు. ఇలాకొన్ని రోజులు గడవ

గానే పానుగంటి వద్దిరాజులు వేటకై ఆ అరణ్యానికివచ్చి ఈ బాలలను చూశారు. వారు తమ మేనమామ బిడ్డలని తెలుసుకొని ప్రేమతో తీసుకొనిపోయి వివాహ మాడారు. అంతా సుఖంగా ఉన్నారు.

అక్కడ నవాభోజరాజు ఢిల్లీవచ్చి సుల్తానుదర్శనం చేసుకోలేదని సుల్తాను కోపించాడు. దండునిపంపి కోటలు, పేటలు లాక్కొని బికారిని చేశాడు. ఎందరుచెప్పినా వినలేదు. నవాభోజరాజు మాణిక్యదేవితో అడవులపాలై దేశాలన్నీ తిరిగి తిరిగి చివరకు పానుగంటిపట్నంలో కట్టెలమ్ముకొని జీవించేటందుకు చేరాడు. కట్టెలమ్ముతూ ఒకరోజున భోజరాజు వేసినకేకని బాలనాగమ్మ విన్నది. తండ్రిని గుర్తించింది. ఇంటిలోనికి రప్పించింది. అప్పచెల్లెళ్లంతా తండ్రిని గుర్తించి ఆయన చేసిన మోసాన్ని గ్రహించి—

ఓరి పాపకర్ముడా నవాభోజరాజా ! ఓరి కులద్రోహి నవాభోజరాజా !

అని నిందించారు. కాని, వీరినిచూసి పశ్చాత్తాపతప్తుడై కుప్పటంబుపలెరూలి కండ్లనీళ్ళుకార్చే రాజుని చూడగానే వారిలో పితృ భక్తిభావం పొంగింది. వారితన్ని గౌరవించి తమదగ్గర నిలిపికొన్నారు, మరొక వీధికి కట్టెలమ్ముకొనపోయిన మాణిక్యదేవి ఈయన జాడలనెరుగక తిరిగి అడవులపాలయింది. పశ్చాత్తాపతప్తుడైన మామగారి తరఫున వద్దిరాజులు ఢిల్లీ రాయబారంవెళ్ళి సుల్తానుదగ్గరనుంచి అతనిరాజ్యం అతకిని తిరిగి ఇప్పించారు.

కొంతకాలం గడిచింది. వద్దిరాజులికి ఘండికోట కార్యానికి (యుద్ధానికి) వెళ్ళవలసిన అవసరం కలిగింది. వారి మామ నవాభోజరాజు అంతకుముందే మాణిక్యదేవి పెట్టిన మందులు వికటించి తీసుకొని మరణించాడు. రాజుల ఘండి కోటకుపోతూ, పట్నం కాపాడవలసిన బాధ్యతని తలారిరాముడిమీద వేశారు. అరిదేసికీ, రపదేసికీ సేరుబియ్యం, పావుసేరు పప్పూ, ఒకడబ్బూఇచ్చి పంపించ వలసిందేనవీ కోటలోకి వదలవద్దనీ ఆజ్ఞచేశారు. కార్యవద్దిరాజు ప్రసవాసన్నయైన బాలనాగు మేడచుట్టూ ఏడుగిరులుగీసి, దాసరి, జంగంభట్టు, బ్రాహ్మణులెవరు వచ్చినా గిరులుదాటి భిక్ష వేయవద్దనీ అనవెట్టాడు; ఇలా జాగ్రత్తలుపడి వద్దిరాజులు గండికోటకి వెళ్ళారు. ఇలాగ రాజులు వెళ్ళినతర్వాతనే అసలుకథ మొదలయింది.

పద్దిరాజులు యేలేభూమిలో నాగళ్ళపూడి గట్టువుంది. గట్టుతో ఫకీరు పుట్టాడు. వాడికి ఒక కోటవుంది. అందులో పన్నెండు స్థంభాల మసీదువుంది. మసీదులోనే మాయలఫకీరు కాపురం. వాడు ఆరుపుట్ల అర్వం, ఏడుపుట్ల యేదాంతం, మూడు పుట్ల ఖురానూ చదివాడు. వాడు మంత్రిగాడు. బల్‌మాయలగాడు. వానికి యేడు వందల యెర్రిభూతాలూ, మూడువందల ముక్కిడిభూతాలూ దాసులు. వాడికి పాకలిదయ్యం దివిటీపడుతుంది. మంగలిదయ్యం అద్దం చూపిస్తుంది. కుమ్మరి దెయ్యం కూడువండుతుంది. ఇలాగ వాడు దయ్యాల సేవలను పొందుతూ, గాండ్లసంగు లంజగా, మాయలమరాటీయై ఉన్నాడు. నాలుగులోకములలోఅందగత్తె యెవరాఅని అంజనంవేసి చూశాడు. ఆతని దృష్టిలో బాలనాగు పడింది. వెంటనే ఆమెని చెరబెట్టే నిశ్చయంతో బయలుదేరాడు. శివరాత్రి జంగంవేషం ధరించి, పానుగంటి దర్వాజాదగ్గరకొచ్చి వోరుగంటివో శంభుడు నాపేరు, పానుగంటివారి కులదైవాన్ని. బిడ్డలులేనివారికి బిడ్డలనిచ్చే బీదజంగాన్ని కొడుకులు లేనివారికి కొడుకులనిచ్చే కొమరజంగముని అని శంఖం పూరించాడు. కావలి రాముడికి సంతానంలేదు. అతని బలుపుదిరేలా మాయజంగం మంత్రించిన విభూతిఇచ్చాడు. ఇచ్చి ఆ ప్రసాదానికి ప్రత్యామ్నాగా కోటలోకి పోయేటందుకు సెలపు సంపాదించాడు. మాయలఫకీరు విభూతి మహిమని పదకర్త వ్యంగ్య హాస్య మర్యాదలో ఎలా వర్ణించాడో చూడండి—

తలారిరాముడు పరుగున వచ్చేను
ఏడుగురి భార్యల పిలిచెను
ఆపదలేని సంతుయిచ్చె భామా
ఏడుగురికి నొష్టని బెట్టినాడు
ఏడుగురికి నోటిలోవేసెను.
మేడమీగను చల్లుకున్నదేమి
చేతుల్లా విభూతి నలుపుచున్నదేమి
తల్లో బట్టగ అదుముకొన్నదేమి
త సాధుముని జుట్టులో అమ్మయ్యా,
యేందుకు తొమ్మిదిమంది బుట్టినారు,
మీనుకూడా దతానే బువ్వడుగుతారు
మాకు ఖుసాదాలుదేర

నాయనమాకు పప్పులు పెట్టుమురా
ఓరి యెక్కడపిల్లలు, యేడపిల్లలోరి:
పుడుతూనే వీరు బువ్వడుగుతారు.
జుట్టులొకొంచెం గులగులపుట్టె రాముడికి
నెత్తిగుడ్డతీసి నేలగొట్టెను
పరుగుపరుగున యింటికివస్తుంటె,
మూడువందలూ ముందుగవస్తూరు.
బాబూ మాకూ పప్పులుతెస్తీవా
బిడ్డలు కలవారికి యిట్లాగెకాబోలు
సంతులేకుంటె సుఖమెగ నాయనా
పరుగుపరుగున యింటికొచ్చెనేమి
యేడుగూరివో భార్యలచెంతాను
మూడు నాలుగూ, పందలున్నరయ్యా
అమ్మామాకూ అన్నంబెట్టావె
బాబూ మాకు పప్పులు పెట్టుమురా
అవతల రాముడు యివతలరాగా
పన్నెండుపుట్ల శనగలు తెచ్చేసు
నడివీధిలో పోగుబోసినాడు.
మనిషికివొక్కొ గింజరాలేదు.

అలా ఎక్కడచూసినా బిడ్డ... తలారి రాముడిఇల్లు కులకులలాడింది—

దేశంతిరిగే జంగందేవరా
నాకొంపకు యేమో వేదనతెస్తివి
నాకొంపకు యేమో పంపులుతగిలేను
చావనివ్వరూ బ్రితుకనివ్వరోరి

అని మరోదారిలేక జంగమదేవర బసకి అత... సన్యాసకొనేటందుకు వెళ్ళినాడు. అప్పుడా మాయజంగం—

అబ్బీ యేరా తలారి రాముడా
నీకేమైనా సంతు కలిగినాదా?

అని సున్నితమైన వెటకారం చేశాడు. తలారి రాముడిపని హాస్యంగాలేదు. ఈ మాయ సంతానంతో విసిగి ఉన్నాడేమో—

ఈసంతు మరి కొల్లబోనుతండ్రి
ఒక్కనాటికే దూసుకుతిన్నారు.
నీబిడ్డలు గెడ్డలుజేరా
బిడ్డలువద్దో జంగందేవరా
నీకు కోటలోకె సెల్వలిస్తాను
ఈ సంతుముచ్చట వాలించుముతండ్రి.

అని బ్రతిమాలుకున్నాడు. ఫకీరు మంత్రించిన విభూతియిచ్చి మాయ సంతానాన్ని ఎక్కడగాన్ని అక్కడ మాయంచేశాడు. తర్వాత ఫకీరు కోటలో ప్రవేశించాడు.

ఇక కోటలో బాలనాగమ్మ బాలవద్దిరాజునికన్నది. మాయజంగం బెదిరించి, ఆమెను గిరులుదాటించి, కుక్కగామార్చి చెరబట్టి తన మకాముకి కొనిపోయాడు. ఆమె తన శీలం కాపాడుకొనేటందుకోసం పండ్రెండు సంవత్సరాల వ్రతం పూనింది బాలనాగు చెరబోయిన సమాచారం వద్దిరాజులకి కబురుచేశారు. వారు ఆగ్రహావిష్ట మనస్కులై మాయలమరాటీమీదికి యుద్ధానికి వెళ్ళారు. వారందరినీ వాడు తన మంత్రబలంచేత రాళ్లుగా మార్చాడు. బాలనాగమ్మ అప్పులందరూ తమ గొడుగులుకూడా పడిపోయాయని ఎంతో పలవించారు. వారందరూ బాల వద్దిరాజుమీదనే ప్రాణాలు పెట్టుకొని పెంచుతున్నారు.

బాలవద్దిరాజు వరప్రసాది. విద్యాభ్యాసంలో, గరడిసాములో, ధమర్విద్యలో ఆరితేరాడు. తండ్రి, తాతలు సాధించలేనివి సాధించాడు. దైవీ శక్తిసంపన్నుడనే నమ్మకం కలిగించాడు. తల్లిదండ్రులు మాయలఫకీరు చెరలలో మ్రగ్గుచున్నట్లు తెలుసుకొన్నాడు. వారిని విడిపించుట తన ధర్మమనుకున్నాడు. పెద తల్లుల సెలవులంది బయలుదేరాడు. దారిలో పులిరాజుపట్నంలో పులిని చంపాడు. తాను తనకార్యం సాధించుకొని తిరిగి వచ్చేటప్పుడు ఆ రాజుకూతురుని పెండ్లాడు తాననిచెప్పి ముందుకుసాగాడు. గంగవాదిపట్నంలో రాజుకూతురి వ్రణం నయం చేశాడు. ఆమెనుకూడా తిరిగి వచ్చేటప్పుడే పెండ్లాడుతాననిచెప్పి నాగళ్ళపూడిగట్టు

ఈకథలో చిలుకవాదిపట్నం, నయనవాదిపట్నం, గంగవాదిపట్నం పేర్కొనబడ్డాయి. ఈ పట్నాలే ఇతర కథల్లోకూడా కన్పిస్తున్నాయి. జానపద కథా రచయితలకి ఈ నగరాలపేర్లు ప్రీతిపాత్రమైనవేమో అనిపిస్తోంది,

ఈ బాలనాగమ్మ కథలో చిన్న నెరసులు లేకపోలేదు. కవి సామాన్యుడవడంచేత రాజరికపు దర్జాలెరుగడు. అందుచేతనే నవాభోజరాజు రెండోపెళ్ళి ఖర్చు నాలుగునందల రూపాయలతో ముగించాడు. ఏడుగురుబాలల్ని మేనమామ లింటికి ప్రయాణంచేసి, మధ్యదారిలో తినేటందుకు ముంతకూడులాగ రొట్టెలు మూటకట్టించాడు. గ్రామకరణాలు జమాబందికి వెళ్ళినట్లుగా జమీందారు ఢిల్లీ పాదుషావగ్గర కెళ్ళాడట! మొత్తంమీద రచనలోని సొంపుతో పోలిస్తే ఈ నెరసుల్ని లెక్కచేయనక్కరలేదు. జనరంజకమైన లక్షణా లుండటంచేతనే ఈ కథ సంచారికథకుల మూలంగానూ, సినీమా రూపంగానూ, విశేష ప్రచారం గాంచింది.

## (II) ధర్మాంగద చరిత్ర — పాముపాట

ఈ పాటకూడా ఎక్కువ ప్రచారంలోనున్న వాటిలో ఒకటి. దీన్ని యీపూరి రామచంద్రరాజు సోదరుడు నారాయణరాజు అనేకవి రచించాడు. ఇది ఆశ్చర్యకథ (అద్భుత రస ప్రధాన కథ)అనీ, అందరికీ తెలిసేలా పదముగా చెపుతాననీ నిర్వచించాడు. ద్రౌపది, సీతా, మొదలైన సాధ్వులమించెడి పతివ్రత కథను తెల్పుమని కోరిన అహల్యకు గౌతముడీ కథచెప్పాడట.

కాశ్మీరరాజైన ధర్మాంగదుడు భార్యయైన అర్మిలీదేవితో సంతానంలేదని తపించి దైవయోగంవల్ల రెండు నాలుకలతో నిండుపడగతో చిరుబుస్సుమనే నాగరాజుని కన్నాడట! ఇదేమిపాపం! విశ్వంలోలేని వింత కలిగిందిఅని చింతించి, మంత్రి సలహామేరకు చిత్రాంగుడనే తనయుడు కలిగినట్లు ప్రకటించాడు. రహస్యం ఎవరికీ తెలియకుండా రక్షించి, ఛప్పన్నదేశాలలోనూ ప్రసిద్ధి గాంచిన సౌరాష్ట్రరాజైన రత్నాంగుని కూతురుత్రైలోక్య సుందరినిచ్చి పెండ్లి చేయించాడు. కత్తికి బాషికంకట్టి పెండ్లిచేశారు. అదికాగానే త్రైలోక్యసుందరి అత్తింటికి వచ్చింది. భర్తృదర్శనంకోసం వేచి, వేచి చివరకు సిగ్గువిడచి అత్తగారిని—

నేను వచ్చినదిమొదలు నేటిపర్యంతమూ

చేరాడు. అక్కడ పొలిమేర శక్తిని రంజింపజేసి ఆమె సలహాప్రకారం ఫకీరుకి పూలదండలుకట్టి తంబళ్ళపెద్దు మనుమడనని పేరుపెట్టుకొని ముందుపథకం ఆలోచించాలని నిశ్చయించాడు. ఆవేషంతోనే ఫకీరుని మెప్పించి, బాలనాగమ్మకు తనరాకతెల్పి ఫకీరు జీవితపు కిటుకు గ్రహించి, తలిదండ్రుల చెరవిడిపించి, ఫకీరుని తన దాసునిగా జేసుకొని, వాని మాయమర్మములన్నీ వశంచేసుకొని చివరకు వానిని నాశం చేశాడు.

ఎన్నో అద్భుత చర్యలతో నింపిన ఈకథని కవి చక్కగా రచించాడు. కథాసంవిధానంలోగాని, రసప్రకర్షలోగాని లోపాలులేవు. వైవిధ్యంకోసం కవి తలారి రాముడి సంతానం కథ, నాగంబొట్లుకథ, చాకలి తిప్పడికథ చేర్చి హాస్య రసం చిలికాడు. బాలనాగమ్మని సీతాదేవికి ప్రతిగా, మాయలఫకీరుని రావణునికి ఉజ్జీగా, బాలవర్ధిరాజులో శ్రీరాముడూ, కుశలవులూ మూర్తీభవించినట్లు కవి చిత్రించాడు. నాగపూజలూ, జంగమారాధనలూ గ్రామీణ జీవితంలో ముఖ్యాంశాలయిన కాలంనాటిదీ కథ అనీ తర్వాత కాలానుసారమైన చేర్పులూ మార్పులూ జరిగిఉంటాయనీ మనం అనుకోవచ్చు. 1542-43 లో గండికోటవద్ద తిరుమల రాయలికీ. పెమ్మసాని తిమ్మానాయుడుకీ యుద్ధం జరిగింది. ఈ కథలో వర్ధి రాజులు పాల్గొన్న గండికోటకార్యం అదేనని కవి భావనయేమో. నాగలాపురి చెరువుని కృష్ణదేవరాయలు తనతల్లి నాగమాంబికపేరిట తవ్వించాడట. అది 1538 ప్రాంతంలో జరిగింది. అంతకుముందు ఆచోటు పర్వతారణ్యమయమే. బాల నాగమ్మ కథలోకూడా లక్ష్మీదేవమ్మ తపసుచేసిననాడు నాగముసీంద్రునిగట్టు పాముల కిరవు. వర్ధిరాజులు గండికోట కార్యానికి వెళ్ళారు—

రాజుయేలే భూమిలోపలాను
నాగళ్ళపూడి గట్టుపుట్టెను
గట్టుపుట్టగ ఫకీరుపుట్టెను

అని రాయబడింది. ఈవాక్యాలు నాగలాపురి నిర్మాణాన్నిగురించేమోనని కూడా అనుకోవచ్చు. ఈ వర్ణనలు చారిత్రిక విషయాలకు సూచనలేమోననటం కేవలం అనుమానమూ, ఊహాగానమూఅనే అనాలి, వాటిని రుజువు చేయడం సాధ్యంకాదు.

ఈకథలో చిలుకవాదిపట్నం, నయనవాదిపట్నం, గంగవాదిపట్నం పేర్కొనబడ్డాయి. ఈ పట్నాలే ఇతర కథల్లోకూడా కన్పిస్తున్నాయి. జానపద కథా రచయితలకి ఈ నగరాలపేర్లు ప్రీతిపాత్రమైనవేమో అనిపిస్తోంది.

ఈ బాలనాగమ్మ కథలో చిన్న నెరసులు లేకపోలేదు. కవి సామాన్యుడవడంచేత రాజరికపు దర్జాలెరుగడు. అందుచేతనే నవాభోజరాజు రెండోపెళ్ళి ఖర్చు నాలుగువందల రూపాయలతో ముగించాడు. ఏడుగురుబాలల్ని మేనమామలింటికి ప్రయాణంచేసి, మధ్యదారిలో తినేటందుకు ముంతకూదులాగ రొట్టెలు మూటకట్టించాడు. గ్రామకరణాలు జమాబందికి వెళ్ళినట్లుగా జమీందారు ఢిల్లీ పాదుషాదగ్గర కెళ్ళాడట! మొత్తంమీద రచనలోని సొంపుతో పోలిస్తే ఈ నెరసుల్ని లెక్కచేయనక్కరలేదు. జనరంజకమైన లక్షణా లుండటంచేతనే ఈ కథ సంచారికథకుల మూలంగానూ, సినీమా రూపంగానూ, విశేష ప్రచారం గాంచింది.

## (II) ధర్మాంగద చరిత్ర — పాముపాట

ఈ పాటకూడా ఎక్కువ ప్రచారంలోనున్న వాటిలో ఒకటి. దీన్ని యీపూరి రామచంద్రరాజు సోదరుడు నారాయణరాజు అనేకవి రచించాడు. ఇది ఆశ్చర్యకథ (అద్భుత రస ప్రధాన కథ)అనీ, అందరికీ తెలిసేలా పదముగా చెపుతాననీ నిర్వచించాడు. ద్రౌపది, సీతా, మొదలైన సాధ్వులమించెడి పతివ్రత కథను తెల్పుమని కోరిన అహల్యకు గౌతముడీ కథచెప్పాడట.

కాశ్మీరరాజైన ధర్మాంగదుడు భార్యయైన అర్మిలీదేవితో సంతానంలేదని తపించి దైవయోగంవల్ల రెండు నాలుకలతో నిండుపడగతో చిరుబుస్సుమనే నాగరాజుని కన్నాడట! ఇదేమిపాపం! విశ్వంలోలేని వింత కలిగిందిఅని చింతించి, మంత్రి సలహామేరకు చిత్రాంగుడనే తనయుడు కలిగినట్లు ప్రకటించాడు. రహస్యం ఎవరికీ తెలియకుండా రక్షించి, ఛప్పన్నదేశాలలోనూ ప్రసిద్ధి గాంచిన సౌరాష్ట్రరాజైన రత్నాంగుని కూతురుత్రైలోక్య సుందరినిచ్చి పెండ్లి చేయించాడు. కత్తికి భాషికంకట్టి పెండ్లిచేశారు. అదికాగానే త్రైలోక్యసుందరి అత్తింటికి వచ్చింది. భర్తృదర్శనంకోసం వేచి, వేచి చివరకు సిగ్గువిడచి అత్తగారిని—

నేను వచ్చినదిమొదలు నేటిపర్యంతమూ

నా విభుని కవలేదు నాభాగ్యమేమో
తల్లిదండ్రులు మీరు తలచరెన్నడు సుతుని
దాసదాసీలును తలచరెన్నడును
పరదేశములకైన పంపించియుండిరో
యేమాయెనో నాథు డెక్కడున్నాడో

అనిఅడిగింది. అర్మిలీదేవి కోడలిని కౌగలించుకొని మూర్ఛిల్లి కొంతసే పయినతర్వాత తెలివంది—

చెప్పిన నేమగునో చెప్పకుంటేమవునో
యికనేమి సేతునని యింతి చింతించె

చివరకు కోడలికామె కలరూపు తెలిపి—

కాంతరో నీవిభుడు ఫణిరాజు చూడుమని
దాని సుందరియెదుట ధరణిపైడించె

ఈ వార్త తెలియగానే సుందరి గగ్గోలు పడినిది, గుండెలు కొట్టుకొని—

అత్తరో మాయత్త అర్మిలీదేవనుచు పేరు జగతినిగలదు ప్రఖ్యాతిగాను
నీవంటిపాపిష్టి యేలోకమునలేదు; పాముకయి నన్నిటకు పట్టితెప్పించినావు
ధర్మాంగరాజైన తగదనక యీలాగు పాపిష్టిపనికేల పాలుపడెనమ్మ

అని దూషించి—

నాలుగూ యుగమూల నడవళ్లవినినను ఈరీతిలేదుగాయెందైనగాని
బుధులు పండితులైన భువిలోన నిదివరకు ఈవింతజెప్పుటను యెపుడు వినలేదు
ఏజాతిగర్భమున అజంతువేపుట్టు ఇతరజంతువు పుట్టుటిలలోనలేదు
నాయునురుమీవెంట నాతిరో వదలకను పదునాల్గుజన్మముల పట్టితీరునుగా
యిది ఘోరపాపంబు, యిదివద్దు, తగదనుచు పురమునందొకరైన పలుకలేదటవే
పట్నంబులోనున్న ప్రజలంత నొకబుద్ధి పట్టివ్రాసినయట్టి బ్రహ్మనవలెను
పంచమహాపాతకుల పట్నమని జెప్పుటకు ఈపట్నమేగాని వేరొకటిగలదా

అని పనవి, పనవి

నాకు విభుడయినట్టి నాగరాజునితోడ దివ్యతిరుపతులెల్ల తిరిగివచ్చెదను

అని నిశ్చయించింది. అర్మిలీదేవి కంటనీరు దుడిచికొని—

కోడలానీవిటులు గొప్పగాపలికెదవు నాకేమితోచదే నాతల్లివినుము
కొడుకువైననునీవె కోడలైననునీవె నినునమ్మికొంటిమి ఈవరకుమేము
తిరుపతులు తిరుగంగ తరుణులకు వశమగున కొండలును అడవులు
గొప్ప నదులుండు
ఘోరమృగములుకలవు చోరులునుకలరమ్మ అడువారికి యాత్రలదివట్టిమాట

అని బెదిరించింది. అక్కడికీ కోడలు తన నిశ్చయం మానకపోగా—

ఈపేరుపెట్టుకొని యిల్లువెడలుదువిపుడు పామునొకబుట్టలో పారంగద్రోలి
వ్యభిచారివై నీవు వర్తించుటకునిపుడు ఈబొంకుబొంకితివి ఇవినిజముకాద

అని నిందించి మాట్లాడింది. ఆకఠినవాక్యాలకు సుందరి మూర్ఛిల్లింది. తేరు కొని తన మదితీరు—

పంచభూతములెరుగ, పరమేశుడెరుగును నెలతరోనామనసు నీకేమితెలియు
ఫణి విభుండైనట్టి పతితోడ నేగూడి లోకమందున తిరుగ నాకు తప్పేమి
పతినిదైవముగాగ పాలించునటువంటి పడతులకు తప్పున్నె పరగభువిలోన

అని నమ్మబలికి ధర్మాంగదుని సెలవులుకూడ పొంది, విరాగిణియై, యాత్రలె న్నింటినో సేవించి, నైమిశారణ్యంలో మునులగాంచి, తన కర్మగతికి కారణ మడిగింది. వారు జాలిపడి ఫణిరాజు బ్రాహ్మణశాపంవల్ల పాముజన్మమందిన రాజ కుమారుడని యాతని పూర్వజన్మ వృత్తాంతాన్ని వివరించి, బ్రహ్మకుండంలో స్నానంచేస్తే శాపవిమోచనమగునని సుందరికి చెప్పారు. సుందరికూడా అట్లే చేసింది. రాజకుమారుడైన నాగేంద్రుడామెను శంకించాడు. కాని, ఆకాశవాణి పలుకులవల్ల అతడు సందేహంతీరి, ఆమెను స్వీకరించాడు. తర్వాత వారిద్దరూ స్వదేశమునకేగి సుఖించి తలిదండ్రుల కానందదాయకులయ్యారు.

యేమేమి గండమనగా ఈ బాలుడు తన తండ్రిగారికి రణములేచియుంటే నిర్మలమనే మందుకు పోతాడు. రాక్షసపురియందు

వాలునికయినా ప్రాణముపోతుందీ తందానేతందానా
ఆగండమునూ నేనుగాతునమ్మా తందానేతందానా

అచటినుండి మేఘమండలానికి దక్షిణై పోతూవుండగ కుసుమరాజు కుమార్తెయను కుసుమగంధి చేతులో

బాలునికయినా ప్రాణముపోతుందీ తందానేతందానా
అట్టిగండము గాతును నేనమ్మా తందానేతందానా
ఏడేడు సముద్రాలనడుమను తందానేతందానా
యోజనగంధి మేడలోపలాను తందానేతంగానా
బాలునికైనా పార్ణముపోతుంది తందానేతందానా

తానేపురి పట్నంబున భోగము రంగసానినోడించి అగ్గురన్నలనుతోడ్కొని నలుగురు స్త్రీలను పిలుచుకొని శాంబపురిపట్నానికొచ్చేటపుడు జంగాలమర్రికాడ

బాలునికైనా పార్ణముపోతుంది తందానేతందానా
యేడు మండలాలు యేలపోతాడు తందానేతందానా
శాంబపురిపట్నం యేలపోతాడు తందానేతందానా
మూడుదినములు పురుడువెల్లినాది తందానేతందానా
యేడుదినములు పురుడువెల్లినాది తందానేతందానా
తొమ్మిదిదినములు పురుడువెల్లినాది తందానేతందానా

నామకరణమునాడు శరాబందిరాజు అని దేవతలందరూ చెప్పుకొన్నారు.

ఈ ఘట్టంలో కవి గ్రీకు వాఙ్మయంలో ముగ్గురుదేవతలు తమ అభిమాన పుత్రునికి వరాలిచ్చిన ఘట్టాన్ని జ్ఞాపకంచేస్తున్నాడు. రచనా విధానంలో ఈఘట్టం అతి పరిణతమైంది. త్రిమూర్తులదేవులిట్టిపాత్ర వహించినఘట్టం మరొకటి మన సారస్వతంలో లేదు. త్రిమూర్తులదేవుల కథిమాన పుత్రుడైన శరాబందిరాజు అద్భుతకృత్యాలు చేశాడన్నా వింత ఏమీలేదు. అందుచేత ఈకల్పన చాలా ఉచితంగా ఉండి కథకి వన్నె తెచ్చింది.

కాని ఈకథలో ప్రశస్తమైన తీర్థయాత్రల్ని వర్ణించాడు. రచనాప్రాశస్త్యానికిందుదహరించిన వాక్యాలే సాక్షీభూతములు.

## (III) కాంభోజరాజు కథ

కాంభోజరాజుకథని జంగం సుబ్బయ్యదేవర రచించాడు. అందులో సవతుల ఈర్ష్యావేశమూ, అన్నదమ్ముల అసూయలూ, భోగం రంగసాని టక్కుటమార విద్యలూ, గచ్చాకు పుచ్చాకు వైద్యుల చట్కావైద్యాలూ ఆధారంగాగల చక్కని కల్పితకథ చిత్రించబడింది. వీరభద్రుడికి ఉత్సవాలూ, జంగమార్చనలూ, మాట్లాడే నిర్మలమండూ, సముద్రాలు దాటించే కీలుగుర్రమూ, సంతునిచ్చే వ్రతాలూ, ఉపవాసాలూ ఈకథలో సూచించబడ్డాయి. రచనావిధానంలోకూడా ఒక ప్రత్యేకత కన్పిస్తోంది. కథ జరగడంలో నాన్పుడులేదు. పాత్రలు సజీవాలు, కథలో రక్తీ, ఉత్సాహం నిలిపి కవి కథనినడిపిస్తాడు. చూడండి కథని చురుకుగా సంగ్రహంగా చెప్పుతూ, రక్తి చెడకుండా ఎలా కాపాడుతూ శరాబందిరాజు కథని కవి చెప్పాడో.

శరాబందిలోవున్న మాణిక్యాలదేవి త్రిమూర్తుల సతులకు మర్యాదలు చేసింది—

కుర్చీమీద కొలువుతీరింది తందానేతందానా
తొమ్మిదవ ఘడియకులోగాను తందానేతందానా
బాలుడే ప్రసవమౌతున్నాడు తందానేతందానా
లక్ష్మీదేవి బొడ్డుగోసెను తందానేతందానా
సరస్వతీ లాలలుపోసె తందానేతందానా
పార్వతిదేవి చాపపరిచెనయ్యా తందానేతందానా
చాపమీదను బాలుడుపండె తందానేతందానా
రావమ్మా ఓపార్వతిదేవి తందానేతందానా
జాతకములు వ్రాయుమన్నది తందానేతందానా
పొంతనాలుమరి చూడమన్నది తందానేతందానా
నాలుగైదు గండాలువ్రాస్తివా తందానేతందానా

యేమేమి గండమనగా ఈ బాలుడు తన తండ్రిగారికి రణములేచియుంటే నిర్మలమనే మందుకు పోతాడు. రాక్షసపురియందు

బాలునికయినా ప్రాణముపోతుందీ తందానేతందానా
ఆగండమునూ నేనుగాతునమ్మా తందానేతందానా

అచటినుండి మేఘమండలానికి దక్షుడై పోతూవుండగ కుసుమరాజు కుమార్తెయను కుసుమగంధి చేతులో

బాలునికయినా ప్రాణముపోతుందీ తందానేతందానా
అట్టిగండము గాతును నేనమ్మా తందానేతందానా
ఏడేడు సముద్రాలనడుమను తందానేతందానా
యోజనగంధి మేడలోపలాను తందానేతంగానా
బాలునికైనా ప్రాణముపోతుంది తందానేతందానా

తానేపురి పట్నంబున భోగము రంగసానినోడించి అగ్గురన్నలనుతోడ్కొని నలుగురు స్త్రీలను పిలుచుకొని శాంబపురిపట్నానికొచ్చేటపుడు జంగాలమర్రికాడ

బాలునికైనా ప్రాణముపోతుంది తందానేతందానా
యేడు మండలాలు యేలపోతాడు తందానేతందానా
శాంబపురిపట్నం యేలపోతాడు తందానేతందానా
మూడుదినములు పురుడువెళ్లినాది తందానేతందానా
యేడుదినములు పురుడువెల్లినాది తందానేతందానా
తొమ్మిదిదినములు పురుడువెల్లినాది తందానేతందానా

నామకరణమునాడు శరాబందిరాజు అని దేవతలందరూ చెప్పుకొన్నారు.

ఈ ఘట్టంలో కవి గ్రీకు వాఙ్మయంలో ముగ్గురుదేవతలు తమ అభిమాన పుత్రునికి వరాలిచ్చిన ఘట్టాన్ని జ్ఞాపకంచేస్తున్నాడు. రచనా విధానంలో ఈఘట్టం అతి పరిణతమైంది. త్రిమూర్తులదేవుళ్లపాత్ర వహించినఘట్టం మరొకటి మన సారస్వతంలో లేదు. త్రిమూర్తులదేవుల కభిమాన పుత్రుడైన శరాబందిరాజు అద్భుతకృత్యాలు చేశాడన్నా వింత ఏమీలేదు. అందుచేత ఈకల్పన చాలా ఉచితంగా ఉండి కథకి వన్నె తెచ్చింది.

## (IV) గాంధారికథ.

అద్భుత రసాత్మక కథల్లో గాంధారికథ ఒకటి. కథా విషయాన్ని బట్టి చూస్తే ఇదే అత్యంత ప్రాచీనమైందనాలి. ఇతర జానపదకథలవిషయంలాగే దీని సందర్భంలోకూడా రచనాకాలాన్ని నిర్ణయించడం సాధ్యంకాదు. అతి ప్రాచీన మైందేమోననిపించేదవటంచేత, కథ యింపునిబట్టి కథావాఙ్మయాభిమానులంతా చదవవలసిందే. యిందులో కొన్ని వాక్యాలు యథాతథంగా బాలనాగమ్మకథలో ప్రత్యక్షమవుతున్నాయి. అదికూడా జానపదవాఙ్మయంలో విరివిగా కన్పించే విషయమే. ఈ గాంధారికథలో తాంత్రిక విధానాలకు ప్రాముఖ్యం ఎక్కువ. మంత్ర తంత్ర శక్తుల్లో జనసామాన్యానికి నమ్మకం ఎక్కువ. అందుచేతనే ఈ కథ, అమానుష శక్తుల్ని తమ పాతివ్రత్య మహిమవల్లా దైవీ సంపత్తివల్లా వ్యక్తంచేసిన కామమ్మ, సన్యాసమ్మ, చిన్నమ్మ కథలూ జనుల అభిమానానికి పాత్రం అయాయి.

హంపి విరూపాక్ష ఆనెగొందెభూమిలో కెంపిలీగంగావతి ఆనేగ్రామంలో దేవరామపీరుడనే రాజూ, దేవశిరోమణి అనే అతని ఇల్లాలూ పరిపాలిస్తున్నారు. వారి రాజధానికి తారశీలపట్నంఅనే మరోపేరుకూడాఉంది. దేవశిరోమణి పుట్టి పన్నెండేళ్లూ, పెరిగి పన్నెండేళ్లూ మొత్తం ఇరవైనాలుగేండ్ల వయసువచ్చినా సంతులేదు. ఎన్నో నోములు నోచింది—

కాశీతీర్థం గంగకు నోమెను
గంగాతీర్థం కాశికినోమెను
రాతిరాతికి మ్రొక్కెను
గుంటగుంటలో మునిగెను
పెండ్లిండ్లులేని బ్రాహ్మలకు
పెండ్లిండ్లు చేయించెను
వడుగులులేని పేదబ్రాహ్మలకు
వడుగులు చేయించెను
అడుగడుగున అన్నపందిలి వేయించెను
ఉగ్గులేనిబాలురకు ఉగ్గుదానం చేయించెను
పాలులేని బాలురకు పాలుదానం చేయించెను

చివరకు శ్రీశైలపర్వతమువెళ్ళి శివుణ్ణిగురించి శిరసుక్రిందుగా, శ్రీపాదములు మీదుగా తపసుచేసి సంతానఫలం తెద్దామని నిశ్చయించింది. భర్తను సెలవు అడిగింది. ఆమెస్వామి మూడుసెలవులు ఇచ్చాడు వాటిప్రకారం ఆమె ముద్దుటుంగరం వేశ్రిలధరించింది. దండుదళవాయి బసవన్నకి, ఆజ్ఞలిచ్చింది. దండు ధం ధం ధం ధణమని కదిలింది. పచ్చలపల్లకిలో రాణి పర్వతాల మల్లికార్జున స్వామిని సేవించేటందుకు పూజా సంబరాలతో బయలుదేరింది. సూర్య సోమ వీధులదాటి; నాగులేరుదాటి, నల్లగొండదాటి, వెదురువనములూ వెలిగొండలూ దాటి శ్రీశైలపర్వతంచేరి పాతాళ గంగవొడ్డున నవనందుల దేరావేయించింది. పాతాళగంగలో స్నానంచేసి, తడికోకతో పిడిగంటల పర్వతాల మల్లయ్యను దర్శించింది. స్వామివారికి అభిషేకం చేయించి, ధూప దీప నైవేద్యములిచ్చి దేవళంముందున్న ఏడునిలువుల సూది గుండుపైకెగబ్రాకి, పులిచర్మమూ, జింక చర్మమూ, దర్భాసనమూ ఒకదానిమీద ఒకటిపరచి వాటిమీద భద్రాక్షీలూ, రుద్రాక్షలూ, ఏడు సన్నసూదులూ, వాటిమీద ఆవగింజా పోకచెక్కా క్రమంగానిలిపి ఆపైని తలక్రిందుగానిల్చి తపసు చేయసాగింది. ఆమె ఘోరతపస్సుకి—

కొండ కొండ డీకొనెన్
మండలంబు దూపెట్టె
సూర్య చంద్రులు తోవదప్పిరావేళ
ఆకాశమడలెను
నెలతప్పి పొడిచింది; నీళ్ళకు చెవలంటెను
అగ్నికి ఈగలు ముసిరెను

హంసవాహనంమీద బ్రహ్మ, నందివాహనంమీద సాంబమూర్తీ, వారి వెంట ఇతర దేవతలూ ప్రత్యక్షమైవచ్చి, ఆమెనుమెచ్చి "పట్టపుదేవీ ఆయుస్సు లేని మొగ బాలను యిచ్చేదా? ఆయుస్సుగలిగి అయిదవతనం గలిగిన ఆడబాలను యిచ్చేదా?" అని అడిగారు. రాణీ ఆడబాలనే కోరింది. వారు సరేలని నాగ మల్లె పుష్పమూ, ఫలమూ, కక్షపాలలోని విభూతీ, కమండలోదకమూ దయచేసి పుట్టబోయే ఆడబాలకు—

పీపున వింజామర
అరికాలున తామరపద్మం

బొడ్డున మాణిక్యం
కన్నుల చింతామణి
పండ్ల పరుసవేదియున్
నొసట చిత్రివన్నె విభూతిరేఖ
ఒకజడా అమరివుంటాయనీ
శివగాంధారి నామం కరుణించవమ్మ

అని పీడ్కొలిపాడు. రాణి తారశీలపట్నంచేరి దైవప్రసాదం సేవించి, తొమ్మిదిగడియలు గర్భంధరించి, శివప్రసాద ఫలంగా గాంధారిని కన్నది. ఆకన్య జన్మవేళనుబట్టి మేనమామల గండంఅని జ్యోతిష్కులు చెప్పారు. రాజు అయ్యయ్యో పాకొండ యేలేవాడు మాంధాతరాజు కుమారుడు, గనగంటలరాజు ఘనుడు, సుహితుడు, తల్లికి పెద్దవాడు. చిన్నదానికి ఒకేఒక మేనమామ. అలనిగండాన బుట్టిందాఅని చింతిల్లాడు. జ్యోతిష్కులు ఉన్నమాట సిద్దమయ్యా స్వామీ అన్నారు, రాజు ధైర్యంతెచ్చుకొని కానున్నది కాకమానదుఅని ఆసంగతి మరచాడు.

గాంధారి ఎదిగి పెద్దదికాసాగింది. తనకుతానే ఓనమాలు దిద్దింది పర్వతాల మల్లికార్జునస్వామే ఆమెకు చదువు చెపుతున్నాడనితలచి, విద్యాభ్యాసకాలం వచ్చిందని తలిదండ్రులు ఆమెకొక గురువుని ఏర్పరవారు, కొండగుహాలలో నిర్లిప్తుడుగా తపసు చేసుకొంటున్న తపసిని రప్పించి తమకూతురుకి గురువు కమ్మని కోరారు. గాంధారి గురువు నిమిత్తమాత్రుడుగా చరచరా విద్యనేర్చింది. తొమ్మిది ఘడియలలో కావ్యనాటకాలూ, భరతశాస్త్రమూ, వేదాలూ నేర్చింది. ఆటవిడుపు సెలవులుఇచ్చి బ్రాహ్మణుడు తిరిగి తపస్సుకి వెళ్ళాడు. గాంధారికేమీ తోచక తనతో చదువుకొనేటందుకు ఎవరైనా జోడుకావాలంటుంది. తల్లీదండ్రీ యోచనచేశారు. రాజు తన బావమరదికొడుకు బాలరాజుని రప్పిద్దామనుకున్నారు. గాండీవరాజు పశ్చిమభూమిలో సుందరగిరిపట్నం యేలేవాడు. దేవరాయ వీరరాజు చెల్లెలు వేడుక రామక్కభర్త. కాని, తాను చెప్పినమాట వినవందున రాజాతనిని పదభ్రష్టుణ్నిచేసి, సోలెడుబియ్యం, తోటకూరకట్ట, పాతికెకాసులూ గ్రాసంగా ఏర్పాటుచేశాడు. కష్టాలలో మునిగిఉన్న,వారికి యాగంటి ఈశ్వరుడివరాన బాలరాజు అనే కుమారుడు కలిగాడు, రాజు ఏర్పాటుచేసిన గ్రాసంతో జరిగీ జరగకుండా వారు కాలం గడుపుతున్నారు. గాంధారికి చదువు తోడుకావాలనేసరికి రాజుకి

చెయిలోపయిన మేనల్లుడు, బాలరాజుని రప్పించాలనే ఆలోచనకలిగింది. రాణికది నచ్చలేదు. బాలరాజూ గాంధారీ తారసపడితే వారికి పరస్పరానురాగం కలుగవచ్చునని భయపడింది. రాజు, అలాభయపడేటందుకు కారణంలేదనీ వయసువచ్చేనాటికి వారిని ఎడబెడదామనీ సర్దిచెప్పాడు.

బాలరాజుని తోడ్కొని రావలసిందని రాజు మనుష్యులను పంపాడు. బాలరాజు రాకపోతే కట్టి, కొట్టి మోకాటితో కుంది కుండి తేవలసిందని ఆజ్ఞాపించాడు. ఆఆజ్ఞని తలదాల్చి చినరంతు, పెదరంతు, చందమామ, గాలపోయుడు మొదలైన 11గురు జెట్టీలు సుందరగిరిపట్నం వెళ్ళారు. బాలరాజు గరిడీసాములో నేర్పరి. బాణాకర్రల సాములోనూ కుస్తీపట్టుటలోనూ కుశలుడు. తన్ను కొనిపోవచ్చిన జెట్టీలను తనతో ఒకచెయ్యి కలపవలసిందన్నాడు. వాళ్ళప్లేచేసి ఓడి. హడలి సామంగానే ఇతనిని కొనిపోవాలనుకున్నారు. బాలునికి శరణని జెట్టీలుఅని తనని మేనమామల పట్నానికి రమ్మని కోరారు. బాలరాజు అలంకరించుకొని, తలిదండ్రుల సెలవులంది, గుర్రంమీద తారశీలపట్నానికి బయలుదేరాడు.

రాజు, వచ్చే మేనల్లుడికి ఎదురేగాడు. ఎదురువచ్చేమామనిచూచి బాలరాజు గుర్రందిగి వినయంగా ఎదురు ఏడడుగులు వేశాడు. బాలరాజు రాకడచూసి అతని మేనమామ " చక్కనివాడే రాజు - సరసుడేను బాలరాజు " అని తలచి "రావయ్యబాలుడ పల్లకినెక్కుబాలుడ"అని ఆహ్వానించాడు. బాలరాజు "పాలకివద్దో మామ, పేదరాజు బిడ్డాను, బీదరాజు కొడుకూను, నీ గ్రాసగాని బిడ్డాను " అని తనమనసులోనున్న ఉక్రోషాన్ని వెళ్ళగ్రక్కాడు. రాజు తానంతకుముందు చేసిన అవమానాన్ని కడిగేయాలని "అర్ధంఇస్తాను, అర్ధరాజ్యం ఇస్తాను, ఇంట ఎదుగుతున్న గాంధారినిచ్చి పెండ్లిచేస్తాను" అని అన్నాడు. ఈ వాగ్దానాలతో బాలరాజు తృప్తి పడలేదు "పుత్రమోహం అంతాఒకటే, మా తలిదండ్రులు నాకోసం బెంగపడి వుంటారు పోతాను" అన్నాడు. "మాతల్లి దుఃఖపడితే నేను జయప్రదమేనా, మామయ్య ?" అనిఅడిగాడు. "ఇంటఉన్న మాటేనోయి, ఇంటనున్న ఆడపడుచు దుఃఖపడితే యేడుదండ్యాల కోకలు కాలిపోవునన్నారు'' అని మదలకించాడు. బాలరాజూ, మేనమామా ఇలా అన్యోన్యంగా రావడం గాంధారితల్లి పద్మగంధి చూచింది. బాలరాజు అందచందాలు చూచింది. గాంధారి అతనినికనక చూచిందంటే తప్పక మరులుకొంటుందని తలచింది. అది ఆమెకిష్టంలేదు అందుచేత వెంటనే బాలరాజుని తిరుగుముఖం పట్టించాలనుకుంది, వెంటనే బాలరాజుని పిలువనంపింది. వచ్చే బాలరాజుని దాసీసంగ చూడనేచూచింది. గాంధారితో వర్ణించి

చెప్పనేచెప్పింది. గాంధారి తల్లి మేడలకువచ్చే బాలరాజుని చూసింది. చూడగానే అతనిమీద మనసు నిలిపింది. రాణి తలచినదంతా వృథా అయిపోయింది. గాంధారి బాలరాజులమధ్య తెరలుగట్టించి పరస్పరావలోకనం లేకుండా విద్యాభ్యాసం జరిగించాలనీ తర్వాత మెల్లిగా గాంధారి పెద్దదైన తర్వాత మనసు మారుదారి పట్టించవచ్చుననీ అనుకొన్నది. కాని, ఆవిషయంలోకూడా ఆమెతలపు నిరుపయోగమైంది. బాలరాజూ, గాంధారీ బాసలిచ్చుకొన్నారు. గాంధారి పర్వతాల మల్లయ్య సాక్షిగా నిన్నుతప్ప ఇతరుల నేను పెండ్లాడనని బాలరాజుకీ, బాలరాజు పుస్తకాలసుముట్టి వీరభద్రుడుసాక్షిగా, బేతాళుడుసాక్షిగా నిన్నుతప్ప ఇతరుల పెండ్లాడనే భామాఅని గాంధారికీ బాసలిచ్చుకొన్నారు.

గాంధారీ, బాలరాజూ పరస్పరానురాగంతో చదువులు చదివారు. గాంధారి చదువులబ్రాహ్మడి మంత్రాలపుస్తకంచూసింది. చూసి శక్తిపంపు, శాంభవిపంపు, హనుమంతపంపు, వీరభద్రిడిపంపు, భేతాళపంపు, భైరవిపంపు ఆకళించుకొన్నది. ముగ్గులన్నీ నేర్చింది. ఉచ్చాటనా, ప్రయోగమూ నేర్చింది. ఇక తననూ బాలరాజునీ ఎవరూ వేరుచేయలేరని అనుకొన్నది. బాలరాజుతో మరికొంత చనువుగా చొరవగాఉంది. బాలరాజు కివేమీతెలియవు. గాంధారీ బాలరాజుల లీలలను చదువులబ్రాహ్మడు గ్రహించాడు, అవిమించితే తనమీది కే నేరం వచ్చిపడుతుందోనని గాంధారితల్లి పద్మగంధిచెవిలో జరుగుతున్న విషయము ఊదాడు. పద్మగంధి ఇక ఆలసిస్తే అదునుతప్పి పదును చెడుతుందనుకున్నాది. తన అన్నగారిని తరలి రమ్మనీ, గాంధారినిచ్చి పెళ్ళిచేస్తామనీ రాసింది. ఆనాటినుంచి గాంధారికీ, తల్లికీ తాంత్రికకృత్యాల్లో పోటీలునడువసాగాయి. మాంత్రికకృత్యాలలోనెగ్గి చివరకి గాంధారి బాలరాజుని పెండ్లాడింది. తల్లికూతుళ్ళ పోటీల ఫలితంగా గనగంటల రాజు, ఘనుడు, పెళ్ళికని తరలివచ్చినవాడు, నశించాడు. గాంధారి జన్మకాలజ్యోతిషము ఫలించింది.

ఈ గాంధారికథలో మాంత్రిక తాంత్రిక కృత్యాల వర్ణనలెక్కువ. ఛందస్సు కూడా ఇతర కథలలోని ఛందస్సులకంటె విలక్షణమైందే. దీని రచనాకాలంగాని, గ్రంథకర్తగాని, మనకి తెలియవచ్చే దారిలేదు. ద్విపదలతోటీ, దరువులతోటీ, వచనాలతోటీ కథ సాగింది. పదకర్త జానపదుడన్నది నిశ్చయం. రాజకుమారి గాంధారి మూడు పిన్నమాడలిచ్చి—

"వకపిన్నమాడకు అత్తరు సంపెంగ దండలు
వకపిన్నమాడకు పూలచండల పరిమళ గంధాలూ
వకపిన్నమాడకు ఆరుమూళ్ళ నిడివి మూడుమూళ్ళ
వెడల్పు నిల్వుటద్దమూ''

తెమ్మంటుంది. ఈమాటల్లో దమ్మిడీబేరాలుచేసే మన జానపదవ్యవహారం ధ్వనిస్తోంది. ఇందులో సూచించబడిన వస్తువులు కారుచౌకగా నున్నకాలం స్ఫురిస్తోంది.

తాంత్రిక కృత్యాల వర్ణనకి మచ్చుగా ఈ ఒక్క వర్ణనని చూడండి:
"మానెడు నలుపూ, మానెడు యెరుపూ, మానెడు తెలుపూ, మానెడు పచ్చముగ్గూ నేసి, రంగవల్లి ముగ్గులేసి, హోమందేల్చి శక్తిని లేపతూఉన్నది.

రంగవల్లీముగ్గు రమ్యముగ విరిసెన్
రంగవల్లి ముగ్గులొ శక్తిముగ్గు నడుమను
రూపాకారం యేర్పరించిందీ - ఓం శక్తిని లేవుతున్నదీ
ఓం అమ్మవారు రాజు, వేణి, నాగారవుశక్తి లేస్తేలేచినావు

లేపకపోతివా యెదురుమేకులు చెక్కించి నీతలకొట్టింతును. నాగలోకంలో నడుమె విరుగ పడగొట్టుదు. దేవలోకంలొ తెగి పడగొట్టుదు బ్రహ్మలోకంలో పటపట పగలగొట్టుదులేవె - అమ్మవారా నీకు ఆహారం పెట్టుతూయ్యున్నాను. ఇది గోనే ఆహారం,

తల్లివైనానీవే, తండ్రివైనానీవే, తోడువైనానీవే, నిన్నునమ్మినానే, అమ్మవారా హోం, హోం, హోం, ల, ల, ల, లి, లి, లి, లి, లు, లు, లు, లు, హోం హోం హోం హోం,

శక్తిపుట్టెరా హోరి హోమకుండములోను; మంటికి మింటికియేమో వెక్కసముగ పెరిగెను.

ఆహారమేదీ నాకు - నన్నెందుకు లేపినావు ? యేకోటమీదికి పోయేది, యెవరిని సాధించేది, యెవరిని తెచ్చేది ?

నిన్ను బింగుతానె నన్నేడ పంపుతావు.
పంపు ఆహారమేపె నాకు ?

ఇలాంటి తాంత్రిక వ్యవహారాల వర్ణనలెన్నో ఈగ్రంథంలో ఉన్నాయి. అవి ఈనాడు పరిపాటికాదు. అందుచేత ఈ కథారచన పర్వతాల మల్లయ్యభక్తులు తాంత్రిక విధానాలలో నిమగ్నులైన 11-12 శతాబ్దాలలో జరిగిందేమోననీ, తర్వాత దీనిలోమార్పులూ, చేర్పులూ, జానపదవాఙ్మయానికుండే సహజ గుణానుసారంగా జరిగాయేమోననీ ఊహించవలసి వస్తోంది

## (V) పసల బాలరాజు కథ

కటియము గ్రామవాసియైన కిన్నెర నాగయ్య కొడుకు, పీరాస్వామి, కమ్మ వారిపణతి పసుల బాలరాజు కథఅనే అద్భుత రస ప్రధానమైన కథనొకదాన్ని రచించాడు.

మహానందికొండ పాలించే కలికిరాజు భూమి దున్నిస్తుంటే నాగేటిచాలులో ఒక పసిబాల లభించింది. ఆబాల దేవేంద్రుని కన్యకఅనీ, శాపవశంవల్ల భూమికి దిగివచ్చిందనీ కవి చివర తెలిపాడు. ఆబాలకి కలికిరాజు సీతఅని పేరుపెట్టి గారంగా పెంచాడు. ఆబాల యుక్తవయస్కురాయెంది పసులనుగాచే వెలమదొర బిడ్డ బాలరాజు గానంవింది, ఆతనిని మోహించి తన్ను పెండ్లాడవలసిందని కోరింది. బాలుడు అదిరిపడ్డాడు,

కన్యకా నీవెవర పీరీతి నొంటిగా రానేలె నీవగు రాణివాసమును
వదలివచ్చుటనీకు పొంకమేభామ సిన్నెవరయిన జూచిన నేమి
చెప్పుదురు ?
నీకిదిసరిగాదు పోపొమ్మ నన్నవలి పెండ్లికిప్పుడు నేనుపేసారలేమ

అని ఆమెను వదలించుకోజూశాడు. కాని, కమ్మవారి పణతిబాలుని వదలక అనుసరించసాగింది. ఆమెను వదలించుకోవాలని బాలుడు అసాధ్యమైన పనులెన్నో చెప్పాడు. ఆమె ఆ అద్భుత కృత్యాలన్నీ చేసింది. అఅమానుష మహిమల్ని చూసినకొద్దీ బాలుడు అది కట్టుబోతుల ప్రభావమని అనుమానించి ఆమెకి మరింత దూరంగా పోబోతాడు. బాలుడికామెని వదలగొట్టుకోవడం సాధ్యంకాలేదు. కమ్మ

వారి పణతిదగ్గర హారాలు తీసుకొని సంచారములకోసం కోమటింటికి బాలరాజు వెళ్ళాడు కోమటి దురాశాపరుడై బాలరాజు చేతిని ఖండించాడు. బాలుడు దాహ కోర్వలేక దగ్గరి అకుతోటలో చెరాడు. ఆతోట కాపు లితనిని దొంగయనిభావించి ఖండించారు. బాలరాజుని వెదకికొంటూ వచ్చిన కమ్మవారి పణతి సహగమనంచేసి శాపవిమోచనమును పొందింది.

మొత్తంమీద ఈ కథ, రచనలో ఇతర కిషలకెంతోలొచ్చే గాంధారికధకి కొంతవరకు ఇమిడేషను. తలాతోకాలేని అద్భుత కార్యాల సాధన తలనొప్పి, విసుగునీ కల్పిస్తుంది. ఐనా, ఈ కథ సినిమా ప్రొడ్యూసర్ల నాకర్షించింది. అందుచే తెరమీదికెక్కి మరింత ప్రచారాన్ని పొందింది.

## (VII) చిన్నమ్మ కథ

చిన్నమ్మ కధని చెంగల్వరాజు రచించాడు. చిన్నమ్మ మద్దిలేటిస్వామి అనుగ్రహంవల్ల చేసిన అద్భుత కృత్యాలు అందులో వివరించబడ్డాయి. చిన్నమ్మ పాకనాటి రెడ్డికులస్థురాలు. మద్దులేటిస్వామి భక్తురాలు. అందుచేత ఈకధని భక్తి ప్రధాన కథా కావ్యంఅని అన్నాఅనవచ్చు.

చిన్నమ్మ శీలంవారింట్లో మద్దులేటిస్వామి వరంవల్ల పుట్టింది. రాఘవరెడ్డి కొడుకైన వెంగళరెడ్డిని వివాహమాడింది. చిన్నమ్మఅత్తవారు వీరమాహేశ్వరులు; జంగమారాధనపరులు. చిన్నమ్మను విష్ణుభక్తినివదలి శివభక్తురాలవు కమ్మని వార న్నారు. ఆమాట ఆమెకు నచ్చలేదు. అది కారణంగా ఆమెను అత్తమామలూ, బావమరదులూ, భర్తా దాసీకన్న కనిష్టంగా చూడసాగారు. వారు—

"చిన్నమ్మను చెప్పలేనిగా హింసలుబెట్టిరి<br>
యే నూరుదొడ్ల యెరువు యెత్తమన్నారు<br>
పూటకు పుట్టెడు జొన్నలు దంచమన్నారు<br>
బర్రిలకంతకు పచ్చిక మోయమన్నారు

అలాచేసి—

వాకిళ్ళువూడ్చి కళ్ళాపుచల్లెను చిన్నమ్మతల్లి

ఇంతచేసినా చిన్నమ్మ ఎద్దులదొడ్డిలోని గుడిసెలోనే కాపురం ఉండవలసి వచ్చింది. ముక్కిన జొన్నలఅంబలితాగి ప్రాణం నిలుపుకోవలసి వచ్చింది. అందులో నంజుకోవటానికి ఆమెకు తిట్లూ, కొట్లూ, తన్నులూమాత్రమే లభించేవి. కలిగినంతలో వైష్ణవదాసరుల నాదరించి చిన్నమ్మ మరింత కష్టాలపాలయింది. కాని, అన్నింటికీ మద్దులేటయ్యనే నమ్మింది. చివరికి మద్దులేటయ్య వైష్ణవదాసరిలావచ్చి జంగమారాధన చేస్తున్న రాఘవరెడ్డి ఇంటికి వెళ్ళాడు. అతనిచే అవమానితుడై చిన్నమ్మఇంటికి వెళ్ళాడు. ఆమె తన మామూలుప్రకారం ఈ దాసరిని ఆదరించింది. మద్దులేటయ్య రాఘవరెడ్డిమీదా తన్నునాదరించిన ఆడఃరి మీదా కోపగించి ఆవూరు దగ్ధంకావాలని శపించాడు. చిన్నమ్మ నివసించే పూరిల్లు తప్ప తక్కినదంతా దగ్ధమైంది. రెడ్లంతా ఈ వినాశానికి హడలిపోయారు. ఎరుక అడిగారు. మద్దులేటయ్య ఎరుకత వేషంలోవచ్చి వారియింటికి వచ్చిన వైష్ణవ దాసరి మద్దులేటయ్యఅనీ, ఆతనిని అగౌరవించినందువల్ల కలిగిన శాపఫలితమే వారనుభవించారనీచెప్పి కదిరికొండకు యాత్రవెడలి చేసినపాపం చెల్లగట్టుకోమని సలహా ఇచ్చాడు.

రెడ్లకు ఇంతజరిగినా, బుద్ధిరాలేదు. వారు చిన్నమ్మను ఇంటికాపలాకు నియమించి, బలగముతో కదిరికొండకి, బయలుదేరారు. దారిలో వారిబండ్లు విరిగాయి. మద్దులేటయ్య వారితో తన భక్తురాలయిన చిన్నమ్మని తోడ్కొని మరీ తన కొండకు రమ్మన్నాడు. వారు బుద్ధితెచ్చుకొని చిన్నమ్మను రప్పించి కదిరి యాత్ర చేసికొన్నారు. మద్దులేటయ్య చిన్నమ్మకూ, ఆమెనుబట్టి ఆమె భర్తకీ అత్తమామలకూ వైకుంఠం ఇచ్చాడు.

చిన్నమ్మ కథారచన బాగానేఉంది. కాని, మాటతీరు కొంచెం మోటుగా ఉందనిపిస్తుంది. చిన్నమ్మ భర్త, బావగార్లకని తెస్తోన్న అన్నం వైష్ణవదాసరికి పెట్టింది. తర్వాత విష్ణుమహిమవల్ల కల్పితమైన పంచభక్ష్య పరమాన్నాలనూ బావగార్లకూ భర్తకీ వడ్డించబోయింది. అప్పుడు జరిగిన రగడచూడండి కవి ఎలా వర్ణించాడో—

అప్పుడు తమ్ముణ్ణి కూతేసి పిలవమన్నరూ
అన్నగారికూత విన్నాడమ్మ వెంగళరెడ్డి
తాళు తాళు తాళురా వోరన్నావో అరగడియతాళు

ఇదీ మనకుతెచ్చిన కూడుకాదురా యీగుండాముండా
మాదిగవాడు, మాలవాడు, అలంజకొడుకూ
దాసరివానిది విష్ణుకులమూ, మనది శివకులమూ
పాలవంటి కులమునుగనుకా పాడుచేసిందీ
దాసరివానీ యెంగిలన్నమూ మనకుబెట్టిందీ
ఇటువంటి అన్నముగనుకా మనకుదెచ్చిందీ
కొట్టుకొట్టురా గుండావాన్ని జాగకొట్టుమనిరి

ఈ కథలో అక్కడక్కడఉన్న మోటుపదాలని పరిహరిస్తే, సహజ పద సౌరళ్యంతో ఒప్పే, సూటిమాటలలో వివరించబడిన జానపద వాఙ్మయాలంకారం అని దీన్ని అనేందుకేమి సందేహించనక్కరలేదు. ఇది రాయలసీమకు చెందినకథ అవడంచేతకూడా అక్కడి మాటతీరు తెలుసుకొనేటందు కుపయోగిస్తుంది. అక్కడ ప్రచారంలోనున్న కథల్ని సేకరించవలసిన ఆవశ్యకతని ఇది మనకి అనుక్షణమూ విశదీకరిస్తుంది.

## 7. శైవ కథా వాఙ్మయం

దేశి వాఙ్మయ ప్రాశస్త్యాన్ని గుర్తించి గౌరవించినవారిలో పాల్కురికి సోమనాధుడు మొదటివాడు—

ఆ రూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ట రచన
మానుగా సర్వ సామాన్యంబుగామి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకును

అని నిశ్చయించి తేటతెనుగున ద్విపద రచింతునని బసవపురాణాన్నీ, పండితారాధ్య చరిత్రనీ, రచించాడు. శైవ కథలన్నిటికీ అవే మూలాధారం. వీర శైవుల కవి పారాయణ గ్రంధములు. ఈ గ్రంధ రచనాకాలం నాటినుంచీ, జాను తెనుగు వాఙ్మయంప్రజా సామాన్యంలో కథారూపంగా వ్యాప్తి గాంచింది. ఈ రెండు ఉత్తమ గ్రంథాల్ని పరిష్కరించి, వాటి ప్రాశస్త్యాల్ని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ చిలుకూరి నారాయణరావుగార్లు వివరించిన పీఠికలతో,

ఆంధ్రగ్రంథమాలవారు ప్రకటించేరు. జానపద వాఙ్మయానికి చెందినవైనా ఇవి నేడు జానపదులకు కొంచెం దూరమవడంచేతా, వాటినిగురించి సమర్థులు వివరముగా చెప్పివుండటంచేతా వాటిని వివరంగా చర్చించడము మానుకుంటున్నాను. శైవసిద్ధులైన నవనాథుల చరిత్ర మహో ద్విపద కావ్యము. దీన్నీ, హరిశ్చంద్ర కథనూ గౌరన రచించాడు. ఆయన 15-వ శతాబ్ది ప్రాంతంవాడు. ఈ గ్రంథాన్ని శ్రీశైల జంగమ మహాధీశ్వరుడైన శాంత భిక్షావృత్తినాయని కోరికపై మల్లికార్జునునిపేర రచించినాడనీ తెలుస్తోంది.

ఇందు మీననాథుడు, చౌరంగియైన సారంగధరుడు, గోరక్షసిద్ధుడు, మేఘనాథసిద్ధుడు, నాగార్జున సిద్ధుడు, ఖణికాఖ్యసిద్ధుడు మొదలైనవారి కథలు వివరించబడ్డాయి.

సారంగధరుడు మీననాథుని వరంవలన మాళవ దేశాధిపతియైన రాజమహేంద్రునికి కలిగిన పుత్రుడు. అతని కథని నామసామ్యంచేత దోనేరు కోనేరు నాథకవీ, తర్వాత అప్పకవీ మన తెలుగుదేశంలోని రాజమహేంద్రవరానికి ముడిపెట్టి ప్రచారం చేశారు.

నవనాథ చరిత్రలో నాగార్జున సిద్ధుని కథ మణిపూసలాంటిది. నాగార్జునుడు, వివిధౌషధముల మణిమంత్ర యోగాది మర్మకర్మలను, అణిమాది సిద్ధులను, రస వాద సార శాస్త్రములను తెలిసిన అంధుడు. మల్లికార్జున శివలింగ దివ్యధామమైన శ్రీనగాన్ని హాటకమయం చేయ తలపెట్టినవాడు. వయఃస్తంభవాదము దుర్లభమనే పలుకులన్నీ పూర్వపక్షంచేసి మూలికలను అక్కడ ఇక్కడ ననకుండా శోధించి—

రసములైదును, నుపరసము లెన్మిదియు,
పసరులు, మందులు, పాషాణములును,
కలువంబులును జాలగా సమకూర్చి,
నలయు మంత్రౌషధావళులకు బలియు
జేసి మనోజయసిద్ధి పెంపొంది,
యాసీనుడై లలాయాజిన రచిత
గురు భస్త్రికల, విన్నకోవులు నిలిపి,

నరములు పొందుగా సంధించి భక్తి
గురునాథు దలచి తద్గురువు భజించి,
వరభైషజాది దైవములకుమ్రొక్కి,
నేర్చిన మందులన్నియు వైచి యగ్ని
గూర్చి పుటంబు గ్రక్కున బెట్టినపుడు
వెసనూదువారును, విసువకరము
పసరులు గలిపి పాల్పడ నూదువారు,
అనుపొందగా మూస లమరించువారు,
మొనసి క్రమ్మర పుటంబులు పెట్టువారు,
కలయంగ నూదిన కనకంబు దివిసి
యెలమి మై పెనుబ్రోవు నీడ్చెడువారు,
నై సంభ్రమించుచు నయ్యయిపనుల
ఆసన్నులై శిష్యులందరు మెలగ
పొలివోక తా జేయబూనిన కార్య
మలవడ ఫలసిద్ధినందిన హృదయ
నలినంబు వికసింప నాగార్జునుండు
కలయంగ వారల కనుగొని పలికె.

సిద్ధనాగార్జునుడు రసవాద తంత్రంలో నిష్ణాతుడు. మహాయాన బౌద్ధ సాంప్రదాయ నిర్ణేత. ఆంధ్రుడు. అతని రచనలన్నీ మన దేశంలో లుప్తమయాయి. టిబెటన్. చైనీయ భాషల్లో పరికల్పితమైనవిమాత్రం ఉన్నాయని తెలుస్తోంది. అలాంటి స్థితిలో నాగార్జునుని చరిత్రనీ రసయోగశాలనీ వివరించే నవనాథ చరిత్రలోని ఘట్టాలు తెలుగు సారస్వత, సంస్కృతీ ప్రియుల కథిమాన పాత్రములు; అమూల్యములు. దానిని రచించిన గౌరన తెలుగువారిని కృతఘ్నతా పాపంనుంచి తప్పించాడనే అనాలి.

తెలుగులో పద్య ప్రబంధ రచనకి పోషణా ఆదరమూ ఎక్కువగానున్న కాలంలో దేశీయఛందంలో గౌరన వ్రాసిన ఈ వాక్యం ఇతని దేశభాషా ప్రీతిని కూడా వెల్లడిస్తోంది. ఆ కాలంలో—

ఒప్పదు ద్విపద కావ్యోక్తినా వలదు
లిట్టనుగాక కావ్యము ప్రౌఢిపేర్మి

నెట్టన రచియింప నేర్చిన జాలు
నుపమింప గద్య పద్యోదాత్త కృతులు
ద్విపదలు సమమభావింప

అని చెప్పగలిగిన సాహసం. మనసులో ఇతనికి ద్విపదలే పద్యాలకంటె ఎక్కువ అనేభావం ఉందేమో ననిపించేలా ఉన్నవి.

తెలుగు వాఙ్మయంలో వీర శైవ వాఙ్మయానికి ప్రత్యేక స్థానముంది. ఆ విషయాన్ని గుర్తించి విజ్ఞుల దృష్టిలో దాని ప్రాముఖ్యతని రుజువుచేసినవారిలో శ్రీయుత నిడదవోలు వెంకటరావుగారు ముఖ్యులు. వీర శైవ వాఙ్మయం ప్రజా వాఙ్మయానికి మూలవిరాట్టు. జైన బౌద్ధుల మత ప్రచారం తెలుగుభాషలో జరిగిందని నిర్ధారణగా చెప్పలేము. కాని, వీర శైవ వాఙ్మయం తెలుగు జనసామాన్యంలో మతాభినివేశాన్ని రేకెత్తించి, తెలుగు వాఙ్మయంలో నూతన చైతన్యాన్ని పులకెత్తించి తర్వాత హరిహరాత్మక మతోత్తుంగ కెరటాలలో ఇమిడిపోయిన జీవస్రవంతిగా వాఙ్మయంలో నిలిచింది. నాడు మతప్రచారానికై ఉపయోగపడిన జంగంకథలు, ప్రజా వాఙ్మయంలో స్థిరమైన రూపు దిద్ది తీర్చిన రేఖలయాయి. ఆ రీతినే నేడు ప్రజాబాహుళ్యంలో రాజకీయ ప్రబోధాన్ని కల్పించేటందుకూ, వారిని తమవైపు త్రిప్పుకొనేటందుకూ, తెలుగుదేశంలో వివిధ రాజకీయ కక్షలవారుపయోగిస్తున్నారు. కించిద్భేదంతో గొల్లసుద్దులు, యక్షగానాలు, బుర్రకథలు, శివకథలు, కీర్తనలు శైవ మత ప్రచార కాలంనాటినుండి ఉన్నవనే అనిపిస్తుంది. శివరాత్రి జాగరణ సమయంబున—

ప్రమథ పురాతన పటుచరిత్రములు,
క్రమమొంద బహు నాటకములాడువారు
భాగవతాదికథల జీరమరుగుల
నారంగబొమ్మల నాడించువారు,
అదట గంధర్వ యక్ష విద్యాధ
రాదులై పాడెడు, నాడెడువారు,
పురములుగాల్చిన బొల్కియాడుచును,
యతులు గొల్వగనున్న యందమాడుచును,
గంధగజాసురు గడపుటాడుచును,

జన్నంబుదుగ్రించిన బాళినాడుచును,
వెన్నుండు గన్నిచ్చువేళ నాడుచును,
గరళంబుదాల్చిన కరణియాడుచును,
కాలక్షేపం చేసేవారూ,

శతకంబు శివతత్త్వసారంబు, దీపకళిక, ఉహానాటకము, ఉదాహరణ ములు, రుద్రమహిమయు, ముక్తకావళులు గీతసూక్తకములు, భృంగీస్తవంబులు పురాతనముని ముఖ్య రచితపుష్పకములు అదుదంద జదువుచు నంకించువారు, ఎల్లకడలను కాననయ్యేడి వారనేఅనాలి. పండితారాధ్యుడు, వెలనాటి చోడుని బౌద్ధగురువుతో వాదించుట కారాజుసభకు పోయేటప్పుడు ఆతనివెంట నాయన శిష్యులూ, భక్తులూ,—

పదములు, తుమ్మెద పదముల్, ప్రభాత
పదములు, శంకరపదముల్, నివాళి
పదములు, తాలేళు పదములు, గొబ్బి
పదములు, వెన్నెలపదములు, సంజ
వర్ణన; మణిగణ వర్ణన పదములు
పాడుచు నాడుచు.........వెళ్ళరట.

ఈ వర్ణన వీర శైవకాలంనాటి ప్రజా వాఙ్మయ స్వరూపాన్ని సూచిస్తుంది. నాటి ప్రజా వాఙ్మ యప్రకవళికలు తెలుసుకోవాలంటే నేటికీ మన జానపద వాఙ్మ యంలో నశించక నిలిచిఉన్న శివభక్త ప్రతిపాదకములూ, శైవకథా సంనిధానం కలవీ ఐన రచనల్ని పరిశీలించాలి.

నేను చేసిన ఈ ప్రతిపాదనని విమర్శించేటందుకూ నిరాకరించేటందుకూ అవకాశంఉందని గుర్తిస్తున్నాను. నా సూచనయొక్క ప్రయోజనాన్ని శంకించే వారిని బ్రిటిష్ వైజ్ఞానిక సర్వస్వంలో ప్రజా వాఙ్మయంమీద రచింపబడిన వ్యాసాన్ని చదువవలసించని కోరుతున్నాను. అందులో సందర్భోచితమైన సారాంశాన్నిమాత్రం ఇక్కడ పొందుపరుప నిశ్చయించాను. "జానపద గేయాల్ని సేకరించేవారికి ఆగేయం ఏకాలంనాటిది అనేప్రశ్న సామాన్యంగా కొరకరాని సమస్యఅయి కూర్చుంటుంది. ఐతే, ఆప్రశ్న అంత ముఖ్యమైంది కాదనేఅనాలి

కొందరు జానపద గేయాల్ని సేకరించినవారే వాటిని రచించారనీ, లోటుపాట్లు భర్తీచేశారనీకూడ అపోహ పడవచ్చు. ఇందువల్ల ఆగేయంయొక్క రమ్యతకేమీ కొరతరాదు. జానపదగేయాల విషయంలో ముఖ్యమైనది వాటికాలమూ, రచయిత ఎవరుఅన్న విషయాలు కానేకావు. వాటిలో వ్యక్తమయే అందమూ, సహజమైన ధారా, అనేఅనాలి. జానపద గేయాల్లో కొత్తనీరువచ్చి పాతనీటిని వరద కొట్టి వేసినట్లు కొత్తభావాలూ, కొత్తభాషా నిత్యప్రవాహినీ దేశ్యాలన్న నుడికి అనుగుణంగా పాతపాటమీద అరోహించి, తీర్చిదిద్దుతాయి. అందుచేత మెట్టుకి మనకి నేడు లభించే జానపద గేయాలు పాత జానపద గేయాలనే వృక్షాలనుంచీ, తీగెల నుంచీ అంట్లు తొక్కి పెంచినవనే భావించాలి. అందుచేతనే అవి నిత్య నూతనత్వంతో వికసిస్తూ గుబాళిస్తాయి. సారస్వత వృక్షంలో, ప్రతిసారస్వత యుగనవ వసంతంలో పుష్పించే కుసుమములే, జానపద గేయములు"

ఈ అభిప్రాయముతో జానపద వాఙ్మయంలో శివభక్తి ప్రతిపాదక రచనలను పరిశీలించాలి. ఆ రచనలనుబట్టి ఆ కథల రచనాకాలాన్ని నిర్ణయించడం సాధ్యంకాదు. భాషాస్వరూపం నిశ్చితముకాదు. కాని అక్కడక్కడ మెరుపుల్లా వాటి విషయాలు ద్యోతకమవుతాయనీ, అవి నిస్సందేహంగా ఋజువైన సత్యాలనడానికి వీల్లేదనీ, మనం గుర్తించాలి.

అసంఖ్యాకమైన వీర శైవ యుగంనాటి జానపద రచనలన్నింటిలోనూ, కొన్నిమాత్రమే నేటికీ ఎన్నో వరదల తాకిడికి తట్టుకొని నిలిచాయి. వాటిని అన్నింటినీకూడా పరిశీలించడం సాధ్యంకాదు. అందుకని కొన్నింటినిమాత్రమే స్థాలీపులాక న్యాయంగా స్పృశించదలచుకొన్నాను.

వీర శైవ వాఙ్మయం అంతటిలోనూ బసవేశ్వరుని జీవితం ముఖ్యమైన ఇతివృత్తం. అదేదానికి పట్టుకొమ్మ. మనకి మెకంజీదొర సేకరించిన బసవేశ్వర జీవితం కన్పిస్తోంది. అది వచనరీతి నున్నది. అందుబాటులోఉంది. అందులో శిలాదరుషి శ్రీశైలంలో తపస్సుచేసి, శివుని మెప్పించి వరం పొందడమూ, బసవని అవతారమూ, గొప్పదనమూ, ఇతర శివభక్తుల మహిమలూ, మనోహరంగా వర్ణించబడ్డాయి. చాంగుభళ్ళఅనే శబ్దంతో ఆనంద శంకరాభరణ గీతాలతో ఖ్యాతిగా రుద్రమహిమలు పాడేవారు" అని అందులో సూచించబడింది. అది వచనంఅని నిర్వచింపబడినా కథా ప్రసంగరీతిని గొల్లసుద్దుల్లా చెప్పడానికి అను

వయిందనే నా అభిప్రాయము. వచనాన్నే అర్థజ్ఞానం, భావానుగుణమైన వాగ్విలాసమూ, పృచ్ఛకసమాధాన రీతులతో "ఆ" "ఆహా" లమిళాపుతో ఇద్దరు ముగ్గురు సహ జోక్తులతో దానిని చెప్పినట్లయితే, సరస కథా కాలక్షేపం అవుతుంది. అందుకు ఉదాహరణంగా బసవేశ్వరుని జీవిత చరిత్రలోంచి కొన్ని పంక్తుల్ని స్తాను.

పూర్వ యుగాంతరమున యందు ఆ
శిలాదరుషి అనే మునిశ్రేష్ఠుండు ఆ
పరమ శ్రేష్ఠమైన శ్రీగిరియందు ఆ
దానవదిశా భాగమందుపుండి ఆ
శివుని చరణా ధ్యానంతో ఆ
కందమూల ఫల పర్ణాంబులనో ఆ
మదుత్తు భాస్కర తేజాలో ఇటువంటివో ఆ
సేవించుకొంటూ ఆహా
తపస్సుఅనే తప్తాంగముతోవుంది ఆ
ప్రత్యక్షమైన శివునితో ఆహా
దేవదేవా ఆ
నిరతిశయ భవభక్తి సుధారస పాత్రం ఆ
శివసమయ, ఆ
శివ వీర శైవం అనే కమలాన్కి ఆ
మిత్రం సూర్యునివంటివాడవు ఆహా
మీవంటి కుమారుడు ఆ
నాకు పుదయించ వలెనుఅని ఆ
యిచ్ఛయించి తపస్సుచేస్తిని ఆ
మీకు సమానమైన ఆ
తనయుణ్ని కరుణించి ఇయ్యమని ఆ
మీయందు భక్తివళటిలేకుంటే ఆ
అటువంటి కుమారుడు నాకు శత్రుడు ఆ
ఆప్రకారం భక్తివిరహితుడైన కుమారుణ్ని ఆ
వధచేసేది నిశ్చయం ఆ
పురమథనా! సాంబమూర్తి! ఆహా

అని ఈప్రకారం అడిగిన శిలాదరుషి భక్తిభావానికి మెచ్చినవాడై -

| | |
|---|---|
| సాంబమూర్తి రుషితో | ఆహా |
| నందీశ్వరుని ప్రభావం | ఆ |
| చెప్పినవాడాయెను. | ఆహా |
| నందీశ్వరుడు యెటువంటివాడుఅంటె | ఆ |
| ఆదికారణం అయినవాడు | ఆహా |
| అనాదికి సదాదిఅయినవంటివాడు | ఆహా |
| మరీంన్ని మహావేంశభరితుడైనవు వంటివాడు | ఆహా |
| నాయొక్క చిత్పరమధర్మం అనె ధర్మమునకు | ఆ |
| నిజాంగం శరీరంవంటివాడు | ఆ |
| ఆవతుర్యుగములనుంచీ కప్పబడిన | ఆ |
| సుధర్మపాపం. ధర్మపాలన చేసినవాడు | ఆ |
| అపార కృపా కరుణం | ఆ |
| అపారమైన నాకృపకు ఆశ్రియమైనవు వంటివాడు | ఆహా |
| యిదిగో రెండోశంకరుడని తలచవలసింది | ఆ |
| అని వృషభేశ్వరుని పిలిచి | ఆహా |
| ప్రమథగణాలలో ముఖ్యమైనవాడవు నీవె | ఆ |
| చరాచరములకు రక్షకారం అయినవాడవు | ఆహా |
| అప్రమేయ మహిమ కల్గినవాడవు | ఆహా |
| ఇదిగాక నీయొక్క ప్రాణరూపము | ఆ |
| జగద్గురు సత్యంకట్టినవాడవూంన్ను | ఆహా |
| గనక నీకు అనాదియందు దృఢమైన భక్తి | ఆహా |
| అనే శక్తిని నీకు యిచ్చివుంటినిగదా | ఆహా |
| నీవె శిలాదరుషికి కుమారుడవై | ఆహా |
| నంది నామాఖ్యతో వుదయించవలసింది | ఆహా |

అని చెప్పాడు. ఆ తరువాతి బసవన కథావృత్తాంతంఅంతా ఈ ధోరణి లోనే నడిచింది.

ఇందులో వర్ణితమైన శైవకథల్లో మడి వాళయ్య మాదయ్యగారి కథా వృత్తాంతం ఒకటి రమ్యమయింది.

హర్పరిగిఅనే పురముయందు ఆ
మడి వాళయ్య మాదయ్యగారు ఆ
నిజకకాయకంనుంచి ఆ
జంగముల దాసోహం చేస్తూవుండగా ఆ
కళ్యాణానికి బసవన్న మొదలయిన ఆ
ప్రమధగణాలు వచ్చిరని వార్తయు ఆ
విని తనభక్తికి వృత్తమపైనా ఆ
వారి సేవ చేతునుఅని ఆ
భక్తితో జంగముల దరిశనం చెయ్యవలెను అని ఆ
పుద్యుక్తులయి కళ్యాణానికి ఆ
వస్తావుండగా మార్గంయందు ఆ
భీమరథీ అనేనది అడ్డగించెను ఆ
అపుడు హరిగోలు లేకుండా ఆ
శివుణ్ని ధ్యానం చేసినంతటా ఆహా
నదియు రెండు భాగాలుగాఅయినందున్ను ఆహా
మడివాళయ్య మాదయ్యగారు ఆహా
నదివాటి పోతావుండగా ఆ
అక్కడ వుండిన నరులు ఆ
స్తోత్రం చేస్తావుండిరి అపుడు ఆహా
మడివాళయ్య మాదయ్యగారు ఆ
కళ్యాణానికివచ్చి ఆహా
బసవన్న మొదలయిన పురాతనుల దర్శనంచేసి ఆహా
అక్కడ తన కులకాయకంతో ఆ
జంగములను అర్చిస్తూ ఆ
బిజ్జలరాయని కపట కృత్యములు ఆ
అన్నిజయించి రాజుతో ఆ
స్తోత్రం చేయించుక ఆహా
మడివాళయ్య మాదయ్యగారు ఆ
శివభక్తి ప్రతాపం మెరుస్తువుండినరు ఆహా

ఇతర శివభక్తుల కథల్లో కూనపాండ్యరాయని కథ రసవంతమయింది.

కూన పాండ్యరాజు పుట్టు గూని. చోళరాజు. జైనుడు: కాని ఆయనభార్య జంగమారాధనపరురాలు, ఆమె శివాలయానికి వెళ్ళిందని విని కోపగించి రాజు ఆలయానికి చిచ్చుపెట్టిస్తాడు. పిళ్ళనాయనారు జ్ఞానసంబంధరు మహిమవల్ల ఆచిచ్చు చోళరాజు హృదయమందు ప్రవేశించి వేదన కలిగిస్తుంది. ఆలయమూ, రాణీ, జంగమదేవరలూ చెక్కు చెదరరు. ప్రజలకూ రాజుకీ ఆశ్చర్యం కలుగుతుంది. రాజు వేదనకు తాళలేక రాణినీ, శివభక్తులనూ, శరణని బాధావిముక్తి పొందుతాడు. శ్రమణకులకు జంగమ మహిమలలో నమ్మకం కలగలేదు. ఆ జన్మసిద్ధమయిన కూన పాండ్యరాయని గూనిపోయేలా మహిమవలన చక్కజేసిన యెడల తాము ఒప్పుకొందుమనిరి, సంబంధరు సరేయని, శివునితలచి కూనపాండ్యరాయని గూనుమీద తన్నాడు. వెంటనే అతనినడ్డి సాపయింది. నాటినుండి అతడు సుందర పాండ్యుడయినాడు.

భక్తులలో వీర శైవ మతాధినివేశాన్ని కక్కయ్య కథ సూచిస్తుంది. కక్కయ్య తోళ్ళతిత్తులు కూర్చేవాడు. మహాభక్తుడు. అతనిడిన శివప్రసాదం విలువ భక్తుల దృష్టిలోను బసవేశ్వరుని దృష్టిలోనూ, ఎంతో ఒకవిషయం తెలుపుతోంది. కక్కయ్య ఇచ్చిన శివప్రసాదంలో పిపీలికా ప్రసాద సంబంధమైన ఒక మెతుకుని బసవేశ్వరుడు తనఅక్క నాగలాంబికకు ఇస్తాడు. ఆమె దాన్ని సేవించి, చెన్నబసవేశ్వరుని కన్నదట !

కక్కయ్య ఒకసారి విష్ణుపురాణం చదివే విప్రుడు విష్ణునాధిక్యతను గురించి చెప్పుతూండగా విన్నాడట. వెంటనే, సహించలేక శివుని ఆధిక్యాన్ని వివరిస్తూ, ఈ టెతో ఆ విప్రుణ్ణి పొడిచేశాడట. బసవేశ్వరునితో మొదలైన వీర శైవం క్రమంగా ఎంత వెర్రితలలువేసిందో, విష్ణుద్వేషం ఎంతబలిసిందో వరహావతారచరిత్ర అన్నపదంలో కోటయ్య లింగానికీ, పరశురామాంశవల్ల అవతారమెత్తిన వరాహమూర్తికీ జరిగిన యుద్ధకలాపంలో వివరించబడింది.

## నిజలింగ చిక్కయ్య కథ

శైవకథా వాఙ్మయంలో నిజలింగ చిక్కయ్య కథకూడా ముఖ్యమైందే. దాన్ని యక్షగాన సరణిలో నెరయనాథుడు రచించాడు.

కళ్యాణపురంలో నిజలింగ చిక్కయ్యఅనే మున్నూటి కులజుడు జాగరదై

కల ధనమెల్ల వెచ్చించి, చోరులగూడి చోరుడయ్యాడు. అతనికి ఎక్కల్లిసీలి, పలనాటివీరులు, దొనకొండ గంగాదేవి, ఇలవేల్పులయారు. ఒకనాడు చిక్కయ్య బసవేశ్వరుని శివపూజా బిదారంలో కన్నంత్రవ్వి ప్రవేసించి, వీర శైవారూఢ భక్తిగోష్ఠిలోనున్న వారినిచూచి అజ్ఞాననాశమై బసవనితో.

సామి నే మున్నూరు జాతివాడను జార
కామివీ వ్రయమునకు గతిలేకపోయెన్
కాన వచ్చితిసి మీన గర్వస్తు నెత్తుక పోవచ్చునని
కన్నం బుచ్చుకొని యిటపూజలో మిము నాడు పూర్వకర్మాన అరసి
నాకు లింగము గట్టుమనుచు దండంబు బెట్టినాను

అని—

"శరణయ్య లోకేశ, శరణు బసవేశ"

అన్నాడు. "శివకరుణ" అని బసవడాతనికి లింగమహిమ, జంగంబు మహిమ, పంచాక్షరీ, విభూతి, రుద్రాక్షల మహిమలు మొదలైనవానిని వివరించి బోధించి బొక్కన మయ గారిచే చిక్కనికి వెయ్యివరహాలు యిప్పించి ముత్యాలు, పగడాలుకొని, అమ్మి లాభంతో జంగమారాధనంచేస్తూ బుద్ధిగా బతక వలసిందని సెలవిచ్చాడు. చిక్కన అలాగేచేస్తూ, కొండవీడులోని లింగధకేశీ పురములో నిలిచాడు. ఒకసారి కర్నాటకదేశం వెళ్ళాడు. అక్కడ తలవరి రాము లింగయ్య లింగకేశపురాణశ్రవణంలోనూ, జంగమారాధన వ్రతంలోను, ఆసక్తి గలవాడు. చిక్కయను రామలింగయ్య ఆహ్వానించి, భార్యామణి లింగమాంబను విభూతి తెమ్మని అర్చించాడు, లింగమాంబ—

"నవమన్మధాకారునగ జేశుమారు
నవతారుడైన చిక్కయ చక్కదనము" చూచి
చలించిన మనసుగలదైంది. షోడశోప
చారములతో దేవపూజ కావించి,
భోజనములు వడ్డించింది.
కర్మపదముల దొలగి గంగాళముల బెళిగి
పరమాన్నమును, పెసలపప్పు దీపులనూ
చాల బెల్లముఁబెట్టి చమురుతో గావించి

తుమ్మిపువ్వులు, సన్నజాజులును
మెదలాడు యెమ్మెగను సన్నవరి యన్నమెుద్దించెన్
తగిన పరిపక్వమగు తాలింపు వంకాయ
జిగి గుజ్జుపులుసైన చేమ కూరయును
మరి పుల్లకూర, గుమ్మడికాయ, కమ్మనగు
తిరుగబోసిన చారు, అరటికాయయునూ
ఘుమఘుమాళించు మక్కువ నూరగాయలను
అమలనుగు వెన్నకాయించి నెయ్యంచున్
వారిముందరనుంచె వారిజాక్షియు నపుడు
గాఢతరమైన చొక్కపు గట్టిపెరుగూ.

వారారగించినపిదప, తాంబూలంబు లొసంగి రామయ్య నగరు కాయ బోయెను. చిక్కయ విశ్రమించెను. లింగమాంబ అదను దొరికినదని అతనిచరి చేరి తనవలపు తెలిపెను చిక్కయ హరహరాయని నిరాకరించి తనసంచికూడ అచటవదలి పారిపోయెను. లింగమాంబ మనసున ద్రోహచింతతో తనమెడలోని లింగమునుత్రెంచి, చిక్కయ సంచిలోనుంచి యాతనిపైపు విసిరెను. చిక్కయ మోసము నూహించక, దానిని గ్రహించి, శివాలయమున విశ్రమించి బసవా యంచు శివ మంత్ర జప నిరతుడయాడు.

రామయ్య రాగానే లింగమాంబ చెనటి జంగమువాడు చేసిన చేష్టలని నేర ములు కల్పించి చెప్పింది. వెంటనే అతడు మఠవాల్యంబునకేగి వారికీవృత్తాంతం ఎరుకచేశాడు. వారిలో సర్వజ్ఞుడు లింగమాంబనే శంకించాడు. కాని ధూర్జటి అనే వాడు "అరగించిన సదాచారికి భక్తుల బిడారమున పవళించ కారణంబేమి ? దావడి యైన నొక దేవళంబునకయిన పోవలెను. అతడు చిత్పరుషుడై తేను'' అని చిక్కయను అనుమానిస్తాడు.

ఇలా తర్జన భర్జనలుచేసి చివరికి—

అలివేణి లింగంబు అతనిదగ్గరను
యెలమితోనుండిన అన్నియు నిజము

అని నిశ్చయించి వీరముష్టులను చిక్కయను వెతకి, నిజానిజాలు పరిశీలించవలసిందని పంపారు. వారుకూడా—

ఘల్లుఘల్లున వారి గండ పెండములు
వలనయిన మంచి సనరపు జల్లులును
మొలచుట్టు నసురుల ముప్పిరితలలు
తనరుచు తలచుట్టు లింగములపేర్లు
కావి జారల వీరకావి రుద్రాక్ష
సేవళంబునను పసైన విభూతి
పూతల కొలిపాక బొడ్డుఘంటలను
భ్రాంతియాడే వీర పలకలందరికి
గిలుకుపాదాలు మిక్కలి చాయలమర
తళుకు ఫిరంగికత్తులు జళుపుకొనుచు

నార్భటించుచు వారేగి చిక్కయ్యనుజూచి చుట్టుముట్టి వెదకి లింగమాంబ మెడ లింగము నాతని సంచిలోగాంచి అది యెట్లువచ్చినదో తానెరుగననియు "ఆయమను నను మీరు ముఖ కళసేయరయా, నేరము - నాయెడ గలిగినను ఆజ్ఞ సేయరయ్యా" అనెను. వారు చిక్కయ్య పలుకులు పెడచెవినిడి మనకు నీ దుర్మార్గునితో మొగమోటమేలా శిరము నరుక - ననుచు నరుక శిరంబు—

బసవాయనుచు నెగసెన్
యెగసి యా బ్రహ్మాండ భాండమెల్లలుదాటి
యంతటను మగుడి బొందికి రెండు
నిలువుల మాత్రనిలిచెన్

అలానిలిచి జగదాశ్చర్యకరంగా బొంది పదపదండని వీరముష్టులకు చెయ్యి విసరించి. శిరము యేలలుపాడుతూ వారివెంట సభాస్థలికేగెను. అక్కడ మాయ గప్పి భయభ్రాంతులైయున్న వారినందరిని—

పేరుపేర్వ రుసలను పిలిచి యందరికి, శిర
మా రూఢితోను శరణార్థియని, బలికెన్
బొందియును. దానికటముందె హస్తయుగంబు

ఆందముగ శరణార్థియంచు జోడించెన్
పలిది యయ్యలనెల్ల నేర్పుతో జూచి తను
బిలుచు పనియేమనుచు వేర్వేర నడిగెన్

సభవారును భయభ్రాంతులై జరిగినది వీరముష్టులవలననని చిక్కన్ననే దేవరమీరానతియ్యుడని కోరారు. చిక్కన్న లింగమాంబ చర్యల వివరించి "యితరమే నెరుగ సర్వేశ్వరుండెరుగుననెను" ఆకాశవాణి శిరంబాడు వాక్యములు నిజమనెను. ఆ శివగణము జంగమస్వామికిట్లు ద్రోహము చేసినందుకు ప్రతిగా తమ శిరంబులు వ్రేళ్ళనేయ నిశ్చయించుచుండిరి—

పటు వీర శైవ సంపన్నులుగండ
కత్తెరలందరు కరములబూని
కత్తిరించిరి మస్తకము లెట్టులనిన
కరి కు కరుక్కన కరికరుక్కనను
గిరుగిరుక్కన గిరిగిరి రుక్కనను
ధరబడు తలలు మొత్తపు గుంపుగూడి
శరణను తలలును జయపెట్టు తలలు

కాగా, లోకములన్నీ—

విపులతరాటోప విభ్రమంబెసగ
తిరిగె కుమ్మరిసాన తిరిగెడు భాతి
ధరణీధరంబులు తలక్రిందులయ్యె;
జలజలరాలె నక్షత్ర సంఘములు;
ఇలరాసులింకె; భాస్కరుడండజంకె;
బలభేది మూర్ఛిల్లె ఫణిపతివ్రేళ్ళె;
ప్రళయకాలా భీల పాలాక్ష భక్తు
లలరనట్లున్న రామయ్య నీక్షించి
వనితనుండియెఇంత వచ్చెనటంచు
తన వధూటికదెచ్చి తాతెంపుసేయ
ననమ కత్తినిబూనె నాక్షణంబుననుఁ,
వెసగణోల్లని రంకెనేసి కుప్పించు

నందిపైనెక్కి పన్నగ కంకణుండు,
బృందారక శ్రేణి ప్రణతులుగొల్వ
వీరభద్రావతార విఘ్నేశ శృంగి
భృంగి భైరవునాది ప్రమధులతోడ
నచ్చోట శివుడు ప్రత్యక్షమయి నిలచె
చెచ్చెర భక్తుల శిరములన్నియును
తమతమ బొందెలతద్దయునంటి
గనుపించె దిగ్గున లేచివచ్చి
అభవునకపుడు సాష్టాంగదండములు
విభవ మొప్పగబెట్టి వినతులొనర్చి
శివుడంత నిజలింగ చిక్కయ్యబిలిచి
బాపురే! నిజలింగ భక్త ప్రసంగ!
బాపురే! నిజలింగ పరమాత్మరంగ!
బాపురే! నిజలింగ పరమయోగాంగ!
బాపురే: నిజలింగ పటుతారాపాంగ!

అని కొనియాడి వరమడుగుమనెను. చిక్కయ్య కన్నులార శివుని చూడ గలిగినందుకు హర్షించి, శరణుగణమునెల్లా రజతగిరికి తోడుకొని పొమ్మనెను. శివుడు అంగనకు కయిలాసంబివ్వ చిక్కయనెను. ఆ వనితనుండియే శివుని పద పద్మములు సేవింపగలిగెననియు, నందుచేత నింతికుముందు కైలాసమిచ్చి పిదపనే తనకిమ్మనియు చిక్కయ కోరెను. భక్తిమతియాటచే లింగపతి చిక్కనతో నీవేమనినను కాదనలేను గదరాయని రుద్రకన్నెలు ధవళములుపాడ, చిక్కన మొదలైన శివ భక్తవరుల పుష్పకములమీద నెక్కించికొని కైలాసగిరికేగెను.

శివభక్తుని మార విజయ సూచకమైన యీగాధ శైవ వాఙ్మయంలో ముఖ్యమైనది. ఏలలతోటీ, జంపె, త్రిపుట, ఏకతాళ, ద్విపదలతోటీ ఈ యక్ష గానం రసవంతంగా రచింపబడింది.

## (II) సారంగధరుడి కధ

"కొండమీద వెండిగిన్నె, కొక్కిరాజు కాలువిరిగె" అన్నపదం అబాల గోపాలానికీ తెలుగుదేశంలో తెలిసిందే. అందులో కొక్కిరాజు సారంగధరుడని

కొందరు చరిత్రకారులూహించారు. సారంగధరుడు అనేకొడుకు రాజరాజనేంద్రుడికి కలగనేలేదనీ, రాజరాజు మాళవదేశపురాజనీ కొందరు ఐతిహాసికులూ, కవులూ, వక్కాణించారు. చరిత్రాధారం శూన్యమైనా, జనసామాన్యంలోమాత్రం పాటరూపంగా పదంరూపంగా, నాటకరూపంగా వ్యాపించింది. రాజమహేంద్రవరంలోని మెట్టఒకటీ, రెండు మేడలూ సారంగుడితోటీ, రత్నాంగి చిత్రాంగుతోటీ ముడిపడ్డాయి. నవనాథసిద్ధులలోనివాడైన సారంగునికథ ప్రజాసామాన్యానికి అత్యంత ప్రీతిపాత్రమయింది. మారహరుడైన శివుని వరంవల్లపుట్టి మారుని జయించి అనశ్వరమైన కీర్తికి సారంగధరుడు తావలమైనాడు. శివకవుల కిలాంటి కథలు అత్యంత ప్రీతిపాత్రములని మనకు నిజలింగ చిక్కయ్య కథవల్లకూడా తెలుస్తోంది.

సారంగధర చరిత్రాన్ని పాటగా రాసిందెవలో మనకు తెలియదు. కాని, కవి, అందులో వర్ణనలతో కథకి అడ్డుగట్టులు లేకుండా చరచరా నడిపిస్తాడు. పాట ఎత్తుగడలోనే ప్రఖ్యాత కవుల్లోకూడ కన్పించని రచనా చమత్కారాన్ని చూపించాడు. ఒక్కమాటలో కొండంతభావాన్ని, ఒక వాక్యంలో బ్రహ్మాండమంతటి అభిప్రాయాన్ని సూచించగల సమర్థుడనిపించాడు.

"పర్వతాల మల్లన్న భమిడిమేడలమీద మెరిపించె జోగిరూపు
పులితోలు వస్త్రమ్ము వునుక గజ్జములపేరు చంక జోలెయుగట్టుకా
ముఖమునా వీభూతి మెడనిండ రుద్రాక్ష తావళంబులు మెరయగా
బంగారు కిన్నెరా, రత్నంపుమెట్లదీ, వాయింపుచుండగానూ

అని నాలుగుపాదాల్లో శ్రీశైల మల్లేశ్వరుణ్ని సాక్షాత్కరించేలా చేశాడు.

సారంగధరుణ్ని తన మేడకు రప్పించిన చిత్రాంగి-

బాలురాకలజూచి పణతి తా యెదురుకొని యేకనివ్వాళులిచ్చె
పన్నీరు అత్తరు, ఫలములూ, మొదలుగా బాలునకు కానుకలిచ్చె
అమ్మ కట్నంబివ్వ అయ్యలమామేము కొమ్మ నీ సుతుడగానా

అని సారంగుడు సడ్డిస్తాడు. మారపిశాచా విష్టయై ఎప్పుడెప్పుడని సమయముకోసం వేచియున్న చిత్రాంగి తనభావం ఉట్టిపడేలా—

"అమ్మన్న నోటికే కమ్మన్ని ఖాజాలు కాముడా నేబెడుదును
పెంచెనే మీతండ్రి పెద్దవానిసిచేసె పెండ్లిచే యాడాయెనా :
భోగాలవారింటి కొత్తువో పోదువో దొంకకా నాకుదెల్పు"
కన్ను సైగలుచేసి కాంతలా బిల్చుటకు కాలమిప్పుడు వచ్చెను :
తల్లి పిల్లగనెంచి అల్లిబిల్లాడుదము కల్లలూగాదుసుమ్మి :
ఛప్పన్నదేశాల చిత్రపటములజూచి చిన్నపు పె వరియిస్తిని

అనిఅంటూ—

"మాటికీమాటికీ మారుప్రశ్నలుపన్ని మగువ తల్పులువేసెనూ"
చక్కనీ ఓబాల చేత చిక్కితివనుచు రెక్కలాతల్పువేసె :
వేడిఉన్నాచోట వెన్నకరుగవలెను వన్నెకాడా వింటివా

అని తన మనోభావాన్ని సూచిస్తుంది. ఈ రచనే తరువాతి రచయితలకు ఒరవడియైంది. దీన్నే ధర్మవరంవారు సానదీర్చి తమ నాటక చిత్రాంగినోట చొప్పించారు.

విఫలమనోరథయైన చిత్రాంగి రాజుతో సారంగధరునిమీద ఫిర్యాదు చేయడంలోకూడా ధర్మవరంవారు పదకర్త ఒరవడినే పాటించారు—

ముట్టకుమి ఓరాజ మామవయ్యెద పీవు మమ్ము నంటకుమానెనూ
కోడలూ కూతురితో నెన్నంగదగునని వేదశాస్త్రము పల్కెనే :
గవ్వముడితావిప్పి గబ్బిగుబ్బలుజూపి గోరువాటులు జూపెను
కోకముడివిడిచి నీకొడుకు జేసినవిధము నాథయిటుచూడమనెనూ!

అంతటితో ఆవేశంపొంది సారంగధరుని నేరం విచారించేటందుకు ధర్మస్థానానికి పోతున్న రాజుతో రత్నాంగి ఆత్రం పనికిరాదనీ—

సారంగబాలుడు చక్కనీ సుగుణుండు వేదవేదాంతపరుడూ
దేవతాభక్తుండు దిననాథ తేజుండు ధీరసేవ్యుండుసుమ్మి
తరుణులను తల్లిగా తలపులోభావించు తత్తరాపడనేరడు

అని రెండు చక్కని ఇతిహాసాలను చెప్పుతుంది. అవి రెండూకూడ నిజం ఎంత విలకడగా తెలుస్తుందో తెలియజేసేవే. నిజం తెలుసుకోవడం ఒక్క

క్కప్పుడు ఎంతజటిలమవుతుందో రెండోకథ తెలుపుతుంది. మొదటికథ బ్రాహ్మణుడు, ముంగిసని దొంపరపడి చంపినకథ. అది చాలమందికి తెలిసిందే. పాముని చంపి కొడుకుని కాపాడి రక్తపుమరకలతో ఎదుటపడిన ముంగిసని కొడుకుని చంపిందని భ్రమపడి బ్రాహ్మణుడు తలమీదమోది చంపుతాడు. తన పొరపాటుని వెంటనే ఇంట్లోకి పోగానే గ్రహించి విచారిస్తాడు. ఇక రెండో కథలో ఇంత తేలికగా కల నిజం బయటపడదు చోళదేశంలోని నిమళాపురిలో చిత్రకేతుడనే రాజు ఒక రామచిలుకను పెంచుతాడు. దని నేస్తాలన్నీ పయనమై పోతూ దీన్ని దేవతావనములకు పోదాము రావలసిందని పిలుస్తాయి—

'పార్థు (పార్థివు:) నానతిలేక పైనమైపోవుటకు ప్రాణంబుఒప్పదని'

అది ధరణీ పాలకునిపిలిచి తనసనిచెప్పి తిరిగివత్తునని మాటయిచ్చి సెలవంది—

చక్కనీ చిలుకలతో, గుమిగూడి యాపక్షి అంతరిక్షముకేగెను
నదులు నగరులుదాటి సాగరంబులుదాటి నందనావనముచేరె
చిగురులను గొరుకుచు కాయలనుగొట్టుచూ కొమ్మలాకెగురుచును
ద్రాక్షలూ దినుచునూ దబ్బలూ కొరుకుచూ కేరిగంతులువైచుచూ
పచ్చిమామిడిపండ్లు పక్షులారగించి పసిబాలకూలమ్యేను
తోటిపక్షులతోటి సాటిగానేనును బాలుడయి పడియుంటినా
యెచ్చటీ నిమళపురి యెచ్చటీ చోళరాజేగుటా యెట్లునేను
మళ్ళివచ్చెదనని మహారాజుతో 'బల్కి' మోసముచేయ తగునా
అనుచు నాలోచించి చక్కని చూతఫలము ముక్కునకబచికొనెను

ఆ పండుతెచ్చి దాని మహిమనిచెప్పి. రాజుకిచ్చింద. ఆరాజు దాన్ని తన ఉద్యానవనంలో నాటాడు. అవి మొక్కమొలిచి, మాసై పండింది. ఆ పండు నేలమీదపడి సర్పదష్టమైంది, తర్వాత దాన్ని వనపాలకులు సర్పదష్టమైందని ఎరుగక రాజుకిచ్చారు. రాజు తొలిపండు, భక్తితో వృద్ధ విప్రులకిచ్చాడు ఆపండు తిన్న బ్రాహ్మణుడు వెంటనే విషగ్రస్తుడై పరలోకగతుడయ్యాడు. రాజు బ్రహ్మహత్యాపాతకం వచ్చిపడిందని చింతించి దానికి చిలుక కారణమని దానిని గొంతు పిసికి చంపాడు. తరువాత కొంతకాలానికి పట్నంలో ఒకవేశ్య పుత్రికతోపోరాడి విషఫలంఅని ప్రఖ్యాతిగన్న చెట్టు పండుతిని "చచ్చి సాధింతునని చొచ్చి తోటలు

తిరిగి చెట్టుకిర్రించ జేరెను. చేరి అక్కడపడియున్న పండుతిని పణతి పన్నెండేండ్ల బాలకన్యక ఆయెను.

ఈవింత అంతయును ఆచెంత నున్నట్టి చారులూ దెల్పగాను
వారకాంతనుబిల్వ వైఖరంతయుదెల్ప నివ్వెరాహొందె రాజు
దూరంబు చూడగా దురుసుతనమూచేత కీరంబు జంపితిని

అని తన అవిమృశ్య కారిత్వానికి వగలపొగిలాడు. ఐతేం, చేతులు కాలింతర్వాత ఆకులు పట్టినట్లయింది. రత్నాంగిచే ఈ రెండుకథల్ని ఎన్నిరాజుకి చెప్పించడంలో రచయిత గొప్ప ఉపజ్ఞ చూపించాడు.

"నా పాణ్రనాథుడా, నాసుతునిజంపుటా న్యాయంబు కాదుసుమ్మీ"

అని నిజం ఎంతోకాలానికి తేలకపోయేటట్లుందనీఅన్న రత్నాంగి మాటలకి రాజు కాలరుద్రుడై మెడపట్టి గెంటుచూ ద్వారాలు దాటించాడు.

"తనయుణ్నిబిల్పించి తలవరులకొప్పించి కట్టించె సారంగునీ"

మరణశిక్షని అమలు జరుపవలసిన తలవరుల మనసుకూడా కరిగింది. వారి కతనిని చంపడానికి చేతులురాక "పరభూములకువెళ్ళి ప్రాణంబు దాచుకొని బ్రతుకుమీ వాలకుండా" అనిఅంటారు. కాని,

"దొంగనై నేనెట్లు పరభూములకుబోదు ధరణి జనములునవ్వరా!"

అనీ,

తండ్రి దైవంబనీ ధర్మశాస్త్రములల్ల తప్పియెటుల నడువచగును

అని తలవరులను వారిపని వారిని తీర్చుకొమ్మంటాడు. వారుకూడా—

పరుపుకొండలమీద రుద్రవృక్షముక్రింద బాలునీ పడవేసిరీ
కత్తులనునూరియూ కాళ్ళుచేతులుగోసి కుండనూతెగగొట్టిరీ
దిక్కులూకదలెను చుక్కలూరాలెను సురలెల్ల ఘోషలిడగా,

తమపని కానిచ్చి తర్వాత కరచరణాదులను రాజనరేంద్రుని కానవాలుగా ఇచ్చారు. అచ్చట సారంగుడు బాధకు తాళలేక

"ఆకాశవాణీ యో మా అమ్మ భూదేవి పార్వతీ పరమేశ్వరా
ఓ సూర్య చందుృడా ఓ బృహ్మదేవుడా నన్ను కాపాడరయ్యా

అని పేరుపేరు వరుసలా దైవాల్నిపిలుస్తూ పలవిస్తాడు. అచటి ఋషిసంఘ మూ పలవింతలువిని వచ్చి చీమలుదూరని చిట్టడవిలో చింతయేటికి కల్గెననుచూ పరిచారకులబంపి యాతని దెప్పించిరి. వారు జాలిపడి సమాచారమడుగగా సన్యా సులనుజూచి సారంగుడడలుచూ సాధులారా జంపుడీ అనికోరాడు. సిద్ధులతనిని ఋడియకుమని చేతదువ్వి, ఆకాశవాణివల్ల కల నిజంతెలిసి సారంగునికి కాళ్ళు చేతులు తిరిగి అమర్చి తమలో కలుపుకొనిరి. అంతటితో ఆచంద్రతారకం యీ చందృవంశజుడు జోగులతో కూడియుండెను. రాజనరేందుృడు, కుమారుని నేర గాడని శిక్షించినా పితృపేృమ లేనివాడుకాడు, అడవిలో జరిగిన సమాచారం విన గానే "నావంశవర్ధనా, నాముద్దులాపుతృ, నాతిమాటలు నమ్మియూ భూత భేతాళు లకు బలిగాను కట్టిస్తి యెంత పాపినొ" యనుచు-

ఆలాపించి గద్దెపయిమూర్ఛిల్లి గిర్రునా కిృందపడెనూ
చిత్రాంగి పాపం పండేవేళ రావడంచేత చీరెతెరలో
నుంచివచ్చి తలవర్లదిట్టి "అడవిలో పల్కిన ఆకాశ
వాణి అవనీశునిలోపల నిజం చెప్పరాదు"

అంటుంది. వెంటనే ఆకాశవాణి రాజు రచ్చనునిలిచి మూర్ఛమునిగిన రాజనరేందుృని

మండలాపతివయ్య, మహనీయ గుణధైర్య, మహారాజ లేవవయ్యా!
పృహ్లాదునీ వంటి పరమభక్తుడు వీడు పాతకంబనక గొట్టా
చిన్నిబాలునిజంప చేతులెటువచ్చెను జాలియెంతయులేకనూ
స్త్రీబుద్ధిపృళయమని ఋృతులు బల్కుచునుండ స్త్రీలచెయిజిక్కితీవీ,
కాలసర్పమువంటి కాంతచేతిలొజిక్కి కొడుకూను జంపితీవీ
చిన్నభార్యావలన యెనలేనిదోషంబు క్రన్ననా గలిగెనయ్యా

అని ప్రబోధిస్తుంది, ఈ పృబోధంతో ఆగృహంకలిగి చితాృంగిని నరి కించి. జోగులలో కలసిన రాజపుత్రుని జాడలతీసి రత్నాంగి, "దారమాకుల దీపకా మావంశరక్షకా పుత్రరత్నమ రావయా" అని ఆహ్వానించారు. దానికి సారంగుడు—

తలిదండ్రులూయేల ధనసంపదలుయేల చెల్లిపొయ్యేవారికీ
ధర్మమే తలిదండ్రి. ధర్మమే తోడుసుమి ధర్మమే పట్టుకొమ్మ

అని–

" ధర్మం శరణమ్ గచ్ఛామి "

అంటాడు.

రాజ్యంబులూయేల రచ్చలూనీకేల రత్నంపుసొమ్ములేల ?

అని వారి కోరిక నిరాకరించి చిత్రాంగి చిన్నెలడుగుతాడు. చిత్రాంగి గతివిని, "హరహరా'' యని దేహదేవతల్నీ, కులదైవాల్నీ. సిద్ధుల్నీ ప్రార్థించి విశల్యకరణి సంగతిచే చిత్రాంగికి పునరుజ్జీవం కలిగిస్తాడు. చిత్రాంగి లేచి "అయ్యో నా పుత్రుడా అపకీర్తి పాలైతినని తప్పులను మన్నించి మమ్ము రక్షించి మహియంత యేలవయ్యా" అని కోరుతుంది. కాని, సారంగధరుడు ఎవరి మాటలనీ పాటిసేయక బైరాగిగానే నిలిచిపోయి, శివపూజా తత్పరుడయాడు.

సారంగధరుడి కథలాంటి కథలు ప్రపంచ వాఙ్మయంలో అనేకము లున్నాయి. మారవిజయాన్ని సూచించే ఈ కథని సూటిగా ఉద్వేగంతో నడిపి ప్రతిపదం అర్థవంతముగా పదకర్త రాశాడు. రచనా విధానాన్నిబట్టి ఇది జానపద వాఙ్మయంలో అత్యంత శ్రేష్టమైందని భావించాలి. ఒక వాక్యంతో గంపెడు వర్ణన వల్ల కల్పించగల దృశ్యాన్ని చిత్రించగలిగిన సామర్థ్యం ఇతనిలోనే గోచరిస్తుంది ఆ "ఇతను'' అజ్ఞాతకవి కావడంకూడా జానపద వాఙ్మయ లక్షణాల్లో ముఖ్య మైనదే. అందుచేత అజ్ఞాత కవియైన ఆ ప్రజ్ఞాశాలికి జోహార్లు. సారంగధరుడి కథని సోమయాజుల రామజోగిశాస్త్రి అనే ఆయనకూడా కీర్తనలరూపంగా రచించాడు. అందులో ఈ కథ శివభక్తి ప్రతిపాదకమన్న సంగతి స్పష్టంగా తెలుప బడింది. రాజనరేంద్రుడు శివపూజచేసి, స్వప్న సాక్షాత్కారముపొంది, సారంగ ధరుణ్ని కన్నాడు. సారంగధరుడికి యౌవరాజ్యాధికారం ఇచ్చాడు. గౌరీపూజా నిరతమైన మంజువాణినిచ్చి పరిణయంచేశాడు. ఈ కథలో చిత్రాంగి వారకామిని. రాజరాజు ఆమెవశంవదుడు. తక్కినకథ పాటలోలాగే సాగుతుంది. పాటలో చెప్పినరీతికిది వివరణప్రాయంగా ఉంది. మునుల సాంగత్యంవల్ల కర చరణాదు లందిన సారంగధరుడికి వారు

శైవతంత్రముల సిరియొసగినారు
భస్మలేపనము చేయించినారు

చీమరుద్రాక్ష పేరులిడినాడు
ప్రణవపంచాక్షరియు తెలిపినాడు
మంత్రవర్ణార్థములు జెప్పినాడు
ఉగ్రదేక్షల లోపల నుంచినాడు

.... .... .... .... .... .... .... .... .... ....

అపుడు హఠయోగవిధి దెల్పినాడు

రాజయోగియై తీర్థయాత్రల దిరుగుతూ కాశిలో నివశించి నిత్య తృప్తుడై తనకథలెచట జగిగిన నచటికి సూక్ష్మరూపధారియైయుండునని ప్రఖ్యాతినొందాడు. ఇతివృత్తాన్నిబట్టి తెలుగువారి మనసుల్ని చూరగొన్నదవడంచేతనే ఇతర జానపద రచనయితలు యక్షగానంగానూ, చేమకూర వెంకటకవి ప్రబంధరూపంగానూ, ధర్మవరం కృష్ణమాచార్యులవారు నాటకంగానూ దీన్ని రచించారు. ఈ అన్ని రచనల్లోనూ అంతో ఇంతో పాటల్లోని ఛాయలుకన్పిస్తూ దాని ప్రాశస్త్యాన్ని చెప్పక చెప్పుతున్నాయి.

సారంగధరుడి కథని రాజమహేంద్రవరంలో ముడిపెట్టింది. 1560 ప్రాంతంవాడైన దోనేరుకోనేరునాధకవిఅనీ వ్యాప్తంచేసింది, అప్పకవిఅనీ, విద్వాంసులలో ఒక అభిప్రాయము వ్యాపించిందని తెలియజేశారు. ఐతే, జన శ్రుతిగా వ్యాప్తమైఉన్న కథ విద్వాంసుల దృష్టిలోపడడం సహజంగాని ఒకరిద్దరు విద్వాంసుల భ్రమ. ప్రమాదంవల్ల ఇతర దేశపు కథ జనసామాన్యంలో వ్యాప్తిం చడం సహజంగా కన్పించదు. ఇది ఏటికి ఎదురీదడం లాంటిదనాలి. అందుచేత, రాజమహేంద్రవరంలో ఎప్పుడో ఆ కథలాంటి కథ ఏ రాజ వంశంలోనో జరిగి ఉంటుందనీ ఆది పార్వతీపతి పదాబ్జ ధ్యాన పూజాపరుడైన రాజరాజు కాలంలో కాకపోయినా అంతకుముందో వెనకో అయిఉండవచ్చుననీ, ఊహించడం జన శ్రుతినీ చరిత్రదృష్టినీ సమన్వయంచేసే వాదం.

సామాన్య ప్రజలకోసం ద్విపదగతిని నడిమింటి రామయోగికవి బాణాసుర యుద్ధమనే ఉషాకళ్యాణము రచించాడు. దాన్ని శైలినిబట్టీ రచనా రీతుల్నిబట్టీ జానపద గేయ వాఙ్మయంలో చేర్చడానికి వీల్లేదు. వర్ణనల్లో ప్రబంధాల పోకడలు స్పష్టంగా కనిపిస్తాయి. కవిత్వంలోకూడా కవితావేశంకంటె పాండిత్య ప్రకర్షే ఎక్కువ ప్రాధాన్యము వహించింది. ఐనా, ఉషానిరుద్ధులకథ ప్రజాసామాన్యానికి

ఆకర్షణీయమైనది. అందుచేత స్థాలీపులాకంగా రామయోగి రచనల్లోంచి కొన్ని రసవంతమైన ఘట్టాల్ని ఉదహరిస్తాను.

ఎత్తుగడలోనే శోణపుర వర్ణన చూడండి—

బంగరుకోటలు బాగైన పేటలును
మిన్నుదన్నెడి మేడ మిద్దెలందుండు
సర్వ విద్యలుచదివి సరిగ చెప్పగచాలు
పుడమి వేలుపులందు పొసగిఉందురుగ
శౌర్య గాంభీర్యాది సకల గుణములచేత
సరిలేని రాజులా పురిలోన గలరు
కోటికి పడగెత్తి కోటి సంపదలతో
వైశ్యులా నగరిలోపల చాలగలరు
అదురుగుండెయు పిక్కబెదరునులేనట్టి
కాల్బలంబా యూరగలదు చాలగను
వాయుదేవునికంటె వడిగలిగియున్నట్టి
గుర్రంబులచటను కోట్లుగాగలవు
కోటానుకోటులై కొండపిండిగచేయు
మదపుటేనుగులందు మరిచాలగలవు
కదలుచుండెడి మేరు కైలాసములకరణి
లక్షోపలక్షలై రథములందుండు
పొడిచి గాయములతోను పోరుసల్పంగ
పీరులచ్చట వేనవేలుందురెపుడు
అచ్చరలతోనైన మచ్చరింపగజాలు
వెలకాంతలా యూరగలరు చాలగను

జానపద వాఙ్మయంలో స్వభావోక్తికి ప్రచారం ఎక్కువ. అల్లాగే పుర వర్ణన మొదలిడిన రామయోగికవి గుర్రాల్ని, ఏనుగుల్నీ, రథాల్నీ, వెలకాంతల్నీ వర్ణించడంలో అత్యుక్తివశుడయ్యాడు.

ఉషాకన్య బాల్యచేష్టల్ని వర్ణించడంలో కవి జానపద కవిత్వ మర్యాదనే

వ్యక్తం చేశాడు. బంగారుగొలుసుల ఉయ్యాలల్లో సరిగ జరీగుడ్డపొత్తిళ్ళలోని ఉషా కన్యకకాదు మన కళ్ళకు కట్టేది.

తలయంటినీరార్చి, తడియొత్తి బొట్టుంచి
కళ్ళ కాటుకదిద్ది కడురక్షగట్టి
పొత్తిళ్ళలోనుంచి పొనగ దాదులుజూడ
మెరుపు మెరసినలాగు మెలత గన్పించె
నానాటికొక వింతగాను నవ్వుచునుండ
చిన్నముద్దులమోము చెన్నుమీరగను
అప్పటప్పటికింతి రెప్పలెత్తగనేర్చె
తళుకుకన్నులు ధగద్ధగలు గొల్పగను
మెల్లమెల్లగ బోర్ల దొల్లగిలతానేర్చె
వెలగ మత్స్య పుటంబు వేసినట్లుగను

ఇలా కన్పించే ఉషాకన్య బాల్యచేష్టలతో ఒప్పే చిట్టితల్లిలాకన్పించి ముద్దుగా నుంటుంది.

యాదవులికి బాణాసురిని సైన్యానికి జరిగిన యుద్ధ వర్ణనచూస్తే నిలువెల్ల రక్తధారలునిండి కడువొంగి—

జుత్తుపాపలలాగు శూరులుండిరిగ
ఒక చెయ్యిగూలి వేఱొకచేతి యీటెను
యెత్తి పత్తురు కొందరేమి చెప్పుదును
విల్లుకోలలతోడ విరిగి చేతులుగూలి
తాటిమ్రానులలాగు ధరణి గూలుదురు
తలలు బంతులలాగు ధరణి ఆకాశంబు
నిండార బాణాలు నిండెనంతటను

దేవాసుర యుద్ధంలాకాకుండా బాహాబాహీ. ముష్టాముష్టి. విల్లమ్ములతో మానవవీరులు చేసిన పోరాటాన్ని తలపిస్తో ఉంటుంది. బాణాసురుని భార్య పద్మాంగి ఉషాకన్యను రుక్మిణీదేవికి అప్పగింత పెడుతూ—

పాలుగన్నులనీరు వరదలై పారంగ
గోటమీటుచు బలికె కొమ్మతో నపుడు
పసిబాల యీగోల పనులేమి యెరుగదే
చందాన గాపాడుకొందువో నీవు
చాల జెప్పగనేల బాలరో యీపట్టి
మాపట్టిగాదమ్మ మీపట్టిసుమ్మీ

అని మనకెంతో పరిచితమైన ఆడబిడ్డగన్న తల్లిలా కన్పిస్తుంది. ఈలాగెన్నో ఘట్టాల్లో పాత్రలు మనకి సన్నిహితులులా కన్పించడంచేతనే ఈకథాగేయాన్ని డెంకాడలో పుట్టిన నంబూరి పెద్దయ్య పాఠంచేసి పాడి పాడించి జానపద గేయ వాఙ్మయంలో కలపడం జరిగింది.

రామయోగికవి పండిత ప్రవరుడనీ, 14-వ శతాబ్దారంభంవాడనీ విజయ నగర ప్రభువుల ఆస్థాన పండితుడనీ ఉభయభాషలయందును గొప్ప వైదుష్యము గలవాడనీ శ్రీ అడిదము రామారావుగారు పేర్కొన్నారు. ఇది జనరంజకమైన దనీ జానపదులచే పఠింపబడు చున్నదనీకూడా వారు తెలిపారు. అంతకంటె ఈ రచనకు కావలసిందేది.

శైవకథల్లో గంగావివాహము అనే గ్రంథాన్ని పద్మసాలెకులుడైన పసగాడ సన్యాసి రచించాడు. అతను ముసలయ్య అచ్చమ్మల కుమారుడు.

రాజాధిరాజ నారాయణాంశుండు
మహితకీర్తి జెలంగుమన్నె సుల్తాను
ఛప్పన్నదేశాల జన నాయకులనెల్ల
పేరుమీరినయట్టి బిరుదాంకితుండు
రాకావిహార తారక బాంధవుండు
రాణించు శ్రీ విజయ రామ గజపతి మహా
రాజ చంద్రిందేలు రాజ్యంబు లోనివాడు
"కల్మషంబులులేని గంగాభవాని
అఖిల పావనియైన ఇటువంటి తల్లికిని
జాలారి కులమందు జన్మమెటు గలిగెనో"
వివరించి, గంగా వివాహాన్ని వర్ణించాడు

బ్రహ్మ కల్పాంతమున పదునాల్గు లోకంబు
లణగిపోవుటజూచి యాగంగ తనకు
అడ్డులేరని మది తగిలి యుప్పొంగుచును
నిండి పారెను గంగ నిఖిల లోకముల
తనసాటి ఎవ్వరూ ధరణి లేరనుచు
ఉప్పొంగెనాగంగ ఉప్పరము పొడవు
గర్వమున తనమహిమ పారుచునాగంగ
తుంపురుల్చేల గంగ దుముకుచుండెను
వాన కురిసినరీతి వడి తుంపురుల్చెదరి
పడియె రజతాద్రిపై బహువిధంబులుగ
ఇది కడువింతనుచు ఈశ్వరుండపుడు
గర్వపడగూడదే గంగరో నీవు
పొంగి మిన్నందేవు బుద్ధిహీనతను
నీగర్వ సంహార మేనుగావింతు
యోని సంభూతవై యుండుమిలమీద
నీచువాసనలకు నిలయమయియున్న
జాలారికులమందు జన్మించుమమ్మా
జాలారికన్నెవై జన్మించుమనుచు

శివుడు శపించాడు—

గడగడ వణకెను గంగాభవాని
గడగడా వణకుచు కన్నీరుబెట్టి
నిటలాక్ష శంకరా ! నీకిదితగున !
హీనకులమున జన్మమెత్త మంటివిగా
నిర్నిమిత్తంబుగా నీచజన్మమునను
పుట్టుమనుటకు నోరు ఎట్లాడినది
అనుచు గద్గదకంఠయై రోదనముసేయ,
ఉప్పొంగితివి నీవు వుప్పరము పొడవు
ఆడుదానికినింత అతిశయము కూడదని
కోపంబుచే నీకు శాప మిచ్చితిని
మగువరో నీవింత వగవ పనిలేదు

పరిణయంబై నిన్ను శివమంచు దాల్తు
గౌరి నిన్నొక్కగతి మరి మేలుకొందు
నమ్మనమ్మమటంచు నాగ కంకణధరుడు

అభయం ఇచ్చాడు. శాపగ్రస్తయైన గంగ హేలాపురంలో (ఏలూరులో) శంకుదేవయ్య చక్రమాంబల కూతురై జన్మించింది.

చిత్తజునిచే బంతి బంతిగాదిది మేల్మి బంగారుదండ
దండగాదిది మంచితనరు కప్పురగంధి
గంధిగాదిది హోయల్గుబుకు, పొన్నారి

అని అందరూ అనేలా పెరగసాగింది. అంబరమార్గంలోపోతూ నారదుడు చూసి యెరుకతరూపందాల్చి ఆమె దగ్గరకొచ్చి, గుర్తించి—

ఓతల్లి జగదాంబ, యోగంగమాంబ !
భాగ్యంబుగలచెయ్యి ప్రతిష్ఠగలచెయ్యి
సంతానఫలమైన నీచెయ్యిచెయ్యి

అని మెచ్చి,—

శాపమున నిచ్చోట జననమొందితివి
మగవేల్పు నీయొక్క మగడు కానున్నాడు
శర్వాణిపతినీకు సవతిగాగలదు

అని ఎరుకపరచి,—

నేవెళ్ళి చెప్పెదను నీ తెరంగెల్ల
నిక్కంబుగా హరుడు నిను జూడవచ్చు

అని ఆశగొల్పి శివుడిదగ్గరకు వెళ్ళాడు. శివుడు నారదునివల్ల గంగాదేవి వృత్తాంతంవిని జంగం రూపమును ధరించి హేలాపురికివచ్చి "చందనంబున్నదే జాలార్లవీధి" అని గుర్తెరిగి గంట వాయిస్తూ, శంఖం వూదుకొంటూ, శంకు దేవయ్య ఇంటికివచ్చిన కలహంసంగామియై గంగాభవాని బాగైన బంగారుతూగు టుయ్యాలదిగి కర కంకణాసులు ఘల్లుమనేలా వచ్చి ఇచ్చిన భిక్షను శివార్పణంగా గ్రహించి శివగుడికిపోయి అంతర్ధానమయ్యాడు. అంత గంగ—

నిజముగా జంగంబు నీలవర్ణుండు
నాగ కంకణధరుడు నను జూడవచ్చె
ధవళవర్ణునిబాసి నేనెట్లునిలతు

అని వగల పొగుల సాగింది, అన్నంబునూని ఆడలసాగింది. చక్రిమ్మ దగ్గర జేరి.

జడుసుకున్నావేమొ సఖియ నాతల్లి
అబల నేనుండగా ముండ జంగముకు
భిక్ష నీవేటికి బెట్టపోయితివె!
కలవె పిశాచముల్ జంగంబువెంట
వదలెనె నీమీద నొక్క భూతంబు
వెర్రిజంగముజూచి వెదకుచున్నావేమొ
తల్లికీని బిడ్డకును దాపేలచెపుమ
తప్పయిన ఒప్పయిన తల్లితోడుతను
బిడ్డ చెప్పగవచ్చుననెడు శాస్త్రములు
ఆకుచాటున కాయ అమరినరీతి
తల్లిచాటున బిడ్డ దాగుండవచ్చు
తల్లిచాటున యెంత తప్పుజేసినను
అవిపయికిబోవునా అమ్మ లోకమున

అని బుజ్జగించి అడిగింది. గంగ కొంత తడుముల్లాడి దైర్యం తెచ్చుకొని—

తప్పుజేసిననీవె ఒప్పయిననీవె
నామీదివలపుచే నన్నుచూచేకొరకు
వచ్చి బిక్షముబెట్ట వలచి తెలుపకను
పాడుగుడిలోజేరి పరమేశుడున్నాడు

అని చెప్పింది. చక్రిమ్మ—

పసిబాల నీవు ఏపాప మెరుగవుగా
ముష్టి జంగముజూచి మోహపడ్డావేమొ

కడుపునిండని వట్టి కక్కుర్తియేల
కులములోపల మహా గొప్పవారికిని
నిన్నివ్వవలెనంచు ఎంచుకొన్నాము

అని మందలించింది. గంగాదేవి—

అంబికేశునకు సమర్పించవమ్మ
అంబికేశునకు సమర్పించకుంటివే
విడుతు నే ప్రాణంబు వేయునింకేల

అని తన నిశ్చయాన్ని సూచించింది. గంగమనస్సు తిరుగదని తెలుసుకొని ఈ లోక మర్యాదల ప్రకారం అలా మాటలాడినానని అంతటికీ తండ్రి అధికారి యున్నాడు—

అతనితో నొకమాట నభిలాషజెప్పు
నినుపెండ్లిసేయంగ నేను కర్తనుగాను
కరమొప్ప నంతటికి గర్త నీతండ్రి

అని శంకుదేవయ్యమీదికి బాధ్యతను నెట్టింది. శంకుదేవయ్య అంతకు ముందే జంగమయ్యను ఈవాడ భిక్షమునకు ఎప్పుడూ రావద్దని గద్దించాడు.

నిజముగా జంగంబు నిటలాక్షుడై తేను
దర్శనంబిచ్చును తప్పకుండగను
దర్శనంబీకున్న తగువారలనుబంపి
అబల నర్పించుమని యడిగింపలేడా!
పరదేశివలె తాను పాడుగుడిలోనున్న
దేవుడని నేనెట్లు తెలియనమ్ముదును

అని శంకుదేవయ్య శంకాస్పదంగా మాటాడగా గంగ మారుపలుకలేక

నీలకంఠ ధ్యాన పారీణయై
తార్కాణమగు పనికి దాగనింకేల
జగములెరుగగ పెండ్లి సంపత్రి నిత్రించు

నిజమాపుతో నీవు నిలువకుండగనున్న
నమ్మజాలగలేను నాకండిరినిన్నో
దర్శనంబీకున్న తగుజాలలనుబంపి
పరిణయపు సంగతేర్పరపించుదేవ

అని ప్రార్థించింది. తర్వాత శివుడు సనకసనందనాదులను, వశిష్ఠారుంధతులను రప్పించి, పెండ్లిమాటలు నడిపి గంగను పరిణయమై రజతాద్రికి కొనిపోతాడు, కవి పెండ్లి వైభవాల్ని, పెండ్లి విశేషాల్ని, బహురమ్యంగా వర్ణించాడు. నారదుడు అంతకుముందే శివుని వివాహ వృత్తాంతాన్ని గౌరికెరిగించాడు. తలలో గంగనుదాచి రజతాద్రిచేరిన శివుని గౌరి "జాలారి కన్నియను పెండ్లాడుట కల్లా నిజమా?" అని నిగ్గదీసి అడిగింది. సామాన్య మానవుడిలా మాట మర్మంబెట్టి, "యెంతమాటాడితివి యెలనాగశ్రీ గౌరి యేపాపకర్మంబు .నెరుగనే నేడు" అంటూ మాట తప్పించబోయాడు. కాని గౌరి పాతకథలన్నీ తడవి.

శివధర్మ ప్రభవులైన కాలభైరవ, కార్తికేయ
అంజనీసుతుల జన్మాలనీ, మోహినిని వెంట

తరిమి పోవడమూ తడిమింది. కానవచ్చినపనికి కల్లలాడుట అఖిల లోకపతివైన నీకు తగదని ఖండన మాటలాడి శివుని ఉపలాలనమువల్ల కలతదేరింది. తర్వాత వారిద్దరూ పందెమువేసి సొగటాలాడారు. హరుడిపందెం పలికినట్లుగా రావడం గౌరిదేవి ఓడిపోవడం జరిగింది. గౌరిదేవి ఓడుటజూచి గంగ తొంగి జూచింది. వెంటనే—

కడలేని కోపమున గౌరి యిట్లనియె
యెవరివే శంభుని శిరమెక్కి కూర్చుంటి
గయ్యాళినాసవతి కండ్లుగానకను

గయ్యాళి నేగాను గౌరమ్మ యాకాశగంగ నేనేను

గంగవైతే నీవు గగనమందుండకను
మగని శిరమెక్కుట తగునటేగంగా

అనే ధోరణిలో ఇద్దరికీ సవతులకయ్యం చెలరేగింది. ఈ ధోరణి రివ్వ సతులలో అసహజంగా కన్పించవచ్చును. కాని జానపద కవుల రచనల్లో దేవత

లలోకూడా మానవత్వమే చిత్రీకమౌతుండుటచేత మనకిది వింతగా కన్పించదు.

గౌరి శివునితో యేమెరుగనని నోట ఎట్లుబలికితివి? తరుణిపెట్టిన మందు తలకెక్కెనానీకు అని మొదలకించి ఈర్ష్యాగ్రహావేశపరవశురాలైపోయింది. శివుడామెను బతిమాలి నిలిపాడు. అదిచూసి గంగ "ఆడదానికి నీవు అతివిధేయుడ వగుచు ఇంత ఖీతిల్లుటా యెరుగనైతినిగా" అని అలిగి పుట్టింటికేగింది. గౌరి మీద కోపమున గంగాదేవి నదీ నద సముద్రాలన్నింటిలోనీరూ ఇంకింపజేసింది. గౌరి స్నానపానాలులేక కటకటలాడింది. గర్వంతగ్గి శివుని ఆజ్ఞప్రకారము కుమారునితో గంగదగ్గరకెళ్ళి ఆమెను సరదీసి ప్రీతురాలినిజేసి తిరిగి తోడ్కొని వచ్చింది. గంగాపార్వతులు శివునితో సరససల్లాపాలాడుతూ భోగరాగాలతో పొలుపారారు.

ఈ కథ వ్రాసిన సన్యాసి సులభశైలిలో రచన సాగించాడు. ఇతను 18వ శతాబ్దంలోనివాడనీ ఇది కేవలం జానపదులకోసమే వ్రాయబడినా, కవిత్వమని చెప్పదగిన గుణవిశేషము లిందులో లేకపోలేదనీ, కవిపరులనుగూడా తల యూపజేసే, మనోహరములైన రచనలచ్చటచ్చట కనిపిస్తాయనీ శ్రీ అడిదము రామారావుగారు రచించారు.

గంగా గౌరీ సంవాదము ప్రత్యేకంగా ఒక పాటగా ఎవరో జానపదకవి రచించాడు. గౌరిమీద ఆగ్రహించిన గంగ ఉదకాలను దాయడం ఎంతో మధురంగా కల్పించాడు. గౌరి,—

తనకొడుకు వీరన్న గ్రక్కునాపిలచి
రావోయి వీరన్న రాజశేఖరుడ
వయసుగలిగి వర్ధిల్లుమోయి వీరన్న
ఉదకాలజాడలు కానరావాయె
ఉదకాలజాడలు చూచిరాకొడుకా
అటుబోయి వీరన్న ఆకొలనుజూచె
ఆ కొలను ఉదకాలు దాచిందిగంగ
ఇటుబోయి వీరన్న ఈకొలనుజూచె
ఈ కొలను నీరంత దాచిందిగంగ
చిలకసముద్రముజూడ చిన్నమెత్తులేవు

పాలసముద్రముజూడ పాతికెత్తులేవు
ఎచ్చట తిరిగినా ఉదకంబులేదు
పిఘాతి గుండాన ఇంకిపోయినవి
సవతుల గుండాన సురిగిపోయినవి
కౌశికావడిగట్టి గంగకే బంపె
గంగలో వుదకాలు కానరావాయె

ఈ స్థితి విని గంగకు సర్వాధికార మెవరిచ్చినారు అని గర్జించింది—

అయిదు దినములబట్టి స్నానమ్ములేదు
ఆరు దినములనుంచి శివపూజలేదు

అని బాధపడి గంగచేతకి ప్రీతి చేయాలని—

పట్టించు పదివేల పాలకావిళ్ళు
కట్టించు పదివేల నేతికావిళ్ళు

అని,—

పాలతోనే గౌరి స్నానంబుచేసె
నేతితోనే గౌరి శివపూజచేసే

పాపం వెంటనే గౌరిని—

చీమలు దోమలు చెడగుట్టసాగె
గండుచీమలుమేను చెండుతూవుండె

వాటి బాధ పడలేక గౌరి వృద్ధగంగ (గౌతమి) లోని జలాలకోసం "పంచవటిదాక పోయిరా కొడకా ! "అని ఆక్రోశించింది," శివ శరణుమాంపాహి శివశరణు, శరణు" అంది. శివుడు—

"పుట్టించ గిట్టించ శివుడు కర్తగును
నోచిన నోములకు గౌరి తాకర్త
యేప్రొద్దు గంగతో యెదురువాదమ్మా
కూడదని చెప్పుమీ ఆ గౌరితోడ

గంగ సమ్మతిచేత ఘనఉదతమొచ్చు
నదులన్ని నిధులొచు నిండుండునయ్యా
స్నానపానమ్ములు సకల జపములును
నీరుంటె నెరవేరు''

అని చెప్పి పంపాడు. గౌరి వీరన్నను తోడ్కొని గర్వం దిగమింగి గంగ మేడలకు వెళ్ళింది. గంగగౌరికి తగిన సవతి—

గవరమ్మ రాకలు గంగప్పజూసి
పచ్చి చేపలుదెచ్చి పందిళ్ళువేసె
పండుటాకులుదెచ్చి తోరణాల్గుచ్చె
పెద్దచేపలు పంచటరుగులనుగట్టి
కప్పజచ్చిననీళ్ళు కళ్ళాపుజల్లె

ఇలా అలంకరించి, గౌరిని ఆహ్వానించి వచ్చినపని విని ఉదకాల జాడలు నేనెరుగనంటుంది. గౌరమ్మ గంగమ్మకి కొడుకుల్ని, చీరెల్ని, రవికెల్ని ఇస్తానని ఆశపెడుతుంది, గంగ బెసకదు. నీ కొడుకులు నా కొడుకులేననీ, చీరలూ సొమ్ములూ తనకూ ఉన్నాయనీ అంటుంది. గౌరి నా యొక్క శివుణ్ని నీకిస్తా అంటుంది, వెంటనే గంగ—

ఇపుడన్నమాటలు తప్పకుమీ అక్కా

అని రెట్టించి యీ మాటకు సాక్షి యెవరని పలికి—

భూమి ఆకాశమ్ము ఆరెండుసాక్షి
వృద్ధులు మారేళ్ళు ఆవి రెండుసాక్షి
సకల దేవతలును వారెల్లసాక్షి

అనగానే సంతోషించి గంగ ఉప్పొంగి నదులన్నీ నిండి ప్రవహించేలా జేసింది, గౌరి స్నానంచేసి శివపూజ చేసింది. ఈశ్వరా గవరప్ప ఇచ్చెను నిన్ను అని గంగ మురిసింది. శివ నిర్మాల్యంకోసం తిరిగి నరికొల్లాడగా నరిదానవాలని నిరసిస్తూ గౌరమ్మ పంచిఇచ్చింది. అదే ఈ గాథకి కారణమైంది గౌరి గర్వాన్ని

పరిహరించి గంగ సరిదాన్ని కాకుండే—

శివుడేలమెచ్చు శివుడేల దెచ్చునూ
జగమేలమెచ్చా శివుడికి చిన్నాలినీ, నీకు చెల్లెలినీ

అని పలికిన పలుకు నిరూపించుకొంది. కవి కథా సన్నివేశాన్ని చమత్కారంగా కల్పించి రసవంతమైన సంభాషణ, రీతిని నడిపాడు. దీన్ని నీచజాతి సవతుల కయ్యాలలాగు ఉందని నిరసించడం విమర్శకులకు తగదు. దీన్ని అచ్చువేసిన కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్‌వారు ఇందులో కుప్పలుగానున్న అచ్చుతప్పులను పరిహరించి పరిష్కరించవలసి ఉంటుంది.

శైవ కథా వాఙ్మయంలో దక్షునియజ్ఞం అనేపాట మరొకటి. పదకర్త ఆ గాథ రామేశ్వరంలో రామలింగమూ, కంచిలో ఏకామ్రనాధుడూ వెలసిన తర్వాత జరిగినదంటాడు సూచనప్రాయంగా—

దక్షుడు యజ్ఞదీక్షితుడు కాదలచుకొన్నాడు. ముందు అల్లుళ్ళనూ, కూతుళ్ళనూ యజ్ఞానికి ఆహ్వానిద్దామని, తోడితెద్దామని అనుకొని—

పెద్దకూతురు తనకు పెత్తనం గలదని
పెద్దఅల్లుడు తనకు యోచనగలవాడు

అని సంభ్రమంతో ఈశ్వరునిదగ్గరకు వెళ్ళాడు. కాని,

దీక్షబట్టుకు శివుడు
వివరాము తెలియక విరసాముతోనుండె

యోగ నిద్రాముద్రితుడైన శివుడు దక్షుని రాకా పోకా గమనించలేదు. దక్షుడు తన్నిది అవమానించడమేనని భావించాడు. రోషంతో కూతురిదగ్గరకేగి—

వేడె నీకు నాకు చెల్లెగా ఋణము
పాపాత్మతో పొందుబాసి పుణ్యుడనైతి
నీచులతో నేను భాషింపగారాను
గర్వాంతకుడనైతి నింతపర్యంతము

పార్వతీనీవు నా పాలింటనేలేవు
ఇంతి నీకూ నాకు యింతె కడలాయె

అని బంధుత్వాన్ని తెంచుకొని అతి వేగంగా తర్లిపోయాడు. ఇలా చెంగ లాడుచూ తండ్రి పోగానే సతీదేవి మనసు చెదిరింది. పుట్టినింటిమీద ఆపేక్ష నామె తెంచుకోలేకపోయింది. చెదిరిన మనసుతోచే శివునిదగ్గరకేగి తండ్రి యజ్ఞానికి పోయేటందుకు అనుజ్ఞ నీయవలసిందచి కోరింది. శివుడామెను పోవల దన్నాడు. కాని, ఆమె శివుని మొగమోటంపెట్టి అనుజ్ఞ సంపాదించింది. కవి ఈ ఘట్టాన్ని చకచకా వర్ణించాడు. ఇంత శ్రమపడి తండ్రియజ్ఞాన్ని చూసేటం దుకు వెళ్ళిన సతీదేవిని దక్షుడు—

ఆశపాతకురాల, అతి హీనురాల,
అధఃపాతాళాన అణగియుండగలేక
అధికురాలని వస్తివా?

అని చిన్నెలు వన్నెలుగా శివునితోకలిపి నిందించి అవమానించాడు. సతీ దేవి ఈ అవమానం భరించలేకపోయింది.

పోతరించకు దక్ష పొంగు కూడూగాదు
వ్యధబెట్టి నన్ను నీ వేమనుభవించేవు
పతిమాట వినకనే భంగపోయీవస్తి

అని ఆక్రోశించి "బొటనవేలూతోను" కట్టడయి వ్రాయగా ఉద్భవించిన యోగాగ్నిలో మండి తామగ్గిబుగ్గిఅయింది. ఈ వృత్తాంతమంతా నంది శివుడితో చెప్పాడు. రుద్రుడు ఆగ్రహావేశ పరవశుడై—

శీఘ్రముగ జడలన్ని వేగాన దులుపుకొని
చిందుచిందాయెనా యెందుకింతాసేపు
శీఘ్రిన లలాటముపై చెమటలూడీసి
శీఘ్రిన చటాగ్రిపై చినుకులూ జల్లె
ఘుణఘుణామోగ్రియుచూ ఘణఘణాలాడుతూ
వీరభద్రుడుపుట్టె వీరాలుపలుకుతూ

వీరభద్రునికి జరిగినదంతాచెప్పి "దక్షుని పురికేగి పురము పాడుచేయమని ఆజ్ఞాపించాడు.

వీరభద్రుడు తండ్రి యాజ్ఞని తలదాల్చి మాతృశోకంతో విహ్వలచిత్తుడై

ఈశ్వరుల దేవేది ? అమ్మయేదీ ? మమ్ముకన్న తల్లియేదీ ?

అని ఆక్రోశిస్తూ దక్షుని యజ్ఞశాలకు చేరబోయాడు. అక్కడ నిశ్చింతగా కుడుములు తింటూన్న గణపతినిజూచి కోపం పట్టలేక "భక్షింపుతూ వీర్ని బాగు చేస్తున్నావ ? అమ్మయేదీ, మన అమ్మ యేదని పలికి, అమ్మయేదని తన్నెనూ" తర్వాత తన్ను ఎదిరించినవార్నీ, తల్లిని అంతకుముందు పరిహసించినవార్నీ నరుకుతూ గగ్గోలుచేయుచూ గడగడా వణకించెనూ ఇలా వీర విహారంచేస్తూ దక్షుని శిరసుని ఖండించి దక్షసతితో సోమయాజినినేను, సోమిదేవివినీవు అని ఆ శిరసుని అగ్నిలో స్వాహాయని వేల్చాడు. దక్షునిసతి విచారంతో

ఏమిచేతును దక్ష యెచ్చోటబోదునూ
కూతురులొ పోరాడ వద్దంటినీ
కూతురి వంకావారు కూర్రసాహసులంటి

అని పలవించి–

మాతృవంశముబట్టి మమ్ము రక్షించరా
కావరా కరుణించి యేలుకోరా తండ్రి
పురుష భిక్షము పెట్టరా

అని వీరభద్రుని వేడుకొన్నది. మునులూ దేవతలూ ప్రార్థించగా శివుడు వీరభద్రుని శాంతింపజేసి గొర్రెశిరసు తెప్పించి దక్షునికి తగిలించి యజ్ఞం పూర్తి చేయించి తన యాగభాగం తాను తీసుకొని తృప్తిజెంది వెళ్ళాడు. సతీదేవి యోగ విముక్త దేహయైన తర్వాత హిమవంతునింట పుట్టి పెరిగి శివుని చేపట్టింది. యీ కథను వ్రాసిన కవి యెవరో మనకు తెలియదు. ఇది అక్కడక్కడ కుంటినడక లు నడుస్తూ పరిష్కరించవలసిన అగత్యాన్ని తెలియజేస్తోంది.

శివకథా ప్రతిపాదకమైన కథల్లో సురాభాండేశ్వరమొకటి. సురాభాండంలో అవతరించిన ఈశ్వరుని కథ కాశికా మహాత్మ్య ప్రతిపాదకంగా వర్ణించబడింది.

పంచకోశమైన కాశీపట్నంలో గంగాతీరాన్ని శృంగార కంఠము చేరువన—

పులితోలు వస్త్రంబు భూమందుబరచి
కాషాయ వస్త్రములుకట్టి ధరియించి
వాళ్ళెళ్ళ వీభూతివని తేరగాను
రుద్రాక్ష తావళాల్ మెడనిండేవేసి

అపర శివుడిలా ఒక బ్రాహ్మణుడు జపం చేసుకొనేవాడు. అలా చేసు కొంటూఉండగా ఒకనాడొక గమల్లవనిత కలశంగొని గంగకోసం వచ్చింది. ఇంతభక్తుడూ కాలవశంవల్ల వలరాచవాని ప్రేరేపణవల్ల ఆమెని మోహించి, అనుసరించి, పొమ్మన్నను పోక ఆమె యింటిముందే లచ్చాడుతూ ఉంటాడు. ఆమె బ్రాహ్మణుడికి తానంటే జుగుప్స కలిగించి తనమీది మోహాన్ని మళ్ళిద్దామని

ఇదియేమి యెరుగవా యాడిగయిల్లు
కల్లుకుండ వారి కట్టినవి ఇంటికోళ్ళు,
కూడులు మిగిలిన కుక్కడాగినలు
పిల్లలు కతికగా పెట్టినతొట్టి
గుదిగూర్చినటువంటి గొర్రె మాంసంబు
చాల దుర్వాసనలు సమకూడ్చినట్లు
మాలమాదిగలెల్ల మసలెడిచోటు
హీనమ్ముచ్చేని యీయిల్లునీకు
సహ్యమెట్లాయెనో సద్బ్రాహ్మణుండ
వచ్చిన పనులేమి'

అని తన పరిసరాల్ని వర్ణించి చెప్పి అడిగింది. ఆ బ్రాహ్మణుడు తన మనసులోని కోరికని వెల్లడిస్తూ—

రంభమొదలైనట్టి రమణులందారు
నీకు సరిరారింక నిను కౌగిలించ
నాకు కోర్కెలుపుట్టె నలినాయతాక్షి

అని అన్నాడు. అంతటితో ఆగక—

కాదనక యిప్పుడు కౌగిటజేర్చి
మర్మ కేదపుదీర్చి మగువతోనన్ను
వదలకుండానన్ను బ్రతికించుమని

సిగ్గువిడిచికోరాడు. ఆమె ఇవన్నీ విని-

?? వెర్రిలయిన నీ వెర్రి తిరిగి
తడయకరోకలి తలకు జుట్టుమంటావె
పతివ్రతను నేను నాపతి మాటలేమి
మతితప్పి తిరుగుటా మేరయుగలదె ?
ఈ తుచ్ఛతనము నా సుఖమేమిగలదు
జనుబు యెరిగుంటేను సిగ్గెల్లపోవు
పెనిమిటి జూచితే మెట్టుగా జంపు

అని చెప్పి తగదని బెదరించింది. అంతటితో ఆగక—

తొల్లి ఈ పనులకు దొరకొన్నవారు
చెల్లిపోయినమాట సిద్ధముసుమ్మి
ఇంద్రుండు యేమాయె యీపనికిబోవ
చంద్రుండు యేమాయె యీపనికిబోవ
జనపతి సీతా తానెత్తుకపోయి
చెరను దవిలిన రావణాసురుడు త్రెళ్ళె
పాంచాలి మోహించి పట్టి కీచకుడు
కొంచెపుతనమున గూలడా వాడు
తెలివితెచ్చుక నీవు తిరిగిపొమ్మంచు

హిత ముపదేశించింది. బ్రాహ్మణుడు తన పెద్దతనమంతా నీటగలిపి—

నిన్ను పొందకయున్న నీరజనేత్రి
నిర్ణయము ప్రాణంబు విడుతు నీవేళ
యెగదిగజేసి నీవెంత చూచినను
తపసి బ్రతికించ నీతరము గాదనుచు

దశావస్థలో పడబోయేనన్నాడు.అంతతో ఆవనిత విప్రుడు తన్ను మిక్కిలి వలచి నాడని నిశ్చయించి, పరోపకారమే పరమ పుణ్యమని తలపోసి విరహవేదనచే

మూర్ఛిల్లిన బాపని తట్టి లేపి

నా వ్రాశ్రిత ఫలమునూ వైపగతిరీతి
తప్పించవశమయ్యా దైవ బ్రాహ్మణుడా

అని తన పడకటింటిలోనికి పదమంది, తర్వాత తాను స్నానమాడి, అలంకరించుకొని కరకంచు చీరకుచ్చెళ్ళు మీగాళ్ళ నటించులా తీర్చికట్టుకొని, అందెలు ఘల్లని మ్రోయ తపసి కానందము కలుగజేసి సయ్యాటలు పేరుగా వారి వాసనలు దీర్చి నిద్రించెను. వారాస్థితిలోనుండగా ఆమెభర్త—

అట్టిట్టుతిరుగాడి అతాడిచెట్లా
క్రిందుక కావుళ్ళకల్లు వుప్పొంగగా
బిం చెలనుం చుకూ ప్రియకాంతబిలచె

భర్త రాకడనెరిగి ఆ వనిత బ్రాహ్మణుని పక్కగదిలోనున్న సురా భాండంలో దాగి ఉండుమనిచెప్పి తాను పతి కెదురేగింది. అలావెళ్ళి పతికి కల రూపునీ బ్రాహ్మణుని రాకడనీ తెలియజేసింది. ఇలా చెప్పుటవిని భయభ్రాంతుడై

బ్రహ్మచారి అనియేటి బ్రాహ్మణోత్తముడు
బ్రహ్మ రంధ్రింబునా విడిచె ప్రాణములూ

ఆగొడు దాగియుండి మరణించిన బ్రాహ్మణుని సతితో పోయి చూచి తమకు బ్రహ్మహత్యా పాతకం సిద్ధించిందనే విషాదంతో—

మఠములో బ్రాహ్మణుడు మన యింటికిపుడు
కఠిన మానసుడితడు కదలిరానేలా
వచ్చి నీమీద వాంఛల కోరనేలా
తీర్చిన తదుపరి ముగుద పొమ్మనక
ఈ యింటి లోపలికి యేలపొమ్మంటి
పచ్చి కొయ్యవుగదే భామరో నీవు

అని ఆమెను మందలించి—

" నీళ్ళ కేతెంచితిని ఇభరాజగమనా "

అని తన రాకడకు కారణంచెప్పి, బ్రహ్మహత్యా పాతక విముక్తికై-

కాయము విడుతునా గ్రక్కునా నేను
పాయక అగ్నిలో పడుదునా నేను

అని వగచెందాడు. భర్త మాటలవిని యా వనిత ఎంతో విచారించి పరమే శ్వరుడిని ధ్యానించింది—

విశ్వేశు కరుణచే ఆ బ్రాహ్మణుండు
నిలువరకమ్ముగా ఈశ్వరుండాయె
భూమికి మెరపైన భూశక్తి వెలసె
ఆ సదాశివమూర్తి అమ్మతా అనుచు
యేనుగ చర్మంబు నెలమితోగప్పి
ఘనమైన పులితోలు కాశికాపేసి
పుర్రెపేరులువేసి భూతిపైపూసి
తలయందు దశకళలు తళతళాయనగ
తనకాంతి దశదిశల ధవళంబుపట్ట
చండికేశ్వరుడపుడు చెయ్యెత్తిపొగడా
రమణ భృంగీ, తండు, రిట, నందితోడ
పొగ్రిఢిరమ్మనికొంత భక్తవత్సలుడు
భరత విద్యలజూప పణతులుపాడ
నిలువగవచ్చిన ఈశ్వరుండాయె.

ఇలా ప్రత్యక్షమై ఈశ్వరుడా గమళ్ల దంపతుల నాశ్చర్యపరవశుల్నిచేసి సురాభాండేశ్వరుడై వారింట వెలసి కాశిలోగల కోటిలింగాలలో అధికుడై భక్తుల సేవలు కొనసాగాడు.

జంగం కథలనేపేరుతో విరాటపర్వం, గయోపాఖ్యానం, దేవయానిచరిత్ర, భల్లాణరాయచరిత్ర, శిరియాళకథ, నల్లతంగాళ్కథ ప్రచారంలో ఉన్నాయి. వీటిలో కథావిషయాన్నిబట్టి, భల్లాణరాయ చరిత్రా, శిరియాళకథా, శివకథా విభాగా నికి చెందుతాయి. విరాటపర్వం, గయోపాఖ్యానం, దేవయానిచరిత్ర పౌరాణిక గాథలు. నల్లతంగాళ్కథ సాంసారికగాథ. అది కల్పితమనే అనాలి. కథాసంవిధా నము ప్రజామోదం పొందినదవడంచేత యక్షగానాది రూపకాలూ, కేవల ద్విపద

కథలూమాత్రమే కాకుండా ఈ జంగంకథ పక్కీకూడా రూపొందింది. ఇష్టదేవతా ప్రార్థనతోటీ, సుకవి స్తుతితోటీ, రగడలతో, పురవర్ణనలతో, దరువులతో, వచనముతో, కందార్థాలతో జంగంకథలు చంపూ రీతి కావ్యాలను తలపిస్తాయి. హరికథలలోకంటె తక్కువగా, సంగీతానికీ కావ్యాలలోకంటె ఎక్కువ విరివిగా ఛందోభేదాల్ని వాడి జానపద రచయితలు రచించినవే జంగంకథలు.

భళ్ళాణరాయ చరిత్రాన్ని కిలారి బ్రహ్మయోగి రచించాడు. ఆయన కమ్మ కులజుడననీ పమిడిపాటి కామాక్షయ్యగారి ప్రియశిష్యుడననీ, చింతలపాలెము (కావలి తాలూకా) నివాసిననీ చెప్పికొన్నాడు.

జంగమదేవర్లంగుగాను ఉప్పొంగుచు చదువగనూ
మంగళకరమని యీకథ జనులిటు సంగతిగా విననూ
భళీ, భళీ. భళ్ళాణరాయకథ ఫెళ్ళున మ్రోగగను
కళాపెళాయని గజ్జెలంచెలును కాళ్ళను మ్రోయగనూ.
దిరీసు (డ్రెస్) వేసుకొని సరసముగా ఏది వరుసగజెప్ప
సరేసరేయని సరసులెల్లరును హర్షమొందగాను

భళ్ళాణరాయకథ చెప్ప బూనుకొంటినని వక్కాణించాడు.

భళ్ళాణరాజు శివ భక్తిపరుడు, చెల్లమాదేవి, మల్లికాదేవీ పట్టపుదేవులుగా శివ దీక్షాపరుడై ఆ రాజు విభూతి నొసట ధరించిన వారడిగినది లేదనకుండా ఇత్తునని వీరవ్రతంపట్టి నడిపించుకొంటున్నాడు. అతని దీక్ష ఎలాంటిదో కవి వర్ణన చూస్తే తెలుస్తుంది. ఆరాజు—

అడుగకపోయిన జంగమునకు నే పెడుదును ఒకబట్టు
అడిగిన లేదని నుడివితి నయినను నాకగు నావట్టు
అని యీవిధమున జనములకెల్లను విన దగ తెల్పండీ
ఘనముగ యేబదియారు దేశముల వినునటు జేయండీ

అని చాటించబంపాడు. ఆ చాటింపువిని-

విడువని వీరశైవము గలిగిన జడముని బసవయ్య
నడుపుడి వడిగా తడవేలనునిక పిడిఘట చిక్కయ్య

షర హరు మరువక పూజలుచేసే పర్వత నాథయ్యా
గరళకంధరుని స్మరణచేసెడి చరలింగ వేమయ్య
గంటవేసుకొని గగ్రిక్కున రమ్మట ఘంటా శరభయ్యా
వెంటనె వెంటనె కూడిపోదము జంటగ నందరమూ
సిద్ధలింగమా, బుద్ధవీరయా, మద్దుల వీరయ్యా,
నాథ సుందరం, బోధ సుందరం, మేఘా మరళయ్యా,
నాదలింగమా, నాగలింగమా, సదమల కంబగిరీ,
శంకరలింగం, శంభులింగమా, అంకెరగురులింగం,
బొంకెరుగని శివరాజలింగమా డంక కోటిలింగం
యేకాంబరమా, కనకాంబరమూ యోగ సాంబశివుడా
శ్రీకంఠా, శివ, నీలకంఠ, యీలోక సదాశివుడా
మల్లికార్జునా, చెన్నవీరయా, అల్లవిరూపాక్ష
పుల్లివీరయా, చల్లసూరయా, ఢిల్లీ విశ్వనాథా
కొమరలింగమా, అమరలింగమా, వినుసోమలింగం
భీమలింగమా, భీకర లింగమ, సుమహిత శివలింగం

అని జంగాలంతా ఒకరినొకరు పిలుచుకొంటూ భళ్ళాణరాజుదగ్గరకి సదా వృత్తికోసం బయలుదేరారు. భళ్ళాణరాజు ఎవరు వచ్చినా లేదనకుండా తృప్తుల్ని చేసి పంపుతున్నాడు. అతనికీర్తి అన్ని లోకాలలో నిండింది.

భళ్లాణరాయడి శివభక్తినిగురించి నారదుడు విన్నాడు. పార్వతీదేవి దగ్గరకు కడుపుబ్బుతో వెళ్ళాడు. భళ్లాణరాయని శివభక్తిని పరీక్షించవలసిందేనని చెప్పాడు. ఆమె శివుని ఎగసనదోసి భక్తుని పరీక్షించవలసిందని పంపింది.

శివుడు జగన్మోహనాకారుడైన జంగంవేషం ధరించి భళ్ళాణుడి దగ్గరకు కదలి వచ్చాడు. వచ్చి—

"వెన్నెలతేటకు మించిన మంచిది కన్నియ గావలెను
లంజలేంది వెయి లంచమిచ్చినను గంజిబోదు నాకూ"

అని విపరీతమైన కోర్కె కోరుతాడు, రాజు—

స్త్రీసగావలెనని గోరితే ఒక్క మానినీమణి పెండ్లిజేతునే
సగము రాజ్యము పంచియిత్తు నిన్ను వగమీర యేలించిమెత్తునే

అని జంగాన్ని సరదీస్తాడు. కాని, జంగం ససేమిరాఅని తనకి కావలసిన లక్షణాల్ని హిరణ్యాక్ష వరాలలాంటి వాటిని వివరిస్తాడు. మరి దారిలేదని రాజు జంగంకోర్కె తీర్చుటకు తలవర్లని వేశ్యవాటికకు పంపాడు. వేశ్యవాటికలోనున్న వేశ్యలందరి ఇండ్లలోనూ విటరాయులు కుదురుకొన్నారు. ఈ వార్తవిని రాజా శ్చర్యపడిపోయాడు. వ్రతభంగ మవుతుందని చింతించాడు. చివరకు భార్య చెల్లమాదేవినే వేశ్యఅని జంగమరాయని కర్పిస్తాడు. శివుడామె పాతివ్రత్యభంగం కాకుండా అడ్డాలలో బిడ్డ అయాడు. భళ్ళాణరాయని భక్తికి మెచ్చాడు. ఆతనిని భార్యలతో కైలాసానికి కొంపోయి వారికి ప్రమథాధిపత్యం ఇచ్చాడు.

"నాది" అనే భావాన్ని త్యజించి సర్వం జంగమ శివార్పితంచేసిన భల్లా ణునికథని జానపదకర్త రసవంతంగా వర్ణించాడు. గంజి నాగేశుడు రచించిన శ్రీయాళ మహారాజు చరిత్రకంటె ఇదెంతో మిన్నగాఉంది. చిరుతొండనంబికథనే శ్రీయాళ మహారాజుచరిత్ర అనేపేరుతో నాగేశకవి రచించాడు. నాగేశుడు పద్మ సాలి. శ్రుత పాండిత్యంవల్ల శ్లోకాలను పొందుపరచగలిగినవాడు. శివకథా పరి జ్ఞానకాడనీ అందుచేతనే చిరుతొండనంబినే శ్రీయాళరాజుగా వర్ణించాడనీ ఆనవ లసి వస్తోంది.

వెంకట సుబ్బరాయగుప్త రచించిన దేవయానిచరిత్ర మరొక జంగంకథ. వాసిరెడ్డి వెంకట కృష్ణయాఖ్యుడను కమ్మ కులశ్రేష్ఠుడు ప్రోత్సహింపగా మల్లి కార్జునినికంకితంగా "విన్నభారతమే వినవలె పీనుల విందుగను, తిన్నగాచెలే కడు మోదంబున తినవలె''నని కోరడంచేత భారత కథాంతర్గతమైన దేవయాని కథని రచించాడు. ఇందులో పాండిత్య ప్రకర్షకోసం పడే తాపత్రయం ఎక్కు వగా కన్పిస్తోంది. అందుచేత భాషనిబట్టి జానపదులకు దురవబోధమైనా, యక్ష గాన రూపంగానూ, జంగంకథగానూ, ఈకథ నిలిచింది.

వెంకట సుబ్బరాయగుప్త రచించిన వామనవిజయమూ, ధేనువకొండ వెంకయామాత్యుడు రచించిన గయోపాఖ్యానమూ, విరాటపర్వమూఅనే జంగం కథలుకూడా ఈ దోరణిలోనే రచింపబడ్డాయి. ఇవేకాకుండా విజయవాడ రేడియో స్టేషనువారు సేకరించిన వొక ఐదు జంగంకథ లున్నాయి. వాటిలో శ్రీగిరి యాత్రావర్ణనమే ఒక కథలోని విషయము యాత్రికుడు—

అరుస మెడల రుద్రాక్షల దాల్చిరి

గురుకటాక్షమున గోప్యిందరిసితి
శివ పంచాక్షరి శివ రహస్యంబును
శివ తత్వము పరిశీలన చేసితి
వెలుగులకెల్లా వెలుగై లోపల
వెలిగెడి దీపము నే కనుగొంటిని
ఈవల సూర్యుం డావల చంద్రుడు
తోమలమౌ నీ ధామము గంటిని

అని ఉత్సాహంతో సాగిపోవడం అందులో వర్ణించబడింది. ఇలాగే శివ రాత్రి మహాత్మ్యంఅన్న కథలోకూడా, రకరకాల యాత్రికులు ఏదారిచూచినా "చేదుకో కోటయ్య, చేదుకో"అంటూ నాదంచేస్తూ పోతారు.

మొత్తంమీద అసలు జంగంకథలూ, వాని రచనారీతుల్ని అనుసరించిన ఇతర కథా రూప రచనలూ తెలుగు వాఙ్మయంలోని చంపూ, కావ్య రీతులకు పూర్వరూపములేమో ననిపిస్తాయి. ప్రాచీన విద్వత్కవులీ సంధానమనుసరించినట్లు కన్పించకపోయినా జానపద కవులుమాత్రం విరివిగా ఈ మార్గాన్నేఅనుసరించినట్లు తోస్తుంది. అందుచేత ఈరీతి రచనలను ఇంకా నిశితంగా పరిశీలించవలసి ఉంటుంది.

## 8 వేదాంత, భక్తి రస ప్రధానమైన రచనలు

తెలుగు వాఙ్మయంలో కీర్తనలూ, తత్వాలూ ప్రత్యేకంగా శ్రద్ధతో పరిశీలించవలసిన వాఙ్మయశాఖ. వాటినన్నింటినీ వాటిలో ప్రతిపాదితమైన విషయాల్ని బట్టి మూడుభాగాలు చేయవచ్చు. అవే హరిభక్తి ప్రతిపాదకమైనవీ, శివభక్తి ప్రతిపాదకమైనవీ, అద్వైత వేదాంత ప్రతిపాదకమైనవీఅని నిర్వచించవచ్చు. కొంచెం సంగీతజ్ఞానంకల భక్తులు కీర్తనలనే ముముక్షుమార్గ సాధనంగా గ్రహించారు. వాటిని నేడు భిక్షుకులు భుక్తిసాధనంగానూ, సంగీతప్రియులు వాటిని కళోపాసనకు ఆధారంగానూ గ్రహిస్తున్నారు. భక్తశిఖామణులందరూ భక్త్యావేశంతో పాడిన గేయాలు తమిళ వాఙ్మయంలో ముఖ్యమైనస్థానాన్ని ఆక్రమించాయి. ఇటీవలివాడయిన సుబ్రహ్మణ్య భారతికూడా ఆవేశంతో ముందు పాటల్ని పాడాడనీ, వాటినే తర్వాత మెల్లిగా ఆయనో ఆయన శిష్యులో గ్రంధస్థం చేశారనీ తెలుస్తోంది

భావావేశమూ, భావవర్ధనమూ, ఉత్తుంగ తరంగ సదృశమైన భావప్రకటనమూ గేయకవిత్వపు సొమ్మని సూచించేటందుకు సహాయకారు లౌతున్నాయి. తెలుగు వారిలోకూడా భద్రాచల రామదాసూ వారి సంప్రదాయ పరంపరకే చెందిన తూము నృసింహదాసూ, పరాంకుశదాసు, నిట్టల ప్రకాశం, కడపజిల్లా భోజదాసులూ, వెంకటాద్రి స్వాములు, సుదర్శనదాసు మొదలైన వారెందరో ఎన్నో హరిభక్తి ప్రతిపాదకములయిన హరి మహిమల్ని వ్యక్తంచేసే కీర్తనలను గానంచేశారు. వాటిని ఎంతస్థూలంగా పరిశీలించిన వారికైనా వాటిలోని సహజమైన కవితాధారా, తేటతెలుగుదనమూ, అసమానభక్తి పులకిత హృదయోత్థిత మధుధారలూ, రుచి తగులక మానవు. భద్రాచల రామదాసు కీర్తనలు వీటన్నింటిలోనూ మకుటాయమానమైనవి. వాటి ఛాయలూ, జాడలూ, ఇమిటేషన్లూ తక్కినవారి రచనల్లో విరివిగా కన్పిస్తాయి. అందుచేత భద్రాచల రామదాసు కీర్తనల్ని కొంచెం వివరంగానూ తక్కినవారి కీర్తనల్ని స్థాలీపులాకంగానూ పరిశీలిద్దాము.

గోల్కొండ పాదుషాయై తానీషా యనుగ్రహమునంది భద్రాచలమునకు తహశీల్దారుడై (నాటి తహశీల్దారుడు నేటి కలెక్టరువంటివాడు) అధికార గర్వ మత్తుడుగాక "రామనామమే జీవనమని" భావించి రామదాసను పౌరుష నామమందిన గోపన్న ధన్యుడు. కబీరుదాసుచే తారకమంత్రముపదేశమంది "తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా'' అని సంతోషమున గెంతిన భక్తుడు. "ఆశపుట్టెనే శ్రీరాములతో ఆహా నే పుట్టనైతిని. సకల సేవలు సల్పుచు మరియు అకట నల్గురితో నాడుకొందుగద'' అని బాలునివలె వలపలాడినాడు.

గోపన్న అధికార స్వీకరణమునకై భద్రాద్రి చేరుకొంటూ భద్రగిరి దర్శనము కాగానే "అదిగో భద్రాద్రి, గౌతమి ఇదిగో చూడండి" అని పరవశుడయి మనసుండబట్టలేని ఉత్సాహాతిశయంతో క్రమంగా అడుగు వేసినకొలదీ కంటబడిన గోపుర ప్రాకార మంటప సౌందర్యాలను కన్నుల కరువుదీర వర్ణించినాడు. తమ్మల దమ్మక్క ఏనాడో గ్రామస్థుల సహాయంతో కట్టించిన ఆలయ మంటపాదుల్నీ, జీర్ణావస్థలోనున్న రామాలయాన్నీచూసి మనసులో వగలపొగిలి వెంటనే కాపుల బిలిపించి రాముని కోవెలను జీర్ణోద్ధారణము చేయవలెనని నిశ్చయించాడు. " సాహసించి, తానీష పైకమును సరగున తా వ్యయపరచన్ '' నిశ్చయించెను. "పోయ్యేటప్పుడు వెంటరాదు ఒక పుచ్చిన వక్కయిన" అని అందరినీ రామకోవెల పునరుద్ధరణకి లోభము వదలి పాటుపడు నట్లుద్బోధించాడు. "శ్రీరామ

నామం మరువాం మరువాం సిద్ధము యమునకు వెరువాం వెరువాం'' అనీ, "తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకూ పక్కతోడుగా భగవంతుడు మును చక్రధారియై చెంతనె యుండంగ" అని ధైర్యం వహించాడు. రాజభీతిచే మనసు చలించినప్పుడుకూడ "ఏతీరుగనను దయజూచెదవో ఇనవంశోత్తమరామా'' అనీ "గురుడవు నామది దైవము నీవనీ'' ఆలాపించాడు. రాజాజ్ఞ ననుసరించి, నిష్ఠురములాడి యితనిని గోల్కొండకు హర్కారాలు బందీగాకొనిపోతున్నప్పుడు కూడా "నీసంకల్పం బెటువంటిదో గన నెంతవాడ రామా" అనీ "ఇతరము లెరుగ నయ్యా నాగతి నీవే రామయ్యా'' అనీ విన్నవిస్తాడు రాజు దెబ్బలశిక్ష విధించి నప్పుడు "రక్షింప నిదియేమి రాచకార్యముపుట్టె రామచంద్రా, నన్ను రక్షింప కున్నను రక్షకులెవరింక రామచంద్రా !'' అనీ, ప్రశ్నిస్తాడు. తన ఇష్టదైవాన్ని ఎంతో మృదువుగా వినయం ఉట్టిపడేలాగ, తర్వాత రక్షణగానక "తగునయ్య దశరథ రామచంద్ర దయదలపవేమి నీకు పగవాడనా ?'' అని మందలింపు మొదలిడతాడు. చివరికి గజేంద్రుణ్ని ఆవహించినట్లుగా రామదాసునికూడా కలడు కలండనెడివాడు కలడో లేడో అన్న సందేహం ఆవహించింది కాబోలు "ఏడనున్నాడో భద్రాద్రివాసు డేడనున్నాడో నాపాలిరాముడు'' అనీ "ఎటుబోతివో, రామ యెటుబోతివో ! యెటుబోతివో నిన్ను నే వేడుకొనుచుంటి" అనిఅంటాడు. చెరలో కఠిన శిక్షలకు తాళలేక "ఏలాగు తాళుదు నేమిసేతుర రామా !'' అనీ, "అబ్బబ్బ దెబ్బలకు తాళలేర రామప్ప గొబ్బున నన్నేలుకోరా" అనీ మొరపెట్టుకుంటాడు. అంతకీ అలనా పాలనా లేకపోతే "రక్షించె దొరవని నమ్మితీ, నన్ను శిక్షింప తప్పేమిచేసితీఅని కరుకుగా అడుగుతాడు. అంతలో నొచ్చుకొని రాముని భక్తపరాధీనత సభివర్ణించి దాసునితిప్పలు చందముతో తీరునని భావించి "ఇన్ని గలిగి మీరూరకున్న నే నెవరివాడనౌదు, కన్నతండ్రిపలె రక్షించుటకును కరుణ యేలరాదు ! అని గారం చేస్తాడు. "ఓ రఘువీరాయని నే బిలచిన ఓహో యనరాదా'' అనీ "శరణాగత రక్షణ బిరుదని నే శరణంటి గదయ్యా !" అనీ అనునయించి "కోదండరాములు మముగన్నవారు. ధరలో నాదరించి పెంచి విడనాడలేరు'' అనీ రాముని వారమైనారము ఇతరాదుల గణనసేయము" అని తనకుతాను ధైర్యం చెప్పుకొంటాడు.

భక్తి తన్మయుడై అనుక్షణ రామస్మరణ దీక్షాపరుడయిన రామదాసు బాధలకు తాళలేక మానవ సహజ స్వభావంతో రామచంద్రునికి తాను చేసిన కైంకర్యము లన్నింటినీ వివరించి "నీవు కులుకుచు తిరిగేవు ఎవరబ్బసొమ్మని రామ

చంద్రా" అనీ ఈ దెబ్బలకోర్వక అబ్బ తిట్టితినయ్యా రామచంద్రా ! అని క్షమా ర్పణ చెప్పుకుంటాడు. ఈ కీర్తన రామదాసు చరిత్రంలోనూ, భక్తిజీవనంలోనూ పతాకలాంటిది. పండ్రెండేండ్ల కఠిన నరకాన్ని అనుభవించి నమ్మిన ఇష్టదైవం చేయూతగానక ఏటికి జల్లిన నీళ్ళవంటి బ్రతుకయినదని నిస్పృహతో అపాటి మాట కరుకుగా అనడం అశ్చర్యకరంకాదు. నిస్పృహావేశపరుడై 'నిన్ను బోనిచ్చెదనా నన్ను రక్షింపవచెన్ని విధముల నా కన్నులాన రామ' అని కట్టుచేసి 'నిన్నరికట్టుదునింక దిక్కుగలిగితే మొంకెట్టుకో రామా' అనీ బెదిరించడం చనువు గలిగిన మహాభక్తునికే చెల్లుతుంది. "రామా నీచేతేమి కాదుగా సీతాభామ కయిన చెప్పరాదుగా "అనీ" శర చాప మూల శక్తి దప్పెనా నీ శౌర్యము జలధిలో జొచ్చెనా' అనీ ఇష్టదైవం మనసులో రోషం రేకెత్తించేటందుకు చేసే ఉపాలంభాలుకూడా భక్తుడికే తగును. "రామచంద్రులు నాపై చలము చేసినారు, సీతమ్మ చెప్పవమ్మ" అని సీతమ్మతల్లి హృదయాన్ని సులభంగా ద్రవించగలిగేలా చేయగలననే లౌక్యాన్ని వెల్లడిస్తుంది.

జైలునుంచి సగౌరవంగా విడుదలఅయి తిరిగీ భద్రాచలం చేరుకొన్న తర్వాత రామదాసు భక్తిపూరిత కీర్తనల్లో ఒకస్థాయి కన్పిస్తుంది. మనస్సు నిర్వి కల్పక సమాధి నందిందని గోచరిస్తుంది. "ఏమయ్యరామ బ్రహ్మేంద్రాదులకయిన నీ మాయ తెలియవశమా" అనీ బహుకాలమునకు శ్రీ భద్రాచలేశునకు పాదసేవ కుడనై తిని ఆహాహా నాజన్మ సఫలమాయె నేటికిని అని తృప్తినందుతాడు. "చంచలమైన నామనసు నిశ్చలమై యున్నది. అరిషడ్వర్గములు నన్నంటకున్నవి. శ్రీ హరినామస్మరణ జిహ్వాకమై యున్నదీ" అని వైరాగ్యస్థితి కల్గిందనీ, భక్తి భావం అలాంటి నిర్వికార శాంతస్థితిని కలిగించి పరతత్వంమీద బుద్ధిని లగ్నం చేస్తుందనీ అనుభవ పూర్వకంగా గ్రహించాడు. అందుచేతనే " తల్లిపో తాము చాలదయ యుంచండీ ఇక మళ్ళీజన్మాలకు రాము మదిలోనుంచండీ ఇక మళ్ళీజన్మాలకు రాము మదిలోనుంచండీ" అంటూ తన్ను మిత్రునిగా, రామదాసుగా గురువుగా గౌరవించిన భద్రాద్రివాసుల సెలవు తీసుకొని అవతారం చాలించాడు.

మొత్తంమీద రామదాసు కీర్తనలోని కవిత్వం సహజధారగలది. ఒక్క మాటకుకూడా అర్థంకోసం నిఘంటువుని చూడవలసిన పనిలేదు. కొడుకు గంజి గుంటలోపడి మరణించినా ప్రాతఃకాలమందు చిటికెనవేలి తేలుగుట్టినా పైకెగ సిన భావతరంగాలు కీర్తనలరూపంలో వెలువడ్డాయి. అంతా రామమయం.

శివునాజ్ఞలేనిదే చీమయినా కుట్టదుఅని నమ్ముటచేతనే "పాపడు పీడు బడలి యున్నాడు పాపనులేపి ప్రిజలను గల్పు'ఏ.సీ.—

> మేల్మైన చిటికెనవేళ్లు, ప్రాతఃకాలమందున గుట్టె తేలు,
> బాలత్వమున నేను బావి నీళ్ళకుబోయి
> కాలుబెట్టగ చిన్న తేలుపొడిచెనయ్యో,
> చలివచ్చె నీ నొప్పిచేత, దీనివేడిమి పాపిష్టిఘాత,
> ...... మిక్కిలి సలుపుచున్నది, రామ గ్రక్కున నాదరించుమను

అని కీర్తించాడు. మృదుమధురంగా, భక్త్యావేశంవల్లనే రామదాసైన గోపన్న రాముణ్ని తెలుగువారి ఇష్టదైవం చేశాడు. రామాలయములేని పల్లెగాని, "హైందుకయితే వుంచినావు బ్రందిఖానాలోను"అని అక్షర సాంకర్యాలతో అచ్చమైన జానపద భాషలోనైనా ఆలాపించని నిరక్షరాస్య భక్తులుగాని కన్పించనిచోటు తెలుగుదేశంలో ఉండదు. ఎన్ని అభిప్రాయభేదాలు తెలుగుదేశంలో కన్పించినా, రామదాసు కీర్తనల మాధుర్యాన్నిగురించీ, వాటికిగల పామరామోహాన్నిగురించీ అభిప్రాయభేదం కన్పించదు.

తెలుగుదేశంలో ఉత్తరప్రాంతాన గోదావరీతీరంలో పంచవటీ ప్రాంతంలో స్పందించిన రామభక్తి, గానసుధాలహరి కర్ణాటక సంగీత గానవాహిని కాలంబమై కావేరీతీరాన 17వ శతాబ్దం చివరన మెరుపులా మెరిసేటందుకు బీజమైంది. కంచర్ల గోపన్ననీ, కాకర్ల త్యాగబ్రహ్మనీ కన్న తెలుగుతల్లి భక్తి వాఙ్మయానికీ భారత సంగీత కళకీ అనన్య సాధ్యమైన కాన్కలర్పించింది.

రామదాసు చరిత్ర సింగరిదాసు, తూము నృసింహదాసు, పరాంకుశదాసు, విట్ఠల ప్రకాశదాసు మొదలయిన వారెందరికో ధృవతార అయింది. ఆయన దాశరథీ శతకము పండిత పామరులకు పఠనీయగ్రంథం అయింది. భాగవత పరంపరలో తూము నరసింహదాసు పదిమందికీ తెలిసినవాడు. రామదాసు చరిత్రకి ప్రచారం కల్పించినవాడితడే అయివుండవచ్చు. నరసింహదాసుకూడా తానీషా గోల్కొండని ఏలినకాలంలోనే మంగళగిరికి పడమరగానున్న గుంటూరులో జన్మించాడట ; అచ్చయమంత్రీ, వెంకమ్మా ఈయన తల్లిదండ్రులు. విద్యాభ్యాసం పూర్తిచేసుకొని గుంటూరి డివిజన్‌లో కొలువుచేయుచు లౌకికమునందున్నప్పటికీ రామభక్తిపరాయణుడైనాడు. శ్రీరామునిచే స్వప్నమందు భద్రగిరియాత్ర

చేయమని ప్రబోధింపబడి, హరిదాసులగూడి రామస్మరణ పరాయణుడై భద్రాద్రికి చేరాడు. తరువాత అక్కడనుంచి అయోధ్య, పాండ్యాపురంబును (పండరీ), శ్రీరంగ, రామేశ్వర సేతుయాత్రా చరణశీలుడై 'సెలవా మాకిక సెలవా రామయ్యా' అని సెలవందినాడు. 'రంగని సేవింపగలిగెనమ్మ, వయ్యారిమోహన' అని రంగని కీర్తించి, వరదునిగంటినీ కంచి వరదునిగంటినీ' అని వరదరాజ స్వామిని సేవించి చెన్నగరమున తిరువళిక్కేణి పురంబుజేరి పరమాత్ముడగు పార్థసారథిని పలువిధముల పొగడి భజనవిధానంచూసి వైద్యం రమణయ్యగారు మెచ్చుకొని తిరువత్తియూరి త్యాగరాయ సన్నిధికి అహ్వానించగా నక్కడికేగి నృత్య గీత హరినామ స్మరణలతో నిత్య కాలక్షేపం చేయసాగెను. అక్కడ ఈయనతో వరదయపంతులు (వరద రామదాసు) కలిశాడు. అక్కడ మూడు నెలలుండి ఇద్దరూ భద్రాద్రికి తిరిగి బైలుదేరారు. దారిలో నెల్లూరి రంగని సేవించుకొని రామనామ వ్యాపారంచేస్తూ రామునిప్రేమా, లాభమూ విస్తారంగా ఆర్జిస్తూ, దండకారణ్యమున క్షుత్పిపాసా పీడితులైనారు. వారిని శ్రీరాముడు వృద్ధ బ్రాహ్మణ రూపంలోవచ్చి కాపాడాడు. ఇలా రామానుగ్రహము పొంది భద్రాద్రిచేరి శ్రీరామునికి కైంకర్యములు చేసిరి. వరద రామదాసు తనచేనున్న లక్ష యేబదివేల వరహాలను రామార్పితంబుగా ఆలయ ధర్మకర్తయైన నృసింహ దాసు చేతికిచ్చెను. తర్వాత వారిద్దరును జీవితశేషమునుఅందే రామునికీర్తించుచూ భక్తుల నారాధించుటలో గడపిరి. వరద రామదాసు పరమపదము చేరగానే నృసింహదాసు ఆగాత్రము నొక్క తెప్పగట్టి ఆశాపాశములను వదలి అఖండ గౌతమిలో నైక్యమై వైకుంఠమున కేగెను. అతని చరిత్రను నంబెరుమానారు సూరి రచించాడు, శింగరిదాసు దాని ప్రబలపరిచాడు. మొత్తంమీద భద్రగిరి రాముని ప్రభావాన్ని దేశదేశాలా చాటినది తూము నృసింహదాసే. ఆయన తానీషాకాలంలో పుట్టాడన్న మాటనిబట్టి కంచర్ల గోపన మంత్రితర్వాత భద్రాచల రామాలయ ధర్మకర్తృత్వం వహించింది ఈయనేనని తోస్తుంది. అలౌకిక మహి మల్ని ఒప్పనివారు గోపన్న తానీషా చెరలోనే సిద్ధిపొందాడనీ, భక్తులే తహశీల్ పయికంకట్టి చెర విడిపించారనీ అనడంకద్దు. ఏదెలాగయినా తూము నృసింహ దాసు భక్త్యావేశమూ వరద రామదాసు వితరణా, భద్రగిరీశుని మహిమనీ రామ దాసుకీర్తనల్నీ ఆబాలగోపాలాన్ని భద్రాచలానికి ఆకర్షించసాగాయి రామదాసు చరి త్రను రచించిన సింగరిదాసే రాయడంవల్లనోఏమో తూము నరసింహదాసు చరి త్రలోకూడా కొన్నికీర్తనలలో అవినాభావమైన పోలికలు కన్పిస్తున్నాయి. అందు చేత గోపన్న నరసింహదాసుల కీర్తనలను ఉమ్మడిగానే పరిశీలించాలి. ఇద్దరినీ

రామదాస స్వరూపులనే భావించాలి. క్షీరశర్కరలలా కలిసినవారి కీర్తనలని వేరు చేయవలసిన పనిలేదు. వాటిని భక్తవరులలాగే ఆస్వాదించాలి.

హరినామ సంకీర్తనలు రచించినవారిలో అల్లూరి వేంకటాద్రి స్వాములవారొకరు. ఆయనకే తిరువెంగడ రామానుజజియ్యరు అనే నామాంతరముకూడా ఉండేది. ఆయన శ్రీ వరదరాజ, శ్రీరంగ దేవాలయ కైంకర్యములు చేసినాడు. భాగవత పరంపరను గుర్తెరిగి వారికీర్తనామృతమునుగ్రోలి తత్తుల్యములైన కీర్తనలను రచించినాడు. కబీర్‌దాసు, రామదాసు, పురందరదాసు, తాటంక వెంకటదాసు, తాళప్ప, తూము నరసింహదాసు మొదలైనవారని ఈయన రచనలవల్ల తెలుస్తుంది. తాటంక వెంకటదాసూ, తాళప్పా మనకి అంత తెలిసినవారుకారు. " దండము తిరుపతికొండా యిది దండము సిరిగలకొండా" అనేకీర్తన తాటంక వెంకటదాసు రచించాడట. దానిని రామానుజజియ్యరు ఉదహరించాడు దానినిబట్టి వెంకటదాసు కీర్తనలు సాఫీగా నడిచేవనిపిస్తుంది. వేంకటాద్రి స్వాములవారి రచనల్లో ధన్యాసిరాగము ఆదితాళంలోపాడే " పరాకుసేయుట పాడిగాదురా పరమపురుష వరద'' అన్నపాట భక్తజనామోదంపొంది భజనకీర్తనలలో, జనసామాన్యంలో నిలిచింది. అదే ఈయన రచనా ప్రాశస్త్యానికి మచ్చుతునక. పరాంకుశదాస కీర్తనల్లో—

దాసజన ప్రసన్నుడగు తామరసాక్షుని దాసులైనయా
దాసులకున్, తదంఘ్రియుగ దాసులకున్, తదధీన వృత్తులౌ
దాసులకున్, తదీయ పద దాసులకున్.........

వినమితులయే వైష్ణవ సాంప్రదాయం ఎక్కువగా వ్యక్తమౌతోంది. అదే "భజరే యతిరాజం'', "ధ్యానించవే రామానుజ గురుని ధ్యానించవే'', "భజ, భజరే, భజశ్రీ యతిరాజం పంకజ భవనుత పదాంభోజం," "రామానుజాచార్య నన్ను రక్షించి దయనేలుమా" అనే కీర్తనల్లో స్ఫురిస్తుంది. మానస ప్రబోధము కీర్తనకర్తలందరికీ ప్రియమైనసరళి. అదే వారి భక్తాంఘ్రిరేణుస్థితిని వెల్లడించేది. పరాంకుశదాసుకూడా "హరిహరీయనవే మనసా'' అనీ "స్మరణసేయవే మనసా" ; "శ్రీరామ రామ రామ రామ రామయని" అనీ తన మనసుని ఉద్బోధించాడు.

రామదాసు పడిన బాధలవంటివి పడకపోయినా, వారికట్టివి తటస్థించక పోయినా ఏవో బాధల నూహించుకొని రక్షింపుమని విలపించుట తర్వాత కీర్తన

కర్తలలో ఒక ఆచారం (Fashion) అయింది. అదే పరాంకుశదాసు "ఏల రక్షణసేయవో రామయ్యా" అనీ "ఏలర కరుణాసింధో నను దయ ॥నేలు॥ ఏలర భవబంధంబులు నాకిక జాలుర" అన్న కీర్తనలోనూ వ్యక్తీకరింప బడింది.

రామదాసు హఠం చేసినట్లుగానే ఇతరదాసులూ పరాంకుశదాసూకూడా హఠం చెయ్యడంకూడా ఆచారమైంది. అలాంటి హఠమే "ఒట్టుబెట్టుదురా ఓ పట్టాభిరామయ్య నీపయి గట్టిగ నాచెయ్యికబట్టి బ్రోవకయుంటే" అనీ "కరుణ నీకేల రాదయ్య రామయ్య నావయి" అనీ "కరుణ రాదేల శ్రీహరినాపై నీకింత" అనీ, "కల్కిదేవ నీకింత కరుణగల్గదేమి కారణముదెల్పు" అన్న కీర్తనలలోనూ కన్పిస్తోంది.

భద్రిగిరిరాముని రామదాసు ఆరాధించి తరించినట్లుగా తమతమ ప్రాంతాల్లో వెలిసిన విష్ణుని ఆరాధించి తరించేటందుకు భక్తజనులూ దాసులూ తలపెట్టినట్లు కన్పిస్తుంది. అదే అత్యంత సహజమైందనీ, సులభసాధ్యమైందనీ అనవచ్చు. అందుచేతనే ఆయాగ్రామాల్లో వెలిసిన దైవాలని ఆయాప్రాంతాల్లోఉన్న దాసులు కీర్తించారు. అకారణంవల్లనే వివిధ మకుటాలతోఉన్న కీర్తనలు అసంఖ్యాకము లుగా తయారయాయి. ఐతే వీటన్నిటికీ రామదాసు రచించిన కీర్తనలే మాతృకల వంటివి. ఒరవడులు అందులోని మాధుర్యాన్ని అందుకోకపోయినా ఇవి నాడు నాటికి అక్కడక్కడ తెలుగుదేశంలో ప్రజ్వలితమైన రామభక్తి చిరు తరంగాలని మాత్రం భావించాలి. అందుచేతనే వీటిలో తెలుగుదేశాన్నంతటినీ రామభక్తితో ఉర్రూతలూగించిన రామదాసు కీర్తనల ఛాయలు విరివిగా కన్పిస్తాయి. దీన్ని ఒక లోపమని భావించడానికి వేల్లేదు. ఇవి తెలుగువారిలోఉన్న భక్తిభావాన్ని ఎగసన దోస్తూ వృద్ధిఅయేటందుకు దోహదమిచ్చాయి.

పరాంకుశదాసుకి "తిరువళ్లిక్కేణి దాసుడయిన పార్థసారథిని భక్తపరిపా లనా నీవే నాగతి" అని కీర్తించాడు. అందుచేత ఈ భక్తుడు మదరాసువాసిఅయి వుండవచ్చునని మనం ఊహించవచ్చును. ఈ ఊహకి ప్రోద్బలంగా పరాంకుశ దాసు రాసిన కీర్తనల్లో ఒక అరవకీర్తన కన్పిస్తోంది.

పరాంకుశదాసు రచనల్లో ఒక ప్రత్యేకత లేకపోలేదు. రాజనుత దివ్య పట్టాభి రామభద్ర" అనే మకుటంతో రామమహత్వాన్ని వివరించే పద్యాల్నీ, సీస మాలికలో రామాయణ సంగ్రహాన్నీ రచించాడు. అంతేకాకుండా చూర్ణిక నౌక

దాన్నికూడా రచించాడు. చూర్ణిక జానపద ఛందోరీతుల్లో నొకటి. పరాంకుశదాసు దాని మాధుర్యాన్ని గుర్తించి తన ఇష్టదైవాన్ని సంబోధిస్తూ ఒక గీతాన్ని రాశాడని అనుకోవాలి.

హరికీర్తనకర్తల్లో నెల్లూరపురము వదలి గౌతమీ తీరంచేరిన భద్రాద్రి రామ భక్తుడు నిట్టల ప్రకాశదాసొకడు. ఆయన కీర్తనలన్నీ సేకరింపబడ్డాయనిగాని, అచ్చయినాయనిగాని అనేటందుకు వీల్లేదు. ముప్పది కీర్తనలుమాత్రమే ప్రకటిత మయాయి. వాటన్నింటిలో రామదాసు కీర్తనల ఛాయలే కన్పిస్తున్నాయి. కాని, "గాలిపటమురా జీవా - గాలి నిలచినంతలోనె కూలిపోవు ధరలో జాలమేల జేసెదవురా'' అన్న కీర్తనలోమాత్రం మానవ జీవిత మశాశ్వత మనేటందుకు చక్కని హృదయంగమమైన పోలికను వాడాడు. నిట్టల ప్రకాశమను కవివరే ణ్యుడు, నిట్టల ప్రకాశ కవివరేంద్రుడుఅని కీర్తనల మకుటాల్లో ఆత్మసంబోధన చేసుకొన్నావాటిలో కవిత్వం ఏమీ కన్పించదనే అనాలి.

కీర్తనలను రచించినవారిలో పేరుకలపూడి వేణుగోపాల పదారవింద మరంద పానేందిందిరుండును, పరాశరవంశార్ణవరాకా సుధాకరుండును భారద్వాజస గోత్ర పవిత్రుండును జోగాచార్య పున్నమాంబల ప్రియపుత్రుండును తిరుమంగ యాళ్వారు చరిత్ర, హరిశ్చంద్ర, సావిత్రికళ్యాణ, సారంగధర, శ్రీరామజనన, పుష్పవల్లీవిలాస, ప్రభావతీ విలాసము మొదలైన నానావిధ నాటక రచనాగ్రేస రుండునుఅగు శేషాచార్య కవివర్యుడు రచించిన శ్రీరామ భజనామృత కీర్తనలలో కొంచెం నవ్యత కన్పిస్తోంది. కవివర్యుడన్న పేరు అన్వర్థమయేలాగ ఈకవి ప్రతి పాదంయొక్క రెండోఅక్షరాల్నికూర్చి చదివితే తనపేరువచ్చేలాగ ఒక సీసమాలిక వ్రాశాడు. అలాగే కృతిపతియైన కొల్లా మల్లయార్యునినామం వచ్చేలా ఒక గీత మాలిక వ్రాశాడు. "సారసాక్ష భవతు మంగళం, సకలామరేంద్ర సన్నుతపద భవతు మంగళం జా-లా-మేరా" అని ఇంగ్లీషు నోటులో ఒక చిన్న కీర్తన రాసి నవ్యతని సూచించాడు. "లాలి జగదభిరామ లాలి గుణధామా'' అన్న లాలిపాట లోనూ, "జోజో పావననామ జోజో శ్రీరామా'' అనే జోలపాటలోనూ, "తెల్ల వారవచ్చె పల్లవాధరులెల్ల చల్లచేయుచునుంద్రిదేరా'' అనే మేలుకొలుపు పాట లోనూ "యెంతకొంటెవాడె-యశోదమ్మ-యేమాస దెల్పుదుమె'' అని శ్రీకృష్ణలీలల నభివర్ణించుటలోనూ ప్రాచీన జానపద గేయముల మాధుర్యమును పుణికిపుచ్చు కొన్నట్లు స్పష్టమౌతుంది. పాండిత్యపుమోజు వదులుకొన్నయెడల మంచి రస

వంతమైన గేయములు రాయగల సమర్థుడనిపిస్తాడీకవి. రచనకొద్దిఅనీ రేపిన ఆశలు ఎక్కువఅనీ ఇతని రచనలను పఠికించినవారికి తోస్తుంది.

రామదాస భక్తపరంపరలో పేరందినవారిలో పెద్దదాసు మరొకడు. తంజాపురి శేషాచలంశెట్టి పూజాఫలంగా పెద్దదాసుడు పుట్టాడు. గాజులమ్మడం కుల ధర్మంగా కలవాడు. కౌమరుప్రాయము రాగానే తండ్రి ఇతనిని కొలువుకు పొమ్మంటాడు. కాని,

కొలిచితేను వేణుగోపాలుని కొలువవలెను
వ్రాసితే నీమముతో రామకోటి వ్రాయుచుండవలెను
పాడితే జగన్నాధునిపై పాట బాడవలెను
ఆడితే పురుషోత్తముని కొనియాడుచుండవలెను

అని నీమం చేసుకొన్నాడు. కులధర్మం ప్రకారం గాజులపులారం బుజాన పైచుకొన్నప్పటికీ "కాసులడుగకను ఘనమునదొడగెను భూసురస్త్రీలకు, పుణ్యాంగనలకు, భక్తివినయమున భగవద్దాసుడు వేంకటవిఠలుని వేమరుదలచుచు'' పెద్దదాసుడు విరక్తిమార్గంలో గాజుల వ్యాపారంమీద ధ్యాస లేకుండానే కాలక్షేపం చేశాడు. తల్లిదండ్రులు తాపత్రయంతో తాముచెప్పి, సాధువులచే చెప్పించి, బలవంతంచేసి జాగీరులో కొలువులో చేర్పించారు. ఒకరోజున దాసు గుర్రమెక్కి కొలువుకు పోతూవుంటే రోడ్డుమీద గచ్చకాయ (గొట్టికాయ) లాడే కుర్రవాళ్ళు గుర్రం కాళ్ళవద్ద రోడ్డంతా గుంటలుపడి తమ ఆట చెడినదని పెద్దదాసుని నోటికి వచ్చినట్లెల్ల తిట్టి కొట్టబోయారు. గొల్ల రంగడనేవా డిదిచూచి, పట్టెనామములను బట్టి పెద్దదాసుని గుర్తించి, పిల్లలనందరినీ అదలించి తరిమేశాడు. ఈ సంఘటనతో పెద్దదాసు మరింత విరక్తుడయినాడు. తనగుర్రాన్నీ, గొడుగునీ, వస్త్రాభరణాల్నీ గొల్ల రంగడికిచ్చాడు. ఇహబంధాలన్నీ వదలుకొని నరసింహుని కోవెలలో నిలిచిపోయాడు.

పెద్దదాసు భక్తిప్రభావాన్నివిని తంజావూరి రాజయిన మన్నారునాయడు (విజయ రాఘవ నాయకుడు) పిలిపించి తన తండ్రివంశావళినీ రాజ్యమునూ తగ వర్ణింపుమనీ, తనపై పాటలు పాడుమనీ కోరాడు. ఆమాటలను విని పెద్దదాసు వ్యసనముజెంది "నారసింహుని పాడిననోటను నూరసింహమును బాడన్ సారము గాదని నరగునబల్కెను సాధుబృందములు వినగన్'' సెబాస్ పెద్దదాసా సెబాస్

అని భక్తవరులచే ననిపించుకొనేలా ఉన్నదీ సమాధానము. పెద్దదాసు పోతనతో తులతూగేలా పలికాడీమాటలు. ఒకవిధంగాచూస్తే పోతనకంటె ఒకపిసరు హెచ్చే యేమో. పోతన ప్రసక్తానుప్రసక్తంగా ఉమ్మడిగా " ఇమ్మనుజేశ్వరాధములకు " అన్నాడేగాని పెద్దదాసులాగ ముఖాముఖీగా ఏ మకుటాధిపతినీ ఉద్దేసించి అనలేదు ఇంతేకాదు పెద్దదాసు మరోఅడుగు ముందుకివేశాడు. తిరుమణి దాల్చిన పంచమ దాసులనయినా కీర్తించతగునని కలిపాడు. అప్పుడు సభవారొక గాడిదకు పట్టె నామములు తీర్చిదిద్ది పెద్దదాసును దానికి దండమిడుమని చెప్పారు. పెద్దదాసు దండం పెట్టాడు. వెంటనే సభవారూ రాజూ అతనిని అపహసించారు. ఏమి గాడిదకు దండం పెట్టావన్నారు. పెద్దదాసు రాజుతో ఇలాగన్నాడు. " ఈ గాడిద తిరుమణిదాల్చిన నీవంటిదే. నీకెట్లు దండమిడితినో అట్లే దీనికీ దండమిడితిని అని రాజుని మరింత ఆగ్రహావేశపూరితుని జేశాడు. రాజు వెంటనే దాసుని బల్లెములతో పొడువుడనీ, కత్తులతో నరుకుడనీ ఆజ్ఞాపించాడు. పెద్దదాసు హరి నామ సంకీర్తనచేస్తూ వాటినన్నింటినీ నిగ్రహించాడు. పులిబోనులోవేసినా, కొల నులో దొర్లించినా, విషమిడినా, అగ్నిలో త్రోసినా దాసు చెక్కుచెదరలేదు. చివరకు ఆతనిని కొరతను వేయవలసిందని మన్నారునాయు డాజ్ఞాపించాడు. దాసు కొరతమానుకేసి చూడగానే అది భస్మమైంది. "ఇదిగోవేళ వేణుగోపాలా నామది గర్వమెంచక మన్నించి రక్షింపు మదన తంజపురి సదనగోపాలా'' యని కీర్తిం చగా పురుషోత్తముడు మెచ్చి మన్నారునాయని కడకేగి " దాసుని మిక్కిలి దండిస్తివి రాధగిడికీ'' యని తిట్టి, బురాన్‌పురి కొరడాల్ తీసుక తిరిగికొట్టాడు. అబాధకు తాళలేక నాయడు వేగమే చారులనుబంపి సాధుని రప్పించి తప్పుల క్షమింవుమని ప్రార్థించి వీడ్కొలిపెను, పెద్దదాసు భగవత్సాక్షాత్కారం కలిగి నందుకు రాజునభినందించి భక్తులతో వైకుంఠాధిపుని పాడుతూ కోట అంగడి వీధులవరకు చేరాడు. అక్కడినుంచి శ్రీరంగనాధుడొక ముదుసలి బ్రాహ్మణుని రూపంలో ఉపచారాలుచేస్తూ పెద్దదాసుని శ్రీరంగం తోడ్కొనిపోయాడు. చిన్న నాటనుండి కొలుచుచుండిన విష్ణువే కన్నడసేయక తోడ్కొని వచ్చెనని సంతోషా తిశయంతో శ్రీరంగేశుని పాదపద్మములపై చూడ్కులునిలిపి, సకలేంద్రియము లను మరచి పెద్దదాసు రంగనిలో ఐక్యమైపోయాడు.

పెద్దదాసు రచించిన కీర్తనలు రామదాసు కీర్తనలన్నిలేవు. కాని, అవిభక్తి తన్మయాత్వాన్ని కలిగించేవిగా ఉన్నాయి. ఇతని కధలో చరిత్రాంశమేపాటిఉంది అని చరిత్రశోధకులు పరిశీలన చేయవలసిఉంది.

జానపద గేయ వాఙ్మయంలో గుత్తినదీవి రామాయణ కీర్తనల సంగతిని స్పృశించకుండా వదలడం న్యాయంకాదు, వాటిని మాచవోలు రాఘవయ్య అనేకవి రాశాడు. ఆ కవి రామాయణ షట్కాండల్నీ కీర్తనలరూపంలో రచించాడు. కథలో వర్ణనలను పెంచకుండా సూటిగా సరళమైన శైలిలో చెప్పాడు. ఇది అధ్యాత్మ రామాయణానికి సాటిఅనిపిస్తుంది కాని ఇందులో అధ్యాత్మ రామాయణ కీర్తనల్లోని జిగి కన్పించదు. విరహతప్తుడై మాల్యవంతంమీద కాలం గడుపు తూన్న రాముడు "మగువల గూడియుండు మగవారిదే భాగ్యము" అన్నప్పుడు కాళిదాసకవి రచించిన కంఠాశ్లేష ప్రణయినీ జన సాంగత్య భాగ్యంఅన్న వాక్య చ్ఛాయలూ చెరబడిన సీత హనుమంతునితో "వేగనిటువచ్చి చెరబడియుంటి ఆప కీర్తి పెనిమిటిదంటి యొకరి యతివ యొకరింటనుంట తగదంటి మనసందు దయ యుంచుమనుము తన మగ పంతమెన్నటికనుమి" అన్నమాటల్లో భావసారళ్యమూ తెనుగు నుడి సొంపులూ కన్పిస్తాయి. కీర్తనలన్నీ గుత్తెనదీవిలో వెలసిన హనుమం తునిపరంగా చెప్పబడి వుండటం మరో ప్రత్యేకత.

వృషభగతి రగడఅనే దేశీయ ఛందంలో శ్రీరామ నామ మహాత్మ్యముఅనే గేయం ఒకటి రచింపబడింది. దాన్ని పంచపానక వెంకటార్యుని శిష్యుడైన చెంచు రామకవీంద్రుడు రచించాడు. యోగశాస్త్ర విషయాల్ని జానపదులకోసం కీర్తనల్లోనూ తత్వాల్లోనూ వివరించిన తత్వవేత్తల రచనలను ఇది కొంతవరకు పోలిఉంది. వాటిలోని మర్మకవిత్వం ఇందులోనూ అక్కడక్కడ కన్పిస్తుంది. మచ్చుకోసం కొన్ని చరణాలను ఉదహరిస్తాను.

అమర ద్వాదశ పత్రికమలము నంటియున్నది రామనామం
సమరసముగా పదియు రెండక్షరములాయెను రామనామం
చింది చలనము లేనివారల బొందియున్నది రామనామం
బిందుమండల మధ్యగతమగు నిందురూపము రామనామం
ఏడు ప్రాకారములకావల నెసగుచున్నది రామనామం
ఏడుశక్తుల గెలిచినను దనతోడబల్కును రామనామం
మూడునదులను దాటువారికి మోక్షలక్ష్మియు రామనామం

అద్వైత రాజయోగాలతో ఈ రచయిత సగుణోపాసననికూడా రామనామ స్మరణ రూపంలో జోడించి భక్తిజ్ఞాన యోగాసక్తులకు ముక్తిపథాన్ని సమ

హార్యాడు.

ఆధునికయుగంలో విజయనగరం సాహిత్య సంగీతాలకి పట్టుగొమ్మ అయింది. విద్యానగరం విజయనగరానికి పర్యాయ పదమైంది. ఆటపాటల మేటి నారాయణదాసూ, పేదేలు నాయుడుగారూ నృత్యగీతావాయిద్యాల్లో కర్ణాటక సంగీతములో నేటి ఆంధ్రులకొక విశిష్ట స్థానం కలదని రుజువుచేశారు విశాఖ, శ్రీకాకుళం మండలాలు ఎందరో జానపద గేయ పదకర్తలకు పుట్టినిల్లు. అలాంటి మండలంలో సంగీత సాహిత్యాలు కేవలం ఐహిక సాధనకే వినియోగమయాయనే మాట పుట్టకుండా జనక రాజర్షిసభలో వేదాంతగోష్ఠికి పేరందిన ఋషులనూ, గార్గి మొదలైన వేదాంతినులనూ తలపించే విరాగులూ, వేదాంతులూ, భక్తులూ ఎందరో జన్మించారు. వారందరూ తమతమ భక్తి పారవశ్యాన్ననుసరించి భక్తి జ్ఞాన వైరాగ్యామృతాలను చిందిస్తూ రచనలను కావించారు, కీర్తనలను కీర్తించారు. వారందరి రచనలనూ పేరుపేరు వరుసలా వివరించడం స్థలాభావంవల్ల సాధ్యం కాలేదు, ఆ రచనలన్నింటిలోనూ ఒక ప్రత్యేకతగల రచనను మాత్రం స్థాలీ పులాకన్యాయంగా పరిచయం చేయదలచుకొన్నాను.

సాహిత్య పరమావధి కేవలం రసప్రకర్షమాత్రమే కాదనీ, అక్షరమార్గాన్ననుసరించి అక్షర యోగసాధన చేయాలని మంత్రద్రష్టలైన ఋషుల ఆదర్శమైనట్లు కన్పిస్తుంది. ఈ అభిప్రాయమే నానృషిః కురుతే కావ్యమ్ అన్న నానుడిలోనూ, చింతామణి మంత్ర చింతనఫలంచే నైషధమన్న నమ్మకంవల్లా, ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, ఆధ్యాత్మవిదులు వేదాంతమనియు...... అనేలా భారతేతిహాసాన్ని వివిధవేద తత్వవేదీ ఆదిమునీయైన పారాశర్యుడు రచించాడని నన్నయ్య చేసిన భారత హృదయావిష్కరణ పూర్వకమైన వ్యాఖ్యానంలోనూ ద్యోతకమవుతోంది. మంత్రద్రష్టలే ఋషులు. ఋషులే కవిపదయోగ్యులు. లోకకల్యాణ కరములూ ధర్మసమ్మతములూనైన వారి రచనలే కావ్యములు అన్నదే ఆర్ష సాహిత్య సంప్రదాయము.

ఆర్ష సాహిత్య సంప్రదాయానుసారులయిన కవీంద్రులందరూ మంత్రోపాసకులై సిద్ధినందియో తమతమ యిష్టదైవముల నారాధించి తత్ప్రసాదలబ్ధివలననో కవితాపటిమగలవారై తమవాగమృతమును దూరలిచ్చినవారే బ్రాహ్మీదత్త వర ప్రసాదుడననీ, వాణి నారాణియనీ, పలికించెడివాడు రామభద్రుండనీ సగర్వముగా

పట్టు గలిగిన తెలుగు కవీంద్రులట్టి వారే ఇక ఆధునిక కాలమున కూడ. అంబికా ప్రసాదలబ్ధ కవితామహిమోపేతుడనని చెప్పుకొన్న మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నము పంతులుగారూ, అభినవాంధ్రకవితా పితామహులని పేరందిన బొబ్బిలి సంస్థానాస్థాన విద్వత్కవులయిన మండపాక పార్వతీశ్వరకవి గారూ, వారిసోదరులై విరిసెజ్జ, పాలవెల్లి మొదలయిన కావ్యముల రూపమున తెలుగునాట కవితామృతమును వెల్లివిరియించిన పార్వతీశ్వర శాస్త్రిగారూ అర్ష కవులకోవకు చెందినవారే - వీరు మువ్వురునూ విద్వత్కవులు. అందుచే వీరి రచనలు పరిశీలించుట మన ప్రస్తుత లక్ష్యముకాదు. కాని ఈ మండపాక సోదర కవులయొక్కా వారి పూర్వులయొక్కా మంత్రసిద్ధి పటిమనూ, భక్తిభరితాంతఃకరణమునూ పుణికిపుచ్చుకొన్నదై కాబోలు మండపాకవారి యాడుపడుచైన శ్రీమతి తాతా అన్నపూర్ణాంబ శ్రీ రాజరాజేశ్వరీదేవి భజన కీర్తనలను గానంచేసింది. ఆ కీర్తనలు పాండితీ మహత్త్వముచేగాక భక్తిభావముచే శోభించినవి, భావ సమాధి తన్మయత్వమును స్ఫురింపజేయుటయే వాని లక్ష్యములు-

శ్రీమతి అన్నపూర్ణాంబ ఆధునిక గాన సాంప్రదాయములనూ అభిరుచులను గుర్తించినది. అందుచేతనే బహుజనాదర పాత్రములైన కొన్ని సినీమా పాటల వరుసలనుకూడ గ్రహించి భక్తిజ్ఞాన వైరాగ్య ప్రబోధానికుపయోగించింది. ఇదే ఈమె లోకజ్ఞతనీ కాలానుగుణంగా కాంతాసమ్మిత రీతి ననుసరించి భక్తి భావ ప్రబోధం చెయ్యాలనే ఉద్దేశాన్నీ శుష్కవేదాంత బోధనను కూడా హృదయాకర్షక మగు నట్లొనర్చు చాకచక్యమునూ వెల్లడిచేస్తున్నాయి - ఉదాహరణకు ఈ పాటలు చూడండి--

(సోజారాజ కుమారీ వలె)

ప॥ బ్రోవరావిక ఏ....లా....బాలా బ్రోవకుంటివదేలా.... మేలా ॥బ్రో॥

చ॥ రోజాపూలు కోసిదెచ్చి సొగసుగ శృంగారంబునుచేసి

సేవలుచేయగ.... నేతలచితినే.... రమ్మిరమ్మిక

ఓర్వగలేనే.... వేరే యోచనలేటికే బాల ॥బ్రో॥

(టక్కుటిక్కు వలె)

(1) లక్ష్యాలక్ష్యస్వరూపిణీ లక్ష్మీదేవి లలితదేవి
అక్షయవరమియ్యవే అంజలిచ్చి వేడెదా
మహాగౌరీస్వరూప బ్రహ్మాండగర్భిణీ
మాతృస్వరూపిణీ మమ్ముబ్రోవరాగదే ॥ల॥

(2) పార్వతిపావనీ పాపవిమోచనీ
పాలించవేలనే భక్తశరణ్యవు॥ ॥ల॥
కైవల్యజననివే కన్నతల్లివిగా
కటాక్షముంచవే శ్రీరాజేశ్వరివే ॥ల॥

ఇవేకాదు. తుమ్మెదాఅనే పాటలోనూ, లాలిపాటలోనూ ఈమె జానపదగేయ ఫణితులను గ్రహించి తనకు తెనుగు నుడికారముమీదా జాతీయ ఫణితులమీదాగల ప్రీతిని వెల్లడించింది.

తెలుగుదేశాన్ని అన్నిమతాలూ వాదాలూ తరంగాలుగా ముంచెత్తినా మన జానపదుల మనస్సులను ఆకర్షించిందీ, వ్యాప్తమైందీ వేమనయోగి, వీరబ్రహ్మమూ, సిద్దప్పా మొదలయినవారు వ్యాప్తమొనర్చిన అద్వైత రాజయోగమే అనాలి. వేమనయోగి పద్యాలూ, ఇతర రాజయోగులు పాడిన తత్వాలూ రాజయోగామృతాన్ని తెలుగువారికి చూరలిచ్చాయి. తెలిసినా తెలియకపోయినా సత్తు, చిత్తు, బ్రహ్మానందంఅంటూ కబుర్లు చెప్పేవారిదగ్గర మహత్తుంటుందని ఆశ్రయించేవారూ, తత్వాలుపాడి పొట్టబోసుకొనేవారూ తెలుగుదేశంలో తయారయారు. ఈ తత్వాలు, తెలుగు వాఙ్మయంలో మర్మ కవిత్వమనే శాఖకు కారణమయాయి. కాలజ్ఞాన తత్వాలూ ఆత్మబోధామృతం అనేపేర్లతో ప్రకటితమై వీరబ్రహ్మం. దూదేకులసిద్ధయ. యాగంటి లక్ష్మప్పగార్ల రచనలూ సుజ్ఞానచంద్రిక అనేపేరుతో యడ్ల రామదాసు రచనలూ లభిస్తున్నాయి "బ్రహ్మంఎదో తెలుపరయ్యా బ్రాహ్మలు మీరయితే" అనేతత్వంలో బ్రహ్మజ్ఞానం కలవాడే బ్రాహ్మణుడని తరిగొండ భ్రమరాంబా, "ఈజన్మమిక దుర్లభమురా॥ ఓరి సాజన్మ సాకార సద్గురుని గనరా" అన్న తత్వంలో యోగసాధనా విధానాన్ని పోతులూరీ చక్కగా వివరించారు.

"చిల్లరరాళ్ళకు మ్రొక్కుచునుంటే చిత్తము చెడునుర వారేవారే'' అని నిగ్రహారాధననీ, "కాశికి పోవలెనా తీర్థము మోసుకరావలెనా''అని తీర్థయాత్రల్నీ, "కులమెంచగనేల గుణమె కారణము'' అని కులతత్వాల్నీ చదివితే యోగ సాధనలో సిద్ధిపొంది తాము చూసినవాటినీ అనుభవసిద్ధములయిన సత్యాల్నీ వర్ణించారనిపిస్తుంది. ఐతే, మనకి సందేహం కలిగినచోట్ల అర్థం సందేహాస్పదంగానే ఉండిపోతుంది. శిష్యుడికి ఎక్కడ సందేహమో, గురువుకి అక్కడే నట్టుఅన్న సామెత ఈ తత్వాల్నీ, కీర్తనల్నీ యోగసాధకులు కాని వారుచేసే వివరణలపట్ల సార్ధకమవుతుంది.

గూటిచిలుకేదిరా ? చిన్నన్న గూడు చినబోయెరా
మేలుకొనవే రాజహంసా మేలుకొనవే ఓ చైతన్యమా
మేలుకొనవో కనులుతెరచీ మేలుకోగదవే జీవా

అనే మేలుకొలుపులోనూ గర్భితమైన మర్మం స్ఫురణకు దాటిందికాదు. కాని, క్రిమక్రిమంగా ఈ తత్వాల్లోకికూడా అయోమయత్వం ప్రివేసించింది. అలాంటి అయోమయ రచనల కుదాహరణముగా కాలజ్ఞాన తత్వాల్లోంచి మళ్లూరి వీరరాఘవదయానిధే అనే మకుటంతోఉన్న రచనలను ఉమాకాంత విద్యాశేఖరు లుదహరించారు. మచ్చుగా కొన్ని పాదాలు.

మొనలుమీదుగ తలలుకిందుగ మొలచియున్నది వృక్షమూ
మోదమలరగ మింటమీదను మదగజము విహరించెరా
చిదిమివట్టిన బంటుకైవడి చీమ యేనుగు మ్రింగెరా
విర్రివీగుచు కేకవేయుచు యీగ మంచము మ్రింగెరా
గొర్రెయొక్కటి అయిదు పులులనుగొట్టి నెత్తురు ద్రాగెరా
చిర్రిచెట్టున జాజిపూవులు శ్రీకరంబుగ పూచెరా
మర్రిపై కదళీఫలంబులు........................

ఇలాంటి రచనలవల్ల ఉద్దేశించినంత ప్రయోజనం కలగదన్నది నిజం. వీటిని రాసినవారే వీని బావాన్నికూడా రాసిఇయ్యాలి. అది తాను తమ్మి తేనే ఛిరం జీవ అనుకోనేలాగుంటుంది.

" హరిహరులకు భేదమరయు పాతకుడు దురితపుంజములచే గుందురా '' అని భావించి హరహర భక్తి ప్రతిపాదకముల్లైన కీర్తనల రచించినవారలలో

పరబ్రహ్మకవి ఒకడు. అతనిమాటలు మోక్షపు బాటలుఅని చెప్పుకొన్నాడు. ఆతని రచనల్లో ఆత్మకథాస్ఫోరకమైన కీర్తన ఒకటుంది. బ్యాండుస్వరంలో ఏకతాళంలో పాడేటందుకు వీలయిన ఆకీర్తన పరబ్రహ్మదాసుని వైరాగ్యంవైపు మరల్చిన చిన్న సంఘటనల్ని తెలుపుతుంది—

మేజస్ట్రీటాఫీసులో కొలువుసేయగ మెతుకులు కరవాయె కొన్నాళ్ళు
లేజీఫెలో యింతలేటా వచ్చితివని ఫాజీమాటలు పడితి కొన్నాళ్ళు ॥మే॥

అందముగా లోకల్ ఫండుమీటింగుచేసి యచటికి పిలిచిరి కొన్నాళ్ళు
చందాలజాబితా చేతికిచ్చినాజలుబు నీరోడ్చిరి కొన్నాళ్ళు ॥మే॥

కూడులేకను కోట్లుబూడ్సుతొడిగి కులధర్మముమానీ కొన్నాళ్ళు
వేడుకకత్తెల యిండ్లకుతిరుగుచు వెర్రినయియుంటిని కొన్నాళ్ళు ॥మే॥

హూకెన్ కోప్ పిల్ మై యెబిలిటీస్అని యుబ్బుచుతిరిగితి కొన్నాళ్ళు
వేక్ ఫీల్డ్ వ్రాసిన డిస్మిస్ లెటర్ చూచి వెతలపాలైతిని కొన్నాళ్ళు ॥మే॥

కల్మషబుద్ధినై గర్వించిపెద్దల జంటగాననైతి కొన్నాళ్ళు
అంటీగాడ్ నేనపరాధినైతి నన్నాదరింపుమంటి కొన్నాళ్ళు ॥మే॥

పొట్టకూటి విద్యలెన్నెన్నో నేర్చుచునట్టిటు తిరిగితి కొన్నాళ్ళు
పట్టుగా పరబ్రహ్మభక్తుడు తెలిపిన భావమెరుగనైతి కొన్నాళ్ళు ॥మే॥

అన్న కీర్తన ఇంగ్లీషు తెలుగుల కలగలుపై చమత్కారంగావుంది. తక్కిన కీర్తన లన్నింటియందూ అనాదిసిద్ధంగా వ్యాప్తమైయున్న భావాల్ని "పాటలెందుకు భక్తిలేని యాటాపాట", "గురురాయమాంపాలయ కరుణాసముద్ర రావె'' అనీ "చెడిపోకె యో జీవమా'' అన్న కీర్తనల్లో వ్యక్తం చేయబడ్డాయి.

ముదికొండ శంకరుడనే ఆయన దక్షిణ కైలాసవాసియైన కాళహస్తీశ్వరుని భక్తుడు. శివభక్తి స్ఫోరకమైన కొన్ని కీర్తనలను రచించాడు. " నందివాహనా శంభో నాగభూషణా" అనేకీర్తనలోనూ "మరువము శివనామమంత్ర జపంబును" అన్నకీర్తనలోనూ రామదాసు భక్తిపారవశ్యాన్ని అందుకొన్నాడు. " చూడకూడ దెన్నటికిని శూలి భక్తినిరతులు మూడుకన్నుల దేవుని మొక్కనట్టివారిని" అనీ, "శివభక్తి లేనివాని చింతామానగలదా'' అనీ శివభక్తియే ఏకైక తరుణోపాయం అని ప్రతిపాదించాడు.

శక్తిప్రధానమైన రచనలనుగురించి మరోమాట చెప్పవలసిఉంది. మనవారిలో కొందరు పొద్దుచూసిగాని భుజించమనే వ్రతం పట్టడంకద్దు. ఆ ఆచారము, "శ్రీసూర్యనారాయణా వేద పారయణా" అనే సూర్యనారాయణ దండకమూ రథసప్తమినాటి కార్యకలాపమూ సూర్యోపాసన ప్రధానమైన నాటి చిన్నెలుగా ఇంకా పట్టుకొని ఉన్నాయి. స్త్రీలపాటల్లో సూర్యుడి గుర్రాలు అనేపాటకూడా సూర్యోపాసనయొక్క ప్రాముఖ్యాన్ని మనవారంగీకరించునట్లు ఋజువుచేసే చిహ్నంగా మిగిలినదే. కవిత్వదృష్టిలో ఆపాటలో ఏమీ స్వారస్యం కన్పించదు. ఆ రచన ఛందోబద్ధమైనదనికూడా అనలేము. కాని, విరుపులతో దాన్ని పాటలా పాడడం కద్దు. మచ్చుకోసం నాలుగుముక్కలు—

బాలభాస్కరా మిము గొలుతు
స్వామీ మీరు విప్పిపొడిచేటప్పు డెర్రగా
ఉదయపర్వతం ఎర్రనా
ఓ ప్రభుడా, మీ చాయలెర్రనా
ఎర్రగూళ్ళల్లో ఎర్రగొడుగులు
ఎర్రమారుతం విసరగా దెలియగా........

వేదాంత ప్రతిపాదకమైన కాకాని నరసాంబ రచించిన పాటఒకటి పేర్కొన తగింది. పుత్రశోకాతురుడైన పార్థునికి కృష్ణుడు ఈజీవితంయొక్క అనశ్వరత్వాన్నీ ఋణానుబంధములవల్ల సతీసుతాది బంధుత్వాలు కలుగుతాయనీ, ఉదాహరణ పూర్వకంగా సులభశైలిని వివరంగా వ్రాయబడింది, ఎంతచెప్పినా అర్జునుడు పుత్రమోహం వదలలేకుండాఉంటే కృష్ణుడు గరుడ గంధర్వ యక్ష కిన్నరాదులు పొగడేలా అభిమన్యుని దగ్గరకు పార్థుని తీసికెళ్ళాడట. పార్థుడు వెంటనే "అయ్యారి" అని కౌగిట చేర్చుకోబోయాడు. కాని అభిమన్యుని జీవాత్మ అర్జునుడితో "నెయ్యమేటికి ఇపుడు నాతో అయ్యలెందరైరో నాకు అకటనను ముట్టవలదనె"నట. అంతటితో పార్థుడికి కనువిప్పై పుత్రమోహము గడవనీదాడు. ఈ సన్నివేశం మరే రచనలోగాని పురాణాలలోగాని లేదు. కాని ఇది అత్యంత స్వాభావికమైంది. ఇదే రచయిత ఉపజ్ఞకి నిదర్శనంగాఉంది. రచనలోని సరళశైలికి ఉదాహరణప్రాయంగా ఈ చరణాన్ని చదువండి.

పార్థుడా ఇటువినూ పరమ రహస్యము నీకు సూటిగా వివరించెదా, ఏటికి

యీ భ్రమలూ ఎల్లాకోటి జీవా మాటిమాటికిజూడ మాయమౌ తెరుగవా ! పాటి గాదిది ధర్మపద్ధతి, ఏటికెరుగవు బుధులవాక్యము బూటకంబని తనువుకల్లని పుట్టుటలు ఇక సున్నసున్నని ॥పార్థు॥

భక్తి వేదాంతాలకి పేరందిన మనదేశంలో ఆ రసాన్ని ప్రతిధ్వనించే రచనలు అసంఖ్యాకంగా ఉండడం సహజం. ఆలాంటివాటిల్లో లభించినవాటిని మాత్రమే పరిశీలించడం సాధ్యమైంది. మనభాషలో కీర్తనలకి ఉచితమైన ప్రాముఖ్యం ముమ్ముందు లభిస్తుందనీ అరవములో అరుణాచల కవిరాయర్ మొదలైనవారి కీర్తనలకు కలిగిన గౌరవము, మనభాషలోని అధ్యాత్మ రామాయణ కీర్తనలు మొదలైనవాటికి కలిగినవాడే మనం ఉచితజ్ఞులనిపించుకొంటాము.

## 9 స్త్రీల పాటలూ, బాల బాలికల గేయాలు.

స్త్రీల పాటలూ, బాలబాలికల ఆటల పాటలూ జానపద వాఙ్మయంలో చేర్చడం సబబేనాఅని కొందరు సందేహించవచ్చు. వాటికి ప్రత్యేకమైన స్థానం ఇయ్యాలని అనవచ్చు. కాని, విద్వత్కవులుకానివారు సహజ కవితాధారతో, భావోద్వేగంతో కావించిన రచనలను పరిశీలించ పూనుకొనిన సందర్భంలో స్త్రీల పాటల్నీ బాల బాలికల గేయాల్నీ స్థాలీపులాక న్యాయంగానైనా పరిశీలించడం ఉచితం.

స్త్రీలపాటల్ని వాటిలోని విషయాన్నిబట్టి (I) రామాయణ కథాత్మకములనీ (II) భారత కథాత్మకములనీ, (III) భాగవత కథాత్మకములనీ, (IV) ప్రాసంగికములనీ విభజించవచ్చును.

### (I) రామాయణ కథాత్మక పదములు.

తెలుగు దైవము భద్రాద్రి రామయ్యఅని కీర్తించబడిన తెలుగుదేశంలో రామాయణ కథాత్మక రచనల బాహుళ్యాన్నిగురించి ఎవరూ ఆశ్చర్యపడవలసిన పనిలేదు. సీతాదేవి స్నానమాడిన తీర్థాలూ, రాముడు మాయలేడిని వేసినచోటు (కోరంగి), పంచవటి మొదలైనవాటితో పవిత్రమైన తెలుగుదేశంలో రామాయణ కథ అణువణువునా వ్యాపించిఉన్నా ఉండతగిందే. నిర్వచనోత్తర రామాయణంలో తిక్కనా, కంకంటి పాపరాజూ, హుళక్కి భాస్కరాదులు రామాయణంలోనూ

విద్వత్కవులతరపున రామాయణ కథామృతం పంచిపెట్టారు, అంతతో తనివితీరక "రాఘవేశ్వరు చారిత్రము నెందరెన్ని గతులన్ వర్ణించినన్ గ్రాలదే" అని కొందరూ, జానపదులకు సుబోధంగా ఉండాలని కొందరూ రంగనాథ రామాయణాన్ని అనేకులు పదరూపంగాపాడీ, రామాయణ గాథల్ని కథారూపంగా రచించీ, తెలుగుదేశంలో రామనామామృతాన్ని పేరు వారని తేడాలేకుండా అందరికీ అందించారు. లాడె సుందరనారాయణ రచించిన రామకథా సుధార్ణవమూ, మదిశాప గోపాలుడు రచించిన సుందరాకాండపదమూ, నివూరి రామచండ్రాజు రచించిన కుశలాయకమూ, అజ్ఞాత కవులు రచించిన మరో కుశలాయకమూ, కుశలవ కుచ్చల చరిత్రి, లంకాయాగమూ, పొడుగు రామబ్రహ్మకవి ద్విపదసరణిలో రచించిన శ్రీ పైకుంఠమహాత్మ్యం, అడవి గోవిందనామములు, శాంత గోవింద నామములు, శ్రీరామ దండకములు మొదలయిన పేర్లతో రామాయణ సంగ్రహమూ వ్యాప్తంలో ఉన్నాయి. రామాయణంలోని కథాభాగాలు తీసుకొని రచించిన రచనల్లో సీతాకళ్యాణం, సీత సమర్త, సీతాఅమ్మవారి అలక, సీతాదేవి ఆనవాలు, శ్రీరాములవారి అలక, ఊర్మిళాదేవి నిద్ర, సీత అగ్నిప్రవేశమూ, లక్ష్మణమూర్ఛ, లక్ష్మణదేవర నవ్వు, గుహభరతుల అగ్నిప్రవేశమూ, సీతాదేవి వేవిళ్ళు, పెండ్లి గోవిందనామాలు,మంధా సుబ్బారాయని పొత్రాళహోమమూ,వామనగుంటలాడుపాట, సీత ఘడియ అనేవి ప్రచారంలో ఉన్నాయి. రావణ సంహారంతో రాముని త్రేతాయుగ వీరుడుగా చిత్రించడంతో జానపద కవులకు తృప్తికలిగినట్లు కన్పించదు. దీనికి ప్రోద్బలంగా శతకంఠ, సహస్రకంఠ రావణులూ, వారిని రాముడు జయించడమూ కథలుగా వెలిశాయి. పసగాడ సన్యాసి శతకంఠ రామాయణాన్ని రచించాడు. ఇలా ప్రకటితమై ప్రచారంలోఉన్న రామాయణ కథా సంపత్తికితోడు మరెన్నో మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో వ్రాతప్రతులరూపంలో నశించిపోక నిలిచి ఎవరయినాచూచి ఆదరిస్తారాఅని ఎదురుచూస్తున్నాయి. వాటిని ఉద్ధరించి ప్రజాసామాన్యాని కందించవలసిన గురుతర బాధ్యత జానపద వాఙ్మయ ప్రియులపైనుంది ఈ పాటల్లో చాలమటుకి విరివిగా ప్రచారంలో నున్నాయి. వాటి మాధుర్యానికి, వాటిలోని వర్ణనల ఆత్మీయతకీ అదే రుజువు. వాటిలోనుంచి రసవంతమైన ఘట్టాల్ని కుప్పతిప్పలుగాఎత్తి ఉదహరించవచ్చు, కాని గ్రంథ విస్తర భీతితో ఆపని చేయదలచుకోలేదు.

సాంసారికములయిన ఘట్టాలు వచ్చినప్పుడు కవి కథ పౌరాణిక నాయకులకు సంబంధించినదన్న విషయం మంచిపోతాడు. చూడండి రాములవారి అలకలో

అతివలందరూ శ్రీరాముణ్ని ఎలా హాస్యమాడారో చూడండి.

గుర్రములేదని యేలలిగినావూ గుడ్డికుక్కానెక్కి లేచిరావయ్యా
పల్లకిలేదని యేలలిగినావూ పందిపిల్లానెక్కి లేచిరావయ్యా
..........పత్తిగింజల కుడితి పాచియున్నాది పాచినోరు పెండ్లి
కొడుక లేచిరావయ్యా

పురాణ నాయికలలోకూడా ఎరుకతన్నీ, వదినె మరదళ్ళ సరసాలనీ, అత్తా కోడళ్ళ అనురాగాలనీ, సమర్తబంతులనీ, చిమ్మిలి తొక్కడాలనీ, జానపదకవి వర్ణిస్తాడు. అక్షర రమ్యతకంటె చమత్కారానికీ, ఆప్యాయతకీ ఈ రచనలు లక్ష్యాలు. వీటిని చదివి, పాడి విని, ఆనందించవలసిందే.

సీత ఘడియ ఆనేది మరో చక్కనిపాట. అత్తమామల కుపచారాలుచేస్తూ సీత శయ్యాగారానికి చేరడంలో జాలంచేసింది. అవనిజ మైమరచిఉందని భావించి తల పంకించి రామచంద్రుడు గడియ వేసుకొని తల్పంపై శయనిస్తాడు. కొత్త కోడలైన సీత—

మామ దశరధులకు మడతలందిచ్చి
సుమిత్ర కైకలకు సురటీలువేసి
పరగ కౌసల్యకూ పాన్పులబరచి
మజ్జనంబులుజేసి పసుపులుపూసి

కాని అలంకరించుకొని శయ్యాగారానికి వస్తుంది. అప్పుడు ఆమెకీ, శ్రీరాముడికీ రసవంతమైన సంవాదం నడుస్తుంది—

పుడమిలో నరులకు తలవొగ్గకుండా
పరశురాముని భంగపరచిరే మున్ను
నన్నుయేలేస్వామి కాకుత్స్థతనయా
పలుపేయ కోపమా తాళగాగలనా
నిలుచుండ పాదాలు చేతులూనొచ్చె
దంతంపు తలుపులూ తియ్యవోయి నాధా
వొంటొంటి చినుకుకే ఒకచెంగుదడిసె
కాముడా తియ్యవోయి కనకంపు గడియ

పటపటా చినుకుపడి పైకొంగుతడిసె
పచ్చలా బాలుడా తియ్యవోయి గడియ
నాలుగో ఝామాయె నా ప్రాణనాధా
రత్నహారంబిస్తు తియ్యవోయి గడియ
కరుణించి దీస్తివా కాళ్ళకడనయినా
మరచి వకనిద్రైన శరణందిపోదు

ఇలా బతిమాలిన సీతతో—

నిద్ర సీకులేకుంటె నాకేమిసీత
గంటవలె దీపమ్ము అదినాకుతోడు
సీవు నిల్చుంటేను నాకేమిసీత
పువ్వుబుక్కాయలు అదినాకుతోడు
సీవు నిల్చుంటేను నాకేమిసీత
గంధమ్ము కస్తూరి అదినాకుతోడు
పట్టిమంచం పరుపు అదినాకుతోడు

అని రాముడు తన ఉక్రోషం వెలిబుచ్చాడు. ఈ రీతిగా చెప్పగానే సీత కోపించి, అలకించి, అత్తవాయలకేగి, అత్త కౌసల్యతో అన్నీ చెప్పింది. వెంటనే తల్లి కౌసల్య రాముడిదగ్గరకొచ్చి

దశరధుని పుత్రుడవు జనకులల్లుడవు
భూమి దేవల్లుడవు బుద్ధటర సీకు
సీత జేసిన తప్పు శీఘ్రాన జెప్పు
నాకు యెరిగించరా నను గన్నతండ్రి.

అని నిగ్గతీస్తుంది. సీతపట్ల తప్పు ఉంటేను రాముడు చెప్పేటందుకు; అందుచేత

అమ్మ సీ కోడల్ని అతిగారవమునా
నలినాక్షి పెంచితే నన్ను గైకొనునా ?

అనిఅంటూ తలుపుతీశాడు. సీత నెంటనే అత్తగారితో మా మామ దశరధు లొక్కరూ ఉన్నారు వెళ్ళండి అంటుంది. కౌసల్య సీతారాముల కలహం ప్రణయకలహమే

నని గ్రహించి నవ్వుకొంటూ వెళ్ళిపోతుంది. పౌరాణిక నాయికా నాయకుల్ని కూడా మనకు సన్నిహితుల్ని జేసినారు చెక్కడపు బొమ్మలలాంటివారూ కేవల నియమబద్ధజీవనులూ అని అనిపించకుండా వారి హృదయ స్పందనాల్ని పదకర్తలు మనకు వివరించారు. క్షేత్రకృష్ణుడంతో వారిని చూసేటందుకు అవకాశం కలిగిస్తుంది. వారు కూడా నిజంగా ఇలాంటివారే అయి వుండాలని మనంకూడా అంతటి వారయు కావచ్చుననే అభిప్రాయాన్ని జనానికి కలిగిస్తాయి. అదే వారి పరమావధియైతే మెచ్చుకో దగినదే.

ఇక మరోపాటలో సీదాదేవి వేవిళ్ళతో చిక్కింది, అది చూసి కవి 'నా చేతియొక్క ముద్దుటుంగరము నీ ముంజేత దొడగవచ్చు' అని రాముడన్నట్లు వర్ణించాడు. ఈ వర్ణని విరహభాద గురుత్వంవల్ల కృశించిన కనక వలయ భ్రంశరిక్తప్రకోష్ఠుడైన యక్షుణ్ని తలపించేదిగా ఉంది. పదకర్తల రచనల్లో కాళిదాసు రచనలలోని తళుక్కులు మెరుస్తుంటాయి అనేందుకు రుజువుగా ఉంది.

సీతతో వాయనగుంటలాడి ఓడేటందుకు సిద్ధమైన రాముడు

సఖియ సీతో ఆట నేడు సంభ్రమాయెనే
ఆట చాలునికను చెలియ ఆటకట్టమే

పేటకట్టమనీ బొంకి పారిపోబోయారూ. అలాపారిపోయే రాముడితో సీత-

ఆటకరపై వేలు యివ్వలెక్కలున్నవి
ఓలిగట్టక అడుగువాటి కదల నివ్వనూ

నిలువు, నిలువుమని అజ్ఞచేసి తనస్వామిపై వోటే పట్టి అటకాయించింది

పుడమిలో నెవరైన అట నోడితే
కాసు వాసమిత్తురు గాని వేలు ఇత్తురా
నేను గెలిచినా ఓడినా నీసొమ్ము గాదటే
నీవు గెలిచితేని నా సొమ్ముగాదా ?

అని రాముడు బుకాయించి భరత లక్ష్మణులు వింటె నన్ను కేలిసేతురే అని తప్పించుకొనబోయే రాముణ్ని అలంకారికులు ధీరోదాత్తుడు కాడనీ, సీతలో రాగ తనం కన్పిస్తోందనీ అనవచ్చు. కాని. వీరి అనుకూల దాంపత్యమూ, ఎరమరికలు లేని సరస సల్లాపాలు జానపదుల దాంపత్య జీవనానికి ఒరవడిలాంటివి. అలం

కారికుల దృష్టిలో ఈ సీతారాముల చిత్రణములో లోపాలున్నా ఈ రచనకేమీ లోటు రాలేదు. లక్షలాది స్త్రీల నోళ్ళల్లో ఇవి మధురగాన ఫణితితో నిలిచి వున్నాయి. అచేవందలాది పండితులచే పఠింప బడుతూను వేలాది మూలల్లో నక్కి దాగి ఉండే పుస్తకాల్లో మూలుగుతూ ఉండటము కంటె రచయిత కోరుకో తగింది కదా!

## (II) భారత కథా ప్రధాన పదములు.

వింటే భారతం వినాలి. తింటే గారెలు తినాలి. అనే నానుడి గల తెలుగు దేశంలో భారత కథా ప్రధానములులైన పాటలూ, పదాలూ ఎన్ని వ్యాపించి ఉన్నా ఆశ్చర్యం లేదు. రామాయణ కథాత్మకమైన పాటలంత ఎక్కువగా భారత గాథలు జానపద వాఙ్మయంలో కన్పించక పోవడము వింతే. తెలుగులో భారతం ఆదికావ్యం. అందుచేత విద్వద్గోష్ఠులలో దానిచే ప్రథమ తాంబూలం. అందు చేతనే పైన ఉదహరించిన నానుడి కలిగిందేమో. జానపదవాఙ్మయంలో సుభద్ర సారె, ద్రౌపదివల్వలు, ధర్మరాజు జూదం, కీచక వధ అనే కొన్ని పాటలు వ్యాప్తిలో ఉన్నాయి.

భారతం రాజకీయ వేత్తలకీ పారాయణ గ్రంథమైంది. కాని, భారత గాథలు జనసామాన్యంలో పదాల రూపంగా వ్యాపించలేదు. ఐనా ఆలకూయీ, ఆడుకూయీ ఎవరు ఆలించి పాలించాలనే వీరధర్మం ఉద్బోధించేటందుకు కొన్ని కథలు మాత్రం రచింపబడి ప్రచారంలో ఉన్నాయనిపిస్తోంది. విషయం యొక్క స్వభావానికి సాయం దేశీయములైన పల్నాటి వీరభారతనికీ, యాదవ భారతానికీ తెలుగుదేశం రంగస్థలం అవడం చేత మన ప్రజలలో అసలు భారతానికంటె దేశీయ గాథలకే ఎక్కువ ప్రచారం కలిగింది. భారతంలోని నీతులూ, రాజకీయ తంత్ర పరిజ్ఞానమూ వీటిలో ఇమిడి వుండటంచేత జానపదులకి అసలు భారతంతో అవసరం తగ్గింది కాబోలు. ఐనా భారత కథలలోంచి నలచరిత్రని ద్విపదరూపంగా శ్రీ తోలేటి సీతారామయ్య ఘటికాద్రి నరహరికి అంకితంగా రాఘవుడనే రవీ, గయోపాఖ్యానాన్ని పొడుగు రామబ్రహ్మమూ, విరాటపర్వాన్ని, శ్రీ అయ్యగారి కూర్మనాథుడూ రచించారు. వీరిలో శ్రీ తోలేటి సీతారామయ్య శశిరేఖా పరిణయగాథని కూడా పదంగా రచించాడు. ఇవన్నీ కూడా పామర జనామోదం కోసం వ్రాయబడినవే. ఐతే, ఇవన్నీ ఇటీవలి రచనలే. అవి వాటి ప్రయోజనాన్ని సాధించే టటువంటివిగానే ఉన్నాయి. ఈ ఆధునిక రచనల

ప్రశస్త్యాన్ని కాలమే నిర్ణయించాలి. అందుచేత వాటి ప్రశక్తిని మాని కొన్ని పాత పాటలను మాత్రమే పరిశీలించ దలచుకొన్నాను.

అన్నదమ్ములు నెత్తము లాడటం ఉంది. గెలవడం ఓడటం ఉన్నాయి. కాని, ఏ దేశంలోనూ ఎవ్వరూ రాణివాసపు స్త్రీలను సభలో అవమానించి చీర లొలువలేదు. ఆ సంఘటనమే కురుపాండవ యుద్ధం తప్పదని నిర్ధారణ చేసింది. దుశ్శాసన, దుర్యోధనులు పుట్టిన భారతదేశంలోనే మానావమానాల్ని కాపాడు కోడం తనవల్లకాదనీ భగవంతుడిమీదే భారం వేసిన భక్తురాలు ద్రౌపది కూడా పుట్టింది. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ" అని సంస్కృతంలో చెప్పిన గీతావాక్యానికి వ్యాఖ్యాన ప్రాయంగా, ఆశాజనకమైన ఉదాహరణంగా ద్రౌపదీ మానసంరక్షణ గాధని భావించాలి. అదే మన జానపదకవి భావన ఏమో అని కూడా అనిపిస్తుంది. సత్యభామతో (మరో పాటలో లక్ష్మీదేవితో) పొగటాలాడుతూ

ఓయన్న గావవా - ఓ జనార్దన గావు
ఓ నరసింహా గావవా
మానంబు గాచుటకు మరియెవరు లేరు.

అని మొరపెట్టే యింతి ద్రౌపది దయి కరుణించి భక్తపరాధీనుడయిన శ్రీ కృష్ణుడు అక్షయంబని ముమ్మారు వరమిచ్చాడు. అక్షపోవులు గాగ అక్ష యంబని పల్కెనట. ఆ అక్షయ వల్వలు వల్వలకు వల్వలవి వీధికడ పోవు పడెనట. ద్రౌపది సంతోషమంది వాసుదేవుని దివ్యమహిమను పెక్కుతెరంగుల మతించెనట.

సుభద్రమీద అన్నదమ్ములకు కల అనురాగం ఇతిహాస ప్రసిద్ధమైంది. అది ద్వాపరయుగంతో ఆగిపోక ఈ యుగంలోకి కూడా పాకి జగన్నాధంలో ఉపాసకులకు ఉపాస్యమైంది. కృష్ణుడికి సుభద్రమీది భాతృవాత్సల్యాన్ని పద కర్త సుభద్ర సారెలో అభివర్ణించాడు. ఇందులో అర్జునుడు మామూలు పేచీ కోరు కొత్తఅల్లుడు. సుభద్ర అభిజాత్యగర్వం గల కొత్త పెళ్ళికూతురు. సోదరీ వాత్సల్యంగల కృష్ణుడు సారెలిచ్చి చెల్లెలి కాపరం కుదుటబరిచే చిన్నఅన్న. కాక పోతే ఆ పదంలోని ఈ వాక్యాలకు అర్థం ఏమిటి ? అర్జునుడు సుభద్రతో

పున్నమ్మనాడైన అట్లు వండుకోని
అల్లుడా రమ్మని పిల్చారె మీవాళ్ల
కనుమ నాడైనాను గార్లు వండుకోని
కాముడా రమ్మని పిలిచారె మీవాళ్ళు

సుభద్రి దానికి సమాధానంగా

మా వాళ్ళు పేదవాళ్ళు మాకేమి గలదు
పెట్టగల పెద్దింటి పెళ్ళాడితేను
అచ్చటలు ముచ్చటలు అన్నియును జరుగు

అంది. ఈ సమాధానానికి అర్జునుడు

ఆతివ పల్కులు విని గుద్దెర్రజేసి
యెడమ మీసం దువ్వి పాంకోళ్ళు యెత్తి
పాంకోళ్ళతో తన్ని పక్కనా నవ్వు.

సుభద్రికి రోషం వచ్చింది. అవమాన భారంతో

గోలు గోలూమని గోడపైకొరిగి
ఒంటిసొమ్ములు దీసి భరణిలో నుంచి
మువ్వలా ముద్దుబాలుని చంకబెట్టుకొని
గంటలా బాలుని చెట్ట పట్టుకొని
వెళ్ళెను సుభద్రి అన్నవాడలకు

వెళ్ళి జరిగిన కధ అంతా అన్నతో చెప్పింది. ఆ అన్న

చెల్లెలిని వోదార్చి చేరంగ తీసి
కంట తడిబెట్టకుమి కాంతరో నీవు
దండెమున వున్నాయి కొత్త చీరెల్లు
యిదిగోనె చెల్లెలా నీకు ఆభరణాల్
పెట్టెలో వున్నాయి పట్టుచీరెల్ యివిగోనె చెల్లెలా
గూట్లోను వున్నాయి గుండు దిన్నెల్లు ॥
అటక మీదున్నాయి అంచు బిందెలు ॥
భరిణెలలో వున్నాయి పతకాలపేర్లు ॥

సుభద్ర తృప్తి చెందింది

చిన్నింటి చిన్నవదినె పోయి వచ్చేదను
పెద్దింటి పెద్దవదినె పోయి వచ్చేదను

అని పేరు పేరు వరుసలా వదినెలను సెలవడగింది. వదినెలు కూడా

పోయి మీ యత్తింట బుద్ధి గలిగుండు

అని సలహా చెప్పి

యెండే ధాన్యంబు యెత్తుకొని పొమ్మ
వండే వంటకము యెత్తుకొని పొమ్మ
మా యిల్లు పిరుచుకు పొమ్మ ఓ ముద్దుగుమ్మా

అని తమ ఈసు వెలిబుచ్చారు. ఇలాగ వదినెలు

అనుచు గుజగుజలాడ అతివ దుఃఖించె
అన్నరో వింటివా అలి మాటలను

అంది. కృష్ణుడు చెల్లెలితో

కొన్నబానిస అంటె కొదవేమి మనకు
మన అమ్మ కొన్నాది మాయ మంధరము
వదలేవో సుభద్రా పంపి వత్తుననుచు
పల్లకీ యెక్కించె పరమాత్ముడపుడు.

ఈ పాట పాడినవారెవరూ సుభద్రార్జునులనూ కృష్ణుణ్నీ, పౌరాణిక స్త్రీ పురుషులనుకోలేరు. మన జానపదులలాంటి వారనే భావిస్తారు. పరస్పర మోహ నిష్ఠులై పెద్దన్న కెరుకలేకుండా వివాహమాడి అర్జునునితో యాదవసేనా నివహం లోంచి దూసుకొని వెళ్ళిన సుభద్ర సారె తీసుకోపోయే అవకాశంలేదు. అందుచే ఇలాంటి సన్నివేశాన్ని కవి ఊహించాడు. ఇలాంటి సన్నివేశాలకి జానపద జీవితంలో కొదవలేదు. ఆపాత్రలకి సుభద్రార్జున కృష్ణపాత్రల్ని బుట్టబొమ్మల బురఖాలలో ప్రవేశింపజేసి జానపద జీవితాన్ని పౌరాణిక గాధలతో మిళావుచేసి పదకర్త రచన సాగించాడు. ఈ విధానంలోని ఔచితితో అతనికి పని లేదు. తోటి జానపదుల మెచ్చుకోలె; రసబద్ధతయే అతనికి చాలు.

ధర్మరాజు జూదములో ప్రత్యేకతనితెల్పే కల్పనలు రెండుకాన్పిస్తున్నాయి. జూదపు పాచికలు దొర్లేచోట లక్ష్మి, జ్యేష్ఠాదేవీ పంతులాడుకొంటూ ఇద్దరూ చెరొకర్నీ ఆవహించడం రమ్యంగా వర్ణించబడింది. జ్యేష్ఠాదేవికి భీమన్నమీద తత్రిసి ధర్మరాజుమీద కోపం రవులుతూఉంది. దానికి కారణము ధర్మరాజు.

"రాజసూయ యాగమ్ము తాజేసినాడు
వీధివీధిగట్టి విస్తళ్ళు వెయ్యా"

నిందు చేసిననాడు కలిగింది.

ఆ యజ్ఞశాలలో పలికెనే (జ్యేష్ఠాదేవి) చోతి
కూతుళ్ళు తానూను కుడువబోవంగా
ఆకులు వేసుకొని మేముగూర్చుండా
కూతుళ్ళనుచూచి కోపించె భీమా
ఆడదానవు నీవు యిది నీతిగాదు
మగవారితో కుడువ పాటిగాదనుచు
ఆకులు దీయించి పారవేయించె
ఆ భీము కిస్తినే శాపమ్ము నేను
చేటలోపల వడ్లు నెరపిననాడు
నాడు నిను గొలుతునని పలికితిననెనూ
.... .... .... .... .... .... .... .... .... ....
నాటి కార్యము నేడు సమకూడెననుచు

అవమానంతో కుములుతూన్న జ్యేష్ఠాదేవికి దుర్యోధనుడు ప్రత్యుత్థానంచేసి తనకు జయం కలిగేలా వరమిమ్మని కోరడం తోడయింది. వెంటనే పెద్దమ్మ చిన్నమ్మతో ధర్మనందనులబాసి రారాజు నాశ్రయించవలసిందని కోరుతుంది.

ఆలికివిడిచిన గడపదాటడే రాజు
ఆ ధర్మనందనుని ఎడబాయలేనె
దివ్వెలేవి గృహము చూడదేరాజు
ఆ ధర్మనందనుని ఎడబాయలేనె

అని లక్ష్మీదేవి వెనకాడుతుంది. కాని, జ్యేష్ఠమహాదేవి కన్నెర్ర చేసేటప్ప

టికె లక్ష్మీదేవి నిరుత్తరయై ఆమె ఆజ్ఞావశురాలైంది.

పాటలో దుశ్శాసనుడు గాంధారి అనికూడా వ్యవహరింప బడినాడు. "గాంధారిని పిలువరే పాంచాలితేను" అంటే—

అన్న కెదురుగవచ్చి అతిభక్తితోను
చేతులు ముడుచుకొని చేసె విన్నపము
గాంధారి ఈపనులు గావుమాచేత
అంటోను యీపనులు సరిపడవు అనెను

ఇది భారత దుశ్శాసనునిలో కానిపించని మానవత్వము. ఒకప్పుడు తాను ప్రేమించి స్వయంవరమునకేగి నిరాకృతుడై ఆస్త్రీని (ద్రౌపదిని) సభలో అవమానించి కసిదీర్చుకొనవలెనను మానసిక వికృతికొని వైలక్షణమునకొక్క దుర్యోధనుడే తార్కాణం. ఆ అవమానకర ఘట్టమున తదితరులపాలు అంత ముఖ్యము కాదని ఈపాటలో సూచితమౌతుంది. మరొకటి. అందరూ అది మాపనికాదు అనగానే రాజరాజు కన్నెర్రజేసి—

యేమోయి గాంధారి నీవోయికొనిరా
పోయిరా పాంచాలి దోడుకొనిరారా
ధర్మజు గట్టినా వస్త్రములుగట్టి
ధర్మరాజెక్కినా అశ్వాన్నియెక్కి
హస్తినాపురమునకు వెళ్ళినాడపుడు

అనడంతో దుశ్శాసనుడు వేషాడంబరమంటే ప్రీతిగలవాడని పాట రచయిత సూచించాడు. సుయోధనుని రత్నప్రియత్వమే. ధర్మజుని కోశమునకు చేరిన రత్నబాహుళ్యం చూసినప్పుడు కలిగిన అసూయచే కెంపెక్కిన కన్నుదోయి యే జూదమునకు దారితీసినదని "సాగరసారవారి మహాశౌక్తిక మౌక్తిక విద్రుమ" అన్న భారత పద్యమూ, "నన్ను రత్నపరిగ్రహణంబునకు నియోగించె పార్థివుండు. సకల రత్నాకరైక నివాసము ధర్మ పుత్రు గృహము'' అని వాపోయిన సుయోధనుని పరిదేవనమూ వ్యక్తం చేస్తాయి. అందుచేత దుశ్శాసనుని వేషాడంబర ప్రియ భావుకత భారతంలో సూచింపబడకపోయినా జర్మన్ జనరల్ గోరింగ్‌కి ఒంటినిండా మెడల్స్ దిగేసుకోవడంలోఉన్న ప్రీతిలాంటిదిగా వర్ణించిన కవిని ఉచితజ్ఞుడనే అనాలి—

శ్రీకృష్ణుడి వరంవల్ల ద్రౌపదిచీరలు అక్షయమై
తూర్పునా బడ్డవి తొంబదివేలకోట్లు
పడమరా బడ్డవి పదివేలకోట్లు
ఉత్తరమున బడ్డవి పూరంతపొడవూ
దక్షిణాన పడ్డవి తాళ్ళంతపొడవు
నేలన్ని విరిచెను చేలన్ని మురిగె
ఆపలేక వారు కూర్చుండ బడిరి
ఏమి నోము నోస్తివే పాంచాలి నీవు.

అని అమ్మలక్కలందరూ ఆశ్చర్యపడి ఆడిగారు. ఊరంతా ఇలాగ అక్షయంగా నిండిన చీరల్ని

బ్రాహ్మణ వీధినీ పణతు లందారు
భావించి గట్టిరీ పట్టుచీరెలు

(వారికి మడికి అవసరం గనకనేమో)

వెలమ వారిండ్లను రమణులందారు
అంచు దీర్చి గట్టిరి అంచు జీరెల్లు

(అందంకోసమని యేమో). ఇంత జరిగినందుకు రారాజు కృంగి తల వాల్చుకోవలసిందే కాని సిగ్గు విడచి

పట్టు చీరెలు రెండు పట్టుకొని వచ్చి
పదిలముగ దాచుమని పలికె రారాజు.

కాని, అవి వైష్ణవ మాయా ప్రసాద జనితములవడం చేత

పక్షులయి యెగసినవి పట్టు చీరల్లు
హస్తినాపురములో అంగళ్ళలోను.

దీనిలో రారాజు అద్భుత మనస్కుడయాడు. అమ్మ నీ తలకురులు ముడుచుకొమ్మన్నాడు. అవమానభరంతో ద్రౌపది ముడిపడుతోంది. దైవబలాన్ని నమ్మింది. దైవం ఆసరా ఇచ్చినట్లనిపించింది. వీరవనితాత్వ స్ఫోరకంగా ఇలాఅంది.

నాతి కొంగ చెక్కుమన్న రారాజు తొడలు
తొడలు చీరించక తల ముడువ నేను
పట్టుబట్టినట్టి దుశ్శాసను చేతులను
తోంకాలి గుచ్చక తలముడువ ననెను.

అంతటితో ఆగక

ధర్మజుతో జూదమాడితివి గాని
తనతోటి జూదమ్ము ఆడుమని పలికె.

ఈ మాటల్లో ఆమెకి తనపక్షాన ఉన్న దైవం తనకి జయం ఇస్తాడనే నమ్మకం కలిగిందని తెలుస్తుంది. ఈ మాటలు విని రారాజు సిగ్గులేక పాంచాలితో జూదమైనా ఆడే అవకాశం దొరికిందని ఉల్లాసపడ్డాడు. అందుకు తయారయాడు. పాంచాలి కూర్మాసనంమీద కూర్చుండి ఆ పాపకర్ముడి ముఖం చూడనని మధ్య తెర గట్టించి, కాళ్ళతో పాచికలు తోసి ఆడుతూ

ఒక్కోపలక్కే వస్త్రములు గెలిచె
రెండో పలకకే హారాలు గెలిచె
మూడో పలకకే ఆయుధము గెలిచె
నాలుగో పలకకే కొడుకులను గెలిచె

ఇలాగ తన పతులేవురినీ పాంచాలి గెలవగానే శకునివచ్చి తెరచాటున ఉన్న ఆడవారెవరితోనూ జూదమాడుట ఏమిప్రజ్ఞ అనీ, పాంచాలి పతివ్రిత అవడంచేత ఇలా ఆడకుండా మర్మం చేసిందనీ ఆట ఆపించేశాడు. ఇంతలో అక్కడకి ధృతరాష్ట్రుడు వచ్చి, జరిగిన సంగతి తెలుసుకొని, కొడుకును కోపించి

ఇది యేమి జూదమ్ము ఇట్లు ఆడురురా
రావమ్మ పాంచాలి వరము లిచ్చేను
నీసేన రాజ్యములు నీవు గైకొనుచు
నీపతుల దీసుకొని పదిలాన వెళ్ళు.

అన్నాడు. అలాగ అన్నమామతో

ఆడవారు రాజ్యము ఏలంగ దగదు
పతులగూడి వనములకు పోయెదమనుచు

పాంచాలి కోరెనే పతుల నేవురిని
తప్పక ధృతరాష్ట్రుడు తా వారపోసె
పతులను గూడుకొని పాంచాలి తాను
అరణ్యవాసాని కతివేగ మేగె.

పాటలో జూదపు సభలో కురువృద్ధులూ లేరు. అందుచేత ఆడుకూయి నాలించిన అపకీర్తి, జగంబులో ఎవ్వరూ ఎన్నడూ కనివిని ఎరుగని అవమానం సభలో జరుగుతుండగా, ఊరుకున్న అపకీర్తి అధర్మమూర్తులని పేరుగన్న ఆ భరతవీరులకి తప్పింది. ఇందులో పునర్వ్యూతమూ లేదు. వనవాసం, అజ్ఞాత వాసపు షరతులూ లేవు. పన్నెండేళ్ళ వనవాసం కాలదోష పరిహారానికి ఒక ఏడాది అజ్ఞాతవాసం గర్భగుప్తిలాంటిదై పునర్జన్మ నిచ్చేటటువంటిదనీ పూర్వపు హక్కుల్ని లభింపజేసేదనీ పదకర్త అభిప్రాయమేమో. ఏమైనాగున్నా ఈ పాట రసవంతమై చదువరులను ఆలోచనా పరుల్ని చేసేలాంటిదైయుంది.

## విరాట పర్వాంతర్గత కీచక వధ.

భారత పురాణకథాత్మక రచనల్లో కీచకవధ ఒకటి. రచనా విధానాన్ని బట్టి తెలుగు భారతధోరణి ననుకరించిందనీ అతి రసవంతంగా ఉందనీ, అనవచ్చు. తెలుగునుడికారపు సొంపు ఈ పాటలో ప్రతీ వాక్యంలోను ప్రతిధ్వనిస్తోంది. చూడండి కీచకుడితో సుదేష్ణ అన్నమాటలు

ఆడదాని చిత్తమ్ము అరిటాకు మొవ్వు
ఇల్లాలి గోరితే ఇదియొక్క నిందా
పతివ్రతను గోరితే పోను ప్రాణముల

కథలో కీచకుడు పాంచాలి నాట్యశాలకు వస్తానని సమయనిశ్చయం చేయ గానే నమ్మలేదు.

నిన్న ప్రేరేపించి నీవంత జేసి
నేడు వస్తానంటె నే నమ్మలేను
పట్టు గుప్పిచ్చినవారు పతులరప్పింతురి
నీవు వచ్చేనంటె నే నమ్మలేనె

అని అన్నాడు. దానికి బదులుగా ద్రౌపది

నమ్మకుండగ నేల నామాట నీవు
గురు ఉపదేశంబు కొంగుదీ ముల్లె
నిన్ను జంపుకతిందు నేడు యీరాత్రి
నాటకపు శాలలో నాట్యశాలలో
నాటకపుశాలలో రంగమధ్యమున
నిను జంపి నీనెత్తురి బొట్టెట్టుకుందు

అని చమత్కారంగా, వ్యంగ్యాలంకార స్ఫోరకంగా అని కీచకుడికి రోషం హెచ్చించింది.

కీచకవధకాయుతుడైన భీముడు స్త్రీవేషం వేసే విధము చూడండి కవి ఎంత సహజంగా వర్ణించాడు

పని బూని ఖమిడి చెంగుల చీరగట్టీ
అంగుష్టముల వీరమద్దెలను బెట్టి
గట్టిమట్టెలు బెట్టి కడియములు బెట్టి
పరగనా భీముండు పతకములు వేసి
ఉరమున అవిరెండు భరిణెలంబెట్టి
కుచములమర్చెనే వాయునందనుడు
ఇదియేమి చోద్యమే చిత్రిపుత్రికా (అయోనిజ)
విరహాన నినుగోరి వీడేల చెడెనే
వీడిలక్ష్మి రాజ్యమ్ము నేలపాలాయె
భక్తితో తన సతీ ఆకు చుట్టియ్యా
వీడెమ్ము సేయుచు వేడుకలతోను.
కలసి ముచ్చటగాను కాంతతో నుండ
అల్లంతట వచ్చేటి యా సింహబలుని.
రాకలు జూచిరీ రాజ్యాధి పతులూ
సింహబలుడొచ్చెనని దీపమ్ము లార్పే
వెలుగేల ఆర్పితివె వెలదిరో నీవు
అని యిట్లు కీచకుడు అడు మాటలకు

మాయ ద్రౌపదీ బలికె మాయతోడుతను
దీపమ్ము లుంతురా లోకమ్ములోను
యేవురు మగలాలినై యుండి నేనూ
దీపమ్ము లుంతునా లోకమ్ములోనూ

అని ఉపాలంభించింది.

బరువుకు చాలాకా పట్టెమంచమ్మూ
విరిగినయంతలో విమలాక్షి బలికె
మంచము విరిగితే మరణ మందూరు
పురుషులకు పీలుగాదు బుద్ధేమి చెపుదు
మెల్లసే చెయిబట్టి మెల్లనే దీసె
చందమామను బోలు సఖియ నీ మోము
కళ దప్పియున్నదే కాంతరో నేడు.
పగలు చూచితె చిగురుటాకులను బోలు
మాపు జూచితె మద్ది మాక్రికులను బోలు
ఆడకట్టు గాదనుచు అని నిశ్చయించి
మనసులోపల చింత మరి దిగులు పడెను.
ఆడదెబ్బ గాదనుచు అదరిపడ, లేచి
చెంపపెట్టూ బెట్టె తాను భీముడూ
కదలక తన్నెనే కన్నూడి పడెను.
అచితన్నితె ఊడె ఆ దంతమూలు
భీముడు సింహబలుడు యుద్ధమ్మ సేయా
మూడు లోకమ్ములు ముందరా వణికే
గడగడ భూదేవి అప్పుడే వణకే
కాళ్ళాను వేళ్ళాను అన్నియును విరిచే
పొట్టచించి బుర్ర పొట్టలోబెట్టె
ఉవిద వాడి నెత్తురు బొట్టెట్టుకోవె

అని చెప్పి భీముడు ద్రౌపదీ పరాభవానికి ప్రతికి్రియ చేశాడు. తరువాయి కథనికూడా కవి ఈ బాణీలోనే నడిపాడు. ఉపకీచకుల వధ పూర్తియైన తర్వాత వచ్చే ద్రౌపదినిజూచి ఊరివారు బెదరి—

మగలను దాచుకొంద్రు మగువలందారూ
సోదర్ల దాచుకొంద్రు సఖియలందారూ
యింటింట జాతర్లు చేతుమేతల్లి
ఈనేటి బిడ్డలకు నీపేరెసుమ్మి

అని మొక్కుకుంటారు.

సత్యవాక్పరిపాలనానికి హరిశ్చంద్రుడి కథా, గోవ్యాఘ్ర సంవాదమూ మన సాహిత్యంలో ఎక్కువ ప్రసిద్ధికెక్కిన ఉదాహరణలు. జానపద వాఙ్మయంలో గోవుపాటలో ఈకథని అజ్ఞాత రచయిత హృద్యంగా వర్ణించాడు.

గొల్లకృష్ణుడు వేణునాదం చేతబట్టుకు ఊదుకొనుచు
గోవుమందల వెంటనడచి పొన్నవృక్షము చెంతజేరె
గోవులన్ని పొదలుహారి కలిసి మేయుచుండగాను

పెద్దపులి వాటిమీద పడుతుంది. అప్పుడొక ఆవు దానితో "మూడుదినముల క్రింద నేను కలవ దూడల కన్నదానను నన్ను పెంచిన దాతలెల్లా పాలుపితుకక యుండగాను ఆ రెండుదూడల పెంచుచుంటిని. నాదు రాకకు దూడలెల్ల యెదురు చూచుచు బెంగతో నుంటాయి. శలవు ఇచ్చినట్లయితే పాలుయిచ్చి మళ్ళీవచ్చి నీ ఆకలి తీర్తునని పల్కింది" ఇలా ఆవు అనగానే అది తిరిగి రాదేమోనని పులి అనుమానించింది. వెంటనే ఆవు సకల దేవతలానవచ్చెద" నాదు పుణ్యము ధార పోసెద నాదు కొడుకుల మీదుగానూ, సత్యమైన తలిదండ్రులమీదా నేను సకల ఆనలు బెట్టుతాను. సత్యవాక్యము దప్పితే నేను స్వామిద్రోహము చేసినట్లు. పుట్టినింటి వారికెల్లా, అత్తవారి యింటికెల్లా కీర్తిసంపద పోయినట్లు" అని ఒట్టు వేసుకొంటుంది. ఈ మాటలు కేవలం ఆవు చెప్పిందేకాదు ఇవి నేటి జానపదుల నోటిలోంచికూడా ఆనపెట్టేటప్పుడు వచ్చేవే ఆవు తన బిడ్డలకు కడసారి పాలిచ్చి బుద్ధులుచెప్పి సెలవు దీసుకొనే సందర్భంకూడా ఎంతో సహజంగా చిత్రించబడింది—

బుద్ధిగలిగి మసలుచుండుడి
పచ్చిచేను మేయబోకా
కాపుచేతిలో చిక్కబోకా

పొదలచాటున పేయబోకా
పులుల నోటికి అందబోకా

కాలక్షేపం చెయ్యండి అని తక్కిన ఆవుల్ని—

పేరింటేపీ, మీనాక్షీ
ఆదిలక్ష్మీ అన్నపూర్ణా
కామధేనూ కల్పతరువా
పేరుబడ్డా గోవుల్లారా
నాదు కొడుకుల మీరుజూచీ
ముందుకొచ్చిన పొడవబోకా
వెనుకకొచ్చిన తన్నబోకా

తల్లిలేని బిడ్డలని జాలిదలచి ఆదరించండిఅని కోరి, తుంగభద్రానదిలో తానమాడి సత్యపరిపాలనకి పోయింది. ఇందులో కథా చమత్కారంకంటె జాన పదుల మనసుల్లోంచి ఉబికే భావాలు సహజరీతిని వర్ణించబడ్డాయి. అందుచేతనే ఇది నిలిచింది.

## (III) భాగవత కథా ప్రధానమైన పాటలు.

స్త్రీల పాటల్లో భాగవత కథా ప్రధానమైన వాటిల్లో శ్రీకృష్ణుని జననము, శ్రీకృష్ణునిచల్దులు గోపికాస్త్రీల జలక్రీడలు, కాళింగుమడుగు, సత్యభామసరసము, చెంచితకథ, చిలుకరాయబారము, రుక్మిణీదేవిసీమంతము, లక్ష్మీదేవిసొగటాలాలు, తులసిదళము, గజేంద్రమోక్షము అనేవి ముఖ్యమైనవి.

శ్రీకృష్ణుని జననమూ, గుమ్మడిపాటా స్త్రీలపాటలలోకల్లా ఎక్కువ ప్రచారంలో ఉన్నవనడం సత్యదూరం కాబోదు. విమర్శకులందరూకూడా వాటి మాధుర్యాన్ని మెచ్చుకున్నారు. వాటి ఛందంకూడా కొద్ది మార్పులతో చేర్పులతో, నేటి కవుల కుపయుక్తమైంది, శ్రీకృష్ణ జననంలోని—

వసుదేవ పుత్రుడమ్మా ఈబిడ్డ వైకుంఠ వాసుడమ్మా
నవనీత చోరుడమ్మా ఈబిడ్డ నందగోపాలుడమ్మా
సీతాకళత్రుడమ్మా ఈబిడ్డ శ్రీరామ చంద్రుడమ్మా

ఈరూపు ఈచక్కన అబ్రహ్మ ఎన్నాళ్ళు పొసెదంగ్రి

అన్ని చరణాలు జోలపాటలుగా పాడని తల్లులూ—

నమ్మరా కృష్ణమ్మ పెరుగులో నడుమ గుమ్మడు తిరుగులాడును
నమ్మకున్నను ఘుమ్మ ఘుమ్మను నాదమిదియు వినుమా కృష్ణా గుమ్మడిదిగో

అనే చరణంలోని భావాన్ననుకరించి పెరుగు తరచునపుడు అడ్డాలుపడే బిడ్డల బెదరించని జానపదస్త్రీయీ తెలుగుదేశంలో కానరారంటే ఈపాటల్లోని సహజోక్తి వర్ణనల ప్రాశస్త్యాన్నీ ప్రభావాన్నీ ఊహించుకోవచ్చు.

గోపబాలకులతో చల్దులుగుడిచే గోపాలకృష్ణుడు "ప్రాభాత సమయ మప్పుడు భాస్కరులు దయబాయగ బ్రహ్మాండకోట్లు వెలుగగ ప్రభుడూ చల్దార గించాడట. బాలచంద్రునిచుట్టూ బాల పరివేషమువలెనూ గూడేవారు గోపకులు చల్ది కోలలు వేసేటప్పుడు—

కాళింగుమడుగుదరినీ ఘనమైన పాములున్నాదాటా
కాళింగుమడుగు దరికిబోకుమా

అని బుద్ధులుచెప్పి యశోద కృష్ణుణ్ని పంపింది.

చెప్పంగ భయమాయె అమ్మకోనాకు
పన్నెండు శిరసులా జూచునేపాముా
నాలుకలు గీటుతూ ఉండునేపాముా
యిక దుష్టతనములూ చెయ్యనెన్నటికీ
పాముచేతికి నన్ను పట్టివ్వకమ్మా
యిక్కడ కృష్ణుడూలేడు లేడనుచూ
యశోద చెప్పుమీ సర్పమ్ముతోను

అని పుత్రమోహం రెట్టించేలా పలికి లీలావతారుడు ఈపాటలో నాయకుడు అంతకుముందే యమునా జలాలుత్రాగి సొమ్మసిల్లిన గోపకులను అమృతం కురి పించి తెప్పరిల్లేలా చేశాడు. అప్పుడే కాళియాహిమర్దనకు కృతనిశ్చయుడైనాడు. అందుచే కాళింగుమడుగుదరికేగి, వద్దని మొత్తుకొంటూన్న గోపాలబాలుర మాటలు పెడచెవినిబెట్టి కృష్ణుడు మడుగులో దుమికాడు.

ఇదియేమి శ్రీకృష్ణ మమ్మ వగవిడిచి
మడుగులో దుమికితివి న్యాయమా నీకూ
కరచినప్పుడు పూరిమేయజాలకనూ
అరచి జూచుచుండె అపుడు గోవులనూ
అక్కడ నానాలు బెంగటాల్చేను
పెక్కుయుగాదోచె నందాములకునూ
పగలు చుక్కలుబొడిచె గెద్దలునుయెగసె
కాకులు మూకలై కుయ్యంగదొడగె
అప్పుడూ రేపల్లె కపకరునమాయె
నలకన్ను అదరెనే యశోదకపుడూ
నాచిన్నికృష్ణమ్మ నను గన్న తండ్రి
ఏల యితరులచేత జిక్కితివికాదుకా
ఓ అంతరిక్షమా యో భూమిదేవి
యెందున్న నాపట్టి కాయరేవోయి

అని అందరు దేవతలనూ ఆక్రోశిస్తుంది. గోగోపగణంఅంతా యమున ఒడ్డుకిచేరి కాళియాహిగర్వం అణచిన కృష్ణజే, కృష్ణజే, కృష్ణమ్మ జేజే అని జేజే లిస్తుంది. ఈపాట మాధుర్యంలోనూ, రచనా సొంపులోనూ కృష్ణజనానికే గుమ్మడిపాటకీ తీసిపోదు. ఇది ఇంకా ఎక్కువ విరివిగా ప్రచారంలో ఉండ తగింది.

## గోపికా స్త్రీల జల క్రీడలు.

మార్గశిరమాసంలో వేకువజామున గోపికలు నందగోపాలుని కంటపడ కుండ యమునలో స్నానంబుచేసి నోములు నోయ పూనుకొన్నారు. వారంతా ఏకాంతముగా సమమైన ఒక తిన్నెపయికెక్కి నలుదిక్కులా ఒక్క నరుడూ లేకుండాచూచి చీరెలువిడిచి

కుప్పలువేయుచు కుప్పిగంతులును
తెప్పలువేయుచు తీర్థంబులాడి
వెంగుమ నొకరొకరికేళి దోసిళ్ళ

నవ్వులు నవ్వుచు కొన్నారిమించి
కొదమసింగపుపిల్ల బెదురయినరీతి
పడిపడి జలములు పొరదియ్యుచూ
నెట్టులుపట్టి నానెట్లు పోద్యోదవు
కొట్టబోయినరీతి కోపగించుచును
అని యత్నగించుచు నతివలందరును
నీవెవ్వరో మరి యిటు జూడుమనుచు
నీవు నా వదినెవు నిన్ను పోనీయ
నని కేకలేయుచూ కృష్ణ గోపాల

అని జలక్రీడలాడుతూ కృష్ణునిమీదే మనసు లీనంచేసుకొని ఒకరినొకరు కృష్ణునిగాభావించి సరసాలాడుతూ తన్మయత్వం చెందుతారు. "కృష్ణగోపాల" అన్న వారి పాటలోని పిలుపువిని వారిని కృష్ణుడు చూడవచ్చి

చారలుగల మయిజారు చీరెలును
కమ్ములు గలయట్టి బొమ్మంచుచీర
నిగనిగ మెరిసేటి నీలంపువన్నె
వరగుల్కుచున్నట్టి జిగిమంచిచీరె
తొగరువన్నెలుగల తోపులచీరెలును
మొలకవన్నెలుగల చెంగావిచీరె

ఆ పోగుచూసి పొన్నచెట్టుఎక్కి దాగుంటాడు. స్నానాలు ముగించి వచ్చిన గోపికలు చీరలు కన్పించక

దోసకారెవ్వరో చీరెలకెల్లా
దొంగిలించుకపోయ్యే దోషమెంచాక
ఒక్కరిపనిగాదె, అక్కరో ! దొంగ
లెందరో జేసిరి ఎంచిచూడంగా
వట్టిమాటలకు కట్టుచీరెలిస్తారే
వస్తుండియైన కాసులపోసియైన
మనచీరలెల్లను మనమందవలెను
విలువలేనిచీర కలువవువ్వులది

నొసగదచి యింత ప్రేమతో గొనెను
మల్లెమొగ్గలరవికె మామామగారు
విలువపెట్టికొనెను విభ్రాంతిగాగ
అందమైనచీరె పొందయిన రవికె
అతివలు వెదకుడీ ఆలస్యమేల

అని వెదకులాడి కృష్ణునిగాంచి తమతమ సానుగిరులచీరసూ, చిలుకల రవికెనూ, శ్యామకళల రవికెనూ, సంపెంగపువులచీరెనూ, కెంపునీలపు రవికెనూ, ఇంద్రనీలపు చీరెనూ, చంద్రికావి రవికెనూ, పొన్నపూల రవికెనూ, తెల్లని చీరెనూ, మొగ్గలుగల రవికెనూ, నిమ్మకాయలవన్నె చీరెనూ, నీలివన్నె రవికెనూ పట్టుచీరెనూ, పగటిచుక్క రవికెనూ, పుల్లచీరెనూ, హంసలతీరైవ కమ్ముల రవికెనూ, కోటకొమ్మలుగల రవికెనూ, చాయలుగల చీరెను, బంగారుసరిగవన్నెల రవికెనూ, కలువరేకులచీరెనూ, పసిడివన్నెరవికెనూ, అష్టకళలచీరె నూ, మెరుగుల వన్నెరవికెనూ ఇమ్మనీ కోరారు. ఊరికె వలువలు ఇచ్చెదవా, మా మగవారికి చెప్పు దుమాఅని బెదిరించారు. కాని, ఫలమేమీకానక చివరికి కృష్ణుడు ఆజ్ఞాపించినట్లే ఆతనికి రెండుచేతులనెత్తి మ్రొక్కి వారివారి చీరలను రవికలను తిరిగి పొందారు.

శృంగార నాయికలలో సత్యభామ అగ్రిగణ్య. తెలుగు సారస్వతంలో పారిజాతాపహరణమూ, భామకలాపమూ, ఆమెకు కృష్ణుని అష్టమహిషుల్లో ఒక ప్రత్యేకత కలదని రుజువు చేశాయి. జానపద గేయ వాఙ్మయంలోకూడా ఆమె విశిష్టత గుర్తించబడింది. అది వ్యక్తంచేసే రచనలే సత్యభామ సరసమూ, పారిజాత పల్లవీ, క్షేత్రియ్య పదాలూఅనే పాటలు, సత్యభామ సరసంలోకూడా తలుపు దగ్గర సత్యా కృష్ణుల సంవాదం,

జడభరతుడందురే చెలియ నాపేరు
జడభరతుడైతేను జడలు నీకేవి ?
నరసింహమందురే నాతి నాపేరు
నరసింహమైతే మా నగరి కాపుందు
వెంకటేశ్వరులందురే వెలది నాపేరు
వెంకటేశ్వరులైతే తిరుపతిలొ నుండు
అచ్యుతుడు అందురే అతివ నాపేరు
అచ్యుతుడా ముచ్చువో నిన్ను నేనెరుగ

బలభద్రుడందురే పణతి నాపేరు
పావవో మరదివో నిన్ను నేనెరుగ
శ్రీ కృష్ణుడందురే చెలియ నాపేరు
చీరవో రవికెవో నిన్ను నేనెరుగ

అని బతిమాలించుకొని సత్య ఘడియ తీసింది. దంతక్షతాల వల్ల పగిలిన పెదవుల్నీ, ఇతర చిన్నెల్నీ చూచి అనుమానించి

పరమాత్మ నీ పెదని పగిలినదేమి ?
దోరమామిడి తేనె లారగించానె
పక్షులారగించేవి పతులారగింతురా ?
పరమాత్మ నీవునికి బట్టబయలాయె.

అంటూ అలంకారాలకేసి చూసింది. నాలుగైదు ముఖ్యాలంకారాలు గైరుహాజరు అయ్యాయి. ముఖ్యంగా వేళ్ళికి ముద్రికలేదు.

సూర్యప్రకాశమై వెలిగేటి ముద్ర
రుక్మిణీ వేళ్ళకు ఉందు నా ముద్ర

అని ఊహించింది. వెంటనే ఈర్ష్యాకషాయితయై

రుక్మిణీసతి నీకు పట్నంపు దేవి
యెంత బలువైతినో నాతండ్రి కపుడు
చిన్ననాడె విషంపోసి చంపదాయెనుగ
అంతకన్నా నూతపడవెయ్యదాయె
ఇందరు సవతుల మీద వెదకి తెచ్చినన్ను
నీ మెడను గట్టి తా అరష పడినాడు.

అని వలవలబోయింది. ఇంత వలవక్షమా ఇందీవరాక్షి ? అని ప్రశ్నించింది దానికి సమాధానంగా దక్షిణ నాయకత్వాన్ని రూపిస్తూ కృష్ణుడు

పక్షపాది తనంబు భామ నేనెరుగ
మీరు ఇద్దరు రెండు కన్నులె నాకు
పారిజాతము తెచ్చి నీపెరట వేస్తి

అని జ్ఞప్తికి తెచ్చి నమ్మబలుకుతాడు. సత్యభామకి అలక తీరలేదు

పసుల కాపరివేదో పైకారివేదో
గొల్ల బోయడవగుచు ఉన్నవాడావు
అది యేల బోయేని అది గొల్లబుద్ధి

అని ఎత్తిపొడుస్తూ నిందాగర్భితంగామాటాడింది. విసిగి వేసారి కోపించి మనపదంలోని కృష్ణుడు సత్యతో

యెర్రాని వాడిని పొడుగు గలవాడిని
చక్కనివో విభుని తెప్పించుకోవె
కూర్చుండ తీరదే కుసుమ సిరిగంది
గొల్లభామలు యెదురు చూచుచున్నారె
సిగ్గున తాలేచె శ్రీకృష్ణుడపుడూ
నగధరుడు మొగసాల ముందర నిలచె

అంతటితో సత్యభామ కోపం దిగింది. ఆమె లేచి తెగిందాకా లాగితే లాభం లేదనుకొని

పితాంబరం చెంగు పిగుల తాబట్టి
పట్టంగ తన శిరసు తావంచుకొనియె

అలా వెళ్ళబోయే కృష్ణుని ఆపి భామ

అప్పుడు సత్రాజిత్తు పంపేటినాడు
ఆడపడచుల బుద్ధి యేమని చెప్పె
యేమని చెపుతుంటి వినశక్యమాయె
మిమ్ము శిక్షింపుమని విన్నపములాయె

అని జ్ఞాపకం చేసింది.

అట్టె శిక్షింపుమని అచ్యుతుడు బలికి
కొట్టుమని బంగారు కోల చేతికిచ్చె

వెంటనే సత్య—

బంగారుకోల తానటు పారవైచి
యెక్కువ తక్కువలు ఏమి ఆడితినో
మన్నింపుడని విభుని పాదాలు వొత్తె.

అంతటితో అనుకూల నాయకుడైన కృష్ణుడు

కొడుకుల కనుకొ్కవె కుసుమ సిరిగంధి
మనుమల నెత్తవే మనసిజగంధి

అని దీవించి అక్కున జేర్చుకొన్నాడు. అంతలో అలక, అంతలో ఈర్ష్య. అంతలో అనురాగం వెలిబుచ్చే ఈ సత్యభామ గారం చేస్తూ మురిసి మురి పించే తెలుగు ప్రౌఢలా కన్పించి ప్రియము గొలుపుతోంటుంది.

పారిజాతపల్లవి అనే పేరుతో మరోపాట ఉంది. ఆ పదకర్త సత్యభామని వేశ్యకాంత అంటాడు. అందులోని కథావస్తువు పారిజాతాపహరణం. కోప గృహంలో చేరిన సత్యభామ

పూరింటిలో నొక్క కేలడుగు మంచముపయి
చీరొక్కటి పరుచుకు పవళించెను

ఆమె ఇంటికి వచ్చిన కృష్ణుడు

కనకపు మేడలు రంగస్థలములు కలిసి వెతకదొడగె
మెత్తని పానుపు వెదకే మేరామడుగుల వెదకే
చిత్తరువును వీక్షింపుచు తనచిత్తము కిట్లనెను.
కలహంసలు నడువవుగా కలియదు యింతులరామా
అమర మృదంగము తంతుల బట్టరు హరిపాదగారాసూ
ఇన్నాళ్ళవలె లేమ సుదతి మందిరమేమొ
చిలుకకు పద్యం చెప్పదు కాంతా
యెలమి వేళలాపనుల శాయదూ పంకజముఖి కేమో
సిరిముఖి యేమో చిన్నబోయున్నది
చెలియతోటి యెవరైనా గాని
పన్నగముని తెచ్చిన యా పారిజాతపూ మాట
విన్నపంబులు జేసిరి కాబోలు
మా వెన్నెల మొలకగుమా

అని చింతిస్తూ చేరనరిగాడు. ఆమెను అనునయించేందుకు పారిజాతపు పూవును రుక్మిణికి

మొగమాటమ్మున ఇచ్చితి గానీ
మోహమ్మున గాదే ' అంటాడు
యికను చక్కని పారుజాతం కొని తెత్తును
నీ సరసవనంలో మక్కువతో నాటింతు

అని బాస చేస్తాడు. ఈ పదంలో కోపావిష్టయైన సత్య పాదాలమీద పడిన కృష్ణుని తన్నదు. అంతే కాకుండా ఇంద్రుణ్ణి గెలిచి పారిజాతం తెచ్చి సత్య కేళికా సరసికెలన నాటించినా పూవులన్నీ తుమ్మెదలై రుక్మిణిపైనే వ్రాలాయట.

సత్యభామ తోటలో పూచిన పూవులన్నీ
రుక్మిణి కడకపుడూ వెళ్ళే
తుమ్మెదలు యీ పూవులన్ని రుక్మిణిపయి వ్రాలెను
వేశ్యకాంతవూ గనుక నీ పువ్వులన్నియు
ముట్టరావనీ కృష్ణుడు బలికె
పూచిన పువులన్ని రుక్మిణిపై వ్రాలె
నచే మాకు యీ రవ్వయేల నీ నారదుడాడె

ఒక్క పువ్వుదెచ్చి వనితలకూ నాకూ జగడం పెట్టావిక చాలని నవ్వుతూ కృష్ణుడు నారదుణ్ణి తీసుకొని రుక్మిణి అంతఃపురానికి వెళ్ళాడు. నారదుడు శ్రమ ఒకరిదీ ఫలము మరొకరిదీ అయిందన్నట్లు

పారిజాతచెట్టు సత్యభామ పెరట వేయుచేగాని
పూచిన పువులన్నీ నీపైన వ్రాలెగదే'

అనుచూ రుక్మిణిని అభినందిస్తాడు.

లక్ష్మీదేవి సొగటాలాట మరోపాట. అందులో లక్ష్మీదేవిని పదకర్త రుక్మిణీదేవిగానే భావించాడు. సొగటాలఆట ఆలుమగల వినోద సాధనంగా పొలయలుకలదారిగా మన దేశంలో ఉంది.

సతీపతులంతట సంతోషమ్మున గూర్చుండి పరుపులమీద
వెండితోజేసిన సొగటాలేమొ లక్ష్మీకాంతుడు దెప్పించి
బంగారు సొగటాల్పాళి పద్మనాభుడు పరిపించె

ముందర పందెము నాదోయనుచు
మురియుచు శ్రీకృష్ణుదుపల్కె
అతివాతోను అడగవచ్చి
ఆభరణములు సొమ్ములుపెట్టె
నేర్పుతో మెడనూళ్ళుబెట్టి
మేలయినా పతకంబునుబెట్టె
ఉరమున ఉత్తర జంధ్యంవేసె
మొలనూళ్ళెమొ మెరయుచునుండా

మోహనాకారుడైన శ్రీకృష్ణుడపుడు—

అందెలు పాదములాబెట్టె
వక్షస్థలమున వనమాలా
అచ్యుతూడు తా ధరియించె
చెక్కిట కుండలములు ధగధగలాడుచు మెరయగను
ముద్దుముఖమ్మున ముత్యపు తిరుమణి
చక్కగ తానూ ధరియించె
నెలవంకాబోలు నెన్నుదురుమీదను
చంద్రవంకా తిలకందీర్చె
పిగిలిచంపలకూ జుట్టీ
పీతాంబరమూ పైనీగప్పి

ఇలా పురుషుడైన శ్రీకృష్ణుడే అలంకరించుకోగా ఇక లక్ష్మీదేవి సంగతి చెప్పేదేమి. ఆవిడా అలంకరించుకొన్న తర్వాత ఇద్దరూ సొగటాలాడసాగారు. అప్పుడా ఆర్తత్రాణ పరాయణుడు పరాభవ ఖిన్నయైన ద్రౌపదీదేవి ఆర్తస్వరం విన్నాడు. విని వెంటనే అక్షయమని పాచికలు విసిరినాడట. పాచిక పడగానే.

కోట్ల పొడుగూన చీరెలు పడెనూ
మేట్లకొలది రవికెలు పడెను
కట్టలేకనూ ద్రౌపదీదేవి
విప్పలేకనూ దుశ్శాసనుడూ
స్వామి మహిమా యిదిఆనితలచీ

ఇన్నేటివాడా విశ్వంభరుడా
చెప్పగ చెప్పచితరమయ్యా
చుక్కల పొడుగున చీరెంరాములు
చొక్కమైన రవికెంజోళ్ళు
గొలుసుహారముస కలవాతెల్లా
పట్టుసికిలు బంగారు సరిగెలు
కట్టుకొనిచే సిరజాజులు

ఇదిచూచి కృష్ణుడు నవ్వాడు. గుమ్మడికాయలదొంగ అంటే బుజాలు తడుముకున్నట్లుగా

నాశిరసావు నల్లనిదాని నాకూ తగదని నవ్వితిరా
పదుహార్వేల మగువల లోపల పణతీ తగదని నవ్వితిరా

అని పరిపరి విధముల అడిగి

హెచ్చుపు నా సిపూ నతులను
వచ్చునకాయదసహోరి కృష్ణా

అని ఆదిలక్ష్మి గారంచేస్తుంది. కొంత సరసంగా కాలక్షేపం చేసినతర్వాత కృష్ణుడు కారణం చెప్పాడు. ఆదిలక్ష్మి కలతదీరింది.

చిలుక రాయబారంఅనే మరొక పాటలో రుక్మిణీకన్య తనకు ప్రాణపదం బయిన పంచవన్నెల చిలుకని "రావే నా విభుని తోడితేవే" అని రాయబారం పంపింది. "విప్రునిచ్చి బంపితి కబురు తెలియదాయె చిలుకరో" అని ఆతృపడి చిలకని రాయబారిగా అంపకం చేసింది. పలుకనేర్చిన చిలుక ద్వారకాపురమందు కనక గోపురాలను చూసింది—

నవ్వుచూవచ్చేటి నల్లవిళ్ళలవార్ని జూసేను
బారాగ వచ్చేటి పచ్చవిళ్ళలవార్ని జూసేను
శృంగార వనమూలా శ్రీకృష్ణాల బొగడా జూసేను
వేగాము గోపురముదిగి చిలుక తావచ్చేనూ
ప్రదక్షిణములుజేసి పాదపద్మముల కొరిగేను

వసుదేవనందనుడు వచ్చి రమణిని చేకొను
చేరువ లగ్నము రమ్మని కృష్ణుతో జెప్పెను

రాయబారం సఫలం చేసుకొని చిలక తిరిగి రుక్మిణిదగ్గరకొచ్చి—

అక్కలొ నాకింత వుక్కిర బెట్టానిచెప్పెనూ
అలియాక సొలియాక భక్తితో గూర్చుండి వినావె

అని ద్వారకాపురిలోని తన అనుభవాల నన్నింటినీ వివరించి చెప్పింది. శ్రీకృష్ణరాయలుకి భీష్మక మహారాజూ రుక్మాంగుడూ చూస్తూవుండగా గౌరిపూజ చేసి వస్తూన్న తన్ను రథంమీద ఎక్కించుకొని రాక్షస వివాహం చేసుకొనేటందుకు పథకంపన్ని రుక్మిణి చిలకద్వారా అందజేసింది. అదే గౌరిదేవిని తాను పూజించి నగరికి రాగను

కనకరత్నమువాలె తాళి పట్టెడగట్టేనా

అన్న కోరికలో సూచించింది.

తులసీదళంఅనే పాటలో శ్రీకృష్ణ తులాభారంఅన్న ఇతివృత్తానికి మూల మైన కథ ద్యోతకమవుతోంది. అదే ప్రథమ పటలములో అభివర్ణితమైనకథ. భర్తృదానం చేసిన సత్యని రుక్మిణి ఉపాలంభించడమూ తర్వాత హరిసమానమైన తులసిని నారదునికిచ్చి రుక్మిణి భర్తను తిరిగి పొందడమూ మధురంగా వర్ణించ బడినాయి.

పట్టంపుదేవినయిన నేను ఇచట నుండగాను
నీకు యింత సాహసంబె వేశ్యకాంతలో
యశోద తనయునీవు దానమీయగాను బుద్ధి
యెవరు జెప్పినారతని తండ్రియుండగా

అని రుక్మిణి సత్య తొందరపాటుకు మందలించింది.

పెండ్లినాడు కట్టినట్టి పాలపూసలేగాని
ఇతర సొమ్ములేవియును నాకులేవుగా

అని సామాన్య వనితరీతిని పేదతనం వెల్లడించి.

అయిన నాకు గలిగినట్టి ముఖ్యమైన వస్తువుండె
యిచ్చెదాను వేగపోయి వేసిచూడుమా

అని తులసిదళాన్ని భక్తితో వేసి భర్తను తిరిగి సంపాదించి భక్తిప్రభా వాన్ని నిరూపించింది.

ఆపాట ద్వితీయ పటలంలో "దోసకారి యెరుకువాడు, తులసి గాలిపారి విష్ణుసాయుజ్యాని కేగడమూ, తృతీయ, చతర్థ పటలాల్లో తులసిమహిమా, ఇష్ట కామ్యార్థ సిద్ధిత్వమూ వివరించబడ్డాయి. ఈపాట చిన్నదయినా నిత్యపారాయణో పయోగిగా వ్యాప్తినందింది.

తెలుగుస్త్రీల జీవితంలో సీమంతము ముఖ్యమైనఘట్టం. మెట్టు. చుట్టపక్కాలు మాతృత్వ భాగ్యానికి నేడో రేపోఅని ఎదురుచూస్తూంటే కాబోయే తల్లుల్ని అలంకరించి, అభినందించే ఉత్సవమే సీమంతంఅని నిర్వచించవచ్చు. సీమంతోత్సవాన్ని రుక్మిణీదేవి సీమంతము అనేపదంలో పదకర్త చక్కగా వర్ణించాడు.

అంతట వసుదేవుడు తన సఖిబాయకు యేతెంచి
మరి అరునెలలాయెనా మన రుక్మిణీదేవికిని
చేదెకు సీమంతములు శాయగవలెనని పలికె
శ్రీకృష్ణుడు యేడనుచూ అడిగెను వసుదేవుండూ
ఆరునెలలాయెను కృష్ణుడు అంగడికే రాలేదు
ఏవేళ శ్రీకృష్ణుడు వేలా స్త్రీలతోనుండూ
పదియారువేలా స్త్రీలతో కృష్ణుడు లోనుండయి తిరుగుచునుండూ
ఒప్పదు యిది నామనసుకు ఎప్పుడు
ఒప్పదనుచు తా బలికేనపుడూ

ఆ పలుకులువిని వెయ్యేళ్ళ పూజారియైన కృష్ణుడెక్కడ నున్నాడోఅని పరి జనులు రాచనగరులన్నీ వెదకి సత్యభామ అంతఃపురంలో చూచారు. వారు చాటున నిలిచి కనుసంజ్ఞలు చేశారు.

భామామణిరో సత్యభామామణిరో
వినవే మనభక్తుడు అక్రూరుడు

సనకువిందు అమరించ వచ్చేనే
ఆ పలుకులువిని చెలియా పతిముఖమూ
తా జూచి వేగము పోయిరా కృష్ణా
వేగ పోయి వస్తానెనా

కృష్ణుడువెళ్ళి తండ్రికి మొక్కాడు. ఆయన కొడుకుని ఆలింగనం చేసుకొని—

ఏమిర కృష్ణ యెన్నడు యింటికిరావు
ఆరునెలలాయెను నీవు అంగటికే రాలేదు
వేడుకతో కొమాళ్ళగని యేటివేళలాయినురాతండ్రి
బాలుడవయి తిరిగేవు గోపాలకులనుగూడి

అని బుద్ధులు చెప్పాడు. తర్వాత సీమంతానికి సరంజాములు చేశారు.

కొడుకూ కోడలు యిద్దరు మేడమెట్లు దిగిరాగా
కన్నుల పండువలాయెను వసుదేవుడికీ
అక్కరో వినవమ్మా మనఅక్కకు సీమంతములూ
కాయగవలెనని కృష్ణులు మిము రా బంపెను వేగా

అంటూ చెలులు షోడశసహస్ర అష్టమహిషుల్నీ చెలికత్తెలు పిలిచారు. ఒక్క సత్యభామతప్ప అంతా చేరారు. రుక్మిణిని అలంకరించి కన్నుల కరవు తీరేలా సీమంతోత్సవం జరిగింది. రుక్మిణి పతిదగ్గరకేతెంచి సత్రాజిత్తు పుత్రిక సత్య అలిగిందని పచ్చలపతకము ఇవ్వబోతుంది.

పాషాణము ఆ సత్యభామ కోపమూ
భామకు అలకలు తీర్చా తరమేకామూ
నక్షత్ర కంఠములా
పంకజాక్షి రుక్మిణి తనపతి చేతికినిచ్చే
మెచ్చుచు కోమలి గుణములు నవ్వుచు
గోపాలుడు వెయి స్తంభాలా మేడలదరికేతెంచే

అలిగిన సత్యకు రుక్మిణి ఇచ్చిన పచ్చలపతకం తీర్చి అలకదీర్చి రుక్మిణికి

నవమాసములునిండి పుత్రజననం అయేవరకూ అక్కడేఆగి పుత్రోత్సవం పిలు పుతో భారసాల పీటలమీద కూర్చునేటందుకు తిరిగి రుక్మిణి అంతఃపురానికి కృష్ణుడు వెళ్ళాడు. పదకర్త స్త్రీ పురుషుల అలంకారాలనీ, కోపగృహంలోని సత్య భామ నడవడినీ చక్కగా వర్ణించాడు. ఆయాపట్టుల్లో ఇతర పదాల్లోని అట్టిపట్టుల రచనలు పోలికలు కన్పిస్తాయి.

భాగవత కథా సంబంధినుత్తైన పాటల్లో గజేంద్రమోక్షం ఒకటి. ఆనంద భైరవిరాగంలో ఆటతాళంలో పాడటానికి వీలయిన ఈ కథాగీతం తెలుగు భాగవతంలోని పదజాలాన్ని పుణికి పుచ్చుకొన్నది. పదకర్త లందరికీ పోతన భాగవతం ప్రియమైనదనేటందుకు అదే తార్కాణం. అందులో బాగా రక్తికట్టిన దశను స్కంధమే భాగవత కథా విషయికములయిన పాటల వ్యాప్తికి కొంతవరకు కారణము. దానికి సాయం తెలుగువారిలో తొణికిసలాడే ఉత్సాహమూ, తుందు డుకు స్వభావ ప్రియత్వమూకూడా కొంతవరకు కారణాలయి వుండవచ్చు. మొత్తంమీద ఆటల్లోనూ పాటల్లోనూ, జానపద కవుల రచనల్లోనూ, విద్వత్క వుల భాగవతంలోనూ కృష్ణభక్తి తెలుగునాట వెల్లివిరిసింది.

## చెంచిత కథ

నారసింహస్వామి చెంచుపడుచునుచూచి మోహించి వివాహమాడిన ఇతి వృత్తం గరుడాచల మహాత్మ్యములో వర్ణించబడింది. పదారువేలపై నూటెన మండుగ్రు భార్యలతో మరొకతెను కలిపితే పరవాలేదనుకున్నారో లేకపోతే కృష్ణుని రసికతకూ, దక్షిణ నాయకత్వానికీ ఒక చెంచుకన్య లేకపోతే లోపంఅనుకున్నాడో ఏమోకాని చెంచీతకథలో జానపదకవి చెంచీత నొక నాయికగా గ్రహించాడు. అష్టమహిషుల గర్వాన్ని అణచేటందుకు వారికంటె అందకత్తెను భార్యగా కొని రావాలని నిశ్చయించుకొని వేటకెళ్ళిన కృష్ణుడు ఒకపొదలో చెంచితను చూశాడు, మంచి మాటలతో చేరదీయాలని చెంతజేరి—

మోమెత్తి ననుజూడు చెంచీత
పచ్చనాకీటెండ్లు పాడుటాకుల చీర
పాహి యేవూరుదానవే
పణతిరో యేవూరుదానవే

ఏడిలో యేమూరుదానవే

మొదట్లో చెంచీత—

ఏవూరు దైతేను మా జోలి మీకేల
వేటకొచ్చేము పోవోయి
అడివేటకొచ్చేము పోవోయి
దుప్పేటకొచ్చేము పోవోయి

అంటూ కృష్ణుణ్ని కసిరింది. కాని మరికొంతలాలించి, చొరవజేసి కృష్ణుడు

"నన్ను పెండ్లాడవే చెంచీతా''

అంటే కరుకుగా

పోవయ్యా కృష్ణుడా
నీకు పొద్దేల పోదయ్యా కృష్ణుడా

అన్నప్పటికీ-

మాయన్నలొచ్చేరు నాసామి
అలుగులే వేసేరు నాసామి
ఏడుగూడెములలో
యెన్నాల కొలదైవమెలు పోతురెడ్డి కూతురా
ఏడుగురు అన్నలు కలదాన్ని

అని తన ఆభిజాత్య గర్వాన్ని ప్రకటిస్తూ చెప్పి, బెదరించింది. ఐనా లయలమారి కృష్ణుడు—

మేనత్త కూతురివె చెంచీత
మనకు మేనరికమున్నదే చెంచీత

అని వరస కలిపేటప్పటికి కొంచెం మెత్తబడింది—

నిమ్మాలగిరిమీద నిమ్మాగ తిరిగేటి
కొమ్మాల గురుపోతు నేశేవా
ఏడుపందుల నెయ్యనేరూతువా
అడవిదుప్పుల నెయ్యా నేరూతువా

అనుపులున్నాజాడ తెలుగూడువా
పుట్టతేనెలుబట్ట నేరూతువా
కొండతేనెలుపట్ట నేరూతువా

అని పరీక్షలు చేస్తుంది. తర్వాత కృష్ణాయత్త మనస్కురాలై–

నాయన్నకొచ్చేదు కృష్ణుడా
గోరింట పూవకోక కృష్ణుడా
పరుగుపరుగునవెళ్ళ కృష్ణుడా

అని ఉపదేశించింది. కాని, కృష్ణుడు–

నీవురా పోదాము చెంచీతా
మనమిద్దరుందాము చెంచీతా
ద్వారకా పురిజేరి చెంచీతా
నిన్ను పెండ్లాడెదను చెంచీతా

అనేసరికి చెంచిత కరిగింది.

నిన్ను గూడెదనయ్య నాసామి
నీమీది మోహము కృష్ణుడా
నేను పట్టలేకున్నాను కృష్ణుడా
పట్టి మాటలచేత కృష్ణుడా
యింతవాదేల పోదాము కృష్ణుడా

అని కృష్ణుని అనుసరిస్తుంది.

ఏడువారాల నగలు ధరించుకొని కృత్రిమ సౌందర్య శోభితలైన (అంతఃపుర కామినీ జనులకంటె) నిసర్గమనోహర పరిసరాల్లో నివసిస్తూండేవారి అందమే రసికులమెచ్చుకోలుకి పాత్రింకావచ్చునని ఈచెంచితకథ నిరూపిస్తుంది. శుద్ధ జానపద కన్యఅయిన చెంచితకథ అందుచేతనే యక్షగాన రూపంలోనూ, పదం రూపంగానూ జానపదులఅభిమానానికిపాత్రమైంది. చెంచితకథ నాటకంజరిగినమరునాడు "నన్ను పెండ్లాడవే చెంచీత" అన్న వాక్యమే ఎల్లరినోటా ప్రతిధ్వనించేదని తమ చిన్ననాటి ముచ్చటలలో డాక్టర్ కె. యన్. కేసరిగారు రచించారు. ఆ వాక్యమే ఈ రచనకిగల ప్రజాదరానికి సాక్షి.

కేశవ నామాలతో కృష్ణుని, అష్టమహిషుల్ని మూడిపెట్టి శృంగార రస

పూరితమైన వర్ణనలతో ఒప్పియుండేపాట ఒకటి జానపద వాఙ్మయంలో వ్యాప్తి గాంచింది. దానిసొంపు వ్యక్తం అయేటందుకు ఎత్తుగడలోఉన్న రెండు చరణా లను ఉదహరించదలుచుకొన్నాను.

కేశవ జూడర కీలుజడలనుపూలు, వేసింది వింతాల మారిదిరా, రాచింది చిత్తరువు అలరాను గంధాము, పూసింది బంగారుబొమ్మ వంటిదిరా, నీసేవ కొచ్చేను నీరజగంది వారిజనాభ ఓ వాసుదేవుడ జూడు.

నారాయణా చిన్ననాటనుండి నిన్ను కోరియున్నది పుష్పకోమలిరా, నారీ రత్నము హంసల నడకాల సుందారి మందర నగధరా యిది పోడ్రిదరా, మంద యానునుగూడి నీసేవ కొచ్చింది నీరజగంధి రుక్మిణిచూడు.

శేనవంశాబ్ది సోముడైన శేషాచల దాసాభిధానుడు సముద్రి మధన కథను మిశ్రమరూపంలో రచించాడు. అందులో పురాణ వృత్తాంతంకంటె గొల్లభామకథే ఎక్కువ. నాలుగువర్ణాలవారికీ గొల్లభామ చల్లఅమ్మడమూ, గొల్లవారి ప్రాముఖ్యమూ, సముద్రి మధన వృత్తాంతమూ, గొల్లభామ కృష్ణుల సరస సల్లాపమూ వివరించబడ్డాయి. ఇది రసపుష్టిలో అంత శ్రేష్టమైనదనలేము. రచనారీతి తెలిసే టందుకు ఒక ఉదాహరణ ఇస్తాను.

గొల్లవారిమమ్మా - మేము చల్లలమ్మేవారమమ్మా
పూని గొల్లవారామమ్మ భోగముల వెలసేమమ్మ ॥గొ॥
మేరుశైలమందు పసుల మేపుచుండేవారమమ్మ ॥గొ॥
తెలివిగల్గి సరస్వతీ తీరమందుండుమమ్మ ।గొ॥
కృష్ణరాయపురము నేటి కృష్ణుని గొలిచెదమమ్మ ॥గొ॥

భాగవత కథా ప్రధానమైన రచనల్లో వామనచరిత్రిఅనే పాటఒకటి. పాట రచించిన కవి పోతన భాగవతంలోని ఈఘట్టాల్ని బాగా హృదయంలో జీర్ణించు కున్నాడు సులభశైలిలో ఆత్మీయత ఉట్టిపడేలా పాటగా వర్ణించాడు. బలిని దానం అడుగవచ్చిన వామనుడు చిరునవ్వు నవ్వుతూ—

అధిక దానంబడుగ అది పాటిగాదు
భూములు పురములు మేలందలములు

నవరత్న సొమ్ములు ధాన్యరాసులును
నాకేమి కోరగావు ఓ యసురరాజ
పృధివి మూడడుగులు దానంబుఇమ్మి
ఇచ్చేటివాడ నిన్నడుగ నేమిటికి
వేదంబులందున శాస్త్రంబులందు
తర్కమీమాంసలను తగ పరీక్షించు
ఛప్పన్నవిద్యలు యెల్ల శాస్త్రములు
నేర్చితిని సకలంబు నేను విడువకను
జగములో గలయట్టి విప్రబృందమును
తడయక నేవిస్తు తగిన పరీక్ష

అని అన్నాడు. పరీక్ష చేయమని కోరడం పదకర్త కల్పన. తెలుగు రాజ సభలలోని మర్యాద.

వామనుడడిగిన దానమీయడానికి బలి నిశ్చయించుకొన్నాడు. అపుడు శుక్రాచార్యడతనితో—

వామనరూపుడై వసుధ జన్మించి
నిన్ను వంచనజేయ యిటకొచ్చినాడు
పొట్టివానికిగాదె పుట్టెడుబుద్ధి
దిట్టతనమున దీని యుడిపించి విడువు
గట్టిగా యితనికి కడుపులోపలను
సృష్టించెసుమి బ్రహ్మ చపలబుద్ధులు
నినుబట్టి పాతాళమున బెట్టుటాకు
వామనుండై వుట్టె వనజనాభుండు
దానంబు అతనికి నీవియ్యవలదు
వట్టి యుక్తులుజెప్పి పంపుమీవాని
గట్టిగా నీపాలి కాలకింకరుడు

అని హితముపదేశించాడు. బలికి ఆ పల్కులు నచ్చలేదు, అందుచేత—

లోకాల కర్తైన శ్రీవిష్ణుమూర్తి
ఆదినారాయణుడు అఖిల రక్షకుడు

పూరితమైన వర్ణనలతో ఒనగ నేనిస్తునంటి
యిచ్చెదనని ఒప్పి మరి మారుమాట
సత్యంబుదప్పి నేపల్కపాడగునె
నారాయణుడుకిప్రుందు నేను మీదాయె
పౌరుషకీర్తులు ప్రాణలు దానంబు
శ్రీవిష్ణునకుఇచ్చి సిద్ధిబొందెదను

అని నిశ్చయించి దానమిచ్చాడు. ఇలాగ కథ రసవంతంగా సాగింది.

ఆట భాగవతమూ కృష్ణకథ అనేపేరుతో ఒకకథ ప్రచారంలోఉంది. దాన్ని రచించిన వారెవరో తెలియదు. ఇది సంగీతంతోటీ నాట్యంతోటీకూడి నాటక కర్తులోనున్న రచన. శ్రీకృష్ణుడు తన అష్టభార్యలకోసం వెతుకులాడటం ఇందు లోని ఇతివృత్తం. ఆ సందర్భంలో కృష్ణుడు తాను తన బాల్యంలో చేసిన గొప్ప పనుల్నీ, తన భార్యల అందచందాల్నీ, వారియెడల తనకున్న ప్రేమనీ వర్ణిస్తాడు. ఈయక్షగాన సరళి రచనలో ప్రధానరసం శృంగారం. వ్యాకరణ విరుద్ధప్రయోగా లున్నా ప్రశంసనీయములైన తెలుగు జాతీయాలతోనూ, మనోహర భావాలతోనూ తొణికిసలాడుతూ ఉంటుంది. దీన్ని శ్రీ సి. నరసింహచార్య M. A., శ్రీ నిడదవోలు సుందరేశ్వరరావుగార్లు పరిష్కరించి ప్రకటించారు. అది ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారం వారి బులెటిన్ మొదటి వాల్యూము సంఖ్య 2 లో చూడవలసిందని కోరుతూ దాన్ని గురించి స్థూలంగా నాలుగుముక్కలు చెప్పదలచుకొన్నాను.

ఈ కలాపం సంవాదరూపంగా ఉంది. ఇందులోన నటనే ప్రధానం. కొందరు దీన్ని కేదారగౌళ రూపంలోనే వినిపిస్తారు. అది విసుగెత్తిస్తుందని కొందరు తోడి, భైరవి, సారంగ, యదుకులకాంభోజి, కల్యాణి రాగాలలో వేరు వేరు భాగాల్ని వినిపిస్తుంటారు. కవి రచనలో చమత్కారం చూపించాడు. అను కరణా వైపరీత్యము (Parody) వల్ల నవ్వుపుట్టిస్తాడు. "ఆదే దేవకిదేవి గర్భ జననం........" అన్న శ్లోకంలో భాగవత కథాసారం ఇమిడిఉంది. జగత్ప్రసిద్ధ మైన ఆ శ్లోకాన్ని అనుకరించి—

ఆదే వేంకటసాని గర్భజననం దాసీ గృహేవర్ధనం
దేవబ్రాహ్మణ కాంచనాప హరణమ్ దుర్భీజ పరిపాలనమ్
ఘోరాకార వికారరూప సదృశం పీచస్య సంసేవితమ్
ఏతత్కాకర కోలుకాని మరణం నెల్లూరి సింహాసనమ్

అనే శ్లోకంలో మాధవుడు "కాకర కోలుకాని" చరిత్రని నిమిష్ని చెప్పి నవ్వు పుట్టిస్తాడు. అలాగే—

గీ॥ బాలికామణి నెమ్మేను పసిడితీగె
పొలతి పొక్కిలి బంగారు పొన్నపువ్వు
కలికి కుచములు జాళువా కందుకములు
కుసుమకోమలి దేహంబు కుందనంబు

అని కృష్ణుడు అన్నదానికి ప్రతిగా—

గీ॥ బాలికామణి నెమ్మేను బర్రెతోలు
పొలతి పొక్కిలి బంగారు పొన్నపువ్వు
భామ చన్నులు నిడుపు సొరకాయతీరు
కుసుమకోమలి దేహంబు కూసుకంపు

అని మాధవుడు వర్ణిస్తాడు.

జానపద రచయితలు తమ పరిసర వాతావరణాన్నీ, కష్టసుఖాల్నీ మరచిపోరు. సమయం దొరికితే వాటిని తమ రచనల్లో చొప్పించేస్తారు. "మా ద్వారకయందు పొన్నలున్ను పొగడలున్ను తులసిబృందావనములున్ను,....క్షేమములా?" అని అడిగిన కృష్ణుడికి "అయ్యా, అవిఅన్నీ నిన్నటి గాలివర్షానికి పోయినవిపోగా కడమ అన్నీ క్షేమమే'' అని వేడుక చెలికాడుచెప్పి ప్రేక్షకుల్ని ద్వారకాపుర వాసుల్ని చేస్తాడు.

ప్రజల్లో ప్రచారంలోఉన్న కొన్ని హాస్యరీతులు రచనల్లోకూడా నిబద్ధమైనాయి. ఉద్ధవుడు కృష్ణుడితో "అయ్యా! మనమిద్దెల్లోనూ మేడల్లోనూ సూర్య చంద్రాదులు వెలుగుతున్నారయ్యా'' అన్నాడు. "అదేమిరా సూర్యచంద్రాదులు వెలిగేదేమిరా?'' అంటే "అయ్యా, పైకప్పులన్నీ నిన్నటి గాలివానకి కొట్టుకపోయి మేడలో ఎండా, వెన్నెలా కాస్తున్నాయయ్యా'' అని వివరిస్తాడు.

శబ్దాలంకారంమీద ఆధారపడిన వ్యంగ్యం అతి సున్నితమైన హాస్య రస ప్రకర్షకి తోడ్పడుతుంది. అలాంటిది ఈఆట భాగవతంలో ఒకచోట కన్పిస్తోంది. ఓరీ అష్టభార్యలున్నూ బెరి (పెన) వేసుకొన్నారురా అన్న కృష్ణుడితో మాధవుడు "స్వామీ! వేసుకొన్నారంటే నగనత్తు (నౌబత్తు) వాయిద్యం చేస్తున్నారేమో

పెయ్యా'' అంటాడు. ఇలాగ హాస్య శృంగారరసము లీరచనలో పాళంగా ఉన్నాయి. భామకలాపం అన్న పేరుతో కూచిపూడివారు ప్రచారం చేస్తున్న కలా పానికిది సాహిత్యవేత్తల దృష్టిలో రొచ్చు. బొమ్మలాటలలోని మోటైన వెగటు హాస్యం ఇందులో లేదు. అందుచేత ఇది అన్నివిధాలా ఆదరణీయము.

## ప్రా సం గి క ము లు

ఇటాలియనుభాషకి తుల్యమని పేరుపొందిన మనభాషా, ఉత్సాహంతో అభిజాత్యగర్వంతో తొణికిసలాడే మన స్వభావమూ మాటనే పాట చేస్తాయి. అందుచేతనే ప్రాసంగికములైన గేయాలెన్నో తెలుగునాట వెలిశాయి. తెలుగు వారిని కదిలిస్తేచాలు తేనెలొలికే కవిత్వం చిందుతుందనే మాట పుట్టింది. దీని కుదాహరణప్రాయంగా ఎన్నో లక్ష్యాల నియ్యవచ్చు.

జో అచ్యుతానంద జోజో ముకుందా
లాల పరమానంద లాలి గోవిందా :

అని చిన్నలకు జోలలుపాడే తల్లులూ, "బంగారుచెంబులో పన్నీరుపట్టుక పణతి రుక్మిణివచ్చె మేలుకో '' అని పెద్దలను లేపే యువతులూ, " మేలుకో ఓ రాజహంసా, మేలుకొను చైతన్యమా" అని ఆత్మచైతన్యం కలిగేలా పాడే వేదాంతులూ గేయకలాపంతో నిత్యకృత్యాల్ని మొదలుపెడతారు.

ఎండెక్కి సూరీడు కొండెక్కి చూసె
గంపకింద కోడి కయ్యమని కూసె

అని కంగారుపడుతూ "గొప్పుతవ్వేకాడ కొప్పెందుకోలె'' అని అలంక రించుకొని అలంకరించుకోకుండా పొలానికి వెళ్ళే కాపుకన్నెలూ—

ఆకుమళ్ళాలోన ఆకెండిపోయె
తోడరాత్రి నీళ్ళంతా బావుల్లనించి

అని పనులు పురమాయించి—

కుప్పా నూర్పులుకాడ కూకున్న పేమ
పండినా సేలోకి పయనమైయెల్లె

అని పనివారిని అదలిస్తూ—

కుప్పా సూర్పులకాడ కూసున్నావేమె
పండినా సేలోకి పయనమైయెల్లే

అంటూ సుగ్రీవాజ్ఞలనిచ్చే గవరయ్యకాపు కంఠంలోంచి జానపద గేయ కవిత్వం అవ్యాహతంగా ఊరుతోంది. (ఇంకా తెలుగు జానపదుల గేయ కవితా శక్తినిగురించి సందేహిస్తారా? ఐతే మీకు చెప్పి మరి లాభంలేదు) ఒక్క గవరయ్యకాపు కంఠంలోంచేకాదు. ఆర్షేయ పౌరుషేయాలుచూసే మనవారు పెళ్ళిళ్లు చేస్తారు. ఆర్షేయం సంగతెలాఉన్నా పౌరుషేయమే ఈ కాలంలో ముఖ్యమైంది. చూడండి. అభావాన్నే ఈ గేయంలో కవి ఎంతచక్కగా వివరించాడో—

అల్లపూరీవారు పిల్లనడిగేరు
పిల్లవానికి రూపురేఖలున్నాయి
ఏచేట పండేటి భూములున్నాయి ॥అల్లి॥

ఊరి పొలిమేరలో తోటలున్నాయి
చుట్టు కొల్లాంకింపు మిద్దెలున్నాయి ॥అల్లి॥

కుర్రవానికి మంచి సేద్యమున్నాది
పిల్లదానికి తగిన యీడుజోడేను ॥అల్లి॥

కన్నె నిస్తామని కబురంపుదాము
అల్లపూరీవారు పిల్లనడిగేరు
ఇల్లలికి ముగ్గెట్టి పెళ్ళిసేతాము ॥అల్లి॥

పెళ్ళిళ్ళు మొదలైన శుభకార్యాలన్నింటిలోనూ ఆడువారిదే గడబిడ. వరస అయినవారిని ఒకరినొకరు వేళాకోళం చెయ్యడం. అదికూడా పాటల్లోనే జరిపించడమూ ఒక్కసొగసే. ఎంత ముభావపు స్వభావంగలవారి గొంతుల్లోనయినా కదలిక కలుగుతుంది. అత్యల్పకాలంలో కొత్త చుట్టరికాలు దృఢతరమయేటందుకు ఈ సున్నితమైన వేళాకోళాలు టంకంలా పనిచెయ్యడంకద్దు. ఎప్పుడయినా ఒకప్పుడు మృదుత్వంతప్పితే దీర్ఘ కలహాలకి దారితీయవచ్చు. అయితే అది చాలా సకృతుఅనే అనాలి. వదినెమరదళ్ళూ, వియ్యపురాళ్ళూ పెళ్ళికూతురివారూ, పెండ్లికొడుకువారూ

వేళాకోళాలాడుకోవడం పరిపాటి. అలాంటి రసవంతమయిన పాటల్లో మచ్చు కొంటికొప్పున ఉదాహరణగా ఇస్తాను—

## వది నె మీ ద పా ట

మందూ పెట్టిందీ వదినే సుందారి మా వదినె
మంచీ మాఅన్నయకు మతులు చెరపిందీ వదినె ॥మం॥

జీలకర్ర బెల్లంలోను, జిల్లేడి మొగ్గల్లోను
హెచ్చైన ఏలగింజల్లో ఏదో కలిపింది వదిన ॥మం॥

లడ్డు జిలేబిలోను, కాజా హల్వాల్లోను
హెచ్చైన కరకజ్జంలో ఏదో కలిపింది వదిన ॥మం॥

మంచి కొబ్బరిలోను, పాలా జిలేబిలోను
హెచ్చైన కాఫీలో ఏదో కలిపింది వదినె ॥మం॥

పంచదార జిలేబిలోను, మైసూరు పాకంలోను
హెచ్చైన పిండివంటలో ఏదో కలిపింది వదిన ॥మం॥

## వి య్యా పు రా లి మీ ద పా ట

వివరామెరుగని వియ్యాపురాలికి విడిదలు చూపితిమి
హెచ్చుగ విడెదలు చూపితిమి
వివరామెరుగని వియ్యాపురాలు విడిదెలొ నుండదుగా
హెచ్చుగ విడిదెలొ నుండదుగా
పలుదోముపుడక పన్నీరుబుడ్డి విడిదెకు పంపితిమి
హెచ్చుగ విడిదెకు పంపితిమి
పారపళ్ళా వియ్యాపురాలూ పళ్ళే తోమదుగా
హెచ్చుగ మొహామే కడగదుగా
అగరునూనె దంతపు దువ్వెన విడిదెకు పంపితిమి
హెచ్చుగ విడిదెకు పంపితిమి
తట్టతలా వియ్యాపురాలూ తలే దువ్వదుగా
హెచ్చుగ సిగే చుట్టదుగా

అత్తరుసీసా సబ్బుబిళ్ళా విడిదెకు పంపితిమి
హెచ్చుగ విడిదెకు పంపితిమి
అబ్బబ్బా యీ వాసన మాకూ అలవాట్లేదనిరీ
హెచ్చుగ అలవాట్లేదనిరీ
కాటుకకాయా కుంకుమ భరిణె విడిదకు పంపితిమీ
హెచ్చుగ విడిదెకు పంపితిమీ
ఏనుగుకళ్లా వియ్యపురాలూ కాటిక తీర్చదుగా
హెచ్చుగ బొట్టే పెట్టదుగా
కాఫీ వుప్మా యిడ్లీయైనా విడిదెకు పంపితిమీ
అబ్బబ్బా యీ కారము మాకూ అలవాట్లేదనిరీ
హెచ్చుగ అలవాట్లేదనిరీ
బనారస్ చీరా మొఖమల్ రవికా విడిదెకు పంపితిమీ
హెచ్చుగ విడిదెకు పంపితిమీ
చింకిరిచీరా వియ్యపురాలూ చీరే కట్టదుగా
హెచ్చుగ రవికే తొడగదుగా

ఇలాంటిదే గజ్జలగుర్రం మా వదినె, గుజ్జుస్వరూపం మా వదినె అనే పాటకూడా. ఈ వేళాకోళపు పాటల్లోని వర్ణనలన్నీ అత్యుక్తులే. పాడేవారుగాని, వినేవారుగాని వీటిని నిజమని నమ్మరు. అయినా అందరూ ఉక్తిప్రత్యుక్తులలో సరసాలాప సౌఖ్యం అనుభవిస్తారు. ఇది తెలుగు జాతీయ జీవనంలోని సుందరమైన ఘట్టం. ఇలాంటి పాటలు శతశా సహస్రశా ఉన్నాయి. వాటన్నింటినీ ఉదహరించడంగాని విమర్శించడంగాని సాధ్యంకాదు. అందుచేత వాటి స్వభావాన్ని మాత్రమే సూచించడం జరిగింది.

పెళ్ళివిందుల్లో బూజంబంతి ఒక ఆచారం. తిన్నంతతిని పారేసినంత పారేస్తూ భక్ష్యభోజ్యాదులతో బంతులాడుతూ అప్పుడప్పుడు మితిమీరే ఈఆచారం నేడు మాయమైందిఅనాలి. కాని దానితాలూకు పాటలుమాత్రం మిగిలాయి. అన్ని పాటలలోలాగే వీటిలోకూడా ఇష్టదైవాల పేరుమీదనే బూజంబంతి సాగుతుంది చూడండి. పాటలు రచించినవారి దృష్టిలో మన దేవుళ్ళెంత నాగరికులయారో—

మహారాజ శ్రీనివాసు బువ్వము మహిమా చూడారే
మంగళాంగి అలిమేలు మంగతోడ నేడు

లడ్డు, ఫేణి ముదిగముల్ సూరత్ ఫేణీలు
చక్కెర లడ్డు ఫేణి ముదిగము సూరత్ ఫేణీలు
బాదంహల్వా బజ్జీలూ ॥మహారాజశ్రీ॥

పొంగల్ విడెదోసె ఇడ్డెన్ పులిహోరల్
చక్కెరపొంగల్ విడెదోసె ఇడ్డెన్ పులిహోరల్
వంగీభాత్ కేసరిభాత్ బగళాభాత్ అన్నీనూ ॥మహారాజశ్రీ॥

పనసపండు మామిడిపండు పచ్చిద్రాక్షా
కమ్మకిచ్చియల్ ఆఫీసువనెర్ కదళీఫలముల్ ॥మహారాజశ్రీ॥

నలుగులు పెట్టడం నాగవల్లినాడు తలగడుగులూ వివాహకాండలో ముఖ్యాచారాలు. కుంటికాలు పీటమీద కూర్చోపెట్టి వెంకయ్య పిచ్చమ్మలకు నలుగులు నలిచినా రాజగోపాలుడూ రుక్మిణీ, మీనాక్షీ సుందరేశ్వరులూ మొదలైన దంపతీ జంటలే పాటల్లో ప్రతిధ్వనిస్తారు.

"నలుచూకు లేచి రారా రాజగోపాలుడా యశోద బాలుడా యింత చలమేలరా" అనీ.

నలుగిడుదు రావయ్యా నలుగురిలోనీవు వదలక నలుగిడు మధుర
మీనాక్షితో ॥న॥
కమ్మలు, జుమికీలు, కంఠసరమ్ములు, కమ్మలు కదలగ ఘనత
మీనాక్షితో ॥న॥
కుచ్చుల దండలు కుచమూపై జారగా మచ్చికలాడేటి మధుర
మీనాక్షితో ॥న॥
చేతిచేకల్లు జగమెల్ల వెలుగగ శాంకరియైన మాచెలియ
మీనాక్షితో ॥న॥
ముక్కున ముత్యంపు ముక్కెర మెరయగ మూడులోకములేలె
ముద్దు మీనాక్షితో ॥నలుగిడ॥

అనే పాటలు పాడడము ఆచారంగా ఉంది. నవ దంపతులలో అనురాగం మొలకెత్తి పెంపుచెందేటందుకూ, మధుర స్మృతుల కాలవాలమయేలాగా, వివా

హాల్లో దంపతులకి బెండ్లాటలాడించేటందుకూ పేరంటాండ్లు ఉత్సహిస్తారు. నవ దంపతుల బెండ్లాటలూ. సొగటాలాటలూకూడా పౌరాణిక దంపతుల లీలావినోదాల ప్రతిచ్ఛాయలులాగే పాటల్లో ధ్వనిస్తాయి. గంధం పూయించడమూ. వసంతాలు చల్లించడంలోకూడా ఇదేతంతూ. అదే ముఖ్యోద్దేశము. మంగళహారతులలో కొట్నాలు దంచడంలో అప్పగింతలలో ఏదిచేసినా పాటలే ప్రతిధ్వనిస్తాయి. ఆపాటల్లో పురాణదంపతుల లీలావినోదాలే పల్లవితములవుతాయి. సర్వం బ్రహ్మార్పణ మస్తు. సర్వం కృష్ణార్పణమస్తు అనే వాక్యాలకిది మధురమైన వ్యాఖ్యయనీ. భాగ వతంలోని చెలిమినైన, భక్తినైన, వైరమునైన భగవంతుని ధ్యానించి, స్మరించి, కైవల్యాన్ని సాధించవచ్చుననే సత్యంపట్ల ఉన్న నమ్మకాన్ని సూచించి ఆచర ణలోపెట్టే సులభ విధానమనీ అనవచ్చు. నిత్య జీవితాన్ని మహోత్కృష్టులైనవారి జీవితంతో ముడివేసి ఆనందించి జీవితమొక పాటల వరుసగా. కలలే నిజములుగా జీవయాత్ర గడిపేభాగ్యం తెలుగువారికీ ఆచారాలవల్ల లభించింది. అది నశించ కుండా కాపాడుకోవడం పునరుజ్జీవింపజేయడం అవసరం.

సాంసారిక జీవితంలోని ఘట్టాల్లో కొమార్తెను అత్తవారింటికి పంపే ఘట్టం కరుణజనకమైందని కాళిదాసుని కణ్వముని మొదలు స్త్రీల పాటల అజ్ఞాత రచయితలవరకూ అంతా అంగీకరించారు. అంపకపు పాటలెన్నో జానపద వాఙ్మ యంలో ఉన్నాయి. వాటన్నింటిలోనూ—

"సెలవిచ్చి మాయమ్మ సెలవిచ్చినామమ్మా
చెలగి మీ అత్తింట్లొ బుద్ధిగ నుండమ్మా
యెవ్వరేమాడిన యెదురాడకమ్మా........"

అంటూ ఆ వరసలో రచించినపాట తలమానికంలాంటి దనిపిస్తుంది. అర టాకువంటిది ఆడజన్మంబు. అని కంట నీరొత్తుకుంటో ఆడబిడ్డని లక్ష్మీదేవితో అభేదంగా భావించి అంపకం చెయ్యడం ఈ తెలుగు జానపద గేయకర్తకే చెల్లింది. ఈ పాటవరసకి ముగ్ధులవడం చేతనే మల్లీశ్వరి టాకీచిత్రంలో సంగీత దర్శకులూ. మాటలూ, పాటలూ కూర్చిన మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ఈ పాటని స్వీకరించి వాడారు. పేరుపేరు వరసలా మగపెళ్ళివారికి పెళ్ళికూతుర్ని అప్పగించే ఆచారంవుంది.

మా బాలరామసుమి మీబాల సుమిత్ర
మాబాల మీబాలగా చూడవలెను

అనే పల్లవితో—

బుద్ధులెరుగదు మంకుబుద్ధులేగాని
బుద్ధివచ్చినదాక దిద్దుకోవమ్మ
ఆడబోయినచోట అట్టెవుండేను
మెల్లగా నేర్పుగా బిలుచుకోవమ్మ
కోడలు మీసొమ్ము కొడుకు మీసొమ్ము
ఆడవారికన్న అలుసంతేనమ్మ
సిరివంటి కోడలు, మరువంటి కొడుకు
మగువరో సౌభాగ్య మహిమ యేమమ్మ

అంటూ పాడుతూఉంటే ఎలాంటివారికైనా మనసు అర్థం కాకమానదు. ఆదే అత్తకోడళ్ళమధ్యా, తోడుకోడళ్ళమధ్యా, ఆడబిడ్డ వదినెలమధ్యా పొరపులు రాకుండా జాగ్రత్తపడేఘట్టం. అది తప్పి బేజోటవడంకూడా కద్దు.

అత్తకోడళ్ళ గృహ కలహాలుకూడా స్త్రీలపాటల్లో ప్రతిధ్వనించాయి. అందుచేతనే.

అత్తలేని కోడళ్ళు ఉత్తమురాలు
కోడలులేని అత్త గుణవంతురాలు

అనేమాట పుట్టింది. చీటికీ మాటికీ కజ్జాకు కాలుదువ్వే అత్తగారితనానికి మందుగా కోడలు—

ఇరుగు పొరుగులార ఓ చెలియలారా
అత్తగారారళ్ళు చిత్తగించండి
పెత్తనం లాగేస్తే పేచీలుపోను

మరో గేయంలో అత్తగారిపోరూ ఆడబిడ్డపోరూ పడలేక పాడిపంటూఉన్న అత్తిళ్ళు వదలి పుట్టింటికిపోయే కోడలికీ దారిలో కలిసిన దారితోడుకీ జరిగిన

సంభాషణ చక్కగా వర్ణించబడింది. అత్తగారి కత్తికోత కోడలి మనస్సులో ఎలాంటి గాయాన్ని కలిగిస్తుందో మనకి తెలుస్తుంది, ఆపాట చదివి చూడండి. సాత్వికమైన సఖ్యం ఎంత గట్టిదో కదా—

ఏవూరు ఏపల్లె గుమ్మడా, ఎక్కడికి ఎళ్తున్నావు గుమ్మడా,
గులకల్లపాడూ తుమ్మెదా, గోదావరి పక్కనే తుమ్మెదా
గులకల్లపాడూ గుమ్మడా, అత్తోరీవూర గుమ్మడా
పుట్టిల్లామాది తుమ్మెదా, గులకల్లపాడే తుమ్మెదా
పాడిపంటఉంద గుమ్మడా, సంతానమూఉంద గుమ్మడా
పాడిపంటఉంది తుమ్మెదా, సంతానమూలేదు తుమ్మెదా
అత్తగారుఉంద గుమ్మడా, నీకు ఆడబిడ్డాఉంద గుమ్మడా
అత్తగారిపోరు తుమ్మెదా ఆడబిడ్డాపోరు తుమ్మెదా
పడలేకనే నేను తుమ్మెదా, పాఊరు పోతాను తుమ్మెదా
పెద్దవోరులేర గుమ్మడా కొంత బుద్ధిసెప్పటానికి గుమ్మడా
బుద్ధిసెప్పోళ్ళకి తుమ్మెదా అసలు బుర్రే లేదనాలి తుమ్మెదా
అత్తలేనియిల్లు తుమ్మెదా అరళ్ళుఉండవూ తుమ్మెదా
అత్తలేనియిల్లు తుమ్మెదా ఆయిగా ఉంటాది తుమ్మెదా
అరళ్ళుగలవాని సెల్లేలా అవతలికి పోతావ సెల్లేలా
ఆడపుట్టుకన్న అప్పయ్యో సెట్టుపుట్టూట మే లప్పయ్యో
పోరుపళ్ళేకా సెల్లేలా నీ అత్తింటికెల్లవే సెల్లేలా
మా అత్తగారితోటి అప్పయ్యో "ఊ" అంటేతప్పు అప్పయ్యో
"ఆ" అంటే తప్పు అప్పయ్యా ఏవన్నాతప్పే అప్పయ్యా
ఆపె సెల్లిపోయిందాక సెల్లేలా "ఆ" అన్న తప్పదే సెల్లేలా
వచ్చినదారినే సెల్లేలా వెంటానె పట్టవే సెల్లేలా
ఇట్ల సెప్పేనాని సెల్లేలా ఏవనుకోకమ్మ సెల్లేలా

పెళ్ళిళ్ళల్లో వేళాకోళాలు నాగరకులమనుకొనే మనలోనే కాదు. గౌరీ కళ్యాణ వైభోగమేఅంటూ పాడుకుంటూ తంగేడుచెట్టుకింద తలంబరాలు, మారేడు చెట్టుకింద మంగళసూత్రాలుగా పెళ్ళాడే పర్వతరాజ పుత్రికలైన అచ్చమైన జాన పద కన్యల వివాహాల్లో సరసమైన హాస్యపు పాటలు ప్రతిధ్వనిస్తుంటాయి. మచ్చుకోసం ఈ పాటని చదవండి.

పెళ్ళి పెళ్ళన్నాడు పెరగమన్నాడే
పెల్లయిన తెల్లారి సగ్గబగ్గోలా
గౌరీ కళ్యాణ వైభోగమే
లచ్చి కళ్యాణ సౌభాగ్గెమే
కన్నమ్మ బాస్కాలు కదలమన్నాడే
వోలేది వంకేది వోపెల్లికొడుకా
బాడికట్టు బియ్యపేయి వోపెళ్ళికొడుకా ॥గౌరి॥
మాబాబు గెడ్డాము బైరిగెడ్డాము
యీనుండె పేనుండె యీతముల్లుండె ॥గౌరి॥
వూరిపోయే నీళ్ళోయి పసుపుతోట్లోకి
పారిపోయే వల్లోయ్ వుల్లితోట్లోకి ॥గౌరి॥
నువుతిన్నయిత్తట్లో మేందిన్నయిత్తట్లో
మత్తుంగ వుండాయి మత్తుగల పెల్లికొడుక
యెత్తెయ్యరాదోరె యిత్తట్లోయని ॥గౌరి॥
అరివేణి కుండలకు అంచులేలేవా
పెళ్ళికొడుకు అబ్బాయికి పెదిమలేలేవా ॥గౌరి॥
కల్యాణం గొట్టంగ గొంతెండిపోయె
గతిలేని పెళ్ళికొడక గంజెత్కురారా ॥గౌరి॥
చెంగోడి చెట్టుకింద బాసికాలు సెయ్యంగ
గన్నేరుసెట్టుకింద కంకణాలిప్పంగ ॥గౌరి॥
పెలికూతులు తల్లెమ్మ పేదముత్తైలు
పనిమకలు *కొగోదేసి సన్నాలు పట్టంగ ॥గౌరి॥

చిత్రవిచిత్ర కీర్తన లనేపేరితో కొన్ని కీర్తనలు జనసామాన్యంలో ప్రచారం గాంచాయి. వాటన్నింటిలోనూ కుటుంబంలోంచి వేరుపడమని భర్తకు భార్యచేపే బోధన రసవంతంగా ఉంది. వేరింటి కాపరంలోని లాభాలు వివరిస్తూ భార్య అరచేతిలో తేనెచూపి మోచేయి నాకించేరీతిగా కన్పిస్తుంది. దాన్ని రచించింది లక్కరాజు గంగయదాసట. జానపద జీవితంలో ఏవిధంగా పొద్దుపుచేసు

* శనిమఖలు

కొనేటందుకు అవకాశాలున్నాయో కూడా మనకా కీర్తనవల్ల తెలుస్తుంది. ఆ దృష్టితో ఈ కీర్తనలోని విషయానికి మరింత ప్రిచారం అవసరం.

వేరుపడితే మేలుగా నాథా కూడియుంటే పోషణా
పాలుపూనక నీవు పాలుపంచుకుంటే
కూలిచేసియు నిన్ను కూర్చుండబెట్టి
సోల బియ్యములోను సారగొట్టి యొకగిద్ద
వెనిటాకులక్రింద వెనకేయనో రోజు ||వేరు||

గిద్ద పెసరాపప్పు గిన్నెతోటనువంచి
వద్దువద్దననీకు వడ్డించి నేతినగ
ముద్దచేసియు కొంత మూల దాచిపెట్టి
పొద్దుటన్నములోకి పొలమునే బంపింతు ||వేరు||

మాటలేవిను కొత్త రాటము మనకొస్తె
పూటకు నే యేడుపుంజాలు నూలొడికి
నేటయిన తలగుడ్డ నీకు నేయించంగ
కోటబొమ్మంచు నా కోకకే మిగిలింతు ||వేరు||

పది రూకలకు నీవు పాడిబర్రెను గొంటె
ముందర కాగినపాలు మాపటింతలబోసి
ఉదయాన పెరుగైన వుంచి నీకొప్పించి
కడమ పెరుగుతో నెలకు కడవ నెయ్యోసేతు ||వేరు||

కట్టడిగ నాప్రజ్ఞ కని చూడు ముమ్మారు
చిట్టితవుడూ నీళ్ళు చిక్కంగనే గలిపి
తొట్టికుడిదాపినే తొలికోడి కుయ్యంగ
తట్టగట్టిమేపి తవ్వెడూ పితికేను ||వేరు||

అత్తమామలవలెనె అతివేగ నాయింట
పెత్తనము గట్టుకొని పెరవారు జూడంగ
ముత్తూమామిడివడ్లు ముందుసాలుకుపండు
కొత్తవడ్లాదాక కోరి నే గడిపేను ||వేరు||

సంప్రశ్నము లేని బిట్టదాపుననున్న
మఱ్ఱిచెట్టుచేను మనపాలు వస్తేను
ఒట్టిమాటలుగావు ఒకయేటి కిస్తంత
బఱ్ఱెపాలుతీసి పయిఖర్చు గడిపేను ॥వేరు॥

గట్టిగా వేరుంటె కడ రేగడి చేనులో
మట్టినడతోలించి మనసొప్ప దున్నించి
కట్టించి నే గొర్రెపెట్టి పెనవేసి
పుట్టెడు వడ్లయితె భుజబందు జేయింతు ॥వేరు॥

వేకువజామునలేచి యేకులయినను వడకి
కాకులూ కుయ్యంగ గడ చిమ్మి యలికి
ఏకు నిర్మల జావిపీరు అన్నమువండి
ఆకు కంచములోను అదిమి నే బెడుదు ॥వేరు॥

కోడికుయ్యగలేచి కోడినా వడ్లన్ని
తోడికోడాలయిన తోడులేకనుదంచి
కూరకుండి వంకాయ కూరనో దినిపింతు
మాడు చెక్కలదినిన మనకేమి గతియందు ॥వేరు॥

కలతజెందిననీవు కష్టమనకను రేపు
నలుగురిని వనగూర్చి అక్కడికి బిలిచి
పొలమునందు యిట్లు పొర్లిద్దుననెపంచి
మొదటి నెలలోనీకు మొలత్రాడు జేయిస్తు ॥వేరు॥

యేపల్ల జూచినను యెవరు పొలముపోరు
దావ పెత్తనదారు బయట దిరిగివచ్చు
నాపలన లాభంబు నన్నడుగు దెలిపేను ॥వేరు॥

మొక్కజొన్నానీవు మొదటనేవెయ్యా
అక్కరకు రాగానె అతివేగ నీటోయి
నక్కలకి నాప్రజ్ఞ చూపించి, ఒకకాకి
వాలకుండగజేతు వన్నెమాటలుకావు ॥వేరు॥

కలవారు మావారు కరమైన మనకేమి

కలవు మా యింటింట కాపురము చేవచ్చు
పొలము మా యన్నలు పోనియ్యమని నిన్ను
ఇకమీద యాగంటి యీశ్వరుని కృపవల్ల ॥వేదు॥

కొండవీటిసీమ కోరికలు దీరంగ
గుంటూరుదరి చూర్పు కరివరం
అందగా కాపురంబుందు గంగయదాసు
ఖండితంబుగ మనము కడసుంటి పనిగట్టు ॥వేరు॥

ఈ పాటలో కొత్త కోడలి జాణతనమూ, జానపదుల మానసిక స్థితికను గుణంగా మాటాడి, ఆశలుగొల్పి తన పథకం సానుకూలం చేసుకోవాలనే దీక్షని కవి చక్కగా వ్యక్తీకరించాడు. ఆలుమగలిద్దరూ పాటుపడి ఎలా ఒబ్బిడిగా సంసారం సాగించుకోవచ్చునో సూచితమైంది. ఖద్దరు ఉత్పత్తీ, పాడిపంటల అభివృద్ధీ గ్రామీణ సౌభాగ్యానికి పునాదులని ఈ పాట స్పష్టంచేస్తోండడం ప్రశంసనీయము.

ప్రాసంగికములైన పాటలెన్నెన్నో తెలుగు జానపదులలో ఉన్నాయి. వాటన్నింటినీ సేకరించి, విషయానుక్రమంగా విభాగించి ప్రకటించి, తెనుగు నుడి కారాన్నీ, జాతీయ జీవిత ప్రతిబింబాన్ని తెలుసుకొని చూచి ఆనందించడం అవసరం.

## బాల బాలికా వాఙ్మయము.

అమాయకులైన బాలబాలికలు దైవస్వరూపులనీ, వారి తొక్కు పలుకుల్లో అలౌకికానందాన్ని కల్పించేగుణం తొణికిసలాడుతూంటుందనీ అన్న విషయం వివాదాస్పదముకాదు. ఈ శతాబ్దంలో బాల వాఙ్మయానికి ఎంతో ప్రాముఖ్యం వచ్చింది. బాల బాలికలకు అవసరమైన, ఉపయుక్తమైన వాఙ్మయ సృష్టికోసం కృషిచేసినవారిలో బ్రహ్మశ్రీ ఆంధ్రవాల్మీకి వావిలకొలను సుబ్బారావుగారు ప్రథమ గణ్యులు. వారి ఆర్యకథా నిధులు ఒక ప్రత్యేక పంథాన్ననుసరించి, ఆర్య సంస్కృతికి అనుగుణంగా బాలబాలికల పెంపకానికి పునాదులు వేసినాయి. ఐతే, అది వచనవాఙ్మయం. ఆ రచనలలోని విషయాలన్నీ ఉపదేశముద్ర ధరించి చెప్పిన విషయాలే. అందుచేత బాలబాలికల వయఃపరిమితికి అనుగుణమైన మాన

సికస్థితిని దృష్టిలో నుంచుకొని రచించిన రచనలు కావనే అనవలసివస్తోంది. ఈ విషయాలను గమనించి శ్రీయుతులు డాక్టర్ గిడుగు వెంకట సీతాపతిగారూ, చింతా దీక్షితులుగారూ, వేకుమళ్ళ కామేశ్వరరావుగారూ గేయాల రూపంలోనూ, శ్రీ మాగంటి బాపినీడుగారూ, శ్రీవిశ్వాత్మల నరసింహమూర్తిగారూ చిత్ర, రూపాలలో కథల రచనలనీ సాగిస్తున్నారు. తెలుగులో బాల వాఙ్మయ సృష్టికే రచయితలూ బాల, బాలమిత్ర, బాలభారత్, పాపాయి మొదలయిన పత్రికలూ ప్రశంసనీయమైన కృషి చేస్తున్నాయి. ఐతే, ఇవన్నీ సమకాలిక రచనలు. ఆనుపూర్వకముగా తెలుగుజాతి రక్తంలో జీర్ణించి, తెలుగు బాలబాలికల నోళ్ళల్లో నలుగుతూ, తెలుగు బాలబాలికలను రంజింపజేస్తూఉన్న వాఙ్మయాన్ని గురించి మాత్రమే పరిశీలించడానికి పూనుకొన్న ఈ సందర్భంలో ఈ సమకాలిక రచనలను విమర్శించటానికీ తలపెట్టడంలేదు. అందుకోసం తప్పుపట్టవలదని విజ్ఞుల్నీ "కాలోహ్యయం నిరవధిర్విపులాచ పృథ్వీ" అనవలసినదని రచయితల్నీ కోరుతున్నాను.

జీర్ణం జీర్ణం వాతాపిజీర్ణం అన్న గేయం ఉగ్గుపాలు తాగుతూ, వాటికోసం "ఉంగ, ఉంగ" అని అవ్యక్తమధురిమతో తమలో అర్థంకానిభాషలో పోరుపెట్టే బాలబాలికలను ఊరడించే తల్లుల గేయంతోనే పురాతన బాలవాఙ్మయం ఏనాడో మొదలయింది అనవలసివుంది. పాలుతాగి, ఊరడిల్లి కుందిలా కూర్చోండి, తాచేలులా తాళి, లేడిలా లేచి ఆటలాడే చిన్నతమ్ముళ్ళీ, చిన్నబిడ్డల్నీ..

తారంగం తారంగం
తాండవకృష్ణా తారంగం
వేణునాథ తారంగం
వెంకటరమణ తారంగం
వెన్నదొంగ తారంగం
చిన్నికృష్ణా తారంగం

అనే పాటతో తాళంవేస్తూ పాట ఆగినా తాళంవేస్తూ, ఆడుకొనే పసిపాపల్ని ఆడించడం తెలుగుదేశంలోని అక్కలికీ, అమ్మలికీ ఆచారమైంది. అన్నం తినేటందుకు పోరుపెట్టే పిల్లల్ని చంకనివేసుకొని బుజ్జగిస్తూ చందమామని చూపించి—

చందమామరావె
జాబిల్లిరావె
కొండెక్కిరావె
గోగుపూలుతేవె
బండెక్కిరావె
బంతిపూలుతేవె
పల్లకీలోరావె
పారిజాతంతేవె
ఛమిడిగిన్నెలో
పాలుపోసుకొని
వెండిగిన్నెలో
పెరుగుపోసుకొని
ఒలవనిపండూ
ఒళ్ళోవేసుకు
ఒలిచినపండూ
చేత్తోపుచ్చుకు
అల్లాఅల్లా తిరిగివచ్చి
అమ్మాయి (లేక) అబ్బాయికిచ్చిపోవే

అని పాడుతూ ఎంత మంకుపట్టుపట్టే పిల్లలైనా సముదాయించడముంది. పేరుపేరు ముద్దల్ని ఆరగించబెట్టడం—

ఆరటిపండరటిపండు
అమ్మన్నముద్ద
పేపేరామన్న
పేర్రాజుముద్ద
అమ్మన్నముద్దనూ ఏమిటన్నారు
అచ్చనావుల పాలన్నారు
అపుడుకాచిన నెయ్యన్నారు
పోగ వేగిన గారన్నారు

పాకముపట్టిన అనిరన్నారహో
పటికపంచదార చిలకన్నారు

అని పసివారి ముద్దులోని మాధుర్యాన్ని అతి స్వభావోక్తిలో జానపదుల హృదయంగమములైన ఉదాహరణలతో వర్ణించడం పాండిత్యమెరుగని నూటి మాటల సహజ గేయకర్తలకే చెల్లుబడియైంది.

"గుడుగుడుగుంచం గుండారాగం" అనీ, "కాళ్ళాగజ్జీ కంకాళమ్మా" అనీ "గుమ్మాడమ్మా గుమ్మాడీ" అనీ, "ఏనుగమ్మా ఏనుగు, ఏవూరొచ్చిందేనుగు" అనీ ఆటలాడని బాలబాలికలు తెలుగునాట మనకు కన్పించరు. "ఉడతా ఉడతా హూత్" అంటూ ఉడతలవెంటబడే బడిదొంగలైన బాలకులూ, సెలవులలో సర దాగా తిరిగే బాలకులూ తెలుగు పల్లెలలో కన్పిస్తారు.

అయ్యా సూరయ్యా,
నీకన్నెక్కు లేవటయ్యా
నీ కాలుకిందా గొయ్యి
నీ పెళ్ళాం ముండమొయ్య

అని అల్లరిచిల్లరి పిల్లకాయలు తమగ్రామంలోఉండే కొంచెం వెర్రిబాగుల వారిని ఉడికిలించి వినోదించి ఇతరులకి వినోదం కల్పిస్తూ, ఆ "సూరయ్య" లకి మాత్రం చిర్రెత్తిస్తారు. విద్యాదాతలై గౌరవనీయులైన ఉపాధ్యాయుల్నికూడా—

"మేష్టరు మేష్టరు మెట్టొంకాయ్
మేష్టరు పెళ్ళాం సిరొంకాయ్"

అంటూ అతని పరోక్షంలోనూ, మేష్టరు చేతిబెత్తం పీఢమలుపు తిరిగి నప్పుడూ ఈ బాలగేయ కర్తలు వందిమాగధ వచనాలతో అజరామరుణ్ణి చేశారు. బాలుర వేళాకోళాలకి ఒక్క మేష్టర్లేకాదు ఊళ్లోఉన్న కోమటీ, కరణం, బ్రాహ్మడు మొదలయినవారంతా లక్ష్యాలవుతారు. చిన్నతనంలో—

కోమటి పిరికి, నూతిలొ ఉరికె, అనీ
కోమటి కోమటి కొత్త బెల్లం

అనీ కోమట్లను ఉడికించనివా రుండరు.

జెమ్ముడు దేమ్ముడు బెడ్డముక్క
దేమ్ముడు పెళ్ళాం సుద్దముక్క అనీ,
బాపనపిరికి నూతిలో ఉరికి అనీ,
కరణం కరణం కాసుల మరణం
తెల్లారిలేస్తే చెప్పుల వరణం అనీ
రాజూరాజూ రావాకు

అనీ ఏకులాలవారినీ వదలకుండా అల్లరిచేస్తూండడం బాలుర లక్షణం. ఇలాగ అల్లరిచెయ్యడంలో బాలికలు వెనకపడరు. కాని, వారి వేళాకోళాలకి ఒకరి కొకరు లక్ష్యం అవుతారు.

సూరీసూరీ చుంచెలకా
మా ఇంటికిరావే మంచెలకా

అనేపాట అలాంటివాటిలో ఒకటి. తెలుగుదేశంలో బాలవాఙ్మయంలో దసరాపద్యాలు ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. అంతేకాదు వంగమాగధ కైవారాలుచేసే భట్రాజు వాఙ్మయంలోకూడా వాటిస్థానం ముఖ్యమైందే. వంది మాగధ కైవారాల్లో అత్యుక్తులకేగాని సహజోక్తులకు తావులేదు. అర్థిజన కుముద చంద్రోదయుడు అసలు లోభికావచ్చు. సాహస విక్రమార్కుడు పిరికిపంద కావచ్చు. కాని, భట్రాజుల దృష్టిలోమాత్రం వారు దానరాధేయులూ, అర్థిజన కుముద చంద్రోదయులూ, సాహస విక్రమార్కులూ, కదన విజయ మార్తాండులూ అనేఅనాలి. భాషలో యమకంకోసం లేనిగొప్పలను ఆపాదించి పొగిడితే ఎలాంటి రాయివంటివాడైనా, ఎంతపొగడ్తకుబ్బనివాడైనా జిల్లుమని మది రంజిల్ల వితరణశాలికాకమానడు. అదే దసరాగిలకలపట్టిన బాలురగురువులూ, భట్రాజులూ కోరేది "మరుజనకమమ్మేలుమత్స్యావతార" అనిమొదలుపెట్టి దశావతారస్తవంచేస్తూ భగ్గుండ చెదరగొట్టుతూ ఏవర్ణంవారింటికివెళ్ళితే వారిమీద పద్యాలను చదువుతూ కైవారాలుచేస్తూ "బాలకులదీవెనలుబ్రహ్మదీవనలు' అనిఉటంకిస్తూచక్కగా వుడుగరలు తెప్పించరయ్యా, అంటూ "అయ్యవారికిచాలు ఐదువరహాలు, పిల్లవాళ్ళకుచాలుపప్పు బెల్లాలు' అనిసూచిస్తూ అల్పసంతోషులై దసరాపండుగులలోకన్పించేతెలుగుబాలకుల తండాలు వారి గురువులతో దర్శనీయులు. ఈ ఆచారం క్రమంగా వెనుకపడటం శోచనీయమనే అనాలి. పంతులు పటాటోపాలు లేకపోయినా అలాటి ఆచారమే

ఈనాడు పాఠశాలల్లో విద్యార్థులూ ఉపాధ్యాయులూ కలిసి సలిపే వినోదయాత్రల్లో (excursions) ద్యోతకమవుతోంది. కాని, నేటి ఆచారాల్లో దసరాలలో కన్పించే ఉత్సాహంగాని బాలబాలికలు తమ ఇండ్లకూ బంధుగుల ఇండ్లకూ తోడి విద్యార్థులనూ తమ ఉపాధ్యాయుల్నీ ఆహ్వానించి గౌరవించి ఆతిథ్యమిచ్చు నలవాట్లను మచ్చుకుగాని మచ్చునకైన కన్పించదు. నేటి విద్యాభివృద్ధి సంబంధమైన యాత్రలు (educational excursions) కేవలం మొక్కుబడివంటివయాయి. అవి గురువుల కుత్సాహకరమైనవని చెప్ప వీలుపడదు. అందుచేత అవి నామమాత్రములై నిర్జీవములైనవి. తెలుగు జాతీయ జీవనంలో ప్రాచీన విద్యావిధానంలో మహార్ణవమి పద్యాలూ గిలకలుపట్టించే ఆచారమూ ప్రశంసనీయములనాలి.

బాల గేయ వాఙ్మయంలో బాలికలదే ఎక్కువ ప్రాముఖ్యం. "ఒక్కా-ఓ చెలియా'' అని గచ్చకాయలు ఆడడంలోనూ, "ఒప్పులకుప్పా వయ్యారిభామా'' అంటూ ఒప్పులగుప్ప తిరుగుతూ, "గూట్లో రూపాయి నీమొగుడు సిపాయి'' అంటూ మృదువైన హాస్యంతో వీరపత్నీత్వ కోరికల్ని వ్యక్తంచేస్తూ, "చెమ్మచెక్క చారడేసిమొగ్గ'' అంటూ గెంతిఆడుతూ, "సుబ్బారాయుడుషష్ఠి చూసివద్దామురండి'' అని తమ భావి తీర్థయాత్రాచరణ కాంక్షిత్వాన్ని వ్యక్తంచేస్తూ, "ముత్యాలపందిట్లో ముగ్గులెడదాము'' అని తమ లలితకళాభిమానీ రంగవల్లికా రచనా చాతుర్యాన్ని సూచిస్తూ—

చందమామ యిల్లుగట్టి
సారపప్పు ఒళ్లోపోసి
అమ్మ నేను చిన్నదాన్ని
అల్లుడొస్తే పంపబోకు

అంటూ తమ సౌభాగ్యాన్ని తెలుగు బాలికలు పాటలలో వెల్లడిస్తున్నారు.

"చిలకమ్మ పెండ్లికి శృంగారముంచిరి" అనీ
చిట్టి మీరేమిటివారె ? చిట్టక్క మీరేమిటివారె ? అంటూ
"గుజగుజరేకులు పడుచుందా ?
గుజ్జారేకుల పడుచుందా ?

అనీ బొమ్మల పెళ్ళిళ్ళుచేస్తూ ఆటలుఆడి పాటలుపాడే తెలుగు బాలికలు, భావి సాంసారిక గృహకృత్య నిర్వహణ బాధ్యతలను వహించేటందుకు వారి మనస్సులను తయారుచేసుకొంటున్నారు.

భారతీయ సామాజిక విధానంలో అవిభక్తకుటుంబం జీవంవంటిది. అదే మన నాగరికత పాశ్చాత్య సామాజిక జీవనంకంటె విభిన్నమైనదని రూపించేటటు వంటిది. ఆ సామాజిక విధానంయొక్క మంచిచెడ్డలను చర్చించడానికిది తావు కాదు. కాని, అవిభక్తకుటుంబంలోని ముఖ్యుల్ని తక్కినవారిని కలుపుగట్టి ఒకరితో మరొకరికి అన్యోన్యం పెంపొందేలా చేయడానికి సామాజికాచారాలు దోహదము చేస్తున్నాయన్నది నిర్వివాదము. వదినెమరదళ్ళూ, వియ్యపురాళ్ళూ, బావమరుదులూ, మామఅల్లుళ్ళూ పరసలాడుకోవడమూ, అలాంటివే. అవే ఆప్తే దగ్గరచుట్టాలుకాకుండా అంతర దొంతర చుట్టాలైనాకూడా వారిని అత్యంత సన్నిహితుల్ని చేస్తుంది. వారి బంధుత్వంకంటె ఆప్తత్వం పెచ్చుపెరుగుతుంది. ఇలాగ పరసలాడే ఆచారం వంగదేశంలో ఎక్కువగా నున్నట్లు శరచ్చంద్రప్రముఖులైన వారి రచనలవల్ల ద్యోతకమవుతోంది. ఆఆచారం తెలుగువారిలోకూడా వ్యాపించి ఉన్నట్లు మనకు జానపదగేయవాఙ్మయంవల్ల రుజువౌతూంది. బాలవాఙ్మయంలోని

బావాబావా పన్నీరు
బావనుపట్టుక తన్నేరు

అంటూ కొత్తబావగారిని మరదలూ, చిన్నబావమరదులూ పట్టించే వేళా కోళంలోనూ "వదినా వదినా వల్లంగిపిట్ట" అని చిన్న ఆడబిడ్డలు తమ కొత్తవది నెను చేసే హాస్యపుపాటలోనూ ఆ ఆచారానికి అంకురార్పణ చేస్తున్నాయి.

"తాతా పీతా ముంజికాయ మూతా" అని ముక్కుచివర కోపంగల తాతని పరసలాడే మనుమడు,

ఎందుండివచ్చితిరి యింత బడలికతోనే
కూర్చుండి చయ్యక లేచిపోవండి
అన్నంబు కూరలు వడ్డించుదామంటె
వండెవారూలేక వండనేలేదు
నీరు మజ్జిగనైన తెప్పించుదామంటె
నిమ్మపండ్లేమియు చిక్కనేలేదు
తాంబూలమైనాను తెప్పించుదామంటె
వక్కలుగడిలోన చిక్కనేలేదు
మంచిదాయెను శీఘ్రంబె లేచిపొండి

మధుర దారిలో మాసత్రిమొకటివుంది
సంభ్రమంబున భోంచేసి సాగిపొండు
మళ్ళివచ్చేడివేళ మధురలో వారుకు
మల్లిమొగ్గలచీర పకటితెండు

అని చేసే వేళాకోళపు అతిథి మర్యాదల కల్పనలో జాణతనంతో కూడిన హాస్యం తొణికిసలాడుతోంది. కొత్తకోడలు పెండ్లికూతురిని పిలిచే అత్తపిలుపులో తెలుగు బాలికల మౌగ్ధ్యమూ, తెలుగు గృహిణులకు పతిమీదగల అనురాగం ఎలా వెల్లివిరిసిపోతూవుంటాయో చూడండి ఈపాటని—

దువ్వెనవచ్చి దొంతిలోవున్నది రావే కోడలా !
దువ్వెనవస్తే నాకేమి ? అది దొంతిలోవుంటే నాకేమి ?
ఈర్పెనవచ్చి ఇరువులో వున్నది రావే కోడలా !
ఈర్పెనవస్తే నాకేమి ? అది ఇరువులవుంటే నాకేమి ?
పూవులువచ్చి బుట్టలోవున్నవి రావే కోడలా !
పూవులువస్తే నాకేమి ? అవి బుట్టలోవుంటే నాకేమి ?
కోకవచ్చి కొయ్యపైనవున్నది రావే కోడలా !
కోకవస్తే నాకేమి ? అది కొయ్యపైవుంటే నాకేమి ?
బొట్టువచ్చి తట్టలోవున్నది రావే కోడలా !
బొట్టువస్తే నాకేమి ? అది తట్టలోవుంటే నాకేమి ?
బ్రాహ్మణులొచ్చి పంచాంగం చెప్పుతున్నారు రావే కోడలా !
బ్రాహ్మణులొస్తే నాకేమి ? పంచాంగంచెపితే నాకేమి ?
పెండ్లికొడుకువచ్చి పీటపైనున్నాడు రావే కోడలా ?
పెండ్లికొడుకువుంటే వస్తా - పీటపైకి నేనూ వస్తా.

తెలుగు బాలబాలికలకు ఉగ్గుపాలతో దైవభక్తికూడా అలవడేలా తెలుగు తల్లులు చేస్తున్నారు.

తప్పట్లోయ్ తాళాలోయ్
దేవుడిగుడిలో బాజాలోయ్
పండూ ఫలమూ దేవునికోయ్
పాలూ ఉగ్గూ పాపాయికోయ్

అని ఉగ్గూ, పాలూ తాగేవయసులోనూ, అంతకంటె కొంచెం పెద్ద కాగానే—

చేతిలో వెన్నముద్ద
చెంగల్వపూదండ
బంగారు మొలతాడు
పట్టుధట్టి
సందిట తావేదులు
సరిగజ్జె మువ్వలు
చిన్నికృష్ణమ్మ
నిన్ను నే చేరికొలుతు

అని సగుణోపాసనని మప్పుతున్నారు. పరంపరగా తెలుగువారిలో వ్యాపించిఉన్న బాల గేయ వాఙ్మయాన్ని బాలానందం - పిల్లలపాటలు అనే పేరుతో శ్రీయుతులు వేదుల సత్యనారాయణశర్మ. కాళహస్తి వీరభద్రస్వామిగార్లు సేకరించి పుస్తకరూపంగా ప్రకటించారు. అంతకుముందే బి. వి. రంగయ్యశెట్టిగారు ప్రకటించిన బాలికా భూషణముకూడా ఇలాంటిదే.

మొత్తంమీద బాలబాలికా గేయ వాఙ్మయం అంతా అతిసులభమైన శైలిలో హృదయంనుంచి సూటిగా పైకివచ్చిన హృదయస్పందనాలు. అక్షర మైత్రివల్లా, భావసౌందర్యంవల్లా అవి నశించకుండా ఉంది తెలుగు బాలబాలికల ఆటపాటల్నీ. అభిరుచుల్నీ ప్రతిబింబిస్తూ నిలిచాయి.

## 10 ప్రకీర్ణములు

జానపదులు పాటలు పాడేది ఒక్క పెళ్ళిళ్ళ సందర్భంలోనేకాదు పొలాల్లో కలుపు తీస్తూ, రోడ్డురోలరు లాగుతూ, గోడలు కట్టేటపుడు మట్టిముద్దలందిస్తూ, మంచె మీదినుంచి వడిసెలరాళ్ళు విసురుతూ తిరగలిలో జొన్నలు విసరుతూ, రోటిలో వడ్లుదంచుతూ పనిబరువు తోచకుండా నోటినిండా పాడుతూ చేతినిండా పనిచేయడం జరుగుతోంది. ఇలాగే వడవలాగేవారూ, చుక్కానికాసే తండేలూ, తెడ్డో, గెడలో వేసే సరంగులూ తత్తత్కాలోచితములైన పాటల్ని పాడుతూ పాటతో

విశ్వజ్ఞాన్ని చీలుస్తూ పడవని సాగిస్తూంటారు. వారి పాటల్లో తీరని కోరికలూ, చేసిన పొరపాట్లూ తారుమారైన పురాణకథలూ, వేళాకోళమూ ప్రతిఫలిస్తాయి. వాటిలో ఆశుకవిత్వం పాలెక్కువా పాతకవిత్వం తక్కువా కన్పిస్తాయి. నిత్య ప్రవాహినీ దేశ్యా అన్ననుడికి సరియైన లక్ష్మములు. అందుచే వాటిని సమగ్రంగా వర్ణించడము ఎవరితరమూకాదు. అందుచేత వాటి స్వభావాన్ని వివరించే రెండు మూడుపాటల్నిమాత్రం ఉదహరిస్తున్నాను.

(1) తగిలింది మెరకా హైసా
కాసేపిల్లా హైసా
కూసేపిల్లా హైసా
.... .... .... .... ....

(2) యేలోయాల - యేలోయాల
యెంతబరువున్నదిర - యేలోయాల
యెత్తరాఅన్నా - యేలోయాల
యేమిసరకురఅన్న - యేలోయాల
బలువు సరుకురఅన్న - యేలోయాల
మంచిసరుకురఅన్న - యేలోయాల
బాగుగా నున్నది - యేలోయాల
బరువుగా యెత్తరా - యేలోయాల

(3) చిన్నోడ చిన్నోడ మేనత్తకొడుకా
కన్నెత్తిచూడరా చిన్నోడ
కౌగిలీఈయరా చిన్నోడ
పున్నమచందురుడూ చిన్నోడ
నీమోముబోలురా చిన్నోడ
యెన్నాళ్ళునుంచోను చిన్నోడ
నీమీదఆశరా చిన్నోడ
ఆడబిడ్డానాకు చిన్నోడ
అడ్డమూఉందిరా చిన్నోడ
మాయింటికాడకీ చిన్నోడ
రాత్రిళ్ళురావోరె చిన్నోడ

మొగుడు ఉండడు రేపు చిన్నోడ
మొగమోటపడకాను చిన్నోడ
వేగమే రావయ్య చిన్నోడ

జానపద జీవితంలో గృహాభ్యంతర విషయాల తర్వాత జాతరలూ ఉత్స వాలూ విశేషప్రాముఖ్యం వహిస్తాయి. అవే వారికి ఆటవిడుపులలాంటిది. ఆనందం అతిశయింపజేసే అవకాశాలు. అలాగే వానవరదలూ ఉప్పెనా మొదలయిన ఉప ద్రవాలు విషాదకరమైనగాధల కాస్పదములై జానపదుల్ని చింతామగ్నుల్ని చేస్తాయి రైలు, ప్యాక్టరీలు, బస్సు మొదలయిన కొత్తవింతలు వారిని ఆశ్చర్యపరవశుల్ని చేస్తాయి. విదేశపు సమాచారాలు విజ్ఞానకరములుగా నుంటాయి. అందుచేత జాన పద కవికి అవి నిత్యజీవితంలో విషయాలు గాకపోయినప్పటికీ వీటినికూడా కవితా విషయంగా గ్రహించడం జరుగుతుంది. తెలుగులో ఇలాంటి విషయాలకుచెందిన జానపద రచనలు లేకపోలేదు. మనకు లభించినవాటిని ప్రకీర్ణ రచనలనుగాభావించి స్థూలంగా పరిశీలించడమే ఈఅధ్యాయంయొక్క ప్రయోజనము. చిరతని తెప్పో త్సవ ఓడపాట, రయిల్‌పాటలు, రంగంపదములు, బాబుదొర కంపెనీతమాషాలు యెల్లల చెరువు ఏరువాక బందరుప్పెన మొదలయినవి అలాంటి ప్రకీర్ణ రచనలే. ప్రకీర్ణ జానపద గేయాల్లో చిరతని తెప్పోత్సవ ఓడపాటఒకటి. తిరుత్తనిలో సుబ్రహ్మణ్యస్వామివారి తెప్పోత్సవాన్ని తెలగుమి పురవాసుడైన రావూరి వెంకటాఖ్యుడు ఓడపాటలా రచించాడు. కవితా విమర్శకుల పాటిస్తూ..

ముందుగా గణనాధుని మగముతోదలచి
వ్యాసవాల్మీకులకును వరుస భజియించి
భాసురంబుగ కాళిదాసు నుతియించి
సకల కవులకు మనస్సంతసమొనర్చి

శ్రీ సుబ్రహ్మణ్యుని చరితను వాడపాటగా రచించ పూనుకొంటాడు.

| | |
|---|---|
| మగువలారా రారమ్మా | సుభ్రొ |
| హ్మణ్యుని జూడరమ్మా | స్వామి |
| నిగమాంత చరితుడమ్మా | సర్వా |
| జగమేలే సరసుడమ్మా | చెలుల |

విగధీశా నాధుడమ్మా జూ౹౹తా
యగణిత తేజుడమ్మా

అటు దక్షిణాదివారి ఇష్టదైవమైన మురుగని ఉత్సవానికి ఒకరినొకరు ఆహ్వానించుకొంటూ భక్తులు బయలుదేరుతారు, చిరతనికి ప్రార్థనలు చెల్లించుకొనేటందుకు వచ్చే యాత్రాయాత జనాన్ని, కవి వీరూ వారూఅనే భావంలేకుండా వివరంగా వర్ణిస్తాడు. అందుచేత మనకు వారివేషభాషలూ, ఆచార వ్యవహారాలూ, ప్రత్యేకతలూ తెలుస్తాయి. కార్వేటినగరంలో వెలసిన ధరణీసురులతో కూడుకొని దొరలు బంగారు పల్లకీలెక్కి శృంగారముగా ఇరుగడలవారలూ విచ్చుకత్తులు పూని వరుసగా భటులు ముందుకురాగా యేనుగులమీద బంగారు వెండి అంబారీలలో కూర్చుండి వందిమాగధులు ముందు పరాకులు చేయగానే బట్టువాయిద్యములు మ్రోయగా చిరతని సేవించేటందుకు వచ్చేవారట. పట్టుబట్టలుకట్టి, రత్నభూషణాలుపెట్టి, సరిగెజల్తారుపాగా, కల్కితురాయి ముత్యాల కుంతసరులూ కరముల కంకణాలు ధరించి అలంకారవంతులైన నగరివారితో కొండపై మహలులో విడిసి దేవాలయంలో సహస్రనామార్చనలూ పిండి దీపారాధనలూచేసి ధరణీసురల పూజించి విప్రసంతర్పణలరసి పూర్వోక్తమయిన దర్జాతో తెప్పోత్సవం చూసేటందుకు ప్రజలెల్ల క్రిక్కిరిసి బహుప్రయాసమున గిజగిజయై తెప్పకని సంభ్రమంతో పులకాంకురితులయేవారట.

ఇక చెన్నపురినుంచి వెళ్ళిన స్త్రీ పురుషులు వన్నెమీరిన చిత్రవైఖరుల పిన్నవలవలు, సరిగ ఫేటుతో హొన్నుమించిన రవికెలు తొడగి సన్నజాజులు మల్లిసరములు ఇంపుగా కొప్పులతోతురిమి, చంపసరములు జాకట్లు జంపులు కమ్మలూ, జడబిళ్ళలూ కెంపుల జూముకీలు, రత్నహారాలు, కరముల కంకణాలు పరిపెనాల్ మెడనూలు నవరాలపేర్లు, నవరత్న బావిలీజోళ్ళు బేసరిబులాకీ, వాసికెక్కిన (పెద్ద) నత్తులు, వంకీలు బిగువుపాటీలు, గజ్జియలు ఘలుఘల్లుమనే మట్టెలు మొదలయిన సొమ్ములు ధరించేవారట. వారితో జతగూడి వచ్చిన పురుషులుకూడా రవలంటు జోళ్ళుధరించి నవమన్మధులులాగ వచ్చేవారట.

చెన్నపురినుంచి వచ్చేవారు రాయపురం స్టేషనులో రైలెక్కేవారట (నాడు సెంట్రల్ స్టేషనులేదు. రాయపురమే ఉత్తరాది దక్షిణాది రైళ్ళు రెండింటిలో కూడలి) నాలుగుమూలలనుంచీ బళ్ళలోనూ రైలుబండ్లలోనూ తిరుత్తనిచేరి

ఆర్జించిన చాతుర్యముల భక్తజనులకు మదికింపుగోరి పురహరతనయుడు కుమార సరసితో తెప్పఉత్సవానికి వేంచేశేవాడట.

అడుగున పిప్పాయిలమరంగబెట్టి
తడయక దూలముల్ దానిపైగట్టి
యరసందులేకను యందు పల్కలను
పడిదారములచేత పరుసగాగట్టి
మేటి బంగరుమేడ మేల్మిగ యొనర్చి
గాటంపు రత్నాల కంబముల్ నిలిపి
.... .... .... .... .... .... .... .... ....
పరస గుళోబులు వాలుషేడ్లును
కరదీపికలు చుట్టుకలసి వెల్లగను
చూచువారల కతి చోద్యంబుగాను
చెంగల్వరాయని శృంగారములను
మంగళకరములై మది చెలంగగను
ఉభజ నాంచారుతో వొప్పుగా నిపుడు
విభవముతోనిదే వేంచేసెజూడ
వాడవాడల స్వామివచ్చి నిల్వగను
యిమగా యెక్కెను స్వామి యీ తెప్పలోను
సుందరంబగు తెప్ప చోద్యంబుగాను
నందరెక్కిరిజూడు దద్భుతంబుగను

అని కిక్కిరిసియుండి చూస్తున్న జనంలో బ్రాహ్మణులు—

ఎప్పుడొస్తిరిమీరు కుప్పావుధాన్లు
యిప్పుడే వస్తిమీ యీచిరుతనికి
బాలయ్య కోటయ్య బాగావున్నారా
చాలగా నందరును చక్కనున్నారు
చిరుతని వాండ్లెవరొ సీతయ్యనీకు
మరి చెప్పనేల యీమాట లేదయ్యా
సుఖమె మనవారెల్ల సూరయ్యగారు
అకలంక చరితులె అమిత బంధువులు

బుఖకొందవయున్న యీ భగవంతు కృపను
వరిపంటలేపాటి వర్షమేపాటి
కలువుపో యీసారి నిరుదెమేలేను
పిల్లేడు. మీ చిన్న పిల్లవాడేడి ?
తల్లిదగ్గర చన్నుదాగు వాడిదిగో
ఆదెమ్మ మీరాక యాశ్చర్యమిపుడు
ఈరేవునింజూడ నిట ప్రాప్తినేడు
పిన్మమ్మ. మీకోడలెన్నేండ్లదమ్మా
యెన్నేండ్లొచెప్పవే యీసిగ్గుబాల్లు
యేడుతో పద్దెనిమిదేండ్లాయెనమ్మా
చిన్నవాడికి పెండ్లి జేయలేవటవే
కన్యకెక్కడ కుదరగా లేదుబోవే

(పాపం కన్యాశుల్కం బాధవల్ల కాబోలు !)

బిడ్డలెందరోయి పేరయ్యా నీకు
యద్దె తీరగలేదు మాయాడదికను
అన్నముబెట్టువా రున్నారయిచట
అన్నిమాటలు మనము యాడుదామచట
పాత్రిలు చేబూని పరగనాబోకటి
సత్రమునకు సరగబోవు స్మార్తులు

ఎప్పొవో దేవరీ వేళత్తైనీకుం
యిప్పొదానడియేనుం యిదె వందన్‌పారుం
వరదయ్యంగాదె నీన్‌వందదెన్నిప్పొ
పెరుమాళశేవైక్కి ప్రీతియాయ్ వందేన్

అని వైష్ణవులూ—

దానాగబందిరో తమ్మజారిప్రి
యీవాగబందవే యీగతెప్పకిక్క
తుంబదినవాయిత్తు నిమ్మదర్శనవు
తంబిగె నీవెల్లితక్కొండుబంది

స్నానెల్ల మాడిదిరి శామణ్ణచారెఱ్ఱి
నానాగిబందు కేళిదనె నిమ్మల్లి
పత్రివళిగళాక బడిశినాట్కోటి
సత్రికె్కహోదరె క్షణదల్లియాగ
బహుళ హోళిగెతుప్పపాయసయదేచ్చ
సహజమండిగె ఫేణిక్షణదల్లిబడిసి
వూటమాడి బేగ వుబ్బరిగెదాటి
జూటల్లననవూతు చురుక్కాగిహోగు

అని కన్నడమధ్య బ్రాహ్మణులు

లచ్చమ్మ నేడాడి నత్రిమంట
లచ్చనంబుగ సామి వచ్చేదిసూదే
పెదపాప చినపాప పెద్దక్కతిమ్మ
కదలివచ్చిరి గొల్లకనికి మారుదిఱ్ఱి
ఈడిగె పెదపోలు యీరమ్మబుచ్చి
వోడుగా వచ్చిరే కూడండియిపుడు
అందరు పైనపై నందేటిలోన
ముందుగా మునిగొచ్చి యెందెవున్నారొ
తెప్పునపోయి పిండి తిరుళక్కువేసి
యిప్పుడొత్తామె మనమీ తెప్పసూడ
లచ్చిసూడే పజను లచ్చోషలచ్చ
లచ్చకోశేమి యింకెచ్చుగానుండు
సూటిగా లెక్కేసి సూసితే యిపుడు
యేటిమీదను నూటయెయ్యియూశుండు
ఇసికెయ్య వసరాలదీ చోద్యమేమే
పసిగూబలతోగూడ పైనుండుగాని
బగు యేడికిదిసూడె చాగయీతెప్ప
దిగువ పాతాళాన దిగియుంటదేమొ
ఆది దబ్బరె తెప్పకదలదదిసూడు
యిది నీల తేలతాడీ యింతలేమొ
మానుగునో పొల్లునో మోసమొచ్చినా

యినమె సామి పచావమిది తెలదెసీకు
తెప్పలో కిగనాలు దీస్కొపొయ్యేరు
తప్పకయ్యోర్లు యేదాలు కూశేరు
తాలాలు యేలాలు తపిటవాశేరు
తాపె చిన్నొదేడె తప్పెనోసూడే
బోగమమ్మంగాండ్లు వాగయాడేరె
సాగిపోతదితెప్ప సుక్కనీలల్లో
పగులొత్తిదీయట్లు బగుయేడికగను
దిగువ నీలతోగూడ దిగియెల్లతాదె
కప్పూరమును సీలకడను యెల్గించి
తప్పక సామికి దండమెడుదామె
సూతయాకును వక్క సూడెచిన్నంగి
యింతకాసుకిదీసి యింకుండునంటీ
బొరుగులు తయ్యేడు వాళ్కో యేస్కోని
కొరుకుతూ సూతామె కూకుండుకోని

అనే శూద్రులూ సల్లాపాలాడుకుంటూ ఉత్సవం చూస్తారట. నానావర్ణాలకీ నానాగోత్రాలకీ చెందిన ఈ యాత్రికులంతా స్వభావసిద్ధంగా కన్పిస్తారు. అలాంటి వారిని కాలవ్యత్యాసంవల్ల కలిగే కొద్ది మాటభేదాలుతప్పి స్తేమనం నేటికీ మన మధ్యని చూస్తుంటాము. ఈ పదకర్త లోకంతెలిసి తెలిపినవాడనే లెక్కసేయాలి. ఈ పదం మన జీవితంలోని చిన్నచిన్న విషయాల్లోని రమ్యతనీ చిన్నచిన్న లోపాల్నీ ఎత్తిచూపిస్తుంది. అందుచేత మనకతి సన్నిహితం అవుతుంది.

మన దేశానికి వచ్చిన కొత్తలో రెయిలుబండి జానపద గేయ కర్తలను కవితావేశపూరితుల్ని చేసింది. అలాగే బస్సూ దానికాలంలో వారి కవితకి విష యాన్ని సరఫరా చేసింది.

బస్సుపుట్టిందోయి బాబు, బస్సుపుట్టిందోయ్
బస్సుపుట్టి బళ్ళవాళ్ళ కడుపుకొట్టిందోయ్

అన్నపాట దానిఫలితమే. రెయిలుబండిని గురించిన పాటలు ఇంతకంటె ఎక్కువగా ప్రచారంలో ఉండేవి. అదే ఆధునిక పారిశ్రామిక యుగాన్ని మన

దేశంలో ప్రవేశం పెట్టిందనవచ్చు. దానిమూలంగానే మనవాడికి వైజ్ఞానిక శాస్త్ర లబ్ధిశక్తుల ప్రభావం తెల్లమైంది. పాతబడిపోవటంచేత మన తరంవారికి రైలుబండి పాటలు వింతగా కనబడకపోవచ్చు. కాని, అది చిత్రములో విచిత్రమని ఎలా అనుకునేవారో జానపద గేయ వాఙ్మయ మూలంగానే తెలుసుకొనడానికి వీలవుతుంది. దండు కన్నయ్య అనే పదకర్త రాసిన ఒకపాటా ఆంతటితో లమిదీరక రాసిన ఒక కీర్తనా, కనుమెట్ట అనంతదాసు శివరామదాసు రచించిన పాట, కీర్తనలూ, వెంకటస్వామిదాసు రాసినపాటా, జానపద వాఙ్మయంలో నశించకపోక నిలిచిఉండి లభ్యమౌతున్నాయి. వీటన్నింటిలోనూ మనదేశంలో రైలుదారిలోని స్టేషన్లు రైలునడిచే విధానం, ప్రయాణీకులు గమనించవలసిన విషయాలూ జానపద సుబోధంగా వివరించబడ్డాయి. వయోజన విద్యావ్యాప్తికి అత్యంత సహకారాలు ఈ పద్ధతిలో ఈ శైలిలో నేటి వయోజన విద్యావ్యాప్తికై కృషిచేస్తున్నవారంతా అవసరమైన వాఙ్మయ నిర్మాణం చేయడం తగిన పనిఅని నా అభిప్రాయం. ఈ పాటలోనుంచి కొన్ని చరణాలు ఆ ఉద్దేశంతో ఉదాహరణలుగా ఇస్తాను. వాటిని పరిశీలించి విజ్ఞులు తగిన నిర్ణయం చేతురుగాక,

రెయిలు బండి, మెయిలుబండి, అయ్యలార చూడరండి బయలుదేరి వెళ్ళనండి పోయేవారు యెక్కరండి; సీమదేశపు చిత్రబండి ఏమితెలియదు మాయబండి ఎంచిచూడ కీళ్ళబండి, వేడినీళ్ళ సత్తువండి, వళ్ళెల్లా మరలేనండె ...దండు కన్నమదాసు దయల్‌బండి చిత్రమదిగోండి జూచుటకు మీరు బయలుదేరి వేగ రారండీ

మూడు యిరుసులచేత నమరింది చక్రంబులను మరిమూటి జోడునకలసి చెలువొంది చూడచోద్యము బొగ్గు నీరునుగూడి యగ్నినిరవులు గొల్పగ గాఢతరముగ పొగలు నెగయుచు ఘణఘణ ధ్వనితోడ బరుగిడు ॥రయల్॥

విరివియైన గదులు గలవారు
ఆ గదులలోపల నరులు అరువది అలరియుంటారు
వరలు లస్తల్‌షేక్‌లాంతరు * మెరుగుటద్దాల్ సొగసు
తలుపులు, గురుగు, లోహపుగొలుసు లిత్తడి
గెడలపై తిరుగుడుల తాళాల్ ॥రయల్॥

---

* ఎలెక్ట్రిక్‌లైట్స్ లేనికాలంలో రయిల్లో దీపాలు.

ముందుగా నింజనపు మరబండి
ఆవెనుక చక్కని కుందనపు మేల్మందసములండీ
ఎందుజూచిన వాలుకుర్చీల్
పొందుపరచిన బెంచిబల్లలు
అందు తూలిక తల్పములు పలు
చందముల కడు నిందొనర్చెడి ॥రయల్॥

కూరి మరలగ గార్డుదొరగారు కొన బండిలోగా చేరియుండి బండియరిగెడి దారులరయుచూ రాకపోకల తీరులనుచూస్తూ స్టేషనుల జేరగానే దిగి బండ్ల క్షేమాన్ని చూసుకుంటాడట. ఘంటానాధం కాగానే బండి కదులుతుందట. అది సంజ్ఞమాత్రమే. డ్రైవర్లలో నొకడు మరద్రిప్పి బండ్లను గుప్పుగుప్పున చిమ్ము మంటలు ఉప్పతిల్లగ చేయుచు చెప్పశక్యముగాని వేగంతో బండి నడపునట. ధూమవర్ణపు కవచధారులిద్దరు.

సోమరితనం ఏమీలేకుండా తైలధారలు వదులుతుంటారట. రెండుపైసలు మైలుకు పీజట, బండియెక్కిన జనులకెల్ల వేర్వేరు టికెట్లుండవలెనట. అంతా లేకుంటే తప్పుపనిగా దండనము కాకుండక మానదట. సొమ్ము ముందుగచెల్లుబడి చేయవలెనట. రైలు దిగిపోవునపుడు దానిని అధికార్లు తెమ్మందురట. ఇలాగ రయిలునుగురించీ, దానిలో ప్రయాణంచేసే పద్ధతుల్నీ అన్నింటినీ వర్ణించాడు. ఇలాగే విమానం విద్యుత్పరికరాల్నిగురించీ పాటల్నుంచే విజ్ఞానం ఎంతత్వరగా జనసామాన్యంలో వ్యాపిస్తుంది !

కొత్తవింత ఏదైనాసరే జానపదుల్ని ఆకర్షిస్తుంది. అందుచేతనే తదేక దృష్టితో దేనివంకనయినా చూసే నాగరికుల్నికూడా జానపదులని వేళాకోళం చెయ్యడం జరుగుతుంది.

కంపెనీలలో ఉద్యోగం చేసేవారు టైమ్తప్పక వెళ్ళడం తిండి బుజాన పెట్టుకొనిపోవడం దేవుడాఅంటూ దూరభారంకూడా పనికోసం పోవడం గంట కొట్టగానే గేట్లుమూసి పనివారికి హాజరువెయ్యడం మనకి నేడు అరిపాటిఆయాయి. ఫ్యాక్టరీలలో, దుమ్ములో, వేడిలో, చెమటోడ్చుకుంటూ పనిచెయ్యడం, బీడీలు కాల్చుకొనేటందుకు అందరికీ ఒకేసారి అవకాశం రావడం మిల్లుపనివారికి నేటి

సామాజిక వ్యవస్థలో పరిచితమే. పని అయిపోగానే బజారుకెళ్ళి ఉప్పు పప్పు కొనుక్కొని స్త్రీలైతే ముస్తాబుచేసుకొని సరదాగా సరసాలాడుకొంటూ చీకటి పడినాక ఇంటికి చేరడం నేడు వింతలుకావు. కాని ఇవన్నీ కొత్త జానపద కవికి వింతల్లా కన్పించాయి. అందుచేత వీటిని బాబుదొర కంపెనీ తమాషాలని చిత్రించాడు.

రంగూన్ నగరానికి కూటికోసమూ మేస్త్రీపనులకు వెళ్ళేఅలవాటు తెలుగు జానపదుల్లో వ్యాప్తిచెందింది. ఆది పూర్వ చారిత్రికయుగంలో జావా సుమిత్రాల్లో రాజ్యస్థాపన చేసిన అలవాటుయొక్క అపభ్రంశమేమో ననిపిస్తుంది. విదేశయాత్ర చేయుటయూ స్వదేశీయ సంస్కృతిని వ్యాప్తిచెయ్యడమూ హర్షించతగినవే. మొదట్లో హర్షించతగిఉన్న అలవాటు కాలక్రమాన పారతంత్ర్యములో మునిగి ఉన్న తెలుగువారిలో వెర్రితలలువేసి నీచవృత్తుల నవలంబించేటందుకు విదేశ యాత్రలుచేసేలా చేసింది. ఆ దేవారికి కోరంగేలనేపేరు సంపాదించింది. కొత్త సమస్య లుత్పన్నంచేసింది. నల్లమందు భాయిలలాంటివారు కాకుండా కష్టసహిష్ణులై పనిచేసి ఇంటిదగ్గరకంటె ఇబ్బడి ముబ్బడిగా సంపాదించి దర్జాలు వెలిగిస్తూ తెలుగువారు బర్మా జాతీయ జీవనంలో ప్రత్యేకస్థానం వహించారు. వారు తమ కొక వార్తాపత్రికని ఏర్పాటు చేసుకొని రాజకీయాల్లో ప్రాముఖ్యతనీ సంపాదించారు చూపోపనిచేత వీరిని వెడలనడవాలని గలాటారేపిన బర్మీయులకు తెలుగు కత్తిదెబ్బ రుచిచూపించారు. బర్మా రెండవ ప్రపంచ యుద్ధారంభంవరకూ మన వలసరాష్ట్రంలాంటిదై మన జానపదుల ఆర్థికవ్యవస్థలో ముఖ్యాంశమై ఉండేది. అందుచేతనే జానపద వాఙ్మయంలో రంగం మోర్మెన్‌లకు స్థానం ఏర్పడింది. సిరిసిరిమువ్వ, రంగంపదము అనేవి ఈ విషయాల్ని వ్యక్తంచేసాయి. సిరిసిరి మువ్వపాట వేరేచోట చర్చించబడింది. ఇక రంగం పదముల్లో మన జానపదుల్ని ఆకర్షించిన రంగూన్ పురవైభవం వర్ణించబడింది, వాటిస రంగూన్ నివాసియైనట్టి సోమన్న రచించాడు.

ఘెటుజూచిన మరియెల్ల గొడుగులట
మేడ మిద్దెలట మెలగుచున్నవట
కోటబొమ్మలట కొత్తళంబులట

అని భవనాన్ని—

రాణీతోటొకటి రమ్యమై యొప్పియున్నదట
రాణువల్లెను చూడబోయియట
రంగుగాను డబ్బిచ్చి చూతురట
శరభ సింహ శార్దూలము గలవట
వరకలి హయములు వానరంబులట
ఆశవిమనుష్యులు అమరుఒంటెలట
అడవిమనుష్యులు అమరుఒంటెలట
తెల్లదుప్పులట పుల్లి (పులి) వేళ్ళుయట
జాంబవంతుడట ముప్పదిరంగుల మూషికంబులట
అగ్నిపక్షులట అడవికోళ్ళట
గరుడపక్షులట గార్ధభంబులట
శుకపికరవములు చూడ చిత్రిమట
అన్ని జాతులూ అమరియుండునట
రారా జూతాము జనులారా రంగూనుపురము

అంటూ రాణీతోట అందచందాల్ని వివరిస్తూ జానపదుల్ని రంగూన్‌పురాభిముఖుల్ని చేశాడు. అదిగో రంగూన్ అనునట్లుగా దాని సొగసుని వర్ణించి ఇదే వారి అన్నట్లు—

కాకినాడ వైశాఖపట్నమట
భీమునిపట్నం కళింగపురమట
పూడి బారువట గోపాలపురమట
ఆరురేవులలో అరమరలేరట
ఏరేవైనా ఒక్కరేటుయట
పన్నెండురూకలు యెనిమిదణాలట
ఇచ్చి వెంటనే తెచ్చిచీటియట
వాడయెక్కినా ఐదోరోజుకు
వచ్చిచేరును యీ రంగపురమట

అని పదం ముగించాడు.

వాన వరద రాకలవల్ల యేల్లలు చెరువుపొంగి హఠాత్తుగా రయిలుకట్ట వెక్కి, బ్రిడ్జిమీదకొచ్చి దాన్ని ఫెడీల్‌మనికొట్టి రయిలుని చుట్టుముట్టింది. అమాయ

దారి రాకదకి పెట్టెలన్నీకూలి ఫెళ ఫెళా విరిగాయి. ఉక్కు ఇంజనుకూడ ముక్కముక్కలైంది. పిల్లాజెల్లా అల్లాడిపోయారు. గుడ్డలూ గుడుసులూ కొట్టుక పోయాయి. ఊపిరాడక కొందరూడ్చుకపోయారు. ఊపిరి ఉన్నవారు ఒడ్డుకు చేరారు. ఎన్నో ప్రాణాలుతీసి ఉసురుపోసుకుందని యెల్లలచెరువు యేరువాకని ఒక పదంలో జానపదకవి వర్ణించాడు. అంతకంటె ఎక్కువలైన 1884 నాటి బందరు ప్పెన భీభత్సాన్ని సీసమాలికలో మరో జానపదకవి వర్ణించాడు. ఈ పదమూ పద్యమూ జానపద కవుల పద సారళ్యానికీ స్వభావోక్తి వర్ణనా వైదగ్ధ్యానికీ తార్కాణం. అందుచేత వాటిని ఇక్కడ పొందుపరుస్తాను.

ఎంతపని చేస్తివే యెల్లలచెరువు యేరువాకా
నీ వెంతపనిచేస్తివే యెల్లలచెరువు యేరువాకా
పీకట్లోవచ్చినావు చెట్టుచేమ కలిపినావు
రయ్యానవచ్చినావు రైలుకట్ట నెక్కినావు ॥ఎంత॥

కారుచీకటికోన గుప్పుగుప్పునరైలు
కూత వేసికొంటు రైలు మోతచేసికొంటువస్తె ॥ఎంత॥

వచ్చేది రైలునిండా వందలున్నారుగదే
వచ్చేది రైలునిండా జనులూఉన్నారుగదే ॥ఎంత॥

బ్రిడ్జిమీదకొచ్చి ఫెడేల్‌న పడిపోతా
చుట్టుముట్టి నీళ్ళు చుట్టేసెనే రైలు ॥ఎంత॥

ఎంత మాయదారివే యెల్లలచెరువు యేరువాక
పెట్టెలన్నీకూలి ఫెళ ఫెళా యిరిగెనే
ఉక్కూఇంజనుగూడ ముక్కలుముక్కలయ్యె ॥ఎంతమాయ॥

పిల్లాజెల్లాగూడ అల్లాడిపోయిరీ
గుడ్డాలు గుడుసూలు కొట్టుకుపోయిరి ॥ఎంతమాయ॥

ఊపిరాడక కొందరూడ్చుకపోయిరీ
ఊసిగాను కొందరొడ్డుకుచేరిరీ ॥ఎంతమాయ॥

ఇన్నిప్రాణాల్తీసి ఉసురూ పోసుకుంటె
ఎన్నాళ్ళు నీబ్రతుకూ ఎవరు మెచ్చుతా
నీవెంత మాయదారివే యెల్లలచెరువు యేరువాకా

ఇలాంటివే మరిరెండు రచనల్లోకూడ వరదవల్లా ఉప్పెన కెరటాలవల్లా కలి గిన ఉపంతం వర్ణించబడింది.

వరదవచ్చె వరదవచ్చె వరదవచ్చెరా
మూడునాళ్ళు కుండపోత ముంచుకొచ్చెరా
వాగులన్నీ చెరువులన్నీ ఒకటిచేసెరా
ఘాత కరువుకంటె ఎంతొ దర్పమైందిరా
పోతరాజుకంటె మిగిలి పొగరువుందిరా
వరదవచ్చె వరదవచ్చె వరదవచ్చెరా
ఇళ్ళుముంచి వొళ్ళుముంచి గుల్లచేసెరా
జొన్నచేలు పంటచేలు మన్నుచేసెరా
వరదవచ్చె వరదవచ్చె వరదవచ్చెరా
పక్షులన్నీ పాములన్ని పారిపోయెరా
వరదవచ్చె వరదవచ్చె వరదవచ్చెరా
వరుణదేవుడికి జాలి తిరిగివచ్చెరా
వానలేదు వరదలేదు వొండు్రమిగిలెరా
వరదవచ్చె వరదవచ్చె వరదవచ్చెరా

1834 లో ఒక్క బందరుపట్నంలోనే 30,000 మంది నశించేలా చేసిన ఉప్పెన కెరటాన్ని ఒక అజ్ఞాతకవి ఎలా వర్ణించాడో చూడండి. కెరటంతో కొట్టుకొనిపోయి తాడిచెట్టు మొవ్వలో చిక్కుపడి అదృష్టవశాన ప్రాణం దక్కించుకొని ఆకవి గురజ గోపాలుణ్ణి ఉన్నప్రజలను రక్షింపుమని సకరుణంగా వేడుకున్నాడు.

వసుధరో రక్తాక్షి వత్సరంబందున రహిమించు కార్తీకమాసమందు
శుద్ధ విదియయందు జయవారమునాడు చిన్నగాలివిసరె శీఘ్రమునను
మిక్కిలి ఉత్తరాన మేఘంబుబుట్టెను చక్కగాగాలియు యెక్కువాయె
ఆగాలి తూరుపున అరజాము వేయగా దేవుడోయని ప్రజలు తల్లడిల్లిరి
ఉప్పుసముద్రముపొంగి గ్రక్కున ముట్టేసినుచిలి బందరు ప్రజల
మచ్చుమాసె
గొప్పవృక్షములన్ని తప్పకవంగెను పక్షిజాతములన్ని చచ్చిపోయె

గోవులు గొర్రెలు చచ్చుట నిజమని తల్లికి బిడ్డల తావుదప్పె
గుండిలిపాలెంబు రూపు మాసిపోయె కోన చిన్నాపురము కోలుపోయె
తిమ్మనపాలెంబు ధూళెత్తగొట్టినా పేదరపాలెంబు నీటగొలిపె
పల్లెటూళ్ళలోను ఇళ్ళు కొట్టుకపోయె దీవలు సాదలు భీతిగనిరి
ఆవార్త దేశాన అలుముకు పోవగా చెప్పుకొనసాగిరి గొప్పగాను
యెల్లమ్మ, పుల్లమ్మ, విన్నావ వెంకమ్మ పేటలో చచ్చిరి కోటిప్రజలు
ఇలలోన ఈవింత యెన్నడు యెరుగము ఇంటింట పీనుగులెన్నియెన్ని
కొట్టుకపోయెను గోతాలుపెట్టెలు బట్టలు బస్తాలు బిళ్ళతోడ
బిళ్ళమోప్పగ నీటిలోనిలిచె నెల్లకుతుకబంటిగ నీస్వాతికార్తిలోన
ఉన్నప్రజలను రక్షింపు మురగశయన గురుజ గోపాల గోవింద గుణ
విశాల

ఇలాంటిదే వర్షాభావంతో బక్కచిక్కిన రాయలసీమలోని

జానపదకవి ఆవేదన వ్యక్తంచేస్తోంది ఈ క్రింది రచన—

వర్షాము గురిపించవయ్యా వేగ
కరువూలు కడతేర్చవయ్యా
పరలోకావాసులూ మొరసేయుచున్నారు
పరమ పావనమూర్తి శరధారములవంటి ॥వ॥

భూపతియాజ్ఞచే పాపాలు కాపులు
తాపమొందుచునరులు వాపోవుచున్నారు ॥వ॥

బక్కయెద్దులతోను దుక్కి బాగోనెదున్ని
పెక్కుపైరులు చెట్టా చిక్కియున్నారయ్యా ॥వ॥

క్రోధనాబ్దమూన భాద్రపదములోనా
కొద్ది వర్షమువస్తే మేది నంతటపండు ॥వ॥
.... .... .... .... ... .... .... .... .... .... ....

అంటు దొంతిరెడ్డి కొత్తరాయుడనే అచ్చమైన జానపదకవి కాటకపు కోరలలో చిక్కిన ప్రజల ఆవేదనని వర్ణించాడు.

గుడిలో గంటలనీ మా పెనుగొండఅనీ రెండు చక్కటి గేయాల్ని విజయ

వాడ రేడియో స్టేషనువారు సేకరించారు. వారు వాటిని జానపద గేయాలనే పరిగణించారు. కాని వాటి రచనల్లోని గాంభీర్యాన్ని పరిశీలిస్తే ఎవరూ అవి కేవలం జానపదుల రచనలని అనుకోలేరు. నేటి అభ్యుదయ రచయితల పగ్రిగతిధాటీ

కడుపుకు కూడూ, కట్టగబట్టా లేకల్లాడే పిన్నల్లారా
లెండో లెండో అన్నాయి నడుములు బిగించుడన్నాయి

అన్న చరణంలోనూ

సాళ్వ అప్పాజీని సత్రాలలో పెంచి
బుద్ధిమంతునిజేసి పంపింది పెద్దొండ

అన్న వాక్యాల్లో ఐతిహాసిక రచనా సూచనలగావించే రచనా చాకచక్యమూ కన్పిస్తాయి. ఈలాంటి పోకడలు శ్రీశ్రీ, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి వంటివాళ్ళ మిగిలిన రచయితల రచనలలో తులతూగుతున్నాయి.

అందుచేత ఈ మధురగేయాల్ని జానపద గేయాలనడం భావ్యంకాదని నా అభిప్రాయం. చదువరులే ఆ గేయాల్ని పఠించి ఈ నిర్ణయమందలి ఒప్పుతప్పులు నిర్ణయించుదురుగాక.

## 11 జానపద గేయ రచనల్లోని ఛందో సంగీత రీతులు

### (1) ఛందో రీతులు.

ఈ అధ్యాయంలోని ఈభాగం రచించేటందుకు నాకు శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి "దేశి" అన్న గ్రంధమూ, శ్రీ చిలుకూరి నారాయణరావుగారి మాత్రాఛందస్సులుఅనే వ్యాసమూ ఏంతో ఉపకరించాయి. అందుకు వారిద్దరికీ కృతజ్ఞుణ్ణి.

క్రీస్తుశకారంభంనాటికే తమిళంలో విజయగీతాలూ ప్రేమగీతాలూ రచింపబడి గ్రంధరూపంగా పోగుచేయబడినట్లు తెలుస్తోంది. వాటిని దేశీయ రచలనే పేరుతో వ్యవహరిస్తారు. వాటిలో అక్షరగణములతో కూడిన వృత్తాలుగాని అలంకారిక విమర్శక మతానుసారమయిన నియమాలుగాని అవలంబింప బడలేదు.

ఈ ప్రాచీన ద్రావిడ కవిత్వం మూడో నాలుగు పాదాలతోకూడిన పద్యాల రూపంలోఉంది. పురనానూరు, అగనానూరు అనేవి అలాంటివే. పురనానూరులో శృంగార రస ప్రధానమైన గీతాలు ఉన్నాయట। త్రి, చతుష్పాది పద్యాలకు సాయం 6, 8, 10, 12 పాదాలుకలవికూడా వాడుక చేయబడ్డాయి. క్రీ॥ శ॥ 9-వ శతాబ్దంనాటికి ద్రావిడ భాషలలోకి స్రగ్ధరావృత్తం రవాణాఐంది. కన్నడ సాహిత్యంలో చంపూకావ్యాలు వెలిశాయి. తెలుగుదేశంలో సత్యాశ్రయుడు మొదలు గాగల చాళుక్యరాజులు దేశి కవితకు ఆలంబనమిచ్చి తెలుగు రచనలను నిల బెట్టినారు.

> మునుమార్గ కవిత దేశంబున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
> గుని విడి రంధ్ర విషయంబున జనసత్యాశ్రయునిదొట్టి చాళుక్య
> నృపతో

ఆ రచనలేవో మనం పేర్లయినా చెప్పలేని స్థితిలో నున్నాము. అవి నశించాయి. కాని తరువోజ, అక్కరలు, సీసములు మొదలైన దేశీయ చంధోరీతులు పరకపరకగా శాసనాల్లో కన్పిస్తున్నాయి.

సంస్కృత ప్రాబల్యంవల్ల ప్రాచీన దేశి రచనలు వరుసగా వెనుకబడి పోయాయి. కాని లింగాయత మతం (వీరశైవం) ప్రబలడంతో జాను తెనుగు ప్రచార సాధనమైంది. పాల్కురికి సోమనాధుడు ద్విపదలలో రచనల సాగించాడు. 13-వ శతాబ్దిలో రంగనాధ రామాయణము రచింపబడింది. క్రమముగా తెలుగులో దేశి రచనలెక్కువ కాసాగాయి.

దేశి రచనా రీతులన్నింటిలోను లయానుగుణములైన మాత్రాగణములే వాడబడుతున్నాయి. అందుచేత అవి పాటకి మంచి వీలైనవి. అక్షరగణ బద్ధములైన సంస్కృతములు పాండిత్య ప్రకర్షకూ చదువుటకూ పనికివస్తాయేగాని పాటకి దేశి వృత్తములంత అనువుగా ఉండవు. ఇవి విద్వాంసుల ఆమోదాన్ని పొందాయి. సామాన్య ప్రజల ముఖస్థములైన పాటలు తరతరములుగా ఎన్నో రచింపబడ్డాయి. కాని వారి నెవరూ గ్రంధస్థము చేయలేదు. వాటిని మార్గకవితతో సమన్వయం చేసినట్లయితే నిలిచేదే. కాని తెలుగు దేశి కవిత కాఅదృష్టం పట్టలేదు కొన్ని రచనలకు మాత్రమే మన లాక్షణికులు లక్షణాలు చెప్పారు. వాటినేనా ఎవరో కొందరుమాత్రమే ఉపయోగించారు. మొత్తంమీద వండితులూ విద్వత్క-

ప్రలూ చేసే ప్రబంధాల్ని అసుంటా ఉండమనడం జరిగింది. అది శోచనీయమైన విషయమే.

తెలుగు పాటల్లోని ఛందోరీతుల్ని వివరించాలంటే మనం ఇతర ద్రావిడ భాషల్లో ముఖ్యంగా తమిళ కన్నడాల్లో వ్యాప్తిచెందిన దేశీయ ఛందాల్ని పరిశీలించాలి. ఈ భాషలు ఒకే కుటుంబానికి చెందినవవడంచేత వాటిలో పోలికలు మనకి స్పష్టంగా కన్పిస్తాయి. అందుచేత తమిళభాషలో వ్యాప్తమైయున్న కొన్ని దేశి ఛందాల లక్షణాల్ని వాటికి తెలుగులో కొన్ని ఉదాహరణల్ని ఇయ్యదలచుకొన్నాను. వాటినిబట్టి ఉదహరించిన పాటలు ఈ వరసలో ఉన్నట్లయితే వాటి ఛందోరీతికూడా వీటిలాగే ఉంటుందనడం గ్రహించవచ్చు.

(1) కూత్తైమాన్నై అనేది ఒక తమిళఛందము. ఇందులో తుదిగణంలో తప్ప తక్కిన అన్నిగణాల మొదటి అక్షరాలకీ మైత్రి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు వాటిమైత్రి గణంవిడిచి గణంలోకూడ ఉండవచ్చు. ఈ ఛందంలో ఒక్కొక్క పాదంలో నాలుగేసి మాత్రలున్న నాలుగు గణాలుంటాయి.

బాల గేయ వాఙ్మయంలోని—

(a) గుడు గుడు గుంచం గుండేరాగం
పాముల పట్నం పగడారాగం

(b) చమ్మచెక్క చారెడేసిమొగ్గ
అట్లుపొయ్యంగ ఆరగించంగ

అనే పాటలు ఈ రకపు ప్రబంధాలకి లక్ష్యాలు.

(2) ఒరుఉమాపై అనే మరోఛందంతో పద్యం నాలుగుపాదాల్లోనూ ఒక్కొక్క పాదంలోని మొదటిగణంయొక్క నాల్గోగణంయొక్క మొదటి అక్షరాలకి మైత్రి ఉండాలి.

పువ్వుపేరే జాజిపువ్వు
పురముపేరే అయోధ్యపురము
దేవిపేరే సీతాదేవి

అనే పాట దానికి లక్ష్యము.

(3) తొడై అని మరో ఛందంఉంది. దానిపాదాల్లో తుది గణాలకిగాని అక్షరాలకిగాని మైత్రి ఉంటుంది. వాటిలో అనేక భేదాలున్నాయి.

(a) లాలి శంకర సదాలాలిత కుమారా
లాలి పటుతాండవోల్లాస ఘనధీరా

(b) భూదేవి కూతుర్ని కోయిలావో
జనకుని కూతుర్ని కోయిలావో
దశరధుల కోడల్ని కోయిలావో
శాంతకు మరదల్ని కోయిలావో

(c) పద్దనగూడదమ్మా వినవమ్మా
ఎట్టావు పాలుసుమ్మా
ఎట్టగా గాచిరమ్మా - మాయమ్మ
జుట్టువే ముద్దుగుమ్మా
సుదతి భుజియింపలేకా - నిజపసివ
వేదనకు నిలువలేకా
నొప్పులని చెప్పలేకా చెప్పకను
చెలుల కను గప్పలేకా

అనే పాటలు దీని కుదాహరణములు. ప్రస్తుత విషయం కాకపోయినా చివర ఉదహరించిన పాటలు తొలిచూలి బాలింతరాలి సిగ్గు ఎంత మృధువుగా వర్ణించబడిందో తోడై భేదాల్లో అడియ యెప్పుతొడై అనేదాంట్లో ప్రతి పాదం లోని మొదటిగణముయొక్క తుది అక్షరాల మైత్రి కన్పిస్తుంది. అందుకు అత్యధిక ప్రశక్తిగాంచిన—

గుమ్మడేడే గోపీదేవీ
గుమ్మడేడే కన్నతల్లి
గుమ్మడిని పొడచూపగదె
మా అమ్మ గోపెమ్మా

ఈ ఛందం ఏడుమాత్రలుగల నాలుగేసి గణములున్న పాదములతో కూడిన వృషభగతి రగడ భేదమేమో అనికూడా అనవచ్చు.

(4) కందార్థములు ముందు కందాది ధోరణికలిగి పాటగా మారిన ఛందో విశేషము. దీనికి ఉదాహరణలు వేదాంత విషయ ప్రధానమైన రచనల్లోనే యక్షగానాల్లోనూ కుప్పతిప్పలుగా కన్పిస్తాయి. మచ్చుకి "శ్రీ మధురాధరీ వినవె శేష గిరీశుడ నీదు కేళికాధామమునందు నింతవడి దర్పకరీలలనుడి యంతలో వేమఁ వేటలాడజని వేగమె వచ్చితి తల్పుతీయవే భామా సద్గుణ గుణధామా లావణ్య చతురసీమా అలమేలు మంగనామా" అనేదాన్ని ఉదాహరణగా గ్రహింఁ వచ్చును.

(5) తెలుగు జానపద గేయ ఛందాల్లో షట్పది మరొకటి. అప్పకవి షట్పదిలో ఆరుపాదాలుండాలనీ పాదానికి ఆరింద్రగణములూ ఒక చంద్రగణమూ పాదంలో మూడు ప్రాసయతులూ ఉండాలని నిర్వచించాడు.

శ్రీ తరుణిరో నే శ్రీరఘురాముడ
జేరి కవాటము తీవే
జేరి కవాటము తీవే
ఖ్యాతిగ శ్రీరఘురాముడవైతే
కోతుల జేరగదో యీ ఘన
సేతువు గూర్పగదో (ఓ) యీ

అనేదానికి లక్ష్యంగా గ్రహించవచ్చును.

భోగషట్పది అనేది షట్పదీ భేదాల్లో ఒకటి. అందులో మొదటి రెండు పాదాల్లోనూ నాలుగేసి మూడుమాత్రల గణాలూ మూడోపాదంలో ఆరు మూడు మాత్రల గణాలూ తర్వాత ఒక గురువూ ఉంటాయి. తక్కిన మూడుపాదాలూ ఇలాగే ఉంటాయి. అందుచేత ఈ ఛందంలో మొత్తము 88 మాత్రలుంటాయి. తెనుగు భాషలోని సువ్విపాట లిలాంటివే—

సువ్వి సువ్వి రామచంద్ర
సువ్వి సువ్వి కీర్తిసాంద్ర
సువ్వి సీతమ్మ మాకు శుభములిమ్మా

అనేది మొదటి మూడు పాదాలకీ లక్ష్యము.

(1) భామినీ షట్పది మరో షట్పదీ భేదము. అందులో మొదటి రెండు

పాదాల్లోనూ 3 + 4 + 3 + 4 మాత్రలున్న గణాలు. మూడో పాదంలో 3, 4, 3, 4, 3, 4, 2 మాత్రల గణాలు ఉంటాయి. మిగిలిన మూడుపాదాలూ మొదటి మూడుపాదాల ఛాయలే. గుమ్మడిపాటి భామినీషట్పది ముత్యాల సరాలు కూడ భామినీ షట్పదులే. తులసిదళం కూడ భామినీ షట్పదిలోనే రచింపబడింది.

తులసి యింట నుండువార్కి
తులసి పూజ చేయువార్కి
తులసియందు భక్తియుంచి కొలుచువారికి
తులసిజూచి మ్రొక్కువార్కి
తులసి యనుభవించువార్కి
తెలిసి నీవు వారిదిక్కు తొంగిచూడకు

(d) పరివర్ధిని షట్పదిలో మొదటి రెండు పాదాల్లోను నాలుగు నాలుగేసి మాత్రల గణాలూ. మూడోపాదంలో ఆరు అలాంటి గణాలు ఒక గురువూ ఉంటాయి. ఇలాగే తతిమ్మా మూడు పాదాలూ ఉంటాయి. ఇందులో మొత్తం 116 మాత్రలు ఉంటాయి.

(e) వార్ధిక షట్పదిలో మొదటి రెండు పాదాల్లోనూ నాలుగు ఐదేసి మాత్రలుగల గణాలు, మూడోపాదంలో ఆరు, అలాంటి గణాలూ తర్వాత ఒక గురువూ ఉంటాయి. ఇతర షట్పదుల్లోలాగే మిగిలిన మూడుపాదాలు మొదటి మూడింటి ప్రతికృతులే. తెలుగులో ఈ షట్పదీ ఛందాలన్నింటికీ చెందిన పాటలు ఉన్నాయి.

(6) అష్టపది; నాగవర్మ ఛందోంబుధిలో ఒక అష్టపదిని ఉదాహరించాడు పాదానికి నాలుగేసి మాత్రలున్న గణాలు రెండుంటాయి. అలా ఎనిమిది పాదాలు చివరకు ఒక నాలుగు మాత్రల గణము గగమూ చేరుతాయి. దాసర పదాలూ కొన్ని స్త్రీల పాటల్లోనూ ఈ ఛందం ప్రత్యక్షమౌతుంది.

(7) ద్విపద తెనుగు జానపద ఛందము. ఇందులో పాదానికి మూడింద్ర గణాలూ ఒక సూర్యగణమూ ఉంటాయి. యతిగాని ప్రాసగాని ఉండవచ్చు లేదా లేకపోవచ్చు. ఈ నియమం లేకుండా వరుసగాఉండే ద్విపదలకి మంజరీ ద్విపద అనేపేరు. ఈ ఛందమే జానపద రచయితలు అతి విరివిగా వాడారు.

నివ్వర్ణపులుకూడా కొంత నిరసించినా పోనీఅన్న దృష్టితో చూశారు. ద్విపద రెండుపాదాల్లోనూ సమాన యతిఉండి అలా నాలుగు ద్విపద పాదాల్లో ప్రాస నియమాన్ని పాటిస్తే తరువోజ తయారవుతుంది.

తమిళ, కర్ణాటక, తెనుగుభాషల్లో గణాల లక్షణాలను పరిశీలిస్తే ఒక విషయం తేలింది. తమిళభాషలో కొన్ని గణాల్ని తొలగించి కర్ణాటకులూ వాటిలో మరికొన్నింటిని తొలగించి తెలుగువారూ స్వీకరించారు. సూర్యగణాలలో చివర గురువున్నదీ, ఇంద్రగణాల్లో చివర రెండు గురువులున్నదీ, చంద్రగణాల్లో చివర మూడుగురువులున్నదీ తెలుగులోలేవు. అవి కర్ణాటకభాషలో ఉన్నాయి. ఇలా తెనుగువారివి వదలుకోవడానికి అవి చెవికింపుగా లేకపోవడమే కారణమై యుంటుందని చిలుకూరి నారాయణరావుగారి అభిప్రాయము. ఇలాంటి సంస్కరణములవలననే తెనుగు తేనెసోనెలు కురుస్తూ సహజమైన సంగీత మాధుర్యము కలదయింది. ఏలపాటలు జానపద వాఙ్మయంలోనూ యక్షగానాల్లోనూ విరివిగా వాడబడ్డాయి. ఏళె అనేది కర్నాట జాతులలో ఒక ఛందం. కాని కర్ణాటభాషలో ఛందానికీ తెనుగు దేశీయ ఛందానికీ తేడాలున్నాయి. సోమనాథుడు బసవ పురాణాన్ని ఏలలుపెట్టి పాడినట్లు చెప్పాడు. ఏల భోగ షట్పదికి చేరువైనట్లు కనిపిస్తోంది.

కళిక, ఉత్కళిక, అర్ధచంద్రికలు మొదలైనవానికికూడ అప్పకవి లక్ష్యాలనిచ్చాడు. తాళబద్ధములైనరచనల్లో ధవళములు, మంగళహారతులు ఏలలుచేరుతాయి. ఇవన్నీకూడ రగడలలో భేదములనీ ఆరుతాళాలనుబట్టి వాటిని గుర్తించవచ్చుననీ అప్పకవి సూచించాడు. వ్యావహారిక భాషలోనే ఈరకపు రచనలుండటముచేత ఉదహరించలేదు. తుమ్మెదపాటలు అల్లోనేరేళ్ళు వెన్నెలపాటలు, చిలుకపదములు, కోవెలపాటలు, అప్పగింతపాటలు, శోభనములు, సుద్దులు ఐరేనిపాటలు మొదలైన రచనలన్నీ తాళబద్ధమైన మాత్రాగణ యుక్తమయినవే. జానపద గేయ వాఙ్మయాన్ని ఎంత మడిగట్టుకున్నా మన లక్షణకర్తలూ పండితకవులూ గుర్తించక పోలేరు. అప్పకవీయంలో కొన్ని పాటలకు లక్ష్యపూర్వకములయిన ఉదాహరణలు కన్పిస్తున్నాయి. ఆనందరంగరాట్ ఛందంలో సూళాది తాళకొట్నములూ, దవళములు, శోభనములు, ఆరతిపాటలు కోలలు, ఏలలు, గొబ్బిళ్ళు మొదలయిన పాటలు పేర్కొనబడ్డాయట. గూడూరి వెంకటదాసకవి అనేఆయన బలరామ చరిత్రిలో దవళము సువ్వాలు, శోభనము, ఆరాత్రిక, లాలి మొదలయినవాటిని

పేర్కొన్నాడట. గణపవరపు ప్రబంధరాజ వెంకటేశ్వర విజయ విలాసంలో ధవళము, శోభనము, ఆరాత్రిక సువ్వాల, లాలి మొదలయిన పాటలు పేర్కొనబడ్డాయట. లక్షణదీపికలోకూడ ధవళముల సంగతి ఎత్తుకొనబడింది. ఈ ఉదాహరణలన్నింటికంటె మిన్న అనతగింది సహజ పాండిత్య శోభితుడయిన పోతనామాత్యుని గేయ సాహిత్య ప్రియత్వము. అది జోలపాటని కందపద్యములో ఇమిడ్చి దేశీయగీతికి మార్గఫణితిని చేకూర్చింది.

జోజో కమల దళేక్షణ
జోజో మృగరాజ మధ్య. జోజో కృష్ణా
జోజో పల్లవ కరపద
జోజో పూర్ణేందువదన జోజో యనుచున్

గోపికలు కృష్ణునికి జోలపాడిరి. గోపస్త్రీలు వ్రేపల్లెనుండి తరలి బృందావనము వెళ్ళినపుడు సంతోషసమయంలో ఏలపాటలు పాడారని పేర్కొనబడింది. ధవళములు ఏలలు శోభనములు కొట్నములు లాలిపాటలు మొదలైనవాటికి యక్షగానాలల్లో విరివిగా ఉదాహరణలు కనిపిస్తున్నాయి. జానపద గేయ వాఙ్మయాన్నే గర్భితం చేసుకొన్న ఆ వాఙ్మయ విభాగం జనాదరం పొందిందన్నసంగతి తంజాపురాంధ్రి వాఙ్మయాన్ని పరిశీలించినట్లయితే తెలుస్తుంది. అవి నాటి పండితుల ఆదరం కొంతకొంత పొందిందేమోననేటందుకు చేమకూర వెంకటకవి సుభద్రా పరిణయవేళ కట్టిరి. "మంచి లగ్నమున కంకణముల్ కరపంకజంబులన్ బెట్టిరి. మేనులన్ నలుగుమేలి మృగీ మదచందనంబులన్ జొట్టిరి. కైశికంబుల విశుద్ధ మనోహర పుష్పమాలికల్ పట్టిరి. పేరటాండ్రు ధవళంబులు పాడుచు" అని చెప్పిన పద్యం తోపింపజేస్తుంది. ఇలాగ మొత్తంమీద మాత్రా సంఖ్యా నియమానికిగాని అక్షర గణ నియమానికిగాని లొంగినంతవరకూ జానపద ఛందాల్ని లొంగదీసి లాక్షణికులు లక్షణాలేర్పరచారు. అందనివాటిని అలా వదలేశారు. లయ సమన్వితమైనవవడంచేత వాటిని సహజ కవులు వాడకుండా ఉండలేకపోయారు. దేశీయ గణ లక్షణాల్ని ప్రస్తరించి చూచినట్లయితే ప్రతిపాటా ఏ ఛందో నియమానికో దాసురాలు కాకుండాఉండదు. అందుచేతనే తెనుగుమాట పాటయై వెలిసింది.

## (2) జానపద గేయాల్లో సంగీతము

పదోశతాబ్దంవరకూ తెలుగులో ఉద్గ్రంథాలు లేవనీ నాటి సాంఘికస్థితిని గాని కళా సాంప్రదాయాన్నిగాని తెలుసుకోవాలంటే సంస్కృత గ్రంథాలో ఇతర

వాంకతిమనుడు విషయాలో ఆధారంగా గ్రహించాలి. ఆంధ్రుల సంగీత సాంప్రదాయాన్ని నాటి సంగీత కళనుగురించి, తెలుసుకోవాలంటే మనకి భరతుని నాట్య శాస్త్రము, నారదశిక్ష, మతంగుని బృహద్దేశి శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరము, కొంతవరకు సహాయకారులవుతాయి. "గీతం వాద్యం తథానృత్యం త్రియంసంగీత ముచ్యతే" అని సంగీత రత్నాకరంలో చెప్పబడింది. అందుచేత గీతం వాద్యం నృత్యం మూడూకలిస్తే సంగీతమవుతుందని మనవారు భావించారు కాలక్రమాన నృత్యం ప్రత్యేక కళగా వృద్ధిపొందింది. గీతం వాద్యంకూడ కలిస్తేనే సంగీతం అని నేటి భావనకాదు. అవి కలిస్తేనరే అహ్లాదకరమే. లేకపోయినా కేవల గేయాన్నిగాని వాద్యోత్థిత గానాన్నికాని సంగీతంకాదని ఎవ్వరమూ నిరసించము. సంగీతాన్ని మార్గసంగీతమనీ దేశి సంగీతమనీ రెండువిధాలుగా పరిగణించారు. మార్గసంగీతం శాస్త్రబద్ధమైన ఆర్యుల సంగీతమార్గం దానికి. ఇహంకంటె పరం సాధించటమే ముఖ్య ప్రయోజనం. ఇక దేశి సంగీతం సంగతి అలాకాదు. అది సామాన్య జనులకు మనోరంజకమైనది ఇది అంత శాస్త్రబద్ధమైందిగాదు భరతాదుల సంగీత శాస్త్ర గ్రంథములో దేశి సంగీతరీతులు కొద్దిగా వివరించబడ్డాయి. వాటినిబట్టి ఏలా భేదములు అనేకములున్నాయి. ఏలలేకాకుండా దేశి ప్రబంధములు కూడ లెక్కకు మీరిఉన్నట్లు తెలుస్తోంది. తాళయుక్తం. స్వరోపేతం మధ్యేనాట విరాజితం అయిన గద్యాన్నికూడా గీత విశారదులు పాడేవారట. దేశి గీతాలికి నాటకాల్లోకూడా ప్రయోజనం ఉందనీ ప్రతి తాళం పద స్వరాలతో కూడిన గీతాన్ని గాంధర్వవేదులు వివిధమైన పేర్లతో వ్యవహరించేవారట. క్రౌంచగీతంలో ఒక పాదం రెండోపాదం దేశిలో ప్రాసయుక్తమైఉంటే హంసపదంఅనీ ఆదితాళంతో కూడిఉండే పదంపాటనీ పేర్కొన్నారు. త్యాగ సౌభాగ్య సౌందర్య శౌర్య ధైర్యాది వర్ణనలు విషయంగాగల గీతమే ఏలపాటఅని ప్రాచీన లాక్షణికులు నిర్వచించారు. ఈ నిర్వచనం ఆంగ్లేయ సారస్వతంలో తర్వాత క్రమంగా రూపొందిన వీరగాథల (Ballad) కంటె భిన్నంఅనే అనిపిస్తుంది. ఐతే దేశీయ వాఙ్మయంలో ఏలా భేదా లనేకాలున్నాయని ఏలా నాదవతీ రమ్యా వర్ణాలంకార శోభితాగీయతే మట్టతాలేననాదయుక్తా పదేపదేఅనీ. శృంగారః కరుణోరసఃఅని ముఖ్య రస నిర్వచనాన్ని కైశికీవృత్తిలోనూ. పాంచాలీ రీతిలోనూ ఉండాలనీకూడా మనవా రభిప్రాయం వెలిబుచ్చారు. మాళవరాగంలో లఘుగమకంగల గేయాల్ని, ఏలల్ని పాడారట; తాళవివర్జితమైనది. గద్యం. దాన్నికూడా మేధావులు గీతానుసారివలె పాడేవారు. ధవళములనూ శర్వరీ పదాలనూ ఝంపెలో గానం చేసేవారనీ తెలుస్తోంది దేశీయ సంగీతంలో ద్విపదపల దరువు (ఇదే సంస్కృతంలో ధ్రువా). ధవళము మంగళ

హారతులు ముఖ్యమైనవి. పదాలు పాటలు, ఎన్నోరకాలవి ఉన్నాయి. పదాల్లో ప్రభాత పదాలు (మేలుకొలుపులు) వెన్నెల పదములు (చందమామ పదాలు) కోవెలపదములు, చిలుకపదములు,విరాళిపదములు, గొబ్బిపదములు,నివాళిపదములు మువ్వగోపాల పదములు ముఖ్యమైనవి. అలాగే పాటల్లో లాలిపాటలు, జోల పాటలు, ఏలపాటలు, సువ్విపాటలు, ఉయ్యాలపాటలు, ఐరేనిపాటలు, అప్పగింతల పాటలు, నోములపాటలు, అక్కలపాట, అల్లోనేరెళ్ళు శోభనములు, కొట్నములు, చద్దులు, సుద్దులు, కందార్థములు, దరువులు, చిందులు, కీర్తనలు, సవతుల కయ్యములు ముఖ్యమైనవి.

గీత గోవిందం మొదలైన పదాలకి సంస్కృత వాఙ్మయంలో గౌరవం ఉంది. కాని వ్యావహారిక భాషలో రచింపబడటంచేతనో, మెరుగు బంగారపు ఆలంకారిక నియమాల చాటున బరువైన నగలతో అలంకరించబడలేదనో, పద సరస్వతికి లయయుక్తమై రాగ రంజితమైనప్పటికీ పండితులు అర్హమైన గౌరవస్థానం ఈయలేదు. అతి ప్రాచీన దేశి సంగీతాన్ని గురించి మతంగుడిట్లా అన్నాడు. "నాల్గుస్వరాల్లో సంచారంచేసి పాడేపాటలు మార్గపద్ధతికి చెందజాలవు అలాంటిది సవరలు పుళిందులు, కాంభోజులు, వంగ కిరాత బాహ్లిక ఆంధ్ర ద్రావిడులు మొదలయినవారు పాడుతూ ఉంటారు. ఇది మార్గ సంగీతంలో నిషిద్ధము. దరువులకి మాత్రం ఈ నిషేధం వర్తించదు. అవిమాత్రం మార్గ సంగీతంలో కలుపుకోబడ్డాయి" సంగీత రత్నాకరంనాటికే మార్గ రాగాలన్నీ వాడుకలోనుండి తొలగిపోయి దేశీయ రాగాలే స్థిరపడతాయి. షడ్జగ్రామమే ఈ లౌకిక గానానికి ఆధారం అందుచేత దేశీయ రాగాలన్నీ దీనినుంచే ఏర్పడ్డాయనవలసి వుంటుంది.

నేడు జానపద వాఙ్మయంలోఉన్న అసంఖ్యాకమైన పాటల్ని అన్నింటినీ పేరుపేరు వరసలా ఏ రాగంలో, ఏ తాళంలో పాడాలో వివరించడం కేవలం సంగీతశాస్త్రంలో కృషిచేస్తూ దానికే తమ జీవితాన్ని అంకితం చేసినవారికితప్ప సాధ్యంకాదు. సంగ్రహంగా కొన్నిపాటల్ని అవిఏరీతిగా సంగీత శాస్త్రానికి లొంగుబాటవుతున్నాయని విజ్ఞులు భావిస్తున్నారో చెప్పదలచుకొన్నాను.

"జో అచ్యుతానంద జోజో ముకుందా" అనే జోలపాట అతి ప్రఖ్యాతమైంది. దాన్ని నవరోజ్ రాగంలో పాడవచ్చుననీ జంపెతాళం పడుతుందనీ తెలుస్తోంది. ఏడుస్తోన్న పిల్లల్ని ఊరుకోబెట్టేందుకు వాళ్ళకంటె ఎక్కువ చప్పుడు

చేస్తూ "ఊహూ ఆయీ ఆయీ అపదలు గాయి చిన్నవాళ్ళనుగాయి శ్రీరంగ గాయి" అంటూ పాడే పాటని నెల్లూరులో నాటభైరవీ జన్యమైన రాగంలో పాడుతారు. దీనిలో తాళంలేదు. అదే దేశీయ సంగీతం సహజమైందనీ నియమబద్ధంకాని నాటిస్థితిని ద్యోతకము చేస్తోందనీ రుజువు చేస్తోంది.

ఇక "కొండమీద వెండిగిన్నె", "అట్లతద్దోయి ఆరట్లోయి" అనేవి తెలుగు బాలబాలికల కందరికీ తెలిసిన గేయాలు. వీటికి ఆదితాళం పడుతుంది.

"కస్తూరి రంగరంగ నాయన్న కావేటి రంగరంగ" అనేది సంక్రాంతి దాసరులు ఆనందభైరవి రాగంలో ఝంపెతాళం పడేలా ఆలాపిస్తుంటారు.

బొబ్బిలికథ తాళమాలిక దాన్ని సామాన్యంగా మోహనరాగంలో త్రిశ్రగతిలో మధ్యస్థాయిలో ఎత్తుకొని పాడతారు. వీరగాథల్లో ప్రఖ్యాతిగాంచిన పల్నాటి వీరచరిత్రని పంబజోడూ, తిత్తిసహాయంతో, భావానుగుణంగా ఆడుతూ కథకుడు పాడుతాడు.

జానపద గేయాలు మొత్తంమీద భావసౌందర్యంవల్లా సూటిగా హృదయాన్నించి వెలికెగసిన భావస్పందనములవడంవల్లా శాస్త్రీయమైన సంగీతం దాని జోలికి పోకుండాఉన్నా ప్రజాదరంపొంది నిలచింది. ఇటీవల రేడియోశాఖవారు జానపద గేయాలెన్నింటినో సేకరించి వాద్య సంగీతముతో ప్రచారంచేస్తూ దేశీయ సంగీత వాఙ్మయ పునరుజ్జీవనానికి తోడ్పడుతూ ఉన్నారు. సినీమా కంపెనీలవారు కూడా జానపద గేయ మాధుర్యాన్ని ప్రజలకు అందిస్తున్నారు.

నందికేశ్వరుడు రాసిన అభినయ దర్పణం ఒక్క ఆంధ్రదేశంలోనే లభించిందట; అభినయం కులవిద్యగానూ, వ్రతంగానుఉన్న ఉన్నత వంశీకులు ఒక్క తెలుగువారిలోనే కన్పిస్తున్నారు. అందుచేత నృత్యసరస్వతి కూచిపూడిలో వర్ధిల్లిందనీ, చాలాకాలం పీఠం వేసుకొని అక్కడే వుందనీ, కాలక్రమాన క్షేత్రయ్య సంచార ప్రియత్వమూ, తెలుగురాజుల నృత్యగాన ప్రియత్వమూ దాని దక్షిణాది యాత్రలకు కారణమైనాయనీ నమ్మడం సత్యందూరం కాబోదు. అన్ని కళలలాగే నృత్యకళకూడా స్వయంవ్యక్తమైన స్థితిలో ఏయే రూపవిలాసాలతో ఒప్పిఉండేదో తెలుసుకోవాలంటే జానపద నృత్యబాణీలను పరిశీలించవలసిందే.

భారతీయ జానపద నృత్య జాతులలో గర్బానృత్యం, మణిపుర పై ఖరులూ, కధకళి కలాపాలు విశేష ప్రశంసల పాలవుతున్నాయి. వీటిలో కొంత పరిణతస్థితి కన్పిస్తుందన్న విషయం విజ్ఞులందరూ ఒప్పుకొనేదే అందుచేత నృత్యసరస్వతికి వేవీ ఆదినటనమనేటందుకు ఆస్కారంలేదు. వీటితో మన దేశంలో ఉచ్చారణ సామర్ధ్యంకూడా సరిగా లేనివారు, ఉత్సాహంతో అడుగులువేస్తూ పాటలుపాడుతూ చేసే నాట్యవిన్యాసాన్ని కనక పోల్చామంటే అభినయ సరస్వతి తప్పటడుగులు అందులో మనకు వ్యక్తమౌతాయి. దీపపుసెమ్మాను నిలబెట్టి దానిచుట్టూ చిరతలనో జేగంటనో మ్రోయిస్తూ యెందుకయితే వుంచినావు బ్రిందిఖానాలోనూఅని రామ దాస కీర్తనను, తూగుతూపాడే సంకురాత్రి దాసరి అడుగుజాడలలోనూ, శివశివ మూర్తివి గణనాధ, నీవు శివుని కుమారుడవు గణనాధా అంటూ నాదనామక్రియా రాగం ఆలాపిస్తూ, ఆదితాళం పదేలా అడుగులువేస్తూ కోలాటం మొదలుపెట్టే భజనసమాజంవారి భజనకలాపంలోనూ నృత్యసరస్వతి మధుర మోహన బాల్యం గోచరిస్తుంది. ఈ ఉదాహరణములను పరిశీలించినవారు భారతీయ నృత్య సరస్వతికి తెలుగునాడే జన్మస్థలమనుట కెంతమాత్రమును జంకరు.

తెలుగునాట విద్యావంతుల ఆదరణ లేకపోయినా రాజకీయాభిప్రాయపు వెల్లువలు నిరుత్సాహపరచినా కోలాటపు భజనలు పూర్తిగా మాటుపడిపోలేదు. ఆ సందర్భంలో జానపదులు పాడే కీర్తనలను సేకరించి రాజమండ్రి, మాదేటి సన్యాసయ్య అండ్ సన్స్ వారు ప్రకటించారు. కవిత్వదృష్టితో వీటి ప్రాముఖ్యం అంత ఎక్కువకాకపోయినా, నృత్యవిన్యాసాన్ని కవి వ్రాసిన కీర్తనలోని పదాల విరుపులవల్ల ఎంత సహాయకారులో, అసభ్యస్త బాలనర్తకులుకూడా లయ తప్ప కుండా అడుగు వేసేటందుకూ వారిలో ఉత్సాహాతిశయం క్రమంగా కల్పించి నృత్యానికి జీవంకల్గించి పతాకాస్థితికి (climax) ఎలా దారితీస్తాయో స్పష్టమౌ తుంది. అందుచేత చదువరులకి ఒకటి రెండు ఉదాహరణలుమాత్రం ఇయ్యవలసి ఉంది. మరొకటి కోలాట భజనకీర్తనల్లో తెలుగువారి దైవమైన భద్రాద్రిరాముడి మీదా బాలకృష్ణుడిమీదా గోపికా సంవాదము, రుక్మిణీకృష్ణుల వాదము మొదలయిన విషయాలు సరసంగా, అతి సులభశైలిలో వర్ణించబడ్డాయి.

"గొల్లవారి వాడలకు కృష్ణమూర్తి నీవు<br>యేమిపనుల కొచ్చినావు కృష్ణమూర్తి<br>పాలు కొనవచ్చినానె గొల్లభామా - మంచి

పాలుబోసి నన్నుబంపు గొల్లభామా
కొత్తకోడలను నేను కృష్ణమూర్తి - నీవు
అత్తగారి నడుగవయ్య కృష్ణమూర్తి
కొత్తకోడల నీవైతే గొల్లభామా - నీకు
కొక్కుమిత్తు పుచ్చుకోవె గొల్లభామా
కొక్కుపేమి మాకువద్దు కృష్ణమూర్తి - నీకు
కోటప్ప (కవియిష్టదైవము) కన్నయియ్య కృష్ణమూర్తి

2. ఆటలాడిరీ బెండ్లాటలాడిరీ
వాటముగా కొనగోటన మీటుచు
సూటి దప్పకను నేటుగ కుశలవు
లాటలాడిరీ బెండ్లాటలాడిరీ
సలలితముగ తచ్చరణములను
గజ్జల రవములు ఝం ఝం ఝణ యనగను
ఆటలాడిరీ బెండ్లాటలాడిరీ
క్షితి సుత తనర సుతులను
గనుగొని హితమతి సమ్మతి
నొనరగ బెండ్లాటలాడిరీ

3. మల్లెపందిరదిగో - సుందరి
మాధవుడల్లదిగో - మొల్లసుగంధులు
మొనసికొల్వగా - కల్లగాదు ఓ పల్లవపాణిరో
మల్లెపందిరదిగో

ఆ పరిణత స్థితిలోనున్న నృత్యకళగురించి చెప్పేటప్పుడు తెలుగు బాలికలు చేట్టపట్టాలు వేసుకొని రెండు వహీలుగా ఏర్పడి "చిన్నీ బిన్నీ కెన్నోయేడు, సిరిగల గౌరూ కెన్నోయేడూ'' అని లయ తప్పకుండా ఒకరు ముందుకీ ఒకరు వెనక్కీ నడుస్తూ ఆటలాడుతారనీ ఇద్దరు బాలికలు ఒకరిచేతుల నొకరు పట్టుకొని అడుగులు కలిపి బిర్రబిగుతుగా నిలబడి గిర్రున తిరుగుతూ తిప్పుతూ "ఒప్పులగుప్ప ఒయారిభామ" అనీ ఆడుతుంటారనీ అందులో పదవిన్యాసం అభినయ విన్యాస బీజాలూ ఉన్నాయనిపిస్తుందనీ చేప్పాలి. తెలుగు గేయ వాఙ్మయంలో, పశ్చిమాం

ధ్రంలో ముఖ్యంగా, సారంగపాణి పదములు ఎక్కువ ప్రచారంలో ఉన్నాయి. సారంగపాణి మహాకవి అనీ సంగీత సాహిత్య దేశీయ కవితా రచనా చమత్కారి అనీ పేర్కొనబడ్డాడు. ఆయన తన పదాలన్నింటినీ కార్వేటినగరంలో నెలకొన్న వేణుగోపాలునికి అంకితంగా చెప్పాడు. వాటిని ప్రచురించినవారు వాటిని శృంగారము, దేశీయము జాతీయములని నాలుగు పథాగాలు చేశారు.

శృంగారాత్మకమైన పదాలు క్షేత్రయ్య పదాలకు ఆలంకారిక విజ్ఞానుల దృష్టిలో కొంత లోపమైనా అభినయ కళ దృష్టిలో ఈడు జోడు అనిపిస్తాయి. కవి మరో చమత్కారంకూడా చేశాడు. ఒక పదంలో, స్వరస్థానాల్ని మరో పదంలో ఇలా కొమ్మలు, పూనులు, ఊళ్ళు, ఔషధములు, ఆభరణములు మొదలయిన వాటిపేళ్ళను వరుసగా ఒక్కొక్క పదంలోనూ గర్భగుప్తి చేశాడు. దేశీయమూ, జాతీయమూ అంటే పక్షపాతంగల ఈ కవి రచనల్లో జాను తెనుగు నుడికారం తొణికిసలాడుతుందనడంలో ఏమీ సందేహములేదు. మచ్చుకోసం "పచ్చనికమ్ములచీర పండుగనాడైన యెరగ, పెచ్చానికేమి లేదంటే వెలవెలబోయి నాతో" అని "సరసాలు సేయవద్దిక చాలు పోపోరా" అని సామాన్య నాయిక నాయకుణ్ణి మందలిస్తుంది. రసంచిప్పిలే మరోపదం ఉదాహరణ సూచిస్తాను.

పక్కకైన నాసలేదు గదవే వాని చెలిమికొక దండమే మంచి చక్కని వాడైతే నిండునటే సఖియ వేణుగోపాలునిచేతి ౧ చెడ్డచేని కింటివద్ద పొంగలి జేసినట్లు యెదురు ప్రదర్శించి దొడ్డ రసికుడనుచు పేరుమాత్రమె గుడ్డిగవ్వ జూచితే నీయాన

ఉడుముబోతె పోయినది చెయిమాత్రము విడిచితే చాలుననే కథగా
పడతి తా కుదువబెట్టిన సొమ్ములు పైకమిచ్చి విడిపించితె చాలద

మొగమోటమున మాట తోయజాలక మునుపు యెవతో కడుపాయెనందురు
వగయింతలేక వానిగూడితి వుసురుంటే వుప్పుమ్మకోగల

ఇది వేణుగోపాల పరం నామమాత్రమే. కాని నాయకుడెవడో శశ్ఫోటి గాడనే అనాలి. అందుచేత ఈ పదాల్లో శృంగారం, క్షేత్రయ్య పదాల్లోలాగ దివ్య శృంగారం (Sublime) కాలేదనే అనాలి. కాని జాతీయనుడిదృష్ట్యా సారంగపాణి పదాలు ఎంతో విలువైనవి. ఎన్ని ఉదాహరణలైనా ఈయవచ్చు. కాని మచ్చుకి కొన్ని తునకలుమాత్రం ఇస్తాను.

"వర్ధికాసించ మొదలుపోయినవార్త నిక్కమని తెలిసె"
"దానితల్లి చెడ్డతొత్తు, అన్నదమ్ముడైతే ఇంద్రజిత్తు"
బలవంత మాఘస్నానము, దట్టిరకానివిందు
పేరువాసి, అందరాని మానిపండు, వేముల తీయదనము

సారంగపాణి అచ్చమైన జానపద గేయకర్త. ఇతని రచనల్లో మూడో భాగం కేవలం గ్రామీణుల భాషలో వ్రాయబడిన పదాలే.

అగ్గితిరుణాలంట అజ్ఞాని కతలంట
ఆపురా యెంత సోద్దెమే భారతకత
అపురా యెన్నె వింతలే.
సుగ్గీవు జయములు దీనిసుట్టు బలామూరు
అగ్గురోరపు అయ్యోర్న డిగేసి సాచ్చిగ॥

యిగ నేసుపయినెక్కి - యీబీసనూడిచ్చి
బిగు పెగ్గెలెన్నెన్నో బలికి దుశ్శేసూని
మొగము చూడగానె మొర్చెవో యాలట్టిగు
గురు మిగురనకుండ గుడ్డెల్లగుక్కెనె॥

అనే ధోరణిలో నడిచి జానపద గేయంగా రేడియోవారిచే సేకరించబడిన పదం సారంగపాణి విరచితమే.

భక్తి ప్రబోధం చేసినా సారంగపాణి సూటిగా చెపుతాడు. "కొలిచితే వేణు గోపాలదేవుని కొలువు కొలవవలెను. తలచితే విష్ణుచారిత్రంబులు తలచు చుండవలెను. ఓ జనులార" అంటాడు విమర్శించడంలో కూడా సారంగపాణి సూట కరుకే.

ధాతువు దెలియక వైద్యముజేసే ధగిడీకొక సొద్దు కలిగియుండిపొట్టకు పినజాలని కతినునికొకసొద్దు. తన పద్యమువిని బహుమతిసేయని మనుజునికొక సొద్దు" అని సొద్దులు వేస్తాడు.

మొత్తంమీద సారంగపాణి పదాలు మన సాహిత్యానికి ముఖ్యాలంకారము. సంగీతానికీ, జానపదుల భాషకీ, అభినయానికీ పట్టుగొమ్మలు. వాటికి నేటికంటె

న్సాంసుల్లో ఎక్కువ ప్రచారం అవసరం.

ఇటీవల క్షేత్రయ్య సారంగపాణుల రచనలు అతి అసభ్యపు రచనలనే మర్శదుమారం రేగింది. వాదోపవాదాలు జరిగాయి. ఆవిమర్శక ప్రతివిమర్శకులకు ఒక విషయం సూచించవలచుకొన్నాను. సారంగపాణి పదాలలో అన్నీ అసభ్య ృంగార రసమయములుకావు. భర్తృహరి శృంగార శతకంలోని రచనలు అసభ్య ములని ఎలాగనమో అలాగే సారంగపాణి శృంగార పదాలు అసభ్యాలనడం, శీయ, జాతీయ పదాల్లో వ్యాకరణ విరుద్ధ పదాలను ప్రయోగించాడని తప్పు పట్ట మూ న్యాయం కాదని నా మనవి.

కోలాట భజనకీర్తనల్లో నృత్యకళయొక్క ప్రాతిపదికలూ అపరిష్కృత లాసమూ ద్యోతకమైతే క్షేత్రయ్య పదాల్లోనూ, భామకలాపంలోనూ నృత్యసర ృతి పట్టంకట్టుకొన్న రీతులు ప్రత్యక్షమవుతాయి.

క్షేత్రయ్య పదాలు శృంగారరసాన్ని, భక్తితో రంగరించుకొని రూపొందిన సగుళికలు. జావళీలనే పేరుతో జనసామాన్యంలో వ్యాప్తినందాయి, అక్షరరమ్యత ల్లా నృత్యానికి అనువైనవవడంచేతా మధుర భావ సంయుత ...నవి కావడం చేతా బాలబాలికలూ, యువతులూ ఈ పదాలనుపాడి అభినయించి ...సానుభూతి కలిగించి నాట్యైక జీవనులు కాగలిగారు.

కాపీషాపురాగంలో పాడబడే "అదరెనే మోవి తనకుదానె వదలెనే నీవి" నేపదమూ - తోడి-త్రిపుటలోని "ఇద్దాళ్ళవలె గాదమ్మా ! మువ్వగోపాలుడెన్ని చ్చినాడమ్మా ! అనేపదమూ ఆహిరి - చాపులో పాడే "పచ్చియొడలిదానర" అనే దమూ "రేపు వత్తువుగాని పోర !" అనేదీ ఆనందభైరవి అదితాళంలో పాడుతూ భినయించే "శ్రీపతిసుతు బారికినే - నోపలేక నిను వేడితే కోపాలా ? మువ్వ పాలా ! అనేపదమూ ప్రఖ్యాతి నందాయి. నృత్య విద్యాగురువులైన కూచిపూడి ు ఈ పదాల్నీ భామకలాపాన్నీ పాడి అభినయంచేసే సాంప్రదాయాల్ని నిల ్తారు. అన్నిపదాల అభినయ వివరణనీ చర్చించడం సాధ్యంకాదు. కాని హ్మశ్రీ వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారు ఒక పదానికిచ్చిన అభినయ రణను ఇందు పొందుపరుస్తున్నాను. అదే నృత్య సంగీతాలలో క్షేత్రయ్య లకున్న విశిష్టస్థానానికి నిదర్శనం అవుతుంది.

మోహన — ఆది

I శ్రమ హేళన వితర్కం ఔత్సుక్యం రతి
ఒక్కసారికే యీలాగైతే వోహో ! యిదేమిటి రతిరా !

II ఔత్సుక్యం III
మక్కువ దీర్చరా ! మా ముద్దుగోపాల !

గ్లాని, దైన్యం, చపలత IV వితర్కం దైన్యం
సొక్కియున్న నీ సొగసది యేమిర !

దైన్యం శ్రమ వితర్కం సొగసుశ్రమ వితర్కం
వెమ్మొగమున నీబడలిక లేమిర నీటుకాడ రొమ్మదరేదేమిర

ధృతి వితర్కం
కమ్మనివాతెర కందినదేమిర ?

దైన్యం శ్రమ వితర్కం
కాళ్ళను చేతుల తడబడుటేమిర ? ॥ఒక్క॥

సుప్తి వితర్కం శ్రమ వితర్కం
కన్నుల నిద్దురగమ్మె దేమిర గళమున జెమటలగారేదేమిర?

గద్గద శ్రమ వితర్కం
తిన్నని పలుకుల బలుకవిదేమిర ?

జడత వితర్కం
తెలిసి తెలియకున్నావేమిర !

ఔత్సుక్యం III హర్షం మోహం
ఇనపురి ముద్దుల ముద్దుగోపాల ! యేపునను అలసితినీవే

ఔత్సుక్యం
మనమున నిన్నే నమ్మితిజాల

విషాదము గ్లాని వితర్కం
మారు బల్కకున్నావదియేల ?

ఈ పదంలో నాయిక సామాన్య ఆతృప్త సురతాసక్తిగల ప్రౌఢ అనీ హాస్యరసం మృదురీతిని ప్రదర్శించబడిందనీ తెలుస్తుంది.

శ్రమ, ఔత్సుక్యము, చాపల్యము, గ్లాని, సుప్తి, జడత, దైన్యము, విషాదము, వితర్కము అనే తొమ్మిది భావాల్ని పదమంతటా అభినయిస్తూ హర్షము, ధృతి, హేళన, రతులు, మోహము అనువానినీ నేటి భావ అనుభావ సాత్వికాదిభావాల్ని సందర్భోచితంగా ప్రదర్శించాలనీ తెలుస్తోంది.

ఒక్కసారికే అనేచోట (I) గజధేను కుక్కుట వృశ్చిక హంస నాగపాశ గండభేరుండ, చక్రవాకధను పద్మాసన ముద్రల్నీ, మక్కువదగ్గర (II) ఉపచార పాలు పలహారం, గంధ తాంబూలాలు, అత్తరు, పన్నీరు, పుష్పం, శయ్యాలంకార విశేష ఉపచారాల్నీ, మువ్వగోపాల (III) అనేచోట గోవర్ధనధారి వనమాలాధారి కాళింగమర్దన కంసమర్దన, వటపత్రశాయి, శేషశాయి లక్ష్మీవల్లభ వేణునాదలోల కుచేల రక్షణ గజ రక్షణ పరతని సూచిస్తూ, సొగసు (IV) అనేచోట ఆలింగన చుంబన కళలకచాక్షణ కుచాకర్షణ పంచముఖ్యను అనే శృంగార వికారాల్నీ సూచిస్తూ నటించాలి.

మొత్తంమీద క్షేత్రయ్య పదములు శృంగార రస మంజరికి లక్ష్యములైన వ్యాఖ్యలు, రసగుళికలు, ఆంధ్ర నృత్య సంగీత పరిణతిని సూచించే ఉదాహరణ లలో మకుటాయమానములు, ప్రాచ్య వాఙ్మయంలో జయదేవుని గీత గోవిందానికో తులతూగేవి, జానపదుల్నీ రసికుల్నీ రసవాహినిలో నోలలాడించగలవి.

## 12. వాఙ్మయంలో జానపద రచనల స్థానం, నేటి జానపద రచయితలు.

ఇంతవరకూ బాగా వ్యాపకంలోఉన్న జానపద రచనల స్వభావం, వానిలోని మెరుగుల్ని ఉదాహరణలతో వివరించడం జరిగింది. జానపద రచనలలో లోపాలేమి ఎత్తిచూపలేదు. అలాగని వాటిలో లోపాలేమి లేవని నా అభిప్రాయంకాదు. పళంకరు లన్నట్లుగా కావ్యాలలో..

నా తలంపునందు నాలుగు దోషముల్
పదమునందు, వాక్య బంధమందు

అర్థమందు, రసమునందును - వీనిలో
తుదిది యొకటె ప్రబల దోషమరయ

అని నమ్ముతున్నాను. రస ప్రకర్షకు బంధకమైన రచనలు జానపద గేయాల్లో మనకి కన్పించవు. ఆదర్శప్రాయమైన పాత్రల స్వభావం చిత్రించబడక పోవచ్చు. కాని, దానిని ఒక లోపంగా ఎన్నడానికి వీల్లేదు.

పదవాక్య ప్రవీణులు కాకపోవడంచేత జానపద కవుల రచనల్లో వ్యాకరణ దోషాలు కుప్పలుతిప్పలుగానూ ఆవేశా వేగమువల్ల వాక్యనిర్మాణంలో లోపాలూ ద్యోతకమవుతాయి. అవి నెరసులుకావని ఎవరూ అనరు. కాని, వాటిని చెరకు పానకంలోని నెరసులవంటివనే రసజ్ఞులు భావించి సహించవలసి ఉంటుందని నా మనవి.

మరోమాట. జీవద్భాషలో మార్పులు అనివార్యములు. నిత్యవ్యవహారంలో ఉన్న భాషలో అధికారిననుసరించి పదాల్లో రూపభేదాలు కలుగుతూంటాయి. ఈ సంగతి విజ్ఞులందరూ ఒప్పుకొనేదే. ప్రతిపదమూ ఏదోఒక అభిప్రాయాన్ని సూచించే చిహ్నము మాత్రమేకదా! అందుచేత ఏ పదాన్నైనా వాడినవారి అభిప్రాయం వినేవారికి తెలిసిందంటే పదప్రయోగం సార్థకమైందనేకదా భావించవచ్చు. అలాంటప్పుడు ఆ పదంయొక్క రూపాన్నిగురించి "వెర్రిపట్టింపులు పెట్టుకోవడం న్యాయంకాదు" అనే అనాలి. ఈ సందర్భంలో లోకవ్యవహారంలోఉన్న ఒక చిన్న కథని చదువరులకు చెప్పదలచుకొన్నాను. ఒక సాహుకారుకొడుకు రెండో క్లాసు తప్పాడని విని దానికి కారణం ఏమిటో తెలుసుకుందామని మేష్టరుదగ్గరకి వెళ్ళాడట. వెళ్ళి తనకొడుకు పరీక్ష తప్పటానికి కారణం ఏమిటని నిగ్గదీశాడు. పంతులుగారు తన శిష్యుడు "చింతపండు"కి బదులు "శింద పందు" అని రాశాడనీ ప్రతీమాటా ఇలానే రాయడంచేత ఏమీ మార్కులు రాలేదనీ చెప్పాడట. అదివిన్న లోకజ్ఞుడైన పెద్దసాహుకారు "మేటరుగారూ! శిందపందు అన్నంతమాత్రాన అర్థంకాలేదా? దాని పులుపుతగ్గిందా? ధరతగ్గిందా? అని ముదలకించి, ఇలాంటి యెర్రియెర్రి పట్టింపులు పెట్టుకోక మావోణ్ణి పైక్లాసులోయేసి డోకడాలూ అయీ గట్టిగా సెప్పండి. అన్నాడట! "నిజమే అధికారినిబట్టి పదాల్లో కలిగే మార్పుల్ని, ఎవరు అరికట్టగలరు? ఇప్పుడు వాడుకలోఉన్న రూపాలు అసలురూపాలని ఎవరేనా అనగలరా? "అసలు" అనేదానికి అర్థంఏమిటి? ఒకనాడు వ్యవహారంలో

ఉండి శిలా స్థాయిఅయిన పదాలు కొన్ని నేను దుర్బోధం కాలేదా. ఈ మార్పులకి ఏఒక్కరూ కర్తలనిగాని, నియామకులనిగాని అనడానికి సాధ్యం కాదు. అందుచేత మెట్టుకి జీవద్భాషలో కండగలిగి జీవంతో తొణికిసలాడే సాహిత్యంలో వ్యవహారంలోని రూపాలున్నాయని తప్పుపట్టడం న్యాయం కాబోదు. అందుచేతనే ఈవిషయాన్ని ఇంతవరకూ ఎత్తలేను. ఇదో లోపమనే భ్రమని వదిలితే జానపద వాఙ్మయం ఆదరణీయమౌతుంది. ఈ వాదాన్ని ఇంతతో ఆపితే వ్యాకరణ ప్రయోజనం నేను గుర్తించలేదనీ, విద్వత్కవుల రచనలలోని విశిష్టతని అంగీకరించటం లేదనిగాని ఎవరేనా అనుకోవచ్చు. అందుచేత మరోమాట చెప్పవలసి వస్తోంది. నిత్యప్రవాహినియైన దేశి భాషలకి వ్యాకరణం ఆనకట్టవంటిది. పరమ ప్రయోజనకారి వికరమై, బరువై, నిలువైన ప్రవాహోయూత సంపదని మనం అందుకొనేటందుకు సహాయకారి యౌతుంది. నిత్యప్రవాహినియైన దేశిభాషా సారస్వతము వరదవంటిది. నీరసమైన పాతపదాల్ని మంచెత్తేలాగ ప్రవహించి కొత్త ఒండ్రుని దేశంలోచిమ్మి సారవంతం జేస్తుంది. పదే పదే కాలానుగుణంగా అలాంటి వరద రావడం విద్వత్ కావ్యాలలో జీవానికీ పుష్టికీ కారణమవుతాయి. అందుచేత జానపద సాహిత్యమునకూ మార్గ కవితా రీతులకీ సారస్వతంలో విభిన్నమైన స్థానాలున్నాయి. ఏదీ నిరసనకు తగదు. మార్గ కవితారీతులకు పుష్టినీ, జీవాన్నీఇచ్చే జానపద సాహితీగతులు సర్వథా ఆహ్లాదకరములు. ఆదరణీయములు. పరిపుష్టములై జీవకళతో మిసమిసలాడే విద్వత్కవి రచనలు శిరోధార్యములు. పూజనీయములు. పారాయణచేయ నర్హములు.

ఆధునిక కవుల్లో జానపద వాఙ్మయరీతుల్ని గుర్తించినవారిలో శ్రీ గురజాడ అప్పారావు, బసవరాజు అప్పారావు, చింతా దీక్షితులు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, తురగా వెంకట సుబ్బారావు, కవికొండల వెంకటరావుగార్లు ముఖ్యులు. విశేషించి అడవి బాపిరాజు, నండూరి వెంకట సుబ్బారావు, కవికొండల వెంకటరావుగార్లు జానపద గేయ కర్తలుగా వాసికెక్కినవారు. వారు తమ రచనలని లోకానికి వెల్లడించనట్లయితే అజ్ఞాత జానపద కవుల రచనలుగా వీరి రచనలు చలామణీ అయిపోతాయనేటందుకు సందేహంలేదు. వీరిరచనల్లో జానపదజీవితమూ, భావాలూ, యథాతథంగా ప్రతిబింబించడమే దానికి కారణం.

బాపిరాజుగారి గేయ రచనలు చాలామట్టుకి ఇంకా అముద్రితంగానే ఉన్నాయి. ప్రకటితమైనవాటిలో "ఉప్పొంగిపోయింది గోదావరి" అన్న గేయమూ

"డూమా డూమా బసవన్నా" అనేగేయమూ "గౌళ్ళ చెల్లాయి కూతురు కడు చక్కందనీ చూతురా'' అనేగేయమూ ఆయన సృష్టి సౌందర్యాన్నీ జానపదుల భావాల్నీ పుణికిపుచ్చుకొన్నట్లుగా చిత్రించగల సమర్థుడని రుజువు చేస్తాయి

ఇక నండూరి సుబ్బారావుగారు లేపిన యెంకిపాటల దుమారం మరెన్నో పిల్లనుడిగాలుల్ని రేపిందన్నసంగతి అంతో ఇంతో సాహిత్యంతో పరిచయం వున్న వారందరికీ తెలిసినదే. యెంకి నాయుడుబావలు సిసలైన జానపద నాయికా నాయకులు. జానపద నాయికా నాయకుల భావసౌందర్యము వీరిలో మూర్తీభవించింది. సముగ్రత నందింది. వందలాది సంవత్సరాలుగా తెలుగుదేశంలో ధ్వనించిన లక్షలాది జానపద శృంగార గేయ వాఙ్మయంలో ఇవి కొలికిపూసలు. మేరుశిఖరము. కావ్యగౌరవాని కర్హమైన రచన. మేఘ సందేశాది శృంగార కావ్యములకీను.

నేటి జానపద కవుల్లో కవికొండల వెంకటరావుగారికో విశిష్ట స్థానముంది. నిసర్గ మనోహరమై కోనసీమను తలపించే కోరుకొండ దగ్గరనున్న శ్రీరంగపట్నంఅనే పల్లెలో పుట్టి పెరిగి ఉగ్గుపాలు త్రాగనేర్చిన నాటినుండీ ప్రకృతిశోభను పరికిస్తూ మెచ్చుకొని ఆనందింపనేర్చిన సుకుమార హృదయుడు. విద్యార్థిదశలో వర్డ్సువర్తు బర్న్సు మొదలయిన పాశ్చాత్య కవుల రచనలనుచదివి వంటబట్టించుకొన్నాడు. వీటికితోడు బంగారానికి తావిఅబ్బినట్లు సహృదయుడయిన కూల్డ్రే దొర సాహచర్యమూ, ప్రాపూ లభించాయి. ఆదొర కవికొండలను తీర్చిదిద్ది సానబట్టిన కవిరత్నంగా మార్చాడు.

విద్యార్థిదశ నాటినుంచీ ఎడతెగకుండా కవికొండల తాకళ్ళార చూసినవీ, చెవులార విన్నవీ తన హృదయాన్ని పులకింపజేసి లోతుల్ని కదలించి కలచినవీ అయిన అన్ని విషయాల్నిగురించీ తెలుగులో శత సహస్రాధికంగా గేయాలు వ్రాశాడు. వానిలోని భావశబలతకుమెచ్చి కూల్డ్రేదొర ఈయనను ఆంధ్రవర్డ్సువర్తు అని భావించి అభిమానించి ఆశీర్వదించాడు.

కవికొండల వర్డ్సువర్తుకిగాని మరేకవికిగాని భావదాసుడు కాడు. ఆయన చదివిన పాశ్చాత్యకవుల రచనలు ఆయనకు కేవలము దిఙ్మాత్రముగా మాత్రమే కవితా విషయ సూచకములయాయి.

కవికొండల "కిలారి పదమన జన పదములకు" అని మహోత్సాహంతో మనచేయి పట్టుకొని పల్లెపట్టులకు లాగుకొని పోతాడు. ఏడాదికొకసారి వచ్చే

పసులకాపరినీ చూ
కోకిలమ్మనీ, ఎఱ్ఱకలువపువ్వునీ, చిన్నిమేఘాన్ని, మేకల్ని,
భర్తకి మధ్యాహ్నపు కూడు తీసుకొని వెడుతూ—

ఈవలొడ్డుకు పట్టు
ఆవలి బల్లకట్టు
...యులో నావావ
...ుంటాడు

అంటూ బల్లకట్టు గడిపే సరం
సంజలో పరకలేరుకొంటూన్న నల్లనల్లనిపిల్లిమూతే పల్లెపడుచునీ "ఎఱ్ఱఎఱ్ఱ
...ిన జోడు సర్దుకొంచున్
వచ్చే రైతునిచూసి—

"జొన్న మొలకలచాటె
సన్నసన్నగదాటు
మూరువారవ యూటెనూ"

ప్రత్యక్షము చేస్తాడు. ఈదృశ్య చిత్రాలన్నీ జనపదాలలో అతి సామాన్య మైనవే. కాని ఈకవి చేతులలో అవి అతి సరళమైన భాషలో కవితారూపము దాల్చాయి. ఇలాగే రంగంనుంచీ వచ్చిన రంగని రంగులూ, వాడి పెళ్ళాం రా... కున్న హంగులూ హృద్యంగా కవి వర్ణిస్తాడు. ఇలా చెప్పాలంటే ఈయన రచన లలోనుంచి ఎన్ని ఉదాహరణలనేనా ఇయ్యవచ్చు. మొట్టుకి ఈయన రచనలలో జనపదములన్నీ మనకు ఆత్మీయములైన వనిపిస్తుంది. జానపదుల జీవితదృశ్యాల్లో అనుదినం మన కళ్ళపడే దృశ్యాల్లోని అందము మనకళ్ళకి కన్పించి మనస్సు... పట్టుతుంది. శతాబ్దాల తరబడి మూగవారిఉన్న జానపదుల గొంతుల్లోంచి ఒలికిన కవితారసాన్నిపట్టి అర్పించిన ప్రజాకవి కవికొండల.

కవికొండల జన్మతఃకవి, పరిసరములవల్లా సుహృదయుల మిత్రులతోటీ గురుపర్యుడయిన కూర్ద్రోదొర సాహచర్యమువల్లా పెంపొందిన కవితాత్మయే ఆయన రచనల్లో మెరిసింది. జానపదుల జీవితాల్నీ వారి కష్టనిష్ఠూరాల్నీ, తలష బరువుల్నీ, ఆశల్నీ, అనురాగాల్నీ సూటిగా తేటమాటలతో గేయరూపంగా చిత్రించిన జానపదకవి కవికొండల. వాటిలోని విషయాల్నిబట్టి ఈయనని గౌతమీతీర ప్రాంత సుందరదృశ్య మోహితుడయిన కవికొండలఅనీ, కొండకీలకు వికసితో

"దూమా దూమా బసవన్నా" అనేగేయమూ "గౌళ్ళ చెల్లాయి కూతురు కదు చక్కందనీ మాతురా'' అనేగేయమూ అయన సృష్టి సౌందర్యాన్నీ జానపదుల భావాల్నీ పుణికిపుచ్చుకొన్నట్లుగా చిత్రించగల సమర్థుడని రుజువు చేస్తాయి

ఇక నండూరి సుబ్బారావుగారు లేపిన యెంకిపాటల దుమారం మరెన్నో పిల్లసుడిగాలుల్ని రేపిందన్నసంగతి అంతో ఇంతో సాహిత్యంతో పరిచయంవున్న వారందరికీ తెలిసినదే. యెంకి నాయుడుబావలు సిసలైన జానపద నాయికా నాయకులు. జానపద నాయికా నాయకుల భావసౌందర్యము వీరిలో మూర్తీభవించింది. సముగ్రత నందింది. వందలాది సంవత్సరాలుగా తెలుగుదేశంలో ధ్వనించిన లక్షలాది జానపద శృంగార గేయ వాఙ్మయంలో ఇవి కొలికిపూసలు. మేరుశిఖరము. కావ్యగౌరవాని కర్హమైన రచన. మేఘ సందేశాది శృంగార కావ్యములకీను.

నేటి జానపద కవుల్లో కవికొండల వెంకటరావుగారికో విశిష్ట స్థానముంది. నిసర్గ మనోహరమై కోనసీమను తలపించే కోరుకొండ దగ్గరనున్న శ్రీరంగ పట్నంఅనే పల్లెలో పుట్టి పెరిగి ఉగ్గుపాలు త్రాగనేర్చిన నాటినుండీ ప్రకృతిశోభను పరికిస్తూ మెచ్చుకొని ఆనందింపనేర్చిన సుకుమార హృదయుడు. విద్యార్థిదశలో వర్డ్సువర్తు బర్న్సు మొదలయిన పాశ్చాత్య కవుల రచనలనుచదివి వంటబట్టించుకొన్నాడు. వీటికితోడు బంగారానికి తావిఅబ్బినట్లు సహృదయుడయిన కూల్డ్రెదొర సాహచర్యమూ, ప్రాపూ లభించాయి. ఆదొర కవికొండలను తీర్చిదిద్ది సానబట్టిన కవిరత్నంగా మార్చాడు.

విద్యార్థిదశ నాటినుంచీ ఎడతెగకుండా కవికొండల తాకళ్ళార చూసినవీ, చెవులార విన్నవీ తన హృదయాన్ని పులకింపజేసి లోతుల్ని కదలించి కలచినవీ అయిన అన్ని విషయాల్నిగురించీ తెలుగులో శత సహస్రాధికంగా గేయాలు వ్రాశాడు. వానిలోని భావశబలతకుమెచ్చి కూల్డ్రెదొర ఈయనను ఆంధ్రవర్డ్సువర్తు అని భావించి అభిమానించి ఆశీర్వదించాడు.

కవికొండల వర్డ్సువర్తుకిగాని మరేకవికిగాని భావదాసుడు కాడు. ఆయన చదివిన పాశ్చాత్యకవుల రచనలు ఆయనకు కేవలము దిఙ్మాత్రముగా మాత్రమే కవితా విషయ సూచకములయాయి.

కవికొండల "కిలారి పదమున జన పదములకు" అని మహోత్సాహంతో మనచేయి పట్టుకొని పల్లెపట్టులకు లాగుకొని పోతాడు. ఏడాదికొకసారి వచ్చే

కోకిలమ్మనీ, ఎఱ్ఱకలువపువ్వునీ, చిన్ని మేఘాన్ని, మేకల్ని, పసులకాపరినీ చూస్తాడు, భర్తకి మధ్యాహ్నపు కూడు తీసుకొని వెడుతూ—

ఈవలొడ్డుకు పట్టు
ఆవలి బల్లకట్టు
ఘోలములో నాబావ
తలపోయు చుంటాడు

అంటూ బల్లకట్టు గడిపే సరంగుని బతిమాలే పల్లెపడుచునీ "ఎఱ్ఱఎఱ్ఱ సంజలో పరకలేరుకొంటూన్న నల్లనల్లనిపిల్ల కిఱ్ఱుపెట్టిన జోడు సద్దుకొంచున్' వచ్చే రైతునిచూసి—

"జొన్న మొలకలచాటె
సన్నసన్నగదాటు
పూరువారవ యీపెనూ"

ప్రత్యక్షము చేస్తాడు. ఈదృశ్య చిత్రాలన్నీ జనపదాలలో అతి సామాన్యమైనవే. కాని ఈకవి చేతులలో అవి అతి సరళమైన భాషలో కవితారూపము దాల్చాయి. ఇలాగే రంగంనుంచీ వచ్చిన రంగని రంగులూ, వాడి పెళ్ళాం రాచుకున్న హంగులూ హృద్యంగా కవి వర్ణిస్తాడు. ఇలా చెప్పాలంటే ఈయన రచనలలోనుంచి ఎన్ని ఉదాహరణలనేనా ఇయ్యవచ్చు. మెట్టుకి ఈయన రచనలలో జనపదములన్నీ మనకు ఆత్మీయములైన వనిపిస్తుంది. జానపదుల జీవితదృశ్యాల్లో అనుదినం మన కళ్ళపడే దృశ్యాల్లోని అందము మనకళ్ళకి కన్పించి మనస్సుకి పట్టుతుంది. శతాబ్దాల తరబడి మూగవారిఉన్న జానపదుల గొంతుల్లోంచి ఒలికిన కవితారసాన్నిపట్టి అర్పించిన ప్రజాకవి కవికొండల.

కవికొండల జన్మతఃకవి, పరిసరములవల్లా సుహృదయుల మిత్రులతోటీ, గురుపర్యుడయిన కూల్డ్రేదొర సాహచర్యమువల్లా పెంపొందిన కవితాత్మయే, ఆయన రచనల్లో మెరిసింది. జానపదుల జీవితాల్ని వారి కష్టనిష్ఠూరాల్ని, తలపు బరువుల్ని, ఆశల్ని, అనురాగాల్ని సూటిగా తేటమాటలతో గేయరూపంగా చిత్రించిన జానపదకవి కవికొండల. వాటిలోని విషయాల్నిబట్టి ఈయనని గౌతమీతీర ప్రాంత సుందరదృశ్య మోహితుడయిన కవికొండలఅనీ, కొండకీలకు వికసితో

త్వల కవితని అనాలి. మన ప్రాచీన జాన తెనుగు రచయితలలోనూ, అజ్ఞా
కవుల మధుర జానపద గేయాలలోనూ తొణికిసలాడుతూ సాంప్రదాయికముగ
తెలుగువారి రక్తంలో ప్రవహిస్తున్న కవితా స్రవంతియే గేయరూపంతో ఈయ
లోంచి పైకి ఉబికి[illegible]. అందుచేత ఈయన అవలంబించిన మార్గాన్నుసరించి
తెలుగు రచయితలు జానపద గేయ వాఙ్మయాన్ని పదేపదే మధించి తెలుగు సర
స్వతిని పుష్టివంతం చేస్తారని ఆశిస్తున్నాను.

సంపూర్ణము.

మహోదయ ప్రెస్, శ్రీకాకుళం.